

దేవిదేవతలు

హనుమ

తెలుగు సాహిత్యంలో హనుమంతుని కథ - పాత్ర చిత్రణ





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

తెలుగు సాహిత్యములో

హనుమంతుని కథ-పాత్రచిత్రణ



డా॥ ఆర్. ఎస్. సుదర్శనాచార్యులు, ఎం. ఏ., పిహెచ్. డి.,
రిటైర్డ్ ప్రిన్సిపాల్, కడప.

అభిప్రాయములు

మానవుడి ప్రయోజనార్థము రకరకాల రంగుల పూలనుండి తేనెను సేకరించి 'వండి' తేనెపుట్టలో సిద్ధంగా ఉంచుతుంది తేనెటీగ. అదే విధంగా శ్రీ ఆచార్యులు 'నానృషిః కురుతే' అన్న ఆలంకారికుల నిర్వచనం ప్రామాణికముగా, ఋషిసత్తములు రచించిన సుమారు 150 గ్రంథములలో నుండి శ్రీమత్ హనుమంతునిలోని వివిధ దృక్పథములను వెలికితీసి విరిదండగా కూర్చి మనకు, రాబోవు తరాలకు, తావివీడని, వసివాడని పూల గురుతుగా పరిమళింపజేశారు.

సప్తలోకాలలో, సప్తసముద్రాల మధ్య, సప్తర్షిమండలాలలో సంస్తుతింపబడే సప్తమావతారం 'శ్రీరామావతారం'. ఆ శ్రీరాముని దాసుడు ఆంజనేయుడు. అతడు జితేంద్రియుడు. దేహాత్మాభిమానమున్నపుడు నేను నీకు దాసుడను, జీవాత్మాభిమానమున్నప్పుడు నీలో నేనొక భాగాన్ని. ఈ రెండు అభిమానములను వదలి 'కూటస్థుడే' నేను అని నిశ్చయించితినేని మన ఇద్దరికీ భేదమేలేదని మారుతి వినమ్రతతో శ్రీరామునితో వక్కాణించినాడు.

తన శరీరముచే శ్రీరాముని పాదయుగ్మసేవను, వాక్కుచే నిరంతరము శ్రీరామ నామగాన స్మరణంబును, మనస్సుచే పరమార్థ స్వరూపధ్యానమును గావించుచూ త్రికరణశుద్ధిగా శ్రీరాముని సేవించుచున్న భక్తశిఖామణి ఆంజనేయస్వామి. మరియు ఈతడు అమేయ భక్తి సమన్వితుడు, వీర విక్రమ సాహస పరాక్రమ సముపార్జితుడు, అహంకారదూరుడు, సకలసద్గుణ విలసితుడు, ఆజన్మబ్రహ్మచారి, సాంగచతుర్వేద పారీణుడు. ఈ విధంగా అగణిత గుణములను ఆయన వ్యక్తిత్వము నుండి వెలికి తీయవచ్చును.

ప్రతి మంచి పనికి ప్రతిబంధకాలు తప్పనిసరి - ఏ విధముగా వీటిని అధిగమించగలరు అనే విషయం, ప్రతి మనిషియొక్క స్వభావంపైన ఆధారపడియుంటుంది. ఎల్లవేళలా అన్ని పరిస్థితులలోను ఈ ప్రతిబంధకాలతో పోరాడటం సాధ్యం కాకపోవచ్చు. అదే విధంగా ప్రతిసారి వాటినుండి తప్పించుకోవటం సులభమైన పనికాదు. బృహత్కార్య నిర్వహణలో దృఢమైన పట్టు

దలతో ఉన్న వ్యక్తికి విశ్రాంతి పొందాలనే కోరిక కూడ ఒక ప్రతిబంధకమే. ఇది హనుమంతుని జీవితం నుండి నేర్చుకోవలసిన పాఠం.

వాయుదేవుడు ప్రధాన సేవావిధానమునకు ముఖ్య ప్రతీక. సూర్యుడు, పృధ్వి. వరుణుడు అందరూ కూడా సేవాతత్పరులే. కానీ వాయుదేవుని సేవా విధానములో గల సమగ్రత వారిలో పూర్తిగా లేదు. సకల చరాచర జీవ రాసుల శాశ్వత సేవలో నిమగ్నమై ఉంటాడు పవనదేవుడు. వాయు తనయుడు హనుమంతుడు అంకితభావానికి, సర్వసంగ పరిత్యాగానికి, సత్యమైన సంకేతము వంటివాడు. రుచి, వాసనలేని గాలి చల్లదనాన్ని, పరిమళత్వాన్నేగాక, అది ప్రయాణం చేస్తున్న పరిసరాలకు సంబంధించిన ఆనవాళ్లను కూడ మోసుకు వచ్చినట్లే అంకితభావానికి, సర్వసంగ పరిత్యాగానికి, సత్యసంకేతమైన పవన కుమారుడు కూడా తన 'గురువ'గు శ్రీరామచంద్రుని కార్యములను మోసుకు వచ్చే మానస పుత్రునిగా గుర్తింపవచ్చును. రాముని సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పటానికి హనుమంతుడు ఒకవారధి.

తోడుగా రావటానికి సరయూనదీతీరాన వేచిఉన్న అశేష జనవాహిని వద్ద నిలబడిన శ్రీరాముడు వినయవిధేయతలతో చేతులు మడిచి నిలబడిన హనుమంతునితో 'హనుమా,' స్వర్గసుఖాలను అనుభవించటానికి నీకు కూడా నావెంట రావాలని ఉందా? అని ప్రశ్నించాడు. అప్పుడు ఆంజనేయుడు 'స్వామి, నాలో నాకుగా స్వతంత్రమైన కాంక్షగానీ కోరికగానీ లేనేలేదు. నాలోని అణువణువు ఎప్పుడూ నీ ఆజ్ఞకోసం, నీ సంతోషం కోసమే ఎదురు చూస్తూ ఉంటుంది' అన్నాడు.

అదివిని శ్రీరాముడు గద్గద స్వరంతో 'హనుమా, నీవు వరపుత్రుడవు. అంకితభావం గల నీవంటి వ్యక్తుల అవసరం ప్రపంచానికి ఎంతయో అవసరం. అందుకే ఈ ప్రపంచంలో నీవు చిరంజీవివై, నాకథ మార్మ్రోగుతున్నంత కాలం నువ్వు ఇక్కడే ఉంటావు. స్వామిభక్తి పరాయణుడైన హనుమంతుడు తన గురువుయొక్క ఉత్తర్వును తలదాల్చి రామభక్తుల మనసులలో ఆవరించి ఉన్న అంధకారపు పొరలను పటాపంచలుచేస్తూ శ్రీరాముని దివ్యకథామృత గానానికి శాశ్వత శ్రోతగా, భగవంతునికీ భక్తునికీ మధ్య అనుసంధానం కలిగిస్తూ ఇక్కడే ఉండిపోయాడు.

హనుమంతుడు మహాయోగి. ఆయోగ మహిమచేతనే అతడు దుష్కర మైన మహాకార్యములనొనర్చ గలిగాడు. ఇటువంటి మహాయోగి, స్వామిభక్తి పరాయణుని కథ, అతని మూర్తిమత్వ చిత్రణ తెలుగు సాహిత్యంలో ఎక్కడెక్కడ ఉదాహరించారో సవివరంగా పరిశీలించి ఒక సిద్ధాంత గ్రంథరూపంలో అందించి శ్రీ సుదర్శనాచార్యులు తెలుగు సాహిత్యాన్ని విస్తృతపరచటానికి, తద్వారా తెలుగువారికి ఎనలేని సేవచేశారు. వీరి గ్రంథములో హనుమంతుని గురించి సామాన్యంగా తెలియని అనేక విషయాలను అంతర్గతభావ సందర్శనంతో విపులంగా చర్చించి హనుమంతుని గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని చక్కగా విశదీకరించారు.

ఇహపర సాధనకు ఈ మహా గ్రంథము ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రయోజనకారిగా భాసిల్ల గలదు.

పి. ఎస్. రామచంద్రరావు ఎం. ఎస్సి.,
కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్సు (రిటైర్డు)
ఇంటర్మీడియట్ బోర్డు, హైదరాబాదు.

సుగుణాభిరాముడైన శ్రీరామునికి సేవకుడై ప్రభువుతోపాటు పూజలందుకున్న భటుడు శ్రీ ఆంజనేయుడు. శక్తి యుక్తి భక్తి సంగమించిన ఒక త్రివేణీతీర్థం శ్రీ ఆంజనేయుడు. స్వార్థ స్పర్శ లేకుండా జీవితాన్ని లోక కల్యాణానికి అంకితంచేసిన మహానుభావుడు శ్రీ ఆంజనేయుడు. ఆయన చరిత్రను, గుణగణాలను, ఘనవిజయాలను చక్కగా విశ్లేషించి సరళ సుందర శైలితో లోకానికందించిన సుహృన్మణులు డాక్టర్ సుదర్శనాచార్యులుగారు. వారికి హృదయపూర్వక అభినందనలు. ఆలోచించటానికి, ఆనందించటానికి ఆచరించటానికి అనేకాంశాలున్న ఈ గ్రంథం అందరికీ అవశ్య పఠనీయం.

డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య ఎం. ఏ. పిహెచ్. డి.,
కార్యదర్శి, ధర్మప్రచార పరిషత్,
తిరుమల తిరుపతి దేవస్థానము–తిరుపతి.

* * *

పరిశోధనకు లభించిన సారస్వతాంశములను సమర్థవంతముగా విశ్లేషించి శ్రీ హనుమంతుని వ్యక్తిత్వాన్ని సమగ్రంగా చిత్రించిన డాక్టర్ సుదర్శనాచార్యులగారి కృషి శ్లాఘనీయం. రామాయణ సాహిత్య సాగరంలో నుండి వెలికి తీసిన మరో రత్నమే యీ ప్రబంధం.

డా॥ ఆర్. అనంతపద్మనాభరావు ఎం. ఏ., పిహెచ్. డి.,
డైరక్టరు, ఆకాశవాణి, అనంతపురం.

ఆప్తవచనం

ఇది అంజనేయుడి పాత్రకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వం. దైవిక శక్తులన్నీ ఏకత్రరాశీభూతమై, రెండు మూడు యుగాలకు విస్తరించి, ఒకరికి భక్తుడుగా, కోట్లాది ప్రజలకు ఆరాధ్యుడుగా - ఇలా వైవిధ్యంతోకూడి దైవ మానవ జంతు కోటితో నతులూ, నుతులూ అందుకొన్న పాత్ర అంజనేయుడు.

కలియుగంలో వైష్ణవ సంప్రదాయంలో భగవంతుడికంటె భక్తుడికే అధిక గౌరవం. అంజనేయుడు రామభక్తుడైనా, ఈనాడు ఊరూరా రామాలయాలున్నా, క్షేత్ర పాలకుడుగానో, రామబంటుగానో ఈ యాలయాల్లో దర్శనమిస్తూఉన్నా, కులమత ప్రాతిపదికలు లెక్కించక రాముడి బొమ్మగాక అంజనేయుడి బొమ్మ (తాయెత్తు) మణికట్టునో, రెట్టనో, మెడనో ఆశ్రయించి శక్తికీ, ధైర్యానికి రక్షణగా ఆరాధింపబడటం జగద్విదితసత్యం. అంతేకాక ఈనాడు పల్లెల్లో, పట్టణాల్లో జానపదులు, నాగరకులు శ్రీరామునికంటె అంజనేయుణ్ణే అధికంగా కొలవడం ఆయన విజయ సంకేతం. భూతప్రేత పిశాచాలు ఆయన పేరు స్మరించగానే పరుగెత్తి పోతాయని ప్రజల విశ్వాసం. రామభక్తులైన జాంబవదాదులకీ గౌరవం దక్కకపోవడం గమనించవచ్చు. లౌకికదృష్టిలో అంజనేయుడి పాత్ర ఇలాంటి విశిష్ట ప్రయోజనం సాధించింది.

ఇంక రామాయణ సుందరకాండ సీతాన్వేషణ ఘట్టంలోను, లంకా దహనంలోను, యుద్ధకాండలో రామలక్ష్మణులకు గావించిన సహకారంలోను అంజనేయుడి బహుముఖ ప్రజ్ఞ ఆధ్యాత్మిక దృష్టితో అనుశీలింపవలసినంత గహనమైంది.

"తెలుగు సాహిత్యంలో హనుమంతుని కథ - పాత్ర చిత్రణ" అనే సిద్ధాంత వ్యాసం డా॥ అర్. ఎస్. సుదర్శనాచార్యుల విశేష కృషి ఫలితం. ఈ గ్రంథాన్ని నేను దైవ ప్రేరణతో ఆమూలాగ్రం నిశితంగా చదవటం తటస్థించింది. తర్క వితర్కాలు, ఖండన మండనలు స్పృశించి, సంస్కృతాంధ్ర అంగ్ల హిందీ తమిళ గ్రంథాలలో అంజనేయుని పాత్రను పోషించిన రీతిని సూక్ష్మేక్షికతో పరిశీలించి, జీర్ణించుకొని, పరిశోధన ఫలితాన్ని శిష్ట వ్యావహారిక భాషలో ఆంధ్ర ప్రజానీకానికి అమూల్యోపహారంగా అందించిన ఆచార్యులు గారిని హార్దికంగా అభినందిస్తున్నాను.

డా॥ యన్. రామచంద్ర, ఎం. ఏ., పిహెచ్. డి.,
ఆంధ్రోపన్యాసకులు,
ప్రభుత్వ కళాశాల, ప్రొద్దుటూరు.

విజ్ఞాపన

ఆంజనేయం మహావీరం బ్రహ్మవిష్ణు శివాత్మకమ్
తరుణార్క ప్రభం శాంతం రామదూతం నమామ్యహమ్

"ఆపదా మపహర్తార"మని నుతికెక్కిన శ్రీరామునికే ఆపన్నివారకుడైన వాడు శ్రీ ఆంజనేయుడు. శ్రీ సీతారాముల వియోగదుఃఖాన్ని తొలగించి వారి ప్రాణముల నిల్పిన ప్రాణనందనుని పాత్ర వంటిది ప్రపంచ భాషలలో ఏ సాహిత్యంలో కూడా నభూతో న భవిష్యతి. సర్వజగద్రక్షకుడైన పరమాత్ముని చతుర్యుగములలో సేవించిన భాగవతోత్తముడు శ్రీ ఆంజనేయుడు. 'దాసోఽహం కోసలేంద్రస్య' అని ప్రకటించుకొని ఆ శ్రీరామునికే పరతంత్రుడై. శ్రీరామార్పిత సర్వకర్ముడై మోక్షము మది కోరనొల్లని మహాత్ముడు మారుతి. నిర్హేతుకమైన భక్తియే ముక్తికన్నా మిన్న అనే భాగవతవాక్యానికి ప్రత్యక్షసాక్షి. పావని. మా గురువర్యులగు కీ॥ శే॥ ఆచార్య జి. యన్. రెడ్డిగారికి శ్రీ హనుమానుడే యిష్టదైవం. తమ ఇష్టదైవాన్ని గూర్చి పరిశోధన చేయటానికి వారు నన్నే నిర్ణయించి 'గైడు లేకుండా పరిశోధించు విధానము'లో (WITHOUT GUIDE REGULATIONS) నాచేత దరఖాస్తు పెట్టించి రిజిష్టరు చేయించారు. గైడుకాకున్నా అంతకన్నా మిన్నగా నాకు తోడైనారు. శ్రీ ఆంజనేయస్వామిని గూర్చి పరిశోధించే భాగ్యాన్ని కల్గించారు. వారి వాత్సల్యానికి ప్రోత్సాహానికి నా జోహర్లు. పరిశోధనా విధానమును గూర్చి పలు సూచనల నందించిన కీ॥ శే॥ డాక్టర్ జే. శ్రీధరబాబు గారికి నా నివాళులర్పించుచున్నాను.

పరిశోధనకు నన్ను ప్రోత్సహించిన వారిలో నా చిరకాల మిత్రులు ఆచార్య ఎస్. గంగప్ప గారు డాక్టరు ఆర్. అనంతపద్మనాభరావు గారు ముఖ్యులు. ఎన్నో గ్రంథాలను నా అందుబాటులోనికి తెచ్చి తోడ్పడినవారు తిరుపతి ఓరియంటల్ లైబ్రరీ అధికారి డాక్టర్ ముదివేడు వేణుగోపాలరావుగారు అనంతపురం ప్రభుత్వ కళాశాలాంధ్రోపన్యాసకులు చిరంజీవి ఎన్. ఆదిశేషయ్య గారు, ప్రొద్దుటూరు పురప్రముఖులు డాక్టరు కే. వేంకట రమణాచార్యులుగారు నా సహాధ్యాయి గుంటూరు హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొన్నెకంటి హనుమంతరావుగారు - వీరందరికి నా కృతజ్ఞతాంజలి.

శ్రీ హనుమత్కథాంశముల కొన్నింటిని గూర్చి నాకు కల్గిన సందేహాలను పరిష్కరించడంలో పూజ్యశ్రీ భగవాన్ సత్యసాయిబాబాగారు, ఉభయ వేదాంత ప్రవర్తకులైన శ్రీమాన్ తె. కం. గోపాలాచార్యస్వామివారు, మా గురువర్యులు సరస్వతీపుత్ర కీ॥ శే॥ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు, శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు, శ్రీ మామిళ్లపల్లి నరసింహంగారు నాకెంతో తోడ్పడినారు. ఈ మహాత్ములందరికీ నా ప్రణామములు.

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానమువారు ఈ గ్రంథానికి ఆర్థిక సహాయమందించినందున దీనిని ముద్రించుటకు వీలయినది. మా ఇలవేల్పగు ఏడుకొండల శ్రీ వేంకటరమణస్వామికి, ఆయన దేవస్థాన కార్యనిర్వహణాధికారికి, వారి సిబ్బందికీ నా నమస్కారములు.

ఈ గ్రంథాన్ని 1988 లోనే ముద్రించాలని నేను చేసిన ప్రయత్నాలు నెరవేరలేదు. శ్రీ శుఖారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుంగనూరులో ప్రిన్సిపాలుగా పనిచేయుచుండగా రాష్ట్ర ప్రభుత్వము ద్వారా నాకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారము లభించిన సందర్భములో నన్ను సన్మానించటానికి స్వయంగా విచ్చేసిన కళాశాల ప్రధానదాతగారైన శ్రీ ఎస్. రామమూర్తిగారు నా యీ గ్రంథ ప్రచురణకై అయాచితంగా వెయ్యిన్నీ అరువది ఆరురూపాయిలు అరువది ఆరుపైసల ద్రవ్యసహాయాన్ని బ్యాంకి చెక్కుద్వారా పంపినారు. మంచి మనసుతో వారిచ్చిన విరాళము నాకు చేరిన వేళావిశేషమున ఆత్మీయ బంధుమిత్రులకు* స్వామివారికి నాపైగల కృపకు నిదర్శనంగా భావిస్తున్నాను. ఈ గ్రంథ ప్రచురణలో నాకు తోడ్పడిన దాతలందరికీ దీర్ఘ ఆయురారోగ్య విజయ సౌఖ్యసంపదలను శ్రీస్వామివారు ప్రసాదించుటకై భక్తితో ప్రార్థించుచున్నాను.

ఈ పుస్తకాన్ని చదివి తమ అమూల్యమైన అభిప్రాయములనందించిన ఆప్తమిత్రులు శ్రీ పి. ఎస్. రామచంద్రరావు గారికి, డాక్టరు అప్పజోడు వేంకటసుబ్బయ్య గారికి, డాక్టర్ ఎన్. రామచంద్ర గారికి, డాక్టరు ఆర్. అనంత పద్మనాభరావు గారికి నా అభివాదములు. గ్రంథ ప్రచురణకుపక్రమించిన రోజునుండి పూర్తి అయ్యేదాకా నాకెన్నోవిధాల సహకరించిన డా॥ యన్. రామచంద్రను గూర్చి కేవలోపచార వాక్యముల పలుకలేను. నాకు రెండవ ఆత్మయైన రామచంద్రకూ నాకూ మధ్యగల స్నేహాన్ని చిరంజీవిని చేసినందుకు ఆనందించుచున్నాను.

* విరాళములు లభించుట

సకాలంలో ముద్రించి గ్రంథాన్ని సుందరంగా తీర్చిదిద్దిన గా
ప్రింటర్స్ అధినేత శ్రీ కె. నరసింహారెడ్డి గారికి నా కృతజ్ఞతాంజలి.

కాపురానికి వచ్చినదాదిగా నాలుగు దశాబ్దాలుగా నా విద్యా విష
ప్రయత్నాలకు ప్రేరణకల్పించి తెలుగు ఎం.ఏ. డిగ్రీ, ఇంగ్లీషు ఎం.ఏ. డిగ్రీ
తోడుగా డాక్టరేట్ డిగ్రీ పొందేవరకు నన్ను ప్రోత్సహించిన నా ధర్మః
చి॥ సౌ॥ రాజ్యలక్ష్మి చేస్తున్న హనుమత్పూజాఫలితమే నా యీ కృ
హనుమంతునికథ - పాత్రచిత్రణను గూర్చి నేను చేసినది సమగ్రమని
భావించడంలేదు; కేవలమిదొక ప్రయత్నమే. మతగ్రంథాలలో, ఇతర సా
త్యాలలో, జానపదగాథలలో ఎన్నో అంశాలు నా దృష్టికి రానివి ఉన్నా
భవిష్యత్పరిశోధకులు వాటిని సాధించగలరని ఆశిస్తాను. విషయ ప్రతిపా
లోనూ రచనలోనూ దొరలిన దోషాలను నా అవిద్యాఫలముగా భావి
మన్నింపగల సహృదయ పాఠకులకు నా సాదర ప్రణామములు.

త్యక్తసంగుడై ఫలాపేక్షరహిత కర్మయోగానికి కమనీయమైన అద
సృష్టించిన ఆంజనేయస్వామియే నాచేత ఈ కార్యాన్ని నిర్వహింపజేశాడ
నా నమ్మకం.

ఆంజనేయః పూజితశ్చేత్ పూజితా స్సర్వదేవతాః
హనుమాన్మహిమాశక్యో బ్రహ్మణాపి నవర్ణితుం॥

హనుమద్భక్త జనసేవలో
ఆర్. ఎస్. సుదర్శనాచార్యుల

శ్రీ హనుమద్భక్తుల సహాయము

శ్రీ స్వామివారి కైంకర్యమునకై ఉదారముగా
విరాళములనిచ్చిన దాతలు.

1.	శ్రీమాన్ బి. జి. రంగాచార్యులుగారు, కడప.	రు. 1116-00
2.	శ్రీమాన్ ఉప్పల శేషాచార్యులుగారు, కడప.	1116-00
3.	శ్రీమాన్ కే. వి శేషాచార్యులుగారు, తెనాలి.	1116-00
4.	శ్రీ ఎస్. రామమూర్తిగారు, శ్రీ శఖారాం ట్రస్టు – బెంగుళూరు.	1066-66

వి ష య సూ చి క

అధ్యాయము 1. హనుమంతుని జన్మవృత్తాంతము

1. ఉపోద్ఘాతము 1
2. హనుమంతుని జనన వృత్తాంతము 5
3. హనుమంతుని జన్మస్థలము 19
4. హనుమంతుని జనన కాలవిశేషములు 20
5. హనుమంతుని రూపవిశేషములు 23

అధ్యాయము 2. బాల్యయౌవన వృత్తాంతము

1. బాల్యయౌవనములు 25
2. హనుమన్నామ విశిష్టత 32
3. హనుమంతుని బాల్యము 34
4. హనుమంతుని విద్యాభ్యాసము ... 36
5. హనుమంతునికి వివాహమైనదా? 39

అధ్యాయము 3. శ్రీరామ సందర్శనము

1. శ్రీరామ సందర్శనము 52
2. హనుమద్రామ సమావేశము 54
3. కిష్కింధా రాజకీయములు-హనుమంతుని మంత్రాంగము 66

అధ్యాయము 4. సీతాన్వేషణము

1. అన్వేషణ 71
2. కడలినిచేరు వరకు కపులు పడిన కష్టాలు 74
3. హనుమంతుని సాగర లంఘనము 81

అధ్యాయము 5. లంకలో హనుమంతుని సాహసకార్యాలు

1. నగరప్రవేశము 89
2. అంతఃపుర భవనములలో అన్వేషణ 92
3. సీతా సందర్శనానంతర కర్తవ్యమును గూర్చిన ఆలోచన 118
4. రావణసభలో హనుమంతుడు 124
5. హనుమంతుని పునరాగమనము 135

అధ్యాయము 6. రామరావణ యుద్ధము-హనుమంతుని పాత్ర

1. ఉపోద్ఘాతము 141
2. విభీషణ శరణాగతి 141
3. సేతు నిర్మాణము 143
4. యుద్ధరంగమున హనుమంతుని కార్యాలు 145
5. హనుమంతుని ఇంద్రజిత్తు మోసపుచ్చుట 152
6. మైరావణకథ 158
7. నికుంభునివధ 163
8. శివలింగ ప్రతిష్ఠ—హనుమంతుని తోడ్పాటు 167
9. గంధమాదనుని తెచ్చుట ... 175
10. రామాగమన వార్త భరతునకు తెలుపుట 177

అధ్యాయము 7. అయోధ్యలో హనుమంతుడు

1. శ్రీమద్రామాయణోక్తరీతి 180
2. రత్నహారమును హనుమంతుడు కోరుకుట 181
3. హనుమంతునకు సీతారాములు తత్త్వోపదేశము చేయుట 183
4. శతకంఠవధ 187
5. సహస్రకంఠవధ 203
6. వీరమణివధ 205
7. సురధునితో పోరాటము 206
8. కుశలవులతో పోరాటము 207
9. సకుంభ నికుంభులవధ 210

అధ్యాయము 8. ద్వాపరయుగమున హనుమంతుని వృత్తాంతము

1. హనుమంతుడు గరుడ నారద తుంబురులకు, సత్యభామకు గర్వభంగమొనర్చుట 212
2. అర్జున కపిధ్వజమగుట 219
3. భీమసేనునకు తోడ్పడుట 223
4. పురుషామృగమును తెచ్చుటలో భీమునకు తోడ్పడుట 230

అధ్యాయము 9. హనుమంతుని పాత్రచిత్రణ

1. ఉపోద్ఘాతము 233
2. కావ్యములలో పాత్రచిత్రణ 242

3. హనుమంతుని గూర్చి పండితుల అభిప్రాయములు 249
4. హనుమంతుని వ్యక్తిత్వములోని ముఖ్యాంశములు 257

అధ్యాయము 10. హనుమంతుని గుణగణాది విశేషాలు

1. దివ్యాంశ సంభూతుడు 258
2. వినయ సౌశీల్యాదులు 260
3. అహంకార రహితుడు 262
4. రామభక్తుడు 265
5. రామనామ ప్రచారకుడు - రామదర్శన కారకుడు 270
6. హనుమ పాండితీబుద్ధి విశేషాలు 272
7. హనుమ జవసత్త్వ ధైర్యపరాక్రమాది విశేషాలు 274
8. హనుమ పోరాట విధానము 276
9. హనుమ రాజనీతిజ్ఞత 277
10. హనుమ దూతగా - దౌత్యవ్యవహర్తగా 278
11. హనుమ చిరంజీవత్వము 280
12. హనుమ రచయితగా - కళావేత్తగా 281
13. హనుమ భావిబ్రహ్మగా 282
14. హనుమ ఆచార్యునిగా 282
15. హనుమ జీవన్ముక్తిమార్గ ప్రదర్శకుడుగా 284
16. హనుమ కామరూపత్వం 287
17. కపిలక్షణం (వ్యక్తిగతలోపాలు) 288
18. ఆరాధింపబడుటకు కారణము 289
19. హనుమన్మహిమలు 296
20. సింహావలోకనము 297
ఉపయుక్త గ్రంథసూచి 305
సందర్భోచిత సూచనల పట్టిక 315

తెలుగు సాహిత్యములో హనుమంతునికథ - పాత్రచిత్రణ

అధ్యాయము 1.

1. ఉపోద్ఘాతము :

శ్రీరామదాసుడగు ఆంజనేయుని ఆసేతు శీతాచలం అన్ని ప్రాంతాలవారు కొలుచుచున్నారు. మనదేశంలో రామమందిరంగానీ, మరి హనుమంతునిగుడి కానీ లేని తావే లేదు. ఆంజనేయునారాధించువారిలో హైందవేతరులుగూడ ఉన్నారు. ఆంధ్రుల నిత్యజీవితములో ఆంజనేయస్వామికి ఎంతో స్థానమున్నది. తెలుగులో ఈ మహాత్ముని కథ ఏవిధంగా ప్రతిబింబించిందో తెలుసుకోవాలన్న ఆసక్తి నాలో అధికం కాగా, సాహిత్యపరిశోధనకు పూని, మా ప్రియతమ గురువర్యులగు ఆచార్య శ్రీ జి. ఎన్. రెడ్డిగారిని కల్సుకోగా, నా పూర్వపుణ్య విశేషమునకు తగినట్లుగా "తెలుగు సాహిత్యములో హనుమంతునికథ - పాత్ర చిత్రణ"ను నాకు పరిశోధనాంశముగా వారాదేశించగా నేనీ ప్రయత్నమునకు పూని, ఇది నా జన్మ చరితార్థమగునట్లు చేయగల ప్రయత్నముగా భావించి క్రీ.శ. 1978లో నాకృషికి శ్రీకారము చుట్టితిని. ఇంకొక ప్రబల కారణము గూడ నన్నిందుకు ప్రోత్సహించినది. ఈనాడు జనులలో ధార్మికత ద్రుతమై, నీతి మృగ్యమై ధనార్జనమే జీవితధ్యేయమై, దౌర్జన్యయుతమగు అవినీతియే దానికి సాధనమై, స్వార్థము పరాకాష్ఠకు చేరియున్నది. శ్రీరామ, శ్రీకృష్ణుల వంటి పురుషోత్తములు, సిద్ధార్థుడు, రామకృష్ణ పరమహంస, వివేకానంద స్వామి, గాంధీజీవలె ఉదాత్తాదర్శములతో జనతను ప్రభావితము చేయగల నాయకులు కరువైపోగా, సమాజము 'కాననివాని నూతగొని నభీష్ట వస్తువుం గానని భంగి' సాగుచున్నది. యువత తమ ధర్మమేదో తెలియక క్రమశిక్షణ, బ్రహ్మచర్యము, జ్ఞానతృష్ణ, సచ్ఛీలములకుద్వాసన పలికి క్షణికోద్రేకతత్పరులై హింసామార్గమున దుర్వినయమునకు పాల్పడుచుండుట నా హృదయమున కెంతో బాధ కలిగించుచుండగా, హనుమంతుని ఘనతను చాటినచో జాతికి మేలు కలుగునని యీ పరిశోధనకుపక్రమించియున్నాను. త్రికరణశుద్ధీ, బ్రహ్మ

చర్యమూ, శక్తీ, యుక్తీ, భక్తీ, అసాధ్యసాధక ప్రతిభా విశేషములూ గల హనుమంతుని జీవితమే ఒక సందేశముగా జాతిని ఉద్ధరించగలదని నా విశ్వాసము.

భారతీయుల సనాతన ధర్మము విశిష్టమైనది. సకల మత సారమును అది తనలో కలుపుకొంటూ వచ్చినందున ఏకేశ్వరోపాసనకు అంకితమైన పద్ధతికి బదులు బహు దైవముల నుపాసించు విధానమే వేరూనినది. అందు వలన ముప్పదిమూడు కోట్ల దేవుళ్లు ఏర్పడినారు. ప్రతియొక్క వ్యక్తికి ఇష్ట దైవం, కులదైవం, గ్రామదైవం అని ముగ్గురుపాస్యదేవతలుండడమేకాక కొత్తకొత్త రూపాలతో, కొత్తకొత్త పేర్లతోకూడ దైవాలు ఏర్పరచుకొనడం జరుగుతూనే వుంది. 'యే యథామాం ప్రపద్యన్తే తాం తథైవ భజామ్యహం'[1] అని భగవద్గీతలో పరమాత్ముడే చెప్పినట్లుగా ఎవరెవరు ఏ యే రూపాల్లో ఆరాధిస్తారో వారికాయారూపాలద్వారానే తరణోపాయమనుగ్రహించెదనని (గీతాచార్యుడు చెప్పినట్లుగా) భక్తుల భిన్న మనః ప్రకృతులకు తగినట్లుగా దేవుళ్ల సంఖ్యకూడా పెరిగినది. కవితావిర్భావానికనుగుణమైన ఛందస్సు లనంతముగా ఏర్పడినట్లే బహునామములతో, బహు రూపములతో దేవుళ్లు కూడా వెలసినారు. కాని వీరిలో కొందరికి అధిక ప్రచారమూ ప్రసిద్ధి యేర్పడి నది. త్రిమూర్తులు, త్రిమాతలు, సూర్యచంద్రులు, నవగ్రహములు, దిక్పాలకులు తరు గిరి ధాత్రీ రూపాలు, మత్స్య కూర్మ వరాహ నారసింహ హయగ్రీవ రూపాలూ, నందీశ్వరుడు, గజాననుడు, గరుత్మంతుడు, శుకుడు, నాగేంద్రుడు, భైరవుడు, ముఖ్యులు. మర్కటరూపుడగు హనుమంతుడుకూడ వారిలో ఒకడు. ఇతనినిగూర్చి తెలుగు సాహిత్యములో ప్రతిబింబించిన అంశములను పరిశోధించి హనుమంతుని కథనూ, పాత్రనూ గూర్చి తెలుపుటయే నా ప్రయత్నము. 'ఆత్మానం మానుషం మన్యే'[2] అని శ్రీమద్రామాయణమున శ్రీరాముడు తనను మానవమాత్రునిగా చెప్పుకొనినట్లే హనుమంతుని దైవముగా కన్నా, సామాన్య వ్యక్తిగానే చూచి నా పరిశోధన చేసినాను. అట్లని హనుమంతుని ప్రశస్తినీ, ఘనతనూ తగ్గించడానికిగానీ, హెచ్చించడానికిగానీ అతని దైవత్వాన్ని మరుగు పరచడానికిగానీ నేనేలాంటి ప్రయత్నమూ చేయలేదు.

హనుమంతుని చరిత్ర ఇతివృత్తంగా కలిగిన గ్రంథాలు తెలుగులో తక్కువ. సంస్కృతభాషలో అగ్నిపురాణము, పద్మపురాణము, శివపురాణము,

వాయుపురాణము, భవిష్యత్పురాణము, విష్ణుపురాణము, వాల్మీకిచే రచింపబడిన శ్రీమద్రామాయణము, పరాశర సంహితాది గ్రంథాలు, రామరహస్యోపనిషదాదులు, భారతము, భాగవతము, దేవీ భాగవతము మొదలైన గ్రంథములు హనుమత్సంబంధమగు కథాంశములు కలిగియున్నవి. ఈ గ్రంథములు కొన్ని తెలుగులో అనువదింపబడియున్నవి. పుష్పగిరి తిమ్మన వ్రాసిన 'సమీర కుమార విజయము' మాత్రము హనుమంతుని కథను తెలుపుటకే వెలసిన గ్రంథము. తిమ్మన ఇందులో తెలిపిన కథాంశములు ఏ యే మూల గ్రంథముల నుండి గ్రహించినాడో తిమ్మన తెలిపియుండలేదు. అవాల్మీకములగు రామాయణములు సంస్కృతముననే చాలా కలవు. వీటికి తెలుగులోకూడ అనేకానేక అనువాదాలు వెలసినవి. శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారి ధర్మసార రామాయణమునకు పీఠిక వ్రాయుచు శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు—"ఆనంద, యోగవాసిష్ఠ, హనుమ, లఘుబృహత్, అధ్యాత్మ, నారద, వసిష్ఠ, అగస్త్య, భరద్వాజ, శివ, భరత, దేవీ, గుహ్యక, మంగళ, రవి, పులస్త్య, విశ్వామిత్ర, సుతీక్ష్ణ, విభీషణాది సంజ్ఞలతో వెలసిన రామాయణాలు వాల్మీకి తర్వాత వెలసినవి. ఇట్లు రామాయణములు వేలకొలది వెలసినవని వక్కాణించునది మురారి అనర్ఘ రాఘవము. ఈ గ్రంథాలన్నీ ఆ యా ఋషుల పేర్లపై అన్యులు వ్రాసినట్లుగా ఊహింపదగును"— అని వ్రాసియున్నారు.[3] వీనిలో కొన్నింటిని మాత్రమే నేను పరిశీలించినాను. జైన బౌద్ధ మతసాహిత్యములలో రామకథ వైదికధర్మ విరుద్ధముగా ప్రతిపాదింపబడినందున వానిని పరిశోధనలో వాడుకొనలేదు. భారతము, భాగవతము మొదలగు గ్రంథాలలో హనుమంతుని ప్రసంగ విశేషములున్ననూ వానిలో పునరుక్తులున్నవి. రామాయణ రచయితలు శ్రీరామునికి ప్రాధాన్యమునిచ్చి వ్రాసియున్నారేకానీ హనుమంతునికి ప్రాధాన్యము నీయరైరి. తమ కాలమునకనుగుణముగాను, తమ ప్రతిభకు తగినట్లుగాను వారు వాల్మీకి తెలుపని ఎన్నో అంశములను కల్పించియున్నారు. హనుమంతుని రామకింకరునిగా, రామభక్తునిగా రామదూతగా చిత్రించు ప్రయత్నమును వారు చేసియున్నారేకానీ బాల్యమాదిగాగల హనుమజ్జీవిత కథాంశములను వారు పేర్కొనలేదు. హనుమంతుని దైనందిన జీవిత ప్రతిక్షణానుభూతులను గానీ, అతడు నివసించిన సమాజస్వరూపమును గానీ వారు ప్రతిపాదింపరైరి. తమ కావ్య కళాధర్మమునకు తగినట్లుగా, కథావసరమును

బట్టి కొంతవరకే హనుమంతుని పాత్రను మలచియున్నారు. రామకథ ధార్మిక బోధకూ, నైతిక ఉపదేశానికి వాడియున్నందున పరిశోధనకు కొన్ని చిక్కులు ఎదుర్కొనవలసి వచ్చినది. ఆ యా గ్రంథాలలోని కవితా ముసుగును (Poetic Garb) తొలగించుకొని విషయముల గ్రహించుట; స్తుతులు, స్తోత్రాలు, మంత్రములలోని అత్యుక్తుల స్వీకరించుటలో విచక్షణతో వ్యవహరించుట; చతుర్యుగములలో వ్యక్తమగు హనుమంతుని కథలోని సన్నివేశములనూ, చారిత్రక క్రమమునూ గుర్తించుట; ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మత సంప్రదాయములలో గల వ్యత్యాసముల వలన కథాంశములలో గల తేడాలను గమనించుట ఇందులో కొన్ని. హనుమంతునికి భూత ప్రేత పిశాచాదుల నణచివేయు మహిమలున్నందున అతనియెడ వాగ్రూపముగాగానీ, క్రియా కర్మాదులవలన గానీ ఏదైనా అపచారము జరిగినచో దానివలన కీడు మూడునను విశ్వాసము చాలామందికున్నందున వారివారి మత విశ్వాసములకు భంగకరము కాని రీతిలో నేను వ్యవహరింపవలసి వచ్చినది. లభ్యస్థ ఆధారములలో హనుమంతునికి సంబంధించిన అంశములను యథాతథముగా స్వీకరించితినే కానీ ఆ యా గ్రంథముల ప్రామాణికతను గూర్చికానీ, వారుగ్గడించిన విషయముల మూలములను గూర్చికానీ నేను విమర్శించలేదు. తెలుగు సాహిత్యములో ప్రతిబింబించిన హనుమంతుని కథను, పాత్రచిత్రణను గూర్చి తెలుపుటకు మాత్రమే నా ప్రయత్నము పరిమితము. అన్యభాషా గ్రంథములలో లభించిన కథాంశములను ప్రధానాధారములుగా కాక విశేషాంశముల తెలుపుటకే వినియోగించుకొన్నాను. ఈ పరిశోధనలో హనుమత్సంబంధమగు ఉపాసన, శ్రీవిద్యోపాసన, కుండలినీశక్తి, తంత్రరహస్యములు, అర్చనావిధులు మొదలగు వానిని గూర్చి తెలుపు ప్రయత్నము ఏమాత్రము లేదు.

సిద్ధాంత రచనలో నేననుసరించిన మార్గము:— కాలక్రమమున మొదటిదగు వాల్మీకి రామాయణములోని అంశములను ప్రథమమున తెలిపియున్నాను. శ్రీ వావిలికొలను సుబ్బరావుగారు యథా మూలముగా దీనిని అనువదించియున్నారు కావున వారి అనువాదమును దానికి వారు వ్రాసిన 'మందరము' అను వ్యాఖ్యను స్వీకరించియున్నాను. ద్వితీయ స్థానమున పరాశరసంహిత అను పేరగల ఆంజనేయ చరిత్ర దీనిని శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు అనువదించియున్నారు. అటుతర్వాత పురాణములలోని అంశములు తెలిపి

యున్నాను. ఆతర్వాత తెలుగులో ప్రథమ రామాయణమగు రంగనాథ రామాయణము, నిర్వచనోత్తర రామాయణము, భాస్కర రామాయణము, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణము వగైరాలను స్వీకరించియున్నాను. పంచమ స్థానమున స్వీకరించిన గ్రంథం పుష్పగిరి తిమ్మనకృత 'సమీర కుమార విజయము.' హనుమంతుని కథను విపులముగా తెలిపిన ఏకైక చంపూ కావ్యమిది. రామాయణమున లేని ఎన్నో అవాల్మీకములగు కథాంశము లిందున్నవి. తిమ్మన ఆ యా కల్పనలను ఏ యే మూలాధారములనుండి గ్రహించెనో తెలుపుటకై నేనెక్కువగా శ్రమ తీసుకొనలేదు. తక్కిన ఆంధ్ర భాషా గ్రంథములలోని అంశములు, అన్యభాషలలో కల అంశములనూ పేర్కొని యున్నాను.

2. హనుమంతుని జనన వృత్తాంతము

శ్రీ మద్రామాయణము సుందరకాండమున హనుమంతుని జనన వృత్తాంతమున్నది. దీనిని హనుమంతుడే స్వయముగా సీతాదేవికి తెలిపి యున్నాడు. శంబసాదనుడను రాక్షసుని చంపిన కేసరియను వానర పుంగవునకు అతని భార్యయందు వాయుదేవుని వలన తాను జన్మించినట్లు హనుమంతుడు తెలిపియున్నాడు.[4] కిష్కింధాకాండమున హనుమజ్జనన కథను జాంబవంతుడు తెలిపియున్నాడు. "పుంజికస్థల అను అప్సరస శాపముచే వానరస్త్రీయై కుంజరుడను వానరునకు పుత్రియై జన్మించి కామరూపధారణా శక్తి కలదై కేసరి అను కపికాంతునికి భార్యయై ఒకనాడు మానవ స్త్రీ రూపమున సంచరించుచుండెను. కొండగాలికి ఆమె కట్టిన వస్త్రము తొలగిపోగా, ప్రకాశించిన ఆమె సౌందర్యమునకు వాయుదేవుడాకర్షితుడై ఆమెను కౌగిలించెను. తన పాతివ్రత్య భంగకారణమునకామె చింతించసాగగా వాయుదేవుడామెనోదార్చి "నేను నిన్ను సర్వదా తాకుచుండు వాయుదేవుడను. నా స్పర్శవలన నీకు పాతివ్రత్యహాని లేదు. నావలన నీకు నావంటి మహాబలవంతుడు పుత్రుడుదయించును. దాని వలన నీకు కీర్తి కలుగును" తెలుపగా దానికామె సంతోషించి, పోయి ఒక కొండ గుహలో నిన్ను కనెను. కావున నీవు వాయుదేవునకు ఔరసుడవు" కేసరికి క్షేత్రజుడవు"—అని జాంబవంతుడు హనుమంతునికే ఈ కథను తెలిపెను.[5] రామాయణోత్తర కాండమున

హనుమంతుని సమక్షమందే అగస్త్యుడాంజనేయుని జనన వృత్తాంతమును శ్రీరామునకు తెలిపెను. మేరుపర్వత ప్రాంతమున కేసరి అంజనతో నుండగా వాయుదేవుని వరము వలన అంజన కుమారుని కనినట్లు అగస్త్యుని వచనము.[6]

పరాశర సంహిత ప్రకారము హనుమంతుని జనన కథ:— దేవతలకు రాక్షసుల బాధ అధికమైనందున వారిని నాశనము చేయు చింతతో వారు బ్రహ్మనాశ్రయించిరి. బ్రహ్మ వారిని తనవెంట కైలాసమునకు వెంటబెట్టుకొని వెళ్లి శంకరుని దర్శించెను. రాక్షసవధోపాయముగూర్చి అడిగిన బ్రహ్మకు శివుడు సమాధానమేమియు తెలుపక వారిని అందరిని బదరికాశ్రమమునకు తరలించి శరణాగత రక్షకుడగు నరనారాయణునడిగెను. అపుడా నారాయణుడు దేవతలయొక్కయు తనయొక్కయు తేజస్సులను సంగ్రహించి దానినొక ముద్దగా చేసి శంకరునకివ్వగా అతడు దానిని మ్రింగెను. శివునిలో ప్రవేశించిన ఆ తేజస్సు నుండి బలవంతుడగు నొక వానరుడు జన్మించుననియు తద్వారా రాక్షస నిర్మూలన మగుననియు తెలిపెను. దేవతలు సంతసించి వెళ్లిపోయిరి. కొంతకాలము తర్వాత శివుడు సతీసమేతుడై శ్రీ వేంకటాచలము చేరి అచట విహరింపసాగెను. రతిక్రీడ సల్పుచున్న కోతిజంట యొకటి వారికాకొండపై కనబడెను. ఆ దృశ్యము చూచి పార్వతి సిగ్గుపడుచుండగా, శివుడది గమనించి తాము కపిరూపమున విహరించుటకు పార్వతినొడబరచి మర్కట మిథున క్రీడకుపక్రమించెను. వేయి సంవత్సరములావిధముగా వారు రతిక్రీడ సలిపిరి. శ్రీవిష్ణువుద్వారా తనలో చేరియుండిన దివ్యతేజమును శివుడు పార్వతి గర్భమున ప్రవేశపెట్టి రతి విరమించెను. శివతేజమును పార్వతి భరింపజాలక దానిని అగ్నియందుంచెను. అగ్నియు దానిని దాల్ప శక్తిలేక దానిని వాయువునందుంచెను. భర్త అజ్ఞపై పుత్రార్థినియై కేసరికాంతయగు అంజనాదేవి ఆకాలముననందే తపమొనరించుచుండెను. ప్రతిదినమామెకొక ఫలము నిచ్చు వాయుదేవుడా శివతేజము నామె చేతిలో నుంచెను. దానిని ఫలమనుకొని ఆమె భక్షించెను. అనతికాలములో తనలో కలిగిన గర్భ చిహ్నముల నామె గమనించి, సిగ్గుచెంది, బాధతో తన పాతివ్రత్య భంగమునకై పరితపించు చుండగా "నీకు వ్రతభంగమేమియులేదు. దైవానుగ్రహమున నీకు మహా పురుషుడొకడు జన్మించును" అని ఆకాశవాణి ఘోషింపగా ఆమె విని ఆనందించెను. తర్వాత ఆమె ఆంజనేయుని పుత్రునిగా పొందెను.[7]

పురాణములలో హనుమంతుని జనన వృత్తాంతము: పార్వతీపరమేశ్వరులు గోలాంగూలములై విహరించుచుండగా వారిని వాయుదేవుడు సమీపించి తనకొక పుత్రుని ప్రసాదింపుమని వేడెను. పరమేశ్వరుడు సమ్మతించి తత్సమయమున స్ఖలనమైన తన వీర్యమును వాయుదేవుని చేతిలో పడునట్లు చేసెను. ఆ వీర్యమును వాయుదేవుడు అంజన చేతిలో నుంచెను. ఫలమనుకొని ఆమె దానిని భక్షించెను. తత్ఫలితముగా ఆమెకొక పుత్రుడు కలిగెను. అతడే ఆంజనేయుడు. తన చేతిలో పడిన పదార్థము ఫలమా! వీర్యమా! అని ఆమె గుర్తింపలేకపోవుటకొక కారణము ఆమె కళ్లుమూసుకొని యుండుటయే. దీనికొక పూర్వకథ కలదు. పతికి ద్రోహము చేయుచు తన తల్లియగు అహల్యా సంక్రందనునితో సంగమించుటను చూచిన బాలిక అగు అంజన ఆ సంగతి తండ్రియగు గౌతమునకు తెలిపెను. దీనికై అహల్య ఆగ్రహించి 'అడుదానివై యుండికూడ అడుదాని గుట్టు కాపాడనందుకు నీవు మర్కట రూపుడగు పుత్రుని పొందెదవుగాక" అని అంజనకు శాపమిచ్చెను. అంత అహల్యా శాపమునకు ప్రతిగా, అంజన "నేను వివాహమాడినగదా నాకు కోతిరూపుగల కుమారుడుదయించుట. కావున నేనింత నుండి బ్రహ్మచర్య దీక్షనుపూని అరణ్యములలో తపమాచరించుచు జీవితము వెడలబుచ్చెదను. కన్నులు తెరచినగదా ఏ పురుషుని యందైనా మనమాకర్షింపబడుట జరుగును. కావున నేను జీవితాంతము గ్రుడ్డిదానివలె నా నేత్రములను మూసికొని చరించెదను" అని అంజన ప్రవర్తించినందున ఆమె తపము చేయుచో తన చేతిలో పడిన పదార్థము పండో, వీర్యమో అని గుర్తింపకపోయెను.[8] బ్రహ్మవలన రావణుడు వరములను పొందుచో వాడు నరవానరులను హీనముగా భావించి తనకు మృత్యువు ఎవరి వలన రాకూడదో పేర్కొనుచో నరవానరులను వదలివేసెను. వాడు లోక కంటకుడు కాగా వానిని వధించుటలో నరవానరములే శరణ్యమని బ్రహ్మ విష్ణువునకు తెలిపెను. నిత్య శివపూజా తత్పరుడగు రావణుని వధించుటలో విష్ణువు శివుని సాహాయ్యము కోరెను. శివుడంగీకరించి తాను హనుమంతుడై జన్మించి రావణ వధోద్యోగమున రామునికి తోడ్పడగలనని తెలిపినందున ఆంజనేయుడు వానరాకారమున జన్మించెనని యిదే పురాణమున కలదు.[9]

ప్రాచీన దేవీభాగవత కథ ప్రకారము: దశకంఠుడు దేవిని ప్రార్థించి త్రైలోక్యవిజయుడయ్యెను. వానిని నిర్జించు ఉపాయమును తెలుపుమని

త్రిమూర్తులు దేవిని కోరిరి. "రావణుని పురమును నేను రక్షించుచున్నాను. వీడెన్ని దుర్మార్గముల జేసినా వీనిని సంహరించుటకు వీలుకాదు. విష్ణువు మానవావతారము ధరించినపుడతనికి సహాయపడుటకై శివుడు హనుమంతుడుగా అవతరించును. అపుడు నేను లంకను వీడి వచ్చెదను. దానివలన రావణ వినాశ మవలీలగా జరుగును" అని దేవి తెలిపెను.[10]

ఆనంద రామాయణము ప్రకారము: రుద్రులంతా వానరులుగా, సంజీవనీ ముద్రతోనూ, కామరూప ధారణాశక్తితోను జన్మించగా సాక్షాత్ ఏకాదశరుద్రుడే హనుమంతుడుగా జన్మించెను. యుద్ధరంగమున నాగపాశ బద్ధుడైన రాముడు గరుత్మంతుని స్మరించగా, అతడేతెంచి సాక్షాత్ రుద్రుడే హనుమంతుడై అవతరించి యుండగా తనను రాముడు స్మరించుటయేల? అని గరుత్మంతుడనినట్లు ఆనందరామాయణకథ.[11] కేసరి అను వానరరాజుకు ఇద్దరు భార్యలు. అంజనాదేవి మార్జారాస్య. ఒకరోజున అంజనాద్రిలో విహరించుచున్న అంజన ఎదుట (సువర్చల అను పేరుగల) ఒక గ్రద్ద పాయస మయమైన పిండమును వైచెను. ఇది దశరథ సతియగు కైక చేతిలోని పాయసమే. ఆ ముద్దను అంజన భక్షించెను. అక్కడికి మార్జారాస్య రాగా వారిరువురు ఆ గిరిపై విహరించుచుండిరి. వాయుదేవుడపుడచట వారి వస్త్రముల నెగురకొట్టెను. వారి జఘన ప్రదేశముల జూచుట వలన వాయువు కామ మోహితుడయ్యెను. అతడు అంజనాదేవిని సమ్మతింపజేసి ఆమెను సురతమున పొందెను. దశరథ మహారాజ యజ్ఞప్రసాద భక్షణం వలనను వాయుదేవుని సంపర్కము వలనను అంజనకు కుమారుడుదయించెను. ఇతడే ఆంజనేయుడు.[12]

సమీరకుమార విజయము ప్రకారము హనుమజ్జనన కథ: శ్రీకరమూర్తి సర్వబుధసేవితుడగు పావని ఏకపాదరుద్రాకారుడని శ్రీరాముడు సీతకు తెలిపెను. హనుమంతుడేల కపిగా అవతరించెనో తెలుపుమని సీత కోరగా శ్రీరాముడు హనుమజ్జననవృత్తాంతమునతి విపులముగా ఆమెకు విశద పరచెను. "ఏ విద్యచేత సంసార బంధము సడలునో అది నా ప్రథమ పాదము శివుడా విద్యలో దివ్యానుభూతితో సదా వెలంగుచుండును కావున అతనికి ఏకపాదుడని పేరు. ఇతనిని ముప్పదిరెండర్బుదముల రుద్రులనుసరించు చుందురు. జ్ఞానశక్తితోగూడి ఏకపాద రుద్రుడీ అజాండము నేలుచుండును.

ఇచట బ్రహ్మ 'ప్రద్యు' సమాఖ్యతో నుండి సృష్టి చేయుచుండును. ఏకపాద రుద్రుని కరుణవలన ఇచట ప్రాణులు కాలకర్మము లెఱుగరు. వీరికి గాలిత్రోవల లీలగతులుండును. వీరికి ఆకలి దప్పు లెడలియుండును. అణిమాది సిద్ధులతో వలయు రూపములను గాంచుచు తలపులెందున్నా చలన మొందని రీతి గలవారుగా నుందురు. పుట్టినప్పుడే యౌవనము పొందిన వీరికి ఏ వేళలో మారుని కాకలు కలుగవు. ఇచటి ఏకపాదరుద్రుడూహింప వశముకాని మహిమలు కలవాడు. ఇతనిని రుద్రులు వినుతించుచుండగా "మాం రక్ష" అని ప్రద్యుమ్నడెంచుచుండును. ఇచ్ఛాశక్తి మొదలగు రమణీ మణులు ఏకపాదరుద్రునకు చామరములు వీచుచుందురు. శాంతి, దాంతి, విరక్తి మొదలగు సత్త్వాది గుణాలు ఆకారములు దాల్చి కొలుచుచుండును. ఈతడు నన్ను 'నిష్కళంకరూపమున మనమున చింతసేయు ధన్యుడు. ఒకా నొకచో నా దివ్యమంగళ విగ్రహము దివ్య తేజోమయమై ఈ ఏకపాదరుద్రుని మనమున తోచగా ముప్పిరిగొను భక్త్యనురాగ సంభ్రమములతో అచోటు వదలి, డెందంబు కందళింప, తన మనోవృత్తి ననుసరించు శరీరంబు సభ్యత్యో-పరివారంబుగా మఱచి, దూరమున నున్న ఆ దివ్యతేజము చేరుటకై కూర్చున్న యటుల తద్గగనంబున కుద్యమించగా, నచటివారది గమనించి పలుతెఱంగుల భావించి 'రక్ష-రక్ష' అని కొంత దవ్వరుగుదెంచి రాగా ఆ రుద్ర విగ్రహంబు దృగ్గోచరంబు గామి, జ్ఞాన క్రియా ప్రముఖ శక్తులు, షడ్గుణైశ్వర్యాదులు అతని ననుసరించి వచ్చినవి. తక్కిన రుద్రులు అతనిని చింతించుచు కొంత కాలమునకు పునరావృత్తి రహితంబగు రామపదము ప్రాపించిరి. ఆ ఏకపాద రుద్రుడు శతకోటి భానుప్రభా సముద్దీపంబగు ఆ తేజోరూపమున కున్ముఖుడై మరుద్గతినతిశయింపు మనోగతియు, మనోగతి నతిశయించు దర్శనాభిలాషయు, తదనుకూలంబగు దృగ్జాలంబు మేలంబు సూచనను, ప్రాణ, పంచేంద్రియములా నా దివ్యతేజమునందే పొందించి, మహత్త్వావరణంబు మీరి, అహంకార సాలంబు దూరి, భూతాకాశంబు డాసి, సత్య తపోలోకంబుల త్రోవలం బడి స్వర్లోకవాసులకాశ్చర్యంబు కల్గించి భువర్లోకంబు తరించి, కైలాసంబు చేరి, రామతారక బ్రహ్మ మంత్ర జపానుష్ఠాన నిష్ఠాగరిష్ఠుండైన ఆ శంకరుని నాసికా రంధ్రాంతరాకాశపథంబున ప్రవేశించిన ఆ తేజోవిశేషము వెంట తానుగూడ ఆ భూతనాథుని చేతనం బ్రవేశించెను. ఈశానుని మూర్ధసీమలో చేరి సుషుమ్న జొచ్చి వెన్నాడి, హృదయాకాశమున ఆరాముని కానక అతనిలో నీట నీరువలె

కాయము భేదములేక ఏకమైపోయెను. జగత్కారణమూర్తి కాదగిన కారణమీ ఏకపాదరుద్రుని యందున్నందున ఈతడే ఆంజనేయుడై జన్మించెను" అని రాముడు సీతకు హనుమజ్జననకారకమగు పూర్వకథ తెలిపెను.

ఈ ఏకపాదరుద్రాంశ సహితుడగు శివుడొకనాడు వనవిహారమునకై బయలుదేరి పార్వతినిగూడ తనవెంట తీసుకొని వెళ్లెను. అది వసంతఋతువు. అధికోల్లాసముతో వారందు మన్మథ వ్యాపార పరతంత్రులై విహరించబోగా వారి దృష్టికొక మర్కట మిథునము 'మన్మథ సుఖస్థితి'లో క్రీడసేయుట గోచరించెను. గిరికన్య శివుని ముఖము చూడలేక సిగ్గుచెందగా శివుడామెను గమనించి తామునూ అట్టి మర్కట రూపమున విహరింతము గాక అని పలికి 'మర్కటాకృతిన్ జిగురు కటారి వజీరుని కేళి'లో నామెను తేలించెను. సురతానంతరం లీలాభరిత కపి దంపతీత్వముడిగి ఆత్మరూపముల వారు ధరించు సమయములో పార్వతీసతి ఆ తెల్లని వేలుపు తేజపుభారము భరింపఁ దేకువ లేక దానిని 'వేఱొండెడజేర్పగదే' అని కోరెను. అపుడు శివుడు మందహాసముతో ఆ తేజమును ధారుణియందిడెను. భూదేవి అ తేజాన్ని దశ శతవర్షంబులు మోసి కృశించి, మోయజాలక, 'దీనినీవేడనైనను నిల్పవే పరమేశ మ్రొక్కెదన్' అని పలికెను. దానిని భరింపుమని శివుడు అగ్నిదేవుని కోరెను. అతడును వేయి సంవత్సరములా తేజమును మోసిన తర్వాత దానిని తాను భరింపలేనని శివునితో పలుకగా, శివుడు వాయుదేవుని పిల్చి ఆ తేజమును వహింపుమనెను. ఆ వాయుదేవుడు దానిని వెయ్యేండ్లు భరించి అంజనాదేవి కివ్వగా తత్ప్రభావమున ఆమెకు ఆంజనేయుడు జన్మించెను.[13]

ఆంజనేయుని తలిదండ్రులగు అంజనాదేవి కేసరికపి గారలను గూర్చి వారి పూర్వవృత్తాంతములు సమీరకుమార విజయము విపులీకరించి యున్నది. బ్రహ్మ అపూర్వ సౌందర్యముతో అహల్యను సృష్టించెను. అమె గౌతమునికి సతియైనను ఇంద్ర సూర్యులామెను కామించి అనుభవించిరి. ఇంద్రునివలన వాలి, సూర్యునివలన సుగ్రీవుడు ఆమెకు కలిగిరి. ఆమె తప్పిదమును బ్రహ్మ వాక్యానుసారము క్షమించి గౌతముడహల్యతో జీవించి ఔరసపుత్రిగా అంజనాదేవిని పొందెను. తమకము తీరని ఇంద్రుడు మరల అహల్యను చేరవచ్చెను. తన తల్లి అహల్య ఇంద్రుని పొందుటను గూర్చి అంజన తన తండ్రికెరిగించెను. గౌతముడంత అహల్యను పాషాణమగునట్లుగా శపింపబూనెను. రెండవమారు

ఇంద్రసంబంధమున అహల్యకు శతానందుడను కుమారుడుదయించియుండెను. శాపమునననుభవింపబోవుటకు ముందు అహల్య గౌతముని క్షమాపణకోరి శతానందునిగూడ క్షేత్రజ పుత్రుడుగా స్వీకరింపకోరెను. గౌతముడు వాలికి, సుగ్రీవునికికూడ శాపముల నొసంగెను. "వీరు తమతమ మానవ రూపముల నుడిగి తమ కన్నతండ్రులతో కలసి అవే అంశములతో వేరొక కపికి జన్మించి, అవే పేర్లతో వ్యవహరించి ఇరువురునూ ఒకే ఇంతికి భర్తలై యీసుచే ఒండొరులు కయ్యంబు కావింపగలరు" అని వారికి శాపము కలిగెను. తమ తల్లి అపరాధము తండ్రికి తెలిపిన కారణమున తమకు శాపము కలిగినందుకు వాలి కోపించి అంజనను 'కపికాంత' యగునట్లు శాపమిచ్చెను. కాని సుగ్రీవుడామెను బాధపడకుండా ఓదార్చెను.

"........విం

తిల్లం బోకు వివేకశాలి యగు వానిన్ వానరుం బెండ్లియై
ముల్లోకంబులు నెంచ సర్వగుణధాముం బుత్రునింగాంచి రం
జిల్లం" గలవని తెలిపి ఆమె కుమారుని తన స్నేహమును పాటించుటకై

పంపుమని తెలిపెను. వాలి సుగ్రీవులు తనువులు వీడి ఋక్షరజుడను వానరునికి పుత్రులై జన్మించిరి. శతానందుని జనకునికి పురోహితునిగా జేసి గౌతముడు అంజనను తగిన వరునకొసంగుటకై అన్వేషింప పయనమాయెను. అంజన కపికాంత అగుటకు కారణమపుడా గౌతముని యోగదృష్టికి తెలిసెను.

అంజనాదేవి పూర్వజన్మ వృత్తాంతము:— పూర్వజన్మలో అంజన ఒక విద్యాధరుని పుత్రిక. పేరు సుగంధి. సకియలతోచేరి ఒకనాడీమె హిమాద్రిలో వనవిహారమొనర్చి శ్రమాపనోదనేచ్ఛతో నచటి కొలనులో జలక్రీడలాడి ఆపై ఒక మావికెలనున చివురు పాన్పున నుండగా మహాభారమగు శివతేజమును భరించి తూలుచూ పోవుచుండిన అగ్నిదేవునామె చూచి నవ్వెను. దాని నవమానముగా భావించి అగ్ని ఆమెను చూచి....

...."నీ శరీరమణి యొండొక రూపున కీశపత్నివై
యిది భరియించి పుత్రుగనుమీ...."

—అని శాపమిచ్చెను. ఈ పూర్వజన్మ వృత్తాంతము గౌతముడంజనకెఱింగించి దానివలననే వాలిశాపమామెకు సంక్రమించెనని వివరించెను. దైవకృతమును భరించి వనాటుని పెండ్లియాడుమని ప్రోత్సహించి గౌతముడామెను హిమాద్రిలో

తపము చేసికొనుచున్న కుంజరుని వద్దకు చేర్చెను. "పుత్రార్థివగు నీకీమె పుత్రిక" కాగలదని అంజననాతనికిచ్చి గౌతముడామెను "కామరూపిణివై, పతి భక్తికల్గి, నిత్యయౌవనము, అతిశయశీలము నిగ్రహానుగ్రహ సామర్థ్యము కలిగి సత్పుత్రుని పొందునట్లు ఆశీర్వదించి తన ఆశ్రమమునకు వెళ్లిపోయెను."

కుంజరునికథ: కుంజరుడను కపి పుత్రార్థియై శివునిగూర్చి తపమొనర్చుచుండెను. మహాదేవుడతని భక్తికి మెచ్చి సాక్షాత్కరించి, "పుత్రస్పృహా సౌశీల్యాత్మకమైన పుణ్యము పూర్వజన్మమున జేయవు గాన గౌతముని పుత్రికను నీకుమార్తెగా స్వీకరింపుము. అమె పేరు అంజన. అ చక్కని కన్యకు నా అంశమున కుమారుడుదయించి వంశోద్ధారకుడగును." అని తెల్పి అంతర్థానమయ్యెను. గౌతముని రాక కెదురుచూచు కుంజరుని వద్దకు గౌతముడు రాగా అతనిని సగౌరవముగా నెదుర్కొని మహాదేవుని వరమును గురించి అతనికి నివేదించగా గౌతముడానందించి తన పుత్రిక అంజననతనికిచ్చి వెళ్లెను. కుంజరునిభార్య 'వింధ్యావళి' ఆమెను పుత్రీప్రేమతో లాలించగా అ వానర మిథునమునే తన జననీజనకులుగా భావించుచు అంజన వారివద్దనే యుండెను.

యుక్తవయస్కురాలై అంజన ఒకనాడు సఖులతో కలిసి వనవిహారమునకై వెళ్లెను. దేవతాస్త్రీల పాటలలో ఆమె చక్కదనాన్ని గూర్చి వినియుండిన కేసరి అను వానరేంద్రుడు ఆమెను చూడవలెనను తలంపుతో అ వనములోనికి వచ్చెను. కంతుని సోయగము గైకొనిగానము చేయుచున్న అంజననుచూచి అతడనంగతాపపీడితుడాయెను. కేసరిని చూచిన అంజనకును మరులు కలిగెను. ఈ విషయమెఱింగి కుంజరుడానందించి తన కూతురగు అంజనను కేసరికిచ్చి వివాహము చేసెను.

అనురాగ దాంపత్యముకల అంజనా కేసరుల కెన్నేళ్లు గడచినను సంతానము కలుగలేదు. ఫలదానములు, వృద్ధోపసేవలు, ద్విజదంపతుల కొలుచుట, అన్నదానములు, ధనకనక వస్తు వాహన ధాన్య కన్యాది దానాలు వారెన్నెన్నో చేసిరి. అంజనకూడ గజగౌరి, ఉత్తరాగౌరి, సాంవత్సరగౌరి, పదియారుగౌరి, పసపుపట్టిగౌరి, నిట్టుప్పుగౌరి, తంగేటిగౌరి, చల్లకూటిగౌరి, సావిత్రిగౌరి, చల్దిగౌరి, కరళ్లగౌరి, ఆదిత్యగౌరి మొదలుగాగల మూడువందల అరువది వ్రతముల చేసెను. సంతానము కొఱకై ఎవరేమి చెప్పినా, దాని నంతయు నామె చేయుచుండెను.

అక్కైన దెల్లఁ బత్తిరి
యే కద రాయైన దెల్ల నీశ్వరుడనుచున్
జేకొని భక్తి భజింపుదు
రా కపి దంపతుల నియమ మరుదు నుతింపన్.

ఈవిధముగా ఎన్నో వ్రతాలూ, నోములూ చేయు నామె కడకొకనాడు ధర్మదేవత కూరిమికల్గి యెఱుకతయై వచ్చెను,

"బంగరు గుంటి వింటి దొరపాటి యనందగు మేటి, సాటి మీ
రంగల గొంటు రక్కసుల రాయిడి గండెడు పోటుబంటు"

పాపడై అమెకు కల్గునని తెలిపి పతి అనుమతితో తపము చేయుమని ఉపదేశించి వెళ్లెను. ఈవార్త వినిన కేసరికూడ అంజననుచూచి "నాకు పుత్రుడు కలుగునని భరద్వాజాది మహర్షులు వరమొసంగియున్నారు. ఆ కథ నీకు తెలిపెదను. శంఖకబళుడను రాక్షసుడు మత్తేభ రూపము ధరించి మునులను బాధించుచుండెను. మహర్షులను సేవించుచుండిన నేను నా పిడికిటి పోట్లతో వానిని చంపినందున భరద్వాజ మహర్షి నన్ను 'కేసరి' అని నుతించెను. వారు

"సర్వలోకోపకారి శాశ్వత బలుండు
నిర్మలుడు పుత్రుడొకడు జన్మించు నీకుఁ
దప్పదీమాట" అని వరమనుగ్రహించిరి. ఆ వాక్యము నాలో వేదార్థమై భాసించుచున్నది. అఖిల జీవులకు అధారభూతుడై, సర్వలోకములకు ప్రాణమై, అన్నిచోటుల పరిపూర్ణుడైయుండు దైవమే వాయుదేవుడు. కావున నీవు వాయు దేవుని గూర్చి తపమొనర్పుము" అని కేసరి తన భార్యయగు అంజనకు తపో దీక్ష స్వీకరింప ప్రేరేపించెను. "పుంజికస్థలమను ప్రదేశ మశేష ఫలదాయక మనియు, నచట తపోవ్రతమూనినచో ధర్మదయాకీర్తి సత్య సత్వరమతి డాంతి శాంతి గుణ ధైర్య పరాక్రమ వేదశాస్త్ర విస్ఫురదణిమాది వైభవ విభుత్వ హితుండు సుతుండు కలుగునని" కేసరి తెలిపిన మాటలను శిరసావహించి అంజన తపోదీక్ష పూనెను.

అతి కఠోర నియమముతో అమె తపమొనర్పసాగెను. అమెక్షుద్బాధను తీర్చుటకై పవనుడామెకు నిత్యమొక ఫలమును ఇచ్చుచుండెను. వాయుదత్త ప్రసాదముతో అమె యేడువేలయేండ్లు తపస్సు కొనసాగించెను. అనిల దేవుడామె తపస్సునకు మెచ్చి—

ఇందు కళాధరుండు ధరియింపఁగ మున్నిడినట్టి తేజ ము
య్యింద నిభాస్య కోర్కి ఫలియింప ఫలాకృతి జెంత నుంచి పో
వం దరుణీలలామ ప్రతివాసరలబ్ధి ఫలంబెయంచు నా
త్మం దలపోసి లోఁ గొనినఁ దచ్ఛివ తేజమమోఘమౌటచేన్.

—ఆమె గర్భము ధరించెను. తనలో గర్భ చిహ్నముల గమనించి అంజన విస్మయాన్వితయై తపోదీక్ష విరమించి 'అయ్యో' పతినిబాసి ఒంటరిగానుండి నాకు గర్భము వచ్చుట వలన అపకీర్తి కలుగునుగదా! అని పరిపరివిధముల చింతించుచుండగా నపుడు 'గగనభారతి' ఆమె నూరడించుచు పలికిన పలుకులు వినబడెను. శివతేజమనిలుని ద్వారా ఆమెకు ఫలరూపముగా లభించినందున, దానినామె భక్షించినందున....

...."నీ గర్భ యుక్తిఁ బ్రత్యక్ష శివుడు
పెరుగుచున్నాడు గాడ్పు గర్భీకరించెఁ
గాన వాయుజుడను పేరు గాంచునితడు"

ఈ వర గర్భ శక్తి జనియించు కుమారక రత్నమార్య సం
భావిత దివ్యకీర్తి సురపాలక జాల కిరీట ఝూట శో
భావహమూర్తి సర్వ జగదంచిత సర్వ గుణానువర్తి నా
నా విధ రామకార్య ఘటనాహృత నమ్ర జనార్తి" యంచని పల్కెను.

అంత వాయుదేవుడుకూడ అచట ఆమెకు ప్రత్యక్షమై తన నిజాకృతి చూపి "ఇపుడు ఆకాశవాణి పలికినది నిజము. కావున చింతింపకుము. నీ విభున కీ విధమంతయు తెల్పుము." అని ఊరడించి వెళ్లెను. కేసరిని చేరి అంజన ఈ విషయమంతయు నతనికి నివేదించి అతనినే సేవించుచు ఉండగా ద్వాదశ మాసము లేగిన తర్వాత ఆమెకు కుమారుడుదయించెను.[14]

హనుమంతుని జనన వృత్తాంతమునుగూర్చి యితర గ్రంథములలో తెలియదగు విషయము. 1. ధర్మసార రామాయణము ప్రకారం వాయుదేవుడు కేసరి రూపమున వచ్చి అంజనను పొంది వెళ్లిన తర్వాత నిజనాథుడేతెంచగా అంజన జరిగిన ఘోరమును భర్తకు వివరించగా అతడు పుత్రార్థమై కొలుచు వాయుదేవుని వలన పుత్రుని పొందుటలో దోషము లేదని ఆమె నూరడించెను.[15] 2. శ్రీమదాంధ్ర వచన రామాయణము ప్రకారము తపముచేయు అంజనను స్పర్శద్వారా కౌగిలించి వాయుదేవుడామెతో సంభోగించగా ఆమె

పాతివ్రత్యభంగమునకు కుందుచుండగా వాయుదేవుడామెకు పాతివ్రత్య భంగము లేనట్లుగా వరమిచ్చి తనతో సమానముగా ఎగురుటలో, దుముకుటలో శక్తిగల వీరుడు పుట్టునట్లనుగ్రహించి వెళ్లగా మేరు పర్వతగుహలో అంజనా దేవి కుమారుని గాంచెను.[16] 3. సంపూర్ణ రామాయణమునకూడ కథ ఇట్లే కలదు. కాని అంజన వాయుదేవుని శపింపబోగా అతడామెను వారించి వర మిచ్చినట్లు మాత్రమున్నది.[17] 4. గణపతి రామాయణ సుధ కథలోకూడ నిట్లే యున్నను

యశస్విని నిను నేను హృదయముననె
కౌగిలించుకొనుచు పొంద నాగినాను
....
నీదగు సతీత్వమునకుర్వి లేదు లోటు
దైవ సంపర్కమున లేదు తప్పు సతికి.... అని కలదు.[18]

ఇట్లే కట్టా వరదరాజకృత రామాయణమున, ఆశ్చర్య రామాయణమున, శ్రీకృష్ణ రామాయణమున అత్యల్ప భేదములతో కథ కలదు.[19]

"హనుమాన్ లీలా తరంగిణి" "హనుమద్విలాసము" "శ్రీమద్రామా యణాంతరార్థము" అను ఆధునిక గద్య గ్రంథములలో శివుడేల హనుమంతు డుగా నవతరించెనో తెలుపు కథలున్నవి. ఏ ఆధారమునుబట్టి వారు అట్లు వ్రాసిరో మాత్రము పేర్కొనలేదు. కైలాసమున శివుడొకనాడు పార్వతిని చూచి ఇట్లు పలికెను. "నేను నిత్యము ఏ దేవుని ధ్యానించుచున్నానో ఆ దేవుడు భూలోకమున అవతరించనున్నాడు. అతనికి తోడ్పడుటకై దేవతలు వానరాకారములలో జన్మించబోతున్నారు. నా ప్రభు కైంకర్యమునొనర్చుటకు నేను కూడ భూలోకమున అవతరించనున్నాను. రావణుడు తమ భక్తుడగుట వలన అతని వధించు కార్యములో శివుడు తోడ్పడుట తగునా అని పార్వతి ప్రశ్నించెను. శివుడు భూలోకమునకు వెళ్లినచో తానావియోగము భరింపజాలనని పార్వతి వాపోయెను. అపుడు శివుడు తాను వేరొక రూపంతో రాముని సేవించుచు, కైలాసములో ఉండి కూడ పార్వతికి ఆ లీలలన్నీ చూపగలనని చెప్పెను. రావణుడు తన పదితలలతో దశరుద్రులను మాత్రమే అర్చించె ననియు అజైకపాద రుద్రరూపమగు తన ఏకాదశ రుద్రరూపము నర్చించ

కుండిన కారణమున తానిపుడా అంశమున వాయుదేవుని ద్వారా అంజనా గర్భమున ప్రవేశించి జన్మింతునని తెలిపెను.[20]

గార్ధభనిస్స్వనుడను రాక్షసుడు (కొందరితనిని గాలాసురుడుగా పేర్కొనిరి) శివుని గూర్చి తపమొనర్చి అనేకములైన వరములు పొందెను. స్త్రీ పురుష సంపర్క స్పర్శచే అవతరింపకున్నట్టి స్త్రీ శక్తిచే మాత్రమే తాను మరణించునట్లు వీడు కోరిన వరములలో నొకటి. లోకకంటకుడైన వీనిని సంహరింపబూని విష్ణువు శివునిచేరి వానిని వధించుటకుపాయము కోరెను. అపుడు శివుడు "వాడు నా భక్తుడు. నా కవచము వానిని రక్షించుచున్నది. కావున వానినెవరును సంహరింపజాలరు." అని పలికెను. శివకవచమున్నను వాని దుష్కృత్యములవలన దాని ప్రభావము శిథిలమైనది కావున వానిని తాను సంహరింపగలనని విష్ణువు తెలుపగా శివుడు పంతముపూని వానిని విష్ణువు వధించినచో తాను కింకరుడై విష్ణువును సేవింపగలనని పందెము పెట్టెను. మహావిష్ణువు ఆ రాక్షసుని చేరి తన జగన్మోహినీ రూపమున వానిని మోహింపజేసి, వానిని మద్యపాన మదోన్మత్తుని గావించి తానొక తోడేలు రూపమొంది వానిని వధించి వాని తలను తెచ్చి శివునకు చూపెను. శివుడంత తన ఓటమి నంగీకరించి, తన మాటప్రకారం నారాయణుడు రామావతారమెత్తినపుడు తాను ఆంజనేయుడై జన్మించి రామునికి సేవచేయ గలనని పలికెను. త్రిపురాసుర సంహార కాలమున విష్ణువు బాణమై శివునకు తోడ్పడినందున శివుడాంజనేయుడై విష్ణువునకు రామావతారకాలమున తోడ్పడినట్లు మరియొక కథ.[21] హనుమంతునిలో శివుని అంశ ఉన్నట్లే అతని తోకలో పార్వతి అంశ ఉన్నట్లు డాక్టర్ ఆర్. లక్ష్మణమూర్తిగారి అభిప్రాయము.[22]

డాక్టర్ మల్లాది గోపాలకృష్ణశర్మగారు శ్రీమద్రామాయణ వైభవమను గ్రంథమున మరియొక విశేషము చెప్పియున్నారు. శివునకు విష్ణువు తన జగన్మోహినీ రూపము చూపగా శివునకు వీర్యస్ఖలనమయ్యెను. దానిని శివుడు సప్తఋషులకిచ్చెను. ఋషులును పరమేశ్వరుడు ప్రేరేపింపగా ఆ పరమేశ్వర ధాతువును అంజనాదేవియందు ఆమె శ్రోత్రము ద్వారా ప్రవేశపెట్టిరి. చెవి ద్వారా ప్రవేశించిన ఆ వీర్యము వలన అంజన గర్భము ధరించి పుత్రుని పొందెనను కథ శివపురాణ శతరుద్రీయ సంహితలో కలదని వారు తమ గ్రంథములో తెలిపియున్నారు.[23]

ఈవిధంగా తెలియవచ్చు విశేషములను బట్టి అంజనాదేవి గర్భము ధరించి ఆంజనేయుని పుత్రునిగా పొందుటలో పలురకముల కథలు వ్యాప్తి లోనికి వచ్చినట్లు స్పష్టము. 1. శివతేజమును అంజన భక్షించినందున ఆమె గర్భవతి యగుట. 2. శివతేజమును వాయుదేవుడు అంజనను స్పృశించి ఆమె కిచ్చుట. 3. అంజనతో సురతమ్మొనర్చి తనలోని శివతేజమును వాయువు ఆమెలో ప్రవేశపెట్టుట. 4. సప్తఋషులు అంజనాదేవి శ్రోత్రము ద్వారా శివతేజమునామెలో ప్రవేశపెట్టుట. 5. సద్యోగర్భమున అంజనకాంజనేయుడు జన్మించినట్లును, 6. నవమాసములు మోసిన తర్వాత జన్మించినట్లును, 7. ద్వాదశ మాసములు మోసిన తర్వాత జన్మించినట్లును కథలు వ్యాప్తి లోనికి వచ్చినవి. ప్రతి కల్పమున చతుర్యుగములలో ఆంజనేయుని కథ పునరావృత్తమగుట వలన ఈ కల్పనల బాహుళ్యమునకు స్థానమేర్పడియుండ వచ్చును. సప్రమాణముగా సత్యముగ్గడింపవలెననిన సర్వభాషాసాహిత్యముల లోని కల్పనలనన్నింటిని ప్రత్యేకశ్రద్ధతో పరిశీలింపవలసియుండును.

కుమారస్వామి జన్మక్రమమునకు ఆంజనేయస్వామి జన్మక్రమమునకు చాలా పోలికలున్నవి. శివతేజము శివసతిద్వారా కాక ఇతరత్రా ఫలించి షణ్ముఖుడు జన్మించినట్లే శివాంశతో జన్మించిన ఆంజనేయుడుకూడ అట్టి జన్మమునే పొందెను. మన్మథుడు, అగ్నిదేవుడు, షాణ్మాతృకలు కుమారస్వామి జననమున ప్రాధాన్యము వహించినట్లే ఆంజనేయుని జననమున భూదేవి, అగ్నివాయువుల ప్రాధాన్యమున్నది. శివునితేజమతని భార్య వహింపలే కుండుట ఒక విశేషమైతే, అంజన భరించుట ఇంకొక విశేషము.

పురాణములలో వర్ణింపబడిన విషయములలో లోకోత్తరులగు వ్యక్తుల జన్మాది విషయములు విచిత్రముగా కన్పించును. ఇట్టి ప్రజోత్పత్తిని గూర్చి విష్ణుపురాణమున గల విషయములు గమనార్హములు. "స్త్రీ పురుషుల మిథున క్రీడ ఎనిమిది రకములు. స్మరణం, కీర్తనం, కేళి, ప్రేక్షణం, గుహ్యాభాషణం, సంకల్పం, అధ్యవసాయం, క్రియానిర్వృత్తి. పురుషులకు ముఖ్య రేతస్థానమైన బీజములోని రేతస్సును ప్రాణాయామ బలముచే యోగులు ఆ శక్తిని పైకి లాగుచుందురు. ఆ కారణముచే వీరికి స్ఖలనముండదు. ఇట్టివారు తాము మనో బలము చేతనే తమలోని రేతస్సును స్త్రీల గర్భములందు చేర్పగలరు— దర్శనం, స్పర్శనములతో వారు అట్లు చేయగలరు. మనసుయొక్క శక్తిచే,

దర్శనశక్తిచే, స్పర్శశక్తిచే అట్లు చేయలేనివారు దేహసంపర్కము చేతనే అట్లు చేయవలసియుండును. కాని, అత్యంతమగు తపస్విజనులు, సిద్ధులు, సంకల్పము చేత, స్పర్శనంచేత, దర్శనంచేత ప్రజోత్పత్తి చేయగలరు.[24] అవతారమూర్తు లగు వామన, పరశురామ, రామ, కృష్ణాదులు; కుమారస్వామి, గజాననుడు, భీష్మ ద్రోణ కర్ణాది వీరులు; క్రీస్తు, రామకృష్ణ పరమహంస, మహర్షులు, ఆళ్వార్లు మొదలగువారి జనన విషయములలో చిత్రవిచిత్రములు జగద్విదితమే అయినా జనులు వానిని తార్కిక దృష్టితో కాక విశ్వసించెడి దృష్టితో స్వీకరించుచున్నారు. ప్రాకృత అప్రాకృత విషయముల మధ్యగల అంశములను స్పష్టముగా తెలియజాలమని మానియర్ విలియం గారను ఆంగ్ల పండితుడు తెలిపియున్నాడు.[25] (In Indian Epics, the boundaries between the natural and the Supernaturul, between earth and heaven, between the divine, human and animal creations are singularly Vague and undefined, troops of deities and individual personages appear on the stage on every occasion. Gods, men and animals are everchanging places. The myths of Indian Epics are still closely interwoven with present Indian Faith) కావున కన్యాత్వం భంగంకాకుండా కుమారులను కని తల్లు లగుట, పాతివ్రత్యభంగం లేకుండా బహు భర్తృత్వమనుసరించుట, వివాహా త్పూర్వమే సంభోగానుభవము పొంది కూడ పతివ్రతలుగా గుర్తింపబడుట, పుట్టుకతోనే ఆభరణాలు, కవచాలు కల్గియుండుట, సద్యోయౌవనము, సద్యో జ్ఞానము పొందుట, వేదాలను వల్లించుట వంటి విశేషములు సాహిత్యమున కొల్లలు. ఆంజనేయుని అసాధారణ జనన విశేషముల గూర్చి శ్రీ కే.సి. అర్యర్ అను పండితుడు ఈక్రింది మాటలలో సమర్థించియున్నాడు.

"It is held by some that 'VAYU" ravished Anjana in the forest. Others who believe that great and divine beings are born in a way different from the normal process of human or animal creation uphold the view that 'VAYU" passed into Anjana's body through her ear. This is not a laughing matter. The passing of 'VAYU' into Anjana's body through her ear and making her pregnant has a deeper significance Even, these days, the TANTRIKS and YOGIS

can effect a humber of psychological, physical, mental and spiritual changes in a person by blowing mantras into his ears. Secondly, ear is believed to be the purest of all bodily parts. Ear is meant for hearing sound (శబ్ద) which emanates from ether or Sky (The purest of all the five elements) This accounts for the unusual birth of HANUMAN, the embodiment of chastity and purity [26]

"శిల్పమూ, (కళ) మతమూ మానవ జీవితంలో అత్యంత ప్రాక్తనమైన అనుభూతులకు ప్రతిబింబాలు. కవులూ, శిల్పకారులూ మతాన్ని పరిపుష్ట మొనర్చియున్నారు. పురాణ వృత్తాంతములను కథలుగా కవి విశదీకరించగా, అందలి దేవతలకు, నాయకులకు రూపాలను శిల్పులు ప్రసాదించారు. భావించడమొక కళ అయితే విశ్వసనీయమగు భావమే మతము. అందువలన మతాన్నీ, కళనీ వేరుచేసి చూడజాలము రసానుభూతిలో, మతవిశ్వాసములో దర్శింపదగిన అంశము అనిర్వచనీయమై మానవహృదయమందు నిగూఢమై యుండును. అందువలన హనుమజ్జనన సంబంధమగు అలౌకిక విషయములు శాస్త్రీయసత్యమువలెకాక సారస్వతశిల్పకళామతవిశ్వాస స్పర్శగల అంశములుగా గుర్తించుట అవసరము.[27]

3. ఆంజనేయుని జనన స్థలము:

ఆంజనేయుని జన్మస్థలమును గూర్చి యే గ్రంథములో కూడా విపులముగా లేదు. ఆంజనేయుని ఒక పొదరింటిలో (లేదా గుహ) అంజన ప్రసవించినట్లు శ్రీమద్రామాయణము. వేంకటాచలమున అంజనాదేవి ఆంజనేయుని ప్రసవించినట్లు పరాశరసంహిత తెలుపుచున్నది. వేంకటాచలమందలి అంజనాద్రిలో ఆంజనేయుడు జన్మించినట్లు ఆనందరామాయణము. కాని యీ అంజనాద్రి పంపాసరోవర సమీపమున నున్నట్లు శ్రీ యస్. సి. డే అను పండితుడు తమ HISTORICITY OF RAMAYANA" అను గ్రంథములో పేర్కొనియున్నారు. ఈ పంపా ప్రాంతము నేటి కర్ణాటక రాష్ట్రమందలి హంపీ ప్రాంతమేనని యిచట ఋష్యమూకమను పర్వతముకూడ ఉండుట దానికి బలమును చేకూర్చుచున్నదని కొందరి వాదము. 'పుంజిక

స్థలము'న అంజన కుమారుని కనినట్లు సమీరకుమార విజయ సాక్ష్యము. కాని తెలుగువారు ఆంజనేయుడు రాయలసీమలో తిరుపతి-తిరుమల ప్రాంత మందలి అంజనాద్రిలోనో వేంకటాద్రిలోనో జన్మించియుండునని నమ్ము చున్నారు. తిరుపతి నుండి హంపి వరకు గల ప్రాంతములో ఆంజనేయ దేవాలయముల సంఖ్య అధికముగా నుండుట; ఇచటి వారు ఆంజనేయులు, అంజి, హనుమంతు; అనుమంతు, సంజీవరాయుడు, సంజీవయ్య, సంజీవి, సంజీవమ్మ యిత్యాది పేర్లు పెట్టుకొనుట – ఈ రెండు కారణముల పేర్కొను చున్నారు. ప్రాచీన భౌగోళిక ప్రదేశముల గూర్చి ప్రామాణిక స్వరూపము నిర్దేశింపబడువరకు ఆంజనేయుని జన్మస్థలమును గూర్చి సులభముగా తెలుప జాలము. ఈ అంశమునే శ్రీ కే. సి. ఆర్యన్‌గారు

It is very defficult to say anything decisi'vely about HANUMAN'S birth place. The tribals of Madhya Pradesh believe that HANUMAN was born in 'ANJAN' Village in GUMLA - PRAMANDAL, of Ranchi District. Countless legends related to HANUMAN'S life are woven around the old temples scattered ali over this region. The inhabitants of KARNATAKA, bellieve their land to be HANUMAN'S birth place. The ruins of Pampa and Khiskhinda, are still to be seen in Hampi of Bellary District.'[28]

4. జననకాల విశేషములు:

శ్రీమద్రామాయణమున ఆంజనేయుని జననకాల విశేషములగూర్చి స్పష్టమైన అంశము లేదు. ఇక పరాశర సంహితలో ఇతడు వైశాఖమాసమున కృష్ణ పక్షమున దశమి శనివారమునాడు పూర్వాభాద్ర నక్షత్రయుక్త వైధృతీ యోగమున జన్మించినట్లు కలదు. ఆశ్చర్య రామాయణమున కూడ ఇట్లే ఉన్నది. శ్రీ దివాకరుని వేంకటసుబ్బారావుగారును ఈ సమయమునే పేర్కొనియున్నారు. ప్రసిద్ధ పంచాంగ రచయితలగు బ్రహ్మశ్రీ ఓరుగంటి వేణుగోపాల వేంకట సుబ్రహ్మణ్య సిద్ధాంతి, బ్రహ్మశ్రీ గొరిపెద్ది రామ సుబ్రహ్మణ్య సిద్ధాన్తి, శ్రీమదాసూరి మరింగంటి వేంకట పీతాంబరాచార్య సిద్ధాన్తి హనుమజ్జయంతిని వైశాఖ బహుళ దశమిగానే పేర్కొనియున్నారు.[29]

ఏకాదశి మఖా నక్షత్రమున అంజనేయుడు జన్మించినట్లు అనంద
ము. శ్రీ తులసీదాసుగారు 'ఉత్సవసింధు' అను గ్రంథమాధార
నేయుని జననము కార్తీక కృష్ణ చతుర్దశి మంగళవారం స్వాతీ
క్ష మేషలగ్నమున జరిగినట్లు తెలిపియున్నారు. ఇవికాక జనావళిలో
నున్న సమయములు కూడ కొన్ని కలవు. 1. చైత్ర శుద్ధ పూర్ణిమ
ం. 2. కార్తీక కృష్ణ చతుర్దశి ఆదివారము, 3. మార్గశిర శుద్ధ
శనివారం అశ్వినీ నక్షత్రయుక్త వృశ్చికలగ్నము, 4. మార్గశిర
మి. సిద్ధాంతుల గణనలోని తేడాలవల్లనూ అంజనేయుని కథను
ములలో వచ్చిన మార్పుల వలననూ ఈ అభిప్రాయము లిన్ని
డ వచ్చునని శ్రీ ములుకుట్ల నరసింహావధానులుగారు, శ్రీ కుంట
మారావుగారు భావించి యున్నారు. మొత్తముమీద హనుమంతుని
ను గూర్చి యిన్ని వాదములున్నను దక్షిణ భారతదేశమున వైశాఖ
మి శనివారము కాగా ఉత్తర భారతమున చైత్ర శుద్ధ పూర్ణిమ
ప్రచారములో నున్నది.[30]

జనేయుని జనన సంబంధమగు విచిత్ర విశేషాదులు. 1. శ్రీమద్రా
న తెలుపబడని కొన్ని అంశములు హనుమంతుని గోత్రమును
పమును గూర్చి కొన్ని అద్భుతాలను పరాశర సంహితాదులు
వి. హనుమంతుడు కౌండిన్యసగోత్రుడని పరాశర సంహితతో
రామాయణ సారోద్ధారము కూడ తెలిపియున్నది. ఈ అభిప్రాయ
వాకరుని వేంకట సుబ్బారావుగారును తమ కిష్కింధాకాండమున
న్నారు.[31] అంజనేయుడు పుట్టగానే పూలవానలు కురిసెననియు,
దేవదుందుభులు మ్రోగెననియు, దేవగంధర్వులు నృత్యము చేసి
సిద్ధులు చారణులు స్తోత్రము చేసిరనియు, వనమున వాయువులు
వీచెననియు, నదులు నిర్మలోదకములై సవనియు మునుల
ను మూడును ప్రదక్షిణాకార జ్వాలలతో ప్రకాశించెననియు రాక్షసుల
ములలో పొదిగిన రత్నాలు అకారణంగా క్రింద పడిపోయినవనియు
గనల గర్భస్థశిశువులు వణికిరనియు పరాశర సంహిత వర్ణించినది.[32]
మారవిజయమునను ఇట్లే ఉన్నది.

మొనసెన్ సురగోముఖ వాద్యతతుల్
నెఱసెన్ మలయానిల లోలగతుల్

విఱిసెన్ బలు కావిరి నల్దెసలన్
గురిసెన్ విరులగ్గురు లగ్నమునన్[33]

తన గర్భమున శివతేజము పెరుగుచుండుట గుర్తించిన అంజనాదేవి "తనయా! 'ఉదయింపుము' అని ఆదేశించెను. అపుడా ఉదరస్థ శిశువు 'జననీ, నగ్నశరీరముతో నేను జన్మింపజాలను.'' అని బదులు పలికెను. అంత ఆమె శివుని ప్రార్థించి అతని కవచమును శిశువున కిమ్మనెను. శివుడు తన వజ్ర కవచము నీయగా దానిని ధరించి ఆంజనేయుడు జన్మించెను.[34] ఈ కథకు అధునికులింక కొన్ని విశేషముల జోడించి యున్నారు. గర్భస్థ శిశువు రామ నామస్మరణ చేయుచుండగా అంజన 'నాయనా, నేను ఈ గర్భభారమును భరించలేను. త్వరలో బయల్పడుము" అని కోరగా ఆ శిశువు 'అమ్మా' నేనందరి శిశువులవలె జన్మించువాడనుకాను. నాకు దివ్య పీతాంబరము, మాణిక్యకుండలములు, సువర్ణ యజ్ఞోపవీతము కావలెను. అపుడు అంజనాదేవి తాను అంధురాలగుట వలన తానవి సమకూర్పజాలనని అందువలన ఆ శిశువు నకే అభరణములు కావలయునో వానితోనే జన్మింపుమని బుజ్జగించెను. అపుడు ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి శనివారము పూర్వాభాద్ర నక్షత్రయుక్త వైధృతీయోగమున మధ్యాహ్నవేళలో మాణిక్య కుండలములతో, దివ్య పీతాంబరముతో, స్వర్ణమాలికలతో, సువర్ణ యజ్ఞోపవీతముతో, మణి నూపురములతో ధ్వజ వజ్రాంకుశ ఛత్ర పద్మ రేఖలతో గూడిన పాద పద్మములతో, గొప్ప భుజములతో, దీర్ఘవాలముతో, బ్రహ్మ తేజః పుంజ వదనారవిందముతో జన్మించెను.[35] మఱియొక కథ ఏమనగా, పూర్ణగర్భవతి యైన అంజన ప్రసవము కానందున బ్రహ్మాది దేవతలు వచ్చి అంజన గర్భస్థ శిశువును బహిర్గతమగుమని కోరగా ఆ శిశువు 'ఓ బ్రహ్మాది దేవతలారా, నాకు మీరు మూడు వరముల నిచ్చినచో లోకములోనికి రాగలను. హేమకాంతులు తేజరిల్లు రోమములు నా శరీరమంతా వ్యాపించియుండవలెను. నాకు అందమైన వరదట్టి కావలయును. నాకు వెండిజందెమమరియుండవలెను. నేను పుట్టుసరికి ఈ వరములు నాకు సంక్రమింప పుట్టిన పిమ్మట ఆ వరముల స్మృతి నాకు లేకుండా ఉండవలెను." అని తెలుపగా, బ్రహ్మాదులందుకంగీక రించి అనుగ్రహించగా ఆంజనేయుడు జన్మించెను.[36]

5. ఆంజనేయుని రూపవిశేషములు:

శ్రీమద్రామాయణోత్తర కాండమున అంజనేయుని రూపము "వరిగింజ కొనముల్లు వంటి వన్నెగలవాడని తెలుపబడియున్నది. ఇతని తోక వాసవ ధ్వజ నిభమైనది.[37] పరాశరసంహితలో: ధ్వజ వజ్రాంకుశ, ఛత్ర పద్మ రేఖ లతో గూడిన పాదపద్మములతో, గొప్ప భుజములతో, దీర్ఘ వాలముతో బ్రహ్మతేజఃపుంజ విలసిత వదనారవిందము కలిగి మహాబల సంపన్నుడై, విష్ణుభక్తి తత్పరుడు, నిగ్రహానుగ్రహ సమర్థుడు, వేదవేదాంగ తత్త్వజ్ఞుడు, మహా మహిమాన్వితుడు, బ్రహ్మవేత్తలలో అగ్రగణ్యుడు, సర్వశుభలక్షణ సంపన్నుడు అగు అంజనేయుడు జన్మించెను.[38] ఉత్తర రామాయణములో వర్ణితమగు రూపమునే సమీరకుమారవిజయమున తిమ్మన వర్ణించియున్నాడు.

నిడుద వాలము వాని నెల బొల్పు తలనిల్పు
　　బలువేల్పు తుల వేల్పు బలిమి వాని
బచ్చ చూపులవానిఁ బగడంపు జిగిసొంపు
　　బెగడింపు మై చాయ బెడగువాని
నొంటి జందెము వాని నొఱపుంచు నెఱమించు
　　మఱపించు బంగారు మౌంజి వానిఁ
గుండల ద్యుతి వాని గురుహార హరహీర
　　శర శారదాకీర్తి గరిమవాని
మంచి మది వానిఁ గ్రొంబట్టు పంచెవాని
మంచు మలనొంచు దిటువావరించువాని
వడుగుఁ బాపని చిన్నారి బుడుత నొకని
గాంచె నావేళ నంజనా కాంచనాంగి.[39]

("లలిత సౌదామినీతులిత దేహమువాని" ఆ 5. ప 95. కంకంటిపాపరాజ ఉత్తర రామాయణ పద్యము చూడదగును.)

హనుమంతుడు పంచముఖుడని, కామరూపుడని తెలియుచున్నది. 'హనుమంతుని పాత్రచిత్రణ' అను శీర్షికలో దీని వివరములను చూడదగును.

పుట్టిన పుత్రునకు కపిదంపతులు నామకరణమొనర్చినట్లేకావ్యములోను లేదు. అంజనాదేవి పుత్రుడగుటవలన అంజనేయుడనియు కేసరి సుతుడగుటచే

కేసరినందనుడనియు రుద్రాంశమున జన్మించుటచే రుద్రకుమారుడనియు వాయుపుత్రుడనియు వ్యవహరింపబడినాడు. శ్రీ కాళూరి వ్యాసమూర్తిగారు 'రామరాజ్యము–కుశలవులు" అను గ్రంథమున వానరజాతి సంప్రదాయముల గూర్చి తెలుపుచు "వీరి జాతి మాత్రము వానరజాతి. వీరికి మానవుల తెలివి తేటలు బుద్ధిబలము కలవు. ఆయా దేవతల రూపము, వేషము, పరాక్రమము వీరియందు గలవు. వీరికి కామరూపత కలదు. కారణజన్ములైన వీరు వేదాభ్యాసము చేసిరి. ఉపనయనాది సంస్కారముల గావించుకొనిరి. వీరు తమ ప్రవృత్తియందు రెండు ధర్మములను స్వీకరించిరి. 1. వానరజాతి లక్షణం, 2. వానరజాతి విలక్షణం. వీరికి ఉపనయనం విలక్షణం; వివాహం విరోధం.[40] అంజనాకేసరులు తమ కుమారునికి నామకరణాది ఉపనయనాది కర్మల జేసియుండవచ్చునని యూహించుకొనవచ్చునేకాని ప్రత్యక్ష సాక్ష్యముల చూపుటకు వీలుకాదు. ఇంద్రుని వజ్రాయుధము తగిలిన పిమ్మట 'హనుమానుడ"ను పేరు కలిగినదేకాని అది తలిదండ్రులు పెట్టిన పేరుకాదు. హనుమానుడన్నా, హనుమంతుడన్నా ఒకరే. ఇతనిని దైవముగా నారాధించువారు అష్టోత్తరశతము, సహస్రము అగు ఎన్నో నామములతో ఇతనిని వర్ణించుచున్నారు.

హనుమంతుని బాల్య యౌవన వృత్తాంతము

1. హనుమంతుని బాల్య యౌవనాదులు:

శ్రీమద్రామాయణోక్తం: కిష్కింధాకాండము ఉత్తరకాండములలో గల అంజనేయ చరిత్రలో హనుమంతుని బాల్య జీవిత విశేషములు కేవలము సూచితమే. ఏడవకుండా ఉండుమని చెప్పి, అంజనాదేవి ఫలముల దెచ్చుటకు వనమునకు పోగా ఉదయాద్రిపై పొడెతెంచు 'జపాప్రసూన రుచిరకాంతి'తో నున్న భానుబింబమునుచూచి దానిని పండనుభ్రాంతితో పట్టుకొనుటకై శిశువగు అంజనేయుడెగిరెను. అపుడు గగనచరులైన గరుడ గంధర్వ యక్ష సిద్ధ సాధ్యులు నివ్వెఱపడుచుండగా ఆ పిన్నపాపనికి ఎండ తాకకుండా మిన్నేటి తమ్మి పుప్పొడి దుమారమొకటి వెనువెంటగా వెళ్లెను. బాలుడు దేనినీ గమనించ కుండా వెళ్లెను. అతని పాదతాడనానికి పాథోథులు చెదరినవి. తొడల రాయిడిచే గంధర్వాది నగరాలు ఛిన్నాభిన్నములైనవి. బాహువేగానికి వైమానికుల విమానము లొఱగిపోయినవి. వాలవిక్షేపానికి నక్షత్రాలు లాజలై తూలిపోయినవి. ఖేచరులు చీకాకుపడుచుండగా బాలుడా భానుని ఒడిసిపట్టెను. సూర్యసతి ఛాయ కరములు పిసికికొనగా, మౌనులు ఒదిగి యుండగా, పారిపార్శ్వకులు పారిపోగా భానుడతనికి వేడిమి తగులకుండా ఉండెను. ఆరోజు అమావాస్య అగుటచే రాహువు సూర్యుని గ్రహింపవచ్చి తనకుగల భయకారణమును ఇంద్రునికి విన్నవించుకొనెను. అపుడు ఐరావత ముపై ఇంద్రుడు రాగా భానుని వదలి తెల్లని పండని తలంచి బాలాంజ నేయుడా ఏనుగును పట్టబోయెను. అపుడింద్రుడు తన వజ్రాన్ని ప్రయోగించెను అది హనువందున తగిలినందున బాలుడు స్మృతితప్పి పూర్వాద్రిపై పడెను. తన పుత్రుడీ అపద నొందుటకు వాయువు ఆర్తితో ఆ బాలుని తీసికొని గుహాంతరమునకు చేరి లోకమున వాయువును స్తంభింపజేసెను. అపుడు జీవరాసులు, యాజకులు, దివిజులు, దురవస్థపాలై పరమేష్ఠికి విన్నవించగా

బ్రహ్మ వారి కోఱకై వాయువును చేరి ఆంజనేయుని లాలించి చైతన్యవంతుని చేసి వేల్పులందరిని అంజనేయునకు వరముల నియ్య ప్రోత్సహించెను. ఇంద్రుడొక అంబుజమాలికనిచ్చి తన వజ్రాయుధము వలన మరణము రాదని చెప్పెను. సూర్యుడు తన తేజమున నూఱవభాగమునిచ్చి విద్యాభ్యాసకాలము రాగానే వాక్పటిమ నొందు శాస్త్రమును నేర్పుదుననియు, ఏ శాస్త్రముననూ హనుమంతునకీడులేనట్లు చేతుననెను. వరుణుడు తన పాశములవలన నీటి వలన పదిలక్షల యేండ్లవఱకు చావునొందనట్లు వరమిచ్చెను. యముడు తన కాలదండము వలన మరణము నొందనట్లును రోగములు లేకుండునట్లును, యుద్ధభూమిలో దుఃఖ విచారము లేకుండునట్లును తెలిపెను. విశ్వకర్మ తనచే నిర్మితమైన అస్త్రశస్త్రాదులవలన చావులేకుండుటే కాక దీర్ఘాయువు కలుగుననెను. బ్రహ్మ చిరాయువును, శత్రు భీప్రదత్వమును, మిత్రముదావహత్వమును, దుర్జయత్వమును, కామచరత్వము, కామరూపము ఎదురులేని బలమును శక్తియును రామసేవను పొందునట్లనుగ్రహించెను.[41]

పరాశర సంహిత ప్రకారము: ఆంజనేయుడు జన్మించిన నాలుగయిదు రోజులలో అమావాస్య వచ్చెను. తల్లిని చూచి బాలుడు ఆహారము కోరెను. అంజన తన శిశువును లాలించి బాగా పక్వమునకు వచ్చిన పండ్లు ఎక్కడైనా లభించినచో తినుమని చెప్పెను. అపుడుదయించుచున్న భానుని చూచి దానిని పండనుకొని పట్టుకొనెను. సూర్యుని నోటకఱచు ఆ బాలుని చూచి యీ బలశాలి యెవడోనని విచారించి ఇంద్రుడు తన వజ్రాయుధము నాంజనేయునిపై విసరెను. ఆ ఆయుధమును అంజనేయుడు తన రోమముతో నడ్డెను. తన ఆయుధము వృథాయగుటజేసి ఇంద్రుడు బ్రహ్మాస్త్రము వేసెను. దానిని కూడ ఆంజనేయుడొక రోమముతో నడ్డెను. అది చూచి దేవతలాశ్చర్యపడిరి. అంత బ్రహ్మాది దేవతలు ఆంజనేయుని చేరి అతనిని ప్రార్థించిరి. "ఓ ఆంజనేయా! వాయుపుత్రా! రుద్రకుమారా! నీవు మహావీరుడవు. మహాబలవంతుడవు. దేవతలకు, మానవులకు, ఋషులకు మేలు చేయుటకే నీవు పుట్టితివి. సూర్యుని నీవు పట్టుకొని నందున వేదోక్తమగు క్రతు కర్మాది సేవలన్నియు నిల్చిపోయినవి. కావున సూర్యుని వదలుము." అని ప్రార్థించిన దేవతల మాట లాలకించి అంజనేయుడు సూర్యుని వదలెను. ఈ అద్భుతములను చూచిన ఇంద్రుడు చాపల్యము చేత క్రీడాసక్తుడై అంజనేయుని దవుడపై తన వజ్రా

యుధముతో కొట్టెను. వెంటనే బాలుడు శిలాతలమున పడి మూర్ఛితుడాయెను. అంత వాయువు అధికవేగముతో అందరి దేహములలోని వాయువును నిగ్ర హించెను. దానివలన లోకవ్యాపారములన్నియు ఆగిపోగా దేవతలు గంధర్వులు సిద్ధులు మహర్షులు త్రిమూర్తులు ఇంద్రుడు వాయువును చేరి నీ కుమారునకు మేము అనన్య దుర్లభములగు వరముల నిచ్చెదము. నీవు శాంతించి వాయు ప్రసరణ కావింపుమని ప్రార్థించిరి. ఆంజనేయునకు దీర్ఘా యువు బల పరాక్రమములు, ఆరోగ్యము, అజేయత్వము, విద్య, బుద్ధి, తపస్సు తేజస్సు, వాక్పటుత్వము, ప్రసన్నత, చతురత, ధైర్యము, విష్ణుభక్తి, దయా మయత్వము, పరస్త్రీ విముఖత మొదలుగా గల వరముల నిచ్చిరి. ఆంజ నేయుని ఆదరించి అతనిని చూచి బ్రహ్మ "నీవు విష్ణువు వలె దేవతల నుద్ధరించ గలవు. రామకార్య దీక్షామూర్తివై సంజీవనీ పర్వతమును తెచ్చి లక్ష్మణునకు ప్రాణములను ఇవ్వగలవు. సముద్రమును లంఘించి సీత జాడ తెలియగలవు. నీవు ఏ అస్త్రముచేతను జయింపబడవు. అయినను నా ప్రార్థనను ఆలించి ఒక్క క్షణము మాత్రము నా అస్త్రమునకు (బ్రహ్మాస్త్రము) కట్టుబడియుండు నటుల అంగీకరింపుము. నీవు ఈశ్వర తేజముచే జన్మించినందున ఈశ్వర తేజోదార్ఢ్యవంతుడవు. పార్వతీ గర్భమున సంభవించుటచే పార్వతీగర్భుడవు. అగ్నిచే ధరింపబడినవానివి కావున అగ్ని గర్భుడవు, వాయుపుత్రుడవు, అంజనాసూనునివి, కేసరి కుమారునివి, నీ హనువునకు వజ్రాయుధము తగిలి నది కావున నీవు హనుమంతుడవు అను పేరు వహింప గలవు. బ్రహ్మ విష్ణు మహేశ్వరాంశమున జన్మించితివి కావున త్రిమూర్త్యాత్మకుడవు. సర్వదేవతల అంశల నందినందున సర్వదేవమయుడవు. నిన్ను పూజించినచో అందరినీ పూజించినట్లే. ప్రతి గ్రామమునందును నిశాచరులు నశించుటకు చెడుగులు తొలగి శుభములు కలుగుటకు నీ నివాసము ఏర్పడగలదు." అని బ్రహ్మ పలికిన తర్వాత వారందరు అంతర్ధానమైరి.[42]

సమీరకుమార విజయము ప్రకారము: పొత్తిళ్లలో నుండిన హనుమం తుడు పోరుపెట్టి ఏడ్వగా అతనిని అంజనాదేవి యీ విధముగా లాలించి బుజ్జగించెడిది.

.... "రార, నన్

గన్నతండ్రి తపః ఫలాకృతి గౌరి నోములపంట, నా

చిన్ని ముద్దులకూన యింతుక సేపు పోరిడకుండు మా
యన్న యాకలిదీఱఁ బండ్లు వనాంతరంబునఁ దెచ్చెదన్ ...."

ఈ విధంగా ఆంజనేయుని ఆదరించి పర్ణశాలలో ప్రవాళశయ్యపై శిశువు నుంచి తాను శీఘ్రంగా వచ్చెదనని పలికి అంజన అడవికి వెళ్లెను. అంత ఆంజనేయుడు ఆకలితో వాపోయి జనని వెనుక వేగంగా వెళ్లబోయి తూర్పు దిక్కున చూచెను. అప్పుడే ఉదయించుచున్న భానుబింబమతనికి అరుణారుణ ప్రభలతో ఆశ కల్గించెను.

తొట్టిన యాకటి బెట్టను
నట్టిట్టు గణింప నెఱుగకది ఫలమనుచున్
బుట్టిన దిట్ట తనంబున
నట్టె యెగసె గాడ్పుపట్టి యాకసమునకున్.

అతడావిధంగా ఘూర్ణిల్లెను. దిగ్గజాలు మూర్ఛనొందెను. బ్రహ్మచిత్తము భయోత్పాతాప్తితో క్షోభించెను. శరభమువలె గర్జించుచు వెడలు అంజనేయు డప్పుడు జగత్సంహార వేళలో వెడలు భీకర శూలాయుధునివలె నుండెను. అతని వాలచలనమునకు జడధివ్రాతముల్ తూలలీలల తూలెను. నక్షత్రాలు లాజలై నిర్ఘాతకోటులు తొరగెను. స్రోవలు సురిగిపోయెను. గంధర్వ నగరము లన్నియు ఛిన్నాభిన్నములయ్యెను. వ్యోమ విహారులగు విమానము లన్నియు గణగణ మ్రోయుచు కూలిపోయెను. చూచుచున్న యక్ష రాక్షస ఫణి సిద్ధ సాధ్య దైవత నాయకులందరు అతనిని చూచి ప్రళయాగ్నియో, అంత్యకాల ప్రభంజనమో, విలయార్కుడో, భైరవుడో కావలయునని తలంచి అతని దుర్నిరీక్ష్య ప్రభాజవప్రతాపోగ్ర గతులకు మహాద్భుతము చెందిరి. ఎన్నడూ దర్శింపని యట్టి వీరుని దెబ్బకు ఇంక ఈ బ్రహ్మాండమేమి నిలువ గలదని తలంచువారు ప్రాణభీతితో, తిక్కమొగముతో పారిపోయిరి.

విచల ద్వాలముతోఁ దరంగితవళీ విస్పష్ట ఫాలంబుతో
రుచిమద్ఘర్మకణాన్వితాననముతో రోదోంతరోచ్ఛేద కా
ర్య చణా వార్య రవంబుతోఁ బవన తార్క్ష్యాశ్చర్యకృత్సత్వర
ప్రచురాహంకృతితో నతండు రవి బింబ ప్రాంతముం జేరగన్.

కుమారుడు సూర్యమండలం వైపు వెళ్తుండుట చూచిన వాయుదేవుడు భయపడి సూర్యతేజమువలన బాలునకాపద కలుగకుండా 'తామర చలువ తావుల నెరసి'

విసరసాగెను. చల్లగాలులు వీచుచు తన వెనుక తండ్రియగు వాయుదేవుడు వచ్చుసంగతి గమనించక, వెనుకా ముందూ చూడకుండా లక్షయోజనము లతిక్రమించి సూర్యమండలంలోనికి దూరుటకై పోగా సూర్యసతి ఛాయ కరములు పిసికికొనసాగెను. సూర్యుని పారిపార్శ్వకులు 'పాహి పాహి" అని భయముతో వణకుచుండగా లోకాలను గ్రంహించడానికి రుద్రుడే లయకాల రూపుడై వచ్చెనని యెంచి సూర్యునితో "స్వామీ మా నేత్రాలు గ్రుడ్డివై పోతున్నాయి; ఈతని గర్జల వలన మా చెవులకు చెవుడు వస్తోంది. మమ్మలను దయాదృష్టితో కాపాడండి" అని మొరపెట్టుకొనిరి. అపుడు దివాకరుడు 'ఈతడు అంజనా సూనుడు. సర్వలోక హితుడు. రుద్రాంశజుడై బాహు శౌర్యముతో కేవల శైశవబుద్ధితో నన్ను ఫలమనుకొని గ్రహించుటకై వచ్చు చున్నాడు. భయపడకుడు." అని ఊరడించుచుండగా బాలాంజనేయుడు భాస్కర బింబాన్ని పట్టుకొనెను. కనులపండువుగా ఉండే పండును కను గొన్నాను కదా అని కపికిశోరమానందించుచు పట్టబోగా అతనిపై వాత్సల్య ముతో సూర్యుడు వేడిచూపకుండా ఉండెను, అరుణ కమలాన్ని గజకిశోరము లాగినట్లుగా ఆ సూర్యబింబాన్ని లాగి దానిని యిటూ అటూ చూచి ముఖానికి దగ్గరగా చేర్చి

..........యొకటి నుంచి వేడియైనను వెడలం
బట్టికొని కేలఁగొట్టియుఁ
దిట్టియు వెసఁబోయి మఱియు

తెమలించసాగెను. అది పర్వమైనందున సూర్యుని గ్రహించుటకై రాహు వేతెంచుచుండగా బాలాంజనేయుడు భయంకరముగా గర్జించెను. అది విని రాహువు భయపడి పారిపోయి ఇంద్రునితో మొరపెట్టుకొనెను. "అయ్యా సూర్యుని యింకొకడెవడో పట్టుకొన్నాడు. ఇంక నేనెందుకు." అని వాసవునితో చెప్పగా ఇంద్రుడు రాహువునకభయమిచ్చి, వానితోగూడ ఐరావతముపై బయలుదేరి వచ్చి ఆంజనేయుని సమీపించెను. ఆంజనేయుని కత్తితో కొట్టుటకై తలంచి తన ఐరావతమును ఢీకొల్పెను. అది చూచి అంజనేయుడు 'ఓహో ఎర్రనిపండు బదులు తెల్లనిపండు దొరుకుతుందే" అని తెల్లని ఏనుగును పట్టబోగా అదికూడ భీతిచే వణకసాగెను. అపుడు ఇంద్రుడు తన వజ్రాయుధమును ---

"ఝళిపించి మరుత్సుతువైవ హనువు పగిలిన
నతడుదయాద్రిపయి వివశుడైనటులున్నన్....

దానిని వాయువు గమనించి తన కుమారునకు కలిగిన దుర్దశకు దుఃఖించి కోపము పూని 'జగజ్జన బాహ్యాభ్యంతర సంచారాన్ని" నిరోధించెను.

వనము నుండి యింటికి చేరిన అంజన పొత్తిళ్లలో పాపడు కనబడనందుకు నేలపైబడి నిట్టూర్చి యే వన్యమృగమో తన కొడుకు నెక్కడికో ఎత్తుకొని పోయెనేమోనని 'విధి'ని దూషింపసాగెను. అంతలో ఆమె భర్త కేసరి ఆమె వద్దకు వచ్చెను. అతడు త్రికాలజ్ఞాని. జరిగిన విషయము నామెకు వివరించి ధైర్యము కలిగించి "గాడ్పు తన ధర్మాన్ని మాని స్తంభించియున్నందున నీ కొడుకునకు సకల మహిమలు చేకూరగలవు" అని ఓదార్చెను. ప్రాణవాయువు స్తంభించినందున దేవతలందరు బ్రహ్మను చేరి తమ బాధను తెల్పిరి. అంత బ్రహ్మ వారిని వెంటనిడుకొని వాయువును చేరి అతనిని శాంతింప కోరెను. మూర్ఛలోనున్న తన పుత్రుని వాయుదేవుడు బ్రహ్మ పాదములపై పెట్టి నమస్కరించెను. బ్రహ్మ తన చేతితో బాలుని తాకగానే అంజనేయునికి చైతన్యము కల్గి లేచి చెరచెరలాడగా, బ్రహ్మ

"ఫలాకాంక్షా హృత బాలసూర్య
గిరి శంభద్ధైర్య"—

"రమ్మునాయనా" అని అంజనేయు నెత్తికొని ముద్దాడెను. ఇది చూచి వాయువు సంతసించి తన పట్టు వీడి లోకమునకు ప్రాణమును ప్రసరింపజేసెను.

అపుడు బ్రహ్మ సకల దేవతానీకమును చూచి 'ఈ బాలుడు అఘున్యాత్మల సంభావింపగా శంభుడే ప్రాదుర్భావము చెందినాడు; లోకత్రయామోదప్రోద్యుడు. ఇతనికి మనము వరములను ఇయ్యవలెను" అని పలికెను. వాయుదేవుని ప్రసన్నుని చేసికొనుటకై దేవతలందరూ అంజనేయుడు కోరుకొనకున్నా వరముల నిచ్చుటకుద్యమించిరి.

1. సూర్యుడు — తనతోడి తేజమును, వేదశాస్త్ర ప్రాప్తినీ
2. వరుణుడు — నీటిలో తన పాశముల నుండి నిర్భయ సంచారిత్వమునూ
3. యముడు — రోగాదులూ మృత్యువూ చేరకుండునట్లునూ
4. ఈశానుడు — తనవేగాని తన ఆయుధాలవేగాని గాసినొందనట్లునూ

5. కుబేరుడు – తన గదాహతికి భీతిల్లకుండుటేకాక సకల సమర విజయమునూ

6. విశ్వకర్మ – శస్త్ర భీతి నివారకమగు కర్ణకుండలములునూ

7. ఇంద్రుడు – తన వజ్రాయుధము వలన భీతి లేకుండునట్లునూ

8. బ్రహ్మ – దీర్ఘాయువుతోపాటు మునిశాపములు తగులకుండా ఉండే శక్తినీ

9. అగ్ని – తనచేత నశింపకుండునట్లునూ (ఈ వరము స॥ కు॥ వి గ్రంథములో లేదు.)

10. శివుడు – తన ఆయుధము దేనితోను చావకుండునట్లునూ (ఇదికూడ స॥ కు॥ వి॥లో లేదు. 9, 10 అంశములు కంకంటి పాపరాజ కృత ఉత్తర రామాయణ మూలాధారముగా. ఆ 1, ప 179 మరియు ఉత్తరకాండము – మందరము. ప 819 – 825)

ఈ వరములు పొంది ఆంజనేయుడే యే కార్యములు సాధించునో, ఎట్టి ప్రభావమును పొందునో బ్రహ్మ వివరించెను. "ఇతడు కీర్తివిహారుడై, అజేయుడై, ఏకైకవీరుడై, అద్రిధీరుడై, జగదుదారుడై, ఆత్మ తత్త్వ విచారుడై అంతరింద్రియజేతయై అణిమాది సిద్ధులు తాను పొంది యితరులకు వానిని ప్రసాదించువాడై నిరర్గళ. మనోవేగముతో తలంచిన మాత్రమున బ్రహ్మాండమును చేరగలవాడై, నిత్య వైరాగ్య స్థితిలో నిష్కాముడై కామ రూపత కలవాడై అనివార్య శౌర్య ధైర్య దయాది సద్గుణముల కాకరమగు వాడై అద్భుతమగు క్రియలొనర్చువాడై అఘటనాఘటన మహిమ కలవాడై రామకార్యసాధకుడై, రాక్షసాంతకుడై లోకశ్రేయస్సు సాధించు నెన్నో మహిమల చూపగలవాడగునని" వివరించెను. ఈ సందర్భములో ఇంద్రుడు తన వజ్రఘాతమున హనువు తగిలి అజేయుడైన కారణమున ఆ బాలుడు హనుమంతుడను పేరుతో ప్రసిద్ధి పొందగలడని తెలిపెను. ఇన్ని వరాలను పొందుటకు బాలుని యెడ వాయువు ఆనందించి అతనిని స్వయముగా ఎత్తికొని తానే ఆ బాలుని అంజనా కేసరుల వద్దకు చేర్చి దేవతాదులతని కిచ్చిన వరముల తెల్పి వెళ్లెను. దానికి వారెంతో ఆనందించిరి. 'వజ్రాహతివేళలో

బాధపడుతూ నన్నెంతగా స్మరించితివోకదా నాతండ్రీ' అని అంజన పలికి హర్షాతిరేకంతో అతనిని చేరదీసి ధరాగత పరాగ క్రాంతమైన అతని ముఖాన్ని తన కన్నీటితొ అభిషేకించెను.[43]

ఈ కథలగూర్చి యితర గ్రంథముల ప్రకారము ; ఇంద్రుడాంజనేయునకు స్వచ్ఛంద మరణమును వరముగా నిచ్చినట్లు 'గణపతి రామాయణసుధ' ఆంజనేయుడు భవిష్యద్బ్రహ్మ కావలసిన కారణమున్నందున సూర్యుడాంజనేయుని దహింపకుండెనని పెన్మెత్స సూర్యనారాయణరాజుగారి ఉత్తర రామాయణము. తన కుమారునకు అమరత్వము, అజేయత్వము సంపూర్ణ బలములతోపాటు శ్రీరామభక్తి, శ్రీరామ సన్నిధాన నివాసము వాయుదేవుడు వరములుగా కోరినందున బ్రహ్మ ఇచ్చినట్లు శ్రీ తులసీదాసుగారి రామచరిత మానస్.[44]

2. హనుమంతుడను నామవిశిష్టత:

హనుమత్ శబ్దమును వాల్మీకి వాడుటలోని ఔచిత్యమును చర్చించుచు తమ 'షోడశి రామాయణ రహస్యము'లో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు హనుమంతుడను పేరులోని విశేషముల తెల్పియున్నారు. ఇది ఆంజనేయునకు జననీ జనకులు కావించిన పేరుగా భావింప వీలులేదు. కుండలినీయోగ సాధకుడను అర్థము తెలుపుటకే ఈ హనుమత్ శబ్దము వాడబడినదని వారి అభిప్రాయము. "అంతరేణ తాలుకేయ ఏష స్తన ఇవా లంబతే సేంద్రయోనిః" అను తైత్తిరీయ వాక్యానుసారము హృదయమునుండి ఊర్ధ్వముగా ప్రవృత్త మగు సుషుమ్ననాడి తాలుకలమధ్య స్తనములవలె వ్రేలాడుచుండును. లోదౌడలు తాలుకలు, వెలిదౌడలు హనువులు. అనగా రెండునూ దౌడలే. కనుక 'హనుమత్' అనగా సుషుమ్నతో కూడిన యోగి అని తాత్పర్యము." ఈ విషయము దివాకరుని వేంకటసుబ్బరావుగారును సమర్థించియున్నారు.[45] "అజ్ఞానమును హననము (ఖండించుట) చేయునది కావున జ్ఞానమునకు 'హను" అని పేరు. ప్రశస్తార్థములో మతుప్ ప్రత్యయము చేరగా హనుమంతుడగును. అనగా ప్రశస్తమైన జ్ఞానము కలవాడని అర్థము.[46]

హనుమంతుని పేర్లను తెలుపు శబ్దములలో హనుమానుడు హనుమంతుడు, సుగ్రీవసఖుడు, వాయుసూనుడు, అంజనాసూనుడు, రామదూత, రామ

దాసు మొదలగు శబ్దములను గమనించినచో శబ్దమునకు అతని ఉత్పత్తిప్రకార మునకును గల సామ్యము విశదమగును.

1. హనుమంతుడు: హనువనగా దౌడ, శిరఃస్థానము నుండి క్రిందకు వచ్చి నోటిలో దౌడల కదలికలచే వినబడునట్లు వెల్వడునట్టి శబ్దమునకు హనుమంతం – హనుమత్ అని ప్రసిద్ధి. కావున శబ్దోత్పత్తితోగల సంబంధమును బట్టియే హనుమంతునకు ఆ పేరు.

2. సుగ్రీవసఖుడు; 'సు' అనగా మంచి. గ్రీవుడు అనగా మెడ గలవాడు. అనగా స్వాధ్యాయ ప్రవచనశీలియగు శ్రోత్రియుడు. శబ్దమును ఉదాత్తానుదాత్త స్వరితాలతో ఉచ్చారణాదక్షుడగు వేదాధ్యయన పరునకు అవసరమైన కార్యములో తోడ్పడువాడు కావున సుగ్రీవసఖుడు.

3. వాయుసూనుడు: అనగా వాయుదేవుని కుమారుడు. శబ్దము వాయువు నుండి పుట్టినది. సంకల్పమాత్రమున శరీరములో నుండు వాయువులో కదలిక కలుగును. ఆ వాయువుచే అభిహతమై మూలాధార స్థానము నుండి శబ్దము బయలుదేరి నాభిని, హృదయమును, కంఠమును దాటి తిన్నగా శిరఃస్థానము చేరును. అటుపై పోలేక కంఠమునుండి ముఖము నుండి వెలికివచ్చును. ఉచ్చారణాస్థానములబట్టి ఆ వాయువు వినపడెడి శబ్దముగా వెలికివచ్చును. ఈ శబ్దమే ఋషుల నోటి నుండి వచ్చినది.

4. అంజనాసూనుడు: అంజనాదేవి కుమారుడు అంజనేయుడు. శబ్దము కూడ శిరస్సుపైపునకు ముందుకు సాగును. నోటిలో ఆయా వర్ణములు అభివ్యక్తమగు స్థానమునే వ్యంజన (వి+అంజన) అందురు. అనగా అంజనయందు శబ్దము జనించును కావున అంజనాసూనుడు.

5. రామదూత: భగవంతుని నామమగు 'రామ' శబ్దమును తత్సందేశమును జీవుల కందించు దూత కావున రామదూత.

6. రామదాసు: రామశబ్దమునకే పరతంత్రుడై రామునే వహించువాడు కావున రామదాసు.

ఇట్లు హనుమంతుని పేర్లన్నియు శబ్దమునకు సంబంధించి యున్నవి. హనుమంతుడనగా శబ్దస్వరూపుడు. భగవానుని తెలిసికొనుటకు శబ్దరూపమగు నామము వినా వేరొక మార్గము లేదు కావున శబ్దస్వరూపుడై భగవంతుని

మనకు అందించువాడే హనుమంతుడు. భగవద్దూతయై, భగవద్వాహకమై, భగవత్ప్రాప్తికి విరోధులగువారిని నిర్జించువాడై భగవత్పరతంత్రమైయుండెడి శబ్దమే హనుమత్ శబ్దము. కావున హనుమంతుడే మంత్రము; హనుమంతుడే గురువు.[47]

అం అనగా సర్వవ్యాపకమైన విష్ణువు. (అక్షరాణాం అకారోఽస్మి-గీత 10–33) జన = జనయతి = పుట్టించునది. కావున అంజనా అంజనకు సంబంధించినవాడు కావున ఆంజనేయుడు. అనగా సర్వవ్యాపకుడగు విష్ణుతత్త్వము నుపాసించెడివాడని అర్థము.[48]

3. ఆంజనేయుని బాల్యము:

శ్రీమద్రామాయణమును పరాశర సంహితయును ఈ విషయమును వివరించలేదు. బాలుడగు ఆంజనేయుడు మునుల అగ్నిహోత్రముల నార్పుచు కొయ్యమిళ్లలు కుండలు పగులకొట్టుచు వారిని బాధించినందున మునులతనికి శాపమిచ్చినట్లు వాల్మీకి ఉత్తరరామాయణం. మునుల వల్కలాజినముల చింపుచు అల్లరి చేసినట్లు కంకంటి పాపరాజు కృత ఉత్తర రామాయణము.[49]

సమీరకుమార విజయము ప్రకారము: ప్రభాసతీర్థ పుంజిక స్థలమున తరుశాఖలలో హనుమంతుడు తిరుగాడెడివాడు. అతుల గతులతో గురు లీలలతో ఒక్కొక్కచో కనబడుతూ, ఒక్కొక్కచో కనబడకుండా వానర బ్రహ్మచారిగా చరించుచు శిష్టమార్గము వీడి ఎన్నో మర్కట చేష్టల కావిస్తూ మునుల వల్కలాజినముల ద్రచ్చి వారిని బాధించుచుండెడివాడు. మునులను తన శిశు లీలలతో బాధించుట తగదని అంజనాకేసరులు ఎంత వారించినా వారి మాటలు ఏనుగునకు కట్టిన నూలుపోగులవలె నిష్ప్రయోజనములగుచుండెడివి. స్రష్ట ఇచ్చిన వరముల వలన హనుమంతుడు శాపము పెట్టినచో అది పనిచేయదని ఎఱింగిన భార్గవకులులైన మునులు కొందరు అతని అల్లరిని భరింపజాలక అతనిని శాంతింపజేయు నాశయముతో "నేను ఇంతటి వాడనంచెఱుగకెప్పుడు నీతడుండుగాక" అని వారిలోవారే అనుకొనిరి. వారి భావనాబలం వల్ల హనుమంతుడు బలాహంకారములు లేక సాత్త్వికగుణ భూషణుడై సాధుతనము మీరగా నదిచూచి అంజనాకేసరు లెంతయో ఆనందించిరి.

తులసీదాసు రామాయణము ప్రకారం: మునుల కమండలములలోని నీటిని త్రాగుచు ఆశ్రమ వృక్షములను కూల్చుచు, కొండకొమ్ము లెక్కుచు మునుల బాధపెట్టుచున్నందున వారు ఆంజనేయుని చూచి "నీబలం నీకు జ్ఞాపకం చేసినప్పుడే నీవు గుర్తింపగలవు" అని అనుకొనిరి. బాలరాముడు హనుమంతుడు ఒకరితో ఒకరు కలిసి ఆడుకొనినట్లు తులసిదాసు పేర్కొని యున్నాడు. రాముడు బాలుడుగా నుండిన సమయమున ఒకనాడొకడు కోతి నొకదానిని తెచ్చి రాజద్వారమువద్ద ఆడించుచుండగా రాముడది చూచి తన కట్టి కోతి కావలెనని కోరెను. ఒక కోతిని దశరథుడు తెప్పించి యిచ్చినా రాముడు దానిని స్వీకరింపక ఏడ్చుచుండగా వసిష్ఠుడు రాజును చూచి "రాజా! కిష్కింధలో సుగ్రీవునివద్ద ఒక కోతి కలదు. నీవు దూతను పంపి ఆ కోతిని మర్యాదతో రప్పించుము." అని చెప్పెను. రాజదూతలు కిష్కింధకు వెళ్లి సుగ్రీవునకు తెలుపగా అతడు సంతోషించి దూతల వెంబడి మహావీరుడగు హనుమంతుని పంపెను. అంతఃపురమున ప్రవేశించిన హనుమంతుని రాముడు తన గుండెలమీద పెట్టుకొని ముద్దులాడి, కౌగిలించుకొని సంతోషించు చుండెను. హనుమంతుడు బాలవానరరూపుడై రాముని వెంటనంటియుండి రాముడాడుకొను స్థలములో తానును ఆడుకొనుచుండెను. ఒకనాడు రాముడు గాలిపటము నెగిరించెను. అది పైకి ఎగురుతూ పోయి స్వర్గానికి పోగా ఇంద్రుని కోడలగు జయంతసతి దానిని చూచి ఆశ్చర్యపడి దానిని పట్టుకొని దాచియుంచెను. రాముడిది గ్రహించి "ఎవరో మన గాలిపడగను దాచి యుంచినారు. వెళ్లి చూచి తీసికొనిరా." అని ఆదేశించగా హనుమంతుడు పైకి ఎగిరి జయంతుని భార్యను చూచి "తల్లీ గాలిపడగను విడిచిపెట్టుము" అని కోరెను. ఆమె 'ఈ గాలిపడగను ఎగురవేసిన వారిని చూడవలెనని యున్నది కావున దీనిని కట్టిపెట్టి యుంచితిని." అని తెలుపగా హనుమంతుడయోధ్యకు వచ్చి ఆ వార్త రామునకు ఎఱిగింపగా 'నన్నామె చిత్రకూట పర్వతమున చూడగలదు" అని తెలుపగా మరల స్వర్గమునకు వెళ్లి జయంతుని సతికి హనుమంతుడా సంగతి వివరించగా రామదర్శన భాగ్యసిద్ధి నెఱిగి ఆమె గాలి పటమును వదలెను. దానిని ఆంజనేయుడు రామునకు తెచ్చియిచ్చెను. విశ్వా మిత్రునితో యజ్ఞ సంరక్షణార్థము రాముడు వెళ్లుచు 'నీవు వనమునకు పొమ్ము నేను అరణ్యమునకు వచ్చినపుడు నిన్ను కలుసుకొనగలను." అని ఆదేశించి

నందున హనుమంతుడు కిష్కింధకు తిరిగి వచ్చెను. ఇదే వృత్తాంతముగల కథ భరద్వాజ రామాయణమున కలదని శ్రీ దివాకరుని సుబ్బారావుగారి బాల కాండలో పేర్కొనియున్నారు. ఈ కథకు కొన్ని కల్పనలను చేర్చి శ్రీ 'హనుమాన్ లీలా తరంగిణి' కర్తగారును శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తిగారు తమ హనుమచ్చరిత్రలోను పేర్కొనిరేకాని ఏ ఆధారమును బట్టి వారది వ్రాసిరో తెలుపరైరి. హనుమద్రామ సమావేశము జరిగినపుడు వారు తమ బాల్యస్నేహ క్రీడాదులను స్మరించినట్లు వర్ణితము కాలేదు.[50]

అంజనేయుని అల్లరి మాన్పించు ఉద్దేశముతో బ్రహ్మ అతనిని విద్యలలో పరీక్షించుటకు తన లోకమునకు రప్పించెను. బ్రహ్మసృష్టి కార్య విధానమును హనుమంతుడు పరిహసింపగా బ్రహ్మ అతనిని చూచి నీవు నా అస్త్రమునకు ఏడు ఘడియలు (గం 2-48 ని) బద్ధుడవగుమని శాపమిచ్చినట్లు శ్రీమద్రామాయణాంతరార్థమను గ్రంథమున కలదు.[51]

4. హనుమంతుని విద్యాభ్యాసము:

వాల్మీకి రామాయణము ప్రకారం: హనుమంతుని విద్యాభ్యాసం గురించి అతని గురువును గూర్చి రామాయణమున ప్రత్యక్ష సాక్ష్యము లేదు. రామ సుగ్రీవ సమావేశమునకు పూర్వము హనుమంతుని వాక్యకోవిదత్వం రాముడు ప్రశంసించుచు ఋగ్యజు స్సామములను మూడు వేదముల నభ్యసింపని వానికి హనుమంతునివలె మాట్లాడుట చేతకాదనిన్నీ అతడు వ్యాకరణమెన్నోమార్లు చదివియుంటాడనిన్నీ అసందిగ్ధమూ అవిస్తరమూ అవిలంబితమూ అద్రుతమూ కాక ఉరస్థ్సానోద్గతంబులై కంఠమునుండి మధ్యమ స్వరముతో మాటలు వ్యక్తమైనట్లు శ్రీరాముడు లక్ష్మణునితో చెప్పినట్లు సుందరకాండలో కలదు. బృహస్పతితో సమానమగు తొమ్మిది వ్యాకరణములు అభ్యసించి, సూత్రవృత్తి, అర్థము, పదము, విశేషార్థము, ఛందస్సు ఇతర శాస్త్రాలు నేర్చినట్లు ఉత్తర రామాయణమున కలదు. కంకంటి పాపరాజు వ్రాసిన ఉత్తర రామాయణములో ఇంక కొంత వివరముగా నున్నది. విద్య నేర్పుమని తన వద్దకు చేరిన హనుమంతునితో సూర్యుడు "నా గమన వేగము వలన త్రోవలో నీకు ఏకాగ్రత కుదరదు కావున నావద్ద విద్యాభ్యాసము వీలుకాద"ని అనెను. అంత ఆంజనేయుడు చిరునవ్వు నవ్వి ఉదయాస్తాద్ర్యాదులపై పాదముల మోపి హరి

త్రివిక్రమ రూపము వలె నిండి, శ్రుతులు, శాస్త్రములు, పరిజ్ఞాన కళావిశేషములు, నిరశనుడై దినకరుని కటుకుటెండ సహించి చదివెను.[52]

"తమ్మిమాలికి నాతని వధూమణికిఁ
దగు గాక యొరులకు దరమె వ్యాకరణ
నిగమ శాస్త్రంబు లన్నియు నేర్వబోలు
నితని సల్లాపంబు నితని రూపంబు
నతుల లక్షణ లక్షితానురూపంబు".[53]

పరాశర సంహిత ప్రకారము: ఆంజనేయుడు బ్రహ్మచర్య నిష్ఠ పూనినవాడై, తాను సర్వజ్ఞుడయ్యు, సమర్థుడయ్యు, లోకసంగ్రహమును దృష్టిలోనుంచుకొని సూర్యమండలమునకు చేరి సూర్యునికి నమస్కరించి తనకు వేదములు, వేదాంగములు, ఉపాంగములు నేర్పవలసినదిగా కోరెను. ఈశ్వరాజ్ఞకు లోబడి సదా భ్రమించు తాను ఆంజనేయునకు బోధించుట కుదరదని సూర్యుడనెను. అపుడు హనుమంతుడు కోపముతో సూర్యుని మార్గము నడ్డగించెను. సూర్యుడంత 'దీనికి పరిష్కారోపాయము నీవే తెలుపుము" అని కోరెను. అంత హనుమంతుడు సూర్యునికి అభిముఖముగా నుండి సూర్యుని చూచుచు వెనుకకు నడచుచు ఒక్కవారములో ఇంద్ర వ్యాకరణము నేర్చెను. అటు తర్వాత ఒక పాదము ఉదయాద్రిపై ఇంకొక పాదము పశ్చిమాద్రిపై నుంచి సూర్యునికెదురుగా నిలబడినవాడై సాంగోపాంగముగా వేదముల నభ్యసించి సర్వవిద్యావిశారదుడై తన గురువగు సూర్యుని సంతోషపరిచెను.[54]

సమీరకుమార విజయము ప్రకారం: అంజనాదేవి, కేసరి హనుమంతుని విద్యార్జనకై ఏ ప్రయత్నము చేసిరో తెలుపుటకాధారములు లేవు. బాలుడగు హనుమంతునికి వాలిసుగ్రీవులు మేనమామలని తెలిపి వారివద్దకు అతనిని అంజన పంపెను. వారిరువురూ అతనిని ఆదరించిరి. కాని వారిలో హనుమంతుడు సుగ్రీవునితోనే ఎక్కువగా గడపుచుండెను. ఒకనాడు తన విద్యాప్రాప్తికై 'వియద్గతిన్‌జని" రవిని దర్శించి "తుభ్యం నమస్సత్యజ్ఞాన కళాత్మనే" అని నమస్కరించెను. "సంకల్పసిద్ధిరస్తు" అని ఆదిత్యుడతనిని దీవించి తన వద్దకేతెంచిన కారణ మడిగెను. "వేదశాస్త్రాగమాభ్యాసంబెప్పుడువేడ నప్పుడే యొనర్పం బూనిన వారొట నే మీ సాన్నిధ్యముఁ జెందినాడ" నని హనుమంతుడు బదులాడెను. "నేను అనుక్షణ సంచారశీలుడను. స్వర్ణాద్రి చుట్టునూ

సముత్కటవేగముతో ద్రిమ్మరువాడను. మార్గలంపట క్లేశములతో నా విద్య నభ్యసించుట కష్టము" అని సూర్యుడు పలికెను. దానిని విని హను తుడు వినయముతో తాను గమన వేగముతో సూర్యుని అనుసరించగల తెలిపెను. "నా వడిని నేనే పేర్కొనుట గర్వమనిపించవచ్చును కానీ 'పూ పశ్చిమ గ్రావములందు పాదములుంచి మీ వెంబడి వెంది యుండునో, దే కంటే ముందు నడతెంతునో ఆనతీయు''డని కోరెను. సూర్యుడంత హను తుని పొగడి 'యీరేడు లోకాలలోని వియచ్చరులానందించునట్లు రెం కొండలందు పదముల ప్రతిష్ఠించి కన్పింపుమని" కోరెను. రవికి నమ రించి తన స్వైర ప్రచారముతో బలిని అనుగ్రహించిన త్రివిక్రమావత రూపము వలె బ్రహ్మాండమును తన రూపముతో నింపెను. అప్పుడా రూపము సర్వదిక్కలితమై విస్తరించి యుండగా మునులు, ద్విజులు 'హర నమో నమోస్తుతే' అని నుతించిరి. హనుమంతుని విరాడ్రూపము గాంచి వివస్వంతుడతని యెడ భక్తితో 'ప్రత్యక్ష రుద్రావతార। జనులు నన్నా రించుటకు నీవు నన్నాశ్రయించుచున్నావే కానీ నేనా। నీకుపదేష్టను. నీ శక్తి శంకించిన నన్ను క్షమింపుము" అని అనెను. తన నంగీకరించి త్రయ ప్రపంచాన్ని కృపన్ వివరిపుమని హనుమంతుడు కోరి రవి బింబమున కెం రుగా నిజాకారముతో ప్రకాశించెను. ఘడియకు తొమ్మిదిలక్షలా డెబ్బ యోజనములు తిరుగు సూర్యునికంటే వేగముగా సంచరించుచు హనుమంతు సూర్యుని వద్ద పాఠములు నేర్చుటకుపక్రమించెను. పదక్రమ ప్రౌఢి, శ నియతితో ప్రత్యాహార నిపుణత, బహుస్మృతిపురాణార్థసంగతులు. నిర సంగీతరత గళోద్ధురతతో విద్యలన్నింటిని లోకసంగ్రహేచ్ఛతో సాధించెను. ఇట్లు సర్వశాస్త్రములెఱిగి సామీరి సూర్యునకు ప్రాంజలించి తన ప్రణామము గురుదక్షిణగా భావింపుమని ప్రార్థించి మాతులుల వద్దకు వచ్చెను. ఈత విద్యాభ్యాస సంస్కారముల గూర్చి శ్రీరాముడే ఇట్లు తెలిపియున్నాడు "హనుమంతుడు ప్రాజ్ఞుడు, తజ్ఞుడు, ఉత్తముడు, సర్వజ్ఞుడు. కానిచో వి నమ్ములున్న తపసి వాలకమును నమ్మని సుగ్రీవునికి నచ్చచెప్పి నాకు సుగ్రీ సఖ్యము నేల కలిగింప గల్గును. ఇతడు విద్వజ్జనులలో విద్వచ్ఛిరోమణి కవులలో ఉత్తమ కవివరుడు. గాయకశ్రేణిలో గాయకశ్రేష్ఠుడు. బలియురలో మహాబల సముద్రుడు, తపోనిధులలో తపశ్శాలి, యోగులలో పరమయోగి, ధీమంతులలో ధీమంతుడు, విరక్తులలో వైరాగ్యపరుడు, వీరులలో వీరాధి

మేయుడు, జితేంద్రియుడు, వినయపరుడు, కార్యవిదుడు, సౌశీల్య
లోకజ్ఞుడు, ఆత్మశక్తిజ్ఞుడు, కామరూపధరుడు, కామదూరుడు.[55]

మంతునికి వివాహమైనదా?

భ్యాసానంతరం మాతులుల వద్దకు చేరిన తర్వాత హనుమంతుని
ఎల గురించి యే గ్రంథములోను వివరముగా లేదు. అతని
వితమూ, యౌవనమూ, అతని ఆశలూ, అనుభూతులూ తోడి
సమాజముతోగాని అతనికేలాంటి మమతానురాగాలు కలుగు
మాత్రము తెలియవు. హనుమంతుడు బ్రహ్మచారియని కొందరు
హము చేసికొనెనని కొందరు తమతమ విశ్వాసాలకు తగినట్లుగా
రు.

ద్రామాయణము ప్రకారము: హనుమంతునికి వివాహమైనట్లుగానీ,
ర్య యున్నట్లుకాని రామాయణమున లేదు. ఈ గ్రంథమందలి
ఎవరు గూడ హనుమంతునికి భార్య యున్నట్లు తెలుపలేదు.
గానంతరం అయోధ్యకు తిరిగి పయనించుటకు ముందు సీత
చూచి

మహిమాభిరామ విను చేసెద నేనొక విన్నపంబుఁ దా
ంహిళాది ముఖ్య కపి రాజ సతుల్ మఱి యన్యవానరీ
ంము గొల్వ సమ్మదముతోఁ జనగోరెద నయ్యయోధ్యకున్[56]

ు. తనకునూ, శ్రీరామునకునూ ప్రాణములు నిల్పి మహోపకార
హనుమంతుని వంటి సన్నిహిత సేవా దక్షుడగు వానికి భార్యయే
[6] ఆమెను అయోధ్యకు తీసికొని రావలసినదిగా సీతకోరియుండెడిది.

ాశర సంహిత ననుసరించి: విశ్వకర్మ తన కుమార్తెయగు ఛాయను
చ్చి వివాహము చేసెను. సూర్యునితో కాపురము చేయు ఛాయ
ణముల తేజస్సును సహింపలేక తాను తన పతికడ నుండలేనని
ి చెప్పెను. ఆమె ఈ విషయమును విశ్వకర్మకు తెలియజేసెను.
తడు సూర్యుని సానబెట్టి తక్కువ తేజస్సు గల వానినిగా చేసెను.
ప్పుడా సూర్యుని నుండి వేరైన కిరణముల నుండి ఒక కన్య పుట్టెను.
ు సువర్చల. బ్రహ్మాది దేవతలామె సౌందర్యమున కాశ్చర్యపడిరి.

వారిలో కొందరు బ్రహ్మతో 'దేవా! ఈమెకు భర్త ఎవరో" తెలుపమని కోరిరి అపుడు బ్రహ్మ "పరమేశ్వరుని మహత్తేజమగు హనుమంతుడాకాశమున సూర్యుని పండు అనుకొని పట్టుకొనగలడు. ఆ హనుమంతుకీమె భార్య కాగలదు." అని తెలిపెను.[57] ఈ గ్రంథమును ప్రమాణముగా పెట్టుకొని హనుమంతునికి 'సువర్చల'తో వివాహము జరిపించిన కథలు తర్వాత వచ్చినవి.

పురాణములలో హనుమంతునకు వివాహమైనట్లుగా వర్ణింపబడలేదు. హనుమంతుని చరిత్రను విపులముగా వ్రాసిన పుష్పగిరి తిమ్మన తన 'సమీర కుమార విజయమున' హనుమంతునకు వివాహమైనట్లు తెలుపలేదు. అందుచే హనుమంతునకు వివాహమైనదను విషయము వివాదాస్పదమైనదిగా తోచును. ఇతనికి వివాహము జరిపించి "సువర్చల"ను భార్యగా కొందరు రచయితలు 'పరాశరసంహిత' ఆధారముగానే పేర్కొనియున్నారు. రామాయణ కర్తలగు వాల్మీకి కాని, అతని ననుసరించి ఎన్నో అవాల్మీకములగు కల్పనలను చేసిన రామాయణానువాదకులుగానీ హనుమంతుని వివాహవృత్తాంతము తెలుపలేదు. రంగనాథ రామాయణము, భాస్కర రామాయణము, నిర్వచనోత్తర రామాయణము. మొల్ల రామాయణములలో హనుమంతుడు వివాహముకాని బ్రహ్మచారిగానే కన్పించును.

ఇపుడు నిర్ణయించవలసిన అంశములలో (1) హనుమంతునికి వివాహమైనదా? (2) అయియున్నచో ఇతని భార్య సువర్చలయేనా? (3) ఈ సువర్చల కథ నిస్సందేహముగా నమ్మదగినదా? అనునవి ముఖ్యము - అందుకు ముందుగా సువర్చల వృత్తాంతమును తెలిసికొనుట కర్తవ్యము.

రామాయణముల ప్రకారము: రామాయణములో సువర్చల సూర్య పుత్రిగా కాక సూర్యపత్నిగా పేర్కొనబడినది. సీతాన్వేషణా పరుడగు హనుమంతుడు అశోకవనమున శింశుపావృక్షమున దాగియుండగా రావణుడేతెంచి సీతను తనకు వశమగునట్లు మోహావేశముగా పలికి వెళ్లిపోతూ తన పరిచర జనమునుచూచి "ఎటులైనను హితబోధచేసి సీత మనసును నాయందు లగ్నమగునట్లు ప్రయత్నించుడు" అని ఆజ్ఞాపించిపోయెను. అంత వారామెకు రావణుని గొప్పదనమును, బల పరాక్రమాదులను తెల్పి ఎంతగానో ప్రయత్నించిరి. ఆమె అనుకూలముగా మాట్లాడనందున వారామెను బెదరించిరి.

అపుడు సీతాదేవి వారిని చూచి "రాక్షస స్త్రీలారా దరిద్రుడో, రాజ్యహీనుడో మరి ఎట్టివాడైనా సువర్చలకు సూర్యునివలె నా మగడే నాకు గొప్ప. సూర్యుడు తన వేడిమిచే తపింపజేయుచున్నను సువర్చల అతనిని విడిచిపోయినదా! ఇంద్రునకు శచీదేవి, వసిష్ఠునకరుంధతి, చంద్రునకు రోహిణి, చ్యవనునకు సుకన్య, సత్యవంతునకు సావిత్రి, కపిలునకు శ్రీమతి, అగస్త్యునకు లోపాముద్ర, సగరునకు కేశినీ, సౌదాసునకు మదయంతి, నలునకు దమయంతి ఎట్టివారో శ్రీరామచంద్రమూర్తికి నేనును అట్లే" అని జవాబిచ్చెను. వ్యాఖ్యాతయగు శ్రీ వాసుదాసుగారు తమ మందరమున ఈ సువర్చల సూర్యుని భార్యయని తెలుపుటకు విష్ణుపురాణగాథ నొకదానిని వివరించినారు. "కల్యాదియందు బ్రహ్మకు కొడుకు పుట్టి యేడ్చెను. ఏల యేడ్చెదవనగా నాపేరేమి చెప్పుమనెను. బ్రహ్మ "నీవు రుద్రుడవు" అనెను. అయినా వాడు నేడుగాసైయేడ్చెను. అప్పుడు భవ–శర్వ–ఈశాన–పశుపతి–భీమ–ఉగ్ర–మహాదేవయని వారికి పేర్లు పెట్టెను. ఆ యెనమండ్రను సూర్య–జల–మహీవాయు–వహ్ని–ఆకాశ–దీక్షితబ్రాహ్మణ–సోమ, దేహములిచ్చి సువర్చల–ఉష–సుకేశి–శివ–స్వాహా–దిశ–దీక్ష–రోహిణి యను నెనమండ్ర భార్యల నిచ్చెను. ఇందు చెప్పబడిన సువర్చల ఈమెయే."

భాస్కర రామాయణమున సువర్చల సూర్యసతిగానే సీత చెప్పెను.

సగరు కేశినివోలె సౌదాసు మదయంతి
గతి వసిష్ఠుని నరుంధతి విభాతి
నిను సువర్చల భంగి నింద్రుని శచి మాడ్కి
....
....
రామచంద్రు
గొలిచి యేను సమ్మతినుండి[59] ....

స్కాందపురాణోక్తముగా: ఇందు సువర్చల దధీచి ముని భార్యగా పేర్కొనబడినది. ఇంద్రుని కొఱకై దధీచి దేహత్యాగము చేయుటకు ముందు తన భార్యయగు సువర్చలను పిల్చి తన వెన్నెముక దేవతలకు చెందిన తర్వాత శివభక్తుడగు తనతోపాటు ఆమెకూడ శివసాయుజ్యము చెందగలదని చెప్పెను. అప్పటికే గర్భవతిగా నున్న సువర్చల భర్తృదేహత్యాగానంతరం

పిప్పలాదుడనువానిని ప్రసవించి వానిని అశ్వత్థ వృక్షము నాశ్రయించి యుండు మనియు, ఆ వృక్షమునకు ప్రదక్షిణములు చేసినవారికి అభీష్టసిద్ధియగునని తెలిపి తన తనువు చాలించెను.[60]

ఆనందరామాయణములో: సువర్చల ఒక అప్సరస. ఈమె బ్రహ్మ శాపంవల్ల ఒక గ్రద్దయైనది. పుత్రకామేష్టిలో లభ్యమైన పాయసమును కైక స్వీకరింపక దానిని పారవైచగా ఆ పాయసమును ఈ గ్రద్ద తీసుకొని వచ్చి అంజనాదేవి వద్ద వేయగా దాని నామె భక్షించి అంజనేయుని పొందెను. కైక చేతి పాయసాన్ని తీసికొని వచ్చుట అమె శాపవిమోచన కారణముగా బ్రహ్మ తెలిపియుండెను. గ్రద్ద రూపం వీడి అప్సరస రూపము పొంది సువర్చల వెళ్లిపోయెను.[61]

పైన పేర్కొనిన వృత్తాంతముల ననుసరించి సూర్యసతియగు సువర్చల, దధీచి పత్నియగు సువర్చల; అప్సరసయై శాపము వలన గ్రద్దయైన సువర్చల హనుమంతునికి భార్యగా పేర్కొనబడిన సువర్చల; మొత్తం నలుగురు సువర్చలా నామధేయలు గోచరించుచున్నారు. వీరు వేరువేరు వ్యక్తులయినచో బాధలేదుకాని ఒకరే అయినచో చిక్కువిప్పుట కష్టము. పూర్వాగాథాలహరి అను గ్రంథమున శ్రీ వేమూరి శ్రీనివాసరావుగారు ఒకచో సువర్చలను హనుమంతుని భార్యగానూ, వేరొకచో పరమేష్ఠి భార్యగాను పేర్కొనియున్నాడు. సువర్చలకు పరమేష్ఠి వలన ప్రతీకుడను పుత్రుడున్నాడని ఆ గ్రంథసాక్ష్యము.[62]

కర్తవ్యమగు చర్చనీయాంశమును కొనసాగించులోగా సువర్చలను హనుమంతునకిచ్చి వివాహము జరిపించిన వారి రచనలలో వారు తెల్పిన అంశములను గూడ తెలిసికొనవలసియున్నది.

హనుమచ్చరిత్ర (చల్లా పిచ్చయ్యశాస్త్రిగారి కృతము): వీరు తమ కావ్య కథకు పరాశర సంహితయే మూలమని పేర్కొని యిందు సువర్చలాంజనేయ వివాహమును వర్ణించి యున్నారు. పార్వతీ పరమేశ పావకానిలాది దేవతలు అంజనా కేసరులు సూర్యునిచే ఏర్పాటుచేయబడిన విడిదిలో చేరరాగా పెళ్లి వేడుకలు మొదలయ్యెను.

కనకపుఁ బళ్లెరమునఁ గాళ్లు గడిగి క
న్యాదానమొసంగె ధర్మోస్మియనుచు

కమల బాంధవుడు దత్కాంతయు నానంద
కంధి వీచిడోలికల నూగి
రనువుగా సభ్యుల కనులకు జెవులకు
పండువయ్యెను జగన్మండలికిని
హస్త మస్తక యోగమయ్యె జంటకు జీర
ధారణ శుభ ముహూర్తమున నయ్యె
తెరవీడె లోసిగ్గు తెఱగున సాప్త ప
దీనంబు నడచెను దివ్యులలర
సూత్రధారణ ప్రేమ సూత్రధారణ దెల్పె
నక్షతారోపణ కుక్షత తత్వ
మెడిగించె.......................[63]

శ్రీమద్రామాయణాంతరార్థములోని కథ: ఇందు సువర్చల కథ సహస్ర కంఠ రావణ వధా ఘట్టమున వచ్చును. ఆ రాక్షసుని ఎన్నివిధాల చంపినా వాడు చావనందుకు హనుమంతుడు బ్రహ్మను ప్రార్థించి వాని ప్రాణ రహస్యముల తెలుపుమని కోరెను. "క్రౌంచద్వీపములోని పర్వతమున గల ఒక గుహ వద్ద సువర్చల అనే రక్కసి కాపలా యుండును. అచట పంచద్వారములవద్ద కాపలా ఉన్న రాక్షసుల చంపి మాయాసౌధమున గల పంచదిశలందున్న పంచజ్యోతుల నార్పగలిగినచో సహస్ర కంధరుడు మరణించును" అని తెలిపెను. ఆ గుహవద్దకు హనుమంతుడురాగా సువర్చల అతనిని చూచి మూర్ఛితురాలయ్యెను. అతడి రాకకు కారణమాంజనేయునిద్వారా తెలిసికొని 'అంజనేయా! నీవు నాకోరిక తీర్చినచో నేను నీకోరిక తీర్తును. ప్రపంచంలో స్త్రీరూపం ధరించిన ప్రతిస్త్రీ నీలాంటి పురుషునే కల్యాణమై సుఖించాలి. కావున నన్ను నీ భార్యగా స్వీకరించి నాకానందము కల్గింపుము" అని తెలిపెను. దానికాంజనేయుడు 'లలనా' నేను అస్ఖలిత బ్రహ్మచారిని. పైగా స్ఖలితము లేనివాడను. మలమూత్రాలే లేనివాడను. నేను ధరించిన యీ ధట్టి నా శరీరము వ్యాపించియున్నది. నన్ను భర్తగా స్వీకరించి నీవేమి సుఖపడెదవు. నీకోరికను విరమించుకొనుము" అని తెలిపెను. దానికి సువర్చల "స్వామీ! నేను మీతో సుఖించకపోయినను నన్ను మీ భార్యగా స్వీకరించి ఏడు ఘడియలు నన్ను మీ వామభాగమున ఉండనిచ్చిన చాలునని" తెలిపెను.

ఇట్లామె కోరుటకు పూర్వకథ ఒకటి కలదని రచయిత పాతకోట రంగనాయ కులు వివరించినారు. సువర్చల పూర్వజన్మమున సూర్యసుత. తన తండ్రివద్ద విద్యాభ్యాసము చేయు హనుమంతునీమె ప్రేమించెను. తన ప్రణయమునతనికి నివేదించగా గురుపుత్రి సోదరతుల్యగా పలికి హనుమ ఆమెను నివారించెను. కాని యౌవనస్థితిలో కామాంధురాలై అంజనేయుని అలింగనమొనర్చి బలాత్క రింపబోగా అంజనేయుడు దూరదూరము పోవుచుండ సూర్యుడిది గమనించి తన కూతురిని 'రాక్షసివై పోవుదువుగా'క అని శపించెను. అమె బాధతో శాపవిమో చనము కోరెను. నీవు ఏకోరికతో ఇతనిని నీవానినిగా చేసుకోదలచితివో ఆకోరికతో ఆత్మతృప్తి నొందిననాడు శాపవిమోచన యగునని సూర్యుడు తెలిపియుండెను. అందువలన సువర్చల తనకు దాంపత్యసుఖము లేకున్నా కేవలము హనుమంతుని భార్యగా గుర్తింపబడినచో చాలునను తృప్తికై యత్నించెను. శ్రీరామకార్యార్థము వచ్చిన హనుమంతుడు రామునిపై భారముంచి ఆమెను తన వామ భాగము నలంకరింపుమని కోరెను. అంజనే యుని వామభాగమారోహించి క్షణముననే ఆమెకు రాక్షసీరూపము తొలగి దివ్యరూపం కలిగెను. (చూడుము పుట 239–అధ్యా.7–) ఈ కథకు అధారగ్రంథమేదియో రచయిత పేర్కొనలేదు.[64]

హనుమాన్ లీలా తరంగిణి గ్రంథానుసారముగా: హనుమంతుడు సూర్యుని వద్ద విద్యాభ్యాసమొనర్చు సమయములో ఒకనాడు సూర్యుడు 'అంజ నేయా, ఇంద్ర వ్యాకరణాది నవవ్యాకరణములలో అయిదు వ్యాకరణములను మాత్రమే నీకు చెప్పితిని. మిగిలిన నాలుగు వ్యాకరణములు గృహస్థులకు మాత్రమే చెప్పతగినవి. బ్రహ్మచారులకు చెప్పరాదు. నీవు బ్రహ్మచారివిగదా అని వీలులేక మానివేసితిని. కాని, యిప్పుడొక పనిచేసిన నివియును చెప్పుటకు వీలగును. నాకీయవలసిన గురుదక్షిణగా నీవు నా కోర్కెను తీర్చుము. నా కుమార్తెయగు సువర్చలను వివాహమాడుము. నా కదియే గురుదక్షిణగా భావించెదను. నీవును గృహస్థుడవయ్యెదవు. మిగిలిన నాలుగు వ్యాకరణము లను అభ్యసించుటకు నీకు అర్హత కలుగును. అమెకు నీవు భర్తవయ్యెదవని అమె జన్మించిననాడే బ్రహ్మ చెప్పియున్నాడు. నేటి కా బ్రహ్మ వాక్కు ఫలించుగాక" అని తెలిపెను. అపుడాంజనేయుడు "స్వామీ నేను అస్ఖలిత బ్రహ్మచారిగా నుండవలెననుకొంటిని. నన్ను వివాహమాడుమనుచున్నారే

నాకర్తవ్యమేమో మీరే తెల్పుడు" అని బదులు పలుకగా. "హనుమా, నీకు వ్రతభంగం కలుగకుండా వరము నిచ్చెదను. దానికాంజనేయుడంగీకరించి "స్వామీ! నావలన సువర్చలకు భర్తృదేహ సంపర్కముండదు. ఇందుకామె అంగీకరించునా?" అని సంశయింపగా సూర్యుడీవైనము సువర్చలకు తెలిపెను. సంపర్కము లేకపోయినను అంజనాతనయుడు తనకు భర్తయగుటయే చాలని ఆమె అంగీకారము తెలుపగా వారికి జ్యేష్ఠ శుద్ధ దశమినాడు కశ్యప గోత్రజుడగు సూర్యుడు తన కూతురగు సువర్చలను కౌండిన్య సగోత్రుడగు హనుమంతునకిచ్చి వివాహము చేసెను. వివాహానంతరం సూర్యుడు మిగిలిన నాలుగు వ్యాకరణములను ఆంజనేయునకు బోధించెను. అపుడు హనుమంతుడు "స్వామీ! రాబోవు కల్పములో నేను బ్రహ్మ నగుదును. నాకప్పుడు సువర్చలతో సంపర్కము కలుగును. అపుడు మా దాంపత్యము సుఖించును" అని తెలిపెను. ఈకథ ఏ మూలమునుండి గ్రహించిరో రచయిత పేర్కొనలేదు.[65]

సువర్చలా హనుమంతుల వివాహమును గురించి న్యాయ వేదాంత ప్రవర్తకులు శ్రీమదిత్యాది శ్రీమాన్ తి. కం. గోపాలాచార్యస్వామివారికి నేను ఉత్తరమును వ్రాయగా వారు తమ వేదాంత మాసపత్రిక యగు 'భక్తి నివేదన'లో ఈక్రింది సమాధానములనిచ్చియున్నారు. "హనుమంతుని మనకు పరిచయం చేసిన వాల్మీకి మహర్షి తన శ్రీమద్రామాయణములో హనుమంతుని వివాహ ప్రసక్తి తేనేలేదు. వాల్మీకికి తెలిసినంతవరకు హనుమంతుడు నిజముగా బ్రహ్మచారియే. త్రేతాయుగములో రామావతారానంతరం తెరమరగున ఉండి మరల ద్వాపరయుగంలో భీమసేనుడికి హనుమంతుడు దర్శనమిస్తాడు. అపుడుకూడ అతని వివాహప్రసక్తి భీముడుకానీ, వ్యాసుడుకానీ తేలేదు. పోతే, అసలు హనుమంతునికి వివాహం చేసుకొనే కోరిక ఉన్నట్లే తోచదు. మరి వాల్మీకి వ్యాసాదులకు అఖరుకు హనుమంతునికి కూడ తెలియకుండా ఆధునిక పురాణ కర్తలైన పెద్దలు ఈ సువర్చల అనే ఆవిడతో అతనికి సంబంధమున్నదని ఆరోపించి, తమ సరదా తీర్చుకొంటున్నారు. హనుమంతునికే తెలియని ఈమె పుట్టుక—చరిత్ర ఎపుడు ఎలా వివాహం జరిగిందో యివన్నీ ఆ పుక్కిటి పురాణకర్తలకే తెలియాలి." "ప్రపంచమంతా అంగీకరించిన విష్ణుపురాణం పరాశరులకృతి. పరాశర సంహితలోని శ్లోకాల రచన చాల పేలవంగా ఉండుటచే పరాశరకృతి గాదని భాషాభిజ్ఞులంతా

అంగీకరిస్తారు. శ్లోకములలోని భాషనటుంచి హనుమంతునికి స్త్రీ సంబంధం కల్గించడం హనుమంతునికి ఘోరమైన అన్యాయం చేయడమే. ఆ పాత్ర స్వభావానికది పరిపూర్ణంగా విరుద్ధం. "భావోనాన్యత్ర గచ్ఛతి" అని శ్రీరాముని తప్ప వేరొకదానిని దేనినీ తలంచుటకుగూడ నా మనస్సు ఇష్టపడుట లేదని ప్రతిజ్ఞ చేసిన హనుమంతుడు అందులకు పూర్తి విరుద్ధముగా తుచ్ఛమైన స్త్రీ సంబంధం కల్గించుకొనుటకు ఇష్టపడునా? రాబోయే కాలానికి అతడే బ్రహ్మ కాబోతాడట గదా అంచేత ఆ కాబోయే నాయకుని ఆనందింప జేయడానికి సాధనాలేమో ప్రాజ్ఞులు మాత్రం వీటిని శ్లాఘించరు"[66]

"పరాశర సంహిత వేదవ్యాసుని తండ్రియగు పరాశరుడు వ్రాసినది కాదు. ఈ గ్రంథము రామాయణ భారతముల తర్వాత వచ్చిన గ్రంథము. సువర్చలను హనుమంతుడు వివాహమాడినట్లు రామాయణమున లేదు.... కాని తంత్రశాస్త్రములలో సువర్చలాంజనేయ మంత్రమున్నది."[67]

ప్రశాంతినిలయం (పుట్టపర్తి)లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా గారితో ముఖాముఖి మాట్లాడు సందర్భమున సువర్చలాంజనేయుల వివాహము గూర్చి వారిని నేను వివరణ కోరగా వారు "సూర్యుని తేజస్సే సువర్చల. సూర్యుని వెంత హనుమంతుడు విద్యాభ్యాసం చేసినందున ఆ తేజస్సును హనుమంతుడు పొందినందున సువర్చలా సహితుడైన హనుమంతుడను ప్రతీతి వచ్చినది" అని తెలిపిరే కాని హనుమంతునకు వివాహమైనట్లు సమర్థించలేదు.

పరాశరసంహితను ఆంజనేయ చరిత్రమను పేరున ఆంధ్రీకరించిన "సాహిత్యవిద్యాప్రవీణ" శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారికి ఈ విషయమై నేనొక లేఖ వ్రాయగా వారిచ్చిన సమాధానము. "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, హనుమంతునకు బ్రహ్మచారి ఆరాధనలున్నంత మాత్రమున వారికి భార్యలు లేకపోలేదు. నారాయణుని లక్ష్మీనారాయణునిగా ఆరాధించినట్లు భూదేవితో కలిపి ఎక్కువగా ఆరాధన ఉండదు. అట్లే ప్రచురత బ్రహ్మచారిగా తప్ప, సువర్చల ఆయనకు భార్యయగుట యథార్థము. అసలు దేవతలకు శక్తులే వారి భార్యలు. బ్రహ్మచర్య నిష్ఠ గలవారికి శక్తి వర్చస్సే. వినాయకుని వలన వచ్చు శక్తి సిద్ధి, బుద్ధియే. బ్రహ్మశక్తి వేదవాక్కు-వాణియే. ఇక కుమార స్వామి శక్తి దేవసేనయే. ఇట్లు సమన్వయ మొనర్చుకొనదగును తప్ప వారి సాంసారిక జీవితముతో పనిలేదు" అని వ్రాసిరి.[68]

"రామరాజ్యం – కుశలవులు" అను గ్రంథమున శ్రీ కాశూరి వ్యాస మూర్తిగారీవిషయముగా చెప్పినది: "కారణ జన్ములైన వానరులు వేదశాస్త్రా భ్యాసము చేసిరి. ఉపనయనాది సంస్కారముల గావించుకొనిరి. వీరు తమ ప్రవృత్తియందు రెండు ధర్మముల స్వీకరించిరి. 1. వానరజాతి లక్షణము, 2. వానరజాతి విలక్షణము. వీరు మానవులనే అనుసరించి ఉపనయనాది సంస్కారముల గ్రహించినా వివాహ సంపర్కము గావించుకొనలేదు. వీరికి ఉపనయనం విలక్షణం. వివాహం విరోధం. వీరికి తాత్కాలిక దాంపత్యమే కాని ఉత్తమ మానవులట్లు స్థిర దాంపత్యము లేదు. వీరికి అగ్ని పరీక్షలు లేవు. వాలి తన మరదలగు రుమను సుగ్రీవుడు తన వదినయగు తారను పొందుట గమనార్హము, అంతేకాక వాలి రావణుల స్నేహము ఏర్పడిన సందర్భములో వారొనర్చుకొన్న సంధి ప్రకారము భార్య, పుత్రుడు, పురము, రాష్ట్రము, భోగము, అచ్ఛాదనము. భోజనము అవిభక్తములు....హనుమంతునికి వానరకాంతలతో వివాహమైనట్లు ఎక్కడను వర్ణింపబడలేదు."[69]

పలు దేవాలయములలో హనుమంతుని బ్రహ్మచారిగానే ప్రతిష్ఠించు చున్నారు. ఇతడు అష్టోత్తర శతనామాది పూజాదికమున 'అజన్మ బ్రహ్మచారిగా-కుమార బ్రహ్మచారిగా" మాత్రమే పేర్కొనబడి యున్నాడు. అందువలన ఇతనికి వివాహము కాలేదనియు ఇతడు జితేంద్రియుడైన బ్రహ్మచారియనియు పలువురు విశ్వసించుచున్నారు. ఈ జితేంద్రియత, బ్రహ్మచర్యము హనుమం తుని ప్రభావానికి మూలమని తద్విరుద్ధముగా అతనిని గృహస్థునిగా భావింప రాదని వారి భావన. సుందరకాండమున సీతాదేవికి తనను గూర్చి తెలుపు కొను వేళలో హనుమంతుడు తాను సుగ్రీవుని సచివునిగా చెప్పుకొనెనేకాని తనకు వివాహమైనట్లు తెలుపలేదు. సీత సూర్యసతిగా సువర్చలను పేర్కొనిన వార్త వినిన హనుమంతుడు సువర్చల సూర్యపుత్రియను ఆమె మాటను సవరింపలేదు. శ్రీరాముని మహాభినిష్క్రమణ సందర్భమున హనుమంతుడు అతనితో స్వర్గమునకు పోకుండా రామచరిత మున్నంతకాలము తాను రామ నామ ధ్యాన తత్పరుడై లోకమున జీవింపవలెనని కోరియున్నాడేకాని తనకొక భార్య కలదనిగానీ, వారితో కలిసి సుఖజీవనాన్ని ప్రసాదింపుమనికానీ కోరలేదు. రామాయణ భారతాలలో స్వయముగా హనుమంతుడుగానీ అతనిని గూర్చి పలికిన పాత్రలుగానీ, అతని సహచరులుకానీ అతనికొక భార్య యున్నట్లు

తెలుపలేదు. కావున హనుమంతుడు వివాహము చేసుకొనలేదనియు అతడు బ్రహ్మచారి యనియు వారి నమ్మకము.

హనుమంతుడు గృహస్థేనని వాదించువారు కొందరున్నారు. "రామాయణంలో హనుమంతునకు భార్యలున్నట్లు తెలుపబడలేదు. అట్లే, నల, నీల, అంగదాది వీరులకును చెప్పబడలేదు కావున వారంతా గృహస్థులు కారని అనజాలము. రామాగమన వార్త భరతునకు తెలిపినపుడు సంతోషించిన భరతుడు హనుమంతునికి షోడశకన్యలను బహుమానముగా ఇస్తానని అంటాడు. కావున హనుమంతుడు బ్రహ్మచారి కాడేమోనని, అతడు గృహస్థేనని అభిప్రాయము."[70] (బలిచక్రవర్తి వామనునికి సిరులు, కరులు, వామాక్షులు.... ఏవికావాలో కోరమనినాడనగా అతడు గృహస్థు కాక బ్రహ్మచారియైనందుననే కదా! భరతుడుకూడ అట్లే అడిగియుండవచ్చును. బ్రహ్మచారికి వివాహార్థము కన్యనడుగుట ధర్మమే. అందువలన భరతుని దాన ప్రతిపాదన వలన సత్యము తేలుటలేదు)

ఆశ్చర్య రామాయణమున హనుమంతునకు భార్యను కల్పించినట్లు తెలుపబడియున్నది. "శౌనకాది మునులకు సూతుడు ఊర్మిళాదుల వృత్తాంతము తెలుపు సందర్భమున లక్ష్మీదేవి తన చెలియలగు వాసంతికతో శ్రీరామావతారమును గూర్చి తెలిపెను. శంఖముయొక్క భార్య, చక్రముయొక్క భార్య (వారి పేర్లు చెప్పలేదు) మాండవి, శ్రుతకీర్తి అను పేర పుట్టుదురని తెలిపెను. శంఖచక్రములకు భార్యలుందురా అని అనుమానింపవచ్చును.... శంఖచక్రములకు భార్యలనగా తదధిదేవతల భార్యలని అర్థము. ఇట్లు దేవతామూర్తులకు భార్యాకల్పనము అంగీకరించినట్లే హనుమంతున కొక భార్యను కల్పించినట్లు భావింపవచ్చును."[71]

శ్రీ రామాయణ సారోద్ధారమున హనుమంతుని గృహస్థుడైన ప్రాజాపత్య బ్రహ్మచారిగా తెలిపియున్నారు. పరాశర సంహితలో ఆరు, పది, పదకొండు, పన్రెండు, పదమూడు, ఇర్వది, ఇర్వదిమూడు పటలములలో హనుమంతుని ధ్వజదత్త హరిశర్మాదులుపాసించినట్లు కలదు. ఆయా భక్తులకు దర్శనమిచ్చిన హనుమ సువర్చలతో నున్నట్లు వర్ణింపబడియున్నది. కనుక ఇతనిని గృహస్థునిగా భావించు పద్ధతి రామాయణ కథాకాలము తర్వాత వచ్చి యుండవచ్చునేమో యని తోచును. శౌనక సంహితలో గూఢ 'అగచ్ఛ

హనుమద్దేవ త్వం సువర్చలయా సహా" అనిన్నీ వానరగీతలో 'మాతా సువర్చలాదేవి – పితా మే వాయునందనః" అనిన్నీ కలదు. కావున ఇతడు గృహస్థుడే అని శ్రీ ములుకుట్ల నరసింహావధానులగారి అభిప్రాయము. మరి యొక ఉపపత్తిని కూడ వారు చూపియున్నారు. సుగ్రీవుడు హనుమంతుని రాముని వద్దకు మొదటిసారి పంపునపుడు బ్రహ్మచారి వేషములో పొమ్మని కోరినాడు. అతడు గృహస్థుడుగా నున్నాడు. కనుకనే బ్రహ్మచారి వేషము వేయవలసి వచ్చినదని తలంప వీలున్నది. ఇట్లే సుందర కాండలో సీతాన్వేషణ సమయములో హనుమంతుడు రావణుని అంతఃపురములో సీతకై వెదకుచు ఎందరో స్త్రీలను చూచి "నేను పరదారలను చూచితినే" అని బాధపడినాడు. భార్య కలవాడే "పరదార" అని అనగలడు కానీ భార్యలేనివాడు పరదార అని వాడడు కావున హనుమంతుడు గృహస్థుడైన ప్రాజాపత్య బ్రహ్మచారి అని శ్రీ నరసింహావధానులగారి అభిప్రాయము. బ్రహ్మచారులు నాలుగురకాలని కాత్యాయన స్మృతి.

1. ఉపనయనానంతరం ఉప్పుకారము లేని ఆహారము తీసుకొనుచు గాయత్రీ మంత్రోపాసన చేయువాడు గాయత్రీ బ్రహ్మచారి.
2. వేదాధ్యయనం పూర్తి అగువరకు బ్రహ్మచర్యం కలవాడు బ్రాహ్మ బ్రహ్మచారి.
3. ఒక సంవత్సరకాలము విడువక వేదాధ్యయనం చేసినవాడు, కానీ ఋతు కాలమునందు మాత్రము తన భార్యతో సంగమిస్తూ పరస్త్రీ విముఖుడైనవాడు ప్రాజాపత్య బ్రహ్మచారి.
4. మరణ పర్యంతం గురుకులవాసం చేస్తూ నిష్ఠగలవాడు బృహత్ బ్రహ్మచారి.

కనుక గృహస్థుడు ప్రాజాపత్య బ్రహ్మచారిగా పరిగణింపబడును. సుందరకాండలో హనుమంతుడు సీతకు రాముని గూర్చి తెలుపుచు 'బ్రహ్మచర్య వ్రతమున స్థితుడైనవాడు రాముడు' అని తెలిపియున్నాడు. రాముడు గృహస్థుడు కావున అతడు బ్రహ్మచారి కాడు. కాని స్మృతిప్రకారం ప్రాజాపత్య బ్రహ్మచారి కనుక హనుమంతుడట్లు తెలిపి యున్నాడు. ఇట్లే చూచినచో హనుమంతుడు గృహస్థనియు ప్రాజాపత్య బ్రహ్మచారి యనియు తెలియవలెను.[72]

ఈ నాలుగు రకాల బ్రహ్మచారులలో హనుమంతుడేరకమైన బ్రహ్మచారియో అనుమానమునకు తావు లేనట్లుగా నిర్ణయించుట కిష్టము లేక అతడు ప్రాజాపత్య బ్రహ్మచారియని చెప్పినచో వివాదము లేకుండునట్లుగా ఉన్నది. శ్రీ నరసింహావధానులగారి అభిప్రాయము - హనుమంతుడు గృహస్థుడైనచో అతని వివాహమెప్పుడు జరిగెనో, భార్య సువర్చలయేనా? అను అంశాలు నిర్ణయింబాల్సియుండును. పరాశర సంహిత తప్ప మిగతా హనుమత్సంబంధ కావ్యాదులలోగానీ, రామాయణ భారతాదులలోగాని సువర్చలాహనుమంతుల ప్రసంగమేలేదు. రామకథ వలెనే హనుమంతుని కథ కూడ కల్పములు, యుగములు మారుటవలన, హనుమంతునకు ఆరాధ్యదైవత్వస్థానమేర్పడు కొద్దీ ఆయా కాలాలలోని కవులయొక్క వారి సమాజములయొక్క విశ్వాసములకూ, అవసరములకూ, తగినట్లుగా హనుమంతుని చరిత్ర విషయములో- అందులో ముఖ్యముగా అతని వివాహవిషయమున - అభూతకల్పనలు, విస్తరణలు, సవరణలు చోటు చేసికొనినవి. పైన తెలిపిన బహువిధ అభిప్రాయముల పరిశీలనానంతరము తెలియు సారాంశమేమనగా—

1. వాల్మీకిని ప్రమాణముగా పెట్టుకొని చూచువారు హనుమంతునికి వివాహమును అంగీకరింపలేదనియు వారాతనిని బ్రహ్మచారిగానే యెంచిరనియు స్పష్టము.
2. అవాల్మీకములగు కల్పనలు చేసిన గ్రంథాలను అంగీకరించినవారు హనుమంతునికి సువర్చలతోడి వివాహమునామోదించుచున్నారు.

వివాహితుడైనను బ్రహ్మచారి పదవాచ్యుడగుటలో దోషము లేదని నారద భక్తి సూత్రములతో పాటు శ్రీ సీతారామాంజనేయ సంవాదమను గ్రంథము స్పష్టమొనర్చుచున్నది. ఎందరినో వివాహమాడిన శ్రీకృష్ణుని కూడ బ్రహ్మచారిగా పేర్కొనినట్లే హనుమంతునికూడ చెప్పవచ్చును. "ఆత్మరతులైనవారికి బ్రహ్మచర్యము ముఖ్యము. ముఖ్య భక్తుడైనచో గృహస్థువుగానుండియు సదా బ్రహ్మచారిగానే యుండును. ఆ గృహస్థాశ్రమమతనికి నామమాత్రము."73

వివాహానంతరము "అక్షార లవణాశినే బ్రహ్మచారిణావధశ్శాయి నే స్యాతాం" అను ఉపనిషత్ వాక్యానుసారము హనుమంతుని బ్రహ్మచారిగా భావించుటలో దోషము లేదు.

కాంతల నందఱ నా మర
ణాంతరమున్ బరిహరించుటది మేలొండే
కాంతయు నిజ భార్యవ్రత
సంతుష్టిని జెంద బ్రహ్మచర్యంబే యగున్[74]

ఇప్పటి వఱకు లభించిన ఆధారములనుబట్టి హనుమంతుడు బ్రహ్మ చారియే. అయితే, ఇతడు ప్రాజాపత్య బ్రహ్మచారియా లేక అవివాహితుడైన బ్రహ్మచారియా అను అంశముతోపాటు ఇతడు ప్రాజాపత్య బ్రహ్మచారియైన గృహస్థు అయినచో సువర్చలయే ఇతని భార్య అనెడి అంశము నిర్ద్వంద్వ ముగా ప్రకటించుటకు వీలులేదు. భవిష్యత్పరిశోధకులీ అంశము నింకనూ కొనసాగించిన కానీ సత్యము ప్రకాశింపదు. ఉపాసనా విధానములను మాంత్రిక తాంత్రిక విశ్వాసములను కడగా పెట్టి చూచువారికి హనుమంతుడు వివాహము చేసికొనని బ్రహ్మచారియనియే చెప్పవచ్చును. హనుమంతుని బాల్యానంతర జీవితమును గూర్చి నిండు యౌవనమును గూర్చి తెలిసికొన వలసిన అంశము వెలుగులోనికి వచ్చువరకు పై చెప్పిన అంశములను హెచ్చ రికతో మాత్రమే గమనించుకొనవలయును.

— —

అధ్యాయము 3.

1. హనుమంతుడు - శ్రీరామ సందర్శనము:

శ్రీమద్రామాయణానుసారము: విద్యాభ్యాసానంతరం హనుమంతుడు కిష్కింధలో తన మేనమామలగు వాలిసుగ్రీవుల వద్దనే యుండగా (గౌతమ శాపము ప్రకారము) వాలిసుగ్రీవులు కలహించుటకు పరిస్థితులు ప్రాబల్యము చూపెను. వాలి తన సోదరుడగుసుగ్రీవుని విరోధిగా తలచి కిష్కింధ నుండి ఏకవస్త్రముతో వెడలగొట్టెను. వీరి కలహమును పరిష్కరించుటకు హనుమంతుని కన్న దక్షత గలవారింకొకరు లేరు. కానీ హనుమంతుడు సుగ్రీవుడు పారిపోగా అతని వెంబడి వెళ్లెను. వీరి కలహమున కేవలమొక ప్రేక్షకుడుగా మాత్రమే హనుమంతుడాదిలో నుండెను. ఇచట వాసుదాసుగారు తమ వ్యాఖ్యానములో "హనుమంతుడు సుగ్రీవుని బంటు, స్వామి అజ్ఞ లేక ఏదియు చేయరాదు. స్వామియైన సుగ్రీవుడు వాలినిగ్రహము తనకసాధ్యమని బంటుతో చెప్పుట ప్రభువునకు న్యూనత. తనకై తాను వాలిని యెదుర్కొన్నచో సుగ్రీవుని విస్మరించునట్లుగ హనుమంతుని భావన. తన బలమునకు గూర్చిన ఎఱుక హనుమంతునకులేదు. హనుమంతునికి వెఱచియే వాలి సుగ్రీవుని భయపెట్టు చుండెనే కాని చంప ప్రయత్నించలేదు."[75]

పురాణాదులు పరాశరసంహితలో వాలిసుగ్రీవుల కలహములో హనుమంతుని పాత్ర యెట్టిదో తెలుపుటలేదు.

నిర్వచనోత్తర రామాయణము ప్రకారం: "వాలియు కీలియు వాయుజునకు సరికారని అత్మశక్తిజ్ఞుడై లోకాలను గెల్వబూనినచో హనుమంతు నెదుర్కొన గల వాడే లేడనియు, తన శక్తి తనకు తెలియనందుననే సుగ్రీవుని కొఱకై హనుమంతుడు వాలిని మర్దింపలేదు" అని అగస్త్యుడే శ్రీరామునకు తెలిపియున్నాడు.[76]

సమీరకుమారవిజయమాధారముగా: హనుమంతుడు తన మేనమామలలో చిన్నవాడగు సుగ్రీవునికే సన్నిహితుడుగా నుండెను.

"తనకు గురుడైన ద్వాదశాత్మ కుమారుఁ
డనుచు మైత్రిని బహుమైత్రి నలరజేసె"

మేనమామల వద్దకు పంపుచో అంజనాదేవి వారిని సమాన గౌరవముతో చూచునట్లుగా హెచ్చరించి యుండెను.

వారలలో సుగ్రీవుని
చేరుచ హితమంత్రివై వసింపుము దమలోఁ
దారె డసిన సుగ్రీవునిఁ
గూరిచి యింద్రజునిఁ గూల్పకుము మామ సుమీ

వాలికి భయపడి సుగ్రీవుడు ఋష్యమూకాద్రికి పారిపోయెను. సుగ్రీవుని హనుమంతు డనుసరించెను. సుగ్రీవుని భార్యను వాలి అపహరించినను "అశక్తు హోలికం దాశె పర్భుతుండతని దండన సేయక తల్లి యాజ్ఞచేన్." ఇప్పట్టున మామకు అతడు 'ఏడుగడ'యై యుండి అఖిల కార్యధౌరేయుడై యుండెను. హనుమంతుడనే ధైర్యతరి వలననే సోదరాగ్రహమనెడి అవమాన సాగరాన్ని; హనుమంతుడనే వాక్సుధాలహరి వలననే కాంతావియోగ శోకాగ్నిని; ప్రభాకర శిష్యుడగు పావని మైత్రి వలననే రాజ్యరాహిత్య దుఃఖతిమిరాన్నీ; కేసరి సుత సాంగత్యం వలననే పరాజయా రోగమనే గజాన్ని సుగ్రీవుడెదిరింప గలిగెను. కార్యాకార్య విధిలో ప్రధానిగా, శోక విధ్వంసనంలో ఆచార్యునిగా, చింతితార్థ ఘటనా సంపత్తిలో దేవునిగా ధైర్యోత్పాదనలో శక్తి దాయకునిగా హనుమంతుడాతని కాపాడి అతని బ్రతుకును నిలిపెను. సోదరుడగు సుగ్రీవుని సమయించుటకై వాలి ఎందరినో గూఢచారులను పంపెడివాడు. వారిని కనిపెట్టి సుగ్రీవుని రక్షించుటకై వారిని హనుమంతుడే తెగటార్చుచుండెను.[77]

ఇతర గ్రంథముల ప్రకారము: తన గురువగు రవికి గురుదక్షిణ ఇచ్చుటకు బదులుగా అతని పుత్రుడగు సుగ్రీవుని సేవించుటకు హనుమంతుడు పూనినట్లు శ్రీకృష్ణ రామాయణము.[78]

అంతరార్థ రామాయణములో: హనుమంతుడు సుగ్రీవునే చేరుటలో ఆధ్యాత్మిక రహస్యములున్నవని యీ గ్రంథ ముగ్గడించుచున్నది. "వలతే" అను సంస్కృత పదమునకు చుట్టుకొనునది అని అర్థము. అనగా మాయ. 'వాలి' అనగా మనస్సును చుట్టుకొని యుండు మాయ అనియే అర్థము.

ఇతడింద్రియముల కధిపతియగు ఇంద్రపుత్రుడు. దేహంలోని షట్చక్రాలలో విశుద్ధచక్రం గ్రీవస్థానమునకు సంబంధించినది. అదియే సుగ్రీవము. ఈ విశుద్ధ చక్రం ద్వారానే ఆజ్ఞా చక్రంలోకి సాధకుడు ప్రవేశిస్తాడు. ఈవిధంగా బుద్ధి యొక్క విశుద్ధ తత్త్వం అని సుగ్రీవ శబ్దమునకర్థము. ఇతడు సూర్యసుతుడు. ఓమ్ భూర్భువః తత్ సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్" అను గాయత్రీ మంత్రం ప్రకారం సూర్యుడు మన బుద్ధివ్యాపారాలలోని విశుద్ధతను ప్రబోదన చేసేవాడు. ఆదిత్యహృదయమున గూడ ధ్యేయః సదా సవిత్రమండలవర్తి నారాయణ" అని కలదు. కావున సుగ్రీవ పదానికి భగవద్విజ్ఞానం చేత కలిగే విశుద్ధ తత్త్వమని అర్థము. వాలికి భీతుడై సుగ్రీవుడజ్ఞాతంగా ఉండెననగా విశుద్ధతత్త్వం మాయావృతమైనది. మాయ, విశుద్ధతత్త్వం రెండును భగవంతుడినుండి పుట్టినవే కాన ఇవి సోదరులు. 'శతేశాఠ్యం ప్రకల్పయేత్" అను సూత్రము ప్రకారము మాయా ప్రభావమునకు గురికాకుండుటకే శ్రీరాముడు చాటున ఉండి మాయారూపుడగు వాలిని వధించుట. రాజైన వాలిని విడచి సుగ్రీవునితో ఆంజనేయుడున్నాడనగా మనసుకు చెందిన మాయను విడచి విశుద్ధతత్త్వంతోనే బుద్ధి అంటి యుండునను అంతరార్థం గ్రహించాలి. ఆంజనేయుడనగా విశుద్ధ బుద్ధి తత్త్వమని అర్థము. అందు వలననే ఇతనిని "బుద్ధిమతాం వరిష్ఠః" అని వ్యవహరించుట.[79]

ఇంద్రుడు వాలికి కాంచనమాలనిచ్చెను. అది ప్రతివీరుల బలములో సగము హరించును. సూర్యుడు తన కుమారుడగు సుగ్రీవునికి తన శిష్యుడగు ఆంజనేయునికినిచ్చెను. కావున సూర్యుని యాదేశమే హనుమంతుడు సుగ్రీవ సఖుడగునట్లు చేసినది.[80]

2. హనుమద్రామ సమావేశము:

శ్రీమద్రామాయణము ప్రకారం: ఈ సన్నివేశమునకు వాల్మీకి రామాయణమున ప్రాధాన్య మధికముగా నీయబడినది. వ్యాఖ్యాతలు కూడ ఎన్నో నిగూఢ విషయముల గూర్చి తెలిపియున్నారు. నారచీరలు ధరించి మునివేష ములతో శస్త్రధారులై వచ్చు దాశరథులను చూచి అనుచర సహితుడైన సుగ్రీవుడు భయపడెను. అతడు పంపానది దక్షిణ దిశలోని పర్వత గుహల లోనికి తలదాచుకొనబోయెను. కాని వారిలో హనుమంతుడొక్కడు మాత్రము

భయమొందక తత్సమయోచిత కర్తవ్యమును సుగ్రీవునికి తెలిపెను. "కపీంద్రా, నీవేల భయపడుచున్నావు. ఇది ఋష్యమూకము కావున వాలి యిక్కడికి రాజాలడు. నీవిట్లు పిరికితనమూని నీ మర్కట స్వభావమును బహిర్గత మొనర్చు కొనుటయే. లఘుచిత్తత నీ బుద్ధి జ్ఞానేంగితములనూ, ఆలోచనా శక్తినీ పోగొట్టెనా! ఇట్టైన రాజు ప్రజలను పరిపాలింపగలడా? కావున సాధుతాసాధుతల నెఱిగి కార్యనిర్ణయ మొనర్పుము" అని పలికిన పావని మాటలకు సుగ్రీవుడు "ఈ చాపధారులను నేను పూర్వము చూచియుండలేదు. వాలి ఆలోచనా సరళి యెట్టిదో నాకు బాగుగా తెలియును. నన్ను నిర్మూలించ దలచియే వీరిని వాలి పంపినాడు. రాజులను నమ్మరాదు. కావున నీవు ప్రాకృతునివలె వెళ్లి వారి వృత్తాంతము తెలిసికొని రమ్ము. నీవు వారిని చేరి భాషించి వారి హావభావరూపాదులను గమనించి వారి స్వభావమును కనిపెట్టి వారు నిన్ను నమ్మునట్లు మాట్లాడుము. నీపై వారికి అనుకూల్యమున్నట్లు గమనించిన పిమ్మట ఆయుధపాణులై వారేల వనములలో తిరుగుచుండిరో హేతువడిగి వారి మనోనైర్మల్యమూ, వాగ్వైఖరీ మంచిదని తోచినచో అటుపై నీకేది యుక్తమో అట్లు చేయుము" అని తెలిపెను. ఈ కార్యభారము వహించి హనుమంతుడు బయలుదేరెను.

తాను నిజరూపముతో వెళ్లినచో కార్యానుకూలము కాదని తనలో తానే తలంచి సన్యాసి (భిక్షు) రూపములో చేరి "నిశ్చంచల వృత్తిమై వినయసంపద వారలకర్థి ప్రమొక్కె"ను. వారిని చూచి సుమనోహర సౌమ్య వినయోక్తితో "అయ్యలారా, మీరు రాజర్షులతోను దేవతలతోను సమానముగా కనబడు చున్నారు. మీరేదో వ్రతము పూనిన వారి వలె నున్నారు. ఈ అడవిలో మీరు తిరుగవలసిన కారణమేమో! మీరు మంచి పరాక్రమవంతుల వలె నున్నారు. మిమ్ము చూచి మృగపక్షి సంతానములు పరుగెత్తుచున్నవి. నేనెన్ని మాటలు పలికినను మీరు నాకు బదులు చెప్పక చెట్లనే చూచుచున్నారు. సామ్రాజ్య సింహాసనారోహణా దక్షులగు మీరు నారచీరల నేల ధరించి యున్నారు. మీరెవరు? పరిఘోపమానములు, సుందరములు, ఆజానుపర్యంత మున్న మీ బాహువులు ఆభరణధారణా యోగ్యములు. ఈ సకలోర్విని పరిపాలింప యోగ్యులగు మీరేల దీనదశలో నున్నారు. మీ కనులు తామర రేకులను పోలియున్నవి. మీ విండ్లు అసదృశ వజ్రాయుధ తుల్యములు.

తూణీరములలోని మీ బాణాలు శత్రుజన ప్రాణాంతకములు. మీ కత్తులు పొడవై వెడల్పు కలిగి అపరంజి కాంతి కలిగి కుబుసము వీడిన సర్పముల వలె నున్నవి. మీ వృత్తాంతము తెలుప వేడుచున్నాను" అని హనుమంతు డెన్ని విధాల పలికినా వారు బదులు పలుకరైరి. అపుడు హనుమంతుడు వారి ఆలోచనలను పసికట్టి తనలో తాను కర్తవ్యము నూహించుకొని మర్మము విడిచి తనను గురించి తెలుపుటకు నిర్ణయించి మరల నిట్లు పలికెను.

"మహానుభావులారా, నేను సుగ్రీవుడు పంపగా వచ్చినవాడను. "కామ రూపధరుండ, కామ సంచారుండ, హరి తనూజు హితంబు నాత్మగోరి మస్కరి యాకృతి మాఱువేషము దాల్చి, ఋష్యమూకము నుండి యిటకు వచ్చినాను. నేను సుగ్రీవునికి సచివుడను. నా పేరు హనుమంతుడు. నేను వాయుపుత్రుడను" అని పలికి వారి సమాధానమునకై నిరీక్షించెను. వెంటనే శ్రీరాముడు సోదరుని చూచి "ఈతడు సామాన్యుడు కాడు. సుగ్రీవుని యనుంగు ప్రెగ్గడ. మన మెవ్వని తలంచుచున్నామో అతని నుండియే వచ్చియున్నాడు. మన మితని నమ్మవచ్చును.

నెయ్యంబుఁ దియ్యంబు నేర్పు దీపింప నీ
    వాక్యజ్ఞునకుఁ బ్రతి వచన మిమ్మ
ఋగ్వేదమును జక్క నెఱుగని వాడు య
    జుర్వేదధారణా శూన్య బుద్ధి
సామవేదమునఁ బ్రాజ్ఞత్వంబు లేని వా
    డీరీతి భాషింప నేరడెపుడు
వ్యాకృతి యంతయు వల్లించె నిజముగ
    నెన్నిమాఱులో యీతడింత సేపు

మాటలాడ నొక్క మాటయేనియు నప
శబ్దితంబు గాదు చక్షువులనొ
ముఖముననొ లలాటమున బొమలందునో
దోషమొక్కడైన దోపదెందు

కౌతుకులు లేక విస్తరము గూడక శంకకు సందులేక యో
ద్రుత మవిళంబితంబు నయి తొప్పులు పోవకురో గళైక సు
స్థితమయి మధ్యమ స్వరముచే నలరారెడి వీనివాక్కు సం
స్కృతమును సక్రమంబు శుభమెంతయు హృద్యమునై రహించెడిన్

ఉదాత్తానుదాత్త స్వరితములతో గూడిన యీతని వాణి శత్రువులనైన సంతోషపరచ గలదు. ఈలాంటి దూతను సంపాదింపని రాజుకు పనులు నెరవేరజాలవు." అని పలుకగా అన్న ఆదేశానుసారముగా లక్ష్మణుడు హనుమంతునకు సమాధానమీరీతిగా నిచ్చెను.

"అయ్యా, పండితోత్తమా, మేము సుగ్రీవుని కొఱకు వచ్చినవారమే" అని తెలిపెను. హనుమంతుడు ఆనందించి వారి కథను సవిస్తరముగా తెలుపమని కోరెను. దాశరథుల జననమాదిగా ప్రారంభించి సీతాపహరణము వరకు గల తమ కథను లక్ష్మణుడు సవిస్తరముగా చెప్పెను. అంత హనుమంతుడు 'అయ్యా, మీ కథ తెలిసి యెంతయో ఆనందించినాను. సుగ్రీవుడుకూడ రాజ్యాన్నీ, సతినీ పోగొట్టుకొని యున్నాడు. అతడు మీకు సహాయ మొనరింప గలడు. సీతాన్వేషణకార్యము మీకు సిద్ధింపగలదు. అతనిని దర్శింప పోదము రండు" అని ఆహ్వానించెను. అంత లక్ష్మణుడు రామునితో 'ఇతని మాటలు సత్యములుగా తోచుచున్నవి. ఇతని వర్తనలో మోసములేదు కావున ఆ వానరేంద్రుని దర్శింపపోవుదమా!" అని అడుగగా రాముడు అంగీకరించెను.

హనుమంతుడంత తన భిక్షురూపము వదలి వానరాకారమూని 'అయ్యిన వంశుల నంసదేశమందునిచి" సుగ్రీవుని వద్దకు బయలుదేరెను. సుగ్రీవుడున్న మలయాద్రి చెంత వారిని దింపి వారివార్తను సుగ్రీవునకు తెలుపుటకై మరల భిక్షురూపము పూని వెళ్లెను. రామాదులయెడ సుగ్రీవునకుండిన సందేహములను తొలగించి "రాముడనఘుడు, మతిమంతుడు, మిత్రాయుతతేజుడగు తమ్మునితో కూడ వచ్చినవాడు మహాత్ముడు. ఇతడు సామాన్యుడు కాడు. సాక్షాత్ పరమాత్మయే. సత్యశౌర్యములు కల సూర్యవంశదీపకులు వీరు. ధర్మస్వరూపులు. పితృవాక్య పాలనా వ్రతదీక్షితులు. భార్యను రావణుడపహరించి నందున దుఃఖార్తుడై నీ శరణువేడుటకై వచ్చియున్నాడు. నీవు చేరి వారిని పూజింపుము" అని తెలిపెను.

రామలక్ష్మణులున్న చోటికి సుగ్రీవుని తీసికొనివచ్చి వారివద్ద నుంచగా హనుమంతుని ద్వారా వారికి స్నేహము కలిగెను. హనుమ తన భిక్షురూపము వదలి అరణులను మథించి నిప్పు పుట్టించి దానిని దాశరథుల మధ్య నుంచెను. అగ్నిసాక్షికముగా వారు మిత్రులైన తర్వాత కొమ్మనొకదానిని విరిచి సుగ్రీవుడు దానిమీద రాముడు కూర్చొనగా తానును కూర్చొనెను. ఇంగితమెరిగిన

ఆంజనేయుడు చందనశాఖ నొకదానిని విరిచి దానిపై లక్ష్మణుని కూర్చుండ జేసెను. శ్రీరామ సుగ్రీవుల యనంతర సంభాషణము, సీతాదేవి జారవిడిచిన ఆభరణములను సుగ్రీవుడు తెమ్మనగానే హనుమంతుడు తెచ్చిచూపుట, శ్రీరామ విలాపము, సుగ్రీవుడాప్త వాక్యముల పలుకుట, వాలిసుగ్రీవుల వైరవృత్తాంతము, వాలివధకై రామప్రతిజ్ఞ, రాముని బలమును గూర్చి సుగ్రీవుని అనుమానము, దుందుభి కళేబరాన్ని కొట్టిన సప్తసాలములను రాముడు కూల్చుట, వాలి సుగ్రీవుల పోరాటము, వాలివధ మొదలగు రామాయణాంతర్గత కథా సన్నివేశములకు లక్ష్మణునితో బాటు హనుమంతుడు కూడ ప్రత్యక్ష సాక్షిగా నుండెను.[81]

పద్మపురాణమునందలి కథ: రాముడు సీతా విరహతప్తుడై శోకించుచు సౌమిత్రి తొడపై తన తల ఉంచి ఋష్య మూకాద్రిలో ఒక వృక్షచ్ఛాయలో శయనించి ఉండగా ఆ చెట్టు కొమ్మపై రామునకు ఒక వానరుడు కన్పించెను. అతనితో రాముడే పరిచయ మేర్పరచుకొని సుగ్రీవ సఖ్యము కోరెను.[82]

రంగనాథ రామాయణ కథ: ఆంజనేయుడు వటువేషము ధరించి ఫలమొకటి గైకొని రామలక్ష్మణుల సన్నిధికి వచ్చెను. రాముడతని రూపురేఖా విలాసములను ఆభరణములను చూచి ఆశ్చర్యపడెను. లక్ష్మణునితో ఆ సంగతినే ముచ్చటించు చుండగా హనుమంతుడు వినెను. అపుడతనికి బ్రహ్మ తనకు చెప్పియుండిన పూర్వవృత్తాంతము స్మరణకు వచ్చెను.

"ఒనరంగ నీమేని యురు భూషణంబులు
కనుగొన్న యాతడే గతియును బతియు
అతడె విష్ణుండు అతడే నీగతి........"

ఈ మాటలు స్ఫురణకు రాగా హనుమంతుడు తాను కొలువ వలసిన దైవముగా శ్రీరాముని గుర్తించెను. ఇట్లే భాస్కర రామాయణము, అధ్యాత్మ రామాయణము, ఆనందరామాయణము, ఆశ్చర్య రామాయణము, గోవింద రామాయణము, శ్రీకృష్ణ రామాయణములలో నున్నది. హనుమంతుడు బ్రాహ్మణ వటువేషమున వెళ్లినట్లు ఈ గ్రంథములలో నున్నది. కానీ ఆశ్చర్య రామాయణము, ఆనంద రామాయణములలో ఒక విశేషమున్నది. శ్రీరామాదులు తమకు శత్రువైనచో సంజ్ఞ చేసి తెలుపవలయుననియు తనకు మిత్రులైనచో చిరునగవు ద్వారా సూచింపవలెననియు సుగ్రీవుడు హనుమంతుని కోరెను.[83]

అద్భుతోత్తర రామాయణములో: హనుమంతునికి రాముని విశ్వరూప మద్భుతముగా కనబడెను. ఆ రూపమునతడు ఏడు పద్యములలో స్తుతించి శ్రీరామునకు సాష్టాంగ నమస్కార మొనర్చెను.[84]

ఆశ్చర్య రామాయణము ప్రకారం: వటువేషములో రామునిచేరి హనుమంతుడు "మీరు దేవతలా, అశ్వినులా, రుద్రులా, అని ప్రశ్నించెను. రాముడంత 'వానరోత్తమా, నీవు నన్ను ఇంకొకమారు చూచినచో నేనెవ్వరో నీకు తెలియును.'' అని చెప్పి తన నిజరూపమతడు చూడగల దివ్యదృష్టిని యిచ్చెను. ఆంజనేయునకపుడు రాముని రూపంలో చతుర్దశ భువనాలూ కులపర్వతాలూ, సప్తసాగరాలూ, నక్షత్రాలూ, సూర్యచంద్రులూ భూమీ ఆకాశమూ, నదీ నదములూ, గ్రామాలూ, నగరాలూ, రాక్షసులూ, వానరులూ.... అన్నీ కనపడెను. "వానరా' అని తనను రాముడు సంబోధించి నందున తాను వానరుడను విషయము రామునకు తెలిసినదని గమనించి హనుమంతుడు వానరాకారము పూని సమీపవృక్ష మధిరోహించి తాను చూచిన విశ్వరూపమును గూర్చి 'యిది యింద్రజాలమో, భ్రమయో అని సంశయించు చుండెను. వృక్షాగ్రంలో నున్న వానరుని రాముడు గమనించెను. అతని దేహంలో చెవులలో గుప్తముగా నున్న సువర్ణకుండలములు, దేహానికున్న సువర్ణ కవచము గమనించి ఆ వివరములను తమ్మునికి తెలిపెను. ఆ వాక్యములు వినిన హనుమంతునకు బ్రహ్మ తనకిచ్చిన వాక్యములు గుర్తుకు వచ్చెను. "ఆంజనేయా! ఈ నీ కవచ కుండలములను ఇతరులు చూడజాలరు. ఇవి ఎవనికి కనబడునో అతడే శ్రీవిష్ణువని తెలిసికొనుము. అతనినే నీవు నీ ప్రభువుగా భావింపుము.'' అను నా వాక్యముల స్మరించి శ్రీరాముని చూచుట వలన తనకు గల్గిన చేతోముదమునే ప్రమాణీకరించుకొని వృక్షము నుండి దిగి శ్రీరాముని చేరి "స్వామీ! నేను మూఢుడనై అపకారము చేసితిని. నేను నీ దాసుడను. నీవే నా స్వామివి. నేను నీకు భృత్యుడను. నీ ఆజ్ఞానువర్తిని" అని తెలిపెను.[85] (విచిత్ర రామాయణమున కూడ ఈ కవచకుండల వృత్తాంత సహితమగు కథ కలదు.)

సమీరకుమార విజయము ప్రకారము: వాల్మీకి రామాయణముతో పాటు ఇతర రామాయణములలోని అంశములను స్వీకరించి పుష్పగిరి తిమ్మన ఈ సన్నివేశమును కడు రమణీయముగా పోషించియున్నాడు. బ్రహ్మవారి

వేషమున వచ్చు హనుమంతుని శ్రీరాముఁడు గుర్తించెను. సతివియోగ దుఃఖ తిమిరమున నున్న రామునకు హనుమంతుని రూపమొక ఆశాకిరణ మైనది. వెన్నెల కాంతిని పోలిన యజ్ఞోపవీతముతో, మెఱుగొన్న మౌక్తికావళులతో, పసిడి కెంజిగి పట్టుపంచెపై మొనయు మౌంజితో నవరత్నఖచిత కుండల ప్రభలతో, తళుకెక్కు చెక్కిళ్లతో, ఎఱ్ఱ తామరల వంటి హస్తములతో, బంగరు గోచితో, ముంజేతి బంగారు కంకణములతో తన చుట్టూ వున్న బయలు ప్రదేశాన్ని బంగారు మయమొనర్చుచు వచ్చు ఆ బ్రహ్మచారి రూపాన్ని రాముడు గమనించెను. కొండపై పాదములూది దిగి, మదబంధురసింధుర లీలతో ఒయ్యనొయ్యనేతెంచుచు రామాదుల సుప్రసన్న శుభ దృష్టులతో చూచుచు వచ్చుచున్న హనుమంతుని రాముడవలోకించి లక్ష్మణునితో "అదర ణీయుడీ వటుకులాగ్రణి జూడగ వేడుకయ్యెడున్"

> ఉక్తి వధూ సతీశ్వరుల నొక్కఁడు గాకితఁడున్న నీ శుభ
> వ్యక్తియు నీ విరక్తి విభవాద్యనురక్తియు నీ మహత్కళా
> వ్యక్త ముఖాబ్జయుక్తి కలదా! యితనిం గని మాటలాడగాఁ
> బ్రాక్తన జన్మ పుణ్య పరిపాక వశంబున గాక కల్గునే...."

అని పలికెను. "సోదరా, ఇట్టి ఘనుని నేనిదివరలో జూడలేదు. ఇతనిని చూచుకొలది నాలో దుఃఖము పోయి మోదము హెచ్చుచున్నది. ఈ చుట్టు ప్రక్కల చెట్లు హేమవర్ణమౌతున్నాయి. ఇతని రాకవల్ల యింకేమి విశేషాలు కల్గునో? అని పలుకు రాముని వద్దకు హనుమంతుడు సమీపించి 'కయిమోడ్పు లలాటము నందమర్చి సాష్టాంగ మొనర్చెను. క్షత్రియులై గృహస్థులైయున్న శ్రీరామ లక్ష్మణులకు హనుమంతుడు నమస్కరించెను. ఇట్లొనర్చుటకు కారణము తల్లిమాటా, బ్రహ్మవాక్కులే.

తన మేనమామల వద్దకు పోవుటకు ముందు ఆంజనేయుడు తన తల్లిని చేరి 'అమ్మా, సత్య దయాది ధర్మాలనూ, నిత్యబ్రహ్మచర్యత్వమునూ నాకు ఇచ్చిన ధాతకు నేను నమస్కరించి నా తనుమనముల నేలుకోగల విభుని తెలుపమని కోరితిని. అపుడు బ్రహ్మ "నీయొడలి నవ్యవిభూషణరాజిఁ గాంచు విష్ణువే నీకు గతియును ఇష్టఫలప్రదాతయు కాగలడ"ని తెలిపియున్నాడు అని చెప్పెను. అంత అంజన, "బ్రహ్మవాక్కు తప్పక ఫలించును. నీవటులే చేయు

మని యాదేశించి పంపియుండెను. హనుమంతుని చూచి లక్ష్మణునితో రాముడు—

బంగరు పట్టుగోచి నును పచ్చని ముంజియు నొంటి జందెమున్
ముంగయి కంకణంబు జిగి మోహన హారము కుండల ప్రభా
భంగ కపోలముల్ తరుణ భాను సమాన ముఖాంబుజంబు మీ
అంగ పటుక్రియన్ శివుడు రాడుగదా మన చింత దీర్పగన్.

—అనిన పలుకులను వినిన హనుమంతుడు తన స్వామిని గుర్తించియే అట్లు నమస్కరించెను.

అంత లక్ష్మణునిద్వారా శ్రీరామకథ విని అమృతాక్షరసంగ మెసంగగా రాముని చూచి—

"రావించెద సుగ్రీవుని
గావించెద మీకు బంటుగా ననిశంబున్
సేవించెద మీ పదములె
భావించెద మిమ్ము స్వామి భావమున నృపా"....

—అని పలికెను. ఆ తర్వాత తనను గూర్చి తన పుట్టుకను గూర్చి, బ్రహ్మ తనతో అనిన మాటల గూర్చి వారితో చెప్పి రాముని స్తుతించుచు "స్వామీ. లోకాలోకచరితక్రియల్ తెలియునంతటి దేవునకు ఒక క్రోతి ముంజిని, గోచిని కంకణములను ధరించుట విచిత్రముగా ఉండవచ్చును. కానీ, సర్వసాక్షి, చిన్మయమూర్తి పరమాత్మయైన మీయొక్క దివ్యరూపమును కనులార సేవించు భాగ్యమునకు అర్హుడనైతిని. మీ దర్శన మాత్రమున నాలోని అంధకారము తొలిగెను. మీ పాదసన్నిధిలో నామేను పావనమాయెను నా మనోరథము లీడేరెను" అని పలికెను. అంజనేయుని భక్తికి, అనురక్తికి ఆనందించిన శ్రీరాముడు తన అనుజుని చూచి "ఈ కపికుంజరుని మాటలు నవవ్యాకరణార్థ దీపకములు; శబ్దనిగుంఫనక్రియాస్తోకములు; విశుద్ధపదాస్పదములు; మనన శ్రవణ శోకహరంబులు. ఇట్టి గుణసుందరు నెందునైన కంటిమే. హనుమన్ముఖ ప్రసక్తవాణి యెంతటివారినైన వలపింపజేయును దాని రుచి, అర్థ గాంభీర్యము, కోమలత్వము, తిన్నదనము, చాతుర్యము అపశబ్దరాహిత్యము, రమ్యరీతి, సరసభావములను పేర్కొని ఆశ్చర్యము ప్రకటించుచుండగా హనుమంతుడు వారి వార్త సుగ్రీవునికి తెలుపుటకై బయలుదేరెను.

హనుమంతుడు సుగ్రీవుని చేరి "ప్రభూ, శోకసాగరంలో కడగానని నీకు దరిదాపు రాముని రూపమున లభించినది. నీవు వారి సాహాయ్యము పొందుము" అని తెల్పి మరల దాశరథుల వద్దకు వచ్చి సుగ్రీవునకు శ్రీరామదర్శన మనుగ్రహింప ప్రార్థించి వారినామోదింప జేసి నరవానరసఖ్యమునకు నాంది యొనర్చెను. శ్రీరామసుగ్రీవ స్నేహాన్ని పటిష్ఠపరచి, వాలి నిర్మూలనమునకు తోడ్పడి కిష్కింధ సింహాసనమును సుగ్రీవునకు దక్కునట్లు చేసిన హనుమంతుని నిర్వ్యాజ పరోపకార వైభవమును, సంధానోచిత వాగ్విధానమును, సత్యవ్రత సామర్థ్యమును అనన్య దృష్టములని శ్రీరాముడే పొగడెను. 'ఇతడా పద్భేది సామాన్యుడే'' అని రాముడే మెచ్చుకొనినందున శ్రీరామవాక్యాను గుణముగా హనుమంతడాపన్నివారకుడయ్యెనని యూహింపవచ్చును.[86]

హనుమంతుడు శ్రీరామునివద్దకు వటురూపమున వెళ్లినట్లుగాను, భిక్షు రూపమున వెళ్లినట్లుగాను, సన్యాసి రూపమున వెళ్లినట్లుగాను పలురామాయణ ములలో పలుపలు విధములుగా నున్నది. ''రూపంబది సంపూజ్యము తాపసులకుఁగూడ గాన దానింగని యా భూపకుమారుల కడకిపుడే పోయెద'' నని హనుమంతుడు తలంచినట్లు ధర్మసార రామాయణము.[87] ఇక ఆశ్చర్య రామాయణములో: 'వటువేషమనగా బ్రహ్మచారి వేషము. బ్రహ్మచారి అవధ్యుడు. మంగళప్రదుడైనను చంచలుడై యుండి తనకు ప్రయోజనము లేకపోయినను కుశంకలు చేయునట్టి వాడని తలంచియే సుగ్రీవుడు హనుమంతుని వటువేషమున వెళ్లమని కోరెను. వటు శబ్దమునకు భిక్షువు, సన్యాసి, అని తెలుపుట తగదు. సన్యాసి రాజునకు నమస్కరింపరాదు. భిక్షువు గృహస్థునకు నమస్కరింపరాదు. రాముడు క్షత్రియ రాజకుమారుడు. గృహస్థు కావున భిక్షు శబ్దమునకు పలువురు వ్రాసినట్టి వటువనియే స్వీకరించుట ఉచితము. హనుమంతుడు మనుష్య బ్రహ్మచారి వేషములో వెళ్లినాడని తాత్పర్యము.[88]

ఇట్లే దండక రామాయణమునను కలదు.[89] కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్షములో నున్న క్రమము: భిక్షుకాకారమున వచ్చి శ్రీరామలక్ష్మణుల జూచి హనుమంతుడు—

"మీర లెవ్వరు వినూతన దైవత మోహనాకృతుల్
మీర లెవ్వరు ప్రదక్షిణ యోగ్యులుదాత్త తేజసుల్
మీర లెవ్వరు మహా హేలా ప్రధానాకృతుల్''

—అని వారినడిగెను. వారిలో—

"రాము కన్నులఁ బరమేశ్వరత్వమనుజ
కన్నులను యోగిరాజ లక్షణముల"

—నాతడు చూచెను. హనుమంతుని మాటలు వినిన రాముడు—

దర్శన మాత్ర తర్పిత హృదంతర భావుడు—సాధుమూర్తి యా
దర్శ గతాత్మ బింబ కలితంబున నక్కపిరాజు జూపెనాన్
స్పర్శము చేత వాయు సుఖ శైత్యము దీపితమెట్లు భావనా
మర్శిత వాక్కుచే నుభయ మంజుల భావము దీప్తమయ్యెడున్

—అని తలంచెను.[90]

అద్భుతోత్తర రామాయణములో: ఇందులో శ్రీరాముడు శంఖచక్రగదాధారియై వనమాలాలంకృతుడై శ్రీవత్సచిహ్నిత వక్షములతో పీతాంబరధారియై సనకసనందనాదులచే స్తుతింపబడుచు సూర్యప్రకాశముతో, శతచంద్రకాంతితో, వేయిపడగలుగల పాన్పుగా లక్ష్మణుడు విరాజిల్లుచుండగా హనుమంతునకు దర్శనమిచ్చెను. ఆ దివ్యరూప దర్శన భాగ్యమునకు హనుమ ఆశ్చర్య చకితుడై నిమేషమాత్రం కళ్లుమూసి శ్రీరాముని రూపమును పరమాత్మగా నెఱిగి తన హృదయమందు నిల్పి ధ్యానించెను. దర్శన భాగ్యమునేకాక హనుమంతునకు శ్రీరాముడు జ్ఞానసాంఖ్యాది యోగములతోపాటు పరతత్త్వం గురించి విపులముగా బోధించెను. శ్రీరాముని దివ్యరూపం అంతర్ధానంకాగా హనుమంతుడంత మానవాకృతులగు శ్రీరామ లక్ష్మణులను చూచెను. రామునిలో హనుమంతుడు పరమాత్మను దర్శించగా, హనుమంతునిలో రాముడు శత్రు సంహార సమర్థమగు రుద్ర కర్మార్హ రూపమును గాంచెను. ఇదే కథ రామాయణ వచనమున కూడ కలదు. హనుమంతుని మూలముగా శ్రీరామునికి సుగ్రీవుని చెలిమి లభించుట. ఆచార్య మూలముగ భగవంతుడు చేతనునకు లభించుటయే. భగవానుడగు రాముడు సుగ్రీవుని శరణుపొందెనా? అని ప్రశ్నించువారికి జవాబుగా వ్యాఖ్యాత ఇట్లు తెలిపియున్నారు. "కర్మ పరతంత్రుడై శోకాకులులగు వారిని గాంచి పరమాత్మయే శోకాకులుడగు ననియు, ఆ ఉభయుల దుఃఖము ఆచార్య మూలముననే తొలగుననియు హనుమద్రామ సమావేశమందలి ధ్వని అని శ్రీ దివాకరుని వేంకటసుబ్బరావు గారు చెప్పియున్నారు.[91]

అన్యభాషా గ్రంథములలోని క్రమము: 1. కంబర్ కవిప్రకారం: హనుమంతుడు శ్రీరామలక్ష్మణుల జేరి 'తేజస్వులారా, భవ్యమై ఇష్టావాప్తి చేకూరుతన్' అని సంభావించి కుశల వార్తలడిగెను. అపుడు రాముడు 'నీవెవరవు?' అని అడుగగా హనుమంతుడు "నేను సుగ్రీవుని మంత్రిని - హనుమంతుడను పేరు గలవాడను. వనచరుండన్ దాసుడన్ మీకడన్" అని తెలిపెను. వారి కథ విని వారు సుగ్రీవుని కలిసికొనుటకే వచ్చుచున్నారని తెలిసి "అహో! తపమాతడు పూర్వభవంబు నందు అనితర సాధ్యముగా చేసిన ఫలితమే కదా ఇది" అని పలికి "మీరలు విచ్చేయుట భాగ్యదేవత కృపన్ ప్రత్యక్షమౌటయే గదా। జనులు వాంఛాపూర్తికై యజ్ఞాది కర్మలు చేస్తారు. సుగ్రీవుని భయమును పోగొట్టుటకన్న వేరు ధర్మము లేదు" అని హనుమ పలికెను. విప్రవర్ణియై హనుమంతుడు తమకు నమస్కరింపదగదని రాముడనినపుడు హనుమంతుడు "కింకరుడు మర్కట కులజుండటంచు పలుకరుగదా!" అని తన నిజరూపము చూపగా, అతని మేరునిభ శరీరమునకు త్రిజగముల గొల్చిన అవతారమూర్తి యగు రాముడే దిగ్భ్రమ చెంది—

"తమ్ముడ కాంచితే విమలతత్త్వము సత్త్వము రూపుదాల్చిన
ట్లెమ్ముగ మోక్షమె యొక కపీశ్వరు నాకృతి నొందు భాతిఁ దే
జమ్ముల పుంజమై వెలసె సమ్మతినిమ్మహనీయుఁ జేరి దుః
ఖమ్ముల నీగునట్టి యొడికమ్ము నెఱుంగగనయ్యె నియ్యెడన్

—అని చెప్పెను. హనుమంతుని ద్వారా తర్వాత రామసుగ్రీవ సఖ్యము నెరవేరినట్లు కంబకవి రామాయణమున కలదు.[92]

రామచరితమానస్ ప్రకారము: దూరమున వచ్చు రామ లక్ష్మణులను చూచి సుగ్రీవుడు హనుమంతుని పిలిచి 'ఆ మహాపురుషుల జూడుము. వారనేక కష్టముల బడినట్లు కనబడుచున్నారు. నీవు బ్రహ్మచారి రూపం ధరించి వారిని చూచిరమ్ము. వారి వృత్తాంతమంతయు వారికి తెలియకుండా నాకు తెలియ జేయుము. ఒకవేళ వారు వాలిచే పంపబడిన వారైనచో నీవు నీ ముఖమును వంచుకొని యుండుము. నేనది గ్రహించి యీ పర్వతము విడిచి పారిపోయెదను" అని చెప్పెను. హనుమంతుడు అట్లేచేసి తన స్వస్వరూపము వారికి తెలియకుండునట్లు శిరస్సు వంచుకొని యుండెను. అతడు వారికి నమస్కరించెను.

రాముని తేజము చూడలేక వారు బ్రహ్మర్షి రాకుమారులనియో, త్రిమూర్తులనియో తలవంచి హనుమంతుడు నమస్కరించి యుండునేమోయని శంకించినారు తులసిదాసుగారు (చౌపాలు 1 విశ్రామము 1 కిష్కింధకాండ) హనుమంతుడు వారిని మూడు ప్రశ్నలడిగెను. శ్యామల శరీరమును, పచ్చని శరీరమును గల మీ రెవరు? మీరేల వనములో తిరుగుచున్నారు? మీరు త్రిమూర్తులైనచో మూడవ వాడేడి? కాక, మీరు నరనారాయణులా! అని అడిగెను. రాముడే స్వయముగా తన కథ చెప్పగా, హనుమంతుడతని పాదాలపై పడి ప్రణామ మాచరించెను. అపుడు హనుమంతుడనుభవించిన సంతోషము చెప్ప శక్యము గాదు. అతని శరీరము పులకరించెను; ఆనంద బాష్పములు స్రవించెను; ముఖమునుండి మాట వెలువడలేదు. నిలువుగ్రుడ్లు పెట్టుకొని శ్రీరాముని దివ్యమంగళ విగ్రహమునే చూచుచుండెను. ఆనందముతో రామునిచూచి హనుమంతుడు "ప్రభూ, నేను స్వల్పుడను. బుద్ధిహీనుడను. నాకు జ్ఞానము లేదు. అందుచేత మిమ్మట్లు ప్రశ్నించితిని. సామాన్య మానవులవలె మీరు నా పూర్వోత్తరముల నడుగుటయా? నేను మీ మాయకు లోబడియుంటిని. కనుక మిమ్ము గుర్తు పట్టలేదు. (బాలకాండ 5వ విశ్రామము చౌపాలు 227లో శ్రీరాముడు హనుమంతుని వీడునపుడు మరల వనమున కలుసుకొనుమని చెప్పియుండెను.) నేను మందమతిని. మీమాయకు వశ్యుడను అని ఎన్నియో విధముల పలికి బ్రాహ్మణరూపము విడిచి వానరరూపముతో రాముని చరణములపై వ్రాలెను. స్వామిలోని వాత్సల్యమంతయు హనుమ శరీరముపై వ్యాపించెను. అతడు కపట రూపము ధరించి యుండినంత వరకు రాముడు అతనిని తాకలేదు. స్వస్వరూపము చూపగానే రాముడతనిని లేవనెత్తి నిలువబెట్టి కౌగిలించుకొనెను. శ్రీరాముని ఆనందాశ్రువులు అంజనేయుని దేహమును తడిపి చల్లబరచెను. అపుడు రాముడు "హనుమా! సంకోచింపకుము. నీవు లక్ష్మణుని కన్నా నాకు రెండింతలు ప్రియుడవు. లక్ష్మణుడు నా సేవకుడు. నీవు మా యిర్వురికి సేవకుడవు" అని పలుకగా హనుమంతుడు వారికి సుగ్రీవుని వృత్తాంతము తెల్పి వారిని తన భుజములపై ఎక్కించుకొని సుగ్రీవుడున్న కొండపైకెగిరి వారిని చేర్చి వారికి మైత్రిని సమకూర్చెను.[93]

హనుమద్రామ సమావేశ సంబంధి విశేషాంశములు: భిక్షురూపం ధరించి వచ్చిన హనుమంతునకు శ్రీరామదర్శనంతో అతని జ్ఞాననేత్రం వికసిం

చెను. అందువలన తాను యతివేషములో నున్నను నమస్కారము చేయును. (రామాయణమున) సంక్షేప రామాయణమున వాల్మీకి కవి 'పంపాతీరే హను మతా సంగతో వానరేణేహ" అని వ్రాసిన శ్లోకమును విశదపరచుచు శ్రీనమ్మాళ్వార్లు ప్రసాదించిన 'తిరువాయ్ మొషి" లోని "వైకంపూంగళి" అను పాశరములో 'హ" శబ్ద ప్రయోగ సార్థకతను విశదపరచుచున్నదని పేర్కొని నారు· "సన్యాసి వేషం కొన్డు వన్దు.... అను వ్యాఖ్యానము ప్రకారము సన్యాసి వేషంలో దివ్యదంపతులకు ఎడబాటు కల్గించిన రావణుని వలె కాక ఆ దివ్య దంపతుల సంశ్లేషము కూర్చువాడుగా హనుమంతుడు వచ్చెను. కావున హనుమద్రామ సమావేశము సీతావిశ్లేషమందాశ్వాసహేతువని తెల్పుటకే 'హ' శబ్దమును వాల్మీకి వాడెను. "అభరణత్తుక్కు అళఘు కొడుక్కుం పెరుమాళ్" ఇత్యాది పాశరముల వ్యాఖ్యలో రాముని అభరణ విరహితుడుగా హనుమ దర్శించినంతనే దృష్టిదోషం తగులకుండా అభరణములు ధరించవలసిన స్వామి యగు రాముడేల అభరణాలు లేకుండా కనిపించెనో అని బాధపడెను.[94]

శ్రీరాముడు భూషణముల వీడి కనిపించుట శత్రువులను సమూలముగా చంపుదునని సూచన చేయుటకేనని శ్రీ దివాకరుని వేంకటసుబ్బరావుగారు భావించియున్నారు.[95]

4. కిష్కింధా రాజకీయములు-హనుమంతుని మంత్రాంగము:

రామబాణహతిచే వాలి పడిపోగా కపిసోదరుల కలహమునకు తెర పడెను. కొన ఊపిరితోనున్న వాలికై దుఃఖించుచు తార ప్రాయోపవేశ మొనర్ప సంకల్పించెను. అపుడాంజనేయుడామె ప్రయత్నమును విరమింప జేయుటకై కేవలము సందర్భోచితమైన బోధ చేయుటయేకాక వానరరాజ్య సుస్థిరతకై రాజనీతిజ్ఞతను ప్రదర్శించెను. తారతోపాటు అంగదుని సహకారము కూడ సుగ్రీవునకు లభించునట్లొనర్చుటలోను, కపిసోదరుల కలహము వారిలో పగను, ద్వేషాన్ని జ్వలించునట్లుకాక పశ్చాత్తాపానికి పరస్పరావగాహనకు పనికి వచ్చు పలుకులను సార్థకముగా పలికి ఘనకార్యమును సాధించినాడు హను మంతుడు. తారకు బోధించిన మాటలలో అతని అధ్యాత్మిక పరిజ్ఞానము వాజ్నైపుణ్యము వ్యక్తమైనది. "తారా, దేహధారులు తెలిసిచేసినా, తెలియక చేసినా, సుకృత దుష్కృతకర్మల ఫలితములను అనుభవింతురు. వాలి నేడు

తన కర్మఫలమునే అనుభవించుచున్నాడు. దీనికై నీవు సుగ్రీవునికాని, రాముని కాని నిందింపవలసిన పనిలేదు. దేహము నీటిబుగ్గకు సమానము. నీకోసం నీవేడ్వవలయును గానీ యితరులకై కాదు. ఈ లోకమున ఎవ్వరికెవ్వరు? జీవపుత్రవగు నీవు సహగమనము చేయరాదు. దుఃఖము నీ తెలివిని హరించెనా? 'భూతలములు పుట్టుట, గిట్టుటా అనిత్యమైనవి. గతించు వాలికై హితకరమగు కార్యములను నీవు జరిపించవలయును గదా. ఔర్ధ్వ దైహిక శుభకామివగు నీవు రోదించరాదు బ్రతికిన రోజులలో వాలి బాగానే బ్రతికినాడు. వానరుల నేలినాడు. ఆత్మీయులను, మిత్రులను పెక్కువిధాల మన్నించి లోకమందనుభ వింపదగిన వాటినన్నియు అనుభవించి వెళ్లినాడు. కావున అతనికై దుఃఖింప కూడదు. ఇపుడీ రాజ్యానికి నీవే దిక్కు. నీమీదనే భారమంతా ఉన్నది. అంగదుని యౌవరాజ్య పదవిలో నిలిపి నీవు చూడాలి. గతించినదానితో మనకు నిమిత్తము లేదు. భవిష్యత్తులో నీకుమారునకు ఏ కష్టమూ రాదు. కావున ప్రకృతము నాలోచింపుము." అని చెప్పుచు ఓదార్పసాగిన తరుణమున కొనయూపిరితో నున్న వాలి సుగ్రీవుని పిలిచి తనవలన కల్గిన బాధలను మరచిపోయి రాజ్యాన్ని పాలించుకొనుమని తెలిపి తారను, అంగదుని సుగ్రీవు నికి అప్పజెప్పి క్రోధరహితుడై ప్రశాంతముగా ప్రాణముల వదలెను. హను మంతుడు తారకు బోధించిన పలుకులకు వాలి ఆమోదముద్ర పడుటతో జరుగవలసిన కార్యముల జరిపించుటకు తార ఆమోదించెను. వాలి మరణించు టకు పూర్వము తారకును, అంగదునకును హితమును బోధించుచు పలికిన పలుకులు, వాలి మరణము, తారావిలాపము, సుగ్రీవుడు సోదరునికై దుఃఖిం చుట, తారకు శ్రీరామునకు జరిగిన సంభాషణము, వాలికి ఉత్తరలోకక్రియలు మొదలగు అంశములకు హనుమంతుడు ప్రేక్షకుడుగా నుండి అన్నియు సక్రమముగా జరుపుటకు తోడ్పడెను.

సోదరునకు పుణ్యలోకప్రాప్తికై తడిబట్టలతో కర్మలనొనరజేసి దుఃఖ భారముతో నున్న సుగ్రీవునకు కర్తవ్యమును బోధించి వానరరాజ్య పట్టాభి షేకము జరుగుటకై హనుమంతుడే ప్రయత్నించెను. రాజనీతి చాతుర్యముతో, సందర్భోచిత వాగ్వైఖరితో శ్రీరామునితో హనుమంతుడు "స్వామీ, మీ అనుగ్రహము వలన, ఎట్టి వానరునకు పొందుట కసాధ్యమైనదీ, ఘనమైనదీ యగు పితృపైతామహమయిన వానర రాజ్యాన్ని సుగ్రీవుడు పొందెను. మీ

రనుమతించినచో నగర ప్రవేశము చేసి పవిత్ర స్నానముచేసి పట్టాభిషిక్తుడై అటుతర్వాత మిమ్ము రత్నమాల్యములతో నర్చింపగలడు. కావున మీరు కిష్కింధ కేతించి, వానరులనందరినానందపరిచి సుగ్రీవుని వానరరాజ్యాభిషిక్తు నొనర్పవలసినదిగా కోరుచున్నాను" అని తెలిపెను. రాముడంత తనకు నగర ప్రవేశము నిషిద్ధమని తెలిపి సుగ్రీవుని పట్టాభిషేకమునకనుమతించి తాత్కార్య భారము హనుమదాది వీరులే వహింపనాదేశించి శరదృతువున కార్తీకమాసము వఱకు తాను ప్రస్రవణ గిరిలోనే యుండుననియు వానరులానందముగా కాలము గడపి రావణవధాయత్నమునకై తర్వాత తనను చేరరావలసినదిగా తెలిపి వారు కిష్కింధకు వెళ్లుట కనుమతించెను.

సుగ్రీవ పట్టాభిషేక కార్యములన్నియు జాంబవంతాది తోడి వానరులతో కలిసి హనుమంతుడు నిర్వహించెను. అధికారప్రాప్తితో భోగలాలసుడై రాచ కార్యముల విస్మరించి చరించు సుగ్రీవునికి హితబోధ చేయుటకై హనుంతుడే చొరవ చూపెను. రామకార్యమును విస్మరించినచో విపత్కరమగునని గుర్తించియే హనుమంతుడు సుగ్రీవుని చేరెను. తనను ఆప్తునిగా స్వీకరించి తన మాట తప్పక స్వీకరించునను నమ్మకముతో అతనికి హితకరమూ, యథార్థమూ, నీతియుక్తమూ, సామయుతమూ, ధర్మయుతమూ నగు మాటలను చెప్పుటకు పూనెను. సుగ్రీవునే సేవించుచున్నను ప్రస్రవణగిరిలో నున్న రాముని కార్యములను మరువక సుగ్రీవునికి కర్తవ్యమును నిర్దేశించుటలో హనుమంతుని కాలధర్మతత్త్వజ్ఞత, హిత పథ్యయథార్థ నయోక్తి చాతుర్యము, మాధుర్యము మెచ్చదగినవి. 'వానరరాజా, రాజ్యము పొందితివి, కీర్తి లభించినది కాని మిత్రకార్యము మాత్రము నెఱవేరక మిగిలియున్నది. ఇపుడు నీవాకార్యమును నెరవేర్చాలి. కాలమెరిగి యెవడు మిత్రకార్యములకు తగినట్లు వర్తించునో వానికి రాజ్యము, కీర్తి, ప్రతాపములు పెరుగును. ఎవనికి కోశబలము సేనా బలము మిత్ర సుహృద్బలము లుండునో వాని రాజ్యమే పరిపూర్ణాభివృద్ధి గాంచును. నీవు సదాచార సంపన్నుడవు. సన్మార్గప్రవృత్తుడవు ప్రతిజ్ఞచేసిన ప్రకారము మిత్రకార్యము నెరవేర్చుము. మిత్రకార్యమొనర్చువానికి కీడు కలుగదు. అకాలమున కార్యమారంభించినచో ప్రయోజనముండదు. సీతాన్వేషణ కార్యము మన బాధ్యత. ఇప్పటికే కాలాతీతమైనది. సతీవియోగ బాధాతప్తుడైనను రాముడు నీ మనసుననుసరించి పోవునేకానీ కాలాతిక్రమణ

మైనట్లు నీతో అనడు. అతడున్నతవంశ జాతుడు. అప్రమేయ ప్రభావుడు. మనకాప్తుడు. ముందు నీకార్యమాతడు నెరవేర్చినాడు. ఇపుడు నీవు ప్రత్యుప కార మొనర్పవలయునుకదా! కావున సీతను వెదకుటకు వానరుల నాజ్ఞాపింపుము. రాముడే మనలను ప్రేరేపించుటకు ముందే మనకై మనమే ఈ ప్రయత్నము నారంభించినచో కాలాతిక్రమణ దోషము కలుగదు. ఏ ఉప కారము చేయనివారికికూడ తోడ్పడునట్టివాడవునీవు. నీకు రాజ్యశ్రీని కలిగించి మహోపకార మొనర్చినాడు కావున అతని కార్యము నీవు నెరవేర్చి అతనికి ప్రీతిని కల్గించుట యుక్తము. సైన్యములకాజ్ఞ ఇవ్వక ఏల జాగు చేయు చున్నావు? రాముడు సురాసుర మహోరగుల గూడ తన శక్తితో స్వాధీన పరచుకొనగలవాడు. నీవొనర్చిన ప్రతిజ్ఞ నీవే నెరవేర్పవలయుననియే నిరీక్షించు చున్నాడు. తన ప్రాణాలను కూడ లెక్కపెట్టకుండా వాలిని వధించి నీకు సహాయము చేసినవాడతడు. అతని భార్యను వెదకుటకై ప్రయత్నించుము. దేవాసుర గంధర్వాదులే రామునకొక లెక్కలో లేనివారనగా క్షుద్రరాక్షసు లొక లెక్కా? రామునకుపకారమొనర్చుట నీ విధి. భూమ్యాకాశాదులలో, నీటిలో, నిప్పులో ఎదురులేక సంచరింపగల వానరకోటి నీ అధీనములో నున్నది. వారిలో ఎవరేపనిని చేయాలో, ఎలా చేయాలో నీవే నిర్ణయించాలి. వారిని ఆజ్ఞాపించాలి." అని హనుమంతుడు ప్రబోధించగా అతని ప్రభుభక్తి రామదైవతకార్య తత్పరతకు సుగ్రీవుడానందించి నీలుని పిలిపించి సైన్య సమీకరణ మొనర్పవలసినదిగా ఆజ్ఞాపించెను. అంగదుడు జాంబవంతుడు మొదలగు వానరశ్రేష్ఠులను ప్రబోధించి రావలసినదిగా చెప్పి సుగ్రీవుడు మరల సుఖలాలసతో అంతఃపురమున ప్రవేశించెను. సుగ్రీవుడట్లు వెళ్లగా అతడు రామాగ్రహమునకు గురియై కష్టపడునని తలంచి అట్టి దుస్థితి సుగ్రీవునికి కలుగకుండా తాను కనిపెట్టియుండవలెనని హనుమంతుడు భావించెను.

సుగ్రీవుని అలసత్వమును గమనించిన రాముడు లక్ష్మణుని సుగ్రీవుని హెచ్చరించుటకై పంపెను. మద్యపానమత్తుడై మదనక్రీడాలోలుడైన సుగ్రీవుని కీ వార్త తెలుపుటలో అంగదుడు విఫలుడు కాగా లక్ష్మణుని ఉగ్ర రూపము చూచి వానరులంతా వణకి పోతుండగా వాయుపుత్రుడు సుగ్రీవునిచేరి అతని మత్తు వదిలించి కర్తవ్యమును బోధించెను. 'రాజా, వర్షాకాలము పోయి శరత్కాలము వచ్చినందున సీతాన్వేషణమును గూర్చి నీ కర్తవ్యమును గుర్తు

చేయుటకే రాముడు సౌమిత్రిని పంపియున్నాడు. అతడు పరుషంగా మాట్లాడినా నీవు హితమని సయింప దగునేకానీ ఎదిరించి మాటలాడవద్దు. వెంటనే కొలువు తీరి సచివులతో ఆలోచించుము. దోషము నీ యందున్నది. అందుకు తోడు తిరస్కారము గూడ చూపినచో అది మరింత దోషమగును. 'అంజలి పరమా ముద్రా క్షిప్రం దేవప్రసాదిని' అని పండిత వాక్యము. కావున సౌమిత్రికి మ్రొక్కి సభలోనికి ప్రవేశపెట్టుటకు అంగదునే నియోగింపుము" అని చెప్పిన హనుమద్వచనముల విని సుగ్రీవుడు అంగదుని లక్ష్మణుని తెచ్చుటకై పంపెను. సభలోనికి అంగద లక్ష్మణులు చేరులోగా సుగ్రీవునకు హనుమంతుడింకనూ కొన్ని విషయములను విశదమొనర్చెను. "కపీంద్రా, ప్రభువు మేలుకోరు మంత్రులు హితము వచింపవలయును కావున భయము విడిచి "కలతెలుగు" తెలుపుచున్నాను. రాముడు నిన్నాశ్రయించినందున అతడసమర్థుడని నీవు తలంచుచున్నావేమో! అతనికి కోపము వచ్చెనా దేవ రాక్షసాదులతో జగత్తునే వశపరచుకొనగలడు. అతడు మునుపు నీకు చేసిన ఉపకారమునకు నీవు 'మారు మేలు సేయ దలకొనుము' రామాజ్ఞ మీరుటకు నీవు మనస్సులో తలంచవద్దు. నీ హితము కోరి నేను చెప్పిన ప్రకారం చేయుము. నీవు పుత్ర మిత్ర బాంధవ సహితంబుగా రాముని వద్దకు వెళ్ళి నిలువుము. భర్త వద్ద భార్య ఏవిధంగా నిలుస్తుందో ఆవిధంగా నీవు రామునికి రెండు చేతులూ జోడించి అతనికి దాసుడవై నిలువుము." అని హనుమంతుడు తన రాజనీతి పరిజ్ఞానమును విశదపరచుచు సూక్ష్మాతి సూక్ష్మాంశములను సుగ్రీవునికి విశదీకరించి బోధించినందున సుగ్రీవుడు తన కర్తవ్యమును చక్కగా నిర్వహించెను. ఆంజనేయుని ఆలోచనా సరళికి తగినట్లుగా తారను ముందుగా పంపి సౌమిత్రిని శాంతపరచుటా, సుగ్రీవ సౌమిత్రీ సంవాదమూ, నరవానర మైత్రీపునరుద్ధరణ ప్రయత్నమూ, వానర సైన్య సమీకరణమూ సుగ్రీవుడు సాధింపజేసెను.

పరాశర సంహితలోగానీ, పురాణాదులలోగానీ హనుమంతుడు తెర మరగున నుండి కావించిన ఈ కార్యములుగ్గడింపబడలేదు. వాల్మీకిననుసరించి ఆంధ్రీకృత రామాయణములలో నున్నదానిలో అధికాంశములేమియు లేవు. సమీర కుమారవిజయమున కూడ ఈ సన్నివేశము లేదు.

— —

అధ్యాయము - 4

సీ తా న్వే ష ణ ము

అన్వేషణ:

సుగ్రీవుని అజ్ఞానుసారము అంగదుని నాయకత్వమున బయలుదేరిన వానర బృందములో హనుమంతుడు, జాంబవంతుడు, నీలుడు, సుహోత్రి, గజుడు, గవయుడు, సుషేణుడు మొదలగువారితో కలిసి సీతనన్వేషించుటకై దక్షిణ దిశకు వెళ్లెను. ఆ వానరసైన్యమునకు అంగదుడే నాయకుడైనా సుగ్రీవుడు హనుమంతునే పిలిచి "ఓ వానరోత్తమా, నీటిలో, నిప్పులో, నింగిలో, నిర్జరలోకములో నీకు అనివార్యమగు గతి కలదని నాకు తెలియును. సురాసుర దేవ గంధర్వ నర నాగ సంఘములు నీకు తెలియును. గిరి సాగర భూమండలాదులలో నీకు తెలియనిది లేదు. బలంలో, వేగంలో తేజంలో నీవు నీ తండ్రితో సమానము.

ఓ కపిలోకనాథ భవదున్నత తేజము చేతఁ జూవినన్
నీకు సమంబు భూతమవనీస్థలి లేదు, బలంబు బుద్ధి య
స్తోక పరాక్రమంబు గుణదోష విచారణ శక్తి దేశ కా
లైక సదానువృత్తియు నయజ్ఞ తిరంబుగ నుండు నీ యెడన్.

కావున, హనుమా, సీతను సాధించి మరలఁ దేరనుపాయంబీవె చేయవలె'నని కార్యభారాన్నంతటిని సుగ్రీవుడు హనుమంతునిపై పెట్టెను. హనుమంతుడే కార్యసాధన చేయగలడను నమ్మకము సుగ్రీవుడు చూపినందున రాముడు కూడ హనుమంతుడే సీతను వెదకుటలో సఫలమగునని సంతోషించి, తన నామాంకితంబగు ఉంగరమును తీసి హనుమంతున కిచ్చి 'కపీంద్రా, సీతాదేవి నిన్ను చూచి అనుమానముకానీ, భయముకానీ పొందకుండాను నీవు నావాడవని నమ్ముటకునూ ఈ ఉంగరము తోడ్పడును. దీనిని గైకొని కార్యసాధన కావింపుము. నేను నీ బలాన్ని ఆశ్రయించి యున్నాను. నీ పరాక్రమం కొద్దీ ప్రయత్నించి సీతాదేవి లభించునట్లు చేయుము' అని పలుకగా ఆంజనేయుడా

ఉంగరం 'చేకొని మూర్ధమునన్ ధరించి" రామునకు నమస్కరించెను. సీత జాడ తెలిసికొని వచ్చుటకు సుగ్రీవుడు వారికొక నెల గడువు నిచ్చెను.[96]

ఇతర రామాయణముల ప్రకారం: భాస్కర రామాయణమున ఈ సన్నివేశమిదే రీతిగా నున్నను "రఘుసంతానము నా ప్రాణంబులు మానగ గలుగంగ జేయుము మారుత పుత్రా" అని సుగ్రీవుడు హనుమంతుని కోరుట అధిక విశేషము. ఇక ఆనంద రామాయణములో రాముడు తన ముద్రికను ఆంజనేయునకిచ్చి 'రహస్యముగా దీనిని సీతకప్పగింపుము' అని చెప్పి తన మంత్రం ఆంజనేయున కుపదేశించెను. చిత్రకూటమున సీత చెక్కిళ్లపైన, నుదురుపైన పత్రావళులను తిలకమును తాను ఎట్లు రచించెనో మున్నగు రహస్యములను తెలిపి సీతకు నమ్మకమేర్పడుటకై ఆ విశేషములను తెలుపుమనెను. ఆంజనేయుడు రామునికి నమస్కరించి బయలుదేరి రామమంత్రం లక్షమార్లు జపించి, లక్షమార్లు వ్రాసి లంకాయానమునకు తగిన సామర్థ్యమును పొందెను.[97]

సమీరకుమార విజయము ప్రకారము: ఈ కార్యమున సీతాన్వేషణ సన్నివేశము సంక్షేపముగా నున్నది. వానరవీరులను ఆజ్ఞాపించిన తరుణమున శ్రీరాముడు హనుమంతుని పిలిచి —

నావిధమంతయున్ జనకనందనతో వివరించి తొల్తఁ ద
జ్జీవనముద్ధరించి మఱి సీత శుభస్థితి నాకుఁ దెల్పి మ
జ్జీవ విధాయివై మరలఁ జేయుము తండ్రి వివాహ కార్య లీ
లావిధి నీ దయన్ రఘుకులంబు పునర్జననంబుఁ జెందగన్....

అని అలిపెను. సీతకిమ్మని తన ముద్రికనిచ్చెను. ఆంజనేయుడా ముద్రికను

"........భక్తిఁ గై
కొని శిరసావహించి కనుగోనల నుంచి ప్రసాదమయ్య, నే
జని త్రిజగంబులన్ వెదకి జానకి గన్గొని కాని యూరకే
నినుఁ బొడగానరానిదియె నిక్కము స్వామి యటంచు"

మ్రొక్కి వారిని వీడ్కొని సుగ్రీవ లక్ష్మణులచే వంద్యమానుడై సహచర వానరులతో పోగి పర్వతములూ, నదులూ, గహనములూ, గ్రామములూ, పట్టణములూ, నగరములూ వెదకుటకై వెళ్లెను.[98]

వేదరామాయణము ప్రకారం: ఈ కథను శ్రీ దివాకరుని వేంకటసుబ్బ రావుగారు రామాయణము—కిష్కింధకాండ వచనములో వివరించియున్నారు. వానరులలో హనుమంతుడుత్తముడని రాముడు గ్రహించి వానరులారా, మీలో వాయుపుత్రుడగు అంజనేయుడు దేహధరుడు, అగ్రేసరుడు మిత్రకార్య నిర్వాహకుడని గ్రహించి నాకార్యార్థ మతని స్తుతింపుడు. ఈతడు సూర్య దేవుని పండుగా భావించి తన సంకల్పము సంపాదించుకొన్నవాడు. నదులూ, సముద్రాలూ, వృక్షములూ, గిరులూ, బడబాగ్నీ, కల్పాన్తాగ్ని, కాలాగ్ని రుద్రాదులు నక్షత్రమండలము బ్రహ్మాండమునందు గలవు. అట్టి బ్రహ్మాండ మందున్న వస్తుజాతము నంతను సశబ్దముగా నావరించి యున్న రుద్రకర్మార్థ మగు హనుమద్రూపం ఆహ్వానించెను. ఈతడు మహాత్ముడు ఈతని దౌడలు ప్రపంచసంహారము కావింపగలవు. అవి ఒకటినొకటి యంటకుండా చరించు చుండును. ఎప్పుడును నోరు తెరుచుకొనియుండును. దవడలతో నమలకయే నిశ్శ్వాసవేగముననే సర్వమాతని కుక్షిని చేరును. వానర రూపుడైనందున శిరము చాల చిన్నది. కన్నులు లోతుగా గుంటలు పడియున్నవి. హనువుల కదలపకయే జల ఫలాదులను జిహ్వ పొడవుగా చాచి భక్షించును. ఆర్గురు దేవతలు ఈతనికి దూతలచే భోజన పాత్రములను అన్నాది పదార్థములచే నింపి పంపుచున్నారు. గంధర్వాది దేవతలు జోహారు లొసంగుచు బద్ధాంజలులై యున్నారు. హనుమంతుడు మిక్కిలి రహస్యమగు సీతాదేవి సందేశమును తెలిసికొనగోరి భూసంచారము చేసెను. ఆమె ఆత్మయే రావణు నిగ్రహింప భూమధ్యభాగమున గుప్తస్థానమున నివసించుచున్నదని గ్రహించెను. హనుమ సీతను దర్శించుట, వారల సంభాషణమును గ్రహించి రాముడు అంజనేయుని పిలిచి, కపిసత్తమా నా అంగుళీయకము నా నామాక్షరములతో గూడిన దాని నొసగుచున్నాను. సీతకు రహస్యముగా నొసగుము. ఈ కార్యమునకు నీవే ప్రధానుడవు. నీ బలమెల్ల నేనెరుగుదును. నీకు శుభమగుగాక అని అనెను. అంత హనుమంతుడా అంగుళీయకమును గ్రహించి శిరమునందుంచుకొని శ్రీరామ పాదములకు ప్రణమిల్లి "ప్రభూ, నా శరీరము ఆరంగుళములు. నా తోక పంన్రెండంగుళములు. నా బాహువులను చూడుము. సముద్రమును నేనెట్లు దాటగలను. దక్షిణ సాగరమునందు రాక్షసులున్నారు. వారినెట్లు వారింపగలను. అపుడు రాముడతనిని పిలిచి రహస్యముగా అదరమున అతని కుడిచెవిలో 'శ్రీరామ' అను మంత్రా (క్షరముల) నుపదేశించెను. అంత

హనుమంతుడాత్మవిక్రమము గలవాడై శ్రీరామప్రభూ, లంకానగరము నిచటికే కొనివత్తునా; లేక అందలి సైన్యమునెల్ల నాశనము కావింతునా; సముద్రము నరికట్టుదునా; ఆజ్ఞాపింపుమనెను. దానికి రాముడు సంతసించి 'హనుమా, నీ మాటలచే నీ తేజస్సుయొక్క మహత్వము వెల్లడియగుచున్నది. సీత ప్రాణములతో నున్నదో లేదో ఎఱిగిన గానీ ఎట్టి పరాక్రమమును జూపినను ప్రయోజనము లేదు. సీతను దర్శించుట వరకే నీకార్యము. ఆమెను దర్శించి కృతార్థుడవు గమ్మని సూచించెను. రాబోవు లంకా దహనాది కార్యములలో సీతానుగ్రహముతో అగ్నిని అంజనేయునకు ప్రసన్నుని కావించుటకై రాముడట్లు చేసెను.[99]

రామచరితమానస్ ప్రకారము: అంగదుడు తన పినతండ్రిని చూచి 'హనుమంతునకు సప్తసాగరాలూ, సప్తపర్వతాలూ తెలుసు. ఇతడు సరసుడు, బుద్ధిమంతుడు; సీతను వెదకుటకు పోవలసిన వానర, సైన్యమును సంఘటితపరచు బాధ్యత హనుమంతునకు అప్పగించుము.' అని తెలుపగా సుగ్రీవుడట్లే హనుమంతునాదేశించెను. హనుమంతుడు రోహితాద్రి, వ్యాహారగిరి,అంజనాద్రి, నీలాద్రి, హిమాద్రి, వింధ్యాద్రి. అర్జునాద్రి, రుద్రగిరి మేరుగిరి, ధవళగిరి మొదలైన గిరులలో, కదళీవనములో, బదరికాశ్రమములో గల వానరవీరుల నందరిని సమావేశపరిచెను. అంగదుడూ, హనుమంతుడూ శ్రీరామునకూ సుగ్రీవునకూ పాదాభివందనముల జేసి కదలిపోయిరి.[100]

2. కడలిని చేరువరకు కపులు పడిన కష్టములు:

ఈ విషయములు శ్రీమద్రామాయణమే విపులముగావించినది. ఇతర గ్రంథములలో సంక్షేపముగా మాత్రమే కలవు. సుగ్రీవుని సూచనల ప్రకారము హనుమదాదులు సీతకై వింధ్య పర్వత ప్రాంతములలో వెదకిరి. అవుడు మార్గశిర మాసమారంభమై యుండెను. కండువ మహర్షి ఆశ్రమ ప్రాంతములో భీకరాకారుడగు రాక్షసుడొకడు వానరులను మ్రింగవచ్చెను. వానిని అంగదుడు చంపెను. అంతలో వారి కొక బిలము కానరాగా, ప్రవేశించుట కశక్యముగా నున్నదానిని చూచి కపులు భీతిచెందుచుండగా అంజనేయుడప్పుడు వారికి కర్తవ్యము తెలిపెను. "ఇప్పటికి ఎన్నో దుర్గమ ప్రదేశములలో మనము సీతకై వెదకియున్నాము. ఇంతవరకూ మనకామె జాడ తెలియలేదు. మన

కెంతో బడలికయైనది. ఆకలి దప్పులధికమైనవి. ఈ బిలము నుండి నీటితో తడిసిన చక్రవాకములు, హంసలు, బెగ్గురు పక్షులు బయటకు వచ్చుచున్నవి. ఈ గుహలో బావియో మరి తటాకమో ఉన్నది. బిలద్వారమున పచ్చని చెట్లున్నవి. కావున మనమిందులో ప్రవేశించి వెదకుదము" అని తెలిపెను. అపుడు వారు కాంతి గూడ ప్రవేశింప వీలులేని గాఢాంధకారమయమైన ఆ బిలమున ప్రవేశించిరి. అట్లు బహుదూరము పోగా డస్సియున్నవారికి వెలుతురు కనిపించెను. అట్లు పోగా, వారికొక రమణీయమైన వనమును, అందు బంగారు భవనమును కనిపించెను. ఆ భవనములో తపోదీక్షలో నున్న ఒక తాపసి వారికి కనబడెను. ఆమెను చేరుటకు భయపడిన కపులు దూరముననే ఉండిరి.

ఈమారుకూడ ఆంజనేయుడు బాధ్యత తానే పూని ఆ వృద్ధురాలిని సమీపించి ఆమెకు నమస్కరించి "ఓ వృద్ధురాలా, ఈ బంగారు బిలమూ, మణిమండప సౌధములూ ఎవరివి? నీవెవరవు? మేము మార్గాయాసమొంది ఆకలిదప్పులచే పీడింపబడి, జలాదులుండునని తలంచి ముందువెనుక లాలోచింపక ఈ బిలములో ప్రవేశించినాము. దీనిని చూచి ఆశ్చర్యముతో దిక్కు తెలియక దుఃఖించుచున్నాము. ఇచట శుచికర భోజ్య పదార్థములు, బంగారు చెట్లు, ఫలావళులు, రజితగృహములు, బంగరు కిటికీలు విమానములు, బంగరు కమలములు, కచ్ఛపమీనములు గల కొలనులున్నవి. ఇవి నీ ప్రభావ నిర్మితములా? పూర్వము మరి యెవరి తపమువలన నైనా ఇది యేర్పడినదా! ఇది మాకు తెలియదు కావున సవిస్తరముగా తెలుపవలసినది" అని ఆ తాపసిని ప్రార్థించెను.

ఆ తాపసియే స్వయంప్రభ. ఆమె తన వృత్తాంతమునూ మయునిచే నిర్మింపబడిన అచటి భవన విశేషములను బిలమందలి వైచిత్రిని తెలిపి తన ఆతిథ్యముతో వారి ఆకలి దప్పుల తీర్చి వారా బిలమందేల ప్రవేశించిరో తెలుపమని కోరెను. అంత హనుమంతుడామెకు సీతారాముల కథను తెలిపి సీతాన్వేషణలో తామా బిలమున ప్రవేశించినట్లు వివరించెను. అచటి ఫలముల తినుటకనుమతించిన ఉపకారమునకు ప్రత్యుపకారమేమి చేయవలయునో అని పావని ప్రశ్నించెను. తనకేలాటి ప్రత్యుపకార మక్కర లేదని స్వయంప్రభ చెప్పెను. అంత ఆంజనేయుడు "తల్లీ, నీకు ఋణపడి యున్నాము. ఇపుడు నీవే మాకు దిక్కు. సుగ్రీవుడొసగిన వ్యవధి దాటినది. మేమిక్కడనే చిక్కు

కొనిన సుగ్రీవుడు విధించు శిక్షకు పాత్రులము కాక తప్పదు. మమ్మేటులైన ఈ బిలమునుండి బయటకు చేర్పుము" అని ప్రార్థించెను. ఆమె తన తపో మహిమచే వారిని వింధ్య పర్వతస్థ పశ్చిమ సాగరతీర ప్రాంతానికి చేర్చి వారి సెలవు పొంది వెడలిపోయెను. అచటి మామిడిచెట్లు పుష్పించి యుండుట వారు గమనించి శిశిర ఋతువు వచ్చినట్లుగా గుర్తించి కాలాతిక్రమణమైనందున సుగ్రీవుని దండనకు గురి కాక తప్పదని భయపడసాగిరి. వారి పరిస్థితిని గమనించి అంగదుడు తమకు ప్రాయోపవేశమే కర్తవ్యమని పలుకగా, వానరు లందరు తమ కర్తవ్యమును చర్చించిరి. అపుడు తారుడు అంగదుని సమర్థిం చుచు తామెల్లరు మరల స్వయంప్రభ తపము చేయు బిలములో ప్రవేశించినచో సుగ్రీవుని దండన భీతి లేక జీవింప వచ్చునని చెప్పెను. వానరులా మాటల కామోదము తెలిపిరి. కాని ఆంజనేయుడు మాత్రము వారి నిర్ణయము దోష యుక్తమైనదని పలికెను. అయిననూ అంగదుడాతని పలుకులను నిరాదరించి తన పినతండ్రి దుర్గుణము వివరించి ప్రాయోపవేశ నిర్ణయమును పునరుద్ఘా టించెను. అంగదునితో వాదమును పెంచక మౌనముగా నుండి, తర్వాత అంగదుడు సుగ్రీవునకు ప్రతిద్వంద్విగా వానర రాజ్యము నెట్లు స్థాపించినను అది వారిని రక్షింపజాలదనిన్నీ, జాంబవంతునితోపాటు తనవంటి వానర ప్రముఖులు సుగ్రీవుని వదలి రాజాలమనిన్నీ, వానరులు చపలచిత్తులగుట వలన కళత్రపుత్రాదుల వియోగము నోర్చి జీవింపజాలరని వారి ప్రయత్నము నెరవేరుట దుర్లభమని స్పష్టపరిచెను. కాని అంగదునే అనుసరించు వానరులు ప్రాయోపవేశమునకే సిద్ధపడిరి.

వింధ్య పర్వత ప్రాంత గుహవద్ద వానరులు దర్భలు పరచుకొని ప్రాయోపవేశ మొనర్చుటకై అంగదుననుసరించగా ఆంజనేయుడు మౌనముగా నుండెను. ఆ గుహ సమీపములోనున్న సంపాతి అను గృధ్రరాజు వారిని చూచి ఆహారార్థమై వారిని చంపుటకు వచ్చెను. వానరుల ప్రసంగములో సీతారాములకథ, జటాయువధ వినిన సంపాతి తనకు నిశాకరమహర్షి యిచ్చిన శాపమును తెలిపి తానెప్పుడు సీతారాముల వృత్తాంతము వినునో అప్పుడు తనకు రెక్కలు వచ్చునని మునివాక్యము తెలిపుచుండగానే అతనికి రెక్కలు వచ్చెను.

సంపాతికి రెక్కలు వచ్చుట తమకు శుభసూచకముగా భావించి అతని ఆశీస్సులపొంది వానరులు దక్షిణ సముద్రతీరము చేరిరి. సంపాతి వచనము

ప్రకారము లంకలో సీతనన్వేషించుటకు సముద్రమును తరింపవలసి యున్నందున వానరవీరులు తమతమ లంఘన సామర్థ్యము నుగ్గడింపసాగిరి. లంకకుగల నూరుయోజనముల దూరముగల సముద్రమును దాటుటకు జాంబవంతుడు తనకు తొంబది యోజనముల వరకు వెళ్లగల శక్తి మాత్రం కలదనెను. అంగదుడు తనకు నూరు యోజనముల నెగురగల శక్తి యున్నను తిరిగి వచ్చుటకు శక్తి చాలదనెను. అంత వానరులు మరల తమకు ప్రాయోపవేశమే శరణ్యమని తలంచగా జాంబవంతుడు "మన బృందమునకు అంగదుడు నాయకుడు. ఇతడు యువరాజు. సేవకులుండగా రాజు స్వయంగా కార్యభారం పూనరాదు. వారిమాట కర్తవ్యంగా"దని పలికెను. ఆ తర్వాత ఏకాంత ప్రదేశమున మౌనముగానున్న ఆంజనేయునిచేరి సాగరలంఘనమునకై సామీరిని ప్రోత్సాహపరచుటకై ఇట్లు పలికెను. "వానరవీరా! నీవు సర్వశాస్త్ర విదుడవు. మేము ఏవేవో ఆలోచనల చేయుచుండగా నీవేల మౌనము పూనితివి? బల పరాక్రమములలో రామలక్ష్మణ సుగ్రీవులకు సమానమైనవాడివి. పక్షీంద్రునితో తుల్యమైన జవసత్త్వములుగల నీవు లోకమునందలి వారికన్నా ధీ బల పరాక్రమ ధైర్యాదులలో మిన్నవైకూడ నీ శక్తినే నీవు ఎఱుగవా! నీవు కారణజన్ముడివి. పుంజికస్థల అను అప్సరస అంజనగా జన్మించి కేసరి పత్నియై వాయుదేవతా ప్రసాదమున నిన్ను పొందినది. పసిబాలునిగా నున్నప్పుడే నీవు ప్రభాకరబింబమును పండని పట్టబోయిన వీరునివి. బ్రహ్మాది దేవతల వరముల పొందినవాడవు. ఆపదలోనున్న మమ్ము కాపాడవలసిన బాధ్యత నీదే" అనియు, మరియు

ఈవన సర్వసద్గుణ సమేతుడవో ప్లవగాగ్రణీ ధరన్
లావున దూరలంఘనకళా విభవంబున నీవ మేటివిన్
నీవలె నేగ నేదియును నేరదు భూతచయంబులందు నే
డీవెస నీ విజృంభణము నేపును జూపగదయ్య మారుతీ

అని ప్రేరేపించగా జాగరితుడైన హనుమంతుడు తన మేనుపెంచి తన బల పరాక్రమాది శక్తులదెల్పి విజృంభింపబూనెను. అపుడాంజనేయుని ముఖము ఎఱ్ఱగాకాలిన పెనమో, ధూమవిరహితమగునగ్నియో అనునట్లుగా నుండెను. అది చూచిన వానరులతనిని పొగడిరి. పర్వతగుహలో సింహము విజృంభించు విధముగా తోకను జాడించుచు పెరుగసాగిన అతని రూపమునకు వానధులా

శ్చర్యమొందిరి. వానరబృందస్తోత్రమునకు పులకరించిన శరీరముగలహ ను మంతుడు అచట తనకన్న పెద్దవారగు వానరవీరులకు నమస్కరించి తన శ క్తి సామర్థ్యములనిట్లు వివరించెను.

వానరవీరులారా వినుడు. నా తండ్రి వాయుదేవుడు, అగ్నిసఖుడు. పర్వతశిఖరముల పెల్లగించగల బలాఢ్యుడు. నేనాతనికి దీటైనవాడిని దాటుటలో నాకు సమానుడెందునూలేడు. నేను కొంచెమైన విశ్రమించక మేరు పర్వతానికివేయిమార్లు ప్రదక్షిణమొనరించగలను. హ్రదకాంతార గిరియుక్తమౌ లోకాలపై సముద్రములోని నీళ్లనుచల్లి కప్పివేయగలను. నా గమనవేగము వలన పుట్టిన గాలికి సముద్రములోని మహాగ్రాహములనాకాశమున కెగురునట్లు కావింపగలను. ఆకాశసంచారియైన గరుత్మంతునికి ప్రదక్షిణ మొనరింతునా! ఉదయభానునిచేరి ఆయన అస్త్రాద్రి చేరులోగా నేనే అతనికన్నా ముందే ఆ గిరినిచేరి అతడు ఆకాశమధ్యానికి చేరులోగా ఎదురు రాగలను. ఆకాశ గోచరమగు భూతములనెల్లను వేగములో మీరగలను. సముద్రం శోషింప జేయుదునా! కొండను చేతితో పిండిచేయనా! నా ఊరువుల వేగానికి నీరధియే నా వెంట వచ్చునట్లు చేయనా! నన్నేమని భావించినారో! నేను ఆకాశానికి ఎగిరినచో లతావృక్షాదులలోని పుష్పాలన్నీ నా వెంట కొట్టుకొని రాగలవు. అపుడది స్వాతీనక్షత్ర సహితమగు ఆకాశంవలె నొప్పును. నా వేగము మీరు కూడ చూడగలరు. మేఘాలు చెల్లాచెదరై గిరులు చలించుచు, సముద్రాలు క్షోభించుచుండును. నిముషాంతరంలో నేను ఆకాశంలో నిరాలంబంగా ఎగుర గలను. త్రివిక్రమావతారుడగు విష్ణువవలె నా ఆకారము భయంకరమై యుండును. సీతాదేవి కనరాలేదను చింత మానుడు. నేను నా బుద్ధిబలంతో చూచి వచ్చెదను. నేనధిక వేగంతో వేయి యోజనాలైనా దాట గలను. ఇంద్రబ్రహ్మాదుల గెలిచి అమృతభాండమునైనా తేగలను. లంకనే నేను పెల్లగించుకొని రాగలను." అని చెప్పు హనుమంతుని మాటలలాలకించు వానరులాశ్చర్యపడుచుండగా. జాంబవంతుడు మరల హనుమంతునితో నిట్లనెను. "అంజనేయా, వానరుల దుఃఖమును పోగొట్టుచున్నావు. నీవు ప్రయత్నించు కార్యం నెరవేరాలని వీరు శుభముల పలుకుచున్నారు. ఋషుల, కపివృద్ధుల, గురువుల అనుగ్రహముతో నీవీ సాగరమును తరింపుము. నీవు తిరిగి వచ్చు వరకు మేము ఏకపాదమున నిల్చి యుండెదము. కాన ఈ

వానరులందరి ప్రాణాలు నీ చేతిలో నున్నవి." అని ప్రోత్సహించు జాంబవంతుని వాక్యాలాలకించి తానెగురుటకు పూనబోవుచు వానరులను చూచెను.

"వానరులారా, నేను పైకెగురుచో ఈ భూమి నా వేగమును భరింపజాలదు. ఈ మహేంద్రగిరి గొప్ప రాళ్లతో నిండి స్థిరమైన శిఖరముల కలిగియున్నది. ఇది నా వేగము సహింపగలదు." అని చెప్పి ఆంజనేయుడు దానిని అధిరోహించెను. అపుడాతని పాదతాడనముచే నలిగిన ఆ పర్వతశిఖరములు సింహముచే కొట్టబడిన మదగజముల వలె నుండెను. దాని శిలోచ్చయములు జలముల స్రవించెను. అందలి మృగపక్షి జంతు సంతానములు భయముతో పారిపోసాగెను. మధుపానాసక్తులగు నాగ, గంధర్వ, విద్యాధర మిథునములు ఆకాశమున కెగిరిరి. పక్షులు ఒకటితో నొకటి ఢీకొట్టుకొనుచుండగా, గిరి రంధ్రములలో నుండి సర్పములు సగము బయటకు వచ్చి పడగలు విరిచి నిట్టూర్పులు పుచ్చుచుండుటచే అవి ఆ కొండకు కట్టిన ధ్వజములవలె నుండెను. అప్పుడే లంకాపురమును తాను మానసికముగా చేరినట్లుగా భావించుచు హనుమంతుడు సముద్రమును లంఘించుటకుద్యుక్తుడయ్యెను.[101]

భాస్కరరామాయణము ప్రకారం: మూలములో నున్నట్లే ఇందున్నను ఆంజనేయుడధిక ఆత్మవిశ్వాసముతో పలికిన పలుకులు విశేషము.

అరుదారం బదివేల యోజనములుద్యచ్ఛక్తిమై దాటెదన్
ధరణీ పుష్కర చక్రముం దిరిగెదన్ దంభోళి వీర్యత్వరం
గర యుగ్మంబున ఋష్యమూకమును లంకాద్వీపముం బట్టి స
త్వరభంగిం గొనివచ్చి యిచ్చటనే సీతారాములం గూర్చెదన్.[102]

శ్రీమద్రామాయణ కల్పవృక్షమున ఈ సన్నివేశమున జాంబవంతుని పలుకులింకను రమణీయముగా నున్నవి.

బలముచే బుద్ధిచేత సత్త్వంబు చేత నధిక
తేజస్సు చేత నీ యంత వాడు
వెలగు త్రైకాలికంబైన సృష్టియందు
గాన రాడయ్యె మేలుకో కపిమహేశ.

....

....

ఉదయత్పూర్యుని దొట్టి యస్తమయ సూర్యుండైన దాఁకన్ సదుల్
చదువన్ దోఁజన మిన్ను నందెవనికో సాధ్యమ్ము దానట్టి నీ
కిది యేపాటిది గోఁటిమీఁది పని మమ్మో యల్ప వారాశియం
దదయత్వంబున ముంపకే సకలవిద్యాభారతీ మారుతీ[103]

సమీరకుమారవిజయమున: సంక్షేపముగా నున్నను సారవంతముగా నున్నది. వానరసైన్యము తిరిగితిరిగి సాగరతీరము చేరిన తర్వాత కపులు కడలిని దాటలేక అడలి తమతమ అలవుల లెక్కించుకొనుచో జాంబవంతుడు హనుమంతుని చేరి "ఘనసత్త్వ సత్వర క్రమ నిరూఢి మొదలగు గుణములలో సముద్రుని వంటి దానివైన నిన్ను ఈతడు ప్రతిఘటించుచున్నాడు. వీనిని భంగమొందించి నీకీర్తిని విస్తరింపుము" అని కోరెను. అందుకాంజనేయు డంగీకరించి—

"..................... కపులార దుస్తరమైన తో
యనిధిం దాటెద లంక మీటెదఁ దృణప్రాయంబుగా జానకిం
గని వే వచ్చెదఁగానకున్న జలధుల్ గాలింతు భూలోక మె
ల్లను దూలింతు నుడుప్రకాండమిల వ్రాలన్ వంతు నాకాశమున్"

—అని పలికి వెంటనే బాహాస్ఫాలనమాచరించి, నిజరూపాన్ని పెంచి, తోకను మస్తకాగ్రమున హత్తించి, తేజస్సుతో మెరిసి వార్ధిని జూచుచు గరుడ వాయు వేగములతో మించి రాముని ధ్యానించి ఎగురుటకై సమీపగిరి నెక్కెను. ఆ శిఖరాగ్రభూమిని త్రొక్కిపట్టి రెండు చేతులను దక్షిణపు దిశగా సారించి అతడు చివుక్కున దాటగా, తన కూతురును చూడగా వాంఛించిన భూదేవి అనుసరించెనో అనునట్లు భూ పరాగం వెంట నంటెను. అపుడు పర్వతాలెన్నో భగ్నమయ్యెను. అవనిజ నన్వేషింపబోవు నాంజనేయున కాహారముగా దగు ఫలముల నందించవలె నను తలంపుతో కొన్ని చెట్లు లేచి దశాస్యుని భయము వలన ముందుకు పోజాలక అతని గమనానిల ప్రభావమునకు క్రింద పడినవి. హనుమద్వీరుని సింహగర్జనలకు అచటి గిరులు "సురలార, సీత జాడ తెలుసు కోడానికీ, రావణుని గర్వం అణచడానికీ హనుమంతుడు వెళ్లుచున్నాడు కావున ఇక మీరు భయముల నొందకండి అని" అనునట్లుగా ప్రతిధ్వనించినవి.[104]

'రామచరితమానస్'లో: "నీవు శ్రీరామ కార్యసాధనకే జన్మించితివని" జాంబవంతుడనగానే హనుమంతుడు కొండంతవాడై సముద్రం లంఘించడానికి త్వరపడెను.

3. సమీరకుమారుని సాగరలంఘనము:

వాల్మీకి మహర్షి యీ ఘట్టమును విశదమనోహర భంగిని విపులముగా వర్ణించి యున్నాడు. ధరాత్మజాతపదమును వెదకుటకై గురుచరణ మార్గమున పోదలంచిన హనుమంతుడు తాను పోవలసిన మార్గాన్ని మెడ నిక్కించి చూచెను. తన కార్యమందలి పరమోత్కృష్టత నూహించుచు ఆ పర్వతమందలి పచ్చికపట్టులలో నిటునటు పచరించసాగెను. పక్షులనదలించుచు మృగపక్షి సంతతుల బెదరించుచు తిరిగెను. అపుడతని కర, పాద, తాడనల వలన చెట్లు నేలకొరిగెను. వివిధ వర్ణ ధాతుకోటితో నతిశయించు నానావిధ అలంకారయుతులగు యక్ష కిన్నర సుపర్వనిభ, అహి, నిర్ఝరీవిసరములతో హృదయంగమమగు నా కొండపై మడువులోని ఏనుగుల మధ్య విచ్చలవిడి సంచరించు గజరాజువలె తిరిగెను. తన కార్యసాఫల్యమునకై సూర్యునకు, ఇంద్రునకు, వాయువునకు, బ్రహ్మాది దేవతలకు నమస్కరించెను. మరల తూర్పువైపు తిరిగి సముద్రాన్ని దాటుటకై తన శరీరాన్ని పెంచడానికి ప్రారంభించెను. మేను పెంచి కాళ్లతోను చేతులతోను ఆ కొండ నూగించెను. దానివలన అందలి చెట్లు పూలను జలజల రాల్చగా అది పూల పర్వతమా అనునట్లుండెను. మావటివానిచే కొట్టబడిన మదగజము మదజలమును విడిచినట్లు ఆ కొండ నీటి వంకలను ప్రవహించెను. అతని తాకిడికి సువర్ణరజతాది లోహములు గల రాళ్ల రేఖలను కనబరచెను. అగ్నిజ్వాలలనుండి పొగలు వెల్వడునట్లు మణిశిలల నుండి గొప్పగొప్ప రాళ్లు వెల్వడెను. గిరి కంపించగా అందలి భూతతతి వికారధ్వనితో రోదించగా ఆ స్వరము భూమ్యాకాశాలు నిండెను. వాతాత్మజుని పీడనమునకు నలిగిన పర్వతమందలి సర్పములు నలిగి స్వస్తికాది చిహ్నములు గల తమ పడగల విప్పి ఆ కొండరాలను కోపించి కరువగా వాటి విషాగ్ని సెగల కవి వేయి ముక్కలయ్యెను. విషఘ్నములగు నగ్గిరి యోషధులా విషముల నణచలేకపోయెను. ఆ పర్వతము తత్సంబంధిత పృథివ్యప్తేజో వాయ్వాకాశంబులతో గూడ పగులునేమో నను భయముతో ఋషులు ఆకాశమును చేరిరి. భయార్తులై విద్యాధరులు తమ కాంతలు వెంటరాగా విలువైన తమ ఆహారపానీయములను పాత్రలతోను, తమ ఆయుధములను అక్కడనే వదలి ఒడలెరుంగక ఆకాశానికెగిరిరి. వారందరు అపుడు "అప్ర

మేయుడగు అంజనేయుడు రామార్థమై దుష్కరమగు సముద్రలంఘన కార్యమునకు పూనుకొనెను" అను మాటలు వినబడెను.

ఎగురుటకుద్యుక్తుడైన హనుమంతుడు తన వెంట్రుకలను విదిర్చెను. మేఘమువలె గొప్ప ధ్వనితో గర్జించెను. వెండ్రుకలతో నిండి గుండ్రముగా నుండు తన తోకను పక్షీంద్రుడు పాముల విదిల్చినట్లు విదిలించెను. ఆ తోక అతని వీపుపై గరుత్మంతుడు పట్టుకొన్న పామువలె మెరయసాగెను. ఇనుప గుదియల వంటి తన బాహువులను స్తంభింపజేసి, భుజములు, మెడ, ముడుచుకొని, మోకాళ్లు ముందరివైపు వంచి, పాదాలనొకటిగా చేర్చి ముడుచుకొని చెవుల స్రుక్కించి, పెదవులు బిగించి నడుము లోపలికి తీసుకొని, కంటిరెప్పలు పైకెత్తి దూరమునందు దృష్టి నిలిపి పర్వతమునందు కాళ్లు బిగదన్ని, శ్వాస బిగించి తన కార్యాన్ని తలంచి తనకున్న బలపరాక్రమము నంతయు పూని కుప్పించి యెగయ బూనినవాడై తనకు సమీపముగ నున్న వానర ప్రముఖులతో

చెచ్చెర వాయువేగమగు శ్రీ రఘురాము శరంబునట్లు నేఁ
జొచ్చెద లంక నందు నృపసుందరి గన్పడకున్న నాకముం
జొచ్చెద నిట్లె నందు సతి జూడమి గల్గినఁ గట్టి రావణుం
దెచ్చెద నెట్టులైన నృపుదేవిని దోడ్కొని వచ్చెదం జుఁడీ.

అని పౌరుషముగా పలికి సెలవొంది చివాలున ఎగసి పోసాగెను. (సుందర కాండము 1వ సర్గలో వాయుపుత్రుని వ్యోమయాన వర్ణనను చూడదగును.)

ఆకాశమున పోవు అంజనేయుడపుడు అద్భుత దర్శనుడయ్యెను. అప్పుడతని నీడ పరిమాణము పదియామడల వెడల్పును ముప్పది యామడల నిడివిని కలిగి సుందరముగా కనబడెను. ఆధారమేదియు లేక ఆకాశమున పోవు హనుమంతుడు రెక్కలున్న పర్వతమువలె కానవచ్చెను. హనుమంతుడు గమించు మార్గమందలి సముద్రము ఆ క్షణములో నడుమ పల్లమై ఈవల ఆవల ఎత్తుగా నుండు తొట్టివలె చూపట్టెను. రామకార్యార్థియై పోవు అతని సాహసమును జూచి దేవ గంధర్వాదులు పుష్పవర్షము కురిపించుచు స్తుతించిరి. అతనికి సూర్యుడు తన వేడిమిని చూపడయ్యె. వాయువు అతనికి అనుకూలముగా వీచెను.

తనకు సగరుడొనర్చిన మేలును స్మరించి ఆ వంశీయుడగు రాముని కింకరునకు తోడ్పడుటకై సముద్రుడు తనలో నుండిన మైనాకుని సంబోధించి యిట్లు పలికెను. "సువర్ణ శిఖరములు కల ఓ మైనాకుడా, ఇక్ష్వాకు వంశస్థులు నాకు పూజ్యులు. నీకును అట్లేకదా. రామకార్యార్థమై పావని యిపుడు ఆకాశమున ఎగురుతూ పోవుచున్నాడు. ఇపుడతడు మనకు అతిథి. అతనిని సత్కరించుట మనవిధి. నీవు యథేచ్ఛగా ఎటు కావలసినచో అటు పోగలవానివి. నీవు పైకి లేచినచో నీ శిఖరాలలో విశ్రాంతికై హనుమంతుడు కొంతసేపు నిల్చి తర్వాత తన ప్రయాణము కొనసాగింప గలడు. కావున శీఘ్రముగా పైకి లేచి రమ్ము" అని పలుకగా మైనాకుడట్లే అని తన బంగారు శిఖరములతో పైకి లేవగా 'ఆకాశము మొత్తము బంగారు కాంతితో నిండెను. సూర్యకాంతి నిభమైన ఆ శిఖరములు తన కవరోధముగా లేచుచున్నవను భావముతో హనుమంతుడు హుంకరించి తన రొమ్ముతో ఢీకొట్టగా మైనాకుడు విలపించుచు శోషిల్లెను. ఆ దెబ్బకు కొంతదూరం కొట్టుకొనిపోయి, హనుమంతుని జవసత్త్వములకు సంతసించి మానవాకారము పూని హనుమంతు నుద్దేశించి "మహాత్మా, అనన్య సాధ్యమైన నీ సాహసమును నేనేమని పొగడగలను? నీ బలము, నీ వేగము అద్భుతము. నావంటి పర్వతాన్నే అవలీలగా త్రోచినావు. ఎవరికినీ చేయనలవికాని పనిని నీవు సాధింపనున్నావు. నీవు నా శిఖరములందు కొంతసేపు విశ్రమించి నీ అలసట తీర్చుకొనుము. సగరుని మేలును స్మరించిన సాగరుడు తద్వంశీయుడగు రామునికి మేలొనర్పదలచి నీవాతని భృత్యుడవైనందున నీకు తోడ్పడదలచి యున్నాడు. నీవు నా శిఖరములపై వ్రాలి, సేదదీరి, నాలోని కందమూలముల భక్షించి ఆతర్వాత నీప్రయాణము సాగించి నన్ను ధన్యత నొందింపుము. తాను పండితుడైనా, తన కడకతిథిగా వచ్చిన మూఢునైనా పూజింప వలెనని శాస్త్రవాక్యము అట్టిచో నీ వంటి ధర్మజ్ఞుడు దొరికినచో పూజింపకెట్లుండదగును? అదీగాక, నీవు దేవతలలో మేటియగు వాయుదేవుని పుత్రుడవు. నిన్ను పూజించినచో నీ తండ్రిని పూజించినవాడనగుదును. అంతేకాక, నిన్ను పూజించుటకింకొక కారణము గూడ కలదు. కృతయుగములో పర్వతములకు రెక్కలుండి అవి విచ్చలవిడిగా సంచరించుచుండెడివి. ఆకాశమున వెళ్లుచో దేవ ఋషి గణములు అవి తమపై పడునేమో అని భయపడుచుండగా ఇంద్రుడు వాటి రెక్కలను తన వజ్రముచే

ఖండించెను. ఆ దెబ్బ పొందకుండా నీ తండ్రియగు వాయువు నన్ను సముద్ర మున పడవేసి నాకు రెక్కలు పోకుండునట్లు రక్షించెను. అందువలన సముద్రునితో పాటు సమీరుడు కూడ నాకు పూజార్హుడై యున్నాడు. కావున సముద్రునితో కలిసి అందించు మా ఆతిథ్యము నంగీకరించి మా మైత్రిని ధన్యమగునట్లు చేసి సేదదీరి వెళ్లుము" అని ప్రార్థించెను. అపుడు హనుమంతుడు "పర్వతోత్తమా, నీ ఆదరణ వాక్యముల వలననే నాకు ఆతిథ్యము లభించినట్లైనది. కార్యము పూర్తి అగువరకు నేను త్రోవలో నెచ్చటను నిలువనని ప్రతిన చేసి యున్నాను. చేయవలసిన పని యెంతో ఉన్నది. ప్రొద్దుండగానే నేను లంకకు చేరాలి. సముద్రమధ్యంబున నేను నిలువరాదు." అని పలికి తన చేతితో ఆప్యాయముగా మైనాకుని స్పృశించి అనుజ్ఞవేడెను. అంత సముద్రమైనాకులతనికి 'కార్యసిద్ధి యగుగాక' అని ఆశీర్వచన మిచ్చిరి. అంత హనుమంతుడు తన ప్రయాణము సాగించెను. రామకైంకర్య నిష్ఠా దీక్ష గల పావని ఆతిథ్య విశ్రాంతి రూప వాక్యములకు లొంగక, నిద్రాహార విశ్రాంతు లెఱుగక కార్యసాధనకై గట్టి మనో నిర్ణయముతో సాగిపోవుటను చూచి ఋషులును, సిద్ధులును అతనిని మెచ్చుకొనిరి.

హనుమంతుని బలపరాక్రమముల తెలియగోరి నాగమాతయగు సురసను పిలిపించి దేవతలూ ఋషులూ ఇట్లామెతో పలికిరి. "సముద్రముపై ఒంటరిగా సాహసించి పోవు పావనికి దైత్యరూపమున అడ్డుపడవలసినది. ముహూర్త మాత్రమాలస్యము" అని అనినవారి ఆదేశానుసారం సురస పెద్దకోఱలతో, ఆకాశానికి సరివచ్చు నోటితో ఎఱ్ఱని కన్నులతో అతిభీకర వికార రూపము ధరించి హనుమంతుని దారికి అడ్డు పడెను. ఆమె హనుమంతుని చూచి 'వానరేంద్రా! నిలువుము. దేవతలు నిన్ను నాకాహారముగా కల్పించినారు. నన్ను మీరి నీవు పోజాలవు. నేను నిన్ను మ్రింగబోవుచున్నాను. నీవింక ముచ్చటలు మాని నానోట పడుము' అని చెప్పగానే హనుమంతుడు ఆమె నిజమైన దైత్యాంగన కాదని ఆత్మతో నిర్ణయించుకొని ఆమెకు నమస్కరించి సీతారాముల వృత్తాంతమూ తాను వెళ్లబోవు కార్యావసరము తెల్పి రామరాజ్య మందున్న ఆమె కూడ రామకార్యమునకు తోడ్పడుమని ప్రార్థించెను. సురస ఆమోదము రానందున 'తల్లీ, సీతజాడ తెలిసి వచ్చి నీకు ఆహారమయ్యెదను నన్ను నమ్ముము' అని పలుకగా, 'ఓరీ, నన్ను అతిక్రమించి పోవుట కెవ్వరికిని

సాధ్యముకాదు. నాకట్టి వరము దైవప్రసాదము. కావున నీవు నాకాహారము కమ్ము" అని నూరుయోజనములంత విశాలముగా పెంచిన తన నోరుతెరచెను. అంత మారుతి బొటనవ్రేలి యంత రూపము ధరించి ఆమె నోట ప్రవేశించి ఆమె నోరు మూయులోగా ఈవలకు వచ్చి, ఆకాశమున నిల్చి "అమ్మా, దాక్షాయణి నీకున్న వరమునకు తగినట్లు నీనోట పడినాను. నా నమస్కార ముల గ్రహించి నాపై కనికరించి సీతను వెదుకబోవు నా ప్రయత్నమునకు మేలు కలుగునట్లు నన్ను అనుగ్రహింపుము" అని పలికినంత సురస సంతో షించి తన భీకర రూపము వీడి నిజరూపము గ్రహించి 'నాయనా, రామకార్యా ర్థమై నీవు యథేచ్ఛగా వెళ్లుము. నీకన్నీ సుకరముగా నెరవేరగలవు" అని పలికి ఆమె వెళ్లిపోగానే దేవతలు హనుమంతుని యీ సమయోచిత ప్రజ్ఞకు సంతోషించి పొగడిరి. అంత నిరాధారమగు అంబరవీథిలో ఆంజనేయుడు తన సాగరలంఘనమును కొనసాగించెను.

ఆ సముద్రములో 'సింహిక' అను ఒక రాక్షసి పైనపోవు హనుమంతుని చూచి తన కిన్నాళ్లకు ఆహారము దొరికినదను సంతోషముతో నీటిలో పడిన హనుమంతుని ఛాయను పట్టి లాగెను. 'ఎదురుగాలికి గొప్ప ఓడ ఈడ్వబడి నట్లు ఈ పరాక్రమము నెవరో అడ్డగించుచున్నారు" అని ఆంజనేయుడు గ్రహించి పైకి, క్రిందికి, ప్రక్కలకు చూచెను. మహాకాయము గల సింహిక అతనికి కనపడెను. సుగ్రీవుడు తనను హెచ్చరించిన ఛాయాగ్రాహి అను అంగారక గ్రహముగా దానిని గుర్తించి దానిని నిర్జించు ఉపాయమాలోచింప సాగెను. దాని రూప తత్త్వముల నెఱుంగ గోరి ఆంజనేయుడు తన కాయము పెంచెను. ఈ సంగతి గమనించి ఆ రాక్షసికూడ తన నోటినీ, దేహాన్నీ పెంచసాగెను. అప్పుడు హనుమంతుడు దాని ఆయువుపట్లను గమనించెను. సూక్ష్మరూపము పూని నోటిద్వారా శరీరమున ప్రవేశించి దాని జీవస్థానము లను తన వాడియగు గోళ్లతో వ్రచ్చి అది తన నోరు మూసేలోగా వెల్వడి తన శరీరమును పెంచెను. లోన గుండెలు నలియగా అది స్మృతి తప్పి నీటిలో పడి చనిపోయెను. ఆకాశసంచారులగు దేవతాదులు ఆంజనేయుని యీ సాహసమును మెచ్చి పొగడి మంగళాశాసనమొనర్చిరి.

అవలి తీరమునకు చేరువ యగుచో నూరు ఆమడల దూరమున అతనికి అడవుల గుంపు కనబడెను. లంకాద్వీపమందలి మలయ పర్వత వనరాశి

ఆకాశము నుండియే ద్యోతకమయ్యెను. నదులు సాగరమును చేరుట అతనికి కనిపించెను. దిగబోవుచు మారుతి తన దేహము ఆకాశమావరించి పెరిగి యుండుటను గమనించెను. అట్టి తన రూపమును వేగమును రాక్షసులు చూచి హాహాకారములు చేసినచో కార్యభంగమగునని తలచి విశ్వరూపాన్ని విరమించిన వామనుని వలె తన దేహాన్ని తటాలున చిన్నదిగా చేసెను. శిఖరములతో, మొగలి పొదలతో, నారికేళ వృక్షములతో గూడియున్న లంకాద్వీపాన్ని చూచి త్రికూట పర్వత శిఖరస్థమగు ప్రాంతముపై వ్రాలెను. అతడు దిగు చుండగా జింకలు పక్షులు భయపడినవి. ఆ పర్వత శిఖరముపై నుండి అమరావతీ పట్టణమును పోలిన ఆ లంకను హనుమంతుడు చూచెను.

ఇట్టులు నూరామడ యొక
పెట్ట వడిందాటి బాహు విక్రమపరుడై
నిట్టూర్పైనను విడువడు
కొట్టబడడు గాసిఁ గీశకుంజరుడంతన్.[105]

పరాశర సంహితలోను పురాణములలోను హనుమంతుని సాగర లంఘనమే వర్ణితము కాలేదు. ఆనందరామాయణమున వాల్మీకి కవి రచనలో లేని విశేషమొక్కటి కలదు. ఆతిథ్యము స్వీకరింపవలసినదిగా మైనాకుడాహ్వా నించినపుడు "స్వామికార్యము నెరవేర్చుదనుక నేను భోజనముగానీ విశ్రాంతిగానీ తీసుకొనునని హనుమంతుడు తెల్పినట్లున్నది.[106]

శ్రీమద్రామాయణ కల్పవృక్షము ప్రకారము: కథలో వాల్మీక కథాను సారియే యైనను సురస మారుతికి విఘ్నమొనరించుటకు కారణమును శ్రీ విశ్వ నాథ సత్యనారాయణగారు సెలవిచ్చినారు. "హనుమంతుడు లంకలో జొచ్చుచో నది వేళాదుష్టమైనదని తెలిసికొనిన దేవతలు ముహూర్తంబు తాపూ లస్యంబు ఘటింపనెంచి నాగమాత సురసను నియమించిరి.[107]

వాల్మీకి భగవానుని సుందరకాండములోని హనుమంతుని కథలో వేదాంతపరమైన ఎన్నో అర్థములను నిగూఢ విషయములను, సాంకేతిక అంశములను గూర్చి ఎన్నియో గ్రంథములు పలువురు ప్రముఖులు వ్రాసి యున్నారు· శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారి "సుందరకాండము— తత్త్వదీపిక" శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి "సుందరకాండం ఎందుకు

సుందరము" ఇత్యాది గ్రంథములలో ఆయా విషయములు విపులీకరించి యున్నారు కావున వానిని నేనుట్టంకించుటకు పూననైతిని. హనుమంతుడు 'గురుచరణ' మార్గమున పోయెనని తెలుపుటలో! "కుండలినీ శక్తికి చరణం అను పర్యాయపదమున్నందున ఆ పదముచేత అంతటా సంచరించు మార్గము (సుషుమ్నామార్గ) మని అర్థము. వాచ్యార్థము ఆకాశమని శ్రీ జి. శేషేంద్రశర్మ గారి అభిప్రాయము. అట్లే హనుమంతుడు సముద్రముపై ఎగురబోవుచో వాయువునకు ఒకమారుకాక రెండవసారి కూడ నమస్కరించుటకు హేతువు ఏమనగా, ఇంద్రియపాలకుల స్తుతించుట ఉపనిషత్ ప్రార్థనలో ముఖ్యము తర్వాత శాంతిపాఠములో

నమస్తే వాయోత్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి
త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి"

అనిచెప్పుటయే.[107]

సమీరకుమార విజయములోని కథ వాల్మీకి ననుసరించి యుండి క్రొత్త అంశమేదియు తెలుపుట లేదు.

రామచరితమానస్‌లో తులసిదాసుగారు వాల్మీకి చెప్పినదే చెప్పినను హనుమంతుడు రామబాణమువలె సముద్రముపై వెళ్లెనని వాల్మీకివలెనే చెప్పి, రామబాణపు గుణముల వివరించెను. అది అపజయము లేనిది, అడ్డులేనిది, వాయువేగము కలది అని తెలిపెను.

హనుమంతుడు సముద్రముపై నాకాశమార్గమున నూరు యోజనముల దాటెను. నేటి కొలతల ప్రకారం ఇది యెంత దూరమో చర్చించుచు శ్రీ వావిలి కొలను సుబ్బారావుగారు తమ 'మందరమున' ఇట్లు అభిప్రాయము నుగ్గడించి యున్నారు. "ఇప్పుడు సింహళ ద్వీపమునకు మన దేశమునకు నడుమ సముద్రము వెడల్పు అరువది మైళ్లే యున్నది. నూరు యోజనము లెక్కడ? అరువది మైళ్లెక్కడ? అని సందేహము కలుగవచ్చును. యోజనము కొలత నిష్కర్ష లేనిదై యున్నది. కొందరు ఆరుమైళ్లు, కొందరు ఎనిమిది మైళ్లు, కొందరు రెండున్నరమైళ్లు కొలతలు చెప్పుచున్నారు. ఇట్లే క్రోసు, క్రోశం అనునవి కూడ నేడు మైలు అనగా వేయిన్ని యేడువందల అరువది గజములు. ఈ పరిమాణము నాడు లేదు. కనుక యోజనమున కిన్ని మైళ్లని నిర్ధారింప

వీలులేదు. ఇప్పుడు సముద్రము మీది దూరము అరువది మైళ్లే యున్నను రామాయణకాలమున సముద్రము ఇంత మాత్రమే కాదు. ఇప్పటి మధురకు కొంచెము దూరములోనే నాడు సముద్రముండినది. సముద్రభాగము విశేష ముగా పూడి యిప్పుడు నేల యైనదని శాస్త్రవేత్తలు వ్రాసియున్నారు. ఇప్పటి రామనాథపురమునకు దక్షిణభాగమంతయు పూర్వం సముద్రముగానే యుండెను. కావుననే సుగ్రీవుడు వానరబృందమును పంపుచో "పాండ్య కవాటావనిం బరికింపుడీ అని చెప్పి వెంటనె 'వననిధి తీరముంగదిసి" అని చెప్పెనుకానీ అడవులని కాని, కొండలని కాని చెప్పినవాడు కాడు. మరియొక విశేషము. ఇప్పటి మలయాళ దేశమగు తిరువాన్కూరు సముద్రములో మునిగి యుండెననియు పరశురాముడు కోరగా సముద్రుడా ప్రదేశమునాయన కిచ్చె ననియు పురాణములలో కలదు. రామాయణములో చెప్పబడిన త్రికూటము, లంబ పర్వతము, సువేల అనునవి లంకకు దక్షిణ భాగంబున నున్నవి కాని ఉత్తర భాగంబున లేవు. కావున ఇప్పటి లంక యందలి ఉత్తర భాగములు కూడ సముద్రమున మునిగియుండవలెను. ఈ పర్వతము చుట్టూ సముద్రము చెప్పబడెనేకానీ, నేల, గ్రామము లున్నట్లు వాల్మీకి చెప్పలేదు. సువేల అను పదమే సముద్రతీర దేశమని తెలుపుచున్నది. లంకయందలి యిప్పటి ఉత్తరపు రేవునకు త్రికూటమునకు నూరుమైళ్లు పైగా నున్నది. కావున హనుమంతుడు దాటినది రెండు వందల యేబది మైళ్లని యేర్పడుచున్నది. (109 యోజనములనగా 250 మైళ్లు)[108]

1. లంకలో హనుమంతుని సాహసకార్యాలు – నగర ప్రవేశము :

శ్రీమద్రామాయణ సుందరకాండములో నున్నంత విస్తృతంగా పరాశర సంహితాదులలో నివి వర్ణింపబడలేదు. సమీరకుమార విజయకర్త కూడ క్రొత్త విషయమేమియు తెలుపలేదు. మహర్షి రమణీయముగా నొనర్చిన వర్ణనలతో నిమిత్తము లేకుండా హనుమంతుని చరిత్రకు సంబంధించిన అంశములను తెలిసికొనుటయే కర్తవ్యము. హనుమంతుడు తీరమున దిగి కొండలు, రాళ్లు, వనసీమలద్వారా వెళ్లి సుగంధ యుక్తమగు లంకానగరో ద్యానములను చూచెను. లంబ పర్వతమెక్కి త్రికూటాద్రిపై నున్న లంకా నగరాన్ని చూచెను. దానికి సముద్రము పెట్టని అగడ్త. సైన్యములచే ప్రాకారములు రక్షింపబడు చుండెను. ఆ సంగతి గుర్తించిన మారుతి మన సులో ఆలోచనలెన్నో కలిగెను. "భవిష్యత్ కర్తవ్యము. ప్రకారం వానర సేన ఎట్లీ సాగరం దాటి రాగలదో? వచ్చినను వారికి ప్రయాసయేకాని ప్రయోజనముండదు. లంకను, రామునీ తలంచినచో రామునికి కూడా ఇది సులభసాధ్యము కాదేమో ననిపించును. అతిక్రూరులగు రాక్షసులయెడ సామ మార్గము పనికిరాదు. ఐశ్వర్య శోభితులైన వీరియెడ దానమార్గముపయోగ కారి కాదు. బలిష్ఠులగు వీరియెడ భేదోపాయము పనిచేయదు. యుద్ధమొనర్చి నను వీరిని గెలుతుమను నమ్మకములేదు. నీలుడు, అంగదుడు, సుగ్రీవుడు మాత్రమే ఇక్కడికి రాగలరు. మా నలుగురితో సాధ్యమగునదేమియును లేదు" ఇట్లాలోచన పూర్తికాగానే ఆ భావనలో నేదో దోషమున్నట్లుగా హనుమ కనిపించెను. "సీతాదేవి జీవించి యున్నదో లేదో తెలిసి ఆమె జాడ తెలిసిన తర్వాతకదా లంకను సాధించు ఉపాయమాలోచించుట. దీనికి ముందే ప్రమా దముల నూహించుకొనుట తగదు." అని తనకు తానే మరల సమాధాన మూహించెను. "నగరులోనికి ప్రవేశించుట నా ప్రథమ కర్తవ్యము. అదెట్లొ నర్చవలెనో? నేనేవిధంగా చేసినా, అది రామకార్యము నెరవేర్చునదిగా

ఉండాలి. ఈనా నిజరూపంతో వెళ్లినచో వారు నన్ను పోనీయరు. దైత్యులను వంచించి లోనికిపోయి సమయోచితమగు వేషములలో రాత్రివేళలలో మాత్రమే నేను నాకార్యాన్ని చక్కబరచుకొనవలెను." అని హనుమంతుడు తలంచెను. పలుమార్లా నగరాన్నిచూచి నిట్టూర్పు విడచెను. కార్యసాధనను గూర్చి తత్సాధనాన్ని గూర్చి ఎన్నో తలంపుల నతడు పొందెను. "ఈ కార్యాన్ని ఎలా సాధించాలి? రావణునికి తెలియకుండా సీతను ఎలా కలుసుకోవాలి? దూతయైన వాడు దేశకాల జ్ఞానము లేక ప్రవర్తింపరాదు. పండితమానియైనవాడట్లు చేసి యజమాని కార్యమును చెడగొట్టినాడను నిందను పొందును. కావున నేనేమి చేయాలి? ఏవిధంగా ప్రవేశించాలి? దానికి తగిన సమయమేది? తగినవేషమేది? నేను రాక్షస రూపమున వెళ్లినచో వారు గుర్తింపగలరు. ఏ రూపము ధరించి వెళ్లినా వారు దానిని కనిపెట్టగలరు. అసలు గాలి కూడా వారి అనుమతి లేనిదే లంకలో ప్రవేశింపజాలదు. కావున నేను చీకటి పడు వరకు ఇందే చాటుమాటున ఉండి తర్వాత పిల్లకోతి రూపమున (గుజ్జు ప్లవంగ రూపము) నగరమున ప్రవేశించి రాక్షస గృహములలో సీతను వెదకెదను. ఇప్పటికిదియే నా కర్తవ్యము" అని నిర్ణయించుకొని మనస్సు స్తిమిత పఱచుకొని కార్యరూపమున దానిని నెరవేర్చుటకై సూర్యాస్తమయమునకు నిరీక్షించెను.

ప్రదోషకాలమున పిల్లియంతటి రూపం ధరించి శిఖరము దిగి లంకలో ప్రవేశించెను. నగరరక్షకులగు వారి కంటపడక గుప్తచారుడై ప్రాకారము చేరెను. చంద్రకాంతి హనుమపై పడుచుండెను. రామలక్ష్మణుల బలమున శ్రీ నగరమొక లెక్కగాదను భావమాతనికి కలుగగా ధైర్యముతో సాగిపోవు నతనికా నగరము రత్నవసనోపేతయై, కోష్ఠాగారములనెడు శిరోలంకృతయై యంత్రాగారములనెడు స్తనములు కలదియై శోభించు ఒక స్త్రీవలె కన్పించెను.

హనుమంతుడు సాగిపోవుచుండగా లంకా నగరాధిదేవత అతనిని చూచెను. భీప్రదమైన వికారరూపముతో లంకిణి అతనిపైబడునట్లు వచ్చి గర్జించుచు "ఓరీ నీవెవడవు. నా చేతిలో దెబ్బలు తిని చావకముందే నీ వృత్తాంతము తెల్పుము. రావణ రక్షితయగు దీనిలో ప్రవేశించడానికి దేవతకే సాధ్యపడదు. నీవు కోతివై ఇక్కడికెందుకు వచ్చావో చెప్పుము అని కరముగా ప్రశ్నించెను. దాని వికారమగు నోరు, భయంకరమగు చూపులు

భీకరాకారములను చూచి ఆంజనేయుడు దానితో "నేను నాకథ తర్వాత చెప్పెదను. ఈ ఘోరాకారముతో నీవు ఇక్కడ ఎందుకున్నావో ముందు నాకు తెలుపుము" అని పలికెను. ఆ లంకిణి "ఓరీ నేను రావణుని కింకరిని. ఈ నగర రక్షణ బాధ్యత నాదే. నన్ను జయించికానీ నీవీ లంకలో ప్రవేశింప జాలవు. కావున నీ వృత్తాంతము చెప్పుము" అని కోరెను. అంత మారుతి "నేను ఈ లంకానగరాన్ని, యిందలి వనములు, ఉద్యానవనములు, అడవులు. భవనములు చిత్రవిచిత్రములు చూచి పోయెదను" అని చెప్పుచున్నంతలో ఆ రాక్షసి గట్టిగా అరచి, అరచేతితో హనుమంతుని కొట్టెను. హనుమంతుడు కూడా గర్జించి తన ఎడమచేతి ముష్టితో దాని నొక పోటు పొడిచెను. ఆ పోటుకు దాని అవయవాలు విలవిల లాడగా కళ్లు తేలవేసి అది నేలకొరిగి పోయెను. స్త్రీని వధించుట యుక్తము కాదని హనుమంతుడు కనికరించి యూరకుండెను. అంత ఆ రాక్షసి మెల్లగా లేచి హనుమంతుని చేరి 'గర్వ చ్యుతమైన చూపులతో, డగ్గుత్తికతో "నన్ను చంపకుము. నీవు మహానుభావుడవు, మహాబలుడవు. పరాక్రమములో నన్ను జయించినావు. ఈ నగర ప్రతిష్ఠా సమయమున బ్రహ్మ నాకొక వరమిచ్చి యున్నాడు. అది ఏమనగా, 'ఏనాడు వానరుడొకడు వచ్చి నన్ను గెల్చునో ఆనాడే యీ లంకకు చేటు కల్గును' అని. ఆ వాక్యము ఫలించు వేళ వచ్చినది. నీవు లంకలో ప్రవేశించి యథేచ్ఛగా విహరింపుము. నీ యిష్టప్రకారము నీ ప్రయత్నములను చేయుము. నందికేశ్వరుని శాపముచే దుర్బలుడైన రావణునిచే పరిపాలింపబడు ఈ లంకలో పతివ్రతా తిలకమగు సీతను వెదకి కొనుము"—అని లంకిణి తెలుపగా నే సంతోషించిన హనుమంతుడు సింహద్వారము ద్వారా కాకుండా వేరొక మార్గమున కోట ప్రాకారము లంఘించి దూకి తన ఎడమ పాదమును శత్రు పురమున మోపి దిగెను.[109]

పరాశరసంహితలో: హనుమంతుడు లంకిణిని నిర్జింపగా దాని సోదరి విషూచి స్వరూపిణియగు కర్కటి హనుమంతుని చంపుటకై వచ్చెను. అపుడు ఆంజనేయుడు దాని చేతిలోని వజ్రదండమునే తీసుకొని దానిని వధించెను.[110]

సమీరకుమార విజయమున ఈ సందర్భము కేవలము సూచనా మాత్రముగా నున్నది. కోటవాకిటిలో కోలాహలమంతా తగ్గి గుటక హెచ్చగానే, దైత్యకాంతల పలవరింతలు సాగగానే, దంపతుల కూరుకుల

యూర్పులు సెలగగానే పౌరజనుల రూపుల వివశత హెచ్చగానే అంజనేయుడు ఉత్తర ద్వారంలో ప్రవేశించెను. అపటికి ఎడసొచ్చి వచ్చు లంక బింకమడవి పెంపుమీరి నిశాపాలికల కేళికా గృహ పాళికలలో అతడు సీతను వెదకెను.[111]

రామచరితమానస్: రామాయణములో తెల్పినట్లు పిల్లియంతటి రూపముతోగాక హనుమంతుడు పిల్లిలాగానే ప్రవేశించినట్లు తులసీదాసు రచించిరి. "పిల్లి చీకటిలో గూడ చూడగల శక్తి కలది. అట్టి శక్తితో హనుమ సాగెనని భావించుట శ్రేయస్కరము." ఇంకొకచోట కవి మశకమంతటి రూపము మారుతి ధరించెనని కూడా తెలిపియున్నాడు.[112]

2. అంతఃపుర భవనాలలో అన్వేషణ :

అతివైభవముతో నొప్పు లంకానగర వైభవమును అంజనేయుడతి జాగరూకుడై దర్శించెను. (వాల్మీకి కవి సుందరమగు వర్ణన జగద్విదితము) రాజమార్గంలో బరాబరులు చేయువారిని, వివిధ వర్ణ రూప విచిత్రావయవ నిర్మాణం గలవారిని బహువిధ భీకర శస్త్రధారులను హనుమంతుడు చూచెను. రావణుని యింటి ముంగల హెచ్చరికగా నుండు మూలబలమును (Reserve Force) చూచెను. ముత్యాల తోరణాలతో కృష్ణాగరు గంధములతో నొప్పు రావణుని అంతఃపురములోనికి ఎవరికినీ తెలియకుండా హనుమంతుడు ప్రవేశించెను. అప్పుడు ఆకాశమధ్యాన చంద్రుడు తన వెన్నెలలను సర్వత్రా వ్యాపింపజేస్తూ అవులమందలో తిరుగాడు శ్వేతవృషభము వలె నుండెను. వెలుతురులో హనుమంతుడు రకరకముల దృశ్యముల చూచెను. విచిత్ర ్ఏ శబ్దములను వినెను. భర్తలకై తత్తరపడు స్త్రీలు వారికై నిరీక్షించుచుండిరి. భర్తృసన్నిధి నున్నవారు వారిననుసరించుచుండిరి. రాముడు వర్ణించిన రూపమునకు తగిన మానవాకారముగల స్త్రీని, ఆభరణములను అనవాలుగా చూచి నిర్ణయించుకొనుట తన విధి కావున హనుమంతుడు తన దృష్టినాకర్షించు దిశలో గల విషయముల నన్నింటిని నిశితముగా పరిశీలింపసాగెను. వీణానాదాల మధ్య రాక్షస స్త్రీ పురుషులు వివిధాలాపములతో, ఆక్షేపణలతో కాలము పుచ్చుచుండిరి. రొమ్ములు విచ్చి దేహము లెఱుగక కూర్కెడి స్త్రీలు, స్త్రీల దేహములపై ఒక చేయి ఒక కాలు వేసి పడుకొనిన పురుషులు, ముచ్చటలాడు జంటలు, చందనాది లేపముల నలదుకొనువారు, భర్తలపై కోపగించిన

వారు భర్తలను రతికై ప్రార్థించు స్త్రీలు హనుమంతున కాయా హర్మ్యములలో అగపడిరి. వారు అనేకాకారములలో నుండిరి. అందమైనవారిని, పతివ్రతలైన వారిని, సిగ్గుచే ఆవరింపబడినవారిని, ప్రేమరసమధికముగా గలవారిని, భర్తల ఒడులలో కూర్చున్నవారిని, భర్తృకార్యాసక్తులగువారిని, విరహోత్కంఠలను రతిప్రౌఢలను, పైట జారినవారిని, రతిశ్రమచే కరగిపోయిన మకరికాపత్ర రచన గలవారిని, చెదరిన ముంగురులవారిని ఆ పడకటింట్లలో ఎందరినో పావని చూచెను. సీత ఎట్లుండునోయని హనుమంతుడూహించుకొనుచు ఆమె రామ విరహ కృశాంగియై యుండుననుకొనెను. తనకు తెలిసిన ఆభరణము లను ధరించిన మానవాంగన వారిలో కనరానందున వాయునందను డధికమగు వ్యథ చెందెను.

సీత కనబడనందున హనుమకు దుఃఖము కలుగసాగెను. కామరూప ధరుడై ఇంకొకమారు లంకలో వెదకుట కుద్యమించెను. దేదీప్యమానమైన రావణుని గృహమును చేరెను. తత్సమీపస్థ ఉద్యానవనములు, ప్రాసాదములు అతడు పరీక్షించెను. ప్రహస్త, మహాపార్శ్వ కుంభకర్ణ విభీషణాది ముప్పది నాలుగు రాక్షసవీరుల భవనములలో సీతను వెదకెను. రావణుని గృహములో ప్రవేశించగానే బహువిధ అయుధ ధారులగు స్త్రీలను రకరకాల ఆకారం గలవారిని హనుమంతుడు చూచెను. ఆ భవనమందలి రత్నకాంతులతోపాటు రావణుని దీప్తి కూడ అంతటా వ్యాపించుచుండెను. శోభాయమానముగా నున్న ఆ భవనములో సీతను కాపలా కాయువారుందురేమోనని హనుమ చూచెను. ఆమెను తానిదివరలో చూచియుండలేదు కావున మనోగతుల చేతను ఊహచేతను మాత్రమే ఆమెను గుర్తించవలెనని హనుమంతుడు తలంచెను. అచటి మ్రాకులపై నుండి సౌధములపైకి ఎగురుతూ రావణుని పుష్పక విమానమును చూచెను. బంగారుతో నిర్మితమై సుందరమై చిత్రవర్ణ శోభితమై పర్వత శిఖరమువలె, మేఘమువలె అది భాసించుచుండెను. సగము ఆమడ వెడల్పును, ఆమడ నిడివిని కలదై ఆ భవనముల మధ్యలో అదియొక శ్రేష్ఠ మైన భవనమో యనునట్లుండెను. దానిలో రావణుడు కాపురముచేయు పెక్కు మేడలు గల నగరుండెను. రెండు దంతాలున్నవి, మూడును, నాలుగును దంతాలున్నట్టి యేనుగులందుండెను. రావణుడు బలాత్కారముగా తెచ్చిన స్త్రీలందుండిరి. సర్వదిక్పాలకులను జయించి తెచ్చిన సంపద అచట కనిపించు

చుండెను. బంగారుమెట్లు, ఇంద్ర నీలాదిమణులతో గూడిన కిటికీలు కలిగి వివిధాహారపదార్థపరిమళముల పర్వముచేయుచుండెను. వినుటకింపైన ధ్వనుల చేత వీనులకు (విందైన ధ్వనులచే వీనులకు) కనుటకింపైన రూపములచే కన్నులకు, తాకుట కింపైన వానిచే చర్మమునకు, సువాసనలచే నాసికకు, నోట నీరూరించు వానితో నాలుకకు తల్లివలె ఆ నగరు హనుమంతునకు పంచేంద్రియ సుఖము నిచ్చెను. రావణుని తేజముతోపాటు కదలక ప్రకాశించు అచటి దీపములు ఆశ్చర్యపరిచెను. వేలాది స్త్రీలు మద్యపానముచే సొక్కి నిద్రించుచుండిరి. వారిలో పద్మినీ, హస్తినీ జాతుల స్త్రీలుండిరి. కొందరు మద్యపానము చేసి రత్యాసక్తిచే పరవశలై యుండిరి. పుష్పభూషణాదులతో పాటు వారి అవయవములనాచ్ఛాదితములై స్థితి తప్పియుండెను. నిద్రించు చున్నవారిని చూచినను సాధారణ పురుషులు మదనవికారము నొందగల్గునంత మనోహరముగా వారగపడుచుండిరి. నిద్రలో వారప్రయత్నముగా చేయు చేష్టల హనుమంతుడు చూచెను.

రావణుని భార్యలందరు వానికి చుట్టునూ దగ్గరగా శయనించియుండిరి. ఆ స్త్రీలను చూచిన హనుమంతుడు "అయ్యో సీతాదేవి కూడ వీరివలె తన నాథుని చేరియుండినచో రావణునకు పుణ్యము కలిగి యుండును గదా!" అని తలంచి, వెంటనే పశ్చాత్తాపముతో 'అయ్యో, అయోనిజ, పతివ్రతా అయిన సీతను రాక్షసాంగనలతో పోల్చితినే!" అని బాధపడెను. సువర్ణ, స్ఫటిక, దంత, వజ్ర, వైడూర్యములతో చేయబడిన రావణుని తల్పమునతడు చూచెను. వివిధాలంకారములతో సరిగవస్త్రములతో నతడు నిద్రించుచుండెను. పెద్దగ బుసకొట్టుచున్న వానిని చూడగానే హనుమంతుడు తబ్బిబ్బుపడి యిట్టి పాపాత్ముని సమీపించితినిగదా అని చింతించెను. అతని చెంత అతని భార్యలు పరుండి యుండిరి. వారిలో కొందరు సొమ్ములూడినవారు, చీరలూడినవారు, బొట్టుచెదరినవారు, కాటుక కరిగినవారు ఉండిరి. వేరొక ప్రత్యేక తల్పముపై నిరతిశయ సౌందర్యవతియగు మండోదరిని చూచి "హా చూచితి సీతను" అని సంతోషముతో భుజములు తట్టుకొనుచు తోకను ముద్దిడుకొని గంతులు పెట్టి, స్తంభములెక్కి లోలోననే గానముచేసి మనస్సులోనే ఆనందముతో నూగి పోయెను. క్షణములోనే అతనికి సంశయము కలిగెను. "ఈమె సీత ఎట్లగును. భర్తకు దూరమైయున్న స్త్రీ యిట్లు నిద్రపోగల్గునా! ఆహారము తినునా!

సొమ్ములు ధరించునా! ఈ రావణుని అంతఃపురములో ఆనందముతో నుండ జాలునా! కావున ఈమె సీతకాదు." అని నిర్ణయించుకొని ఆచోటు వదలి పానశాలల వద్ద సీతను వెదకెను. అచట జింకల, పందుల, దున్నపోతుల పక్షుల తదితరముల మాంసాదులు, పలుపుష్పములతో తయారు చేయబడిన సారాయము గల పాత్రలుండెను. అచట ఎందెందు చూచినా సీత జాడ తెలియ నందున హనుమంతుడు దుఃఖించెను. స్త్రీలను, వారి అవయవములను వారి నిద్రాస్థితిని చూచిన దోషమును గూర్చి హనుమకు ధర్మాధర్మ విచికిత్స కలిగెను. కార్యనిశ్చయవశమైన బుద్ధితో అతడిట్లాలోచించెను. "సీతను స్త్రీల లోనేకదా వెదుకవలయును. స్త్రీలను చూడవలెనను తలంపుగానీ, చూచినందు వలన మనోవికారము కానీ నాకు కలుగలేదు. ఇంద్రియ వ్యాపారమునకు మనస్సే మూలకారణము. నా మనస్సు చంచలత నొందక స్థిరముగా నున్నది కావున దోషము లేదు" అని నిశ్చయించుకొనెను. అచట సీత కనరానందున మరల అంతఃపురమున వెదకుటకై ఆంజనేయుడుద్యమించెను.

"లతా గృహములలో, వివిధ మండపములలో సీతకై వెదకితిని కాని ఆమె కనరాలేదు. ఇంతకూ ఆమె బ్రతికియున్నదో లేదో" అను తలంపతనికి కలిగెను. రావణుడామెను చంపినాడేమోనను అనుమానమతనికి కలిగెను. కామాసక్తుడై తెచ్చినవాడు ఆమెను చంపినచో ఏలాభము పొందడని అతని కనిపించెను. వికృతాకారలగు రాక్షసస్త్రీల వలన ఆమెకేమైనా ప్రమాదము కలిగెనేమో ననుభావన అతనిలో కలిగెను. సీతనుగూర్చి అతనిలో పలువిధ ములగు తలంపులనివార్యముగా కలుగసాగెను. "ఎన్నిచోట్లనో వెదకితిని. ఆమె కన్పించలేదు. నా కృషియంతా వృథాయేనా! వానరుల ముందు పౌరుష వచనములు పలికి వచ్చితినికదా! నేను ఏ వార్తను తీసికొని సుగ్రీవుని వద్దకు వెళ్లవలెనో? సీత కనరాలేదని చెప్పుట యుక్తమా! కిష్కింధకు వెళ్లకుండా ఇక్కడనే ఎంత కాలమని యుందును. గడువులోగా నేను వెళ్లనిచో రావణునిచే హనుమయే చంపబడియుండునని వానరులు తలంపగలరు. కార్యము సాధించ కుండా వెళ్లినచో జాంబవంతుడు అంగదాదులు నన్ను "ఛీఛీ" అని అనగలరు. కనుక నేను వ్యర్థుడనై పోరాదు. ఇక్కడ నేనుండరాదు. ధీరుడు ఆపదలో ఉత్సాహరహితుడు కాక ప్రయత్నము చేయాలి. రావణుని చిత్రాలయములు, తోటలు, కేళివిలాస భవనాలు, వీథులు, సందులు, ఇంకనూ ఇతర ప్రదేశము

లలో సీతను వెదకుటయే యిప్పటి నా కర్తవ్యము. నేలమాళిగలు నాలుగు మార్గాలు కలియు కూడలులు ఇదియది యనక అంతటా వెదకెదను" అని నిర్ణయించుకొని హనుమంతుడపుడు వెదకినచోటికేపోయి వెదకి వచ్చుచు, ఎగురుచూ, దూకుచూ, ప్రాకుచూ, రావణుని అంతఃపురంలో బెత్తెడంత ప్రదేశాన్ని కూడా వదలకుండా ప్రాకారాలూ, అరుగులూ, దిగుడుబావులూ, కొలనులూ అన్నీ వెదకెను.

అయినను సీత కనరాలేదు. "రాక్షసుని యింటిలో సీత ఉన్నదని సంపాతి చెప్పినమాట తప్పగునా! రావణాపహృతయగు వేళలో సీత సముద్రమున పడినదేమో. లేక భర్తృవిరహమున ప్రాణత్యాగమొనర్చి యుండునా. లేక రావణుడామెను రహస్య ప్రదేశములో నుంచెనా. సీతాదేవి కనబడలేదని శ్రీరామునకు తెలిపినచో రాముడు ప్రాణముల విడుచుట నిజము. అది చూచి లక్ష్మణాదులు సుగ్రీవుడు ప్రాయోపవేశము చేయకుందురా? సుగ్రీవుడు మరణించినచో తార సహా మరణించును. వారిలో అంగదుడుకూడ చనిపోవును. వానరులందరు దుఃఖముల పాలగుదురు. కావున నేను సీతజాడ తెలియవరకు కిష్కింధకు తిరిగి వెళ్లకుండా ఉన్నచో నా రాకకై ఆశతో వారు ఎదురు చూచుచుందురు. సీతాదేవిని చూడకుండా వెళ్లుటకంటే నేనిక్కడనే యుండి ఫలమూలాశనుడనై వానప్రస్థునిగా నుండెదను. లేదా పక్షులు, జంతువులు మొదలగువానికాహారముగా నై పోవలెను. ఆహా! సీతాదేవిని కాపాడ దలచిన జటాయువుదెంత అదృష్టము. అతనిది వీరమరణము. అట్టి అదృష్టము నాకు లేదు. రామకార్యసాధనలో నేను మరణించుటే మేలు. అగ్నికాహుతి యగుదునా! లేక నీటిలో మునిగి మరణింతునా! కాదు కాదు చనిపోవుట మంచిది కాదు. చచ్చి యేమి సాధించగలము? సీత జాడ తెలిసినా, తెలియకున్నా, ఆ రాక్షసుడగు రావణుని పట్టి చంపినచో మేలుగా నుండును గదా! రావణుని చంపుట నా కర్తవ్యముకాదు. అది రాముని కర్తవ్యము. వానిని పట్టుకొని యజ్ఞ పశువుగా ఈడ్చుకొని వెళ్లి రాముని యెదుట పెట్టుట మంచిది. అనాడు సంపాతి వచనముల విని రాముని నేనిక్కడకు తీసికొని వచ్చి యుండినచో సీత కనరానందున రామక్రోధాగ్నికి మేమంతా బలియయ్యెడివారమేకదా! అందువలన ఆహార నియమము పూని ఇంద్రియ నిగ్రహముతో నేనిందే ఉండెదగాక. వ్యర్థుడనై పోకుండుట వలన వానరులూ, రాజపుత్రులూ నాకై నిరీక్షించుచు జీవించి యుందురు" అని పలువిధముల చింతించుచున్న హను

మంతునకు అశోకవనము దృగ్గోచరమయ్యెను. అందులో సీతను వెదకియుండ లేదు. అక్కడికి వెళ్లి వెదుక దలంచి ఆంజనేయుడు సీతారామలక్ష్మణుల కున్నూ, రుద్ర ఇంద్రయమ వరుణ దైవములకున్నూ, రవిచంద్రులకున్నూ, అశ్వినులకు, మునులకున్నూ మనసులోనే అంజలించి బయలుదేరెను.

ఆ వనము పరిశుద్ధముగా నుండి బాగుగా పరిరక్షింపబడునట్లు తోచి నందున అందులోనే సీత ఉండునని పావని అనుకొనెను. వసంతర్తు సూచనతో వృక్షములన్నియు పుష్పశోభితములై యుండెను. అతి చిన్నదైన తన దేహ ముతో ప్రాకారమునుండి చెట్లలోనికి గంతులేయగా అందలి పక్షులకు నిద్రా భంగమై అవి కూసెను. పక్షుల రెక్కల అదిలింపునకు పూలన్నియు రాలగా అవి హనుమంతునిపై పడెను. భూతకోటికై వచ్చిన వసంతుడో అనునట్లు వాతాత్మజుడుండెను. గాలి మబ్బులను చిమ్మినట్లుగా చెట్లతీగల గుంపులను చిమ్ముచూ హనుమంతుడు సాగెను. వజ్రాలు తాపిన భూములు, బంగారమూ వెండితో వెలయించిన స్థలాలూ, బావులూ, బావులకు బంగారు మెట్లు స్ఫటికపు తిన్నెలు, బావులవద్ద హంస, సారస, చక్రవాకాది పక్షులను హనుమంతుడు చూచెను. అచట సెలయేళ్ళు పారుచుండెను. అచట నొక పెద్ద శింశపావృక్ష మును హనుమంతుడు చూచెను. అగ్నిని పోలు ఆ చెట్లనుండి క్రొమ్మెరుంగులు హనుమంతునిపై ప్రసరించెను. గాలి తాకిడికి ఆ చెట్లకు కట్టిన చిరుగంటలు మ్రోగుచుండెను. ఈశ్వరారాధన నిమిత్తమై నదిలో పరిశుద్ధురాలగుటకై సంధ్యాకాలమున అచటికి సీత తప్పక రాగలదని ఆశించి అంజనేయుడా శింశపా వృక్షము నందే దాగుకొని యుండెను.

ఆకాశమును తాకుచు సహస్ర స్తంభములతో రమణీయమైన మేడ అంతలో నతనికి కన్పడెను. దానికి తప్తకాంచన వేదికలు ప్రవాళ సోపాన ములు ఉండెను. అచట పెద్ద స్కంధముగల ఒక చెట్టు చుట్టును రాక్షసస్త్రీలు పరివేష్ఠించి యుండిరి. వారి మధ్య ఒక స్త్రీ అతనికగపడెను— మాసినచీరతో, దీన వదనముతో కృశించిన శరీరముతో, మీదమీద వెల్వడు నిట్టూర్పులతో గుర్తింపరాని దేహకాంతితో నున్న ఆమెయే — సీతయగునో కాదో అని బాగుగా పరిశీలింప సాగెను. అట్లు పరిశీలన మొనర్చు పావనికి ఆమె ఎన్నియో రీతుల తోచెను. శుక్ల పక్షాది యందలి చంద్రరేఖవలె కృశించినదై, ధూమా వృతమగు అగ్నిజ్వాలయై కమలములులేని కొలనులాగా భూషణ విరహితయై,

లేడిని చుట్టుకొని యున్న వేటకుక్కలవలె రాక్షసాంగనలతో పరివేష్టింప బడినదై, దుఃఖించునదై, సందిగ్ధమైన స్మృతివలె, చెడిన సంపదవలె, విశ్వా సములేని శ్రద్ధవలె, ప్రతిహతమైన ఆశవలె, విఘ్నముకల సిద్ధివలె, కలుషించిన బుద్ధివలె, చెడిన కీర్తివలె, శిధిలమైన విద్యవలె, లోపింపబడిన ఆజ్ఞవలెనున్న ఆమెను చూచి సీతయే కావచ్చునని హనుమంతుడు అనుమానించెను.

ఆమెయే సీత అగునో కాదో ప్రమాణీకరించి నిర్ణయించుటకా సాక్ష్య ములు చాలవని ఇంకనూ కొన్ని ఋజువులకై అంజనేయుడు చూడసాగెను. "రావణుడపహరించుకొని పోవునపుడు ఆర్తనాదము చేయుచు మాకు కనబడిన రూపమే ఈమె రూపము. ఈమె కూర్చున్న చెట్టువద్ద చెట్టుకు కట్టిన ఆభరణ ములు శ్రీరాముడు మాకు చూపిన ఆభరణముల వలెనే యున్నవి. విమానము నుండి నాడామె జారవిడిచిన ఆభరణములన్నియు ఆమె ఎడమవైపు ధరించి నట్టివి. అట్లామె ఒక ప్రక్కవే వేయుట దేనికనగా ఎవరైనా తనను వెదకుచు వచ్చినపుడు రెండవ ప్రక్క ఆభరణములానవాలుగా గుర్తింపగలరని ఆమె భావించియుండును. నాణెముగ పనిచేసిన కమ్మలు, హస్తాభరణములు, పాదా భరణములు నల్లబారి మురికిపట్టియున్నవి. ఆ ఆభరణముల ధరించుచోట ఏర్పడు ముద్రలు నాకు కన్పించుచున్నవి. ఈ సాక్ష్యములను బట్టి ఈమెనే సీతగా అనుమానించుచున్నాను. శ్రీరాముడు సీత మేనిలో ఇంకనూ కొన్ని ఆభరణములున్నవని చెప్పియున్నాడు. ఆనాడు మేము చూచినవి కాక వేరుగా నున్న ఆభరణములను ఈమె ధరించి యున్నది. రామునకు మేమందించిన ఆభరణములు ఎడమప్రక్కవి. ఇక్కడ కన్పించు ఆభరణములు కుడివైపునకు చెందినవే. అంతేకాక ఈ ఆభరణములను చెట్లకు వ్రేలాడ కట్టి యుండుటకు కారణము లేదు. తనను వెదకుకొనుచు వచ్చువారికై ఇవి ఆమె వ్రేలాడదీసి నది. ఆనాడు ఆభరణములను వస్త్రమున మూటగట్టి జారవిడచినది. నాడే బంగారువన్నె ఉత్తరీయమును చూచితిమో ఆ వన్నెగల వస్త్రమే యీామె ధరించియున్నది. చిరకాలము దానినే ధరించుటచే అది కాంతిహీనమై యున్నది. ఆ వస్త్రమే ఇది. కావున ఈమె సీతయే." అని హనుమంతుడు దృఢాభి ప్రాయము పొందెను.

సీతను సందర్శించినంతలోనే హనుమంతునిలో సీతారాముల అను రాగమూ, సీతాదేవి ప్రస్తుత దయనీయస్థితి గూర్చి హృదయపుట భేదకములగు

భావములనేకము ప్రవహించినవి. "ఈమె రాముని దేవేరి. విప్రయోగ కర్శితయై యొన్న ఈమె రాముని సౌందర్యమునకు తగిన అవయవ సౌష్టవము కలిగి యున్నది. ఇట్టి యీమెను ఎడబాసికూడ రాముడు దేహమున ప్రాణము లుంచుకొనుట దుష్కరకార్యము. ఈనాడీబాధకు సీతను గురిచేసిన రాముడు క్రూరచిత్తుడు. జింకను తెచ్చుటకై ఈమెను వదలి వెళ్లుట కతనికెట్లు మనసు వచ్చెనో? తన అస్త్రవిద్యతో ఉన్నచోట నుండియే దానిని కొట్టియుండవచ్చును గదా. ఈమె లేకున్నా ఇన్నాళ్లు రాముడు మరణింపక జీవించియున్నాడే? అయ్యో, నాకు నా ప్రభువును కించపరచునట్టి తలంపులు కలిగినవికదా! నా ప్రభువును సామాన్యునిగా భావించితినే? సీతా విముక్తిలోని కష్టములనెన్ని నేనట్లు భావించితినేకాని నాప్రభువగు శ్రీరామునికి ఈ రాక్షసులెంత? సర్వ జగద్రక్షకుని సతికి యీనాడీ పాట్లు పడుట తప్పదాయెకదా! కాలమతిక్ర మింప ఎవరికి తరము"....అని సీతారాముల యెడ భక్తితో సామీరి దుఃఖిం చుచు భావించెను. దాశరథుని పరాక్రమమును నమ్మినదై గుండెదిటవుతో, నిర్భరముగానున్న సీతాదేవి స్తవనీయ కావుననే ఈమెకు రాముడు తగినవాడు. వీరి సాముద్రిక లక్షణముల తుల్యతయే ఆ అంశముల నిరూపించుచున్నది. ఇట్టి ఉత్తమురాలికా ఇంతటి కష్టము. ఈమె కొఱకే గదా వాలిని రాముడు వధింపవలసివచ్చెను. ఈమె కొఱకే కదా కబంధుని చంపుట; ఇట్లే విరాధ ఖర త్రిశిరస దూషణాదులూ జనస్థాన నివాసులగు రాక్షసులందరూ రామ బాణహతులైరి కదా! ఈమె కారణముననే కదా సుగ్రీవునకు వానరరాజ్యము దొరకెను. ఈమె కోసమే కదా సముద్రుడు నాచే లంఘింపబడెను. ఈమె కొఱకు రాముడు త్రిలోకాలను దహించినా అది యుక్తమే అగును. అత్రైలోక్య రాజ్యాధిపత్యము సీతలోని ఒక కళకు సరిపోదు. ఇట్టి యీమెనే మరల రాముడు పొంది సుఖించాలి. రామసంప్రాప్తి తప్ప ఈమె కింకేదియును సుఖము నీయజాలదు. చక్రవాకమును బాసిన చక్రవాకివలె కష్టపరితాపములతో కూడుకున్న ఈమె విరహాగ్నిలో క్రుంగి పోవుచున్నది. ఇపుడిక్కడ రాక్షస వనితలు మేల్కొని యున్నారు. అదనుచూచి సీతతో ప్రసంగించుటకై యత్నిం చెదగాక" అని హనుమంతుడనుకొని ఆ వృక్షమునందే దాగికొని రాక్షసాంగ నల తీరును గమనించుచు నిరీక్షించెను.

హనుమంతునకు చంద్రుడు తన కాంతితో ఎంతయో సహకరించెను. సీతనూ, ఆమెను చుట్టుకొనియున్న రాక్షసస్త్రీలను అతడు బాగుగా చూచెను.

ఏకాక్షీ, చెవులులేనిదీ, ఒక్క చెవిగలదీ, నిడుపాటిమెడకలదీ, వ్రేలాడు చెవుల కలదీ, విచిత్రమైన ముక్కులు కలవారూ, భీకరముగా వికారముగా కనబడు రాక్షసస్త్రీలనతడు చూచెను. వారి క్రూరవాక్యమును సరకుసేయని సీతనాతడు చూచెను. దుఃఖతప్త, పతివ్రతా క్రాంతిహీనయైయున్న ఆమెను తాను చూడ గల్గుట రామలక్ష్మణుల అనుగ్రహ ఫలముగా భావించి మనసులోనే వారికి నమస్కరించెను. ఆ చెట్టులోని గుబురైన ఆకులమధ్య అణగి మణగి సమయా నుకూలతకై అతడు నిరీక్షించెను.

రాత్రిగడచి తెల్లవారబోవు సమయమున రావణునకు మేల్కొల్పుగా పాడిన సుప్రభాతాది మంగళవాద్యముల శబ్దములు వినవచ్చెను. సర్వలక్షణ సమన్వితుడై భూషణాద్యలంకార సహితుడై రావణుడు సీతను చూచుటకై అశోకవనవాటికకే తెంచెను. వానిని బాగుగా చూచుటకై చెట్లకొమ్మలమాటున ఒక అనువైన స్థలమునకు చేరి హనుమంతుడచట దాగుకొనెను. రావణుని గాంచి సీతాదేవి భీతిచే వణకుచు తన తొడలచే కడుపును, చేతులచే వక్షఃస్థలాన్ని కప్పుకొనుచు దుఃఖమొందుట హనుమంతుడు చూచెను. రావణుడు సీత ఎదుటకు వచ్చి తన మనోభావముల నావిష్కరించుచు తనకామె వశమగుటకై పలువిధముల తన గొప్పతనమును చెప్పుచు ఆమె అనుగ్రహమునకై ప్రార్థించెను. నిరలంకారయై నిరశనవ్రతములతో క్రుంగక తనతో కలిసి సర్వ భోగములననుభవింపుమని కోరెను. తపములో, బలపరాక్రమములలో, విత్తములో, కీర్తిలో రాముడు తనకొక్కదానిలో గూడ సాటిరాడనియు రాముని నమ్మియుండుట వలన ఆమె కష్టపడవలసియుండునని పలికెను. ఒక తృణము విరిచి వానికెదురుగా వేసి సీత వానికి హితవాక్యముల బోధించుట హనుమ గమనించెను. గడ్డిపోచకన్నా హీనముగా వానిని చూచు సీత పలుక బోవు మాటలయెడ హనుమ శ్రద్ధాళువైయుండెను. "ఓయీ రావణా, పాపా త్ములు ముక్తిని కోరినట్లుగా నీవు నన్ను ఆశింపవలదు. నీ భార్యలపై నీ మనసు నుంచుము. పుణ్యమైన వంశమున పుట్టి పూజ్యుడగు పురుషోత్తముని చేపట్టి పతివ్రతనగు నేను నీ మాటలకు లొంగుదానిని కాను. నేను పరసతిని సాధ్విని నీవు సాధుధర్మాన్నీ సాధుమార్గాన్నీ అనుసరించుట మంచిది." అని చెప్పుచు సీత వాని ముఖమును చూడకుండా వానికి తన వీపు ఎదురగునట్లుగా తిరుగుచు పలుకుట పాపమని గమనించెను. "ఓయి రావణా! స్త్రీలకు పాతివ్రత్యమే

అనుసరింపదగిన ధర్మము. నీ భార్యలు నీకెట్లో లోకములోని యితర స్త్రీలు వారి భర్తలకంతే కదా! స్వకాంతా సంబంధాన్ని వదలి పరకాంతా వ్యామోహమున పడినవాని బుద్ధి, పుణ్యం, ఐశ్వర్యం, ఆయుస్సు, సంతానము నాశనమగును. రాజువై చేయరాని పనులు చేసే నీకు బుద్ధి చెప్పువారీ లంకలోనే లేరా? లేక వారు చెప్పుచున్ననూ వారి మాటలు నీవు వినుట లేదా? నీ ఒక్కని పాపం వలన నీవేకాక ఈ లంకమొత్తం శీఘ్రంగా నాశనమగును. నీకీ నడవడికను ప్రోత్సహించు నీ కుహనామిత్రుల వలన కీడొందగలవు. సూర్యునికి సువర్చల ఎట్టిదో శ్రీరామునికి నేను నిత్యానపాయినిని. వైభవముల ఆశజూపి నీవు నన్ను మోసగింపజాలవు. నా నాథునకును నీకునూ పోలికయా! భర్త దూరమై విలపించుచున్న నా వద్దకు నా భర్తనుతెచ్చి నీ అపకీర్తి కళంకమును తొలగించుకొనుము. రాముని నీవు శరణు వేడినచో ఆ దయాపూర్ణుడు నీ కభయమొసంగ గలడు. కానిచో రాముని చేతిలో నీవు చచ్చుట సత్యము. నీకు వరములనిచ్చిన దేవుళ్లయొక్క ఇంద్రాదులయొక్క ఆయుధాలు వృథాయై పోయినచో పోవచ్చును. కాని రాముడలిగినచో అతని బాణాగ్ని నిన్ను దహించి తీరును. రాముడొంటివాడని తలంతువేమో. మీ రాక్షసోరగముల పాలిటికి ఆ రాముడు గరుత్మంతుడే. బలిని ఒంటరియైన వామనుడు దమింపజేయలేదా! ఆ మహనీయుని బలపరాక్రమాదుల తెలుసుకొనక నీవు అతనిని ఎదిరింపజూచుట పులులవాసన పసిపట్టగానే పారిపోవు కుక్కలాంటిదే. నీవు కైలాసములో దాక్కొన్నా రామబాణాగ్ని నిన్ను దహించి తీరుతుంది." అని సీత పలికిన పిమ్మట రావణుడు ఆ మాటలనెల్ల పెడచెవినిపెట్టి బెదిరింపు మాటలతో ఆమెను తన మార్గమునకు త్రిప్పుకొన ప్రయత్నించెను. "సీతా, నీవు నీ నోటికి వచ్చినదెల్లా పలుకుచున్నావేకాని నా ప్రార్థనలను వినవైతివి. నీ పలుకులకు నా కెంతయో కోపము వచ్చినను నీ మీద కోరిక వలన ఊరుకొన్నాను. నీకు (12 నెలలు) ద్వాదశ మాసములు గడువు ఇచ్చి యున్నాను. అందులో పది నెలలు పూర్తి అయినవి. ఈ రెండునెలలలో నీవు మనసు మార్చుకొని నా దానివి కావాలి. లేనిచో నీ మాంసమును నా ఉదయకాల భోజనములోనికి చేర్పింతును." అని రావణుడతిక్రూరముగా పలుకగా రాక్షసస్త్రీలు భీతిల్లిరి. కొందరు దేవతాస్త్రీలు తమ కనుసన్నలలో, పెదవి విరుపులతో వానికి లొంగవలదని సీతకు సైగలు వేయుట హనుమంతుడు చూచెను. అవి చూచిన సీత ధైర్యము వహించి "ఓరీ నేను రామపత్నిని ఇంతవరకు నీవు ఎన్నో అనరాని

మాటలనియున్నావు. ఆ పాపఫలము నిన్ను తరుముకొని వచ్చును. దొంగవలె సన్యాసి వేషమున వచ్చి నన్ను తస్కరించి తెచ్చినావు. నా నాథునికంటబడినచో అతని బాణాగ్ని రుచి తెలిసెడిది. కామముతో చూచు నీ కన్నులు నేలబడకుండా వున్నవే? నీ నాలుక చీలికలు కాకుండా ఉన్నదే? నిన్ను నేనే భస్మము చేయ గలదానను. కాని నా వల్లభుని అనతి లేనందున, నా తపోదీక్ష పొల్లు కాకుండు టకున్నూ వూరకున్నానే కానీ చేతకాక కాదు. నీవు నన్నేమీ చేయజాలవు. నిన్ను నాశనము చేయుటకే విధి నిన్నిట్లాడిస్తోంది." అని పలికెను. ఆ మాటలు విని కోపించి ఆమెను చంపుదునని బెదిరించి యింకనూ తన శౌర్యపరాక్రమా దుల పొగడి ఆమెను కాపలాకాయు రాక్షసస్త్రీలనుద్దేశించి సీతను మార్చు ప్రయత్నములు చేయునట్లాజ్ఞాపించి మరల ఉద్రేకముతో ఆమెను చేరబోగా ధాన్యమాలిని అడ్డుపడి మనసునకామించని సతిని పొందుటలో సౌఖ్యములేదని బోధించి అతనిని గృహోన్ముఖుని చేసెను.

ఆ రాక్షసస్త్రీలు సీత మనసు మార్చుటకై యత్నించిరి. అందులో ఏకజటి, హరిజట, వికట అనుస్త్రీలు తమ అనునయ వచనములకామెలో స్పందన లేనందున బెదరింపులతో రావణుని భర్తగా పొందుటలోని గొప్ప తనమును, రాముని హీనతను తెలుపగా ఆ మూకకు సీత తన పాతివ్రత్యమున కనువగు రీతిని సమాధానించుట హనుమంతుడు వినెను. చండోదరి, వికట, పఘస, అజాముఖి క్రూరవాక్యములతో ఆమెను తినివేయుదుమని బెదరించిరి. న దురవస్థకు సీత ఎంతో దుఃఖించి 'మీరు నన్ను చంపి తిందురా! అట్లో కానిండు నన్నింత బోధించిన ఈ రావణునకు నాశనము దాపురించినది. ఈ లంక పాడుపడిపోవు సూచనలు కనవస్తున్నవి. ఇది కాలిపోయి కాంతి హీనము కాగలదు. ఇచటి స్త్రీలకు వైధవ్యము రాగా వారు విలపించుట నేను వినురోజు దగ్గరగుచున్నది. నాకు రెండునెలల గడువుగూర్చి మీరు ఆలోచించు చున్నారే కానీ మీకు రాగల గండం గుర్తింపకున్నారు.' అని తెలిపిన ఆమె మాటలను తమ రాజుకు విన్పించుటకై కొందరు వెళ్లగా కొందరామెను నిందించుచుండిది.

అక్కడికి సమీపముననే త్రిజట అను వృద్ధరాక్షసి నిద్రించుచుండెను. ఆమెకంతవరకు జరిగిన విషయములు తెలియవు. ఆమె ఒక కలకాంచి నిద్ర లేచెను. రాక్షసస్త్రీలు సీతను నిందించుచున్నందున ఆమె వారిని చేరబిలిచి తన

స్వప్న వృత్తాంతము తెలిపెను. "సీత సాధ్వి - రామపత్ని - దశరథుని కోడలు - ఇప్పుడు మీరామెను నిందింపకుడు. ఈ ఉషఃకాలవేళలో నాకొక కల వచ్చినది. దాని ఫలితము ఈ రాక్షసులు సమూలముగా నాశనమగుటయే. రాముడు తెల్లని పుష్పములతో లక్ష్మణసమేతుడై లంకకు వచ్చుట; సీతారాముల కలయిక - వారికి దివ్యగంధర్వనాగాదుల సేవలు; దేహమంతా నూనె రాసుకొని రావణుడు ఎర్రని బట్టలు ధరించి ఒక స్త్రీచే ఈడ్వబడుట; విభీషణుడు తెల్లని వస్త్రాలతో, పూలమాలతో ఏనుగునెక్కి మంత్రులతో పరివేష్ఠింపబడియుండుట; కుంభకర్ణ ఇంద్రజిదాదులు రకరకాల దురవస్థల పాలగుట, ఇత్యాది విశేషముల నామె తెలుపగా రాక్షస స్త్రీలు భయపడిరి. "ఇన్నాళ్లు మనమామెను క్రూర వాక్యములతో బాధించినాము. ఇప్పుడు పశ్చాత్తాపముతో ఈమెనే శరణు వేడెదము. రావణుని నమ్మినచో మనకు దుర్గతి తప్పదు. కావున ఈమెనువదలి మీరువెళ్లుడు" అని త్రిజట తెలుపగా వారు వెళ్లిపోయిరి. ఈ సన్నివేశము హనుమంతునికానందము కల్గించెను.

రాక్షసస్త్రీల మాటలువిని సీత తన దుర్దశకు దుఃఖించి రాముడు గడువులోపల రానిచో తనను రావణుడు చంపి తినునని తలంచి తాను ఉరి పోసికొని చచ్చుటమేలని భావించి చెట్టుకొమ్మను చూచుకొనబోయెను. అంతలో ఆమెకు శుభశకునములు పొడచూపినందున అమె హర్షకలితకాగా రామ చంద్రుని సందేశము నామెకందించుటకదియే తగిన సమయముగా హనుమ గుర్తించెను. ఇప్పటివరకు జరిగిన సంఘటనలవలన ఆమెయే సీత అని తెలిసిపోయినను అమె సాముద్రిక చిహ్నములు, ఆమె పాతివ్రత్య స్వభావము మరింత నమ్మకమతనికి కల్గించెను.

సీతతో సంభాషణ మారంభించుటకు పూనుకొనుటతోనే హనుమంతు నిలో నెన్నియో తలంపులు కలిగెను. "ఏ సతి రత్నము కొఱకు వానరులు బయలుదేరిరో అమెను చూడగల్గితినిగదా! ఇంకను ఈమెతోపాటు ఎన్నో సంగతులు తెలిసికొనగల్గితిని."

చారుడనై యోగ్యుడనై
వైరి బలాబలము లెఱుగ మతినో నే
నారసి యసుర విశేషము
లీ రావణు బలము పురము నెఱిగితి నెల్లన్.[113]

"ఈమెకు ధైర్యవచనముల తెల్పి, బోధించి, చేయబోవు మరణ ప్రయత్నమునుండి విరమింపజేయాలికదా! ఇందరు రాక్షసులుండగా నేనీమెతో ఎట్లు భాషించగలను? ఆలస్యంచేస్తే ఈమె ప్రాణాలు తీసుకొనునేమో ? ఈమెతో మాట్లాడకుండా వెళ్లినచో రామునకేమని బదులు చెప్పగలను ? సీత జాడగురించిచెప్పి సాక్షాత్తుగా శ్రీరామునే తేగల్గినచో బాగుండును. కాని మేము వచ్చులోగా ఈమె ప్రాయోపవేశము చేసినచో చేసినయత్నము వృధా యగునుకదా? అల్పశరీరుడనగు వానరుడనై మనుజునివలె నేను సంస్కృత ములో మాట్లాడినచో ఈమె భయపడి నన్ను రావణాసురునిగానే తలంచవచ్చు. ఏమియును పలుకకుండా ఈమె నోదార్చుటెట్లు నెరవేరును? నేను మాట్లాడినచో ఏరీతిగా మాట్లాడవలెను – ప్రాకృతములో మాట్లాడినచో రాక్షసులకది అర్థము కాదు. మనుష్యులభాష మాట్లాడినచో కోతినై మనుష్యభాష మాట్లాడుచున్న రాక్షసమాయగా భావించుకొని కామరూపధరుడైన రాక్షసులలో నన్నొకనిగా గణించును. అంతేకాక ఆమె భయపడి, అరచినచో రాక్షసులువచ్చి నన్ను పట్టి చంపుటో లేక రావణునివద్దకు లాక్కొని వెళ్లుటయో చేయుదురు. నాకు రాక్షసులతో యుద్ధమేరీతిగావచ్చినా అది కాలహరణమునకు తోడ్పడును. నన్ను వారుగుర్తించినచో సీతకేదైనా ప్రమాదమును వారు కల్గింపగలరు. లేదా. వారామెను రహస్య ప్రదేశములో దాచు ప్రయత్నమైన చేసెదరు. ఒకవేళ యుద్ధములో నేను రాక్షసులను చంపగల్గిననూ ఆ బడలికతో సముద్రమును దాటి పోలేకపోయినచో మేలు కలుగదు. కావున శంకకు చోటిచ్చు పనులను నేను చేయరాదు. బాగుగా ఆలోచింపనిదే నా కర్తవ్యమును తొందరపడి నిర్ణయించరాదు. పలుకరింపనిచో కల్గు ప్రమాదము, పలుకరించినచో వచ్చు అనర్థములు ఎన్నో ఉన్నవి. ఇట్టి సందర్భాలలో దేశకాల జ్ఞానౌచిత్య విరహిత మైన చర్యకు పూనిన దూత తన కార్యమును చెరచుకొనును. కాగల కార్యము దూత అసమర్థత వలన చెడవచ్చును. ఇంతవరకు నేను సాధించినదేదియు వృథాకాకుండా సీత నన్ను చూచి భయపడకుండా, నా మాటలను ఆసక్తితో వినునట్లుగా చేయుటకు తగిన మార్గమును నేను నిర్ణయించుకొనాలి." అని ఆంజనేయుడాలోచించి—

కార్యనిశ్చయము నీ కరణిని గావించె
వా రూపమును జూపకా రఘూత్త

మునిని కీర్తించెద వనజాతలోన
భయపడకుండెడు పగిది గాగ
రఘుకుల గ్రామణి రాముని విదితాత్ము
ధర్మసహిత శుభదంబు లైన
మధుర వాక్యములను మానుగ నమ్మిక
పుట్టునట్టి భంగిఁ బొగడువాడ
వెలది యెంత మట్టు విశ్వసించునో దాని
నెఱిగి యవల కార్యమే నొనర్తు.[114]

—అని నిర్ణయించుకొని హనుమంతుడామెను చూస్తూ ఆమెకు మాత్రమే వినపడేలాగున ఆ చెట్టు కొమ్మలలో నుండి మధురమైన వాక్యములలో దశరథ మహారాజుతో ప్రారంభించి సీతాపహరణము వరకు గల రాముని కథ నంతయు తెలిపెను. సీతాదేవి దానిని వినుచుండుట గమనించి రామసుగ్రీవ స్నేహము, సీతాన్వేషణయత్నము, సంపాతివచనములాధారముగా సముద్ర మును లంఘించి తాను వచ్చినట్లుగా పలికి రాముడు వర్ణించిన సీతను అదే వర్ణరూప కాంతి గుణయుక్తను తన పూర్వ పుణ్య వశమున దర్శింప గలిగితి నని పలికెను.

ఆ పలుకులు వినరాగానే సీతాదేవి శింశుపావృక్షములోని కొకమారు తేరిపారచూచెను. తెల్లని వస్త్రముతో పింగళ వర్ణముతో పచ్చని కన్నులతో నున్న కోతిని చూచి చలించి తద్దర్శన ఫలముగా ఏ కీడు మూడునోయని పరిపరివిధాల భావించసాగగా అంజనేయుడు వినీతవేషముతో ఆ వృక్ష మందలి క్రింది కొమ్మమీాదికి దిగి చేతులుజోడించి శిరమున కీలించి సీతాదేవినే సంబోధిస్తు మధురవాక్యములతో 'అమ్మా! నీవెవరవు క్లిష్టకౌశేయము ధరించి చెట్టు కొమ్మనే ఆధారముగాకొని ఎందుకున్నావు? దుఃఖించుచు కన్నుల నీరేల కార్చుచున్నావు? నా మీాద అనుగ్రహించి చెప్పుము తల్లీ, దేవాసుర నాగ గంధర్వ యక్ష రాక్షస కాంతలలో నీవెవరవో? మరుద్వసు రుద్రగణములకు చెందినదానవా? చంద్రుని విడిచి నేల చేరిన రోహిణివా! వసిష్ఠుని విడిచియున్న అరుంధతివా! నీ శుభలక్షణముల చూడగా నీవు మానవకాంతవో! దేవతవో! నీకు శుభమగు గాక. నీవిట్లు దుఃఖింప వలసిన కారణమేదియును లేదు. నీ తండ్రి యెవరో, తోబుట్టువు లెవరో, నీ నాథుడెవరో, నీ సుతుడెవరో తెలు

పుము. రూపమును బట్టి నిన్ను దేవతగా భావించునాకు నీ నిట్టూర్పులు రాజ చిహ్నములు గల నీ పాదాలు నేల తాకు చున్నందున నీవు మనుష్య కాంత వనే నమ్మకము కలుగుచున్నది. మంగళకరమైన నీ లక్షణములు చూచుచుం డగా నీవు క్షత్రియ స్త్రీ వనియు చక్రవర్తియైన వాని పట్టమహిషివనియు తోచు చున్నది. దండకారణ్యములో సంచరించుచుండగా రావణుడు ఎత్తుకొని వచ్చిన సీతాదేవివి నీవేనా! శ్రీరాముని సతివి నీవేకదా! నీ వృత్తాంతమంతయు సాకల్యా ముగా చెప్పినచో నీకు శుభమగుగాక " అని హనుమంతుడు పలుకగానే సీతా దేవి అతనిని చెట్టుకొమ్మ నాశ్రయించియున్నట్లుగా గమనించి తాను దశరథుని కోడలననియు, జనకపుత్రియై, రామపత్నియై అరణ్యములకు వచ్చుటకు గల కథనంతయు తెలిపి తనకు రావణుడు రెండు నెలల గడువు నిచ్చియున్నట్లును తాను శ్రీరాముని రాకకై ఎదురుచూచుచున్నట్లునూ చెప్పెను.

అపుడాంజనేయుడామెను చూచి ' అమ్మా నేను రాముని దూతను. అతని సందేశము నీకందింప వచ్చియున్నాను. తమ క్షేమములను తెలిపి నీ క్షేమము నెఱుంగకోరి నన్ను పంపెను. లక్ష్మణుడు నీకు తన ప్రణామముల నర్పించినట్లు తెలుపమన్నాడు.' అని పలుకగానే మైథిలి " నాయనా, దేహత్యాగ మొనర్ప కుండా ఉండినందుకు ఫలితం ఇప్పుడు పొందినాను. రామలక్ష్మణుల కుశల వార్త వినినందుకు నాకెంతో ఆనందమైనది " అని పలుకుచుండగనే హను మంతుడు ఈమెకు నాపై నమ్మకం ఏర్పడినదని తనలోనే రూఢి చేసుకొని ఆమె దుఃఖమునుపశమింప జేయతలంపుతో చెట్టుదిగి మెల్లగా ఆమెను సమీ పింపబోవగా, సీతకు వెంటనే రావణుడే మాయావానరాకారమున వచ్చినాడను సందేహము కలిగెను. ఆమె తాను వానితో మాట్లాడితినికదా అని చింతించి నేలకూలిపోయెను. కొద్దిలో ఆమె మూర్ఛ నుండి తేరుకొని చూచెను. ఆమెకు హనుమంతుడు నమస్కరించుచు నిల్చియుండెను. అతడు రావణుడు కాదను భావన ఆమె పొంది —

.... " మదిదోఁచె నిన్ననన్

భావము నందు బ్రీతి ప్రభవంబగు చున్నది, రామదూతవేన్
వావిరి మేలు నీకగుత వర్ణన సేయుము మత్ప్రియంబు లొ
నా విభురామచంద్రుని గుణంబులనంత ముదంబు నాకగున్ " 115

— అని పలికెను. ప్రవాహవేగము ఏటిగట్టును హరించినట్లు నీసౌమ్యాకారము నా మనస్సును లాగుచున్నదని పలుకుచు మరల లోలోపల అనుమానముకలిగి మౌనము వహించెను. ఆమె చిత్తస్థితిని గుర్తించిన మారుతి ఆమె సందేహమును తొలగించుట తన ప్రథమ కర్తవ్యముగా భావించెను.

శ్రీరాముని వర్ణింపుమని ఆమెకోరినందున ఆయనను వర్ణించినచో ఆమెకు విశ్వాసము కలుగునని యెంచి అంజనేయుడు 'తల్లీ రాముడు కుబేరునివలె రాజాధిరాజు, విష్ణువలె మహాపరాక్రమశాలి, శత్రు భీకరుడు, మధురభాషణుడు, సత్యశీలి, కాంతిమంతుడు, మన్మథాకారుడు, మహారథుడు, యుక్త విషయములలో కోపించువాడు – అట్టి రాముని మోసపుచ్చి ఆశ్రమము నుండి నిన్ను దొంగలించి తెచ్చిన రావణునకు కలుగు దుర్గతి నీవు చూడగలదానవు అ రాముడు స్వయముగా పంపగా వచ్చిన దూతను నేను. వాస్తవముగా నేను దూతను కానేమోనని నీవు అనుమానింపకుమమ్మా. నీ వియోగము వలన పరితపించు రాముడు నీక్షేమమడిగినాడు. లక్ష్మణుడు, సుగ్రీవుడు తక్కినవారందరు నీ క్షేమవార్తకై తహతహలాడుచున్నారు. నీ జాడ తెలియగానే వారంతా వచ్చి రావణుని నిర్జింప యత్నింపగలరు. నీవు నన్ను ఎవరని భ్రమించుచుంటివో ఆ రావణుని మాత్రం నేనుకాను. నీవు అనుమానించక నా పలుకులను ఆలకింపుము" — అని ప్రార్థించెను ఆ మాటలకు సీత ధైర్యం వహించి శ్రీరామచంద్రులకు హనుమంతునితో పరిచయమెట్లయ్యెనో, నరవానర మైత్రి ఎట్లు ఘటిల్లెనో తెల్పి శ్రీ రామలక్ష్మణుల రూపురేఖలు వాని శుభాంశములు తెల్పుమని కోరెను.

సీతకోరినదే తడవుగా హనుమంతుడానందించి "అమ్మా, నీవు నన్ను నమ్మి నీ మౌనవ్రతాన్ని మాని నీ భర్తయొక్కయు నీ మరిదియొక్కయు రూప చిహ్నములను, ప్రశస్త గుణాదులను చెప్పుమని కోరినావు. ఆ రాఘవుల రూప గుణాను కీర్తన మొనరించు అదృష్టమును నీవు మా దాసుడనగు నాకు కల్పించినందుకు నా భాగ్యమే భాగ్యము. (శ్రీరామలక్ష్మణుల రూపగుణాదుల వర్ణన వివరములకు సర్గ 35 చూడదగును) రాముడు పద్మపత్ర విశాలలోచనుడు; అఖిలసత్త్వమనోహరుడు; రూపదాక్షిణ్యనిరూథుడు, తేజమున సూర్యుని, ఓరిమిలో పుడమిని, బుద్ధిలో బృహస్పతిని, కీర్తిలో ఇంద్రునికి సమానుడు. జగద్రక్షకుడు, ఆశ్రితరక్షకుడు కులధర్మము కాపాడువాడు. మనస్సునకేది హితమో

దానిని తానుచరించి మార్గముచూపి తర్వాత ఇతరులెట్లు నడచుకొనవలెనో తెలియజేయువాడు; బ్రహ్మచర్యవ్రతనిష్ఠుడు, సాధులకుప్రాపు, శీలధనుడు, నీతియుక్తమగు ప్రవర్తన గలవాడు, వేదవేదాంగాలు ధనుర్వేదమూ తెలిసినవాడు వెడల్పుమూపురములు గలవాడు, నిడువగు బాహువులు గలవాడు, మేఘచ్ఛాయ వర్ణమువాడు; అట్లే లక్ష్మణుని రూపమును, రామసుగ్రీవ సఖ్యమును, సీతా సంబంధమగు శ్రీరామవిరహము, సీతాన్వేషణాయత్నములు, సంపాతివచనములు, సాగరలంఘనము మరల వివరముగా తెలిపెను. సీతకు తన మాటల యందు ప్రత్యయమేర్పడినదని గుర్తించి, అమ్మా! నేను లంకానగరంలో రాత్రిపూట కామరూపధారినై సూక్ష్మరూపమున ప్రవేశించి ఎల్లెడల వెదకినాను ఎట్టకేలకు నిన్ను కనుగొనగల్గినాను. నేను అంజనాకేశరుల పుత్రుడను, వాయుదేవుని వరమున జన్మించినవాడను, నన్ను నమ్ముము, హనుమంతుడే సముద్రమును లంఘించి సీతను చూచెనను యశమును పొందితివి. ఇదిగో, రాముడిచ్చిన రామాకింతమైన ఉంగరము, దీనిని చూచి నీవు విశ్వసింప వలసినది. ఇంక నీకష్టములు తొలగిపోవుగాక. నీవు శ్రీరాముని తప్పక కలిసికొనగలవు తల్లీ" అని ఆమె నమ్మునట్లుగా పలికెను.

అంజనేయుని వాక్యముల విశ్వసించి సీతాదేవి ఆ ఉంగరమును స్వీకరించి స్మృతితరంగముల నోలలాడి హనుమనెంతయో స్తుతించెను.

జలనిధి యోజనశతము గోష్పదముగా
లంఘించి యొక్కడ లంకఁజొచ్చి
తీవే శూరుండవు నీవే సమర్థుండ
వీవే ప్రాజ్ఞుఁడవు కపీంద్రచంద్ర
సామాన్య వానరునిగా మది నమ్మగ
జాల రావణుదన సంభ్రమంబు
సంత్రాసమును లేమి సమభి భాషింపగఁ
బావని తగుదువు ప్రాణనాథు
డైన శ్రీరామునకు దూతవగుట జేసి
పంపఁడతఁ డపరీక్షితుఁ బవన తనయ
యందు లోపల నాకొలకంపునవుడు
పటు పరాక్రమవంతుని బంపుగావి.[116]

—అని శ్రీరాముని, తత్సంబంధుల కుశలమడిగి "దూతగా వచ్చిన హనుమా! నా నాథుని వార్తకొఱకై మేనిలో ప్రాణాలుంచుకొని యున్నాను" అని పలికెను. రామపరతంత్రుడగు అంజనేయుడింకను రామనామగుణ సంకీర్తన మొనర్చుచో వినదలచినదై సీత మౌనము పూనెను.

మారుతి అంతట "ఇన్నాళ్ళు మీ జాడ తెలియనందున రామప్రభువు రాకుండెను. నా ద్వారా మీ వార్త తెలియగానే వచ్చి మిమ్ము కాపాడును. నావలె సముద్రాన్నిదాటి నీ నాథుడు రాజాలడేమోనను విచారము నీ వొంద కుము. అవసరమునుబట్టి ఆ సముద్రాన్నే స్తబ్దమొనర్చి, ఎవడడ్డగించినా వచ్చి రాముడు తప్పక ఆ రావణుని కూల్చును" అని మేరునగవింధ్యాది పర్వ తములలో మాకు ఆహారమగు ఫలములమీద, దుంపలమీద ప్రమాణముచేసి తెలుపుచున్నాను. త్వరలో నీవు నీ నాథుని చూడగలవు. ఆయనయొక్క అరతి, నిద్రలేమి మొదలగు మదనావస్థల నే నేమని వర్ణింపను? నీ విరహ మున ఆయన కృషించియున్నాడు. నీకై దుఃఖించుచున్నాడు. నిన్ను రక్షించు ప్రయత్నములోనే యున్నాడు" అని ఆమెకు ధైర్యమధికమగు మాటలనే హనుమంతుడు చెప్పెను.

అమృతములో విషమును కలిపినట్లున్న ఆ పలుకులలో శ్రీరాముని దుఃఖ మునుగూర్చి వినజాలక, తనను రక్షించుటకు గడువు రెండునెలలే వున్నందున ఆలోగావచ్చి తన పరాక్రమముతో రాక్షసులవధించి తనను కాపాడు సమయ మునకై ఎదురుచూచుచున్నట్లు సీత పలికెను. ఈ పలుకులు వినిన హనుమకును ఒక ఆలోచన కలిగెను. "అమ్మా! శ్రీరాముడువచ్చి రక్షించు వరకు నీకు దుఃఖము భరింపరానిదై యున్నచో నిన్ను నేను నా వీపుపై ఎక్కించుకొని సముద్రమునుదాటి నీ భర్తదగ్గరకు చేర్పగలను.—

నీ వొకతివేల లంకను
రావణునిన్ మోచికొనుచు రయమున, బోవం
గా వలతిని జేర్చెద నివు
డే విభుకడ హవ్యమగ్ని యింద్రునకు వలెన్.[117]

—నా మాటలను నీ వుపేక్షింపకుము. నే నీ లంకకెట్లువచ్చితినో అట్లే నిన్ను తీసికొని పోగలను. రాక్షసులందరొక్కటై వచ్చినా నన్నాపజాలరు" అని

సీతాదేవి బాధను తీర్పలయుననను భక్తితీవ్రతవలన తొందరలో హనుమంతుడు పలుకగానే సీతాదేవి "నీవు నీ వానరబుద్ధిని చూపితివికదా! నీ మాటలు నాకు వింతగానున్నవి. ఇంత చిన్న ఆకారముగల నీవు నన్ను మోసికొని పోవుటయా?" అని అనుమానము వ్యక్తపరచెను.

ఆమె అనిన మాటలు తనకవమానకరమైనవిగా తలంచి, తన సంగతి తెలియనందున ఆమె అట్లు సందేహించినదని తనకు తానే సమాధానపరచుకొని ఆమె నమ్మునట్లు చేయుటకై తన నిజరూపాన్ని చూపడానికై నేలమీదికిదూకి శరీరాన్ని పెంచి విరాడ్రూపమెత్తెను. అతని రూపాన్ని దర్శించిన వెంటనే సీతాదేవి "ఓ కపీశ్వరా! నీ బలగర్వ సమున్నతి, వాయువేగము, వనదహనోరు తేజము చూడగల్గితిని. నీవు కేవల కోతిమాత్రుడవుగావు. నీవు ఒంటరిగా సముద్రాన్ని లంఘించి వచ్చుటలోనే నీ సామర్థ్యము తెలిసినది. నీవు నన్ను మోసుకొని పోగలవాడవని నాకు నమ్మకమున్ననూ నా నాథునకు కార్యసాధనకై వీలు కల్పించుట నా కర్తవ్యము అని పలుకుచు సీతాదేవి ఇంకను కొన్ని ప్రబల కారణములను జూపి సున్నితమైన మార్గమున హితవాక్యములతో అతని వీపుపై కూర్చొని వెళ్ళుటకు నిరాకరించెను. మరియు సీత పరాత్పరుడగు నా పతినితప్ప అన్యోపాయముల నే నాశ్రయింపను. నా రక్షణభారమతనియందే యున్నది" అని పలుకుటను విని హనుమంతుడు తన రూపమును చిన్నదగునట్లుగా నొనర్చి సాధ్వీశీలమునకుచితమగు రీతిని భాషించి నందుకామెను బహుధాప్రశంశించుచు "తల్లీ! నీవు అబలవగుటవలన నీ కట్టి సందేహము, పిరికితనమూ ఉండుట సహజమే. తప్పించుకొనిపోవు నుపాయమును నేను చెప్పిననూ నీవు నీ నాథునే ఉపాయముగా భావించినావు. కాన నీవు ఆయనకు తగిన భార్యవే. నీకు మేలొనర్పవలయునని నే నట్లంటినే కాని నామాటలో దోషమెన్నవద్దు. నీవు నాతో రాజాలనిచో శ్రీరామునకు నీ అభిజ్ఞగా దేనినైనా ఇమ్ము" అని హనుమంతుడు కోరెను. అపుడు సీత శోకించుచు చిత్రకూటమున జరిగిన కాకాసురుని వృత్తాంత విషయముల నన్నింటిని తెలిపి, తనకు చిన్న అపకారమొనర్చిన కాకిపై బ్రహ్మాస్త్రము సంధించిన పతి తనకెంతో కీడుతలపెట్టిన రావణుని నిర్జించుటకేల రాకున్నాడో అని పలికి, రామలక్ష్మణులకు తన సందేశముల తెలిపి తన కొంగున దాచియుంచిన శిరోమణినితీసి దానిని తన గుర్తుగా రామునకీయుమని హనుమంతున

కిచ్చెను. భక్తితో హనుమంతుడా చూడామణిని గ్రహించి దానిని తనవ్రేలికి ఉంగరముగా ధరించి ఆమెకు ప్రదక్షిణమాచరించి నమస్కరించెను. సీతా సందర్శనానందముచే దైహికముగా అచటనే యున్నను హృదయములో శ్రీరాముని చేరినట్లే హనుమ భావింపసాగెను. తిరిగి వెళ్ళుటకై హనుమంతు డుద్యుక్తుడగుటను చూచిన సీత "హనుమా! ఈ నా శిరోమణిని రామునకు నీవు ఇచ్చినంతనే ఆయన నన్నూ, నా తల్లినీ, నా మామగారగు దశరథుల వారిని స్మరించును. ఆయనను ప్రోత్సాహపరచుటలో, రామునికర్తవ్యములో, ఏదేది ఎట్లొనర్చవలయునో నీవే ఆలోచించి నా కష్టము తీర్చుభారము వహింపుము" అని కోరెను అట్లే చేయుదునని ఆంజనేయుడు ప్రతిజ్ఞచేసి ఆమెకు సాష్టాంగ ప్రణామముచేసి శ్రీరామాదులవద్దకు పోవుటకై పయనమయ్యెను. అతని ప్రయాణత్వరను చూచిన సీత మరల దుఃఖమొంది "నాయనా! రామాదు లందరి కుశలము నడిగితి ననుము. నన్ను శోకసాగరమునుండి తరింపజేయు కర్తవ్యమునకు రాముని సమ్మతింపచేయుము. నా నాథుడువచ్చి నా ప్రాణాలు పోకపూర్వమే రక్షించుటకు వాబాపుణ్యము కట్టుకొనుము. సాహసవంతుడ వగు నీవు సందేహమున కెడమీయని మాటలుచెప్పి అతనిని ప్రేరేపించి, ఉత్సాహపరచి, రాక్షసులపై తన పరాక్రమమును ప్రయోగించునట్లుచేయుము" అని పలికెను.

ఆంజనేయుడంత శ్రీరాముని పరాక్రమమును పొగడి తప్పక రాముడా మెను రక్షించునని చెప్పి రామునిశక్తికి ఆమెయే మూలమని పలికి నిశ్చింతగా నుండుమనికోరెను. సయుక్తికమై, సత్యమై, సుభాషితమైన అతని పలుకులను మెచ్చుకొని హనుమంతుని మరల మరల చూచుచు 'హనుమా నీకు అమోద మైనచో ఈ ఒక్కరోజు నీవు ఇక్కడనే ఎక్కడనైనా చాటుమాటుగా వుండి, అలసట తీరిన తర్వాత రేపు పోరాదా! నీవు ఇక్కడనే ఉన్నచో నాలోగల దుఃఖం కొంచెం తగ్గినట్లనిపించును. నీవు పోగానే మరల నాకు ప్రాణసందేహ స్థితియేవచ్చును. నిన్ను చూచునపుడు నేను పొందిన శాంతి, నీవు పోగానే పోయి మరల నాకు పరితాపము కల్గును. నీవు వానరభల్లూక సైన్యముతో రాముడు రాగలడని చెప్పియున్నావు. కాని, వారు సముద్రమునుదాటి ఎట్లు రాగలరో అను సందేహము నన్ను పీడించుచున్నది. వాయుదేవుడు, గరుత్మంతుడు, నీవు యీ ముగ్గురు తప్ప వేరొకరీసాగరాన్ని దాట జాలరే! నీకు తెలియని కార్య పద్ధతులు లేవు. నీవు ఒక్కడవే ఈ పనిని సాధింపగలవు. మరియొకరీ కార్య

ముసు చేయజాలరు. నీవే ఈ కార్యమొనర్చినచో ఆ కీర్తి నీకే దక్కునుకానీ నాకుకాదు. రాముడే వచ్చి రావణుని చంపి నన్ను అయోధ్యకు తీసుకొని వెళ్లినచో అదినాకు కీర్తికరముగదా" అని సహేతుకముగా సీతపలుకగా ఆంజనేయుడామెహితకరమైన వాక్కులను మెచ్చి ఆమె అనుమానమును నివృత్తి చేయుటకై పూనెను. 'సాధ్వీమణీ! నీవు సంశయింప వలసిన పనిలేదు. సుగ్రీవుని సైన్యములోని వానర భల్లూకములలో గొప్ప వీరులున్నారు. వారు దేవతాసమానులు. దిక్కులందును, ఆకాశములోను మనోవేగముతో సంచరింపగలవారు. ఎంతటి కఠినకార్యమునైనా చులకనగా చేయగలవారు. జలధిపరివేష్ఠిత భూమండలమునే పరివేష్ఠించి రాగలట్టివారు. నాకంటేగొప్పవారు, నాతోసమానమైనవారు ఎందరో వీరులందున్నారు. నాకన్నా హీనమైనవాడొక్కడుగూడ అక్కడలేడు. నేను వచ్చియే నిన్ను చూచితిననగా ఇంక వారే ఇటకు వచ్చియుండినచో ఎంత సాధించెడివారో? అంతేకాక ఇందొక రాజనీతి రహస్యముగూడ కలదు. శత్రు ప్రదేశములకు పంపునపుడు ప్రభువు సామాన్యునే పంపునుగానీ ఉత్తములను పంపడు. కావున నావలెనే ఇతరవానరులు ఇక్కడికి వచ్చుటలో సందేహింపనక్కరలేదు. నీవు దుఃఖపడునవసరములేదు. నేనువెళ్లివారికి చెప్పగానే వానరులొక్కగంతులో లంకను చేరగలరు. సూర్యచంద్రులవలె ఆ రామలక్ష్మణులు నా వీపుపైనెక్కి నీ ఎదుట వాలగలరు. వారు తమ అమోఘ శస్త్రాస్త్రములచే లంకను పొడి పొడిచేసి రావణుని చంపి నిన్ను ఈ ఆపద నుండి తప్పింపగలరు. పుత్రకళత్ర బంధుమిత్ర సహితంగా రావణుడు నేలబడుట చూచి నీవు ఈ దుఃఖసాగరాన్ని దాటి సమ్మోదముతో నీ విభుని పొందగలవు. అంతవరకు కాలము గడుపుచు రోజులను లెక్కించుచు ఉండుముతల్లీ. అని ఆమెనూరడించెను. పయనమై సాగి మరల ఆమెకు ధైర్యవచనంబులతెల్పి 'నేనువెళ్లి వార్తనందించుటయే ఆలస్యముకాని రామునికర్తవ్యమునందింకే ఆలస్యముండదుసుమా' అని సెలవు తీసికొనెను. అట్లుపోనున్న హనుమను చూచి సీత——

నీ ప్రియసూక్తులు నిండుముదంబిచ్చె
        వాడిన మదికిని వానయట్లు
శోకంబుచే(జాల శుష్కించి యుండు నా
        యవయవంబుల చేత నానదీర
నెట్టు లాత్మేశునే స్పృశియింప గలనో నీ
        వట్లు సేయుము పటువట్లు దొలగ 118A

— అని పలికి "కాకాసురుని కథయేకాక మరియొక గుర్తును కూడ నీకు తెల్పు చున్నాను. అరణ్యసంచారములో నాస్వేదబిందువులకు నుదుటి తిలకము కరిగి పోగా అపుడు నానాథుడొక బండపై మణిశిలతో రాచినా నుదుటి తిలకము దిద్దెను. దీనినికూడ నీవు ప్రత్యభిజ్ఞగా తెలుపుమని" కోరి శ్రీరామాదుల కర్త వ్యమునింకొకమారు గుర్తుచేసెను. ఆమె మాటలన్నింటిని వినిన హనుమంతుడు ఆమె అనుమతి పొంది ప్రయాణమునకు తగినట్లుగా దేహమును పెంచబూనెను "నీకు మార్గము నిర్విఘ్నమై శుభకరమై యుండుగాక" అని సీత అతనిని దీవించెను. హనుమంతుడంతట అచోటు వీడి తాను లంకలో చేయవలసిన కార్యశేషమేదేని కలదేమోనని తనలో తాను తర్కించుకొనసాగెను.[118B]

పరాశరసంహితలో అంజనేయుని సాగరలంఘనాది విశేషములు లంకలో సీతను దర్శించిన విధమును గూర్చి ఏమియు లేదు. ఇతర రామా యణములు వాల్మీకిలోని అంశములనే పేర్కొనినవి. జానపదులను సంతోష పరచుటకో లేక కొన్ని హాస్యసన్నివేశములను కల్పించుటకో అధునికులు కొం దరు హనుమంతునిచే కొన్ని కోతిచేష్టలను చేయించినట్లు కల్పించి యున్నారు. అవి ఆంజనేయుని పాత్రను కించపరచునవిగను అతని శీలమునకు మచ్చ తెచ్చునవిగను ఉన్నవి. దీనికి ఉదాహరణము అనందరామాయణమే. (అవి యేవన, లంకలోని దీపాలను ఆర్పివేయుట, నిద్రించురావణాదివీరుల వస్త్రము లూడదీసి వారిని నగ్నదేహుల చేయుట, రావణుని మీసములు గడ్డమును కాల్చుట; నగ్నంగాపరుండిన రాక్షసాంగనలకు నీటికుండలను కట్టుట; భటు లను తోకతో బెదరించుట; రావణుని భార్యయగు మండోదరి శయ్యపై విభీష ణుని సతుల వస్త్రాలుంచుట; విభీషణ పత్నుల వద్ద మండోదరి వస్త్రాలుంచుట; గయుడను రాక్షసుని బట్టలను మండోదరి శయ్యపైవేయుట; అది చూచిన రావణుడు మండోదరినుపేక్షించి గయుని వధించుట; ఇత్యాదులు.)[119]

శ్రీపాదవారి శ్రీకృష్ణరామాయణం: అంజనేయుడు లంకలోచొచ్చి విభీష ణుని ఇంట సూక్ష్మరూపమున దాగియుండెను. విభీషణుడు తన భార్యకు రామాయణకథను వినిపించుచు హనుమంతుడు లంకకు వచ్చుననియు అతనిచే లంక దహింపబడుననియు, రావణుని రాముడు వధించుననియు, తెలిపిన మాటలను అంజనేయుడు వినెను. [120] సీత అశోకవనమున నున్నట్లు హనుమ అనుమానించుటకు కారణమొకటున్నది. సీతకు అనసూయ ఇచ్చిన అంగరాగ పరిమళము వలన హనుమంతుడట్లూహించెను.[121]

"షోడశి రామాయణ రహస్యములు" లో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ గారు సీతను దర్శించిన హనుమంతుడామెను సందిగ్ధమైన స్మృతివలెను, శ్రద్ధ వలెను, సిద్ధివలెను, ఆజ్ఞవలెను వాల్మీకికవి వర్ణించిన పలుకులలోని [చూడుము పుట. 117] విశేషముల తెల్పియున్నారు. లలితాసహస్రనామములో ఆమెకుగల నామములలో స్మృత్యైనమః, ఆజ్ఞాయైనమః; ప్రతిష్ఠాయైనమః, మహాసిద్ధ్యై నమః అనునవికలవు. సీత సాక్షాత్ పరదేవతయని హనుమ గుర్తించెనని తెలుపుటకే మహర్షి అట్లు వర్ణించిరి.[122] అనితెలిపెను.

శ్రీమద్రామాయణ కల్పవృక్షం: సీతను గుర్తించుటలో కవిసామ్రాట్ గారు సున్నితమైన కవితా మార్గంలో ప్రశంసనీయముగా కొన్ని కారణముల కల్పించియున్నారు. సీత ధరించియుండిన పాతచీరను చూస్తూనే ఆమె నతడు సీతగా నిర్ణయించుకొనెను.

చీరవించి నగలు చేరిచి మూటగా
గట్టి నాడు విడిచె గమలనేత్ర
నాడు గ్రొత్తచీర నేడు ప్రాతపడ్డది
యదియ యిది యటన్నయట్లు తోచు

నీరజపత్రనేత్ర కమనీయ తపస్యముదాద భావనా
వారిధి వారి సంభవ ప్రభావరఘూద్వహు భార్యయేయగున్

....

ఈమె వైదేహియేయగు నీమెదేహ
మున్నయట్లుగ లేనట్లునుజ్జ్వలించు
సరససౌదామనీ సుభాస మనిరాకు
ధృతవిరాగితకృత విశాదవృతి వెలుంగు.

....
.... వాలి
వధమునందున నేదొ లోపమనిపించు
సీతరూపంబు సంశయచ్ఛేది యయ్యె
ఈయమకై యాయన మరి
చేయని దేమంచుమండు సృష్టి సమస్తం

టీయము కాపద కలిగిన
మాయించును దీవ్రవాపమంత్రాహుతులన్

చేతమునందుఁ బూర్వమున శ్రీ రఘురాము నెఱింగినట్లుగా
నేతలపోసినాడ నిపుడీయమ గాంచినయంత సర్వము
జ్ఞాతముగాఁగనుండె నను సంగతి నాకెఱుగంగ నయ్యెడున్
సీతనెఱుంగకుండ రఘుశేఖరు డర్థము కాడు పూర్తిగా.[122]

సుందరమందారము ప్రకారం: సీతకు రామసందేశము వినిపించుటకై వచ్చిన హనుమ పడినపాటు ఈ గ్రంథము విశదీకరించుచున్నది. సునిశిత ముగా సున్నితముగా సాధింప వలసిన కార్యములకు కావలసిన ప్రజ్ఞ, యుద్ధ రంగమున చూపు శౌర్యసాహసాదులకన్న మిన్నగా నుండునట్టిది. ఆ ప్రజ్ఞ అంజనేయునిదే.

శ్రీరామచంద్రుడే చెట్టుదిగి వచ్చినన్
దైతేయుడంచు సీతమ్మ శంకించు
ఎట్లు మాట్లాడవలె ఈ సతీమణితోడ
ఎట్లు నమ్మింపవలె ఈ జానకీమణిని
ఈ వార్ధి లంఘనము ఇంత కష్టముకాదు
మాట్లాడకేగుటయు మర్యాదకాదు
రామప్రసంగమ్ము రామసంకీర్తనము
నొనగూర్చు చుండుటే ఒక సుగమమార్గము.
జనని సందేహభావ జనితవాక్య
వహ్ని సెగలకు మారుతి వదనసుమము
వాడిపోయెను బాష్పప్రవాహ ముబికె
మాట డగ్గుత్తికపడె 'అమ్మా' యటంచు
అనబోకు అనబోకు అమ్మ అంతటి మాట
గుండె నింతింతగాకోసి పెట్టెద చూడు
నను నమ్మదే తల్లి నా జానకీమాత
వేదాంత పరిపూత విశ్వమంగళగీత
నను నమ్మకుండేను నా తనువు చీల్చెదను
నా తనువులో రామనామామృతమెపారు

నను నమ్మకుండేను నా తనువు త్యజియింతు
ప్రభువునే తనువులో ప్రత్యణువువినుతింతు.[123]

సీతకు ఆంజనేయుడు రామాంగుళీయకము నీయగానే ఆమెకు దానిని చూచుట పెళ్లిరోజుకన్నా సుఖదాయకమయ్యెను. ఆమెకు హనుమంతుని శైశవ రూపము కనిపించెను. "నీవు నూరు యోజనాల సముద్రము దాటితివి. నీవు పరాక్రమవంతునివి. బుద్ధిమంతునివి. నీకు రావణుని వలన భయములేదు. నీవు సామాన్య వానరునివి కావు. నీ యోగ్యత తెలిసియే రాముడు నిన్నిటకు పంపి నాడు. నీశక్తి అద్భుతము. నీవు మహాయోగివి. రామునకు ఏకాంత భక్తుడవు. నీతో సంభాషించుట ఔచిత్యమే." అని హనుమద్రామాయణమున నున్నట్లు శ్రీ ది।వె। సుబ్బరావుగారు తమ సుందరకాండమున తెలికి యున్నారు.[124]

సమీరకుమారవిజయము: ఇందలి కథాంశమున వాల్మీకి కల్పనమును పవరించెనా అనునట్లు హనుమంతుడు సీతను తన వీపుమీద ఎక్కించుకొని పోయెదనని యేప్రతిపాదన చేయనట్లున్నది. సీతకు తన విరాడ్రూపము ఆమె కోరినందున చూపినాడు. పరులకదృశ్యుడై అసురనాథుని విలాస గృహములలో, తత్పరిసర ప్రదేశాలలో చూచి సీత కానరానందున ఇలా తలపోశాడు

ఏలిక దొడ్డ వాడనని యెల్ల కవుల్ విన సన్నుతించినన్
వాలిక తోక పెంచుకొని వచ్చితి నిక్కము జూచి వచ్చెదన్
బాలికనంచు నా ప్రతిన భంగముగా సతిఁగానన్యిష

జ్వాలిక వంటి వార్త యిక స్వామికి నేమని విన్నవించుదున్ అని మరల అజాండకర్పరముల క్రింద మీదు చేయుదునా! హేమాచలాన్ని అణగ ద్రొక్కుదునా। తారావ్రజాన్ని పూలపోలిక నేల రాయుదునా? దిగ్గజముల తొండములు ద్రుంచి వేయుదునా। అని భావించి తానలా చేస్తే బ్రహ్మరుద్రేం ద్రాది దివిజనాయకులు సీతజాడ తెలిపెదరని అలుకతో హర్మ్యశిఖరాగ్ర మెక్కెను. అంతలోనే అతనికి శింశుపావృక్షము కనిపించెను. దాని నీడలో రఘునాథుని స్మరించుచున్న మానినిని చూచెను. 'హా! రఘురామా మోహపుఁ బట్టపు దేవికిట్టి వెత పాటిలెనే' అని అనుకొని సాశ్రునేత్రుడయ్యెను. అంతట రావణుడక్కడికి వచ్చి మదనవశకర్తియై పలికిన పలుకులు విని వానిని చంప నుంకించి ఆరోషాన్ని తన శేముషీజలంబుచే దూలించి నిగ్రహించుకొనెను. రావణుడు వెళ్లిన తర్వాత త్రిజటాస్వప్నవృత్తాంత కథనానంతరం నిశాచరాఁ

గనలు నిదురింపగా మారుతి ఆశాఖి శాఖలదిగి సీతకు ప్రమదంబున నమస్కరించి తాను రాముని బంటుననీ మారుత వరప్రసాదుడై అంజనానందనుడుగా జన్మించినట్లు చెప్పెను. తనను చూచి నమ్మినచో రాముడిచ్చిన ముద్రికను కనుగొనమని యిచ్చెను. ఆ ఉంగరాన్ని చూచి సీత ఆనందించి తన ప్రాణములు హనుమంతుడు నిల్పినందుకు

"నీకు దీవన వినానాచేతగాదొండు సత్యాకల్పంబుగ వృద్ధిబొందు మిక నీవాకల్ప పర్యంతమున్ కాకుస్థాన్వయ రక్షణ" .... అని వరమిచ్చెను. "బంటునైన నన్ను వినుతించుదేల" అని పలికి రామునికి ప్రత్యభిజ్ఞకై చూడామణిని కోరెను. సీత అంతట, 'నీవు నీ నిజరూపాన్ని చూపినచో శిరోమణి'నిత్తునని పలుకగా హనుమంతుడంత తన మేను పెంచి బృహద్రూపము చూపెను. ఆ రూప మామెకు ఇంపు, అరుదు, వెఱపు కలిగించగా

"విపులాకారుడవై జగత్రియమావేశించు సర్వాత్మునిన్ గపి సామాన్యునిగా దలంచితిని జక్కంజూడగా శక్యమే అని అతనిని మతించి యథావిధముగా సూక్ష్మరూపము ధరింపుమనికోరెను. అతడు మామూలు శరీరము ధరింపగానే సీత అతనికి తన శిరోమణిని యిచ్చెను. స్వీకరించిన హనుమంతుడు

"అమ్మా! నీ ముదశ్రు వర్షమ్మునకాది గర్జయగు రామధనుర్గుణ ఘోషణంబు కాగ"లదని ఆమెకు ధైర్యం చెప్పి వీడ్కొని వచ్చెను.

అన్యభాషాగ్రంథములు: రామచరితమానస్ ప్రకారం. సీతను వెదకుచు హనుమంతుడు శత్రువులు శయనించి యుండగా చూచుట శుభప్రదమని అంతఃపురములలో సంచరించెను. లంకలో తిరుగుచుండగా అచట విభీషణుని యింటిపై శ్రీరామనామాక్షరములతడు చూచెను. ఆ గృహాంగణమున తులసీ బృందావనముండెను. అది చూచి హనుమంతుడు తనలో తాను ఆలోచించుకొనెను. అప్పుడా మందిరములో విభీషణుడు రామనామము స్మరించుచుండెను అతడు సత్పురుషుడని హనుమంతుడు గ్రహించి సంతోషించి 'నాసందేహము నితనితో చెప్పినచో బాగుండు'నని నిశ్చయించి బ్రాహ్మణరూపం ధరించి విభీషణునితో ప్రసంగించుటకు సిద్ధముగానుండెను. విభీషణుడే అతనికెదురేగి 'బ్రాహ్మణవర్యా, మీ వృత్తాంతము తెలుపుడు. మిమ్ము చూచిన నాకు ఆనందము కలుగుచున్నది. మీరు రామదాసులా! అయినచో మీదర్శనము నాకు గొప్పభాగ్యము. "అని అనెను. హనుమంతుడు శ్రీరామునికథ తన వృత్తాం

తము తెలిపెను. అపుడు విభీషణుడు" స్వామీ రెండుదంత పంక్తుల మధ్య నాలుకలాగా నేనీనగరంలో ఉన్నాను. నేను దీనుడను. దిక్కులేనివాడను, నన్ను రాముడు కటాక్షించునా! అని అనగానే, "ఆర్యా, కులీనతలేనిహీనజన్మమైన నాకంటె వానరమునే ఆదరించిన రాముడు నిన్ను ఆదరింపకపోడు" అని తెల్పి అతనిద్వారా సీత వృత్తాంతమెరింగి అశోకవనముకడకు వెళ్లెను.

సీత అశోకవనములో దుఃఖించుచుండగా జాలిపడిన హనుమంతుడు శింశుపావృక్షము నెక్కి శ్రీరాముని ఉంగరము జారవిడిచెను. ఆ ఉంగరమును చూచి సీత ఆశ్చర్యపడుచుండగా అంజనేయుడు రామకథ గానము చేసెను. అది విని, సీత 'తమ్ముడా, నాకు ప్రత్యక్షము కారాదా' అని అనెను.[125]

నిద్రించుచున్న మండోదరిని జూచునపుడు ఆనందముతో హనుమచేసిన పని జాతి, ధర్మప్రకోపముగా ఒక ఆంగ్ల పండితుని భావన. [It is his apish rashness - ALIOS WVRM][126]

సీతను తన వీపుపై మోసుకొని వెళ్లగలనని చెప్పినపుడు సీత నీ కోతి బుద్ధి చూపావుకదా అని అనిన పలుకులు హనుమంతుని కించపరచినందునే అతడు తన విరాడ్రూపము చూపెనని శ్రీ శ్రీనివాస శాస్త్రిగారి అభిప్రాయము— He felt a little piqued. He flet that for the first time he was insulted grossly. In this matter he failed but was in the end glad to have failed for SITA Convinced him that was the riqht course.[127]

3 సీతాసందర్శనానంతర కర్తవ్యము గూర్చిన ఆలోచన

వాల్మీకి రామాయణ ప్రకారము: తన తర్వాత కర్తవ్యమును గూర్చి హనుమంతుడిట్లు రాజనీతి సంప్రదాయానుసారమాలోచించెను. "సీత జాడ తెలుసుకొని ఆమెతో మాట్లాడుట అను పని నెరవేరినది. రావణకథ రాముని కర్తవ్యముగా సీత తెలిపినందున రామ రావణయుద్ధమనివార్యము. అట్లే రావణుని బలాబలములు వాని అభిప్రాయములు తెలియవలసియున్నది. నేనేదో ఒక నెపము పెట్టి రావణుని సైన్యాన్ని యుద్ధానికీడ్చి వారిలో కొందరిని వధించినచో ఈ రాక్షసులు కొంత పొగరు తగ్గి మెత్తబడగలరు. సీతా సందర్శన

మొక్కటే నాకు లక్ష్యముగా ప్రభువు నిర్ణయించిననూ దానికంగభూత ములగు ఇతర కార్యములను గూడ నాయంత నేనే నిర్ణయించుకొని చేయుట దూతగా నాధర్మము. ఎంత చిన్న పనినైనా దానిని నెరవేర్చుటకై యుండు ఉపాయములన్నీ వెదకి నిర్భయముగా కార్యము నెరవేర్చాలి. రావణాదుల బలసంపదల గూర్చి రామాదులు నన్ను ప్రశ్నించినచో వారికి నేను తగిన సమాచార మందియ్యవలెను. బలములో నాకూ. రాక్షసులకూగల భేదము తెలిసికొని నేను వెళ్ళినచో నిజమైన బంటు నను యశమును పొందుదును. అహంకరించియున్న రావణునకు నా బలము చూపుటకూడ అవసరము. రాముడు ఒంటరివాడనీ, ఏ సహాయము లేనివా డనీ తలంచు రావణునకు సుగ్రీవుని సైన్యపరాక్రమాదుల స్వరూపము రుచి చూపించుట నా కర్తవ్యము. ఈ రావణుని ఉద్యానవనము నందనవనమువలె నున్నది. నేను దీనిని విరచినచో నిజముగా రావణునకు నాపై కోపము వచ్చును. అంత వాడు నాపైకి సైన్యాదులపంపును. తప్పక యుద్ధముజరుగును. అపుడు వాని పరివారమును తప్పక నిర్జించగలను" అని భావించి అంజనేయుడు అశోకవనంలోని వృక్షాలను, లతలను, క్రీడా పర్వతములను, లతా గృహము లను నాశనమొనర్చి దావాగ్ని కాహుతియైన వనమా అని అనునట్లొనర్చెను. కూకటివ్రేళ్లతోగూడ పెకలించి నేలపాలు చేయునపుడు కీడును సూచించుచు పక్షులు అరచుచు పోవుటను, వృక్షాలు నేలకొరుగుచో 'దభీ' మను శబ్దములను వినిన రాక్షసస్త్రీలు తాము కావలియున్న సీతకేప్రమాదము కలిగెనో అని భావించి అమె దగ్గరకు పరుగెత్తిరి. వారినిచూచి హనుమంతుడు వారిని భయపెట్టుటకై, ఘోరమై భయంకరమై యుండునట్లు తన శరీరాన్ని పెంచ సాగెను. అతనిని చూచిన రాక్షసులు ఆ వానరమెవరో, ఏలవచ్చెనో, సీతతో ఏల భాషించెనో తెలుపుమని గద్దించి పలికిరి. అప్పుడు సీత పాముల జాడలు పాములకే తెలిసినట్లు రాక్షసులమాయలు రాక్షసులకే తెలియునని, వీడెవడో రాక్షసుడే యీ రూపమున వచ్చినాడేమోనని సీత చెప్పగానే కొంద రామె మాటలకు భయపడి రావణునకు విషయాన్ని విన్నవించుటకు వెళ్ళిరి. సీతాదేవి యుండు ప్రాంతమునుగానీ, అమె ఆశీనయైయున్న చోటుగల శింశపావృక్షాన్ని గానీ ఏమియు చేయకుండా అమెను కాపాడినట్లు వ్యవహరించుచు హనుమంతుని శిక్షించుటకు రావణుడు ఎనిమిదివేలమంది సైన్యమును పంపెను.

వచ్చుచున్న ఆ రాక్షస సైన్యాన్నిచూచి వారితో తనకు యుద్ధము కలుగుచున్నందుకు సంతసించి తన తోకను జాడించి నేలమీదకొట్టి మహాధ్వని కలుగునట్లుగా అరచి ఇంకను పెద్ద రూపాన్ని ధరించి లంక అంతటా ప్రతిధ్వ నించునట్లుగా భుజాస్ఫాలనమొనర్చెను. ఆ ధ్వనికే పక్షులు నింగికెగిరి గుండె లవిసి నేలపడినవి. హనుమంతుడు రామ లక్ష్మణ సుగ్రీవులకు జయహో నాదములుచేస్తూ—

దాసుడ సర్వసద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసలదేశ వల్లభునకున్ హతశత్రుడ వాయుపుత్రుడన్
నాసరిగారు సంగరమునన్ దశకంఠులు వేవురేనియున్
వాసి యడంతు డాల ద్రుమపాళుల నే హనుమత్సమాఖ్యుడన్.

—అని ప్రకటించెను. "ఈ లంకను మీరు చూచుచుండగనే నాశనమొనర్చి సీతాదేవికి మ్రొక్కి కృతార్థుడనై పోయెదను" అని అరచెను. రాక్షసులు హనుమంతుని దగ్గరకు చేరుటకు భయపడి దూరమునుండియే "ఆయుధముల ప్రయోగించుచు పాటుపడిరి. అపుడాంజనేయుడు ఉద్యానవనద్వారముననున్న ఇనుపగుదియను లాగి ఆ రాక్షసులపై వేయగా వారందరు నుగ్గునుగ్గయి పోయిరి. కింకరులు ఈ వార్త రావణునకు తెలుపగా అతడు ప్రహస్త పుత్రుడగు జంబుమాలిని పంపెను. జంబుమాలి పరాక్రమస్ఫూర్తితో ఆయుధ సామగ్రితో వచ్చుచుండగా హనుమంతుడు ఉద్యానవనమువదలి చైత్యప్రాసాద విధ్వంసమునకు పూనెను. ఆ ప్రాసాద మధిరోహించిన హనుమంతుడు రెండవ సూర్యుడో అనునట్లుగా ప్రకాశించెను. హనుమంతుని గర్జనలకు రాక్షస వీరులు మూర్ఛపోయిరి; పక్షులు నేలకూలినవి. 'దాసోఽహం కోసలేంద్రస్య' అను సూక్తిని వల్లించుచు చైత్యప్రాసాద స్తంభమునుపీకి దానిని రభసముగా త్రిప్పగా దాని రాపిడికి నిప్పుపుట్టి ఆ చైత్యప్రాసాదమంతయు భస్మమాయెను. ఆ స్తంభంచేతనే నూరుమంది రాక్షసులనుచంపి ఆకాశానికి ఎగిరి 'ఓ లంకా వాసులారా! వినుడు. నావంటివారు వేలమంది సుగ్రీవుని సైన్యములో నున్నారు. వారంతా సీతాన్వేషణలో నున్నారు. వారిలో కొందరు పదివేల ఏనుగుల బలము కలవారు కొందరు సహస్ర గజతుల్యులు; వాయువేగము గల వారు; నఖములు, దంతములు ఆయుధముగాగలవారు. వారినెల్ల సుగ్రీవుడు మీపైకి నడిపించును. మీరు నిష్కారణముగా రామునితో విరోధించినవారు.

మీ ప్రభువు రావణుడే దక్కడనగా ఇంక మీరుందురా? అందరూ చనిపోవుట నిశ్చయము. "అని రాక్షసుల తేజోహీనుల చేయు మాటలనాంజనేయుడు పలుకుచుండగా జంబుమాలి అంజనేయునితో పోరాడుటకై వచ్చెను. గాడిదలు కట్టినతేరుమీద పెద్దవింటితో వచ్చిన జంబుమాలిని చూచి అంజనేయుడట్టహాస మొనర్చెను. వాడు పదిబాణాలు అంజనేయుని బాహువులలో ముఖములో నాటుకొనునట్లు వేసెను. అవి తగిలి నెత్తురు కారగా సూర్యకిరణములచే విక సితమైన శరత్కాల కమలములవలె అంజనేయుని ముఖముండెను. ఉగ్రుడై వాయుజుడు పెద్దబండ నొకదానినెత్తి వానిపైకి విసిరెను. వాడు దానిని ఖం డించి అయుధమ్ములతో అంజనేయుని బాహువులను, ఒక బాణముచే వక్ష స్థలాన్ని, పదిబాణాలచే స్తనప్రదేశాన్ని కొట్టెను. వానితాకిడికి నొచ్చియు హనుమ ఒక సాలవృక్షాన్ని పీకి గిరగిర త్రిప్పి వానిమీదికి వేయగా వాడు దానిని ఖండించెను అప్పుడు హనుమ పరిఘను మరల తీసుకొని త్రిప్పి వాని దొమ్ము తగులునట్లుగా గురిచూచి కొట్టెను. ఆదెబ్బకు వాని తల, చేతులు, ధనువు, రథము, గాడిదలు గుర్తింపరానివై చూర్ణమై పడిపోయెను. ఈ వార్త రావణునకు తెలిసెను.

రావణుడు మంత్రికుమారుల నేడుగురిని పంపెను. వారు అహమహ మికతో స్వర్ణస్యందనములధిరోహించి బాణవర్షమును అంజనేయునిపై కురిపిం చిరి. హనుమంతుడంత అకాశానికెగిరి పదనఖకుంతములతో వారిని కొట్టి, చీల్చి చంపెను. వధింపబడిన రాక్షస కళేబరములతో, యుద్ధ సామాగ్రి చూర్ణముతో, గజాశ్వముల ధ్వనులతో, రక్తపు ప్రవాహములతో లంక వికా రముకాగా యుద్ధమునకీమారింకెవరైనా రాగలరని భావించుచు హనుమ ఉద్యానవనతోరణ ప్రదేశమునకు చేరి వారి రాకకై నిరీక్షించెను.

పంచ సేనాధిప పతనము: ఈవార్తవిని కొంత భీతిల్లిన రావణుడు విరూ పాక్ష, దుర్ధర, యూపాక్ష, ప్రఘస, భాసకర్ణులను అయిదు మంది సేనాపతు లను హనుమంతునిపైకి పంపెను. 'ఆకోతి సామాన్యమైనదిగా కనపడుట లేదు. దానిని ఇంద్రుడే పంపెనేమో—మీరు హెచ్చరికతో మీ పరాక్రమము చూపుడు' అని రావణుడు వారికి మెళకువలను తెల్పియుండెను. వారు ఉద్యానవనతోరణ సమీపమునకు వచ్చి మహాకాయుడు, మహామతి మహా వేగుడు, మహాబలుడు, మహాసత్త్వుడు, మహెూత్సాహుడుఅగు మహాకపినిచూచి

తాము తెచ్చిన ఆయుధములను ప్రయోగించిరి. దుర్ధరుడు నూరు బాణము లను హనుమంతునిపై కురిపింపగా వానినెదుర్కొని హనుమంతుడు వాని తేరి పైకి దుముకగానే వాడును, వానితేరును, గుఱ్ఱములును నేలకొరిగెను. అది చూచి విరుపాక్షయూపాక్షులు హనుమంతుని రొమ్మును చీల్చుటకై ముద్గరము నెత్తగా చెట్టునొకదానిని వారిపైకి వాతాత్మజుడు వేసెను. దానినుండి కాపాడు కొనలేక వారు చచ్చిరి. అట్లే పర్వతమును పెళ్లగించి ప్రఘస, భాసకర్ణుల పైకేసి వారిని నిర్మూలించి హనుమంతుడు మిగిలిన సైన్యములో గుఱ్ఱములను ఎత్తి గుఱ్ఱములపై, ఏనుగులపై ఏనుగులను, భటులను భటులపై, రథాలపై రథాలను ఎత్తి విసరివేసి మొత్తం సైన్యాన్ని నాశనంచేసి తోరణద్వారము చెంత లయకాలుని వలె నుండెను.

అక్షకుమారవధ: పంచసేనానులు పంచత్వమొందగానే రావణుడు తన ఔరసపుత్రుడగు అక్షయకుమారునివైపు చూచెను. అదృష్టిమాత్రసంజ్ఞనే ఆజ్ఞగా స్వీకరించి యుగాంతకాలాగ్నివలె యుద్ధమునకు వచ్చి అక్షుడు ఆంజనే యుని సగౌరవముగా చూచి అతని జవసత్త్వాదులను తన బలాదులతో పోల్చు కొని 'యితనిని యుద్ధమున జయించుట కష్టము' అని తలంచి కోపించి హనుమపైకి వచ్చెను. దేవతల గుండెలదురునట్లు గొప్ప పోరాటము వారిరు వురకు సాగెను. అక్షుని బాణాల వలన నెత్తురు కారుచు గాయపడిన హనుమ తన చూపులతోనే అక్షుని సేనలను, వాహనములను దహించెను. అది చూచి వాడు బాణములతో హనుమ బాహువులను భేదించెను. వాని శరసంధాన చాతుర్యమునకు సంతోషించి మెచ్చుకొని వాని కనుగప్పి వానికాపద గూర్చు టకు మనసురాక ఆలోచించుచుండగా వానిలో నేర్పు, తీర్పు, ఓర్పు అతిశ యించుచుండుట గమనించి వానినుపేక్షించినచో తనకు అపకీర్తి కలుగునని యెంచి తన దేహము పెంచి తన అరచేతి ప్రహారములతో వాని వాహనము లను నేలకూలదన్నెను. వాడంత నేలకు దిగి కత్తితో హనుమపైకిరాగా హనుమంతుడు వాని రెండు కాళ్లను పట్టుకొని గరుత్మంతుడు పామును విదిల్చి నట్లు వానిని నేలపై మోదిమోది చంపెను. వాని కండలు, ఎముకలు, నెత్తురు భూమినంతటిని నింపి బడలిక తీర్చుకొనుటకై తోరణమందు ప్రళయ కాలునివలె నుండెను.

ఇంద్రజిత్తుతోపోరాటము: అంత రావణుడు తన కుమారుడగు ఇంద్ర జిత్తును చూచి 'కుమారా, ఇంతవరకు పోయినవారు తమ భుజపరాక్రమముతో

ఆయుధములతో వెళ్లిరి. బాహుబలానికిగాని, శస్త్రాస్త్రములకుగాని ఆ కోతి లోబడునట్లు తోచదు. నీకెన్నో అస్త్రములు తెలియును. నిర్జరుల నోడించిన చరిత్ర గలవాడవు. మాయవిద్యలు నీకు తెలియును. ఏ సందర్భమునకే విద్య ప్రయోగించ వలయునో జాకరూకతతో ప్రయోగించి యత్నింపుము. కాలము వృథా చేయక నీ శక్తిని వాని శక్తిని పోల్చుకొనుము. నీ రక్షణ భారము సేనమీద ఉంచి ప్రమాదమున పడకుము. సేన లెన్ని తాకిన ఆకోతి వాటిని త్రుంచ గల్గుచున్నది. వజ్రాయుధముతో వాని పైకి వెళ్లకుము. ముష్టియుద్ధము చేయకుము," అని పలువిధముల జాగ్రత్తలు చెప్పి రావణుడు పంపగా వాడు రథమున ఆంజనేయుని చేర వచ్చెను. ఆ రథనేమి ధ్వని, ధనుష్టంకారాదుల గమనించి పొంగి ఆంజనేయుడు సింహనాదము చేసెను. ఆ ధ్వనికి కొండలు బ్రద్ధలగుట, మేఘములు చెదరిపోవుట, ఇంద్రజిత్తు చూచెను. వారిరువురి మధ్య ఘోరమైన యుద్ధము జరిగెను. వాని బాణాలు వృథాయగునట్లు వేగముగాచరించుచూ, ఒక్కొకసారి ఎదుటపడుచు మరొక్క సారి ఆకాశానికిఎగురుతూ ఆంజనేయుడు పోరాడగా వారిలో పరస్పర తార తమ్యము వేర్పరుపలేనంతగా పోరు సాగెను. కార్యసాఫల్యమునకై ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమువేసి ఆంజనేయుని కట్టివేసెను. అపుడు బ్రహ్మ తన కిచ్చిన వరమును స్మరించి అతని ఆజ్ఞను మీరజాలక వారికి తాను చిక్కినను బ్రహ్మేంద్రవాయుదేవులు తనను రక్షింపగలరన్న విశ్వాసముతో నిర్భీతుడై కదలక మెదలక ఉండెను. అపుడాంజనేయుడు తనలోతాను ఈ విధముగా తలపోసెను. "ఈ రాక్షసులు నన్ను పట్టుకొని రావణుని వద్దకు తీసుకొని పోగలరు అక్కడ వానితో సంభాషించుటకు వీలగును అదియు మేలేకదా!" — అని భావించుచుండగా ఇంద్రజిత్తు సైనికులలో కొందరు అంజనేయునిపై పడి త్రాళ్లతో, నారచీరలతోకట్టివేసిరి. వారి చేతలకు హనుమంతుడు తన కోతి గుణము తెలుపు కూతలు పెట్టెను. బ్రహ్మాస్త్రమును అవమానించుచు త్రాళ్లతో ఆంజనేయుని తన సైనికులు బంధించుట వలన తన ప్రయత్నము విఫలమైనను దానినాకోతి తెలియకున్నదని ఇంద్రజిత్తు భావించెను. రాక్షసులు హను మంతుని కట్టెలతో కొట్టుచు, పిడికిళ్లతో పొడచుచు ముష్టిప్రహారము లొసంగుచు "తెచ్చామయ్య కోతిని" అని అరచుకొంటూ రావణుని కొలువునకు లాగుకొని వెళ్లిరి.

4 రావణసభలో హనుమంతుడు.

రావణుని మణిమయ సభామండపమునకు 'రా, రా' ఇటు రా, రారా' అని హనుమంతుని రాక్షసులు ఈడ్చుకొనుచు వచ్చిరి. దూరమునుండియే అతనికి రావణుడు కన్పించెను. సూర్యునివలె ప్రకాశిస్తూ తేజోబలయుతుడగు రావణుడు క్రూరముగా హనుమంతుని చూచుచు తన సమీపస్థులగు మంత్రులతో 'వీడెవ్వడో మీరడిగి తెలుసుకొనుడు" అని ఆజ్ఞాపించెను. వారతనిని ప్రశ్నించిరి. "నేను సుగ్రీవుడు పంపగా వచ్చిన దూతను" అని బదులుచెప్పి హనుమంతుడు రావణుని నిర్లక్ష్యపరచు చూపులతో చూచుచు వానిని గూర్చి యిట్లు తనలో అనుకొనెను. "అహా ఏమి వీనిరూపము ఏమి వీనితేజము, ఏమి వీనిబలము, సమస్తరాజచిహ్నములున్న వీడు అధర్మకార్యాలొనర్పకుండినచో వీడు స్వర్గాన్నే పాలించేవాడేకదా! భూతదయారహితుడై దూష్యమైన కార్యములచేసి దానవుడైనాడు. ఇట్టి తేజోవంతునడ్డగించువారుందురా?" అని తలపోసెను. హనుమంతుని చూచుచు రావణుడుకూడ తనలో "ఈ పింగాక్షుడగు వాడు వానరుడా! లేక కైలాసమును పెకలించు వేళలో నన్ను శపించిన నందియా! ఏమివీని తేజోబలవిశేషము! సాక్షాత్ బాణుడే కోతిరూపాన వచ్చెనా! "అని సందేహించెను. అంత రోషతామ్రాక్షుడై ప్రహస్తుని చూచి "దుష్టుడెవడో, లంకకు ఏల వచ్చెనో, ఎవరు పంపిరో, అశోకవనమునేల ధ్వంసమొనర్చెనో, రాక్షస స్త్రీల నేల తర్జించెనో అడిగితెలుసుకొను"మని కోరెను. అపుడా ప్రహస్తుడు అంజనేయునిచూచి ఎట్టి సంబోధన చేయక 'ఓయీ నీవు ఊరడిల్లుము. భయపడకుము. నిజము చెప్పుము. నీవు చెప్పేది నిజమైనచో నిన్ను వదలిపెట్టెదము. నీకు మేలే జరుగును. నిజము దాచితివో నీకు ప్రాణాలు దక్కవు. నీవు వానరదేహముతో ఉన్నావే కానీ నీప్రభావం అద్భుతంగా ఉన్నది. నిన్ను ఎవరు పంపిరి? ఇంద్రుడా, యముడా, కుబేరుడా లేక రావణుని జయింపగోరి ఆ విష్ణువే నిన్నిక్కడకు దూతగా పంపెనా? మారువేషమున వచ్చిన గూఢచారి వలె ఏల లంకా నగరానికి వచ్చితివి! ఉన్నదున్నట్లు వచింపుము" అని ప్రశ్నించెను. హనుమంతుడతనిని సరకుసేయక రావణునే చూచి 'దనుజేంద్ర! నా వృత్తాంతము నిజము చెప్పెదను వినుము. ఇంద్రయమాదులు పంపగా నేను రాలేదు. కుబేరునితో నాకు ఏనాడును చెలిమిలేదు. మరి విష్ణుప్రేతుడను కాను. నేను అచ్చముగా కోతిజాతివాడినే. నీ దర్శనమునకై ఉద్యానవన

మును పాడు చేసితిని. యుద్ధకాంక్షతో రాక్షసులు రాగా ఆత్మరక్షణమునకై వారితో పోరాడితిని. ఇంద్రాది దిక్పాలురు గూడ నన్ను అస్త్రములచే కట్ట జాలరు. నేనును బ్రహ్మచే వరములు పొందినవాడనే. బ్రహ్మాస్త్రమువేసియు నీ భృత్యులు నన్ను త్రాళ్లతో కట్టినందున అస్త్రబంధము లూడిపోయినను నిన్ను చూడదలచియే వారికి పట్టుబడినట్లుండి ఇక్కడికి వచ్చితిని. నేను శ్రీరామ చంద్రుని బంటును. సుగ్రీవుని ఆజ్ఞచే ఒక రాజకార్యముమీద వచ్చితిని. నీవు మేలైన నా పలుకులను శ్రద్ధగా వినుము. నీ తమ్ముడగు ఆ వానరరాజు నీ కుశలమడిగి యున్నాడు. నీకు ఇహపరసుఖదాయకమగు ధర్మోక్తిని చెప్పి పంపినాడు. దానిని వినుము." అని హనుమ సుగ్రీవునిచే చెప్పబడిన మాటలతో దశరథ మహారాజు పుత్రుడగు రాముని కథను సీతాపహరణమును వాలివధను సుగ్రీవ వానరప్రభుత్వమును తెలిపిన తర్వాత, మరల ఆంజనేయుడిట్లు చెప్పెను. "సుగ్రీవుడు వేనకువేలు వానరములను సర్వదిక్కులకు పంపి యున్నాడు. గరుడానిలవేగులగు వానరులందెందరో కలరు. సీతాన్వేషణకై వచ్చినవారిలో నేనొకడిని. నేను వాయుకుమారుడను. నాపేరు హనుమంతుడు శతయోజనాయతమైన సాగరమునుదాటి నీ నగరానికివచ్చి నీ గృహములోనే సీతను చూచితిని. ఇదియంతయు సత్యము. ఎన్నో ధర్మశాస్త్రములను చదివిన వాడవై, తపోధనుడవై పరస్త్రీలను బాధించుట ధర్మమా? ధర్మచ్యుతితో సమూలముగా నిన్ను నాశనము గావింపగల అట్టి కార్యం నీవంటి ప్రాజ్ఞుడు చేయదగునా? సురాసురులలో ఎవరునూ ఆ రామలక్ష్మణుల బాణముల కెదురు నిలువజాలరు. రాముని కపకారము చేసినవారు ఈ ముల్లోకములలో ఎక్కడనూ సుఖపడలేరు. నీవు త్రికాలహితమును ధర్మబద్ధమునైన సుగ్రీవుని వాక్యములను వినుము. సీతను శ్రీరామునకిమ్ము. ఆమె జాడ తెలిసికొనుటయే నా కర్తవ్యమైనందున అనంతర కార్యములు శ్రీరాముడే ఆజ్ఞాపింపవలసి యున్నది. సీతాదేవిని నీవు స్త్రీమాత్రముగా తలంచినావు. ఆమె పగగొన్న కాలభుజంగి. ఆమెను గ్రహించుట విషాన్నమును గ్రహించినట్లే. నీవు తపస్సుచే గడించుకొన్న అవధ్యతావరములన్ని ఇపుడు నిన్ను రక్షింపజాలవు. సుగ్రీవుడు దేవదానవగంధర్వ నాగయక్ష రాక్షసులలోనికి చేరినవాడుకాడు. కావున నీవు బ్రతుకజాలవు. మానవుని పాపఫలము, పుణ్యఫలము రెండునూ ఒకేసారి అనుభవమునకు రాజాలవు. ఇంతవరకు నీ వొనర్చిన తపోరూప ధర్మఫలముల ననుభవించినావు. ఇకపై అధర్మ ఫలితములనే అనుభవింపబోవు చున్నావు.

జనస్థానములో మడిసిన రాక్షసులగాథలు, వాలివధ, రామసుగ్రీవ సఖ్యము అనునవి నీకు సుఖకరమైన సూచనలా! తలపోయుము—

"నేనొకరుండనే కడిమి నిర్మథనంబొనరింప నేర్తులం
కానగరంబు సర్వమును గాని వచింపడు రాముడవ్విధిం
దానె వధింతునంచు ప్రతినవన్ వచియించె"

—అందువలననే నిన్ను నేనేమియు చేయజాలకున్నాను. రామునకపకార మొనర్చి యింద్రుడే సుఖింపజాలడు. ఇక నీ వంటివాని సంగతి వేరె చెప్పాలా! ఇపుడు నీ వశములోనున్న జానకి ఎవరనుకొన్నావు? నీ లంకను సర్వనాశనము చేయుటకై వచ్చిన కాళరాత్రి. నీ మెడపై పడనున్న కాలపాశము. నీవు నిన్నూ, నీ లంకనూ కాపాడుకొనదలచినచో ఆమెను వదిలిపెట్టుము. యోగ్యపద్ధతి గ్రహింపుము. రాముని కోపాగ్నికి, సీత పాతివ్రత్యానికీ నీవూ, నీవారూ ఆహుతి కానీయకుము. నేను దూతగా వచ్చిన వాసరుడను. రాముని దాసుడనై హితము బోధించినాను. నా పలుకులను స్వీకరించినచో నీకు మేలు కలుగును. సమస్త స్థావరజంగమ ప్రపంచాన్ని తన శక్తిచే సంహరించగలవాడు రాముడు. అంతేకాక దానినంతటిని మరల సృష్టింపగలవాడుకూడ. పరాక్రమములో విష్ణువైన అతనిని ఏకకాలములో ఎల్లప్రదేశములలో ఎవరూ జయింపజాలరు. అతడు జగన్నాథుడు. అతనికి ద్రోహముచేసిన నీవు ఏవిధంగా ఆలోచించినా బ్రతుకుట కష్టము. యుద్ధమున రామునిచే చావవలసిన వానిని బ్రహ్మరుద్ర మహేంద్రాదులు కూడా కాపాడజాలరు—" అని హనుమంతుడు నిర్భయముగా చెప్పిన మాటలు తనకు నచ్చనందున రావణుడు కోపముతో "ఈ కోతిని చంపుడు" అని ఆజ్ఞాపించెను.

అప్పుడు పండితుడైన విభీషణుడు తన అన్నకనేక విధముల హితోక్తులు తెలిపి దూతను చంపరాదనియు తగు దండన విధించవచ్చుననియు అందుకై శాస్త్రమున "దేహమును బాధించుట, తలగొరిగించుట, అవయవహీనునిచేయుట, కొరడాతో కొట్టుట, వాతలతో గుర్తులు వేయుట" అను పద్ధతులలో దేనినైననూ ఆజ్ఞాపించవచ్చునని తెలిపెను. దూతను వధించినను అది విరోధిని నిర్మూలించుట కాజాలదనియు తన ప్రభువు ఆజ్ఞానుసారము పలికిన దూతను చంపుట నీతికాదనియు అందులోను కోతిని చంపుట రావణునివంటి వీరునికి తగదనియు బహువిధముల చెప్పగా రావణుడాలోచించి విభీషణుని మాటలను ప్రశంసించి

"ఈ కోతి చుట్టాలూ, స్నేహితులూ వీనిని చూచి నవ్వునట్లుగా వీనికి అవయవ విరూపతఘటించుటకై వీని తోకను కాల్చుచు మన నగరములో త్రిప్పుడు"అని దండన విధించెను. ఆజ్ఞ వెడలినదే తడవుగా రాక్షసులు హనుమంతుని తోక కాల్చుటకై పాతగుడ్డలుతెచ్చి నూనెతో తడిపి తోకకు చుట్టిరి. అపుడాంజనే యుడు తన శరీరమును పెంచ నారంభించెను. రాక్షసులు చెలరేగి తోకకు నిప్పు పెట్టిరి. ఆ తోకతోనే హనుమ వారిని కొట్టెను. కాని అంతలోనే అతడు మరల తన కర్తవ్యమును గూర్చి ఆలోచింపసాగెను. "నన్ను బాధించు ఈ రాక్షసులను చంపుట వలన నాకేమి ప్రయోజనము? నేనేమి చేసినా అది రామకార్యమునకు భంగకారి కారాదు. తలచినచో వీరినందరిని నేనొక్కడనే చంపగలను. పురజనుల వేడుకకై వీరు నన్ను నగరమంతా త్రిప్పెదరు. వీరి బాధల నేను సహించెదగాక. లంకను నేను రాత్రివేళలో మాత్రమే చూచి యున్నాను. ఇపుడు పగటివేళలో దానిని చూచి దుర్గరక్షణ విధానము గ్రహించి నచో అది ప్రభుహిత కార్యమగును. వీరి "చేష్టావిపరీతవర్తనల సర్వము శీర్చెద వడ్డితోన్" అని హనుమంతుడాలోచించి వారు పెట్టు బాధలను సహించి మిన్నకుండెను. భేరికాహళాది వాద్యములతో తరలి రాక్షసులు హనుమంతుని తిట్టుచు కొట్టుచు వాడవాడలలో త్రిప్పసాగిరి. లంకలోని వీధులు, వాడలు, త్రోవలు, గూఢప్రదేశములు, సందులు, గొందులు అన్నియు సామీరి గమనించుచు వారి ననుసరించెను. హనుమంతుని శత్రుగూఢచారిగా వారు ప్రకటించుచుండ ఇండ్లలోని స్త్రీ బాల వృద్ధాదులందరును అతనిని సంతోష ముతో చూచిరి.

హనుమంతుడు లంకను దహించుట: తన తోకకు నిప్పువలన అపాయమే మాత్రం లేకుండుటేకాక తోకనుండి వచ్చు గాలికూడ చల్లగా నున్నందుకు అంజనేయుడాశ్చర్య పడెను. అది రామ మహిమగా నతడు భావించెను. సీతా మాత దయవలన అగ్ని నాకపకార మొనర్పకున్నాడని తలంచెను. రాక్షసుల వలన హనుమంతుని తోకకు నిప్పు పెట్టిరని తెలిసిన సీత అగ్నిని హనుమకు 'శీతోభవ'డగునట్లు ప్రార్థించినట్లు హనుమంతునకు తెలియదు. కాలుచున్న తోకతో సింహనాదంచేస్తూ లంకానగరద్వార గోపురమునెక్కి అచట అతడు తన దేహమును చిన్నదిగా చేయగా కట్టిన కట్లన్నియు వదలిపోయెను. మరల దేహాన్ని పెంచి తోరణాశ్రితమైన గుదియనుకొని కావలి రాక్షసులను చంపెను.

తన వాలాగ్నిలో ఇండ్లు, మేడలు కాల్చి వేసెను. విభీషణుని మందిరమొక్కటి తప్ప తక్కిన పేరుగల రాక్షస నిలయములన్నియు కాల్చెను. పౌరులు, బాలురు, వృద్ధులు ఆర్తులై పరుగెత్తిరి. దగ్ధమైన భవనములలోని బంగారు వెండి మణి మాణిక్యాదులు కాలి వివిధ రంగుల దాల్చెను. పీనుగుల కుప్పలు జంతుకళేబరములు రాశిగా పడెను. ఆ భీభత్స దృశ్యము చూచినవారు అతడు ఇంద్రుడో, అగ్నియో, యముడో, సూర్యుడో, చంద్రుడో, రుద్రుడో అని భావించిరి. అతడొక అప్రాకృత వానరునిగాను విష్ణుతేజమే ఆ ఆకారమొందినట్లుగను భావించిరి. దివినుండి చూచు దేవగంధర్వాదులాంజనేయుని చర్యలకానందింపసాగిరి. లంకానగరం కాలి, మసియై బూడిదకాగా హనుమ రాముని చేరుటకై త్రికూటపర్వతాన్ని అధిరోహింపపోయెను.

ఆ పర్వతాన్నుండి సాగరతీరంచేరి వాలాంతాగ్ని చల్లార్చి ఆంజనేయుడు లంకానగరం వైపొకసారి చూచెను. వెంటనే అతనికి 'సీతామాత' గుర్తుకువచ్చి "అయ్యో! ఆవేశములో నెనెంత అకార్యమొనర్చితిని? సీతకేమి అపద కలిగెనో కదా! కోపమెంత పనిచేయించునోకదా! క్రోధ నిగ్రహము చేయలేనివాని కన్నియు అనర్థములే." అని తన దుడుకుతనమునకు పశ్చాత్తాపముతో క్రుంగి తన అకార్యము వలన స్వామికార్యము భగ్నమైనందుకు పరిహారముగా తన ప్రాణములను త్యాగమొనర్చుటకు నిర్ణయించుకొనెను. 'నేను అగ్నిలో పడుదునా! జలచరముల కాహారమగునట్లు జడధిలో దూకుదునా! ఎట్లాచేసి మరణించవలెనో తెలియక శోకించుచుండగా అతని శరీరమున భద్రశకునములు ద్యోతకమైనవి. సీతమహత్తు అతనికి గుర్తువచ్చి 'అగ్ని అగ్నిని దహింపగల్గునా! మహాపాతివ్రత్యశీల సంపన్నయైన సీతను అగ్ని దహింపజాలడు. నా వాలమునే దహింప సాహసింపని అగ్ని లక్ష్మణ భరత శత్రుఘ్నులకు పూజనీయమై రామునికి సతియగు సీతాదేవిని ఎట్లు దహింపగలడు.' అని ఆలోచించుచుండగా ఆకాశమందలి ఋషులూ, చారణులు లంకానగరమంతయూ భస్మమైనను సీత నిరపాయముగా నున్నదని పలుకుచుండుట వినినవాడై సంతోషించెను. దానివలన సీత క్షేమముగా నున్నదని గుర్తించి మరల ఆమెను ఒకసారి దర్శించి, క్షేమమడిగి తర్వాత తన తిరుగు ప్రయాణమొనర్ప నిశ్చయించుకొనెను.

వెంటనే అతడు శింశపావృక్షముచేరి సీతామాతకు మ్రొక్కి —

....   తల్లి మదీయ భూరి పు
ణ్యాళి వశంబునం గుశలితాప్తి దహించెడి నిన్ను గంటి నా
యేలిన వాని కార్యతతులెల్లనుదీరె యథోచితంబుగన్.

—అని పలికెను. అప్పుడామె హనుమంతుని ప్రయాణత్వరను గాంచి అతనిని పొగడి తన విమోచనమునకై చేయవలసిన కర్తవ్యమును మరల గుర్తుచేసి రామునికి తెలుపుమని కొన్నిమాటలను తెలిపెను. శోకనివారకమూ ఊరడింపు చేయ దక్షమునూ అగు కొన్ని పలుకులను పావని ఆమెకుచెప్పి నమస్కరించి సెలవొంది బయలుదేరెను.[128]

పరాశర సంహితలో ఈ సన్నివేశములులేవు. ఇతర తెలుగు రామాయణములు చాలవరకు వాల్మీకి చెప్పినదే చెప్పియున్నవి. మొల్లరామాయణమున హనుమంతుడు—

"ఉన్నాడు లెస్సరాఘవుడు, రానైయున్నాడు నిన్నుగొనిపోనున్నాడు"
—అని తెలుపగా ఆమె నేనుపకారమేమియున్

"దవిలిదొనర్పలేను వసుధాస్థలి వర్ధిలు బ్రహ్మకల్పముల్"
—అని దీవించినది.

ఆనందరామాయణములో: హనుమత్సందేశానంతరం సీత తన శిరోమణిని హనుమకు ఇవ్వగా దానిని తీసుకొని హనుమంతుడు "స్వామికార్యము చేసితిని. ఇంక ఏదైనా చిన్న చేష్టచేసి పోవలయును" అని నిశ్చయించుకొని సీతతో తనకు ఆకలి, దప్పి అగుచున్నవని తెలుపగా సీత తన చేతి కడియము తీసి "దీనిని విక్రయించి ఫలములనుకొని తినుము కాని వనమందలి ఫలముల నపహరింపకుము"అని అనెను. అప్పుడు మారుతి "తల్లీ ఇతరులిచ్చిన ఫలములను నేను భుజింపను. పరహస్తముల నుండి భోజన పదార్థములను గైకొనకుండు వ్రతము నాది. కావున నేనూరకయే పోయెదను" అని చెప్పగా సీతాదేవి "ఈ వనానికి యజమాని రావణుడు. నీకు సామర్థ్యమున్నచో ఇచట ఫలములను తినుము" అని అనెను. అంతట ఆంజనేయుడు "శ్రీరామమంత్రం శస్త్రమై నా హృదయమున నిల్చియున్నది. ఆ శస్త్ర ప్రభావమున రాక్షసులు నాకు తృణప్రాయులు." అని బదులు చెప్పెను. "అయినచో చెట్లనెక్కి కోయకుండా చెట్లనుండి రాలినవానిని తీసికొనుము" అని సీత చెప్పగా 'సరి'యని సామీరి

చెట్లనన్నింటినీ పట్టి కదల్చెను. సీతఉన్న ఇరుగుడు చెట్టు తప్ప తక్కిన వృక్షాల నన్నింటిని పడగొట్టి నేలను బయలు గావించెను.[129A]

ఈ రామాయణములో ఇంద్రజిత్తుతో పోరాడిన సందర్భమున మరి యొక కల్పన కన్పించును. తనపైకి సైన్యముతో ఇంద్రజిత్తు రాగా, ఆ సైన్యా నికి ఆంజనేయుడు తన తోకతో ఒక ప్రాకారముకట్టి వారితో పోరాడెను. ఒక వృక్షాన్ని లాగి మేఘనాథునిపై వేయగా వాని అంగములు విరిగిపోయెను. వాడు అంత ఒక గుహలో దాగుకొనెను. అప్పుడు బ్రహ్మ అంజనేయుని సమీపించి నా అస్త్రమును గౌరవింపుము. లంకలో రావణుని చూచి వెళ్లుము" అని చెప్పెను. దానికి అంజనేయుడంగీకరించెను. అంత బ్రహ్మ ఇంద్రజిత్తు వద్దకువచ్చి "నీ పరాక్రమం ఏమయ్యె? బ్రహ్మాస్త్రంతో బంధించి నీ తండ్రి వద్దకు తీసికొని పొమ్ము" అని చెప్పెను.[129B]

రావణసభలో హనుమంతుని రావణుడే చంపరాగా "దూతను చంప రాదని" విభీషణుడు తన హితోక్తులతో వారించెను. పిమ్మట రావణుడు వీని తోకను కత్తిరించండి" అని ఆజ్ఞాపించెను. తక్షకులువచ్చి కొడవలి, రంపము మొదలైన ఆయుధములచే కోయనారంభించగా వారి ఆయుధములన్నియు వేయారు తునకలై నశించెను. ఆంజనేయుని రోమముకూడ తెగలేదు. దాని నెఱిగి రావణుడు మారుతితో "వీరులు తమ మృత్యువునుగూడ దాచుటలేదు. కాన నీతోక ఎట్లుపోవునో నీవే చెప్పుము" అని అనెను. అంత ఆంజనేయుడు తనకు చావులేదని తెలిపెను. సత్యమును చెప్పుమని రావణుడు మరల అడుగగా ఆంజనేయుడు తనలో "నా తండ్రి మిత్రుడగు అగ్నిభట్టారకునిచే నాకు భయము కలుగజాలదు. కనుక నా తోకకు నిప్పు పెట్టించుకొని లంకనే కాల్చి వేయుదునని" అనుకొని కపటముతో 'నాతోక నిప్పుచే కాల్చబడును. సందియము లేదు' అని పలికెను. అంత రావణుడు సేవకునితో "ప్రయత్నించి వీని తోకను నిప్పు ముట్టించి లంకలో కనబరచండి" అని ఆదేశించెను. రాక్షసు లంత నూనెలోముంచినబెల్లు, కసవు, గుడ్డలను తోకకు చుట్టుచు రాగా అది పెరుగసాగెను. వస్త్రముల అంగళ్లలోనుండు వస్త్రాలనన్నింటినీ తెచ్చి చుట్టిరి. రాజాజ్ఞచే ఇండ్లలోని స్త్రీ పురుషుల వస్త్రములన్నియు చుట్టబడెను. అందరును దిగంబరమూర్తులైరి. చివరకు పరుపుగుడ్డలు, బంట్రోతుల గుడ్డలు, తలగుడ్డలు మొలగుడ్డలు, సభవారివి, రాజరికము వారివి, రావణ మండోదరులవి, ధ్వజ

పటములు అన్నియు చుట్టిరి. సీతాదేవి వస్త్రమును కూడ తేవలయునని యత్నింపగా దాని నెరిగి ఆంజనేయుడు తన తోక పెంపును చాలించి పుచ్ఛ పూర్తినింజూపెను. ఇంటింటను గుడ్డలకై గుమికూడి కొట్టుకొనుచుండిరి. నూనెకై, నేతికై, జిడ్డుచిక్కిన చాలునని తెచ్చి పోసిరి. రాత్రియైన దీపమునకు నూనెలేదు. బిడ్డలకు నెయ్యి సున్న. అపుడు హనుమంతుడు "యజమానుడగు రావణుడే ముందుకువచ్చి తన నోటితోనూదుచు నిప్పు ముట్టించినచో తోక అంటుకొనుననెను. రావణుడట్లేవచ్చి నిప్పు నూదెను. అంత వాని తలవెంట్రుకలు, గుడ్డలు, మీసములు కాలి వెలుగువత్తులు (మతాబులు అను పగలొత్తులు) అయ్యెను. రావణుడు తన ఇర్వది చేతులచే మోకులను రుద్దుకొనుచుండగా రాక్షసులందరు పకపక నవ్విరి. అపుడు ఆంజనేయుడపహాస్యం చేయగా రావణుడు క్రుద్ధుడై వీని నావలకుగొనిపొండు" అని దూతల నాజ్ఞాపించెను. అంతవారు మారుతికి సంకెళ్లువేసి చక్కగాకట్టి, శ్రద్ధతో లంకతో అంతటా ఊరేగించుచు వాద్యములు మ్రోయించుచు శస్త్రధారులై కేకలువేయుచు వెంట బోయిరి. కపివీరుడు గంతులువేయుచు పగలు సర్వలంకనుచుట్టి అత్యంత సూక్ష్మరూపమునొంది 'సంకెళ్లు' వదల్చుకొనెను. ఆ వేళకు బ్రహ్మాస్త్రము యథాస్థాన గతంబయ్యె.

ఆంజనేయుడు లంకాగారము నాశయించి ద్వారతోరణ స్తంభముతో నచటి పాలకులను సంహరించి ప్రాసాదంబులకు నిప్పు పెట్టెను. ప్రతి గృహ మందును కోలాహలమై అంద్రు నిద్రించు బిడ్డలను విడిచి ప్రాణరక్షకై తమ కురులును, వస్త్రములును కాలిపోగా ఇంటి వెలుపలకు పరుగెత్తిరి. రావణ ప్రాసాదమును, రావణసభను కాల్చి జనులను తోకతో సదలించెను. కాలు చుండు రాక్షసులు నోటికి చేతికి తాళమారంభించిరి. అప్పుడు రావణుడు కృద్ధుడై పదికోట్ల రాక్షసులతో వెడలి ఆంజనేయునితో యుద్ధమారంభించెను. అతని సైన్యాన్ని ద్వారతోరణ స్తంభముతో ప్రహరించుచు కోట్లాదివీరులను తోకతోచుట్టి గెడపి, వినోదముగా రావణుని తలమీద తోకనుంచి వాని చర్మమును కాల్చెను. తోకనిప్పుచే రావణుడు మూర్ఛితుడయ్యె. ఆంజనేయుడు శ్రీరామునికి కీర్తి కలుగవలెనని వానిని చంపలేదు. ఇది చూచి వచ్చిన ఇంద్రజిత్తును చంపక లక్ష్మణుని ప్రీతికై వదలెను. ఇట్లు లంకనంతను గాల్చి సముద్రతీరంచేరి జలజంతువుల బ్రోవనెంచి నీటిమీద తోకనుబాపి అలలచేత

దానిని చల్లార్చుకొనెను. పొగవలన తన గొంతులోచేరిన శ్లేష్మము నుమ్మి వేసెను. అంతలో అతనికి సీత క్షేమముగూర్చి తలంపు రాగా తానొనర్చిన అకృత్యమునకు తన ప్రాణత్యాగమే పరిష్కారమని యెంచి తన తోకతోనే ఉరి వేసుకొనబోవగా అశరీరవాణి సీత క్షేమముగా నున్నదని ఘోషించెను. అది విని ఆంజనేయుడు తన ప్రాయోపవేశ ప్రయత్నమును మాని ఆనందముతో మరల సీతను దర్శించుటకు పోయెను.[129C]

ఈ సన్నివేశమును (లంకాదహనం) అయ్యలరాజు రామభద్రకవి తన ప్రబంధోచిత శైలిలో వర్ణించుచు పొత్తులలో పిల్లలతో సాగిన బాలింతలను పతిహీనలైనవారి కష్టాలను విపులముగా వర్ణించినాడు.[130]

తత్త్వసంగ్రహ రామాయణము: తన వాలమునకు నిప్పంటించునెడ హనుమంతుడు బ్రహ్మమంత్రము నుచ్చరించినట్లును దాని వలన అతనికి కట్లు తెగిపోయినట్లును లంకాదహనానంతరం సముద్రములోనికిదిగి అగ్నిసూక్తము జపించినట్లును తెలుపబడి యున్నది.[131]

శ్రీమద్రామాయణ కల్పవృక్షము: రావణసభలో హనుమంతుని దండించుటలోగల విశేషములిందున్నవి. రావణుడు హనుమంతుని వధింప తలంచగా విభీషణుడు "దూతదుష్టతకు కశాభిఘాతం, శిరోముండనం, విరూపత, లక్ష్మణ సన్నిపాతం దండనలు విధించదగును. అప్పుడు రావణుడు "బహుబాణ ఘాతంబుల నెత్తురుచిమ్ముచున్న యితని మేన కశాభిఘాతంబైనట్లే; వానరులకు మూర్ధజంబులేమి మౌండ్యంబులేదు; మౌండ్యంబందలి రహస్యంబు పతాకా నిర్మూలనంబు వానరులకు లాంగూలము తత్స్థానీయంబు. ఇంక నితని పుచ్ఛంబునకు గుడ్డలుచుట్టి నూనియపోసి నిప్పంటించి లంకాపురీ వీధులందితని త్రిప్పవలయు. లాంగూలము వినష్టమై లక్ష్మణ సన్నిపాతంబుతోపాటు తక్కిన మూడు శిక్షలు జరిగినట్లగును" అని పలుకగా ప్రాడ్వివాకులు శిక్షాపత్రమును రావణుననుమతితో చదివిన వెంటనే రాక్షసులు శిక్షలనమలు చేసిరి. అతనిని వారు వీధులలో త్రిప్పసాగగా వారినాతడు సందులలోనికి లాగెడివాడు. వారు "ఈతడు దొంగగా రాత్రివేళ నగరమున ప్రవేశించెననియు, అక్షకుమారుని చంపెననియు ప్రభువతనికి మరణదండనవేయక బుద్ధి వచ్చునట్లు దండించెననియు ప్రకటించుచు—

పీనదేహుడితడు పిప్పళ్లబస్తా వి
ధాన బలిసినాడు వానరుండు
మొండిజాతి యెంత మొత్తిన నబ్బాయ
నండు నొప్పి యెదగనండు తిరిగి

—ఆ నిప్పువలన అంజనేయుడు బాధ ఎక్కువకాగా అతడు దానితో నూరు ముట్టించాలో జలధినార్పవలెనో అని మనసులో తర్కించుకొనుచుండగా అగ్ని అతనికంతలో చల్లనైనట్లు తోచెను. దానినతడు సీతామాహాత్మ్యముగా భావించెను. దహనకాండ పూర్తికాగానే సీత ఏమయ్యెనో అను భీతి కలిగి—

........నశోకవీధి చనిక్ష్మాసుత దూరమునందుఁగాంచి ద
గ్గరకునుపోవగా నొడలు కాలదొడంగినఁ జిత్రమయ్యె.........అతడా
మెకు దగ్గరగా పోవుకొలదీ వేడి ఎక్కువగు చుండెను. అంత అతడు
........యెఱింగెబోయనలు డౌష్ణ్యము జానకియందుదాచి చొ
చ్చెను దనతోక యందిచట సీతకుఁజుట్టునమన్న రాక్షసాం
గనలును దవ్వదవ్వగను గానగవచ్చి విభీతచిత్తలై....

—అని యెంచి శ్రీరాముని ధ్యానించి ఆమెను చేరగా అనలమతనికి శీతలముగా నుండెను.[132]

సమీరకుమార విజయము ప్రకారం: సీతను దర్శించిన తర్వాత అంజనేయుడశోకవనమును చెఱచుట, రాక్షసవీరులతో పోరుట, అక్షకుమారుని వధించుట మొదలగునవి యథా వాల్మీకముగా సూచితమైనవి. ఇంద్రజిత్ అతనిపై బ్రహ్మాస్త్రము ప్రయోగింపగా తనకు బ్రహ్మ ఇచ్చిన వరమునెంచి—

"తచ్ఛరముఁద్రోయం జాలియున్ ధాతృదేవత నీక్షించి, రావణస్థితిన్ గనన్వాంఛించియు అహుతభుజ్మిత్రసుతుడు కట్టుపడినట్లుండెన్విలాసంబునన్" రావణసభలో 'నీవెవడవురా, నిన్నెవ్వరంపిరిరా' అని రావణుడు ప్రశ్నింపగా, తన వాలము తత్సభాంతరవేదిస్థితిదాల్పగా వానిని "ఓరిదశాస్యస్వామిద్రోహి నేను రామాధ్యక్షుని బంటును, వాయుపుత్రుడను సీతాదేవి క్షేమమారయుటకై వచ్చితిని. ఆమెను చూచితిని. నా భుజసామర్థ్యము నీకు కొంత రుచి చూపితిని నన్నెదిర్చి నిల్వగల బంటు మీలోలేరు. నీమేలుకోరి చెప్పుచున్నాను. నీవు నామాటవిని శ్రీరాముని శరణువేడుము. శివుని ధనుస్సు విరిచిన ఆ వీరునికి

సీతనిచ్చి నీవు బ్రతుకుము." అని చెప్పెను. దానికి వాడుకోపించి కోతిని వధింప నాజ్ఞాపింపగా విభీషణుని మాటల వలన వాలమును కాల్పవలసిన దండన లభించెను. ఈ వార్తవినిన సీత అగ్నిని ప్రార్థించగా అగ్ని ఆంజనేయునికి చల్లగా నుండెను. ఆ అగ్నితో ఆంజనేయుడు "సురలు పద్రష్టగా, తన సింహ నాదములు శ్రుతిసూత్ర నికరముగా, రాక్షసులు బలిపశువులుగా, గృహదారు పటలము సమిధలుగా, తన కోపవహ్ని, ప్రతాపవహ్ని, లాంగూలవహ్ని అను త్రేతాగ్నులతో రామార్పణముగా పూర్ణాహుతిచేసి సముద్రములో అవబృధ స్నానముచేసి తన విజయవార్త కపులకెరింగించుటకై వచ్చెను."[133]

రావణుడు హనుమంతుని చూచినపుడు
"నందీశ్వరుడో హరుడో సందేహమ్మగుచున్నది
భస్మాసురుడో ఏమో ప్రాణాలకు భయమయ్యె"—

—నని తలంచెనని సుందరమందారమున [134] వర్ణితము.

రావణుడు హనుమంతుని చూచినపుడు వాల్మీకి మహర్షి రచనలో రావణుడు అతనిని భీమరూపం, భీమవపుః, ఉగ్రః అని అతనిని పరాక్రమ మును స్తుతించుచు తనలో తాననుకొనెను. మహాభూతము, మహాబలపరిగ్రహము మహోత్సాహము, మహావేగము, మహాబలం, మహామతిం, మహాకాయం మహాసత్వం బలవికరణాయనమః బలాయనమః బలప్రమథనాయనమః సర్వ భూతదమనాయనమః అనునవి మహాన్యాస వాక్యములు. రావణునికి శివుని, నందిని తలపింపజేసెనని శ్రీ శేషేంద్రశర్మగారి వాక్యము.[135]

తన పాపకృత్యములచే లంక కరడు గట్టియున్నందున ఆంజనేయుని వాలాగ్ని స్పర్శచే లంకను పవిత్రీకరించుటకే రావణుడు అతని తోకకు నిప్పు పెట్టించెనని శ్రీమద్రామాయణాంతరార్థము.[136]

రామచరితమానస్‌లో: హనుమంతుడు లంకను కాల్చుబో కుంభకర్ణుని భార్య అతనిని సమీపించి "నాభర్త నిద్రిస్తున్నాడు. కావున మా ఇంటికి నిప్పు పెట్టవద్దు" అని కోరినట్లున్నది. హనుమంతుడు సీతవద్ద సెలవు తీసుకొనుచో సీత అతనిని చూచి "నీకు జరామరణములు లేకుండుగాక, సదా, నిన్ను నానాథుడు ప్రేమించుగాక" అని దీవించెను.[137]

5 హనుమంతుని పునరాగమనము.

తిరుగు ప్రయాణమును చేయబోవు వాయుపుత్రుడు అరిష్టాద్రిపై కాలు పెట్టినంతనే అతని పాదఘట్టనచే శిలలు పొడిపొడియైనవి. చెట్లు నేలకొరుగగా జంతుసంతతులు తత్తరలాడినవి. పిడుగుపడినట్లవి పడగా కొండగుహలలోని సింహములు గుహాంతరమునచేరి ఆకాశం పగిలిపోవునట్లు అరచినవి. పాముల తలలు రాలసందులలోపడి నలిగినవి. కిన్నర కింపురుష విద్యాధర యక్ష పన్నగ స్త్రీలు పురుషులు ఆ పర్వతము వదలి ఆకాశానికి ఎగిరిపోయిరి. పది యోజనాల వెడల్పు ముప్పైయోజనాల యెత్తుగల ఆకొండ పాతాళమునకు దిగబడి నిముషములో నేలమట్టమయ్యెను—

అంతరిక్షార్ణవమున మహాంబురాశి
నావతరియించు చందాన నవ్యలీల
నంజనానందనుండేగె నశ్రమమున

—అట్లు తిరిగి ప్రయాణము చేయుచు దారిలో మరల మైనాక పర్వతమును స్పృశించి, జ్యాముక్త నారాచమువలె మేఘాలలో పయనించి మహేంద్ర పర్వతం చూచి దశదిశలూ నిండునట్లుగా గొప్ప సింహనాదం చేసెను. తన వారిని చూడవలెనను కోరికతో తోకను విదిలించి జాడించగా ఆధ్వనికి ఆకాశము బద్దలై దూరమున అతని రాకను నిరీక్షించు వారికి వినబడెను. దానిని వినిన జాంబవంతుడు. అది హనుమ ధ్వనిగా గుర్తించి ఆధ్వనిని బట్టియే హనుమ కార్యఫలావాప్తి నొందెనని తోడివారికి తెలిపెను. అతనిని దర్శింప కుతూహలము గలవారు కొండశిఖరాలపైకిచేరి అనుకూల స్థానముల నుండి అతనిని వీక్షింపసాగిరి, తామక్కడచేరి ఎదురు చూచుచున్నట్లు హనుమకు తెలుపుటకై పూచిన చెట్లకొమ్మల నాడించిరి. వారంతా చూచుచుండగా హనుమంతుడు మహేంద్రగిరి నిర్ఘరమునబడె నిహతపక్ష శైలంబనగన్." కోతులు అతనికి స్వాగతమిస్తూ తమ ఆనందానికి సూచకముగా ఫలమూలములను అతనికి కానుకగా అర్పించిరి. హనుమ హ్రదము వెడలి జాంబవంతునకు, అంగదునకు, తదితర వయోవృద్ధులకు నమస్కరించెను. మొట్టమొదటి మాటగా "చూచితి సీతను" అని సంగ్రహముగా ముందు వారి కుతూహలమును తృప్తి నొందించిన తదుపరి అంగదుని చేతిని తన చేతిలోనికి తీసుకొని నడచుచు

మహేంద్రగిరిలో ఒక రమ్యప్రదేశమున వారిని ఆ సీనులగునట్లుచేసి సీతాదేవి వృత్తాంతము వివరించెను.

అంగదాదులాతని సాధనలోని దీక్షను వేగమును బలమును ధైర్యమును ప్రభుభక్తిని పలుమారు ప్రశంసించి అయాకార్యాదుల నతడెట్లు సాధించెనో మరల అడిగి వివరములకోరిరి. లంకాయానములోని తన అనుభవములను అంజనేయుడు విశేషాంశములతోసహా తన గంభీరవచో మాధుర్యముతో వివరించి రామానుగ్రహము వలన సీతామాహాత్మ్యము వలన తన ప్రయత్నము ఫలించినదని "నాదుచిత్తము సదా చింతించెడున్ జానకీ వనజాతాయుతలోచనా ప్రణవమై" అని నివేదించెను. రావణుడల్పుడని తలంప వీలులేదనిన్నీ ఇకపై కర్తవ్యము రామసుగ్రీవాదులదేననిన్నీ పలికెను. "నేనొక్కడనే రావణుని రూపుమాపగలను. మహాబలవంతులగు అంగద జాంబవంతులు కలిసి వచ్చినచో రాక్షసులనందరిని రూపుమాపవచ్చును." అని పలికి తాను కోసల రాజేంద్రుని దూతగా (భృత్యునిగా) ప్రకటించుకొనుట, లంకాదహనము, వానర దాశరథుల సఖ్యమునకు సీత ఎట్లు ఆనందించినదో, పరుషోక్తులాడు దశరథుని సీత ఎట్లు నిర్లక్ష్యముగా మాట్లాడినదో, వానిని శపింప సమర్థురాలై తన రక్షణభారము శ్రీరామునిపై ఉంచుట మొదలగు విషయములనన్నింటిని సంపూర్ణముగా తెలిపెను. ఆ ఆనందములో అంగదుడు "సీత జాడ తెలిసినది కావున మనం వెళ్లి ఆమెను తీసుకొనివచ్చు ప్రయత్నము చేయుద"మనెను. జాంబవంతుడతని ఆలోచనను మెచ్చుకొనినను ఇది రామునకుతెల్పి అతడెట్లు నిర్ణయించినచో అట్లు వర్తించుట మంచిదని పలుకగా హనుమదాదులందరు 'సరి' అని అంగీకరించి కిష్కింధకు బయలుదేరిరి. అచట మధువనమున ప్రవేశించి ఆనందముతో తేనెలానవలయునని కపులందరు కోరగా జాంబవదాదులందుల కంగీకరించిరి. వారాతోటలో విందులారగించు చుండగా తత్సంరక్షకుడగు దధిముఖుడు అడ్డుపలికి విఘ్నమొనర్ప రాగా అపుడు హనుమంతుడు వానరులతో "దధిముఖుడు మీదరికి రాకుండా నేను చూచెదను. మీరు తేనెల యథేచ్ఛగా నారగించుడు" అని అభయమిచ్చెను. యువరాజగు అంగదుడు ఆ సంతోష సమయమునకది తగినదిగాయెంచి అంగీకరించెను. దధిముఖుడువెళ్లి యీ వార్త సుగ్రీవునకుతెల్పి వారి యాగడములనాపుమని విన్నవించగా సకలము నూహించుకొని సుగ్రీవుడు వారిని ప్రవేశపెట్టుమని తెలిపెను. వానరులందరు

తుష్టిగా తేనెలాని, ఫలములదిని రాగా, హనుమంతుడు శ్రీరాముని చేరవచ్చుచు "నియత, ప్రాణయుక్త అయిన సీతను చూచితిని" అని కార్యసాఫల్యమును మూడు ముక్కలలో తెలిపెను. వానరులు హనుమంతుడేదేది ఎట్లు సాధించెనో పలుమారు పేర్కొనసాగిరి. సీతాసందేశమును శ్రీరామునకు తెల్పి ఆమె చెప్పిన కాకాసుర కథనుతెల్పి, శిరోమణిని రామునకిచ్చి సముద్రమును తరించి సీతను కాపాడుమని కర్తవ్యము సూచించెను. రాముడానందించి, సీత పరిస్థితికి దుఃఖించి ఆమెతో తనతో చెప్పిన పలుకులను సీతయే యెట్లు చెప్పెనో అట్లు చెప్పుమనికోరి అతనిచే పలుమార్లా సంగతులను వినెను. సీతాదేవితో తానే విధముగా భాషించినదీ, ఆమె పలుకులు, తన ఊరడింపు మాటలు అన్నియు తెలిపెను. "తమరువచ్చి రావణుని చంపి ఆమెను రక్షింపగలరను నమ్మకమామెకు కలుగునట్లుగా నేను చెప్పి వచ్చియున్నాను." అని తెలిపెను.[138]

హనుమను స్వామి సంభావించుట: శ్రీరాముడాతని ద్వారా సకల వివరములను వినినంతనే వానరాదులను చూచి "మన హనుమ గొప్ప కార్యములు చేసియున్నాడు. ఇవి దుస్సాధములు, వీనినితరులు సాధింపజాలరు. అట్లు చేయగలమని వారు సంకల్పించుటకు కూడ దక్షులుకారు. లంకాపురమున ప్రవేశించి ప్రాణములతో తిరిగి వచ్చుట హనుమ బలపరాక్రమములకు నిదర్శనము. ఆజ్ఞాపించినది సాధించుటయేకాక సుగ్రీవుడు తనకు సూచించకున్ననూ తన కనురూపమైన పౌరుషకార్యములనొనర్చి ఉత్తమ భృత్యామార్గమున కుదాహరణమై యున్నాడు. కార్యమును నెరవేర్చుటతోపాటు తదనుకూలమగు అశోకవనభంగము, అక్షసంహరణము, లంకాదహనము మొదలగు కార్యములు చేసియున్నాడు. లఘుత్వము నాపాదించు కార్యమేదియు చేయక సుగ్రీవునికానందము కూర్చెను. సీతను చూచి ఆమె నోదార్చి వచ్చుటయేకాక మా రఘువంశమునే నిల్పి మమ్ములను ఆత్మహత్యా ప్రయత్నమునకు పాల్పడకుండా చేసియున్నాడు. ఈతడొనర్చిన సాహాయ్యమునకు సమానమైన సంతోషమును హనుమంతునకు కలిగింపలేకున్నందుకు చింతించుచున్నాను. నాకున్న ధనమంతా ఇచ్చిననూ ఈ ఋణము తీరదు. "నా సర్వస్వమునర్పించునట్టి నా పరిష్వంగములోనికి రావయ్యా హనుమా" అని పలుకుచు రాముడు పులకితగాత్రుడై హనుమంతుని "నా అవయవంబులచేత నానదీర—

నెట్టులాత్మేశ నే స్పృశియింపగలనొ నీ

—వట్లు సేయుము" అని సీత పలికినదానికనుగుణముగనే హనుమంతుడెట్టి ప్రయత్నము చేయకనే సీతా వాక్ప్రభావము వలన అంజనేయునను రామ లింగన భాగ్యము కలిగెను. అంజనేయుడంత పులకిత గాత్రుడయ్యెను.[139]

భాస్కర రామాయణమున: "రఘుకుల రక్షణ మెలవింగాలింపబుట్టి తీవుకపీంద్రా" అని రాముడు హనుమను ప్రవంసించెను.[140]

అధ్యాత్మ రామాయణము: హనుమంతుడు తాను లంకలో గాలించిన కార్యములను తెలిపి లంకనంతటిని వర్ణించెను. అచటి రక్షణ విధానమూ శతఘ్ను లెట్లున్నవో తెలుపుచు "రావణుని బలములో పాతికభాగము నాశన మొనర్చితిని. సువర్ణ ప్రాకారము పాడు చేసితిని. దుర్గములను శతఘ్నులను పడగొట్టితిని. ఇంక తమరివలన లంక పూర్తిగా భస్మమై పోగలదు. ఆ లంకకు ఉత్తరమున సువేలాద్రి, పశ్చిమమున పరలంక, దక్షిణమున నికుంభల, తూర్పున లఘులంక కలవు అని దాని ఎల్లలను అపసవ్యమార్గమున తెలిపెను. ఇన్ని కార్యములనొనర్చిన హనుమంతునిలో గర్వము కలుగకుండుటకై రాముడొక వినోదము చూపినట్లీ రామాయణమున కలదు. సీతా శిరోమణిని తీసికొని హనుమంతుడు తిరుగు ప్రయాణమునకు రానుండగా బ్రహ్మ అచటకు వచ్చి లంకలో హనుమ గావించిన కార్యములను ఒక లేఖగా వ్రాసి శ్రీరామున కిమ్మనెను. దారిలో దాహము కలుగగా హనుమంతుడొక ముని ఆశ్రమునదిగి తన చేతనున్న ముద్రికను గట్టునపెట్టి ఒక హ్రదమున దాహము తీర్చుకొనన బోయెను. అపుడచటికొక పిల్లకోతివచ్చి ఆ ముద్రికను మునియొక్క కమండలు వులో వేసెను. అంజనేయుడదిచూచి ముద్రికను తీసుకొనబోగా అందట్టివే అనేక ముద్రికలుండెను. తాను తెచ్చిన ముద్రిక ఏదో తెలియక తికమకపడి మునితో చెప్పెను. ఆముని అంత "ఎన్నో కల్పములు జరుగుచున్నవి. ఎందరో రాములు, ఎందరో సీతలు, ఎందరో హనుమంతులు వచ్చి పోయిరి." అందు వలన నీవు ఇపుడు వెదకికొనజాలవని చెప్పెను. అపుడు హనుమవెళ్లి యీా వృత్తాంతము రామునకే తెలుపగా "ఆ వినోదమును నేనే చూపితిని. నీలో గర్వము కలుగకుండా నేనట్లు చేసియున్నాను" అని రాముడు చెప్పగా అపు డాంజనేయుడు తాను సముద్రమును దాటుట, లంకలో వీరోచిత కార్యాలు చేయుట శ్రీరాముని కృపవలననేనని గ్రహించెను.[141]

సమీరకుమార విజయము ప్రకారం: హనుమంతుని మాటలను వినిన రాముడు తనకాతడు కావించిన ఉపకారమునకు "ఈ అనితరోద్యోగ ప్రతాప క్రియా సదుపాయ స్థితులెందునుం గలవే" "నీ శుభోదయము మా వంశరక్షణకే కదా అయినది. సముద్రమును దాటుటకు గరుడుడు పవనుడు సమర్థులేకాని దేవతలకే శక్యముకాని రావణుని నగరములో ప్రవేశించి శత్రువుల నిర్మూలించి ప్రభుకార్యము నెరవేర్చిన నిన్ను పొగడుట కాబ్రహ్మకు కూడ వీలుకాదు. దీనికి ప్రత్యుపకృతిగా నిన్ను కౌగిలించువాడినే కానీ నీకేమియు యీయలేనివాడను"అని రాముడు హనుమంతుని సత్కరించెను.

రామచరితమానస్ ప్రకారం: రాముడు "హనుమా, దేహధారులైన వారిలో నీవంటివాడు దేవమానవులలోలేడు. నీకేమి ప్రత్యుపకారం చేయగలను? నీ ఋణమున నుంటినికదా అని నేను విచారమున నున్నాను. అందువలన నీ ముఖము చూడలేకున్నాను." అని పలికెను. అదివిని హనుమంతుడు భక్తి పరవశుడై రాముని పాదములపై పడెను. రాముడతనిని లేవనెత్తి హృదయమున కాశ్లేషింపజేసెను. అపుడు హనుమ తనలో ఏ దురభిమానము లేనివిధముగా "మీరు సర్వజ్ఞులు. మా వానరులు శాఖామృగములు సముద్రము లంఘించుట, రాక్షసుల చంపుట. లంకను దహించుట – ఇవి మీ ప్రతాపము వలననే జరిగెను వీనిలో నా ప్రయోజకత్వము శూన్యము. మీ ముద్రికను చూచి జానకి శాంతించెను. ఆమె శోకాగ్ని లంకను దహించెను. ఆమె చూడామణి బలముచేత నేను పునః సముద్రమును లంఘించి మిమ్ము చూచితిని. నాకు సుఖదాయిని, నిత్యానపాయినియైన భక్తిని మీయందు ప్రసాదింపుడు." అని పలికెను.[142]

శ్రీరాముడు హనుమంతునాలింగన మొనర్చినంతనే అక్షణముననే అతడు జీవన్ముక్తి పొందెనని శ్రీ శ్రీనివాసశాస్త్రిగారి భావము. What more could Hanuman want; He attained his salvation at that movement (PP 288 Lectures on RAMAYANA By Rt Honourble Sri V. S. Sreenivasa Sastry, P. B. S. Viswathaiah 1968 Revised Edition.)

ఈ విషయము అంతరార్థ రామాయణమున కూడ ఉచితముగా సమర్థింపబడినది. భగవద్గీతలో "మనసస్తు పరా బుద్ధిరోఽబుద్ధేః పరతస్తుసః

(అధ్యా 3 – శ్లో 42) అను శ్లోకమున తెలిపినట్లు బుద్ధి ప్రకృతిని దాటితే పరమాత్మ గోచరించును. సముద్ర లంఘనానంతరం ఆంజనేయుని ద్వారా (సీత అనే) ప్రకృతి పరిశీలనము జరిగి (సీత–రాములనెడు) ప్రకృతి పురుషుల సమైక్యము జరిగినది. సాధన ద్వారా ఈ దశకు చేరినవానికి భగవంతునిలో ఐక్యమగుట (రాముని కౌగిలింత రూపముగా) ముక్తిని పొందుటయే. (పుట 90)

శ్రీ మద్రామాయణ కల్పవృక్షమున కూడ రామాంజనేయుల ఆలింగన విశిష్టత పేర్కొనబడినది. సీతమ్మ లేని సమయమున రామలక్ష్మణులను మాత్రమే చూచి వారి సౌందర్యమునకు వశుడైన హనుమంతుడు లంకలో సీతాదేవిని దర్శించి ఆమె కటాక్షము పొందనంతవరకు పరిపూర్ణస్థితి పొందలేదు. సీతాదేవి రావణునకు నీతి వాక్యముల చెప్పుచో శింశుపావృక్షములో నుండి వినిన మాటలలో హనుమంతుడు భగవత్స్వరూపము తెలిసికొనగలిగెను. తాను రామదూత, రామదాసు అని ఘోషించి మాతృదర్శనం పొంది ఆమెతో భాషించి తాను గ్రహించిన భగవద్రూపాన్ని వర్ణించి స్వస్వరూపజ్ఞానం భగవత్స్వరూపజ్ఞానం తల్లి అనుగ్రహంవల్ల పరిపూర్ణంగా పొందినందున భగవంతుని ఆలింగనము పొందుటకు యోగ్యుడైనాడు. (పు 82–84. సుందరకాండ శ్రీమద్రామాయణ కల్పవృక్షము)

——

అధ్యాయము—6

రామరావణ యుద్ధమున హనుమంతుని పాత్ర

1. ఉపోద్ఘాతము :

రామరావణ యుద్ధమున హనుమంతుడెన్నియో కార్యములను నెర వేర్చెను. అందు కొన్ని అసాధ్యమైనవియు అద్భుతమైనవియు కలవు. వానితో పాటు అప్రధానమైన అల్పాంశములు కూడ కలవు. ఈయెడ హనుమంతుని ధైర్యసాహస పరాక్రమాది విశేషములు రాజనీతిజ్ఞత, ఆర్త రక్షణ పరాయణత• దైత్యాంతకత, రామసేవ, రామానుజసేవ మొదలగు ప్రధానాంశములనే పరిశీలించుట పరిశోధనధ్యేయము.

వాల్మీకి రామాయణము ప్రకారము లంకను చేరుటకు శ్రీరామాదులు వానరసేనతో నడచి వెళ్లిరి. ఆనందరామాయణము ప్రకారం శ్రీరాముని హనుమంతుడును, లక్ష్మణుని అంగదుడును తమ భుజములపై వహించి సాగిరి. సమీరకుమార విజయమున హనుమంతుడు రాముని 'మేనబాని' చేరినట్లున్నది.[143]

లంకాతీరమునకు చేరిన వెంటనే హనుమంతుని ప్రార్థన ననుసరించి రాముడు రావణుని చెరలోని దివిజగరుడ గంధర్వ కిన్నరకంజముఖుల చెఱ విడిపించినట్లు రామాభ్యుదయకథ.[144]

2. విభీషణ శరణాగతి

సాగరతీరమున విడిది హొందియున్న రాముని వద్దకు అర్థుడై రావణ సోదరుడగు విభీషణుడు వచ్చి రామునాశ్రయింపకోరెను. వానరులలో ప్రముఖు లగు సుగ్రీవ అంగద జాంబవానుడాదిగాగల కపుల అభిప్రాయమును రాముడు కోరెను. వారొక్కొక్కరు ఒక్కొక్క విధముగా చెప్పినను శత్రువు సోదరుడగు వానిని దగ్గర చేరనీయరాదను భావమునే ప్రతిపాదించిరి. అప్పుడు రాముడు అంజనేయుని అభిప్రాయమును కోరెను. తన అభిప్రాయము తెలువుటకు ముందీ ఉపోద్ఘాతముతో అంజనేయుడిట్లు తన వాదము తెల్పెను—

మతిమంతులలో శ్రేష్ఠు డ
వతి కుశలుడవర్థముల మహావాగ్మివి ని
న్నతిరేకించి వచింపగ
శతముఖునాచార్యుడైన చాలడు రామా

—వాగ్వాదాలలో యుక్తియుక్తంగా మాట్లాడగల తర్కనైపుణ్యం నాకుందని చూపాలనిగానీ, ఇతరుల అభిప్రాయాల నణచి నా వాదం గెలిపించుకోవాలని గానీ, అందరికన్నా నేనే మిన్న అన్న గౌరవం పొందాలన్న కాంక్షతోగానీ, నా వచోవిజృంభణము నావిష్కరించుటకు సమయమనిగానీ, విభీషణుని మీద అభిమానముతోగానీ, నీవు నన్ను మెచ్చుకొని సన్మానించాలనిగానీ నేను నా అభిప్రాయాన్ని ప్రకటించడంలేదు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పదలచితిని. నీ సచివులు పలికిన పలుకులలో దోషమున్నది. కావున వారి మాటలు గ్రహింపవీలులేదు. పరమర్మము లెఱుంగుటకై ప్రాగ్రూపమెత్తి కుమతులు రాగలరా? ఒకవేళ వేషము వేసికొని వచ్చిరని అంగీకరించినను వారి పలుకు లలో దుర్భావ సద్భావములను పరికింపలేమా! ప్రబలమైన లోని భావాన్ని చావడానికి ఆకారవైఖరులలో బ్రహ్మకు కూడ సాధ్యం కాదు గదా! ఇతడు రావణుని తమ్ముడైనంతమాత్రాన నమ్మరాని యితనిని చంపవలెనను సుగ్రీవుని వాక్యమర్థహీనమైనదా! రావణునివలె ఇతడకృత్యముల చేయలేదుగదా. ఈతడు శత్రువని అంగదుడనుట దయావిహీనతయే. దూతను పంపి ఇతని హృదయ రీతుల నెఱుంగవలెనను శరభుని మాట నీతికాదు. ఇతని రాక దేశకాల విరుద్ధ మను జాంబవంతుని పలుకులామోదింప పనిలేదు. ఆపన్నుడగువాడు వేళలను స్థలములను గమనించగల్గునా! అన్న పాపము వలన దైత్యవంశము నాశన మగుననియూ శ్రీరాముడే జయించుననియూ సమరమారంభింపకముందే వచ్చి నందున ఇతని దేశకాలజ్ఞత తెలియుచున్నది. ఈ విభీషణుడు సాధు. ఉపకారి. గోల, యీతని మాటలలో భేదమొక్కింత కూడా లేదు. అన్నకీతడుపదేశించగా అతని నీతులు నచ్చక రావణుడితనిని తన్ని తరిమివేసెననుట సంశయింప రానిది. నా అనుభవాన్నిబట్టి యీతని చిత్తము నేనెఱుగుదును. నన్ను వధింప వలసినదిగా రావణుడనుచుండగా నా మదికి హితముగా ధర్మాన్ని పలికిన వాడితడే. ఈతని స్వభావము ధర్మమయము, అంతేకాదు, రావణుని తమ్మునికే శరణాగతినిచ్చినచో జగత్తులో అంతకన్నా మీకు ప్రతిష్ఠ ఉండునా? కావున

తమరు రాజనీతి సూత్రానుసారమాలోచించి యితనికభయ మీయవలయును"— హనుమ ఈ అభిప్రాయమును వినిన రాముడు బాగుగా యోచించి తన నిర్ణయ మునకు అనుకూలముగా పలికిన హనుమంతుని అభిప్రాయమును బలపరచుచు కేవలము హనుమంతుడు తెలిపినట్లుగా విభీషణుడు సుజనుడనిన్నీ, దుర్మార్గుడు కాడనిన్నీ తెలిపిన కారణములకన్నా తన శరణాగత పాలనాదీక్షకది తోడ్పడు చున్నందున విభీషణుని అంగీకరించునట్లు తెల్పెను. ప్రపత్తికి స్థలకాల నియమ ములతోగానీ దేశనియమముకానీ ప్రపన్నుని గుణశీలములతోగానీ నిమిత్తము లేదని తెల్పి తాను విభీషణునికి శరణాగతిని ప్రసాదించుటకు నిశ్చయించెను. రామవిభీషణ స్నేహసంధానమునకు (రామసుగ్రీవ సఖ్యమునాడు చూపిన ప్రజ్ఞవలె) హనుమంతుని కృషి నిర్వివాదముగా నిశ్శ్రేయసమైనది.[145] ఇందు హనుమంతుని రాజనీతి పరిజ్ఞానము, వాదప్రకటనాచాతుర్యము "నభూతో నభవిష్యతి"గా పొగడదగినవి.

ఆనందరామాయణం ప్రకారం: విభీషణునికి శరణాగతి ప్రసాదించిన తర్వాత రాముడు ఆంజనేయుని పిల్చి సముద్రతీరమున ఇసుకతో ఒక లంకను చేయించి విభీషణుని అందు ప్రవేశపెట్టి అతనినక్కడ లంకాధీశునిగా లాంఛన ప్రాయముగా పట్టాభిషేకము చేయించెను. రావణవధ జరుగువరకు దానిని సామ్రాజ్యముగా రామప్రసాదముగా స్వీకరింపజేసెను. హనుమంతునిచే చేయ బడినందున దీనికి హనుమల్లంక అని ప్రసిద్ధి వచ్చునని రాముని వచనము.[146]

సమీరకుమార విజయమునగలకథ వాల్మీకి కథనే అనుసరించి యున్నది. హనుమంతుని వాదము సర్వవానరుల అభిప్రాయములను త్రోసి పుచ్చునదై రాముని ఆమోదము పొందెను—

కినుకన్ వాలి వధించి భానుజునిగిష్కింధాపురిం బట్ట భ
ద్రుని గావించిన రీతిఁబంక్తి ముఖునిం దూలించి లంకాపురం
బనపాయస్థితి నిత్తురంచు నభయం బర్థించురాబోలులే
మనలో నీ ఘనుడున్న దానవుల మర్మంబుల్ ప్రకాశంబగున్

—అను అంజనేయుని వాక్యాలనే రాముడామోదించెను.[147]

3. సేతు నిర్మాణము

వాల్మీకి రామాయణములో సేతు నిర్మాణ సన్నివేశము సంక్షిప్తముగా వర్ణింపబడినదే కాని అందు హనుమంతుడొనర్చిన కృషి ఎంతో తెలుపుటలేదు.

సేతు నిర్మాణమున వానరులందరు తనకు తోడ్పడునట్లుగా నలుడు శ్రీరాము నభ్యర్థించెను. అపుడు రాముడు వానరులనందరినీ రాళ్లను కొని తేవలసినదిగా ఆజ్ఞాపించెను. వానరులందరితో పాటు అంజనేయుడు కూడ ఇందుకు తోడ్పడెను.

పరాశర సంహితలో: 21వ పటలమున కపిలుని కథలో హనుమంతుడు తన భక్తుని దారిద్ర్యమును తొలగించుటకై అతని యింటె పెరడులోని నిధిని తానే స్వయముగా మోసి తెచ్చియివ్వగా కపిలుడు హనుమంతుడు తన దైవమై అంతటి హీనకృత్యమును చేయుటకు ఖిన్నుడు కాగా అపుడాంజనేయుడు "నేను మేరుపర్వతాన్ని కూడ సేతు నిర్మాణ సమయములో తేబోయినాను. కాని అందులో రామవిగ్రహము ప్రతిష్ఠించి యుండినందున దానిని వదలి మిగతా చిన్న కొండలనుమోసి తెచ్చి సేతువు నిర్మించు నలునకిచ్చితిని. ఆ రాళ్లబరువు కంటే ఈ నిధి బరువుకాదుసుమా" అని తెలిపెను. ఈ కథలో హనుమంతుడు వారధి నిర్మాణ సందర్భములో రాళ్లను సరఫరా చేసెనని తెలియుచున్నది.

సమీరకుమార విజయము ప్రకారం: సేతు నిర్మాణమున వానరులందరితోపాటు పావనికూడ పాల్గొనినా వారందరికన్నా అధికమైన కృషి యితనిదే అని యీ గ్రంథసాక్ష్యము. హనుమంతుడు మలయద్రోణ హిమాద్రి మొదలగు గిరిశిఖరముల నుండి అసంఖ్యాకములైన శిలలను తన చేతులలో, పార్శ్వములలో, తోకలో, భుజములపై సందు లేకుండా ఇరికించుకొని తెచ్చి యిచ్చెను. భారమైన శిలలను కపులు బహువారంబులు దెచ్చుచుండగా హనుమంతుడొక్కసారి లీలగా తెచ్చి యిచ్చుచుండెను. తన ప్రతి రోమములో రాళ్లను బంధించి ఝుంఝూ తిరస్కార మహాత్వరతో వచ్చుటను చూచి పర్వతపు దొంతులు పావనికి పూబంతులవలె నున్నవని ప్రేక్షకులనుకొనెడివారు. అఖండమైన గండోపల ప్రకాండంబులను ఒంటిగా తాకి గెంటేవాడు; తండోపతండాలుగా కొండతండంబులను నలునకందించేవాడు; గట్లను ఎడలించుచో అందుండు నెత్తములాడు వేల్పుభామినులు తడబడుతు విలాసక్రీడలలో నుండి హనుమంతుని కొనియాడగా "కనికరంబున బయలుపడకుండుదురే — పొందు" అని హెచ్చరించేవాడు. కొండదిగువన వసించు వియచ్చరులిచ్చు దీవనలను తలించుచు గొప్ప కొండల నుప్పరంబెగయ మీటెడివాడు; భారముతో దూరము నుండి కొండశిలలను మోయజాలని కపుల ముందర రాళ్లను తానే

పెకలించి అందించేవాడు. ఎక్కడెక్కడ చెట్లూ, కొండలూ ఉన్నవో తానె వెళ్లి చూచేవాడు. ఎంతటి కొండనైనా అనాయాసంగా ఎత్తేవాడు. ఈ త్రిప్పటలో కపులు దప్పిక చెంది అలసిపోయినపుడు నిజభుజశిరః కరకక్ష వక్ష స్కంధాద్యవయవ సంధుల సంధించిన ధరాధర వితానంబులఁగల కోనల ఫలంబులఁ జల్లని దొనల జలంబులు నిరూపించి యక్కడి కెక్కించుకొనగా వారక్కడి తేనియలం జొక్కి ఫలంబుల మెక్కి బడలికలు దక్కి పెక్కు భంగులం దన మక్కువ పేర్కొని కొండల డిగ్గనుఱికి యూరకచనక చన శంకించిన వలసిన గిరుల లంకించి కొనుండని తాఁ దెచ్చినవి యొసంగెడివాడు. గిరినివహము లను మస్తమున దొంతులిడుకొని చేతితో పట్టుకయే దింపెడివాడు. ముని దేవ విహారయోగ్య వనపర్వతాదుల జోలికిపోక తక్కినవానినే భారవాహుల కొప్పించెడివాడు. కొండలలో, తరులలో, రాళ్లలో ఎక్కడ చూచినా తానేయై కపిబలంబునకు బలంబుం బ్రాపునుం జూపుచు సకల సుకృత హేతువగు సేతువు నలునిచేత కట్టించినాడు.''[148]

రామచరితమానస్ ప్రకారం: సేతునిర్మాణములో రాళ్లను హనుమంతుడు తెచ్చునపుడు గోవర్ధన పర్వతము బ్రాహ్మణరూపము ధరించి నన్ను శ్రీరాముని వద్దకు తీసుకొని వెళ్ళుము అని కోరెను. ఆసంగతి శ్రీరామునికి హనుమంతుడు తెలుపగా "ద్వాపరయుగములో మా దర్శనము కలుగువరకు వేచియుండుమని" తెలుపమనెను. ఆ వార్త తెలిపి అంజనేయుడాపర్వతమును వ్రజభూమిలో వదలివేసెను. (దీనినే శ్రీకృష్ణుడు వ్రేలితో నెత్తెను.)

శ్రీరాముడు విడిదిచేసిన తీరభూమినుండి నూరు యోజనముల సేతువును నిర్మించుటలో ఒకటవరోజు పదునాలుగు యోజనములు, రెండవరోజు ఇరువది, మూడవరోజు ఇరువది యొకటి, నాలుగవరోజు ఇరువది రెండు, అయిదవ రోజు ఇర్వదిమూడు — మొత్తం నూరు యోజనములను అయిదు రోజులలో నిర్మించిరి.[149]

4 యుద్ధరంగమున హనుమంతుని కార్యములు

శ్రీమద్రామాయణము ప్రకారం: యుద్ధకాండమున మహర్షి హనుమంతుని వీరోచితకృత్యములను విపులముగా వర్ణించియున్నాడు. ఇతర అనువదిత రామాయణములూ సమీరకుమార విజయమూ చాలావరకు ఆ అంశమునే

పేర్కొనినవి. యుద్ధ ప్రారంభమునకు ముందు రావణుడు శ్రీరాముని సైన్య సమీకరణమును తెలిసికొనుటకై ప్రాసాదమెక్కి శుకునిద్వారా రాముని సైన్యములో ఎవరెవరెట్టివారో తెలిసికొనగోరెను. ఆ యా వీరుల నందరిని శుకుడు వర్ణించి చెప్పుచు హనుమంతుని రూపమును విపులీకరించి వర్ణించెను. అతడు బాల్యమున సూర్యబింబమును పట్టబోవుట, హనుమంతుడను పేరేలవచ్చెనో తెలిపెను. వానరసేనలో అందరూ హనుమంతుని సదా స్మరిస్తూ ఉంటారని తెలుపుటకు 'హనుమంతుడు - హనుమంతుడు - హనుమంతుడు' అని మూడు మారులుచ్చరించి తెలిపెను. రాముని తర్వాత ఆ సైన్యములో హనుమంతుడే బహుజన పూజ్యుడను భావము శుకుడు రావణునకు స్పష్టపరచెను.

యుద్ధ ప్రారంభములో హనుమంతుడు జంబుమాలిని ఎదుర్కొనెను. వాడు 'బాధసముజ్వల శక్తిని' హనుమపైకి విమ్మెను. అంజనేయుడనిల వేగమునుమించు మాడ్కి వాని తేరిమీద ప్రాలి చేతికొలది వానినొకదెబ్బ కొట్టగా వాడు క్షణములోచచ్చెను. హనుమ బలానికి ఆ తేరుకూడ కూలిపోయెను. ధూమ్రాక్షుని పరాక్రమమునకు తాళలేక వానరులు చెల్లాచెదరగుచుండగా హనుమంతుడొక గ్రావమునెత్తి వానిపై విసరెను. వాడు రథము నుండి దూకి తప్పించుకొనగా ఆ గ్రావముపడి వాని రథము గుఱ్ఱములతోసహా పిండియైపోయెను. ఇదిచూచి రాక్షసులు హనుమంతునిపైకిరాగా ప్రళయ కాల యమునివలె విజృంభించి కొమ్మలు బోదెలుగల చెట్టును త్రిప్పుచు వారిపై పడివారి తలలను ఫట్‌ఫట్‌మని పగులగొట్టి నెత్తుటివంకలు పారించెను. రాక్షసులు దుఃఖించుచుండగా ధూమ్రాక్షుడు అంజనేయు నెదిరింప రాగా మారుతి పర్వతశిఖరము నొకదాని నెత్తుకొని ధూమ్రాక్షునిపైకి కవియగా వాడు తన గదతో అంజనేయుని వక్షము పగులునట్లు వ్రేసెను. దానిని తప్పుకొని హనుమంతుడాశృంగాన్ని వేగంగా వాని నెత్తిపై పడవేసి వానిని చచ్చునట్లు చేసెను. అంత రాక్షసులు భీతిచెంది పారిపోయిరి.

అంగదునిపైకి రావణుడు అకంపనుడను వానిని పంపగా వారిరువురికి తుములయుద్ధము జరిగెను. వానరులతని తాకిడికి నిలువలేక బెదరుచుండగా హనుమంతుడు వచ్చి వాని నెదుర్కొనెను. వాయుపుత్రుని రాకతో వానరులు ధైర్యముపొంది పోరాడిరి. రాక్షసుడు హనుమంతుని బాణాలతో ముంచగా అంజనేయుడు తన తల ఒక ప్రక్కగావంచి ఆ బాణాలను లక్ష్యం చేయక

వాడుండుబోటికి ఉద్రేకముతో రాగా వాడు తొలగిపోయి దూరము నుండియే బాణాలు కురిపించసాగెను. హనుమ వానిని తరుముకొనివెళ్లి ఒక కొండను సమూలంగా పీకి వానిమీదకు వేయబోగా వాడు తన బాణాలతో దానిని చూర్ణము చేసెను. అపుడాంజనేయుడు ఇనుమద్ది చెట్లను పీకి గిరగిర త్రిప్పి శత్రుభటాశ్వాదివర్గములపై ప్రయోగించగా వాడా చెట్టును ఖండించి హనుమంతుని వ్రణీకృత దేహునిగా చేసెను. కోపించి హనుమ మరియొక వృక్షమును లాగి గిరగిర త్రిప్పి రెండు చేతులతో వాని తలపై మోదగా వాడు నేలపైబడి మరణించెను. అకంపనుని హతమొనర్చిన హనుమంతుడు బలిని అణగద్రొక్కిన త్రివిక్రమునివలె ప్రకాశించగా రామలక్ష్మణ సుగ్రీవాదులు దేవతలును హనుమంతుని మెచ్చుకొనిరి.

అన్న అనుమతిపై లక్ష్మణుడు రావణునెదుర్కొన రాగా హనుమంతుడాదిక్కుచేరి 'నా వంటిబంటు ఉండగా మీకిశ్రమ ఉండరాదు' అని రావణుని యెదుర్కొనెను. వాడు వేసిన బాణములను తన తోకతో చెదరగొట్టి వాని రథము మీదికి దుమికి తన దక్షిణ బాహువునెత్తి, క్రూరమైన చూపుల చూచుచు వానితో 'నాగ, యక్ష, సుర, రాక్షసదానవ, పక్ష్యాదులచే చావకుండా నీవుండవచ్చునేమో కానీ వానరులచే నీకు చావు తప్పదు. ఇదిగో నా కుడిచేయి ఇన్నాళ్లుగా నిలుపుకొనియున్న నీ ప్రాణాలను చెదరగొట్టుటకై నాచేయి సిద్ధముగా నున్నది. ధీరుడవై చలింపక నిలులుము అని అనగానే రావణుడు కోపించి "వానరా, నీ బలమెంతో చూచెదగాక కొట్టుము. నన్ను కొట్టితివన్న కీర్తి పొందుము. నీవు కొట్టిన తర్వాత నీ శౌర్యమెంతో చూచి నిన్ను పరిమార్తును." అని అనెను. హనుమంతుడు 'నా చేతిబలమెంతో మునుపు చచ్చిన నీ కొడుకును స్మరించుకొని ఊహించుకోరాదా!' అని అనగానే రావణుడు అరచేతితో ఆంజనేయుని కొట్టెను. ఆ దెబ్బకు హనుమ మిగుల బాధపడి ముందు వెనుకకు పలుమారులాగి మరల తెప్పరిల్లి తీంద్రమైన కోపంతో చంద్రనిప్పుల బోలు చక్షులతో గాంౡంచు మోముతో అరుస్తూ రావణుని ఒక గ్రుద్దు గ్రుద్దెను. ఆ పోటునకు దశాస్యుడు కంపించి భూకంపమున భూధరము వలె వచ్చిపోవు ప్రాణముతో గాసిచెందెను. అదిచూచి వనచర ఖేచర మునీంద్రులు మిగుల సంతోషించి హనుమను పొగడిరి. రావణుడు తేరుకొని 'మేలుమేలు. మార్తుండనయైనను మెచ్చితి దండిమగడ' అని మెచ్చుకొనగా,

హనుమంతుడు 'రావణా ఏమిటికో నీవు మెచ్చుట. నా దెబ్బ తగిలికూడ నీవు చావకున్నావు. నా బలము కాల్పునా? "ఓరి మూఢుడా పోటులలో గూడ హెచ్చుతగ్గు లుండునుగదా. ఏదీ మరల నీవు నన్ను నీ భుజబలంకొద్దీ గ్రుద్దుము. అవల నేను నా భుజబలముకొద్దీ కొట్టెదను. అపుడు నా పోట శక్తి నీ కర్థమగును" అని పలుకగా రావణుడు రక్తాక్షుడై తన శక్తికొల హనుమంతుని రొమ్ముపై తన పిడికిటితో కొట్టెను. ఆ దెబ్బకు హనుమంతుడ చలింపనందున హనుమంతుడు కొట్టులోగా రావణుడు ఆపోటు వదలి నీలు వద్దకు వెళ్లెను.

బ్రహ్మప్రసాదమగు శక్తిని రావణుడు లక్ష్మణునిపై ప్రయోగిం అతడు సొమ్మసిల్లి నేలకొరుగునట్లుచేసి అతనిని బందీగా తన నగరానికి చేర టకై తన ఇర్వదిచేతులతో లక్ష్మణుని ఎత్తుటకు ప్రయత్నించెను. వై వాంశమగు తేజస్సుతో కూడిన లక్ష్మణుని యే కొంచమైనను ఎత్తజా ప్రతిష్ఠకోసం పంగటించి పెదవులు బిగించి ప్రాణాలు బిగబట్టి కదలించుచు యుండగా హనుమంతు డక్కడికి పరుగునవచ్చి వజ్రనిభమగు తన ముష్టి తన చేవకొలది రావణుని రొమ్మున గ్రుద్దగా 'మోము గన్నుల వీనుల నెత్తురులురలంగా దిక్కేడియు తోపక చేష్టలుదక్కి సోలి తన రథము కూలబడెను. దెబ్బకొట్టుటకవకాశమీయక నీలునివద్దకు పోయిన రావణు తన దెబ్బ రుచిని హనుంతుడీవిధంగా చూపి లక్ష్మణుని వద్దకు చేర వెంటనే లక్ష్మణుని తన బాహులలోనికి ఎత్తుకొని రాముని వద్దకు అతి చేర్చెను. సుహృదుడు పరమ భక్తికలవాడగుటవలన రావణునికి భారమై లక్ష్మణుడు అంజనేయునికి తేలిగా ఉండెను. యుద్ధరంగమందలి వింతనుచూచి మెచ్చుకొనిరి.

హనుమ కుంభకర్ణుల యుద్ధము బ్రహ్మాండముగా జరిగెను. ఆ రాక్షసుడు సుగ్రీవుని బంధించుకొనిపోగా హనుమంతుడు కుంభకర్ణుని నుండి సుగ్రీవుని విడిపించుటకై వానిని చంపదలిచియు, తన ప్రభు సుగ్రీవుడే తనకు తాను వాని బారినుండి బయట పడగలడని తలించి సాగించుచు వానరుల నుత్సాహపరచుచుండగా, సుగ్రీవుడు కుంభక ముక్కు చెవులను కొరికి తప్పించుకొని వచ్చెను. తన ప్రభువుపై తాను విశ్వాసమునకు అంజనేయుడానందించెను. ఈ యుద్ధమునకు పర్యవసా ముగా మరణించినవారు లేరు.

అంగదునిపైకి దేవాంతక మహోదర త్రిపురాసులనువారు రాగా అంగదుడు యువరాజని యెంచి ఆంజనేయుడు దేవాంతకుని నడినెత్తిపై పిడికిలితో పొడిచి చంపెను. మహోదరుని నీలుడు మట్టుబెట్టెను. త్రిశిరసుని ఆంజనేయుడెదుర్కొనెను. వానిపై చెట్లను వానవలె కురిపించగా వాడు వానిని ఖండించెను. వాని రథాశ్వములను ఆంజనేయుడు తన గోళ్ళచే చీల్చగా వాడు కోపించి శక్తి అను ఆయుధమును ప్రయోగించెను. దానిని మధ్యలోనే పట్టుకొని విరచిన హనుమపైకి త్రిశిరుడు కత్తితీసుకొని కొట్టుటకురాగా అది తనకు తగులకుండా వానిపైకి లంఘించి హనుమంతుడు తన అరచేతితో వానిని కొట్టెను. దానితో వాడు స్వాధీనతతప్పి నేలపడగా, వాని చేతి కత్తినేలాగి హనుమ వానిని వధింపబోయెను. వాడు హనుమంతుని రొమ్ముపై ముష్టిఘాతమివ్వగా ఆంజనేయుడు వాని కిరీటములను లాగి వాని మూడు తలలను కత్తితో నరికెను.

ఇంద్రజిత్తు విజృంభించి బ్రహ్మాస్త్రమువేసి వానరసేనను సారహీనమొనర్చెను. ధాతమీది గౌరవముతో రామలక్ష్మణులా అస్త్రమువలని బాధను సహించి యూరుకొనగా ఇంద్రజిత్తుమరల అనేక బాణముల వేయగా రామలక్ష్మణులతోపాటు వానరులనేకులు మూర్ఛపోయిరి. కొందరు కపులదిచూచి దుఃఖించుచుండగా విభీషణుడక్కడికిచేరి రామలక్ష్మణులు బ్రహ్మాస్త్రముపై గౌరవముతో కట్టుబడి యున్నారని తెలిపి ప్రముఖ వానరులను వెదకుచు జాంబవంతుని వద్దకు వచ్చెను. విభీషణుని కుశలప్రశ్నకు జాంబవంతుడులేచి 'అయ్యా, నాకు బాణపాతము వలన కనులు కనపడుటలేదు. అంజనాదేవి ముద్దుబిడ్డడు వాయుపుత్రుడగు హనుమంతుడు క్షేమముగా నున్నాడా?' అని అడిగెను. దానికి విభీషణుడు 'కపిశ్రేష్ఠా, తమరు దాశరథుల కుశలమడుగక హనుమంతుని గూర్చి అడుగుచున్నారు. తమకు రాజైన సుగ్రీవునిపైనగానీ, అంగదునిపైకానీ, రామలక్ష్మణులపైగాని ఆంజనేయునిమీద ఉన్నంతప్రేమ లేదెందుకో' అని ఆశ్చర్యముప్రకటించి కారణమడిగెను. అపుడు జాంబవంతుడు-

"హనుమంతుడు జీవించిన
మన సేనలు హతములయ్యు మనియున్నవగున్
హనుమంతుడు లేకుండిన
మనమెల్లను బ్రతికియున్న మ్రందినయట్లే"

—గమనమున వాయుతుల్యుడు వీర్యాతిశయమున అగ్నితుల్యుడు హనుమంతు డున్నచో 'బ్రతుకుమీద ఆశ బాధిస్తూనే ఉంటుంది' అని తెలుపుచుండగా హనుమంతుడే అక్కడకువచ్చి జాంబవంతుని పాదాలపైబ్రాలి 'అయ్యా నేను వాయునందనుడన'ని తెలుపగా, ఆ మాటలువిని మనసున సంకటపడుచు మరల తన తల్లికడుపున తాను పుట్టినట్టుగా నెంచుకొని జాంబవంతుడు హనుమంతుని చూచి సంతోషించి అతని బలపరాక్రమాదుల పొగడి వానరులను రామలక్ష్మణులను కాపాడుటకై సంజీవకరణిని తేవలసియున్నదని చెప్పెను. "నీవు సముద్రముదాటి బాలా దూరముపోయి హిమాద్రినిచేరి అందు ఋషభ శైలమునకు కైలాస గిరికి నడుమ కాంతిగలదై సర్వౌషధులు కలిగిన మూలి కల కొండను చూచి అందు తమకాంతిచే దిక్కుల వెలిగించు మూలికలను నాల్గింటిని చూడుము. మృతసంజీవని (చచ్చినవారిని బ్రతికించునది) విశల్య కరణి (దేహమున నాటిన శస్త్రాదుల తీసి మాన్చునది) సావర్ణ్యకరణి (గాయములచే వన్నెమారినచోట మరల వన్నె వచ్చునట్లు చేయునది) సంధానకరణి (విరిగిన ఎముకల అవయవాలు మరల అతుకుకొనునట్లు చేయునది) అను వానిని తెచ్చి మనవారికి ప్రాణములనిచ్చి సంతోషపరచుము" అని కోరెను.

వెంటనే ఆంజనేయుడు ఆకాశమునకు ఎగురుటకై ప్రయత్నముచేయగా అతని పాదహతికి పర్వత శిఖరములు వణకినవి. చెట్లు నేలకొరిగినవి. ఇంటి ద్వారాలు విరిగినవి. గోపురాలు కూలిపోయెను. పట్టణమంతయు భయముచే "గొండ్లి" నృత్యము చేసినట్లయ్యెను. తన కార్యము నిర్విఘ్న ముగా నెరవేరుటకై శ్రీరామునకు మనసార మ్రొక్కి, రామునికి ప్రియమైన కైంకర్యం చేయుటకు సంతోషముతో గూడిన ఉత్సాహముతో ముఖము వికసింపగా తోక పైకెత్తి మనస్సును కేంద్రీకరించి, వీపు వంచి, చెవులు కుంచించి వేగముతో కుప్పించి ఎగిరి వెళ్లెను. వైనతేయుని వేగముతో విష్ణు కర విముక్త చక్రంలాగా వెళ్లుచుండగా సముద్రములో అలలు తిరుగుడు పడెను. హిమగిరినిచేరి ఉన్నత శిఖరప్రదేశములను, మునిజనపుణ్యాశ్రమము లను, బ్రహ్మకోశము, కైలాసము, హరిహయాలయము, హయగ్రీవుని పూజిం చిన స్థలము, బ్రహ్మకపాలము ఇత్యాది ప్రదేశములను చూచి ఋషభపర్వతము చేరెను. అక్కడ సహస్ర యోజనములు వెదుకగా ఆ మూలికలు తమను ఎవడో తీసుకొనిపోవుటకై వచ్చెనని గుర్తించి బయటపడకుండా మరుగున

నుండినవి. హరీశునకంత కోపము వచ్చెను. కనులెఱ్ఱచేసి పెద్ద స్వరముతో ఆ పర్వతాన్నుద్దేశించి "నగోత్తమా రామునిపై నీకు కరుణలేదా! ఏం నీ ఓషధులను దాచుకొనుచున్నావు? ఇదే నీ నిశ్చయమా? అట్లే అగుచో నాచేతిలో నీవేమగుదువో? ఇదిగో ఇపుడే నిన్ను పిండికొట్టెదను" అని ఘోషించి సకాంచనమై, సనాగమై, నానాధాతుయుతమై, ఘనతరశృంగమై ఇననిభప్రకాశము గల ఆ శైలమును పాతుతోగూడ పెల్లగించి ఆకాశానికి ఎగిరి, దేవతలు మెచ్చుకొనుచుండగా శీఘ్రంగా బయలుదేరెను. సూర్యకాంతిగల ఆ పర్వతము సూర్యశిష్యుడగు హనుమంతుడు దాల్చి సూర్యసంచార మార్గములో వస్తుండగా రెండవ సూర్యుడో అనునట్లుగా సహస్రారములుగల సుదర్శనమును ధరించిన విష్ణువులాగా ప్రకాశించుచు వానరసేనను చేరరాగా ఆ సంజీవనీ పర్వతమందలి మూలికలమీదుగా వచ్చినగాలి తగులుటచే వానరులందరు ప్రాణాలొందిరి. హనుమంతుడువచ్చు దిక్కుచూచి వారు సంతోషముతో కేకలువేయగా భీతితో రాక్షసులు కలతచెందిరి. ఆ కొండను వానరులమధ్య దింపి సుగ్రీవ జాంబవంతాదులకు నమస్కరించి విభీషణుని కౌగిలించి నిలువగా ఓషధుల వాసన తగిలి దాశరథులు స్మృతినొందిరి. చచ్చిన వానరులందరు లేచిరి. కార్యము తీరగనే ఆ కొండను ఆంజనేయుడు మరల యథాస్థానములో ఉంచి శ్రీరాముని సేవకై తిరిగివచ్చెను.[150]

సమీరకుమారవిజయము ప్రకారం: సమరములో ధూమ్రాక్ష రక్షోమేషము నడంచి తద్రుధిరాన్ని కాల్వలై పారునట్లుచేసి పావని అకంపనుని చంపెను. రావణుడు శక్తిబాణముతో లక్ష్మణుని మూర్ఛనొందింపగా అతడు నేలకొరిగెను. అతనిని లంకకు తీసికొనిపోవుటకై దేహము నెత్తలేక అలసిపోగా హనుమంతుడు రావణుని కనులముందరనే సౌమిత్రిని ఎత్తుకొని సురక్షిత స్థానమునకు చేర్చెను. రావణ శూలమును మట్టుపెట్టెను. త్రిశిరస దేవాంతకుల చంపెను. యుద్ధమున రామునకు వాహనముగానుండెను. వానరులందరు మూర్ఛపోగా సింధువులుదాటి గిరులుచేరి మందులుగల మూలికల తెచ్చి వారిని బ్రతికించెను.[151]

రామచరితమానస్‌లోగల విశేషము: మూర్ఛపోయిన లక్ష్మణుని లేవనెత్తి మోసికొని తెచ్చుటతో నూరుకొనక హనుమంతుడు లక్ష్మణుని చికిత్సకై లంకలోని సుషేణుడను వైద్యుని పిల్చుకొనివచ్చుటకు సూక్ష్మరూపమున

వెళ్ళెను. వాడు వచ్చునో రాడో అని శంకించి వానిని గృహముతోకూడ తెచ్చెను.[152]

5 హనుమను ఇంద్రజిత్తు మోసపుచ్చుట

నికుంభిలచైత్యమున యాగమొకటి చేయదలచి ఇంద్రజిత్తు దానికి విఘ్నాలు కలుగకుండా వానరులను తాత్కాలికముగా దృష్టిమళ్లించు నుద్దేశ ముతో మాయసీతనొకదానిని సృష్టించి హనుమంతుడున్న ప్రదేశమున ఆమెను వధింపబూన వచ్చెను. ఆమెను చంపినచో సీతా మరణవార్త వినిన రాముడు యుద్ధము మానివేయునని వాని కుటిలాలోచనము. ఇంద్రజిత్తు ఆమెను చంప నుద్యుక్తుడుకాగా హనుమ ఆమె నొక ముహూర్తకాలము చూచి జానకిగా నిశ్చ యించుకొని సంకటపడెను. వానినుండి ఆమెను కాపాడుటకై వానరసేనతో రాక్షసులపై బడెను. తక్షణమే సీత శిరోజములనుపట్టి వాడు కత్తితో ఆమెను నరుకబోయెను. అపుడు హనుమంతుడు "ఓరీ రామచంద్రుని ఇల్లాలును పరసతియునైన ఈమె కేశములను పట్టిన నీకు నాశనము తప్పదురా శంఠా, దురితాత్మ, కావలుడా, క్షుద్రశీలుడా, ఖలుడా, దయాహీనుడవై స్త్రీని జంప బూనితివి. ఈమె నీకేమి అపరాధము చేసినదిరా! ఇల్లు వాకిలి వదలి భర్తకు దూరమై, మా బాధల మౌనముగా భరించు పరమ రాజర్షి పుత్రియైన యీ సాధ్విని వధింపబూనితివి. దీనివలన నీకు కీర్తివచ్చునా! ఇప్పుడు నిన్ను వధించినచో నీవు స్త్రీహత్యా పాతకులు వెళ్ళు లోకానికి పోగలవు" అని వాని మీద దూకగా ఇంద్రజిత్తు హరీశునిపై బాణవర్షం కురిపించి అతనితో 'ఓరీ వానరా! ఈమెను చంపితర్వాత రాముని, అతని సోదరుని, ద్రోహియైన విభీష ణుని కూడా చంపెదను. మీరు మాకు శత్రువులు. స్త్రీవధ చేయరాదని అంటివి. కాని మీకు/బేయు కార్యమొనర్చుట మాకు కర్తవ్యము' అని అరచి సీతను నరికెను. ఆమె 'రామా రామా' అనుచు రెండు తుండెములై పడి పోయెను. అప్పుడు వాయుజునికి ఇంద్రజిత్తునకు గొప్ప యుద్ధము జరిగెను. సీత ఆ దుష్టుని చేతిలో మరణించెనను దుఃఖము మారుతిని క్రుంగదీయు చుండగా కోపముతో ఒక పెద్దబండను ఇంద్రజిత్తుని రథముపై పడునట్లు వేయగా వాని సారథి ఆ రాతినుండి రథమును ప్రక్కకుతోలి రక్షించెను. హనుమంతుని దైన్యమునుచూచి రాక్షసులు విజృంభించుచుండ హనుమంతుని

మనసులో ఆలోచనలు కలుగసాగెను. "నేను పోరాడి శత్రుసేనను నాశనము చేసినను లాభములేదు. ఈ వార్త రామునకుతెల్పి ఆయన ఆలోచనప్రకారం కర్తవ్యం నిర్ణయించాలి" అని తలంచి మెల్లమెల్లగా వానరసైన్యమును మరల్ప చేసెను. తన ఆశయము నెరవేరినందున ఆనందముతో ఇంద్రజిత్తు నికుంభిలలో నిర్విఘ్నముగా యజ్ఞం చేయుటకై పోయెను.

రామునకు హనుమ సీతావధనుగూర్చి తెలుపగా రాముడు శోకముతో క్రుంగిపోయెను. అప్పుడు ఆవేశముపూనిన లక్ష్మణుడు ధర్మము నాశ్రయించినవానికి వచ్చు క్లేశముల నతిశయించి పలికి అధర్మము చేయువారికే మేలు కలుగుచున్నదని వాదించుచుండగా అచటికి విభీషణుడువచ్చి ఇంద్రజిత్తు చేసిన మోసమును వివరములతోసహా చెప్పి వారిని ఓదార్చి నికుంభిలయాగము నిర్విఘ్నముగా వాడు చేసినచో అతనిని జయింప సాధ్యముకాదని స్పష్టపరచి యజ్ఞధ్వంసమునకు రామాజ్ఞపొంది హనుమదాది వానరవీరులతో నికుంభిలకు వెళ్లెను. ఆంజనేయుడు అచటి రాక్షసులను పిడికిళ్లతో కొట్టి చంపుచుండగా ఇంద్రజిత్తు యజ్ఞముమాని హనుమంతు నెదుర్కొనెను. ఆయుధములతో మాయాప్రయోగములతో కాక ద్వంద్వయుద్ధమునకు రమ్మని హనుమంతుడు సవాలు చేసెను. వారిరువురు పోరుచుండగా విభీషణ ప్రేరితుడై లక్ష్మణుడు ఇంద్రజిత్తుపైకి వచ్చెను. రాక్షసవీరులతో హనుమ పోరాడుచుండగా లక్ష్మణుడు రావణపుత్రుని సంహరించెను. ఇంద్రజిత్తును రూపుమాపినందున వానరులు సంతోషించి శిబిరమునకు తిరిగి చేరిరి.

రెండవమారు రావణుడు రణరంగమునకువచ్చి లక్ష్మణునిపై శక్తి బాణము వేసెను. అది తగిలి రామానుజుడు మూర్ఛపోగా శ్రీరాముడచటికివచ్చి అవలీలగా ఆ బాణాన్ని లాగివేసి సుగ్రీవుని ఆంజనేయుని పిలిచి తన తమ్ముని కాపాడుకొనుచుండుమని కోరి రావణునితో పోరాటము కొనసాగించి వానిని రథముతో పాటిపోవునట్లు చేసెను. సుషేణుడు లక్ష్మణునిలో ప్రాణములున్నవనియు, దుఃఖింప పనిలేదనియు తెలిపి ఆంజనేయునిచూచి "మునుపు జాంబవంతుని సూచనప్రకారం నీవు తెచ్చిన (సంజీవని) ఓషధపర్వతమున దక్షిణ కూటమున నున్న సువర్ణకరణి, సంజీవని, సంధానకరణి అను మూలికలను వెంటనే కొనిరమ్ము. దానితో లక్ష్మణుడు బ్రతుకగలడు" అని చెప్పెను.

రామాభ్యర్థనతో హనుమంతుడు తత్పర్వతమునకుచేరి ఆ దక్షిణ శిఖర మందలి ఓషధీస్వరూపములను గుర్తించజాలక ఆలోచనలోపడెను. సుషేణుని వద్దకువెళ్లి వానిస్థితిని తెలిసికొనివచ్చుటకు వ్యవధి లేనందున ఆ దక్షిణ శిఖర మునే ఎత్తుకొని వెళ్లుటకు నిర్ణయించుకొనెను. అంత ఆ శిఖరాన్ని మూడు మార్లు కదిలించి వికసిత పుష్పయుతములగు లతలతో తరులతో ఆ శిఖరమును ఎత్తుకొనెను. జలపూర్ణమైన మేఘమును వాయువు తీసికొని వచ్చునట్లు వాయు పుత్రుడు వైహాయసవీధిలో ఆ శిఖరాన్ని తెచ్చి రామాదులచెంత చేర్చి, కొంత విశ్రమించి ఆ ఓషధీమూలికలు తనకు తెలియనందున శిఖరమునే మొత్తముగా మోసి తెచ్చినట్లు సుషేణునితో చెప్పెను. వైద్యుడగువాడు మూలికల నుప యోగించి సౌమిత్రిని బ్రతికించెను. ఇంద్రజిత్తు దెబ్బవలన మూర్ఛనొందిన వానరవీరులను, దాశరథులను బ్రతికించుటకై ద్రోణాద్రినేతెచ్చి యొకమారును, రావణాస్త్రమువలన మూర్ఛితుడైన లక్ష్మణుని బ్రతికించుటకు ద్రోణాద్రిలోని దక్షిణ శిఖరాన్ని తెచ్చి రెండవమారును వారికి ప్రాణదానము చేసినందుకు అందరును ఆనందించిరి. మొదటిసారి రాత్రివేళలోను, రెండవసారి సూర్యా స్తమయమునకు పూర్వము పగటివేళలోను తెచ్చి దివారాత్రములలో నేవేళలో నైనా ఆకాశమున వాయువేగమునవెళ్లి అసాధ్యమైన దానిని సాధించి, అసాధ్య సాధక స్వామిగా వానరులందరిచేతను, రామాదులచేతను స్తుతింపబడెను.[153]

భాస్కరరామాయణమున నీ ఘట్టము: తన సోదరునికై రాముడు హనుమంతుని సంజీవనిని తెమ్మనికోరుచు—

సోదరులము మేము నలువుర
మైదవతోడగుదు వీవు ననయముఁ దేజో
మోదంబు మిగుల గలుగగన్
నాదెసఁ గృపసేయరయ్య నగచరవర్య.

—అని పలికెను.[154]

సమీరకుమారవిజయానుసారము : మేఘములలోచేరి ఇంద్రజిత్తు అస్త్ర ములను ప్రయోగించుచో హనుమ లక్ష్మణునిచేరి 'అంబరమందగజేసి ఆఁ హించి' నిల్చెను.[155]

హనుమంతుడు ద్రోణాద్రిని తెచ్చుటలో విఘ్నముల కల్గించుటకై కాల నేమి యనువానిని రావణుడు పంపెను. ఈ కాలనేమికథ అవాల్మీక మ

రంగనాథ రామాయణము, భాస్కర రామాయణములలో ఇది ఒకేరీతిగా పోషింప బడినది. సాగరయానసమయమున మైనాకుని ఆతిథ్యమునే స్వీకరింపని అంజనేయుడు రామకార్యము పూర్తికాకమునుపే దాహమునకై ముని ఆశ్రమములో దిగుట ఔచిత్యము కాదని తలచి కాబోలు ఈ రచయితలు ఈ కథలో కొన్ని మార్పుల చేసియున్నారు. రాముడు హనుమంతుని పిల్చి మరల ద్రోణాద్రిని తెమ్మని కోరుచు—

"పడయుము త్రిభువన ప్రఖ్యాత కీర్తి
అనుజులు మును మువ్వు రరయ నాకిప్పు
డనిలనందన నల్వురైరి నీతోడ...."

—అని పలుకగా, అంజనేయుడు విని—

"నీ బంటు హనుమంతుడుండ
నినకులోత్తమ నీకునేల చింతింప
నీయాజ్ఞ తలమోచి నృపసింహ వేగ
మా యేడు దీవుల కవల నుండినను
నిను డుదయాద్రి కేతేరకమున్న
కొనివత్తు నౌషధ కుధరమేను"

—అని పలికెను. రామాజ్ఞపొంది అనిలసుతుడు వెళ్లుచుండగా అతనికి దారిలో ఒక ఆశ్రమము కనిపించెను. కాలనేమి అను రాక్షసుడు మునివేషములో కుహనాజపము చేయుచుండగా మారుతి గమనించి—

యిది నాడు లేదిప్పుడెందు వచ్చితినో
యెక్కడి దుగ్ధాబ్ధి యెక్కడి మేరు
వెక్కడి మునివనం బది త్రోవదప్పెఁ
దెరువిమ్మునీంద్రుచే తెలియంగ నడిగి

—అడిగెదనని క్రిందకు దిగెను. ఆ వనమున పక్వమైన ఫలములున్ననూ మునిశాపభీతిచే వాటిని తినక ఆ మునినిచేరి తన పేరుచెప్పి నమస్కరించెను. అతడు కన్నులు తెరువగా 'స్వామీ యిచట నేను దప్పిక తీర్చుకొనవచ్చునా' అని ప్రశ్నించగా ఆ ముని 'నా కమండలువులో నీరున్నది త్రాగుము. ఈ ఆశ్రమమందలి ఫలములను తినుము. విశ్రాంతి కలుగునట్లు రాత్రి బాగా

నిద్రింపుము. నాకు అతీత అనాగత విషయముల నెఱుంగు శక్తికలదు. సీతాపహరణం వలన రామ రావణ యుద్ధము జరుగుచున్నది. లక్ష్మణుడు మూర్ఛనొంది యున్నాడు. నాకు అన్నియును తెలియును. నేను అధర్ములకు కనపడను. ఉత్తముడగుటవలన నీను కనిపించినాను. నీవు తేదలంచు వన మూలికలు నా ఆశ్రమములోనే యున్నవి. నావద్ద నీవు ఉపదేశము పొందినచో వనమూలికలతోగూడ నీవు రెప్పపాటు కాలంలో లంకలో ఉండగలవు" అని తెలిపెను. అక్కడ లక్ష్మణుడు ప్రాణాపాయస్థితిలో నుండగా తానిక్కడ నిల్చుటగానీ, ఫలముల తినుటగానీ, నిద్రించుటగానీ ఔచిత్యము కాదని అంజనేయుడు తెలిపి తనకొక నీటికొలనును చూపుమనగా వాడా ప్రదేశములో ఒక కొలను చూపి అందలి నీటిని సేవించి రమ్మని తెలిపెను.

ఆ మాటలను నమ్మి అంజనేయు డా హ్రదమున దిగెను. కాలు నీటిలో పెట్టిన వెంటనే ఒక మొసలి అతని కాలునుపట్టి లాగెను. దానిని మారుతి చంపగానే ఆ మకరి ఒక అప్సరసరూపం ధరించి నిల్చెను. అంజనేయు డాశ్చర్యపడుచుండగా ఆ అప్సరస "మహాత్మా, శాండిల్యముని శాపమున మకరినై యుండిన నేను ధాన్యమాలిని అప్సరసను" అని తన శాపకారణసహితమైన కథ నంతయు తెలిపి "స్వామీ, మీవలన నాకు శాపవిముక్తి యైనది. ఈ ఆశ్రమములో మీరు చూచిన ముని కపటి. వీడొక రాక్షసుడు. రామ కార్యమున సాగిపోవు మీకు మేలు కలుగునని" పలికి తన లోకమునకు వెళ్లెను. అంజనేయుడంతట ఆశ్రమములోనికివచ్చి మాయా మునిని చేరగానే "నీవు గురుపూజ చేసినచో నీకు మంత్రము తెలిపెదను" అని ముని పలుకగా, హరీశుడు 'ఇదిగో గురుపూజ' అని వాని రొమ్ముపై ఒక్క పోటు పొడిచెను. వాడా రూపంవీడి పక్షిరూపం ధరించిరాగా అనిలకుమారుడు వాని రెక్కలు విరిచెను. తర్వాత సింహముకాగా కపిసింహుడు ముష్టితో కొట్టెను. వాడు సుగ్రీవుని రూపం వహించి 'మారుతీ యిక్కడున్నావా! మన సౌమిత్రి బ్రతికినాడు. నీవింక ద్రోణాద్రికి పో నవసరంలేదు' అని మోసపుచ్చు మాటలు పలుకగా సామీరి సత్యమును గ్రహించి వానితల త్రెంపి వధించి అంతట ద్రోణాద్రికి వెళ్లెను. ఆ పర్వతము ఓషధులను కనపరచకున్నందునను అచటి గంధర్వు లడ్డుపడినందునను అంజనేయుడు వారికి బుద్ధిచెప్పి ఆ పర్వతమునే మోసి తెచ్చుచుండగా అయోధ్యలోని భరతుడు ఆకాశమున పోవుచున్న

హనుమనుచూచి దానిని దుష్టగ్రహమని తన వింటిని ఎక్కుపెట్టి బాణమును సంధింపబోయెను. ఆరోజుకు ముందు రాత్రి భరతునకు రామాదులగూర్చి పీడకల వచ్చియుండెను. పైనుండి చూచిన పావనికి ఘనజటాభారవల్కలము లతో ఘన శ్యామవర్ణముగల వ్యక్తి కనబడెను. ఆ భరతుని విగ్రహముచూచి అతనిని రామునిగా తలంచి, 'అయ్యో! లక్ష్మణుని, సీతను వదలి రాముడు వచ్చెనేమోకదా!' అని తలపోసి ఆ వృత్తాంత మెరుంగకోరి క్రిందకు దిగబోయి మరల రాముని సత్యవ్రతము, భ్రాతృప్రేమ, ధర్మదీక్ష మొదలగు గుణముల స్మరించి యీ తపోధనుడు రాముని పోలియుండవచ్చునని వెళ్లనుండగా భరతుడు పూర్తిగా సంధించులోగా అశరీరవాణి అతనికి హనుమంతుని వృత్తాంతము తెలిపి బాణమునుపసంహరింప జేయించెను. అంత రామాదుల క్షేమమునకై భరతుడు పరమేశ్వరారాధన చేయబోగా అంజనేయు డాకాశ మున ప్రయాణం సాగించెను. అంత మాల్యవంతుడు అను రాక్షసుడాకా శంలో ఎదురై 'ఈకొండను సముద్రంలో వేయుము. లేనిచో నిన్ను చంపెదను' అని మీదికిరాగా, అంజనేయుడు వానిని వధించి ద్రోణాద్రిని రాముని వద్దకు చేర్చెను. పనినెరవేరి సౌమిత్రి లేచిన తర్వాత ఆ ద్రోణాద్రిని యథాస్థానంలో ఉంచివచ్చుచో స్థూలజంఘు, మహోదరరాదులతని నెదిరించగా వారిని మడియజేసి గిరిని దానిచోటికిచేర్చి తిరిగివచ్చెను. అతనిని శ్రీరామ లక్ష్మణులు అభినందించి ఆలింగనమొనర్చి స్తుతించిరి.[156]

సమీరకుమార విజయము ప్రకారము: వాల్మీకి రామాయణములో లేని యీ కథ తెలుగు రామాయణముల పంథాలోనే సాగినది. శక్తిబాణహతుడై మూర్ఛనొందిన లక్ష్మణుని బ్రతికించుటకు ద్రోణాద్రిని తెచ్చుచో దారిలో విఘ్నకారియగు కాలనేమిని కడతేర్చి ఆ పర్వతమును తెచ్చెను. ధాన్యమాలినికి శాపవిమోచనం కలిగించెను. కాని యీ సన్నివేశముల క్రమములలోను కొన్ని కల్పనలలోను, సమీరకుమార విజయమున కొంత విస్తృతి ఉన్నది. కాలనేమి రకరకాల జంతురూపాలను ధరించినట్లు మాత్రం ఇందులో లేదు. ద్రోణాద్రికిచేరి ఔషధములను కనపడవలెనని ప్రార్థించెను—

"ఓ నగచక్రవర్తీ సుగుణోర్జితకీర్తి జగద్ధితంబు రా
మానుజు ప్రాణరక్షకు(ద్వదౌషధముల్ గనిపింపు"

—అని అతడు ప్రార్థించినా ఆ పర్వత మాతని మొర నాలకింపలేదు. మరి యొకసారి మొరపెట్టుచు ధరాదురంధరుల నందరిని దాల్చు మహా ఫణీంద్రుడే సౌమిత్రియై పుట్టినాడనియు, రావణ బాణహతుడై మూర్ఛితుడై యున్నాడనియు, అతనిని జీవింపజేయ ఔషధములనిమ్మని ప్రార్థించెను. దానికాకొండ కదలనందున దాని కృతఘ్నతకు రోషించి ఆ గిరిని తన వాలముతో చుట్టి పెకలించెను. అప్పుడాగిరిలోని ఝురులన్నియు ఆ కొండ వ్యధతో కార్చిన కన్నీరులాగా స్రవించెను. దానిని చేత ధరించి పావని పైకి ఎగిరిపోవుచో అందలి పదమూడుకోట్ల గంధర్వులు క్రోధరక్తాస్యులై కేసరిసుతు నెదుర్కొనిరి. అపుడు హనుమ తన వాలమునల్లార్చి వారిని గొంతులపట్టి పైకి ఎగురవేయగా వారు భయపడి శరణువేడిరి. అంత ఆ కొండనుతెచ్చి లక్ష్మణునకు ప్రాణదానము చేసెను. తిరిగి దానిని యథాస్థానములో చేర్చివచ్చుటకు పోవుచో స్థూలజంఘ, మహాదంష్ట్ర, మహెూదరాది రాక్షసులు ఎదిరించగా వారిని చంపి తన కార్యము నెరవేర్చెను.[157]

రామచరితమానస్ ప్రకారం: హనుమంతుని యెదుట ఇంద్రజిత్తు సీతను చంపగా ఆ వార్తవిని రాముడు మూర్ఛపోయెను. అపుడు పావని ప్రచ్ఛన్న రూపం ధరించి లంకలో ప్రవేశించి జానకిని చూచివచ్చి తమవారికావార్త తెల్పి ధైర్యము కలుగజేసెను. ఇంద్రజిత్తు మరణించగా అతని కళేబరాన్ని మోసుకొని లంకానగర ద్వారమున పెట్టివచ్చి ఇంద్రజిత్తు పరాక్రమమునకు తగిన గౌరవమును చూపెను. సంజీవనీ పర్వతమును మోసుకొనిపోవు హనుమనుచూచి వానినొక రాక్షసునిగా భావించి భరతుడు బాణముతో వానిని కొట్టెను. రామనామోచ్చారణముతో హనుమ నేలపై పడెను. భరతుడువచ్చి చూచి చైతన్యవంతుని చేయుట కెన్నో విధాల ప్రయత్నించెను. హనుమ లేవనందున శ్రీరామునిపై ఆన పెట్టినంతనే హనుమ లేచెను. అతని కథ సకలమెరిగి లంకవరకు వెళ్లునట్లు తానొక బాణము సంధింతుననియు, దానిపై కూర్చొని వెళ్లుమని వానరవీరుని కోరెను. శ్రీరాముని ప్రతాపమును పావని వర్ణించి భరతునకు నమస్కరించి గాలిలోనే ఎగురుతూ వెళ్లెను.[158]

6 మై (మహి) రావణ వృత్తాంతము

ఈ కథ వాల్మీకి శ్రీమద్రామాయణమున లేదు. పరాశర సంహితలో వర్ణితము. ఆనందరామాయణమునకూడ కలదు. సమీరకుమార విజయము

దీనిని పాతాళలంకేశవధగా తిమ్మన వ్రాసియున్నాడు. అంతరార్థ రామాయణము మైరావణచరిత్ర పద్యగ్రంథములు, వచనగ్రంథములు, హనుమత్ లీలా తరంగిణి మొదలగు కావ్యములలో ఈ కథ పోషింపబడియున్నది. కథలోని అంశములలో అన్నిటిలోను ఏకాభిప్రాయమున్నను పేర్లు కొంచెం తేడాగా ఉన్నవి. పాతాళలంకేశుని మహిరావణుడుగా, మైరావణుడుగా కొన్నింట పేర్కొనబడగా కొన్నింట ఐరావణునిగా పేర్కొనుట జరిగినది. కొందరు గ్రంథకర్తలు అహిరావణుడు, వాని సోదరుడు మహిరావణుడు అను నిర్వురను కల్పించిరి. కొన్నింట మైరావణుడు రావణునకు మేనమామ కాగా మరికొన్నింట దాయాది. మైరావణుని సోదరి దోర్దండి అని కొన్నింట ఉండగా మరి కొన్నింట దుర్దండి అని యున్నది. ఈ కథను నాటకములుగా, సినిమాలుగా చిత్రించి ఇంకనూ అర్వాచీనులు కల్పనలనధికము చేసియున్నారు. శృంగి - భృంగి అను వైకుంఠవాసులే అహిరావణ, మహిరావణులుగా జన్మించి రావణునకు తోడ్పడినట్లు కొన్నింట కలదు. రాముని ఏకపత్నీవ్రతమును పరీక్షింపజేసి అతని శీలమును పోషించుటకును, రాక్షసుల ప్రాణములు పంచ కీటకములలో నుండగా ఆంజనేయుడు పంచముఖుడై వానిని వధించుటలో చూపిన పరాక్రమాదులను, రావణుని మోసములను మోసముతోనే మారుతి జయించినట్లును అద్భుతమైన సన్నివేశములను ఈ చరిత్రలలో కూర్చి యున్నారు. పునరుక్తదోషమునకు తావీయకుండా కేవలము పరాశరసంహిత లోను, సమీరకుమారవిజయములోను గల కథాంశములను ఆంజనేయ సంబధమగువానిని వివరించుచున్నాను. (ఇతర వివరములు తెలియుటకు ఆనందరామాయణము, మైరావణ చరిత్ర, రామాయణాంతరార్థము, హనుమాన్ లీలాతరంగిణి అను గ్రంథములను చూడదగును.)

పరాశరసంహితోక్త కథ: మైరావణుడు రావణునికి మేనమామ. వీనికి సోదరి దుర్దండి. కాలదండుడనువాని నీమె పెండ్లియాడి నీలమేఘుడను కొడుకును కనియుండెను. నారదుడొకరోజున మైరావణునివద్దనున్న వాని మేనల్లుడగు నీలమేఘుని చూచి 'వీడు పాతాళ లంకాధిపతి కాగలడుసుమా' అని తెలుపగా మైరావణుడు కాలదండుని తుదముట్టించి దుర్దండిని, నీలమేఘుని బంధించియుండెను. వారిని వేరువేరుగా ఉంచెను. దుర్దండితో ఊడిగము చేయించుచుండెను. రాముని వీరోచితముగా రణరంగమున జయింపలేక

రావణుడు మాయోపాయమున వారిని నిర్మూలింపదలంచి మైరావణుని సహాయ మర్థించెను. అదిలో మైరావణుడు అయిష్టత ప్రకటించెను. బంధుత్వమూ, జాత్యభిమానములకు లొంగి అంగీకరించెను. శ్రీరామలక్ష్మణులకు అపద కలుగకకుండా హనుమంతుడు తన తోకతోఒక కోటనుకట్టి వారినందుంచి కావలి కాయుచుండెను. రామలక్ష్మణుల నపహరించుకొని రావలసినదిగా మైరావణుడు సూచీముఖుడను రాక్షసుని పంపెను. వాడువచ్చి హనుమంతుని తోకను పొడవగానే వాని ముఖము బ్రద్దలైనందున వాడు పారిపోయి తన ప్రభువునకు తెలిపెను. అంత వాడు మూషికముఖుని పంపగా వాడు హనుమంతుని కొరుకబోగా వాని నోరు బ్రద్దలయ్యెను. ఆ తర్వాత వచ్చిన పాషాణ భేది అనువానికి యిదేగతి పట్టగా స్వయముగా మైరావణుడే కార్కారంగమున దిగి విభీషణుని రూపమున వానర శిబిరములో ప్రవేశించి హనుమదాదులను మోసపుచ్చి వాల ప్రాకారమందలి రామలక్ష్మణులనుచేరి వారిపై సిద్ధ ఔషధములచల్లి మూర్ఛితులచేసి వారిని బంధించి ఒక పేటికలోనుంచి వంచనతో పాతాళలోకమునకు చేరెను. తన సోదరి దుర్దండినిపిల్చి ఆ నరులను దుర్గకు బలియిచ్చుటకై సిద్ధము కావింపుమనిచెప్పి పవిత్రముగా ఘటముతో తీర్థమును తెమ్మని ఆమెనాదేశించెను. విభీషణుడు జరిగిన మోసమును వానరాదులకు తెల్పి శ్రీరామలక్ష్మణులను దెమ్మని హనుమంతుని కోరెను. హనుమ పాతాళమున ప్రవేశించెను. ఆ పాతాళ లంకాపురమున శత్రువులు ప్రవేశించినచో ఒక త్రాసు మ్రోగును. దానితో హెచ్చరికనొందిన రాక్షసవీరులు హనుమంతుని పట్టబోవగా శార్దూలముఖ, గార్దభనిస్స్వన, శతజిహ్వా, దీర్ఘజిహ్వా, అశ్వముఖ, సర్వరోమ, వృశ్చికరోమ అను ఏడుగురిని చంపి మత్స్యవల్లభుడనువాని నెదుర్కొనెను. వీడు అంజనేయ స్వేదజలసంభూతుడైన కథ విని, వాని సహాయముతో, దుర్దండి సహాయముతో తీర్థఘటమున ప్రవేశించి, మొదట శ్రీరామసౌమిత్రులను దేవికి బలికాకుండా కాపాడి అటుతర్వాత దుర్దండి చెప్పిన రహస్యము ప్రకారము మైరావణుని పంచప్రాణములుకల అయిదు తుమ్మెదలనుచంపి శ్రీరామలక్ష్మణులతో లంకాసాగరస్థశిబిరము చేరెను.[159]

సమీరకుమారవిజయలోని కథ : ఇందికథ పాతాళ లంకేశుని కథగా వర్ణితము. రాముని వధింపలేక, రామబాణహతినోర్వలేక రావణుడు తన

చెలికాడగు నాగలోక లంకావిభుని సహాయమర్థించెను. నరులగు దాశరథులను తన పురి కంకాళికి బలి యొనర్తునని వాడు రావణునకుతెల్పి తా జేయబోవు పనిని తన భార్యకు తెల్పెను. ఆ ప్రయత్నమును మానుమని ఆమె భర్తకు హితముపదేశించెను. "పెరవారి నేర్పరిమాటలకు మోసపోయి జగత్పతియైన రాముని మాయతో కప్పుటకు వీలుకాదు. అతనికి మంత్రియై, భృత్యుడై, మేధాశాలియై, జగత్త్రయైకనుత గాంభీర్యుడై, బ్రహ్మశివేంద్రాది దేవతా వర ప్రభావుడై యున్న వాయుపుత్రుడున్నంతవరకు రాముని సాధింప తరముగాదు. ఆ వాతాత్మజుడు —

".... .... వానరమాత్రుడే?
యాతత శత్రుకుల జైత్రు డఘటనఘటనా
స్వాతంత్ర్య శుభ చరిత్రుడు
నీ తరమా యతని దొడరి నిలువగఁ బోరన్"

—అని హెచ్చరించెను. ఆమె తన భర్తనాప్రయత్నమునుండి వారింపజేయు తలంపుతో ఆంజనేయుడప్పటిదాకా సాధించిన వీరసాహస కృత్యములు కాల నేమి కథ, మాల్యవంత పతనము, స్థూలజంఘాదులు తూలిపోవుట, చిత్రసే నాది గంధర్వులు పాట్లుపడుట, అక్ష ధూమ్రాక్ష దేవాంతకాది వీరుల అస్తమయము పేర్కొని అంజనీసుతుడు బాల్యమాదిగా నొనర్చిన అద్భుత వీర సాహసగాథలు, సూర్యబింబ గ్రహణము, దేవతలందరతనికిచ్చిన వరములు ఇత్యాదులన్నియు తెలిపి 'తెలిసితెలిసి చిచ్చు వడిగట్టనేల' అని పలుకగా వాడు తన భార్య తన శౌర్యము గుర్తించలేదని తెల్పి తన కార్యమును కొనసాగింప బూనెను. ఈ వార్త సరమ విభీషణునికి తెలుపగా అతడు హనుమంతుని వద్దకువచ్చి "వానరాశికెల్ల నీ వాలవల్లియే వజ్రపుకోట, రాజకుమారులకు బహిఃప్రాణము, కావున వారిని కాపాడుకొనవలసినదిగా కోరెను. అంత హనుమ తన వాలమును కోటవలె పెంచి వారికి రక్షావలయము నేర్పరచెను. అపుడతనితోక—

ఆత్మీయ చలన లీలాధూత కంజాత
గర్భాండ భాండోర్ధ్వ కర్పరంబు
నిజ కర్బుర ప్రభా నిర్భేదిత క్ష్మాంద్ర
శాసనోదగ్ర బాణాసనంబు

ప్రత్యర్థి రాక్షస ప్రాణాహృతి క్రియా
భీల కాలవ్యాళ ఖేలనంబు
పర్వతోత్పాట నోద్భట పాటవ కఠోర
తాటోప విజిత వజ్రాయుధంబు

నై వెలగెడు లాంగూల కుట్టి పెంచి
క్రింద మీదటనెల్ల నేకీభవించి
చుట్టు సేనకుఁ గోటగాఁ బెట్టి యొక్క
పట్టునను నెట్టుకొని గాడ్పు పట్టియుండె.

—అందు వజ్రపంజరంలో ఉన్నదానికన్న నిర్భయులై కపికోటి నిద్రించెను. దాశరథులు విశ్రాంతి పొందిరి. విభీషణుడు ప్రహరీ తిరుగుచుండెను. పాతాళ లంకాధిపతి తన వేగులవారినిపంపి ఆ కోట తెఱంగు తెలియరమ్మని పంపెను. సూచీముఖుడనే రాక్షసుడు అందుకై వచ్చి ఆ కోట క్రిందుక్రిందుగా త్రవ్విచూచి దాని దుర్భేద్యత తన ప్రభువునకు తెలిపెను. పాతాళ లంకేశుడు విభీషణుని వేషమునవచ్చి కోటలోనికిపోయి తన మాయాప్రభావంతో రామలక్ష్మణులను తీసికొనివెళ్లి వారిని కాళికి బలియిచ్చుటకొఱకై యుండెను. మోసము గ్రహించిన విభీషణుడు హనుమకు పాతాళ లంకేశుని మాయలుతెలుపగా వెంటనే హనుమ పాతాళలంకామార్గం తెలిసికొనిపోయి అచట ప్రవేశించెను. వాయుపుత్రుడగు హనుమంతుని పుత్రుడని చెప్పుకొను మత్స్యవల్లభుని ఎదిరించి, తన స్వేదజ పానమొనర్చిన ఒక మత్స్యమునకు జన్మించినవానిగా నెఱింగి వానితో పోరాడి నగరిలో ప్రవేశించి దుర్దండి అనేదాని తోడువలన దనుజుని మర్మమెరిగి, ద్వారపాలురచంపి పలుసేనల హోలియించి, తస్కరుని పుత్ర మిత్ర పౌత్రంబుగా తునిమి దుర్దండి సుతునకారాజ్యమిచ్చి రాఘవులను క్రమ్మరతెచ్చెను.[160]

రామచరితమానస్ ప్రకారం: ఇందులో అహిరావణుడు రావణునికి సాక్షాత్తు మండోదరి ద్వారా జన్మించిన పుత్రుడే. జన్మించినపుడు వీడు ఇరువది పాములతో కూడి పుట్టినందున వీనిని గృహములో నుంచుట ఉచితముకాదని భూమిలో పాతిపెట్టుమని రావణుడాజ్ఞాపించెను. ఆ శిశువు మన్నుతిని జీవించుచు భూమిని తొలచుచుండెను. రాహువుతల్లి సింహిక వీనిని కాపాడి పెంచెను. వీడు పాతాళమునకుచేరి కామదదేవి నుపాసించి ఆమె నుండి రెండు వరము లను పొందెను. త్రిమూర్తులు, ఆదిశేషుడు, సూర్యుడు మొదలగువారివలన

మరణము లేకుండునట్లు మొదటివరము. తన తండ్రి తనను విసర్జించి అవమానించినందున అతడు తననొకసారి యాచించునట్లు చేయుమని రెండవరము. దేవి అటులనే ప్రసాదించుచు "నీతండ్రి నిన్ను త్రేతాయుగములో యాచించును. ఒక వానరుడు మాత్రం నీకు వశ్యుడుకాడు. వాని ప్రభువు జోలికి నీవు వెళ్లకున్నచో నీకు మరణముండదు." అని హెచ్చరించియుండెను. వీడే రామలక్ష్మణుల నపహరించెను. వీనినే హనుమంతుడు వధించెను. అందువలన రామలక్ష్మణులు "హనుమా, నీకీర్తి త్రిలోకవ్యాప్తి పొందును." అని అనుగ్రహించిరి.[161]

పైన తెల్పిన అంశములనుబట్టి అహిరావణుడనగా పాములతో పుట్టినందున వచ్చినపేరు. వీడు పాతాళలంకాధిపతియే. మహి అనగా భూమి - అనగా పాతాళమును అనియే భావించి మహిరావణుడని తలంపవచ్చును. మహిరావణ శబ్దమునకు మైరావణ శబ్దము వికృతికాగా అహిరావణ శబ్దమునకు ఐరావణ శబ్దము వికృతి. కనుక పాతాళలంకేశుడు ఒక్కడేగాని ఇరువురుకారు. సమీరకుమారవిజయకర్త వీనిని పాతాళలంకేశుడనెనేకాని మైరావణ శబ్దముగా వాడలేదు.

7 నికుంభునివధ

శ్రీమద్రామాయణము ప్రకారం : కుంభుని సుగ్రీవుడు చంపగా వాని సోదరుడు నికుంభుడు మండిపడి తన పరిఘతో వానరులపైకి రాగా, వారు భీతిల్లి పరువెత్తగా హనుమంతుడు ధైర్యముతో వానిని ఢీకొనెను. ఆ పరిఘను వాడు హనుమ రొమ్ముపైవేయగా అతనిని తాకి అది తునుకలై అనేకమగు కొరవులవలె నేలబడెను. ఆ దెబ్బకు హనుమ భూకంపములో పర్వతమువలె వణకెను. వెంటనే తెప్పరిల్లి ఆ రాక్షసుని తన పిడికిటితో పొడిచెను. వాడు కూడ ముష్ఠితో అంజనేయుని కొట్టెను. అపుడు హనుమ పృథివింబడగదన్ని యతనిపైకెగిరివేగ, చక్కబిగబట్టి మెడద్రిప్పి శాత్రవుండు గర్జిలుచునున్న విడువక కాలనులిమి, మృత్యువునుగూర్చె యొక్క నిమేషమునను[162]

కాని సమీరకుమార విజయమున నికుంభవధ రావణవధానంతరము చేసినట్లున్నది.[163A] ఖడ్గరోముడను రాక్షసుని హనుమంతుడే చంపెనని రంగనాథ రామాయణములో నుండగా శ్రీరామునకు కీర్తి కల్గించుటకై హనుమ

వానిని చంపక రామునిచే చచ్చునట్లు చేసెనని సమీరకుమార విజయమున నున్నది[163B]

కుంభకర్ణునికి మూలానక్షత్రమున జన్మించిన మూలకాసురుడను వానిని హనుమంతుడు చంపినట్లు ఆనందరామాయణములో నుండగా రాముడే చంపినట్లు ఇతర రామాయణములో నున్నది. (రామచరితమానస్ వగైరా) రావణునకు మూలానక్షత్రములో నరాంతకుడనువాడు ఒకడు పుట్టగా తనకు గండకారకుడగు వానిని రావణుడు విసర్జించి యుండెను. వీడు విహ్వాబలపురములో రాజై యుండెను. సుగ్రీవ పుత్రుడగు దధిబలుని చేతనే వీనికి మరణము కలుగునని బ్రహ్మవాక్కు. ఆ దధిబలుడు ధవళగిరిలో తపోదీక్షలో ఉండగా హనుమంతుడు వెళ్లి వానిని తీసుకొనివచ్చి వానిచే నరాంతక నిర్మూలన కావించెను.[164]

శ్రీరామునిచే రావణుడు నిర్మూలింపబడగానే యుద్ధము పరిసమాప్తమయ్యెను. విజయమొందిన రాముడు హనుమంతుని పిల్చి "హనుమా నీవు విభీషణానుమతితో లంకకువెళ్ళి రావణ గృహములోనున్న సీతకు నా విజయ వార్త తెలిపి, సుగ్రీవ లక్ష్మణుల క్షేమముతెలిపి, ఆమెకు ఆనందముకలిగించి ఆమె సందేశము కొనిరమ్ము" అని ఆదేశించి పంపెను. రామాజ్ఞ శిరసావహించి హనుమంతుడట్లేబయలుదేరి రావణుని గృహము ప్రవేశించి, శోకతప్తురాలైన సీతాదేవి చెంతకుచేరి, తనపేరు చెప్పుకొని, ప్రణామముచేసి నిశ్శబ్దముగా నిలబడియుండెను. అతనినిచూచి కొంతసేపు ఊరకుండి పిదప సీత అతడు మునుపువచ్చి వెళ్ళిన హనుమగా తెలిసికొని సౌమ్యానన కాగా అది ఆంజనేయుడు గమనించి తన సందేశము చెప్ప నారంభించెను.

"సీతాసాధ్వీరత్నమా, నీ నాథుడు శత్రునిర్మూలనమొర్చి కృతకృత్యుడై తన క్షేమమును నీతో చెప్పుమనెను. సుగ్రీవ లక్ష్మణ విభీషణాదులతో కూడినవాడై వానరసేనాసహితముగా కుశలముగా నున్నాడు. హరి సాహాయ్యముతో రావణుని వధించెను. పరాక్రమ స్ఫూర్తితో శత్రునిర్మూలనమొనర్చి నీకు సంతోషావహమైన కొన్ని మాటలను చెప్పుమని పంపియున్నాడు. ఆ మాటలను తమరు కర్ణపర్వముగా వినగోరెద."

"ధర్మజ్ఞే, నీవు నా భాగ్యవశమున జీవించి యున్నావు. నీపై మిగుల ప్రేమ కలవాడను. నా పరాక్రమము వలన యుద్ధమున మనకు జయము

కలిగెను. ఇంక నీవు దుఃఖింపకుము. మనసు కుదుటపడనిమ్ము. నిన్ను విడిపించుటకై దృఢచిత్తుడనై నిద్దురనైనాపోకుండా సముద్రానికి సేతువుకట్టి రావణుని వధింపవలెనను ప్రతిజ్ఞ నెరవేర్చుకొన్నాను. ఇపుడు విభీషణుని వశమైనది. కనుక నీవు రావణుని యింట నున్నానని ఎంతమాత్రం భయపడ వద్దు. నీ సొంత ఇంట్లో ఉన్నట్లే నిర్భయముగా, నిశ్చింతగా ఉండవచ్చును. నిన్ను దర్శించుటకై విభీషణుడుకూడ రానున్నాడు" అని రాముని సందేశ మును హనుమ వినిపించినంతనే సీత తటాలునలేచి నిలబడి ఏమియు బదులు పలుకక ఊరకుండెను. హనుమంతుడది గమనించి "తల్లీ ఏమాలోచించు చున్నావు. నీవేమీ బదులు చెప్పకున్నావే" అని అడిగెను. ధర్మనిరతయైన ధరణిజ ప్రియవాక్య శ్రవణజనిత హర్షముతో గద్గదకంఠయై ఇట్లనెను. "వానరేంద్రా, నా నాథుని విజయవార్త సంతోషమగునట్లుగా చెప్పిన నీ వాక్య ములను విని పరవశించిన నేను క్షణకాలము నిర్వాక్యనైతిని. నాకింత ప్రియ వచనములను తెల్పిన నీకు—

అర్థోక్తులేమని యందునా యని యెంతొ
　　యోజించితినిగాని యొకడు లేద
యర్హ వస్తువైన నర్పింతు నందునా
　　యీడైనదీ యిల నేది లేదు
వివిధ మణులుగాని విశ్వంబునం గల
వెండిగాని పైడి కొండగాని
యెల్లలోకములయు నేలిక తనమైన
సాటిగాదు నిజము మాటకైన

—అని తన మౌనకారము తెల్పిన సీతకు పావని ప్రాంజలియై "భర్తృవిజయ కాంక్షిణీ యిట్టి స్నిగ్ధోక్తుల పలుకుట నీకేతగునుగదా? నీ నాథుని విజయవార్త చెప్పిన నాకు ఈయదగిన వస్తువేదీ లేదని స్నేహవాత్సల్యముతో నీవు పలికిన పలుకులే నాకు దివ్యమణిమయ సముదాయముకంటే, దేవతా రాజ్యాదులకంటె అధికమైనవి. హతశత్రుడై, విజయుడైన రాముని చూచుటకంటే త్రైలోక్య రాజ్యాధిపత్యము నాకు గొప్పకాదు" అనిన అంజనేయునిచూచి సీత "అతిలక్షణ సంపన్నమైన, అతి మధురమైన, అష్టాంగయుతమైన బుద్ధితో మాటలాడ నీవే సమర్థుడవు. పరమ ధార్మికుడవు. పవన నందనుడవు. 'ఘనబలశౌర్య

సత్త్వ్రశ్రుతకాంతి పరాక్రమ ధీరతా క్షమా విజయధృతి ప్రశస్తగుణ విశ్రుత ఎన్నో మంగళకర గుణములు నీయందే ఒప్పుచున్నవి" అని సీత చెప్పగానే హనుమంతుడు పరమ సంతుష్టుడై సీతాదేవికిన్నాళ్ల బాధలు కల్గించిన రాక్షస స్త్రీల సంహరించుటకు అనుజ్ఞనిమ్మని కోరెను. ధర్మమార్గ స్థితయైన సీత "తమ ప్రభువు ఆజ్ఞల పాలించిన వీరిపై నీవు కోపపడవచ్చునా? నా పూర్వకృత పాపముల వలన దుఃఖముల ననుభవించితినే కాని నా బాధకు వీరు కారణం కారుగదా? సుఖదుఃఖాలు కాలాధీనము. తమ ఏలిక చెప్పిన ప్రకారం వీరు నన్ను బెదరించి హింసించిరేకానీ వీరియందే పాపములేదు." అని వ్యాఘ్ర ఋక్షగాథను జ్ఞప్తికితెచ్చి యిట్టివారిపై సజ్జనుడు కృపజూపవలయునే కాని కోపింపరాదని తెలిపెను. "హనుమా, లోకములో ఏ అపరాధము చేయనట్టి వారు లేనేలేరు" అని నీతిని బోధించి శాంతింపజేసెను. అంత హనుమ తన ప్రయత్నమును వీడి "తల్లీ శరణాగత రక్షావ్రతుడగు రామునకు తగిన పత్నివి నీవే. ఓ యశస్వినీ నీ నాథునకు నేనేమని చెప్పవలెనో తెలిపినచో నీ సందేశము రామునకు అందింపగలను" అని తెలుపగా సీత "నేను నా నాథుని చూడగోరుచున్నాను." అని పలికెను. "తప్పక అనుజసహితుడై యుండు శ్రీరాముని నీవు చూచెదవుగాక" అని మారుతి పలికి ఆమెకు ప్రదక్షిణ నమస్కారమొనర్చి సీతా సందేశముతో శ్రీరాముని చేరెను.

వాచాదక్షుడగు వాయునందనుడు రాముని చేరి "స్వామీ. ఎవరి నిమిత్తమై మీరింత ప్రయత్నము చేసితిరో ఆ సీతాసాధ్వి దుఃఖితయై రావణు నింట నున్నది. నీ విజయవార్త విని సంతోషముతో పరవశించెను. అనుజ సహితుడవైన నిన్ను చూడగోరుచున్నది" అని పలుకగా రాముడు కన్నీరు కార్చుచు నిట్టూర్పు నిగిడించి సీతను తెచ్చుటకై విభీషణుని కోరెను.[165]

భాస్కరరామాయణములో : సీతకు శ్రీరాముని సందేశము విన్పించి నపుడు సీత మారుతిని ప్రశంసించినది — అది ఎట్లన —

పతిహితముం బ్రతాపము నుపాయము శౌర్యము ధైర్యమున్ సమీ
హితకరణక్షమత్వము నహీన జవంబుఁ బరాక్రమంబు నం
చిత వినయంబు నీతియు వశిత్వముఁదేజము నీకయొప్పు మా
రుత సుత నీకు ధారుణి నొరుల్ పరివత్తురె వారి మెత్తురె

(యుద్ధకాం. 2311)

8 శ్రీరామునిచే శివలింగ ప్రతిష్ఠ-హనుమంతుని తోడ్పాటు

శ్రీరాముడు శివలింగమును ప్రతిష్ఠించిన విషయము శ్రీమద్రామాయణమునలేదు. రంగనాథ రామాయణముననుసమీరకుమార విజయముననుఈ కథ కలదు. ఈ శివలింగ ప్రతిష్ఠను గూర్చి శైవవైష్ణవ సంప్రదాయవిధేయులు తీవ్ర వాదోపవాదముల లేవనెత్తి యున్నారు.

శ్రీమద్రామాయణం ప్రకారం : సీతావహ్నిశుద్ధి, విభీషణునికి రాజ్యము స్వాధీనపరచుట పూర్తియైన తర్వాత శ్రీరాముడు అయోధ్యకు తిరిగి పుష్పక విమానమున పోవుచు సీతకు తాము సేతువు కట్టినచోటు చూపుచు సముద్రుడు తనకు ప్రసన్నుడయ్యెనని చెప్పుచు సముద్రవాచకముగా 'మహాదేవ' శబ్దము నుపయోగించెను—

దేవిమున్ను ప్రభుడు మహాదేవుండిందు
గంజనేత్ర ప్రసన్నతాకారియయ్యె

—అని తెలిపెను. (అత్రపూర్వం మహాదేవః ప్రసాద మకరోత్ప్రభుః అని మూలము) ఈయెడ వ్యాఖ్యానము వ్రాయుచు శ్రీ వావిలికొలను సుబ్బారావు గారు ఇట్లు తెలిపియున్నారు. "మహాదేవ శబ్దము శివపర్యాయముగా నిఘంటువులనందుండుట వలన ఇచట 'శివుడు' అని కొందరు అర్థము చెప్పుచున్నారు. శ్రుతిస్మృతియితిహాసములందలి శబ్దములకు సర్వత్ర అమరనిఘంటువునే ప్రమాణముగా చేసికొని అర్థము చెప్పజాలము" అని తెలుపుచు విపులముగా ఎన్నో ఇతర శబ్దములను చూపి నిఘంటువునకన్నా భిన్నమైన అర్థములో నవి వాడబడిన సందర్భములు రామాయణములోనే చూపియున్నారు. అంతేకాక రావణుని తండ్రి బ్రాహ్మణుడైనను తల్లి బ్రాహ్మణస్త్రీ కాక క్షత్రియాంగన అనియు, ఆమెనతడు వివాహమాడలేదనియు కావున వాని బ్రాహ్మణత్వమునే నిరాకరించి వానిని చంపుట వలన బ్రహ్మహత్యాదోషము రాలేదనియు తెల్పియున్నారు. అట్లైనచో కుంభకర్ణుడుకూడ బ్రాహ్మణుడేగదా. వానిని చంపినందున బ్రహ్మహత్యాపాతకము ఏల రాదయ్యెనని ప్రశ్నించియున్నారు. తాటకవధవలన స్త్రీహత్యాపాతకము రామునకు రానట్లే ఇచట బ్రహ్మహత్యాపాతకము రాలేదని వివరించియున్నారు. సీతావహ్నిశుద్ధి సందర్భమున శివుడే వచ్చి రాముని స్తోత్రముసేసినట్లుండగా సముద్రము అను అర్థమున ప్రయో

గింపబడిన మహాదేవ శబ్దమును ఆధారముగా రామునికి శివభక్తి అంటగట్ట రాదని వివరెంచియున్నారు. రాముడు రామాయణమందంతటను వైదికుడగు ఆర్యునిగా సంధ్యావందనాది కర్మల నాచరించువానిగనే వాల్మీకి చూపియున్నా డనియు, అతడు శివార్చన చేసినట్లు లేదనియు తెలిపియున్నాడు. కాని, యీ పదమునకు శైవులొకవిధంగా, వైష్ణవులింకొకవిధంగా అర్థముచెప్పుట జరుగు చున్నదనియు, రామేశ్వరమున శివలింగము రామునిపేర నున్నను అది రాముడే ప్రతిష్ఠించినట్లు నమ్మజాలమనియు నిరూపించియున్నారు.[166] రాముడు శివలింగము ప్రతిష్ఠించలేదని నమ్మినచో హనుమంతుడు హిమాలయమునకు వెళ్లి లింగమును తెచ్చుట అను ప్రమేయమేలేదు. రాముడు బ్రహ్మహత్యా పాపమునకు పరిహారముగా శివలింగమును ప్రతిష్ఠించినట్లు రంగనాథ రామా యణమున కలదు.

రంగనాథ రామాయణములో: శ్రీరాముడు పుష్పక విమానమున సీతా లక్ష్మణ పరివార సహితుడై అయోధ్యకు పోవుచుండెను. గతమున తా మేయే ప్రదేశములలో నే యే కార్యముల నొనరించినదీ సీతకు తెలుపుచూ పోవు చుండగా వారికి దశకంఠుడెదురయ్యెను. అపుడు రాముడు విభీషణునిచూచి 'తాను చంపిన రావణుడు మరల కనిపించుటేల' అని అడుగగా, అది బ్రహ్మ హత్యా దోషమని విభీషణుడు తెలిపి బ్రహ్మను ప్రార్థింపుమని తెలిపెను. అంత రాముడు బ్రహ్మను ప్రార్థించి ప్రసన్నుని చేసికొనగా బ్రహ్మ ప్రత్యక్షమై రావణుడు మోక్షార్థియై వచ్చినాడని వానిని మోక్షకామునిచేయు ముదమున—

"భావించి నీపేర భవుని ప్రతిష్ఠ
గావింపు మున్నీటి కట్టపై నొప్పు
రమణమై నొక ముహూర్తములోన...."

—అని చెప్పి వెళ్లెను. రాముడు హనుమంతుని పిల్చి "ఇదివరలో నీవు ఇరువదిమూడు లక్షల ఇరువదివేల పది యోజనములు వెళ్ళి మందులకొండ తెచ్చియుంటివి. రెండువందల నలభై యోజనములుకల కాశీపురమందలి శివలింగాన్ని శీఘ్రమేతెమ్ము" అని పంపెను. హనుమంతుడు కాశీచేరి గంగలో స్నానమాచరించి కాశీవిశ్వేశ్వరునికి మ్రొక్కులిడి లింగమును తీసికొనివచ్చుట కాలస్యముకాగా ముహూర్తము మీరుచున్నదని రాముడు హనుమంతుని కొఱకై ఆకసంపైకి చూచి చూచి, ఏల రాలేదో అని తెలియలేక ఒకవేళ

రాక్షసులడ్డగించినందున వారితో జగడమగుచున్నదేమోనని తలంచి ఒక సైకత లింగాన్ని చేసి సేతుతటమున ప్రతిష్ఠించెను. ఆ తర్వాత కొంతసేపటకి హనుమంతుడువచ్చి రాముడు శివలింగప్రతిష్ఠ చేసినందుకు ఖిన్నుడై రాముని చూచి 'స్వామీ శివలింగాన్ని తేగల అర్హత నాకులేదా! నాపై మక్కువ లేక పోయెనా! ఏల తమరు నాకొఱకు నిరీక్షించక శివలింగప్రతిష్ఠ చేసితిరి' అని బాధతో అడిగెను. రాముడతనికి కాలాతిక్రమ దోషము రాకుండుటకై ప్రతిష్ఠించినట్లు తెలిపి—

"...... .... నీ వరుదెంచితివి
సంతోషమయ్యె నీశ్వరుని నవ్వలికి
దొలించి నీ తెచ్చు దేవుని నిలుపు...."

—అని వలుకగా అనిలనందను డానందమొంది—

ముదమంది తన వాలమున నీశు జుట్టి
కదిలించి కదిలించి కదిలింపలేక
మదిలోన శంకించి మరియు నుంకించి
మెదలింప జాలక మిగుల చింతించి
ఇదియేల ప్రేగయ్యె నీరీతి నాకు
బదిలింపు దప్పెనో భానువంశజుని
గినసి యేమాఱు పల్కిన పాపముననొ
కనుగొన నటుగాక కాశీవ నిటకు
జేకొని యేను దెచ్చిన పాపముననొ
కాకున్న నిదియేల ఘనమగు

—అని చింతించి తన బలమునంతా కూడతీసికొని పెకలించి చూచి రక్తము గ్రక్కుకొని మూర్ఛపోయెను. శ్రీరాముని ఉపచారములకు, అతని కరస్పర్శకు తేచిన పిమ్మట పావని పశ్చాత్తాపపడి—

మీరు నిల్పిన యీశు నెఱుగ
కీలీల దెమలింప నెంచిన యిట్టి
నాతప్పు లోగొని నన్ను మన్నించి
యీతరి మీ యాజ్ఞ నేడిచ్చినట్టి
యీ యీశునకు వెరవెరిగింపు

—మని కోరెను. అంత రాముడా కాశీలింగాన్ని ఒకచో ప్రతిష్ఠిపజేసి హనుమంతునిచే తేబడిన హనుమల్లింగాన్ని ముందు పూజించిన తర్వాతనే తాను ప్రతిష్ఠించిన రామలింగాన్ని పూజించునట్లు అనుగ్రహించెను. మరియు గంగాజలమును తెచ్చిన ఏ మానవుడైనా—

"వెచ్చెర నట నభిషేకంబు సేయ
నతడొనర్చిన బ్రహ్మహత్యాదియఘము
లతనిబొందవు కీర్తులలర సిద్ధించు
నతులిత పుత్రపౌత్రాభి వృద్ధియు
నతుల భోగంబులు నమరంగ గలుగు"

—నని తెలిపెను.

సమీరకుమారవిజయములో: ఈకథ హనుమంతునిలోనున్న అహం భావమును తొలగించుటకునూ, లోకమున శివభక్తిని ప్రచారము చేయుటకును చాల విపులముగా పోషింపబడియున్నది. రంనాథరామాయణకర్త చెప్పిన దానికన్న మరికొన్ని వివరములను తిమ్మన చేర్చియున్నాడు. దేవాలయాల ప్రాచీనతను తెల్పుటకు ప్రభావవంతులైవారిచే నవి ప్రతిష్ఠింపబడినట్లు క్షేత్ర ప్రసిద్ధిని తెలుపు గ్రంథములలో నెన్నియో కల్పనలను చేసియున్నారు. భక్తి విశ్వాసములు గలవారు వాటి చారిత్రక సత్యములగురించి తర్కించకుండా తమ అధ్యాత్మిక విశ్వాసముల పెంచుకొను చిత్తశుద్ధి పూర్వకమైన విశ్వాసముతో నమ్మి పూజలొనర్చుచున్నారు. కాలాంతరమున శ్రీమద్రామాయణేతర గ్రంథ ములలో చొచ్చుకొని వచ్చిన అవాల్మీకములగు కల్పనల కెన్నింటికో ఆమోద ప్రచారము వచ్చినట్లే బ్రహ్మహత్యాదోష నివారణకై రాముడు శివలింగప్రతిష్ఠ చేసిన గాథకూడ ప్రచారము పొందినదని భావించుటలో తప్పులేదు.

రావణవధానంతరము రాముని పూజించుటకై దండకారణ్యవాసులగు మునులు అగస్త్యునితో కలిసివచ్చి రాముని కొనియాడిరి. రాముడు వారితో 'మద్దృష్టిగోచరమైన జంతువెప్పటికి కైవల్యభాజన మగు'నని తెలిపి పౌలస్త్య వధ వలన తనకు కలిగిన పాపము తొలగు ఉపాయమును తెలుపుమని వారిని కోరెను. అంత వారు "శ్రీరామా, నీకు దోషముండునా? ఏదో యీ లోకాన్ని అనుగ్రహించు కొఱకు నీవడుగుచున్నావేకానీ నీకు దోషమంటునా? అయినను శంభుప్రతిష్ఠ చేయుమని తెలిపిరి. వారు 'ముహూర్తద్వయ మాత్రములో

అభంగుర మాంగల్య ముహూర్తమున్నదని తెలుపగా రాముడు హనుమను చూచి 'కలధౌత ధరాధరముననున్న లింగాన్ని నాల్గు ఘడియలలో తేవలయు' నని చెప్పగా హనుమంతుడు కైలాసగిరినిచేరి శివలింగాన్ని వెదకి వెదకి కానక —

"చరణాంగుష్ఠముచేత నూతగొని పక్షద్వంద్వమున్ విచ్చి భా
స్కరు దృష్టించుచు నూర్ధ్వబాహుడయి నిశ్శ్వాసంబు బంధించి బం
ధుర విశ్వాసముతోఁ దపంబు"

—సలుపగా హరుడు వెంటనే సాక్షాత్కరించి ఇష్టార్థము వేడుమని పలికెను. హనుమ శివుని స్తుతించి తనను రాముడు శివలింగమును తీసికొని వేళ అతిక్రమించకుండా రమ్మనిన వృత్తాంతముతెలిపి 'ఇష్టమైన గూర్పవే'అని మ్రొక్కెను. ఈశుడలరి యతనికప్పుడు లింగద్వయం బొసంగి యంతర్ధాన మయ్యెను.

ఆంజనేయునికై రాముడొక్కింత నిరీక్షించి ఆలస్యంకారాదను మునుల వాక్కుల నాదరించి సైకతలింగాన్నిచేసి సీతాసమేతుడై సేతు తటమున ప్రతిష్ఠించెను. తన ఆలస్యమునకు రాముడు అన్యలింగమును ప్రతిష్ఠించునేమో యని వితర్కించుకొనుచు వచ్చు ఆంజనేయుడు 'ఋషిపాఠ్యమాన వేదమంత్రంబులు, మద్దెలలమ్రోత వినరాగా, ధరణికిదిగి సీతారామలక్ష్మణాదులకు నమస్కరించి, పెదవి కంపించుచుండగా, ఎఱ్ఱని కన్నులకాంతితో కన్నీరు చంపల తడుపుచుండగా రాముని చూచి శోకావేశముతో—

"కనవలదు నమబోలిన
తనుజాతుని నెప్పటికిని దల్లి నిజంబో
జననాథ వృథా స్థూలము
తనువుండిన నేమి తలగిన నేమి"

—అందరిముందర నన్ను ప్రియమార పిలిచి వెండికొండలోని లింగమును గొని వేగముగా రావలయుననిచెప్పి, నీకసాధ్య మెందును లేదని తెలిపి దానిని నేను తెచ్చులోగా త్వరపడి సికతామయ లింగమును నిలిపితిరిగదా!—

"నేనెంత నాదు బలమన
గా నెంత యనంత శక్తి కలితుడవగు నీ
కేనా యుద్యోగంబులు
పూని ఘటింపం దయా ప్రపూరిత హృదయా

పరితాపానల కీలల
భరియించి వసించుకంటెఁ బ్రాణంబులు వే
గిరమెఁ బెడబాసి మఱి నీ
చరణంబులు గనుట మిగుల సౌఖ్యంబనుచున్"

—నిర్వేదపడగా రాముడంత మందహాస ప్రసన్నవదనముతో "నేను – నీవు అను భేదము నీలో కల పర్యంతము జన్మమృత్యువులకు అంతము లేదు. సన్నుతి, తిరస్కారములు దేహగతంబులు" అని తత్త్వబోధచేసి అద్వయ జ్ఞాననిష్ఠ పూనవలసినదిగా పావనికి బోధించి—

"మత్కృతము త్వత్కృతంబగు
ద్వత్కృతమగు మత్కృతంబు ద్వైతము వలదో
సత్కృతి లింగస్థాపన
సత్కృతి నీవాచరించు సత్కృతి గాదే"

—"లగ్నము దగ్గరైనందున మునిప్రవరులు వివరించగా భూసుత చేసిన సైకతలింగాన్ని నిల్పితిని. ఇంతమాత్రానికే భగ్నత చెందనేల" అని ఓదార్చెను. ఇంకను హనుమను తృప్తిపరచుటకై మరల రాముడు "ధీవరేణ్యా. నీవు తీసుకొనివచ్చిన శివలింగాన్ని కూడ నేడే ఇక్కడ నిలుపుము. మొదటి పూజను అక్కడ జరిపి అటుపై నా పేరిట లింగమును ప్రజలు భజియింతురు గాక. అదియుగాక నీవును యుద్ధమునందనేకుల వధించి యున్నావు. తత్పాప పరిహారణమునకు నీవును శంభుని ప్రతిష్ఠించుట మంచిదే. మేము ప్రతిష్ఠించిన సికతాలింగమును తీసి ప్రతిష్ఠించవలయునని నీవు తలంచుచున్నచో అది దుశ్శకము. ఇప్పటికే సప్తపాతాళ భూమికలలో పాదుగొనిన మహేశుని ఏ శౌర్యరాశి కూడ తీయజాలదు. నీవు తీసియిచ్చు నెడల కైలాసగిరి నుండి నీవు తెచ్చిన లింగమునే ప్రతిష్ఠించగలను" అని రాముడు తెలుపగా హనుమంతుడు రామునకు నమస్కరించి—

"దేవర ప్రతిష్ఠ గదా యని కొంకినాడఁగా
కనిమిష శైలమైన ద్రుహిణాండము దాటగ మీటనేరనే"

—అని మనవిచేసి రాముడు ప్రతిష్ఠించిన సికతాలింగమును పెకలింపబూనెను. హనుమంతుడు "తన భీకరతర కరప్రకాండము సారించి రామనాథలింగము ననాయాసమున తెమల్చి, యగలకున్న, దిగులుపడక, కలకలనగుచు కిలకిలా

ర్భటి సముద్ఘటించి మోకారించి, వాలంబెగకట్టి కరద్వయంబునంబట్టి దిట్ట తనంబున నిట్టట్టుగా నూగియు గట్టియై నెట్టుకొన్నయట్టి కటతటంబులదర, చటులతర లోచనంబులు నిప్పుకలు చెదర, కిటకిట పండ్లు గీరుచు, పటపట బ్రహ్మాండ భాండంబువగుల నట్టహాసంబుచేసి ప్రయత్నించు"చుండగా హనుమ చేయు శివాపరాధంవలన నేమి పుట్టునో అని సీతాదేవియును, ఇంతటి అహం కారము తగునా అని సౌమిత్రియును, ఇంతటి బలశాలికిది అసాధ్యమగుట వింతకదా అని సుగ్రీవుడును, రామప్రయుక్తతృణంబు ద్రుహిణాస్త్రంబగుట తెలిసి దానిని భంగముచేయుట వివేకమా అని విభీషణుడును, ఇంకను వానరాది వీరులు, అంగదాదులు తమకు తోచినట్లుగ పలుకుచుండ, రాముని దయ వలన జగత్ప్రాణసుతునకు హాని లేకుండుగాక అని ఋషులు ఆశీర్వదించు చుండగా, నభోభాగంబున బారులుతీరి నగవిదారి ప్రముఖ బర్హిముఖ, గరుడ, గంధర్వ, కిన్నెర, కింపురుష, యక్ష, రాక్షస, సిద్ధసాధ్యాది వియచ్చరులు మచ్చెకంటులతో నచ్చెరుపడి చూచుచుండగా, సప్తమారుతములు నిజాను కూలంబుగా వాలంబునకు బలంబు గూర్చగా, సప్తసముద్రాలు కలత చెందు చుండగా, సప్తద్వీపజనులు భయభంగురులై భీతిల్లగా, సప్తాశ్వప్రముఖ గ్రహ నివహంబులు త్రోవలు కలంగ, సప్తకులపర్వతంబులతో ధరాతల ముత్పాత లూగుచుండగా, భూతములాక్రోశింపగా, దిగ్గజాలు ఘీంకరించుచుండగా, భూభారాన్ని మోయు ఆదిశేషునికాధారమగు ఆది వరాహము ఎట్టి ఉత్పాతము పుట్టెనోకదా అని చింతించుచుండ, కుమారప్రముఖ ప్రమథులు, గజాననుడు సైరించి కాచియుండగా హనుమంతుడు తన కరచరణంబు లిలాతలంబునంబెట్టి తన వాలంబున లింగమూల మామూలంబుగా జుట్టి, పట్టి, చలపట్టి, ఆ పట్టు తప్పించి, ఆకాశానికి ఎగసినా, ఆ లింగము తన తోకవెంట నంటిరాక నిరాక రించుటంజేసి ఆకాశమున సేకరింపలేక సకలలోకపాలక హాహాకారంబులతో నవరంధ్రంబుల బుడబుడ నెత్తురులు వడయ, వడి అడగి, రెండు ఘడియలు ఒడలెరుంగక పరవశుండై పుడమిబడి మూర్ఛపోయెను. అతని రక్తమువలన రక్తకుండమేర్పడగా చూచుచున్న అక్కడివారంతా ఎంతో బాధపడుచుండగా సీతాదేవి ఆంజనేయుని అవస్థజూచి—

"అప్ప యిదేమిరా యని ధరాత్మజ కన్నుల బాష్పపూరముల్
చిప్పిలఁ గేలుదమ్మిఁ దుడిచెన్ దనుసక్త ధరాపరాగమున్"

—అంత రాముడు నెత్తుటిలో తడిసి పుల్లసిలు పావని మోము కనుగొని తల్లడ పడి అతని శిరస్సును తన తొడలోనికి చేర్చి యెంతయో దుఃఖించెను. "శత్రువుల శూల ముద్గర గదా క్షురికాదులచే గాయమైనా ఎరుగని నీ కాయమున కీ యపాయమా! నా మాట వినరావా! ఓ అసహాయశూరా! మమ్మే జననీ జనకులుగా భావించి సేవించుచుండు నీవు ఈనాడు భక్తిసేయకుంటి వేమోయి. నీవు తోడుండిన నేను నా కన్న తల్లిదండ్రులను, సోదరులను, చెలులను మరచి వుండిన వాడిని గదా! మేము మూర్ఛలో మునిగినపుడు నీవు మాకు ప్రాణములిచ్చినావే. నీ వీనాడు మూర్ఛమునుగగా మే మేమీ చేయలేకున్నామే" అని విలపించుచు—

"జగతి యేలనేల సౌమిత్రి యేల సీ
తా లతాంగి యేల తక్కియున్న
వారలేల నిన్నువంటి గుణాఢ్యుండు
లేకయున్న నాకు నో కుమార"

—అని అతని కన్నుల స్రవించు కన్నీటితో నతని కాయము తడుపగా హనుమంతుడు మూర్ఛతేరి, లేచి తన చింతవదలి, రాముని చేరి, తనను నిందించుకొని, భక్తితో నిరోష్ఠ్యదండకమున రాముని ఫలుభంగుల స్తుతించి "నా జాతిచేష్టా నిక్కృష్టేహదృష్టింప కిష్టాదృతించేర్చి రక్షింపగా నీకెకాకేరికిం జేరికే" అని వినుతించి ఆ తర్వాత సీతామాతనుగూడ నుతించగా ఆమె అతని నోదార్చుటకై "హనుమా, నాయనా, సకలజ్ఞానకళాకలాపుడగు రామ విభు డిక్కడ శివుని ప్రతిష్ఠించగా నీవు—

సికతామాత్రునిగా దలంప నగునే నేడాదిగా నిట్టి గా
యకముల్ సేయకుమన్న స్వామి హితకార్యాసన్నితం బత్రకా

తప్పుచేసితిఁ బతికని తల్లడిలకు
నీ మనశ్శుద్ధి యెఱుగు శ్రీరామ విభుండు
పాప డాటల కెనసిన పనులు జూడ
దండ్రి కానందములుగాక తప్పులగునె.

—రాముడే పరాత్పరుండు. నేను మూలప్రకృతిని. కార్య హేతుత్వంవల్ల మే మిద్వురమై వెలగుదుము. స్వామి రూపవ్యాపకమైన సర్వాన్ని నేనే సృజించి, పెంచి, అణచివేయుదానను. త్రిగుణ్యవిస్ఫూర్తిచే మతి దృగ్వ్యాపార దృశ్యాకృతులన్నీ యేర్పడుచున్నాను—

త్రిపుటీశూన్యన కీ జగజ్జనన శక్తి స్ఫూర్తి వర్తిల్లగా
గపిలోకేశ్వర సత్యసంకలిత సంకల్పాకృతిన్ మించి భే
దపు భావంబు వహించి యుండియు నభేదవ్యాప్తి వర్తించు నీ
యపురూపంపు రహస్య మీ వెఱిగి నిత్యానందముం బొందుమా.

—అని ఓదార్చెను. "హనుమా, నీ రక్తంవలన ఏర్పడిన ఈ గుండం నీ పేరున వెలసి దురితాపహారియై జగత్తులో వెలయుగాక. నీపేర హనుమత్కుండం అను ప్రసిద్ధినిపొందు. ఈ సరస్సులో జనుల ఎమ్ములు ఎంతకాలం ఉండునో అంతకాలం వారు యమలోకం పోకుండా దివ్యలోకాలలో ఉండగలరు. ఇందులో స్నానం చేసినవారికి గంగాస్నానఫలం, సహస్ర అశ్వమేధయాగం ఫలం, సరస్వతీనదీస్నానఫలం కలుగును. ఇందులో తిలోదకముల నిచ్చినవారికి పితరులు ఘృతకుల్యలో నుండగలరు" అని సీతామాత అనుగ్రహించగా విని, హనుమంతుడు కలతతేరి తాను తెచ్చిన కైలాసగిరి లింగాన్ని సైకత లింగానికి ఉత్తరముగా ప్రతిష్ఠించి ధన్యతగాంచెను.[168]

9 హనుమంతుడు బ్రహ్మలోకమునుండి గంధమాదనుని తెచ్చుట.

శ్రీమద్రామాయణమున ఈ వృత్తాంతము లేదు. ఇది సమీరకుమార విజయములో వివరింపబడినది. సీతాదేవి అగ్నిప్రవేశమైన పిమ్మట బ్రహ్మ రుద్ర ఇంద్రాది దేవతలు శ్రీరాముని అనేకముగా స్తోత్రమొనర్చిరి. రాముని కోరికపై ఇంద్రుడు అమృతవృష్టి కురిపించి మడిసిన వానరుల నందరిని మరల బ్రతికించెను. పుష్పకములో అయోధ్యకు పోవుచు శ్రీరాముడు గంధమాదనుడను కపిశేఖరుని అడిగెను. అతడు కుంభకర్ణుని యుద్ధసమయమున సమయమున మరణించినట్లు విభీషణుడు తెలుపగా రాముడు దిగులొందగా జాంబవంతుడు రామునిచూచి "హనుమానుడీదురవస్థ తీర్పగల"డని రామునితో చెప్పెను. అపుడు రాముడు హనుమనుచూచి—

"మా ఆపదలెల్లఁ బాప మహిమాంబుధి నీవె కదయ్య"

—అని పొగడి గంధమాదనుని తీసికొని రావలసినదిగా కోరెను. అపుడు హనుమంతుడు 'నిమిషములో తెచ్చెద'నని పలికి ఉప్పరంబున కెగసి యముని

పురమునకరిగి ద్వారమువద్ద 'అర్చిన(దద్దరిల్లి జముడు పరతెంచి పూజించి' సద్భావముతో గంధమాదనుడు తన లోకమున లేడనిన్నీ, బ్రహ్మలోకమున నున్నట్లున్నూ తెలిపెను. పావని జమునికి మ్రొక్కి 'భూర్భువస్సుఖోదంచిత పుణ్యలోకాలదాటి సత్యలోకముచేరి బ్రహ్మదగ్గరకుచేరి మ్రొక్కినంతనే బ్రహ్మ అతనిని కౌగలించి వచ్చినకార్యమడుగగా "సమస్తము నీ వెఱుంగవే మహాత్మా. గంధమాదనుడను కపీశ్వరుడిక్కడున్నాడు గాన వానిని రాముని కొఱకు పంపుము" అని విన్నవించెను. "రామకార్యహితబుద్ధితో కుంభకర్ణుని తోడి పోరిలో మరణించిన ఇతడు అజరామర రూపమొందిన గంధమాదనుని అవనికంపగ జెల్లదు. అయినా, నీవురాగ నంపవలసె" అని బ్రహ్మ గంధ మాదముని హనుమంతునితో పంపగా, వానిని రాముని చెంతకు చేర్చి హను మంతుడు నమస్కరించెను. తక్కిన కపులందరు ఆశ్చర్యపడి 'తనువుడిగిన జను గ్రమ్మర తెచ్చెదననిచెప్పి తేగల్గిన నీ ప్రభావ తేజములను పొగడ నెవరికి తరమగునని, నీవె విధాత'వని పొగడగా రాముడు హనుమంతుని ప్రశంసాపూర్వకంగా గౌగలించి గౌరవించెను.[169]

రాముడయోధ్యకు చేరులోగా విమానమును కిష్కింధలో ఆపించి వానర కాంతల నందరినీ తన పట్టాభిషేకమునకై ఆహ్వానించెను. వారందరు చేరిన పిమ్మట వాయుకుమారుడు రాముని చూచి 'స్వామీ, మా అమ్మనొక్కసారి దర్శించివచ్చుటకనుమతించుడని కోరెను. రాముడుకూడ అంజనేయునితోను, లక్ష్మణునితోను, సీతతోను ఆమెవద్దకు వెళ్ళిరి. అంజనేయుడామెకు నమస్క రించగానే శ్రీరామాదులుకూడా ఆమెకు ప్రణామములొనర్చిరి. శ్రీరాముని వీరోచితకార్యములను హనుమ వివరించగా అంజన తన కుమారునిచూచి కోపముతో 'అయ్యో, కింకరుడవు నీవుండికూడ ప్రభువునకింత కష్టము కల్గించి తివా! ఆ రావణుని నీవే చంపకూడదా!' అని పలుకగా, శ్రీరాముడామెను శాంతింపజేసి 'అమ్మా నీకుమారుడు మహావీరుడే. అతడసాధ్యములను సాధించు ఘనుడు. నాకు కీర్తి కలిగించుటకై, నా చరిత్ర లోకములో నిల్పుటకై అట్లొనర్చెను' అని ఓదార్చెను. ఆమె శ్రీరాముని పూజించుచు సంభాషణలో తన స్తన్యమువలన హనుమ బలశాలియై గొప్పవాడైనట్లు పేర్కొనెను. ఆ వాక్కులను లక్ష్మణుడు విశ్వసించనట్లు ఆమెకుతోచి 'సౌమిత్రీ, నా పాల మహిమ చూపెదనుసుమా!' అని తన కుచమునుండి పాలను కొండ శిఖరము

మోదికి చిమ్మించగా అది తునాతునకలైనది. అదిచూచి వారు అంజనను స్తుతించి సాగిపోయిరి. ఈ కథ ఆనందరామాయణమున కలదని హనుమాన్ శీలాతరంగిణిలో కలదు.[170]

10 రామాగమనవార్త భరతునకు తెలుపుట.

ఈ సన్నివేశము శ్రీమద్రామాయణమున విపులముగా నున్నది. తాము అయోధ్యకు వచ్చుచున్నవార్తను రాముడు లక్ష్మణునిద్వారా గాని ఇంకే కింకరునితోగాని పవనకుమారునే పంపి తెలియజేయింపనెంచెను దీనినాతడు కేవల సందేశముగానే గాక భరతుని రాజ్యకాంక్షారతిని పసికట్టి ఆంతరంగిక ముగా రామునికి తెలుపగలందులకే హనుమంతుని పంపెను. భరద్వాజాశ్రమ మున దిగిన రాముడు వానరులందరికీ విందగునట్లు అచటి వృక్షములకు మధురఫలములుండునట్లు రాముని వలన వరము పొంది వారందరు తృప్తిగా భక్షించి ఆనందించుచుండగా, హనుమంతుని పిలిచి "మహిత జనాఢ్య, నీవు అయోధ్యకువెళ్లి అచట రాచనగరులో అందరు క్షేమముగా నున్నారేమో తెలిసి కొని రమ్ము. త్రోవలో శృంగిబేరపురమను పల్లెలో నా ప్రాణస్నేహితుడు గుహుడున్నాడు. నా క్షేమాదులు వినుటవలన అతడానందించును. నా కుశలవార్త అతనికి తెలిపినచో అయోధ్యకుపోవు మార్గము అతనే నీకు తెల్పును. అక్కడ భరతునితో నా క్షేమము తెలుపుము. తొలుదొల్త నీవు, నేను నా తండ్రియాజ్ఞనెరవేర్చి తమ్మునితో, సీతతో తిరిగివచ్చితినని తెల్పుము. ఆ మాటలువిని అతనిముఖ మెట్లుండునో పరీక్షింపుము. తర్వాత సీతాపహర ణమాదిగా రావణవధవరకు జరిగిన విషయములనన్నింటిని తెలుపుము. నేను సుగ్రీవ విభీషణాదులతోకలిసి వచ్చితినని చెప్పుము. ఆ సంగతివిని అతని ఆకారమెట్లుండునో కనిపెట్టి చూడుము. ఇట్లుండగా నేను చెప్పినరీతిగాచేసి నీవుకూడ నా విజయపరంపరలను, ప్రతిజ్ఞపాలనములను నీ మాటలలోతెలిపి—

అతతి యింగితములు నానన కాంతియు
జూపు విధము పలుకు బొప్పెరింగి
వాని చిత్తవృత్తి వర్తన మఖిలంబు
దెలిసి రమ్ము వేగ తెల్లముగను

—కరి హయ రథాదులతోడి భోగయోగ్యమైన రాజ్యమునందెవ్వరికి ఆశ కలుగదు? ఇంతకాలము పరిచయమైనందున రాజ్యభోగాదులను భరతుడాశించు చున్నచో అతడే రాజ్యాన్ని పాలించుగాక. అట్టికోరిక అతనిలో వున్నచో వెంటనే నీవు బయలుదేరి మేమధికదూర మక్కడికి ప్రయాణము చేయకముందే మమ్ము కలుసుకొని మాకు ఆ వార్త తెల్పుము. అతనికి రాజ్యాభిలాష లేనిచో నీవు అక్కడనే యుండుము. మమ్ము కలియుటకు రావద్దు" అని చెప్పిన రాముని వచనములు విని హనుమంతుడు మనుష్యశరీరము ధరించి వేగముగా పోయి ముందుగా శృంగిబేరపురముచేరి గుహునకు రామాగమనవార్త తెలిపి, జనపదములను చూచుచుపోయి అయోధ్యకు క్రోసుదూరమున నందిగ్రామము నందొక ఆశ్రమమును చూచెను. నారచీరలుకట్టి తపసివేషములో తనరారు భరతుని చూచెను. వెంటనే అతనిని సమీపించి నమస్కరించి యిలాచెప్పెను. "నీవు ఏ రాముని కొరకు ఎదురుచూచుచున్నావో, దండకారణ్యములో చీరాజిన ధారియైన అన్నకై ఎంతకుందుచుంటివో ఆ రాముడు నీ క్షేమము తెలిసికొని రమ్మనెను. భరతా! నీకు ప్రియమైన వార్త తెలిపెదను. దుఃఖమును నీవు వీడుము. నీ ప్రియమైన అన్నను నీవు ముహూర్తకాలములో చూడబోవు చున్నావు. రావణునిచంపి సీతను గ్రహించి లక్ష్మణునితో సుగ్రీవాది మిత్ర పరివారసహితుడై నీ అన్న వచ్చుచున్నాడు" అని చెప్పెను. భరతుడాపలు కులు వినినంతనే ఆనందమున పరవశించి మూర్ఛపోయి కొంచెముసేపటికి తేరుకొని హనుమంతుని కౌగిటగ్రుచ్చి ఆనందబాష్పములతో అతని శరీరాన్ని తడిపి "అనఘా! మనుజుండవో, నిర్జరుండవో దయగొని సమ్మదంబిడు నుదంతము జెప్పగవచ్చితీక్రియన్" అని పలికి 'అయ్యా! నీకు నూరుగ్రామాలు, లక్ష గోవులు, బంగారు ఛాయగల కులీనాంగనలు మొదలగు కానుకలను బహూకరింతును. నీవు మా అన్న సర్వవృత్తాంతమును, ఈ పదునాలుగేళ్లలో అతని అనుభవములను సవిస్తరముగా తెలుపు'మని కోరగా హనుమంతుడంతయు (సీతాపహ్నాశుద్ధి తప్పించి) విస్తరముగా తెలిపెను.

అంత భరతుడు ఆనందముతో నగరమును అలంకరించునట్లుగా శత్రుఘ్నునాజ్ఞాపించి, రామపాదుకలు స్వీకరించి, బ్రాహ్మణ మంత్రి పరివార సమేతముగా బయలుదేరి రామునకు ఎదురువెళ్లెను. రాముని రాకలో విలంబము సహింప జాలక హనుమంతునిచూచి 'అయ్యా! రాముడు రాలేదు.

కోతులలో ఒకడైనా కామరూపధారియై మారువేషములోనైనా రాలేదు. నీవు చాపల్యము చూపలేదుకదా!" అని పలికెను. భరతుని పలుకులకు ఏమాత్రం నొచ్చుకొనకుండా హనుమంతుడతనికి భరద్వాజాశ్రమమునగల విందు ఏర్పాట్లను తెలిపి 'ఇదిగో ధూళి వాలుకానదీ ప్రాంతంలో ఆకాశమంటుచున్నది. అందులో విమానపు ఆకారం గోచరించుచున్నది. దానిలో రాముడు వచ్చుచున్నాడు' అని తెలిపి భరతుని ఆనందింపజేసెను. పరమ భాగవతశిఖామణి భరతునికి రామునకు జరిగిన కలయికను రామభక్తశిఖామణియగు హనుమంతుడు నయనానందకరముగా తిలకించెను.[171]

సమీరకుమారవిజయము ప్రకారం: రామాయణమున తెలుపబడిన అంశమే ఇందు సంకేతముగా నున్నది. భరద్వాజాశ్రమమున శ్రీరాముడు తిరువడిని (ఆంజనేయునకు శ్రీవైష్ణవ సంప్రదాయమందలి పేరు) పిలిచి 'పర హృదయజ్ఞతా గరిమ ప్రౌఢవచోరచనా చమత్క్రియ సరసుడవౌట మా భరతుని సన్నిధికేగి మదాగమనంబు మచ్చరితము తెల్పి రమ్మనుచు' ప్రియమున పంపెను. కాని రామాయణమున నున్నట్లు భరతుని స్వభావమందలి మార్పులను గమనించినట్లులేదు. మారుతి 'మానవరీతి నాతనింగాంచి రామ కథామృతంబు వర్ణించెను.'[172]

1 అయోధ్యలో హనుమంతుడు

శ్రీమద్రామాయణోక్తరీతి : అయోధ్యకు చేరిన తర్వాత రాజ్యపాలనను భరతునినుండి స్వీకరించి శ్రీరాముడు తన పట్టాభిషేకమునకు సమాయత్తుడాయెను. అపుడు సుగ్రీవునిచే ఆజ్ఞాపింపబడి వానరశ్రేష్ఠులగు వేగదర్శి, జాంబవంతుడు, వృషభుడు, అనువారితో కలిసి హనుమంతుడు 'ముహూర్త మంతలో దివ్యతీర్థనిచయ పూర్ణకుంభములను రామ పట్టాభిషేకమునకై గ్రన్నన తెచ్చెను. శ్రీరాముని పట్టాభిషేకమున వైభవోజ్జ్వలముగా ముగిసిన తర్వాత శ్రీరాముడు తనకు తోడ్పడిన వానరులకూ, విభీషణునకు బహుమతుల నొసంగెను. అప్పుడు సీతాదేవి తన చూపులతోనే శ్రీరాముని అనుమతి పొందినట్టిదై హనుమంతునకు నిర్మలములైన వస్త్రములు, సువర్ణాభరణముల ఇచ్చి తృప్తినొందక తన కంఠమందలి బంగారు హారము నొకదానిని తీసి తన చేతిలో ఉంచుకొని తన పతివైపు పలుమారు చూచుచుండెను. శ్రీరాముడామె తలంపెరిగి 'నిన్ను ఎవడు తన గుణగణములతో మెప్పించెనో వానికే ఆ హారము నిమ్ము' అని పలికెను. సీత సంతోషించి ఆ కంఠహారమును సీతాశోకవినాశకునికే యిచ్చెను. హనుమంతుడు దానిని ధరించి ఆనందించెను. ఇంతేకాక ఆ వేడుకలో శ్రీరాముడు అంగద హనుమానులను తన తొడపై కూర్చుండబెట్టుకొని వారినిపొగడి తాను ధరించియుండి ఆభరణముల నన్నింటిని తీసి వారిని అలంకరించగా అదిచూచి వానరులందరును శ్రీరాముని శ్లాఘించిరి. రాముడపుడు హనుమంతునిచూచి తననుండి ఏదైనా వరమును కోరుకొనమని చెప్పెను. అంత నాతడు తన ప్రభువునుచూచి—

.... రామచంద్ర నా
మన మెదివేళ నీ యెడల మానని నెయ్యముఁ బూనుగాక నా
కనయము నీదుభక్తి చెలువారెడుగాక మనం బికెందునన్
జనయక యుండుగాక మహిజాధవ నన్ను ననుగ్రహింపుమీ.
నీ దివ్య చరితం బీ మేదిని నెందాక నిలచు మిహరకులేంద్రా
నా దేహంబునఁ బ్రాణము లాదరమున నిలువనిమ్ము యందాక పతీ.

—అని కోరెను. ఆ పలుకులకు రాముడానందించి సింహాసనము దిగివచ్చి ఆంజనేయుని కౌగిటచేర్చి పరమానురాగముతో, నీ మనసులో నున్నట్లే కాగల దని పలికి 'నా చరిత్ర నా కీర్తి ఉండునంతవరకు నీకు ప్రాణములుండు'నని అనుగ్రహించెను. "ఉపకారము చేసినవానికి తిరిగి ఉపకారం చేయదలంచుట వానికేదైనా ఆపద కలుగవలెనని తలంచుటయే. నీవు చేసిన ఒక్కొక్క ఉపకారమునకు నా ప్రాణమే ఇవ్వవలసి యున్నది" అని పలుకుచూ తన కంఠమందలి హారమునుతీసి శ్రీరాముడే స్వయముగా హనుమ మెడలో అలంకరించెను.[173]

ఆశ్చర్యరామాయణోక్తము : "త్రిలోకములలో దేవతలకుకూడ దుర్లభ మైన వరమును నేనిచ్చెదను కోరుకొనుము" అని రాముడు హనుమంతుని కోరెను. అపుడాంజనేయుడు 'మీ నామస్మరణము నెంతచేసినా నాకు తృప్తి రాదు. అందువలన భూతలమున నేను సతతము మీ నామ జపము చేస్తూనే ఉంటాను. మీ నామమీలోకంలో ఎంతకాలం ఉండునో అంత కాలము నాకు ఈ శరీరముండుగాక' అని చెప్పగా, రాముడట్లే అనుగ్రహించి 'జీవన్ముక్తుడవై సుఖముగా ఉండి కల్పాంతమున నా సాయుజ్యము పొంద గలవు. నీ వెక్కడున్నను సమస్తభోగాలు నా ఆజ్ఞచే నిన్ను అనువర్తించి యుండును.[174]

సమీరకుమారవిజయము ప్రకారం : శ్రీరామ పట్టాభిషేకమునకు (రామాయణమునందువలెకాక) హనుమంతుడొక్కడే వెళ్లి 'ఉత్తరాంబుధి రంగన్నరపూరంబు కాంచన కుంభమున' తెచ్చెను. ఆ సమయమున ఉత్సవా నంతరం రాముడు హనుమంతునకు బహుమతుల నిచ్చినను, సీతాదేవి శ్రీరామునిచూచి —

" .... మహామణిహారము పూని దీన మం
దార కుమార రమ్మనుచు దానె యురంబున వైచిచూచె న
య్యారె ధరాకుమారి కనిలాత్మజుపైగల కూర్మి యెట్టిదో"[175]

2 హారములోని రత్నములను హనుమంతుడు కొరుకుట

ఈ కథ వాల్మీకిరామాయణమున లేదు. పరాశరసంహిత, సమీర కుమార విజయమునను లేదు. శ్రీ తులసిదాసుగారి రామచరిత మానస్‌లో

నున్నది. సభలో తనకు బహుమానముగా లభించిన హారమును హనుమం తుడు త్రెంపి అందరును చూచుచుండగా ఒక్కొక్క రత్నమునునమలి సభలోనే ఉమ్మివేసెను. అపుడు వానరులు హనుమంతుని కృత్యముల నేవగించుకొను చుండగా, సీతాదేవి 'ఆంజనేయా, నీ కోతిచేష్ట పోనీవైతివికదా!' అని ఆక్షేపించెను. అపుడు వాయుసూనుడు 'అమ్మా, ఈ హారమందలి రత్నము లలో రాముడు కనబడునో లేదో అని కొరికి చూచితిని. అందులో నాకు కనిపించనందున పారవేసితిని'అని తెలుపగా, అపుడచటవారు 'నీకు రామనామ రహిత రత్నము రుచింపనిచో ఆ రామనామము నీలో చూపగలవా!' అని అడుగగగా వెంటనే హనుమంతుడు తన రొమ్ముచీల్చి తన వక్షఃస్థలములో సీతా రాములను చూపెను.[176]

తులసీదాసుగారి రచనచే ప్రభావితులైన ఆధునికులీకథ నెక్కువగా ప్రచారములోనికి తెచ్చిరి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారును తమ కృష్ణ రామాయణమున దీనికి స్థానమిచ్చియున్నారు. రాముడిచ్చిన బహుమతియగు హారమును త్రెంపబోవుచు హనుమంతుడు సుగ్రీవునివైపు చూచెను. అపుడతని భావము గ్రహించి సుగ్రీవుడు "రాతిలో రప్పలోపల రామనామముండునని యెంతే నీలోన నుండునోయి' అని పలికెను. అంత కపీశ్వరుడు "తన హృదయంబు గోరులనుదారత(జీరి కనుడటంచు" చూపగా అతని శరీరభాగ మంతయు రామమయముగా కన్పడెనని శ్రీ శ్రీపాదవారి కల్పన.[177]

ఈ కథలు కేవలము రామనామమాహాత్మ్యము నుగ్గడించుటకు కవులును, పౌరాణికులును కల్పించినదేనని శ్రీ వాసుదాసుగారి అభిప్రాయము. రత్నము లలో రామనామ మగుపించలేదనుట, రత్నమును నోటిలోవేసుకొని రామ నామమంత రుచిగా లేదనుట అను హనుమంతుని చర్యలు అతనికి ప్రాపంచిక వస్తువులయెడ, ఉపాయనములయెడ గల నిస్పృహను తెలుపుటకును, రామ భక్తిలో హనుమకు ఈ జగమంతా రామమయముగా తన దేహాత్మాదులలో రామతత్త్వమున్నట్లుగా తెలుపుటకు ఎంతో తోడ్పడినది.

ఈ సన్నివేశము తర్వాత హనుమంతుడు —

"రామరస విహీనమైన
రత్నమ్ముల పనియేమిటి

ముత్యమ్ముల విలువేమిటి
సత్యజ్ఞానమ్ము నిమ్ము"—అని కోరెను.[178]

3 సీతారాములిద్దరూ హనుమంతునకు తత్త్వోపదేశంబు చేయుట.

తన ఆశ్రితులనందరిని వారివారి గృహములకు తిరిగి వెళ్లుట కనుమతించిన తర్వాత శ్రీమద్రామాయణమున హనుమంతునికి సంబంధించిన కథాంశములు తక్కువ. పరాశరసంతహితలో కొద్దిగను, సమీరకుమారవిజయమునను, సీతారామాంజనేయ సంవాదమునను, ఆశ్చర్య రామాయణమునను, మహర్షి తన ఉత్తరకాండమున తెలుపని అంశములు కలవు. వాటిని పరిశీలించగా రాముడయోధ్యలో పరిపాలించినకాలమున హనుమంతుడు రామునకు మరల ఎన్నియో సందర్భములలో సేవలొనర్చినట్లునూ, శ్రీరాముని కృపకు పాత్రుడైనట్లును తెలియును. అయోధ్యలో నొకరోజున శ్రీరాముడు 'తనకు పురోభాగవర్తియు, పుణ్యకీర్తియు, నిటలతట ఘటితాంజలియును, కృతకార్యుండును, నిరాకాంక్షుండును, నిత్యానిత్యవస్తువివేకవంతుడును, సకలవిధైహికాముష్మికభోగవిరక్తుండును, శమదమాదిషట్క సంపత్తియుతుండును, మహాబుద్ధిమంతుడగు హనుమంతుని గమనించి కరుణారసంబు పొంగార జనకజాంగనామణి నెమ్మొగంబు జూచి మన నిత్యభక్తుండును, మదీయ జ్ఞానాసక్తుండును, పరమ భాగవత శిఖామణియునైన యితనిని మద్దివ్య తత్త్వస్వరూపంబుపదేశింపుము" అని ఆదేశించగా వల్లెయని సీతాదేవి అతనికి తారకయోగమును బోధించెను. "తారకయోగమనగా నాదబిందుకళలను ప్రత్యక్షముగా అనుభవించి పిదప వానికి లయస్థానమగు పరబ్రహ్మము నందైక్యమగుటయే. ఈ నాదబిందుకళలు ఇంద్రియగోచరములు కావు. వీనిని అనుభవించుటకు అనుకూలమగు ఖేచరి, భూచరి, మధ్యమ, షణ్ముఖి, శాంభవి అను ముద్రల సహాయమున ఇంద్రియములను మనస్సును అంతర్ముఖమగునట్లు చేయవలను. ఇవి యోగమునకు ముఖ్యాంగములు. యమనియమాది రూపమగు భ్యాసయోగమున పయనించు తారకయోగికి శీఘ్రకాలమున నాదబిందు సాక్షాత్కారమగును. అట్లెరిగిన వారికి శరీరము చలించదు. బాహ్యమగు శీతోష్ణాదుల వలన దుఃఖాదులుగానీ అంతరంగిక మనోవ్యాధులుగానీ బాధింపవు.

మనస్సు ఆ విధముగానున్నప్పుడు జీవబ్రహ్మము లొక్కటియే అను విషయము అనుభవపూర్వకముగా గోచరమగును. ఇది ముక్తికి చక్కని మార్గము. అతి సూక్ష్మమైన పరమాత్మ తత్త్వము నెఱుంగుటకు మనోనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము లేనివాడు సమర్థుడుకాడు.

[నాదము - బిందుకళల స్వరూపము: శరీరమునందు ప్రాణవాయువుల సంచారము వలన పుట్టుధ్వనియే నాదము. ఇది ఓంకారరూపమున నుండును. ఈ నాదమును చెవులు మూసికొని వినినచో "ఝిణి" అని ఒకసారి, "ఝిణిఝిణి" అని మరొకసారి వినబడును. వీనితోపాటు వరుసగా ఘంటానాదము, శంఖ నాదము, తాళనాదము వేణునాదము భేరినాదము మృదంగనాదము, మేఘ నాదము - అను దశవిధ ఓంకారనాదములను శ్రీ గురూపదేశ పూర్వకముగా శ్రుతియుక్తి అనుభవపూర్వకముగా ఎఱుంగవలెను. 'ఓమ్'కారములో 'అ' కారము 'ఉకారము' 'మకారము' అను మూడు అవయవములున్నవి. అకారము భూరినాదము, ఉకారము బిందువు మకారముకళ ఈ మూడును కలిసిననే ఓంకారమగును. నాదము పరమాహ్లాదకమై చిత్తప్రసాదకమై, భేదరహితమై, అపగత వివాదకమునునై యుండును. శరీరము పొందిన జీవునికి షడాధార చక్రములు, డెబ్బదిరెండువేలనాడులు, దశేంద్రియములు, దశవిధ వాయువులు కల్గి, మనస్సునకు శబ్ద, దర్శన, స్పృష్ట ఘ్రాణేంద్రియాది రుచులసందించును. కర్మేంద్రియ జ్ఞానేంద్రియ సహాయముచే కార్యముల నెరవేర్చునది హృదయ కమలము. ఇది అధోముఖమై యుండును. దీనిని ఆధారముగా గొని బుద్ధి సంచరించును. ఇది ప్రాణవాయువునకూ మనస్సునకూ అగ్రభాగమున ఉండును. దీనికే బిందువు అని పేరు. సకలవిధమగు వాసనలకు కార్యకారణములకు ఇదియే ఆశ్రయము. సుషుప్తిలో ఇది అజ్ఞానరూపమున, జాగృతిలో అంతఃకరణ రూపమున ఉండును. దీనికి కదలికలేదు. కాని ప్రాణవాయువుల యొక్కయు మనస్సు యొక్కయు కదలికలచే ఇదియు కదలినట్లుండును. అనాదికాలమ నుండియు మోక్షము కలుగువరకు బహువిధములగు కర్మల నాచరించునదియు వారి ఫలముల ననుభవించునదియు నాదబిందువే. కర్తృత్వభోక్తృత్వము నాదబిందువునకేగాని ఆత్మకు లేవు. అతి సూక్ష్మమగు ప్రాణమనోగ్రస్థి బుద్ధియే బిందువు. దీనియందు ప్రతిఫలించియున్న పరమాత్మ ప్రతిబింబమే చిత్కళ].

హనుమంతుడు సీత వలన తారకయోగము తెలిసికొని 'అమ్మహాసర్వము యని సులభముగాగాంచు పరమ సూత్రము బోధింపు'మని కోరెను. అంత మాత అతనికి అభ్యాసయోగము, జ్ఞానయోగములతెల్పి జీవబ్రహ్మైక్యజ్ఞానము నిచ్చు అతి సులభమైన విజ్ఞానయోగము, రాజయోగముతెల్పి ఈ రెండింటికి శ్రీరామచరణభక్తి, వైరాగ్యము లావశ్యకములని పలికెను. హనుమంతుని రాజయోగిగా సీతామాత గుర్తించి "జ్ఞానమాత్ర స్వరూపమై, వియన్మండలాది దశవిధమండలముల కాధారమగు పదార్థము ఒకటి కలదనియు నాదబిందు కళలకు ఆధారభూతమై వాని ఉత్పత్తి వినాశనముల వలన మార్పు చెందక ఏదైతే తత్త్వమున్నదో అదే పరబ్రహ్మమని బోధించి—

ఆ నాదబిందు కళలం
గానంబడుచుండు వానిఁగను పురుషుడె ప్ర
జ్ఞాన ఘనుడైన రాముడు
నానావిధ తత్త్వములగు నాధుడు పుత్రా.

—అని విశదపరచెను.

సీతాదేవి హనుమంతునకి రహస్యముల బోధించుచు 'సుతా, పుత్రా, హంసా, మహాత్మా' అని ఆదరముతో పిల్చినట్లే శ్రీరాముడుకూడ అట్టి అప్యాయతతో హనుమంతునకు స్థూల సూక్ష్మ కారణ శరీరాది విశేషములను బోధించగా, హనుమంతుడు తనకు ఉపాసనాక్రమమును ఉపదేశింపుమని కోరెను.

"ఏ నియమంబులుం గలిగి యే సమయంబున నెవ్విధంబున
న్స్నానము పూనియో యదియు మానియో మంత్రము తంత్ర మెద్దియో
నీనయ రూప మారయగ నిర్గుణమో సగుణంబో నెమ్మదిన్
ధ్యానము సేయగా వలయు నన్నియుఁ బ్రేమ నెఱుంగఁ జెప్పవే.

—అపుడు రాముడు 'శరీర ప్రాణ బుద్ధి చిత్తాహంకారములే ఆత్మ అనియు, తనకంటే ఈశ్వరుడు బ్రహ్మవిష్ణ్వాది రూపములలో వేరుగా నున్నాడనియు, తానుపాసకుడననియు తలచు అజ్ఞానికి దేశకాల నియమాదులుండును. ఈ దేహాదులజూచు సాక్షినిగాని నేను దేహాదులగాను అను వివేకికి దేశకాలాది నియామాదులక్కరలేదు. కావున బ్రహ్మమును స్వాభిన్నునిగా జూచువానికి

దేనితోను పనిలేదు సాక్షికి సాక్ష్యవికారము లంటవు" అని బోధించగా దానిని వినుచు హనుమ 'చిత్రరూపమట్లు చేష్టలుడిగి తనువు మఱచి కొంత తడవూరకుండె.' అంత రాముడానందించి హనుమంతుని అలింగనమొనర్చు కొనెను. హనుమంతుడు శ్రీరాముని వివిధ శ్లోకములతో, దండకముతో స్తోత్రమొనర్చి 'జీవబ్రహ్మైక్యజ్ఞానము' హృదయముననిలుప వేడి 'అనవరతము నెఱయ నామది నీయందు నిల్వజేయు రామ' అని ప్రార్థించెను. రాముడు సంతసించి పావనికి అమనస్కయోగము బోధించెను. "పరమ భాగవతోత్తమా, నీవు దేహాద్యతిరిక్తుండ వగుటంజేసి జన్మాస్తిత్వ వృద్ధిత్వ పరిణామాపక్షయ వినాశంబులును, బాల్య కౌమార వయో జరావస్థలును, వర్ణాశ్రమ కుల గోత్ర నామ రూప దేశకాలాదికంబులును, స్థూలత్వ కృశత్వ హ్రస్వత్వ నీలత్వ రక్తత్వాదికంబులును, నిరింద్రియుడవగుటంజేసి వచనాదాన గమన విసర్గానంద కర్మంబులును, శబ్దస్పర్శరూప రసగంధ విషయ సంగంబులు, అప్రాణుండ వగుటంజేసి చలన ధావన కంపనా కుంచన ప్రసారణాదికంబులును, క్షుత్పిపాసాదికంబులును, అమనస్కుండవగుటంజేసి సంకల్పవికల్పంబులును, రాగ ద్వేష కామక్రోధలోభ మోహ మదమాత్సర్యేర్ష్యాసూయాదంభ దర్పాహంకారేచ్ఛా తృష్ణా వివికిత్సా లజ్జా దయా భయ శోక ధైర్యాధైర్య దైన్యాదికంబులును, నిత్యానిత్యవస్తు వివేక వైరాగ్య శమదమోపరతి తితిక్షా శ్రద్ధా సమాధాన ముముక్షుత్వ శ్రవణమననిదిధ్యాస జ్ఞానాదికంబులును ధీవిలక్షణుండవు నిరహంకారుండ వగుటంజేసి వక్తృత్వ ధాతృత్వ గంతృత్వ విసర్జయితృత్వానంద యతృత్వబులును, శ్రోతృత్వ స్ప్రష్టృత్వ ద్రష్టృత్వ రసయితృత్వ ఘ్రాతృత్వంబును, కర్తృత్వ భోక్తృత్వ స్మర్తృత్వ జ్ఞాతృత్వ మంతృత్వ హంతృత్వ ప్రమాతృత్వ ధాతృత్వాకంబులును నీకు లేవు;నీకు కేవల శుద్ధచిద్రూప ప్రత్యగభిన్న బ్రహ్మచైతన్య ప్రకాశమాత్రుండవు గావున 'నేను శరీరేంద్రియ ప్రాణబుద్ధి చిత్తాహంకారంబులును గాను; స్వయంప్రకాశ సచ్చిదానంద స్వరూప మాత్రుండ'నని నిన్ను నీవు విలోకించు సమాధి సమయంబున సకల వికార సమన్విత మనోరహితుండవు; భూతభవిష్యద్వర్తమాన కాలంబుల నివ్విధంబున ప్రకాశించుచుండుటవలన నిరంతరంబును నిర్వికల్పుడవై యేకరూపుండవై యున్నావు. ఇదియే సర్వవికారశూన్య సహజామనస్క రాజయోగసమాధి" అని బోధించి. "పరమేశ్వరుండైన నా నెమ్మనంబున పరమ నిక్షేపంబుగా ప్రకాశించు సర్వోపనిషత్సార భూతంబైన యీ దివ్య జ్ఞానంబును మద్భక్తుం

డవు, మత్పూజాపరుండవు, మదర్పిత మనోబుద్ధివి, మత్పరాయణుండవు నగుటంజేసి నీకుపదేశించితి, నింతకంటె రహస్యంబైన యర్థంబు నాడెందబున లేదు" అని పూర్తిగా విశదీకరించెను. సకలజ్ఞానసారమగు శ్రీరాముని పలుకులను మనోగమ్యమొనర్చుకొని శ్రీరామరూప పరమాత్ముని పలురీతుల ప్రస్తుతించి హనుమంతుడు శ్రీరామునిచూచి—

దేహబుద్ధ్యాస్మి దాసోహం
జీవబుద్ధ్యా త్వదంశకః
ఆత్మబుద్ధ్యా త్వమేవాహ
మితి మే నిశ్చితా మతిః

—అని పలికి, శ్రీరామునిచే సాదరముగా అనుజ్ఞాతుడై నిజాశ్రమమునకు వెళ్లెను.[179]

4 శతకంఠ రావణాసుర వధ

శతకంఠ రావణాసుర వధను గూర్చిగానీ, సహస్రకంఠ రావణాసురుని గూర్చి కానీ శ్రీమద్వాల్మీకి రామాయణమున లేదు. పరాశరసంహితలోను, మర్దనకవి రచించిన సీతావిజయము అను నామాంతరముగల శతకంఠ రామాయణములోను, ఆశ్చర్య రామాయణము, అద్భుతోత్తర రామాయణము, సమీరకుమారవిజయములలో నున్నది. ఈ కావ్యములన్నిట కథ రమారమి ఒకటిగానే యున్నది. స్థలముల పేర్లు, మానవుల రాక్షసుల పేర్లు, సన్నివేశముల క్రమము మొదలగు వానిలో స్వల్పముగా భేదములున్నవి. ఇవి సీతా మాహాత్మ్యమును, హనుమంతుని జవసత్వాది వినయ సౌశీల్యములు, రామకైంకర్యపరత్వమును, అసాధ్య సాధనాదక్షునిగా అతనిని చిత్రించుటకును రచింపబడినవి.

పరాశరసంహిలోని కథ : శతకంఠుడను రాక్షసుడు కశ్యపపుత్రుడు. బ్రహ్మరుద్రాదులచే వరములపొంది గర్వితుడై యుండెను. వీడు లోక కంటకుడై మునుల బాధించుచుండెను. యక్ష రాక్షస కిన్నర కింపురుష దేవ గంధర్వ నర వానర పురుషుల చేతిలో తనకు మరణము సంభవించ కుండునట్లును, తన రక్తము నేలమీద పడినచో తనవంటివారు నూర్గురు ఉద్భవించునట్లుగను వీడు పొందిన వరములలో ముఖ్యములు. వీని బాధల

పడజాలక సాధువులగు ఋషులు శ్రీరాముని శరణువేడిరి. అయోధ్యకు కడు దూరముననున్న వీని పురము అంతరిక్ష పురము. దీనిని చేరుటకు అనేక సముద్రములను దాటవలసియుండెను. సాగరతీరము చేరిన తర్వాత పదివేల అమడల దూరముననున్న వీని పురమునకు వారధి కట్టుటకు సాధ్య పడదని రాముడు చింతించుచుండగా మారుతి తన వాలమును పెంచి అంతరిక్ష పురమునకు దానిని వంతెనగా ఉపయోగింపుమని తెలిపెను. రాముడంగీక రించగా హనుమంతుడు వాలసేతువు నిర్మించగా ఆ వాలమందలి రోమము లలో నక్షత్ర గ్రహాదులన్నియు దర్పలయందు మంచుబిందువులున్నట్లుండెను. రాక్షసుని పట్టణ ప్రాకారము అగ్నిమయము. అది పరాక్రమముచే సాధ్య పడునదికాదు. ఏమి చేయవలయునో అని చింతించు రాముని వద్దకు హను మంతుడు చేరి ఉగ్రుడై ఆ ప్రాకారాగ్నిని సముద్రములో పడవైచి ఆ పట్ట ణము లోపలివరకు తన తోకను విస్తరించెను. ఆ వాలసేతువుద్వారా చతు రంగబలములు, రామానుజులు ముప్వురు, సీతాసహితుడైన రాముడు ప్రవే శించిరి. శతకంఠునితో పోరాడి రామాదులు మూర్ఛపోయిరి. మూర్ఛ నొందిన తనవారినిచూచి సీత చింతించుచుండగా గర్గముని సీతాదేవికి హనుమ ద్ద్వాదశాక్షరీ మంత్రముపదేశించెను. అపుడామెయే వానితో పోరాడుటకు సిద్ధపడెను. యుద్ధరంగమున రాక్షసుని ప్రతి రక్తబిందువు నేలమీాద పడునపుడెల్లచో సూర్గురు శతాననులుద్భవించుటను సామీరి చూచెను. అంత అతడు పంచముఖుడయ్యెను. ఒక్కొక్క ముఖమునకు మూడు నేత్రములు, ఒక్కొక రూపమునకు ఆయుధసహితమైన పదిచేతులుండెను. అపుడతని ముఖము త్రిపురాసుర సంహార సమయమున రుద్రునివలె ప్రకాశించెను. ఎందరు శతాననులుద్భవించెడివారో అందరు పంచముఖాంజనేయు లుద్భవించ సాగిరి. హనుమ సీతాదేవిని తన భుజమున వహించగా ఆమె కాళీస్వరూపమై శతకంఠునితో యుద్ధమొనర్చెను. రాక్షసుని రక్తం నేలపై పడకుండా హనుమంతుడు తన తోకను విస్తరించి రక్తబిందువులు నేలమీాధ పడకుండా చేయగా, రాముని మహిమపై, తన పాతివ్రత్యముపై శపథముచేసి సీతాదేవి వానిని అగ్నిజ్వాలలవంటి బాణములతో సంహరించెను. దేవతలు పుష్ప వర్షము కురిపించి దుందుభుల మ్రోగించగా ఆ శబ్దములకు దాశరథులు లేచిరి. రాముడు సీతను, హనుమంతుని వారివారి విశ్వరూపముల చూపుమనికోరెను.

అపుడాంజనేయుడు మేము మా విశ్వరూపములను చూపినచో మీరు భీతిల్ల గలరు అని అనగానే రాముడు వారిని కొనియాడెను.[180]

సమీరకుమారవిజయోక్త కథ : రాముడయోధ్యలో సామ్రాజ్యము చేయుచుండగా అగస్త్యుడతనిని సందర్శింపవచ్చి రావణుడాదిగాగల రాక్షసుల నిర్మూలించినందుకు రాముని కొనియాడుచుండగా ఆకాశవాణి ఆ సందర్భంలో "ఓ జననాథా! దశకంఠుని జయించినందుకే ఇంతటి ఆనందము చెందుచున్నారే దధిసముద్రముచేత ఆవరించబడిన మాయాపురిలోనున్న శతకంఠుడనుదైత్యుడు నిన్ను గెలువవలెనని యున్నాడయ్యా!" అని పలికిన పలుకులు వారందరును వినిరి. అప్పుడు అగస్త్యుడు ఆ రాక్షసుని వృత్తాంతమును శ్రీరామునకు విన్నవించెను. వసువను దైత్యాంగన అసురసంధ్యాసమయములో కశ్యపుని కూడినందున శతకంఠుడు జన్మించెననియు, వాడు బ్రహ్మ రుద్రాదుల వర ప్రసాదముచే గర్వితుడై మాయాపురమును రాజధానిగా చేసుకొని పరిపాలించు చున్నాడని తెలిపెను. అంత రాముడు 'దుస్తరములైన బహు తోయధులఁ దరించి వైరి నేరీతిఁ జీరువార'మని సంశయించి, సోదరత్రయముతో ఆలోచించి మారుతినిచూచి ఇట్లు పలికెను. 'వాయుకుమారా, సారజవశౌర్యోత్సాహ బాహాబలోపాయశ్రీల భవత్సమాను డీ లోకములోనే లేడు. ఏ ప్రయత్నములో నైనా నీవు సమర్థుడవు. నీవు ఏకపాద రుద్రాంశ సంభూతునివి. నీచే కాగల కార్యమునుగూర్చి యింత ఉపేక్షింపదగునా' అని అనెను. అంత హనుమ—

" .... అపార కృపావనరాసులైన మీ
కీ వనరాసులెంత ననునెక్కి సహోదర సైన్యయుక్తి న
ద్దీవికి దాటిపోయి పగదీర్పుము"

—అని బదులాడగానే రాముడు ఆనందించి 'ఏకడ నీ మగటిమి కాక మఱి గలదే' అని మెచ్చి అతనిని కౌగలించెను.

సర్వసైన్యముల సమీకరించి రాముడాజ్ఞాపించిన వెంటనే హనుమంతుడు అజాండమంతా నిండిపోవునట్లు విరాడ్రూపము వహించెను. చుక్కలతని మొలపూసలై దిక్కులకు అవకాశములేని దివ్యాంగము ప్రకాశించెను. అతని ఒక జంఘకు సప్తసాగరాలు చాలవయ్యెను. ఒక చక్కని భానుచక్రాది మండలము చాలదయ్యె. ఒక ఘట్టనకే ఆదివరాహ శేషులు ఓర్వలేరైరి.

అతని వితిక్రమోపక్రమమున బ్రహ్మాండపేటి నిండినది. ఆంజనేయుడు తాను 'కదిలితే ఊర్ధ్వలోకాలు చూర్ణం కాగలవని,' చక్కగా నిక్కితే కర్పరంబు పడి పోవునని, పాదము గట్టిగా మెట్టితే ఆదికూర్మమడుగంటుననీ, బిగువు చూపితే దిశావలయము బీటలువారునని, రాక్షసవధకై పెంచిన తన తనువును నిగ్రహించుకొని సమస్త లోకోపకారసిద్ధికై —

"ఒక్క దిక్కున ఘనమూర్తి నొందియున్న
నవని యెక్కడ గ్రుంకునో యతి భరమున
ననుచుఁ గకుబంతముల నెల్ల నావరించె"

—అపుడతని బృహత్ కాయాన్ని 'జక్కగ గనలేరవ్వేళ బ్రహ్మాదులున్.' ఆ రూపాన్ని ఆశ్చర్యంతో తిలకించుచు విభీషణుడు ఆపదుద్ధారకమనే మంత్రాన్ని పఠించి పొగడుచుండగా, 'అయ్యో, నీవు నా మంత్రివని తలంచిన దుర్మదుని గదా' అని సుగ్రీవుడు చింతించి క్షమాపణ కోరుచుండగా, సాక్షాత్తు త్రివిక్రమావతారమే యిది అని జాంబవంతుడనుచుండగా 'ఇంతవాడై గర్వమింతయుఁ గన'డని రాముడు తలయూచుచుండగా, సీతాదేవి కనులు మోడ్చుచుండగా, తక్కినవారాశ్చర్యపడుచుండగా ఆంజనేయుడు దీర్ఘరూపము వహించెను.

రాముడెక్కుటకై హనుమంతుడు తన దేహము వంచగా ప్రభువు ముందుగా సీతాదేవిని ఎక్కించి, మిగత వానరులను హనుమపై ఎక్కమనెను. అపచారమొనర్చుటగా భావించి వారు సంశయించుచుండగా రాముడు వారిని ఆదేశించినంతనే వారు మొత్తం సైన్యము వాయుపుత్రుని వీపుపై అధివసించిరి. హనుమంతునితోక తుదిభాగం 'చుక్కలబెడంగు దొరసి మెరసింది.' ఆసీనుడైన రామునకది ముత్యాల గొడుగువలె భాసించెను. గగనగంగ హనుమంతునకు తనవారి 'లహరీఘుమంఘుమ' స్వరములతో సేసలు పెట్టింది. ఆనదిపై అంజనేయుని కాంతి పర్వి ఆమె ఎఱ్ఱబారెను. సీతారామసహిత సైన్యముగా క్షీరసాగరము, ఇక్షురసవార్ధి, సుధాజలధి, ఘృతవారాశి అను నాలుగు సముద్రాలను అవలీలగా లంఘించి మాయాపురమును చేరెను. త్రినేత్రుడైనా తేరిచూడజాలనట్టి శతకంఠుని హేమపుకోటను మారుతి తృణీకరించి చేరగలిగెననియు, జగదాభీలప్రయాణోద్ధతితో నభోమార్గములో దైత్య వానర నరేంద్రానీకములను, చతుస్సాగరములను దాటించి శత్రుపురము చేరడానికి ఆంజనేయునికితప్ప ఇంకొకరికి చేతకాదనియు, కామరూపతకల్గిన హనుమంతుని

జంగకు భువనజాలములే చాలవనియు, ఇట్టి మహాబలుడానాడు లంకకువేరుట ఆశ్చర్యము లేదనియు, నాడు హనుమయే విజృంభించి యుండినచో రావణ కుంభకర్ణాదులుండెడువారా అనియు ఆ సందర్భమున ప్రయాణమధ్యములో రాముడు సీతకు తెలిపెను. మరియు 'నా కీర్తి భూజనులెంచుటకై నాకు సాహాయ్యుడై ఉండినాడే కానీ హనుమ కసాధ్యమైన దేదియును లేదు. ఆకాశ మార్గంలో ప్రయాణంచేస్తున్న మనకు ఇందలి వింతలు చూడడంకోసం ఇతడు తన వేగాన్ని కావలెననియే తగ్గించెనేకాని నిజముగా మన మారుతి తలంచినచో ఈ దీవి ఒక నిముష గతికి కూడ చాలదు" అని తెలిపిన పతి మాటలకు సీత హనుమంతుని మెచ్చుకొనెను. వారి ఆదేశముపై వాయుకుమారుడు మాయా పుర ఉపవన సమీపములో సేనావాహినిని దింపెను.

వెక్కసమైనందున రాక్షసులు ఆంజనేయుని ఎదిరింపవచ్చిరి. దండ పాణులైన మాయాపుర సైనికులు మ్రగ్గిపోయిరి. అజాండము నిండిన దండి మేనుగల ఆ కోతిని రెండు నెలలు నిర్జించిరేకాని గెలువలేకపోయిరి. మంత్రుల ద్వారా వార్తవిని శతాననుడు సమర సంరంభముతో అక్కడికిచేరగా వానిని చూచుచు రాముడు మహాద్భుతమొంది చూచుచునేయుండెను. అంత పావని రామునిచూచి 'స్వామీ, ఆద్యంతవిదూరవిగ్రహులు, తత్త్వవిదులును అయిన తమరు ఈ రాక్షసుని వింతగా చూడనేల? మీకు వీడు ఎదురుండ గలడా? వీనిని గూర్చి చింతించుటమాని శత్రుహృతి వేయుట మంచిది' అని తెలిపెను.

హనుమ శతకంఠునిచేరి 'తినురా' అని ఒక్కసారిగా వాని రొమ్ముమీద పొడవగా వాడు నాగిలి భూమిని త్రెళ్లి, లేచి అంజనేయుని చూచి 'త్రిజగద్భయ దాంగుని నన్ను నొంచె నీ పిడికిటిపోటు బెట్టిదము పేర్కొన శక్యమే వాన రోత్తమా' ఎల్లలోకాలు తిరిగినా ఇంత ముష్టిబలముగల దెబ్బ నేను చూడలేదు అని హనుమంతుని పొగడి తన శూలపువాడిని చవిచూడమని అంజనేయునిపై విసరెను. దానిని హనుమ 'తృణలీలఁ బాదహతిఁ ద్రుంచెను' వాడు తన ఇన్నూరు చేతులతో ఎన్నో ఆయుధాలను అంజనేయునిపై వేసెను. వాటి నన్నింటిని వాయుకుమారుడు త్రుంచివేసెను. ఇంతలో సుగ్రీవ విభీషణులు వానిపై శైలములను శస్త్రాదులను వేయగా వాడు వాటిని త్రుంచి తన పాద ముతో వారిని చిమ్మగా ఎగిరివచ్చి వారు లంకాద్వీపంలో పడిరి. అపుడది

చూచి హనుమ 'ప్రాలన వారికై తన వాలము చాచి నాలుగు సముద్రాలకు
సేతువు కట్టగా ఆ మార్గంలో వారు తిరిగివచ్చి హనుమంతుని పొగడిరి.
వాయుపుత్రుని వాలసేతువును చూచి ఆ ద్వీపవాసులు భయమందిరి.—

వదలడు సమరోదగ్రత(
గదలడు తానున్నచోటు గగనాంతరమున్
దుదగన్న మేనితో సత
డు దధులపై వాలసేతు వొదవించు నెడన్.

—మరల తిరిగివచ్చిన దైత్యవానరసంఘాన్ని శతకంఠుడు బాధింపగా
వారందరు కాందిశీకులై పారిపోగా రామానుజులు ముగ్గురును వాని నెది
రించిరి. నాలుగు నెలలు వానితో వారు పోరాడినను వాడు బలహీనుడు
కాలేదు. సోదరులు అలసిపోవుటచూచి రాముడు వారిని విశ్రాంతి గొనుమని
చెప్పి తాను ఆంజనేయుని చరమాంగాగ్రస్థితుడై యుద్ధానికి దిగెను. వారి
యుద్ధము అతిభీకరముగా నుండెను. రామబాణహతి వలన స్రవించిన ఒక్కొక్క
రక్తబిందువునకు ఒక్కొక్క శతాననుడుద్భవించి రాముడువేయు మహిమాన్విత
అస్త్రములనన్నింటిని త్రుంచుచుండగా ఆ అందరికీ అందరైన రాముల్లో
యుద్ధం చేయుట అంజనేయునకొక్కనికే తెలియును. అప్పుడు హనుమ 'మహి
మాధికుడై వీరరసమావేశించగా' వాని రక్తబిందువులను తన పదఘట్టనలతో
నేలరాచి నాశనం చేసేవాడు. ఈ సందర్భమున హనుమ చూపిన పరాక్రమము
పరాకాష్ఠ చెందగా "అప్పంచముఖకపి వియచ్చరుల కచ్చెరువును శతముఖ
శతశతకంబులకు రౌద్రంబును, తచ్చమూపతులకు భయానకంబును, నిజసైని
కులకు సంతసంబును స్వామికి భృత్యభావంబును సుగ్రీవునికి సౌహార్దంబును
కనిపించుచు పెంపుమీరినది. యుద్ధరంగమున పడిన మాంసరక్తమేదో పలల
ముల నారగించు భూతతతులు "అనుమయ్య దయ సమగ్రంబు" అని స్తుతించు
చుండగా యుద్ధము భీతివిస్మయ భీభత్సహేతువయ్యెను. పోరులో అలసట
చెందిన రాముడు తన కోదండమును సీతకివ్వగా ఆమె బాణములకు శత
కంఠుడు మరణించెను. దీనిని చూచిన వేల్పుదొరలు శ్రీ సీతారామాంజనేయు
లను ప్రణుతి చేయగా సీత తన చేతివిల్లు సౌమిత్రికందించి రామునకు
మ్రొక్కెను. శతకంఠవధ చేసినందుకామెకు బహూకృతిగా రాముడామెకు
మణిహారమును ఇవ్వగా, సీత రాముని చూచి—

"ఘోరాస్త్రాహతమైన శాత్రవుని క్రొన్నెత్తుటన్ బుట్టి పెన్
బారుల్ దీరు శతాస్యకోటిమశకప్రాయంబుగా స్వాంఘ్రి సం
చారస్ఫూర్తి నడంగ ద్రొక్కిన నభస్వత్స్వాతికే గాక నీ
హేరంబన్యులు దాల్ప నర్హులె త్రిలోకాశ్చర్య చర్యాధికా"

—శతకోట్యర్బుద సంఖ్య శతకంఠుల చంపిన సామీరి ఒక్కనిని చంపలేదంటే జగత్త్రాతా నన్ను—

"స్తుతి గావింపదలంచిగాక మనకున్ సూనుండు సద్బంధుడున్
హితుడున్ భృత్యుడమాత్యుడాప్తు డికలేడేతాదృశం డెయ్యడన్."

—అని పలికి "మనకు ప్రాణనందనుడే బహిఃప్రాణము; యుద్ధములో మనకు ఎన్నో మహోపకారాలు చేసినవాడు, దూతయై మన ప్రాణాలు నిల్పినవాడు, మిమ్మే మదిలో నుంచుకొని మనోవాచాకర్మణా అన్నీ మీ అడుగుజాడలలో నడిచి కార్యాలు చేసినవాడు. ఈ ఋణంబేజన్మలో దీర్చుకోగలమో నృపాలాగ్రణీ." అస్త్రపరాక్రమములో సాటిలేనివారు తమరు. తమరి తర్వాత ఈ హనుమయే శ్రేష్ఠుడు.

ఏ రమ్యమతి సత్కథా రత్నముల్
ఘనమతుల్ కంఠ భాగమున దాల్తు
రే మహామహు దృష్టి కీరేడు లోకంబు
లసదు కుండల దొంతులై కనబడు
నే వీరవరు దేహ మావహించిన దీప్తి
మిహిరాదులకు మిరుమిట్లు గొలుపు
నే కపీంద్రుని యున్కి మీకీర్తి వల్లికా
జాలకంబున కాలవాలమయ్యె

కంఠ చరమాంగ ఫాలభాగముల మనుజ
దనుజ వానరసేనల దాల్చె నెవ్వ
డట్టి విశ్వాధికునకు మీ యనుగు బట్టి
కాంజనేయున కొసగుడు హారమనిన.

—రాముడు తనకు ప్రేమైక పాత్రుడు, బహుకార్య నిర్వహణతాభీరు ప్రభావ ప్రతాప యశశ్చిత్ర చరిత్రుడగు హనుమంతుని కారుణ్యముతో చూచి "నీవు

మమ్ము మాతా పితృభావముల గొలిచి ప్రబలినావు కాన భావి బ్రహ్మ పద శ్రీ ప్రోవంగల మహిమ నింక బొందెదు తండ్రీ, "బ్రహ్మాండోద్ధరణ ప్రసక్తి మనుమా భాషాధృతిం పుత్రకా" అని పలికి ఆ హారమతని కందించెను. ఆ హారము పూర్వచరిత్రను రాముడు వివరింపబూని "ఆదినారాయణుడు దీనిని సృష్టికర్తయగు బ్రహ్మకిచ్చెను. ఆయననుండి ఇక్ష్వాకునకు లభించగా దాని నాతడు పట్టాభిషేకవేళలో ధరించెను. తదాదిగా ఇక్ష్వాకులకిది వంశపరం పరగా వచ్చుచున్నది. చక్రవర్తులచే ధరింపబడిన ఈ హారమును అన్యులు ధరింప నర్హులుకారు. ఇది కామరూపాన్వితమై సార్వభౌమ చిహ్నముకలది. దీనిని ధరించుటకు నీవే అర్హుడవు" అని చెప్పి హనుమంతుని కంఠమునందు తానే స్వయముగా వేసెను. రాముడు కోరినందున వారినందరిని శివదర్శనమునకై కైలాసమునకుజేర్చి భక్తిసలిపి తిరిగి వారిని సాకేతనగరమునకు చేర్చెను. రాజమాతలు శతకంఠు నెట్లు వధించితిరో తెల్పుమని కోరగా. రాముడు వారికి హనుమను చూపి,—

మట్టుమీరిన మహామహిమమై చదలెల్ల
గప్పిన లోక విఖ్యాతుడితడె
లెక్కకెక్కువయైన పెక్కు సేనల మేన
సంభరించిన మహాసత్వుడితడె
నిమిషములో సముద్రములెల్ల గ్రమియించు
సరిలేని ఘన వేగశాలి యితడె
శాకాంతరీప భూస్థలినుండి లంకకు
త్రోవ నేర్చిన జగద్వంద్యుడితడె
అప్రమేయ ధృతి శతాస్యకోటుల గాల
పెట్టినట్టి గట్టిదిట్ట యితడె
వేయి మాటలేల వినుడు పోరున మాకు
విజయమిచ్చినట్టి వీరుడితడె.

—అని తెలుపగా వారును, తక్కిన వారును హనుమంతుని సన్మాన వాక్యములతో ఆదరించిరి.[181]

శతకంఠ రామాయణ కథ ప్రకారం: పులస్త్యునికి విశ్రవసుడు, అశ్రముడు అని ఇర్వురు కుమారులు. విశ్రవసుని పుత్రులే రావణాదులు.

అశ్రముడు చిత్రవతి అను గంధర్వకన్యను తగుల్కొని సంతానము కొఱకై తపము చేసెను. వీని కుమారుడే శతకంఠుడు. వీడు నూరు తలలతో ఇన్నూరు చేతులతో పుట్టెను. రామునిచే రావణాదులు వధింపబడిన వార్త విని వీడు బ్రహ్మను గూర్చి తపమొనర్చెను. "యక్ష రాక్షస గరుడ గంధర్వ సిద్ధ విద్యాధర కిన్నర కింపురుష సుర, నర, వానరాదులలో పురుషులవలనను, మృగాండజ భుజంగమ లోకములవలనను, మీన మర్కట మకర కచ్ఛపేత్యాదులగు జలచరముల వలనను తనకు మరణము లేకుండా కోరుటేకాక 'రణంబు సేయునెడఁ దన శరీరంబునఁగల శోణిత కణంబెచట దొరంగు నచట నూర్గురు శతముఖులు జనించునట్లుగాను జరయు, శ్రమయు, పరితాపంబులు, భయంబును, దైన్యంబును, నెన్నండును దన్నుం బొరయకుండునట్లును వరములను కోరి పొందెను. లోక కంటకుడైన వీనిని వధించుటకై ఉపాయమాలోచించుచు రాముడు హనుమంతుని స్మరించెను. వెంటనే గంధమాదనము నుండి వచ్చి వాలిన హనుమంతునితో ఏకాంత సౌధమున వీభీషణాదులతో చేరి హనుమకు ఈ రాక్షసుని చరిత్ర తెలియజేసెను. అంత హరీశుడు 'బంటును నన్ను పంపినచో వెళ్లి వానినిపుడె వధించి వత్తు' ననెను. తన పరాక్రమునకు దేవతల వరాలు శ్రీరామసేవకారణమని తెలిపి తన వాలము మీద సేనలు సముద్రములు దాటివెళ్లవచ్చునని తెలిపి తన విరాడ్రూపం చూపి 'రేపు మీ పేర చంద్రతారాబలములు బాగున్నవి" అని స్పష్టపరచి .రామునివద్ద సెల వొంది తన విడిదికి వెళ్లి శివుని ధ్యానించి అతనిని ప్రత్యక్షము కావించుకొని పూని ప్రళయకాలంబున మీఁదు విశ్వరూపంబుదాల్చునెడ మీ యందెట్టి మహిమంబు ప్రవర్తిల్లునట్టి దుర్నిరీక్ష్యంబగు తేజంబును వివిధ శిలీముఖా ప్రతిహతత్వంబును కోరి," తదనుగ్రహమున వానిని పొందెను. తర్వాత తన తండ్రియగు వాయుదేవుని ప్రార్థించి అతనిని కూడ ప్రత్యక్షము కావించుకొని అతని వలన అసదృశజవమును, అభేద్యసత్త్వమును పొందెను. మరునాడు శ్రీరామ విభీషణులవద్దకు వచ్చి వారి వద్ద తన బృహద్రూపాన్ని చూపగా, ఆ రూపాన్ని సుమంత్ర ప్రముఖ ప్రధానులు నిరీక్షింపజాలిరి; రామానుజులు ఆశ్చర్యముతో నిర్విణ్ణమనస్కులైరి. రాముడతని ఘన రౌద్రరేఖా విశేషంబుల జూచి అతని సహాయముతో శతకంఠుని చంపుటకు సందేహింపఁబని లేదని నిశ్చయించి తన కంఠములోని దివ్యరత్నహారము తీసి హనుమంతుని గ్రీవము నలంకరించి, లక్ష్మణుని వెంట పంపి సకల వానర సైన్యముతో సుగ్రీవుని

మమ్ము మాతా పితృభావముల గొలిచి ప్రబలినావు కాన భావి బ్రహ్మ పదశ్రీ బ్రోవంగల మహిమ నింక బొందెదు తండ్రీ, "బ్రహ్మాండోద్ధరణ ప్రసక్తి మనుమా భాషాధృతిం పుత్రకా" అని పలికి ఆ హారమతని కందించెను. ఆ హారము పూర్వచరిత్రను రాముడు వివరింపబూని "ఆదినారాయణుడు దీనిని సృష్టికర్తయగు బ్రహ్మకిచ్చెను. ఆయననుండి ఇక్ష్వాకునకు లభించగా దాని నాతడు పట్టాభిషేకవేళలో ధరించెను. తదాదిగా ఇక్ష్వాకులకిది వంశపరం పరగా వచ్చుచున్నది. చక్రవర్తులచే ధరింపబడిన ఈ హారమును అన్యులు ధరింప నర్హులుకారు. ఇది కామరూపాన్వితమై సార్వభౌమ చిహ్నముకలది. దీనిని ధరించుటకు నీవే అర్హుడవు" అని చెప్పి హనుమంతుని కంఠమునందు తానే స్వయముగా వేసెను. రాముడు కోరినందున వారినందరిని శివదర్శనమునకై కైలాసమునకుజేర్చి భక్తిసలిపి తిరిగి వారిని సాకేతనగరమునకు చేర్చెను. రాజమాతలు శతకంఠు నెట్లు వధించితిరో తెల్పుమని కోరగా. రాముడు వారికి హనుమను చూపి,—

మట్టుమీరిన మహామహిమమై చదలెల్ల
గప్పిన లోక విఖ్యాతుడితడె
లెక్కకెక్కువయైన పెక్కు సేనల మేన
సంభరించిన మహాసత్వుడితడె
నిమిషములో సముద్రములెల్ల గ్రమియించు
సరిలేని ఘన వేగశాలి యితడె
శాకాంతరీప భూస్థలినుండి లంకకు
ఖాల మర్చిన జగద్వంద్యుడితడె
అప్రమేయ ధృతి శతాస్యకోటుల గాల
పెట్టినట్టి గట్టి దిట్ట యితడె
వేయి మాటలేల వినుడు పోరున మాకు
విజయమిచ్చినట్టి వీరుడితడె.

—అని తెలుపగా వారును, తక్కిన వారును హనుమంతుని సన్మాన వాక్యము లతో ఆదరించిరి.[181]

శతకంఠ రామాయణ కథ ప్రకారం : పులస్త్యునికి విశ్రవసుడు, అశ్రముడు అని ఇర్వురు కుమారులు. విశ్రవసుని పుత్రులే రావణాదులు.

-మని కోరిరి. హపుడు మారుతి మహా[ద్రూపం ధరించి పుష్కరద్వీపానికి గసి పోయెను. దారిలో పుష్పకవిమాన మెదురుపడగా తన బృహ[ద్రూపం డి సాధారణ రూపంధరించి వారిని కల్సుకొని శ్రీరామునికి [శమనిచ్చిన హ[స్రకంతుని 'గూల్పగల్గిన సీతా వధూటి'ని [ప్రస్తుతించెను.[184]

అయోధ్యలో శ్రీరాముని సేవలో హనుమంతుడెట్లుగడిపెనో శ్రీమ[ద్రా ాయణమున తెలియదగు విషయమే లేదు. ఉత్తరకాండములో వాల్మీకి కవి ానుమంతునికి శ్రీరాముడు వరములనిచ్చినట్లు మాత్రం ఉన్నది. రాము ానర్చిన అశ్వమేధయాగమున ఆంజనేయుడెట్లుతోడ్పడెనో, సవనాశ్వ రక్ష కు వెళ్ళినట్లుగను లేనేలేదు. పరాశరసంహితలోను, సమీరకుమార జయమునను కుశలవులు శ్రీరాముని అనుచరులతో పోరినట్లు వర్ణింపబడి ఉండలేదు. ఆశ్చర్యరామాయణమున అనేకమైన కల్పనలు హనుమంతుని ాప్పతనమును [ప్రకాశింపజేయునవిగా తెలుపబడియున్నవి. సమీరకుమార జయమున హనుమంతుని దినచర్య వర్ణితమైనది. పై కల్పనలకు వాల్మీకి ర్తకాడు. ఏ ఆధార [గంథమునుబట్టి పై కల్పనలను ఇతర కవులు [ప్రవేశ ట్టిరో చెప్పుటకు విశేషమైన పరిశోధనయే శరణ్యము.

విభీషణాది దైత్యవీరులను, కపి[శేష్ఠులను వారివారి స్థానములకువెళ్లుటకు ాముడనుమతించిననూ హనుమంతుని తనవద్దనే ఉంచుకొనెను. హనుమ ాడ రాముని యెడబాయకుండా ఉండెడివాడు. "సహాసన మజ్జన భోజనాది యన గమనుడై" రాముడుకూడ హనుమంతు నెడబాసియుండెడివాడు కాదు. ాముడు ని[ద్రలేచుటకు ముందే హనుమంతుడులేచి 'రాముడల కేళికారామ ామి వెడలఁ బాదుకల చప్పుడాలించి ఆ రాముని కేళీమందిర సజ్జ చలువరాతి న్నెపైనుండి లేచి సాష్టాంగమొనర్పగా' రాముతడనికి కైదండ యొసగి ాగెడివాడు. రాముడు సరయూనదిలో స్నానసంధ్యాజపాదుల నెరవేర్చు 'ని వచ్చుచో—

"భ[ద్రకరిపైఁ బరగు పతికి గొడుగుపట్టి పావని నడచున్"

—రాముడు ఏనుగునుండి దిగుచున్నయెడల హనుమ అతనికి చేయూత చ్చెడివాడు. సభలోనికి రాముడు రాగానే—

"పాదుకల వెంత దక్షిణ
పాదము కెంగేలఁ బూని భక్తి"

—వసించెడివాడు. కొలువులో ధర్మతంత్రము నలుపువేళలో, మంత్రము నిర్వహించుచో ప్రభువు ఆత్మను తెలిసి తదనురూపమనిషావిధానరీతిలో—

లలిత యథోచిత రచనా
కల్పనం దత్ప్రస క్తిఁ గార్యము

—తెల్పుచు 'పగటి కొలువున' వర్తించెడివాడు. కొలువు చాలించి రాముడు పీఠము దిగిన వెంటనే 'కడాని మెఱుంగు పాదుకలను' పావనియే స్వయముగా ప్రభువు పాదాలకు తొడిగెడివాడు. హనుమ దక్షిణభుజముమీద హస్తమిడి నగరిలోనికి వెళ్లుటయే రాముని అలవాటు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో రాముడు అతిసరళంగా వేదాంత రహస్యముల చెప్పుచో కించిత్కంపంబొందుచు హనుమ వాని నాలకించెడివాడు. త్రయ్యంతపదార్థ రహస్యములను వివరింపుమని స్వయంగా సామీరి కోరిన సందర్భములలో రాముడొనర్చు వ్యాఖ్యానములను వాయుజుడతి శ్రద్ధతో వినెడివాడు. తాను రచించిన శ్రీరామబిరుదు గద్యలను వందిమాగధులచే ప్రాణనందనుడే చదివించెడివాడు. తన శిక్షణలో నిపుణులైన వైణికులచే గీతప్రబంధములను పాడించెడివాడు. కావ్యములలో రసస్థితిగల భాగములను కవులచే చదివింపు జేసెవాడు. రామకైంకర్యరూప కథలను సభాసదులు పొగడునట్లు నియమించెడివాడు. కంబళాశ్వమతంగాది కథిత నర్తనాగమోక్తమతప్రౌఢి నధిగమించి తానొనర్చిన భరతశాస్త్ర క్రమములో చెలులను నటింపజేయుచు రాముని కొలువుచేసెడివాడు. కూర్మి పుత్రుడుగూడ చొరరాని శ్రీరాముని కేళికాకనక గృహోద్యానాది ప్రదేశములోనికి అనుమతింపబడి అంజనేయుడచటనే 'రేలు గమించెడివాడు.' రాముడొక్కక్కసారి 'హరువుగ నొక్కరాగమనుమానమా' అని అనినంతనే—

"స్వామికింపయిన పోలిక దాననంగ రాల్
గరిగి ఘళంఘుళార్భటిఁ జెలంగిన నీదగు రాగరక్తి మై
గరగెడు సౌధలక్ష్మి యని కౌగిటఁజేర్చు నృపాలు డెక్కడన్"

—రాముడు సీతాదేవి నిద్రలోనుండగా తాను నిద్రలేచి 'హనుమంతుడు గూడ కూర్కెకదా' అని పౌరపోత్కరవార్తల వినుటకై బయలుదేరుచో ఆ విషయము కనిపెట్టిన అంజనేయుడు తన ప్రభువు 'జాడపట్టుకొని గాఢ్పు కొమరుడుఁబోవు వీటిలో నింతట నంతటన్ నృపతి దృష్టికిఁ దోపక గూఢచాతురిన్.' రాజెంత

వీరుడై సను ఒంటరిగా వెళ్లుచో బంటు వెంటనంటివెళ్లుట కర్తవ్యమని తలంచియే హనుమ యాతనికి తెలియకుండా అనుసరించి వెళ్లెడివాడు. రాముడింటికి మరలివచ్చుచో చొప్పుదెలిసి అతనికన్న ముందుగాచేరి యేమియు యెఱుగని వానివలె తన తావులో పవ్వళించి నిదురపోయినట్లుగపడెడివాడు.

ఈవిధమైన దినచర్యతో చరించు హనుమంతుని చూచి రాముడొకనాడు 'రావోయి పావనీ' అని కరమూది భోజనశాలాంతరసీమకు తోడ్కొనిపోయెను. అపుడతనితోకలిసివెళ్ళలేక ఓసరించుచుండగా రాముడు అంజనేయుని హస్తము పట్టి 'నా పొత్తున ఆరగింతు వెటుపోవక' రమ్మని అహ్వానించెను. తన కుడి వైపున కూర్చొనబెట్టుకొని 'యుద్ధములందందరినీ మోసితివి కావున శరీరము బడలినదిగదా' అని హనుమంతునిచేతిని తాకుతూ, అతని కడిమిని పొగడుతూ, సారెసారెకతని ముఖముచూస్తూ, వాత్సల్యము ప్రసరింపజేస్తూ అంజనేయుని ముదబ్ధి తేల్చెను. అపుడు హనుమ—

మొగ మొక యింత వంచి కయిమోడ్పునఁ గుండల కాంతి చెక్కులున్
ధగధగ లీన దేవుని పదద్వయి జూచుచు నే వికారమున్
దగులని చిన్న రూపున నతండు గనంబడె రాము చెంగటన్
ముగుద తనంబు సద్వినయమున్ భయముఁ బ్రియముం బెనంగొనః.

— అపుడు సీతాదేవియే స్వయంగా వడ్డించుటకై రాగా రఘునాథుడు 'సర్వత్ర సుభోజ్యమస్తు' అని పలికి ప్రాణాహుతులు కాగానే అంజనేయుని చూడగా, అతడు భుజింపకున్నందున 'అహారముంగొనుమా తండ్రి క్షుధాగ్ని వీరు'నని వాక్రువ్వగా హనుమ భయమొంది, ప్రాంజలియై 'నృపా, మీరు భుజింపక యున్నగాక భుజియింపగ నాకుం జన'దని అనెను. అతని పలుకుల నామోదించి రాముడు కొన్ని కబళములు గైకొని 'ఇకనైనా ఆరగింపుము' అని పలికెను. అపుడు హనుమ 'మీరలూరక యారగింపుచున్నగాని భుక్తి చేయ బూనన'ని అనెను. ఈ విధముగా ప్రతి కబళమునకు రాముడు అంజనేయుని 'తిను'మని కోరుట, అంజనేయుడు 'ఇదిగో తింటాను' అని అనుచుండుట జరుగసాగెను. చివరకు రాముడు 'తుష్టిగా ఆరగించు ప్రొద్దువరకు వినయ వ్యాజముల్ గడపి' పిమ్మట రాముడారగించిన భోజన భాజనమును వేగంగా పుచ్చుకొని ఎత్తుకొనిపోయెను. అపుడు ప్రభువు 'నీవు పొత్తున నాతో ఆరగించ కుండగనే భోజనపాత్రనెత్తుకొని యెందుకు పోవుచున్నావన్నా' అని ప్రశ్నించెను. అంతట సామీరి—

" .... జగదీశ్వర దేవర భుక్తశేషమే
నిత్తఱి మత్కుల ప్రజలకెల్లను బెట్టి భుజించు వాంఛ మైఁ
బుత్తడి పల్లెరంబు గొనిపోయెద ...."

—నని నమస్కరించుచు తెలిపెను. ధానికి రాముడు సమ్మతించుటేకాక హనుమంతుని చర్యను తన సోదరులకు బ్రాహ్మణులకు తెలిపి హనుమంతుని 'గాఢ వినయ సనయ చాతుర్యముల గమనించు'డని తెలిపి హనుమంతుని ప్రశంసించెను.

హనుమంతుడా పళ్లెమును తీసుకొనివెళ్ళి అగిసె చెట్టుమీదికి ఎక్కి తాను తెచ్చిన రామ ప్రసాదమును స్వీకరించుటకు కపులనందరినాహ్వానించెను. అతని ఎలుగెత్తిన స్వరమునకు కపులందరు తేనెటీగలు బారులు తీరునట్లుగా చేరి మూగగా, ఒక్కొక్కరికి ఒక్కొక్కపులకము ఇచ్చి తర్వాత అట్లొనర్చినచో సరిపోదని ముందే గమనించి ఆ అగిసిచెట్టు ఆకులను అపరిమితంగా దూసి భోజనపాత్రలోవేసి తుడిచి తుడిచి కపులకు పంచెను. వారును ఒక్క ఆకు తునుక కూడ నేలమీద పడకుండా స్వీకరించి 'ఒడలెత్తిన ఫలము నేటి కొదవే'నని ఆ ప్రసాదము భుజించిరి. వారాంజనేయుని చూచి 'సర్వశరణ్యా బుధాగ్రగణ్యా, యుద్ధములో మాకు ప్రాణాలనిచ్చి ఐహికసౌఖ్యాన్నీ, లోకేశ భుక్తశేషమిచ్చి ఆముష్మిక సౌఖ్యాన్ని కలుగజేసితివి. ప్రసాద వినియోగమున ఎక్కువ తక్కువలు లేకుండాచేసి మా కలుషములను తొలగించి మాకు హిత కార్య మొనర్చిన దీనవత్సలుడివి. నిన్ను నుతియింప మేము శక్తులమా? అని తమకు భవపాశముల తొలగించి భుక్తి ముక్తి ప్రధాన విధానాత్ముడైన పావనిని హితాలాపములతో నుతించిరి. అగస్త్యమహర్షి తారకమంత్ర రాజపఠనము వలనను, ఆంజనేయుడా అగిసెచెట్టునెక్కి రామప్రసాదము నిచ్చిన కారణమునను ఆ అగిసెచెట్టుకూడా లోకాన ప్రసిద్ధిపొందెను. సదాగతి సూతియే అగిసె ఆకు. ప్రసాదమును స్వీకరించినరోజు ద్వాదశి అగుటవలన ఆర్యులు ద్వాదశి తిథినాడు అగిసె ఆకులను మానక స్వీకరించుట వ్రతమైనది. తన్నుమాలి కూడ పరబంధు రక్షణకై పూనిన పావని రామ భక్తి, స్వజన వాత్సల్యమూ సర్వస్తుత్యమయ్యెను. రామచంద్రుని ప్రసాద మందించగల్గిన పావని భక్తాభీష్టముల నీడేర్చుటలో నాశ్చర్యమేమున్నదని వానరులెల్లరును స్తుతించిరి.[185]

ఈ కథకు ఇంకొన్ని మార్పులు అధునికులు చేసి రచించియున్నారు. సీతాదేవి తన నాథునితో ఒకనాడు 'స్వామీ! హనుమంతుని విందునకు ఆహ్వానించి పందెం వేయదలంచినాను' అని అనగా 'నీవు హనుమంతుని ఏ పందెంలోను నెగ్గలేవు' అని రాముడు బదులు పలికెను. తన పరిచారికలతో రకరకాల భోజనపదార్థముల చేయించి పావనికి విందుచేసి ఎన్ని వడ్డించినను అప్పటిని ఆంజనేయుడు తినుచుండెను. సీత హనుమంతుడు ఏదీకూడ 'చాలును' అని అనక భుజించుచుండుట రామునకు చెప్పగా ఆ ప్రభువు వచ్చి చూడగా హనుమ సాక్షాత్ రుద్రావతారుడై తినుచున్నట్లు కన్పించెను. రాముడతని తలపై 'ఓం నమః శివాయ' అని పంచాక్షరిని వ్రాయగా ఆంజనేయుడు తృప్తిచెందెను. ఇంకకొందరు లక్ష్మణుని సలహానుసరించి భోజన పదార్థములపై 'రామనామము' వ్రాయించి వడ్డించగా ఆంజనేయుడు తినుట మానెనని కలదు.[186]

రామాజ్ఞపై అయోధ్యలో ఒక సత్రములో అన్నదానం జరుగుచుండెను. ఒకనాడొక బ్రాహ్మణుడా సత్రమున భుజింప నిరాకరించెను. వేగులవానిద్వారా ఈ వార్తవినిన రాముడు పాపపరిహారమునకై సీతాసహితుడై తీర్థయాత్రలకు బయలుదేరెను. అదివిని హనుమంతుడు వారిని కాశీలో దర్శించెను. వారికి నమస్కరించి అనంతరం గంగలో స్నానమొనర్చి అచటిరాళ్ళలో తన పేరుతో ఒక ఘట్టము నేర్పరచెను. అదియే నేటికిని కాశీలో పిలువబడు హనుమాన్ ఘట్టము.[187]

రాముని సేవించుచు హనుమంతుడు అయోధ్యలో పదునొకండువేల సంవత్సరములను గడపెను. ఆ సమయములో రాముడుచేసిన హయమేధ సహస్రములకు హనుమ ఎంతో సహాయము చేసెను. సవనాశ్వ రక్షణకై సైన్యముతో హనుమ వెళ్లెడివాడు. అపుడెందరో అవనీనాథులతో ఆంజనేయుడు పోరాడిననూ, వారి బాణద్యాయుధాలను మాత్రమే త్రుంచెడివాడు. తనను కొలిచినభక్తులను వాత్సల్యముతో వారిని వధింపక వదలెడివాడు.[188]

5 సహస్రకంఠ వధ

పుష్కరద్వీపమునకు రాజైన సహస్రకంఠుడు సవనాశ్వమును బంధించెను. వీనిమీదికి హనుమంతుడు భరతాదులతో కలిసివెళ్ళెను. సహస్ర

కంఠుని మంత్రి భరతాదులపై మత్తుమందుచల్లి వారిని తన వశమున నుంచు కొనెను. హనుమంతుడు పంచవన్నెల చిలుకరూపం ధరించి సహస్రకంఠుని నగరులోనికి ప్రవేశించి వానితో రాయబారము నడపి, వానిని పడవేసి వాని కిరీటమును హరించగా వాడు హనుమంతుని బంధించెను. అది తెలిసి శ్రీరాముడే స్వయముగావచ్చి సహస్రకంఠుని వధించెను.[189] ఈ కథకు కొన్ని మార్పులు, చేర్పులు శ్రీమద్రామాయణాంతరార్థమను గ్రంథమున చేయబడి యున్నవి.

శ్రీమద్రామాయణాంతర్గత కథ: ఇందు సహస్రకంఠుని నగరం చిత్రవతీ నగరము. చిలుకరూపమున వెళ్లిన హనుమను రాక్షసుడు బంధింపబోగా హనుమ యాభై వేలమందిని చంపెను. ఇందు పుష్కరద్వీపంవరకు తన శరీరాన్ని పెంచి ఆ చివరనుండి ఈ చివరవరకు ధనురాకారంలో ఉండెను. సైన్యములతని వీపుపై ఎక్కి నడచి వెళ్లెను. శబరమాయావులను రాక్షసులు సర్పాకారులై వచ్చి రామానుజులను మ్రింగిరి. విభీషణుని ద్వార ఈ విషయ మెరింగి వాతాత్మజుడా సర్పాలను నిలువున చీల్చి చంపి ఆ మాయాజాలము నుండి వారిని రక్షించెను. సహస్రకంఠుడు ఒక పర్వతాన్ని పెకలించి శ్రీరామునిపైకి విసరెను. హనుమంతుడు తన బాహువులను ఆమడ వరకు విస్తరించి చాచి దానిని పట్టుకొని రాక్షసుని రాజధానిపై వేసెను. రాము డెంత పోరినా సహస్రకంఠుడు కూలనందున హనుమంతుడు బ్రహ్మను ప్రార్థించి వాని జీవరహస్య మెరిగింపుమనెను. బ్రహ్మ అపుడా విషయమును తెలిపెను "ఈ ద్వీపానికి నూరుయోజనముల దూరమున క్రౌంచద్వీపమున భైరవపర్వత మున్నది. దానిలో ఒక గుహకలదు. దానికి సువర్చల అనే రాక్షసి కాపలా యుండును. దానిని జయించి ఆ కందరమునుండి వెళ్ళినచో పంచద్వారములు కలవు. వాటిని భీకర రాక్షసులు కాపలా కాయుచుందురు. వారిని చంపుట కష్టం. వారిలో ఒకరిని అశ్వరూపంతో, గండభేరుండ రూపముతో రెండవ వానిని, సింహ రూపంతో మూడవవానిని, సూకరరూపంతో నాల్గవవానిని, అయిదవవానిని ఈ అన్ని రూపములు కలిసిన రూపముతో పూని చంపవలసి యుండును. ఆ తర్వాత ఒక మాయాసౌధముండును. ఆ సౌధములో పంచదిశలందు పంచజ్యోతులుండును. వానిని ఒకేసమయములో ఆర్పివేసినచో సహస్రకంఠుడు మరణించును." ఈ వివరం వినిన వెంటనే ఆంజనేయుడ

గుహను చేరెను. సువర్చల అను రక్కసి అతనిని చూచి దిగ్భ్రమచెంది మూర్ఛితురాలాయెను. ఆమె కొంతసేపటికి స్పృహతెచ్చుకొని "ఓ వానరా కారా! నీవు ఎవరవు? అజరుద్రాదుల కభేద్యమైన ఈ పర్వతప్రాంతానికి నీ వెట్లు వచ్చితివి?" అని ప్రశ్నించెను. రామకార్యార్థమై తాను వచ్చిన వృత్తాంతం ఆమెకు ఆంజనేయుడు తెలిపెను. అప్పుడామె 'ఓ మహాబలా! నీవు నా కోరికను తీర్చినచో నేను నీ కోరికను తీర్చగలను. ప్రపంచములో స్త్రీ రూపం ధరించిన ప్రతిస్త్రీ నీలాంటివానినే కల్యాణమొనర్చుకొని సుఖింపగోరును. కావున నీవు నన్ను నీ భార్యగా స్వీకరించి నాకు జీవితానందం కల్గించుము' అని కోరెను. హనుమంతుడదివిని 'లలనా నేను బ్రహ్మచారిని. పైగా స్ఖలితము లేనివాడను. మలమూత్రాదులే లేనివాడను. నేను ధరించిన ఈ ధట్టి నా శరీరము వ్యాపించియున్నది. నన్ను భర్తగా స్వీకరించి నీవేమి సుఖపడెదవు. నీ కోరికను విరమించుకొనుము' అని చెప్పెను. సువర్చల వెంటనే "స్వామీ! నేను మీతో సుఖించకపోయినను నన్ను మీ భార్యగా స్వీకరింపుడు. ఏడు ఘడియలు (రెండుగంటల నలువది ఎనిమిది నిముషములు) మీరు మీ వామభాగమున నన్ను అలంకరింపనీయుడు చాలును" అ కోరగా సామీరి శ్రీరాముని స్మరించి "స్వామీ! ఇదియేమి వైపరీత్య బ్రహ్మచారియగు నాకు భార్యయా? ఇది నా భక్తికి పరీక్షయా? లేక నా ఏదేని లోపమా? అంతా మీదే బాధ్యత" అని శ్రీరాముని ధ్యానించుచు 'సువర్చలా! నీవు నా వామభాగము నలంకరింపుము' అని తెలిపెను. ఆమె అట్లొనర్చగా ఆమెకు సూర్యునివలన వచ్చిన శాపము తొలగి దివ్యరూపము కలిగెను. పతివద్ద శలవుపొంది సువర్చల సూర్యలోకమునకేగగా, ఆంజనేయుడు అశ్వనీదేవతలను ఉపాసించి అశ్వరూపమున ఒక రాక్షసుని, నరసింహస్వామిని ప్రార్థించి సింహరూపమున రెండవవానిని, గరుత్మంతు నుపాసించి గండభేరుండ రూపమున మూడవవానిని, శ్వేతవరాహస్వామి నర్చించి నాల్గవ వానిని, పంచరూపములొక్కటిగా ధరించి పంచముఖాంజనేయుడై పంచముని, పంచత్వమొందించి ఆ జ్యోతులనార్పి సహస్రకంఠుని అంతమొందించెను.

వీరమణి కథ : సవనాశ్వము దేవపుర ప్రాంతములో తిరుగుచుండగ ఆ నగరపాలకుడు వీరమణి దానిని బంధించెను. ఇతడు శివభక్తుడు; శివుడె ఇతనిని సదా కాపాడుచుండెను. భరతపుత్రుడు పుష్కలుడనువాడు వీరమ

పుత్రుడగు రుక్మాంగదునితో పోరాటమారంభించెను. పుష్కలునిపైకి వీరమణి రాగా హనుమంతు డతని నడ్డగించెను. హనుమంతుని దెబ్బకు వాడు మూర్ఛ పోగా తన భక్తుని రక్షించుటకై శివుడు ప్రమదగణములతోవచ్చి నందిని హనుమంతుని మీదకు, తక్కినవారిని ఇతర సైనికులమీదకు పంపెను. వీరభద్రునిచేత పుష్కలుడు వధింపబడెను. శంకరుని చేతిలో శత్రుఘ్నుడు మూర్ఛపోయెను. అపుడాంజనేయుడు శంకరునిచూచి "రామానుజుని కొట్టు టకు రామభక్తులగు మీకు తగునా?" అని ప్రశ్నించెను. కాని శివుడు ముసలాయుధముతో హనుమను కొట్టగా, హనుమంతుడు దానిని విరిచివేసెను. అంత తన వాలముతో శంకరుని చుట్టి ఆంజనేయుడు బాధించగా, శంకరు డతనిని మెచ్చుకొని వరము నిచ్చెద ననెను. తాను ద్రోణాద్రికివెళ్ళి సంజీవనిని తెచ్చువరకు రామసంబంధి వీరులగు పుష్కల శత్రుఘ్నాది వీరుల కళేబరము లను శివకింకరులగు భేతాళ పిశాచాదులు తినకుండా రక్షింపుమని వరము కోరగా శంకరుడంగీకరించెను. ద్రోణాద్రిని తెచ్చుటకై వాయుపుత్రుడు బయలుదేరివెళ్ళి అడ్డుపడిన దేవేంద్రాదుల నిర్జించి, బృహస్పతి మధ్యవర్తిగా రాజీ యేర్పరచి విశల్యకరణి, సంధానకరణి, సంజీవకరణి అను ఓషధులను ఇప్పించగా వానినితెచ్చి తనవారిని బ్రతికించెను. చివరకు రాముడే శంకరు నితో తలపడవలసివచ్చెను. శ్రీరామ శంకరులు తమతమ భక్తులయెడ వాత్సల్యముతో యుద్ధము విరమించిరి. ఓషధుల ప్రభావముతో వీరమణి పరివారమున చనిపోయినవారిని బ్రతికించిరి. అంత వీరమణి అశ్వమును శ్రీరామునకప్పగించెను.[190]

సురథునితో పోరాటము: రామభక్తుడగు కుండలి పురాధీశుడు సురథుడు యాగాశ్వమును బంధించెను. వీనికి పదిమంది కొడుకులు. శత్రుఘ్నుడు వీని వద్దకు అంగదుని రాయబారిగా పంపెను. తానన్నీ తెలిసియే యాగాశ్వము బంధించితినని వాడు తెలిసి శ్రీరాముడే స్వయముగా వచ్చి దర్శనమిచ్చినచో అశ్వమును వదలుదుననెను. కానీ యుద్ధమే జరిగెను. సురథపుత్రుడు చంప కుడు పుష్కలుడను భరతకుమారుని బంధించెను. వానిని విడిపింపుమని శత్రుఘ్నుడాంజనేయుని కోరెను. హనుమంతుడు చంపకునిపై ఒక బండను ఒకసారి, మరొకసారి మదగజము నొకసారి వేయగా వాడు వానిని నాశనము చేసెను. చంపకుని పాదములుపట్టి వానిని హనుమంతుడు గిరగిర త్రిప్పగా,

వాడాతని వాలమును పట్టుకొని వ్రేలాడెను. చివరకు తన వాలము చేతనే వానిని బంధించి అంజనేయుడు పుష్కలుని విడిపించెను తర్వాత హనుమంతు నికి సురథునికి పోరు జరిగెను. సురథుని రథమును హనుమ విరుగగొట్టెను. అట్లు నలువది తొమ్మిదిమారులు రథములు కోల్పోయి సురథుడు హనుమపై పాశుపతాస్త్రము వేయగా హనుమంతుడు క్షణకాలము బద్ధుడాయెను. మరల పోరాటమునకు రాగా బ్రహ్మాస్త్రమును సురథుడు వేయగా దానిని పావని భక్షించెను. సురథుడు శ్రీరాముని స్మరించి రామాస్త్రమును వేయగా హను మంతుడు బద్ధుడైనందున సుగ్రీవుడు తలపడెను. అనిని కూడ సురథుడు బంధించి వారిని తన నగరమునకు చేర్చెను. హనుమంతుడంత రాముని స్మరించెను. అవసరమునకు రాముడేతెంచి సురథునికి దర్శనమిచ్చి అతనిని ఆదరించినందున అశ్వమును వాడు వదలుటేకాక బంధితులను గూడ విడిచి పెట్టెను.[191]

కుశలవులతోడి పోరాటము: ఈకథ వాల్మీకి రామాయణమునగానీ, పరాశర సంహితలోగాని, సమీరకుమార విజయమునగాని లేదు. శ్రీరామునిచే సీతాపరిత్యాగము, కుశలవ జననము, సీతాశపథము మొదలగు అంశములే ఉత్తర రామాయణమున ప్రధానమైనందున హనుమంతుని కథ అందులో గౌణమైనది. ఆశ్చర్యరామాయణమే ఈకథ విపులముగా పోషించి యున్నది. శ్రీరాముని యాగాశ్వమును లవుడు బంధించెను. భరతపుత్రుడు పుష్కలుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడు సైన్యముతో వచ్చిరి. హనుమంతుడు బూరుగు బెట్టు నొకదానిని లవునిపై వేయగా దానిని లవుడు నాశనము చేసెను. తో (హనుమ లవుణ్ణి గిరగిర త్రిప్పగా, లవుడు తన తల్లియగు సీతను స్మరించు అంజనేయుని తోకను పొడిచెను. దానికి వ్యథచెంది హనుమ లవుని వదలి వేసెను. లవుని బాణాఘాతముతో హనుమ మూర్ఛపోయెను. శత్రుఘ్నుడువచ్చి లవునితో పోరాడి వానిని మూర్ఛితు చేసెను. కుశుడు గురుదైవములను పూజించి, తల్లి ఆశీర్వచనం పొంది వచ్చి వాయవ్యాస్త్రముతో శ్రీరాముని సైన్యాన్ని విసరికొట్టెను. దానితో శత్రుఘ్నుడు మూర్ఛనొందెను. హనుమ తేరుకొని కుశునిపై తరువర్షం, శిలావర్షం కురిపించెను. తేరుకొన్న లవుడు సుగ్రీవుని బంధించగా, కుశుడు హనుమను బంధించెను. ఈ యిరువురి తోకలను పట్టుకొని లాగుకొనివచ్చి లవకుశులు వారిని తమ తల్లివద్దకు చేర్చిరి. సీత వారిని ఆదరించెను. శ్రీరామలక్ష్మణులే యుద్ధమునకు వచ్చిన తర్వాత

వాల్మీకిమహర్షి కల్పించుకొని వారినందరినీ కలిపెను. ఈ కథలో హనుమంతునితో లవకుశలు ఆడుకొనినట్లు, చెట్టుకు కట్టివేసినట్లు ఎన్నియో కథలు ఆధునికులు కల్పించి యున్నారు.[192]

చక్రాంగనగరాధీశుడు సుబాహుడనువాడు అశ్వమునుపట్టి యుద్ధమునకు సిద్ధపడినట్లును హనుమంతుని పాదతాడనముతో మూర్ఛకల్గి అందు వానికి రామదర్శనమై, శ్రీరామాపచారదోష పరిహారమై అశ్వమునప్పగించిన కథ యున్నది. కాశీరాజగు యయాతి విశ్వామిత్రునికి అపచార పడినందున శ్రీరాముని శిక్షకు పాత్రుడుకాగా అంజనేయుడతనికభయమిచ్చినందున శ్రీరామాంజనేయ యుద్ధము జరిగిన కథ కలుదు. ఇది చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గయోపాఖ్యానమునకనుసరణముగా వెలసిన కథ. ఇట్లే యమాంజనేయయుద్ధము, కర్ణాంజనేయయుద్ధము, శనైశ్చరునితో వివాదము అంజనేయ సంబంధమగు కథలు కలవు. ఇవి ఆధునికములైనవగుటేకాక రామాయణమున లేనివగుట వలనను, వాని ప్రామాణికత్వము రూఢము కానందునను కేవలము పేర్కొనినానే కాని వానిని వివరింపబూనలేదు.[193]

కొందరు ఆధునికులు హనుమంతుని అమాయకత్వమును, వానర ప్రవృత్తిని చూపించుటకై లోకజ్ఞాన హీనునిగా, మూఢునిగా చిత్రించినట్లు కథలను కల్పించియున్నారు. వానికాధారమే గ్రంథమో వారు తెలుపనందున వాటి ప్రామాణికత్వము కూడ రూఢి కాలేదు. కావున వానిని కేవలము సూచించుటతో వదలుచున్నాను. శ్రీరాముడావులించినపుడు చిటికెలువేయు పనిని హనుమంతునికి కేటాయించగా దాని ద్వారా ఇతర భక్తులకునూ, శ్రీరామునకును అసౌకర్యము అంజనేయుడు కల్పించి తన నిత్య కైంకర్యము యథావిధిగా సాగునట్లు చేకొనిన కథ ఇందొకటి[194] (అ). అట్లే సీతారాముల ఏకాంతమునకు హనుమంతుడంగీకరింపక, దాంపత్యక్రీడను తుచ్ఛముగా పేర్కొని సీతాదేవికి గర్భోత్పత్తి అగుటకు శ్రీరాముని ధనువును మథించి ఆ గంధమునిప్పించిన కథ కలదు. ఇందు హనుమంతుడు స్త్రీ పురుషుల మిథునక్రీడనుగూర్చి ఏమియు తెలియనివానివలె చిత్రింపబడుటేగాక రామునికి సీతకును గల అద్వైతస్థితిని తెలియనివానివలె చిత్రింపడియున్నాడు.[194] (ఆ) ఈ కథలన్నింటి సారాంశమేమనగా హనుమంతుడు శ్రీరాముని సన్నిధివీడి క్షణమైనను ఉండలేకుండెనని తెలుపుటే.

అయోధ్యలో హనుమంతుని పరిచర్యలనుమెచ్చి రాముడు ఒకనాడు "నాయనా హనుమా! నీ భక్తికి, ప్రపత్తికి, త్రిశుద్ధికి నేను చొక్కినాను; అందుకే నేను నీకు దక్కినాను.—

ఒక గుణరీతినైన వినయోన్నతినైన విరక్తినైన శౌ
ర్య కలననైన నామదికి రాగమొనర్పగ నేర రన్యు లీ
వొకడనెకాదనేక గుణయోగ సమగ్రత మెచ్చజేసి నా
విక ముదమందినా డనన నేటికి నీమది నేనె యుండగన్.

— సూర్యచంద్రు లున్నంతకాలం, నా కీర్తి ఉన్నంతకాలం, చతుర్వేదా లున్నంతకాలం నీవు నీ స్వరూపం ద్వారా నా భక్తినీ, నా మంత్రాన్నీ లోక హితంకోసం ప్రవర్తింపజేయుటకై నీకు చిరాయువు కలుగునట్లు వరమిచ్చు చున్నాను. నీవు కింపురుష వర్షములో గంధమాదన పర్వతాగ్రమున కదళీ వనమందు విశాల ప్రదేశమున కల్పతరుమూలమున నివసించుచుండుము. కింపురుష వర్షవాసులకు నీ వధిపతివై సంపద్విజ్ఞానమోక్షసౌఖ్యార్థమై వా రొనర్చు పూజలందుకొంటూ ఉండుము. నీవునూ ప్రతిమారూపముహొంది మావలెనే పూజలుహొంది జనులకీప్సితదాయకుడవై వరలెదవుగాక" అని ఆశీర్వదించి హనుమంతుని కౌగిటిలో చేర్చెను. అంత హనుమ శ్రీరామునకు సాష్టాంగపడి 'స్వామీ! మీ పాదపద్మ దర్శనమును వీడి ఇంకొకచోట నే నుండజాలను. నా మనోదృష్టిలో మీరు వసించుచుండగా, నా ఆత్మ దృఢ మైన భక్తిని హొందుచుండగా మీ కథలు ఆలించుచు గడుపవలెననియే నా ఆశయము. మనసులో మిమ్మే తలుస్తూ, మీ దివ్యకథలే చెవులతో వింటూ తప్ప వూరక నేనుండలేను స్వామీ'అని మనవిచేయగనే రాముడు, "హనుమా అవశ్యము నేను నీ మనసులో తోచుచుండెదను. నీ తలంపుగూడ నాలో యుండును. నారద తుంబురులు, విద్యాధర ముఖ్యులు, అప్సరసలు నీ చెంతనుండి అన్నివేళలలో నా కథలను నీకు వినిపించుచుందురు. నీవుండు కదళీవనము ఎన్నో జన్మలెత్తి పుణ్యచారులైన వారికే గోచరించునుకాని అన్యు లకు దర్శింప వీలుకాదు. కావున నీవు ఎవరికినీ కనపడకుండా ఉండగలవు. నీకు సాటి ఎవరునూ లేరు. నీవు కపిరూపమొందిన త్రినేత్రుడవే. నీవు నన్నేరీతిగా నుతింతువో నేనారీతిగానే నీలో వసించుచుందును" అని సమాధాన పరచి తన వైఢూర్యోజ్జ్వలహారం ఇచ్చి వీడ్కొలుపగా హనుమంతుడంగీకరించి

గంధమాదనశైల శిఖరముచేరి తనస్వామి పలుకులకు తగినట్లే వినీతివివేకాతి గుప్తనియమైకగతితో కాలము గడుపుచుండెను. ఆ కింపురుష వర్షజనులతి భక్తితో అతనినే దైవముగా తలంచి పూజించుచుండుటవలన వారికి దీర్ఘ ఆయురారోగ్య కళత్ర పుత్రాది సిరులతో తులతూగుచుండిరి. ఆ కింపురుష భోగభూమిలో సువర్ణ కదళికారామమునందు కల్పద్రుమ ఛాయలో బంగారు ఆసనముపై ఆంజనేయుడు నివసించుచుండగా గంధర్వులు, మునులు, అచ్చరలు, చారణులు, యక్ష కిన్నెర సిద్ధవిద్యాధరాహిగరుడాది గణములతని రామకథాగీతములతో కొలుచుచుండెడివారు. అష్టదిక్పాలురూ, ఇంద్రాదులతని పూజించుచుచో భావిబ్రహ్మలీల ఆనాడే కల్పించినట్లుండెను. తమ వీణావాదనములతో నారద తుంబురులతని నలరించెడివారు. రంభ, హేమ, తార, మంజుఘోష మొదలుగాగల అచ్చరలు ఆంజనేయుడు సకలకళల నెఱజాణయని తెలిసి ఇంద్రుని కొలువులోవలె కాక భక్తిశ్రద్ధలతోచేరి నాట్యము చేసెడివారు. వారి కీర్తనలలో రఘుశేఖరుని వర్ణనలేయుండి ఆంజనేయున కానందం కల్గించెడివి. దివ్యులూ, గంధర్వులూ, దివౌకసశ్రేష్ఠులు అతనిని కొలిచెడివారు.[195]

ఆంజనేయుడు నివసించు స్థానము పది అని కొందరు, పదునొకండని మఱికొందరు భావించుచున్నారు. 1 శ్రీభద్రము, 2 కుశతర్పణము, 3 కుండిన నగరము, 4 పంపాసరోవర తీరము, 5 చంద్రకోణము, 6 మలయపర్వతము, 7 కాంభోజము, 8 నైమిశారణ్యము, 9 బ్రహ్మావర్తపురము, 10 సుందర నగరము – దీనికి హనుమత్పురము చేర్చి పదునొకండుగా కొందరి భావన. ఇవి తన్మంత్రాధిష్ఠాన దేవతయొక్క స్వయంవ్యక్త స్థలములుగా తంత్రములందు చెప్పబడినవి.[196]

సకుంభ నికుంభుల కథ: రామరావణ యుద్ధమున హనుమచేతిలో నికుంభుడు వధింపబడినట్లు కలదు. కాని వీరిని పట్టాభిషేక అనంతరము తుదముట్టించినట్లు సమీరకుమారవిజయములో ప్రత్యేకముగా పేర్కొనబడినది. గంధమాదనమున రామధ్యాన తత్పరుడై యున్న హనుమంతునివద్దకు విభీషణుడు వచ్చి తన దాయాదులగు సకుంభ నికుంభులు తనపై దండెత్తివచ్చిరని తెలిపి వారిని రూపుమాపవలసినదిగా హనుమంతుని కోరెను. వీరు కుంభకర్ణుని పుత్రులు. దేవయాన శాపమువలన గజరూపమున నుండిరి. రావణ

కుంభకర్ణ వధానంతరము వీరికి శాపవిముక్తి కలిగి నారద ప్రోత్సాహముతో విభీషణునిపై దండెత్తిరి. అంత ఆంజనేయుడీపనికి స్వయంగా పూనుకొనక విభీషణుని తనతో వెంటబెట్టుకొని రాముని ఆశ్రయించెను. సకుంభ నికుంభుల కథ వాయునందనుడే చెప్పగా వినిన రాముడు 'ఈ వాయుకుమారుని శక్తి వలన శతకంఠాదులే కూలిరి. వీరినోర్చుటెంతపని' అని పలికి మరురోజు సైన్యసమేతుడై ఆంజనేయునితో కలిసి లంకకు చేరెను. రామునితో భరత శత్రుఘ్నులు వచ్చిరి. రాక్షసుల యమదండపు దెబ్బకు వారు మూర్ఛపోయిరి. మరల హనుమంతుడు ద్రోణాద్రినితెచ్చి యిదివరలో లక్ష్మణుని బ్రతికించినట్లే చేయవలెనని వానరులభిప్రాయపడగా శ్రీరాముని ఆనతిపై వాయుజుడు ఇంద్రుని చేరి సుధాకలశము తెచ్చి రామానుజులను చైతన్యవంతుల చేసెను. ఆంజనేయుని శ్రీరాముడు పొగడగా "మీ ప్రతాప ప్రభావములే కదా యివి. అయినా, మీరు మీ బంటును పొగడవచ్చునా!" అని వినయోక్తులాడెను. ఆ రాక్షసులు తృణసంజాతులచే చావగలవారని కుశుడను కపిశేఖరునిచే వారిని చంపించి విభీషణునికి శత్రుశేషము లేకుండా హనుమ తోడ్పడెను.[197]

అయోధ్యలో శ్రీరామ నిర్యాణ సన్నివేశమునకు ఆంజనేయుడు ప్రేక్షకుడుగా నుండెను. మహాప్రస్థానోన్ముఖుడైన రాముడు అయోధ్యాపురవాసులందరిని అతనితో వచ్చునట్లు అనుగ్రహించెను. అందరకును వీడ్కోలుచెప్పి అవతారపరిసమాప్తి సందర్భమున రాముడు ఆంజనేయునిచూచి—

జీవితమందు నాశ యెడసేయకు మానకుమా ప్రతిజ్ఞ యీ
భూవలయమునందు గపిపుంగవ మత్కథ ఎంతదాక బెం
పై విలసిల్లు నందనుక హాయి రమింపుము మద్వచస్థితిన్.

—అని కోరెను. రాముడు సానుజుడై వైష్ణవతేజమున లయమొందుట బ్రహ్మాదులేతెంచి అతని నుతించుట హనుమదర్శించి ధన్యుడయ్యెను. వానరములే యే దేవతాంశమున జన్మించిరో ఆ యా దేవతలలో ప్రవేశింపుమని బ్రహ్మ తెలుపగా, సుగ్రీవుడు సూర్యబింబమున చేరగా తక్కిన వానరులు తమ పితృ ఆంశలలో చేరిరి. వీరందరు సుగతుల పొందగా హనుమంతుడు రామానుగ్రహమున 'మనం బింకెందునున్ జనకయయుండ యీ లోకమున చిరంజీవిగా నిల్చిపోయెను.'[198]

———

అధ్యాయము—8

ద్వాపరయుగమున హనుమంతుని వృత్తాంతము

రామావతార సమాప్తితో రాముని కథ ముగిసెను. కాని శ్రీరామానుగ్రహములన, సీతామాత వరమువలన హనుమంతుడు చిరంజీవియై యున్నందున ఇతని కథ తర్వాత యుగములో కూడ వ్యాపించెను. మహాభారతము, భాగవతము, పురాణములు పరాశరసంహిత, సమీరకుమారవిజయములలో హనుమంతుని ద్వాపరయుగ వృత్తాంతము కొంత తెలియుచున్నది.

వజ్రాయుధ ప్రహారము వలన తనలో రోమమొక్కటి మాత్రం రాలినదనియును, తాను నాగులకుశత్రువై, విష్ణువాహనమై విశ్వంభరునిమోయుచున్నానని తన జవసత్తముల గూర్చి గరుక్మంతుడు గర్వించినట్లు శ్రీకృష్ణుడు గ్రహించెను. కృష్ణునికి కూరిమి ఇల్లాలును తానేనని భావించి అన్యకాంతలను సరకు చేయక సత్యభామ యుండెను. నారద తుంబురులు గానములో తమలో ఎవరు గొప్పవారో తెలుపుమని శ్రీకృష్ణుని ఆశ్రయించిరి. అపుడు కృష్ణుడు శౌర్యజవంలో పక్షిరాజు గర్వాన్ని, భక్తి పటిమలో సత్యభామ గర్వాన్ని, గానలీలలో నారద తుంబురుల గర్వాన్ని అణచుటకు హనుమయే తగినవాడని భావించి, నారద తుంబురుల చూచి మీ సంగీత కళావిలాసములో మేలెంచుటకు గానాది నానాసారస్య రహస్యవేదియు, సకలామ్నాయాంతవిద్యాభామా సర్వంకష శేముషీనిధియు, సర్వజ్ఞుడును అగు హనుమద్బ్రహ్మను పిలిపింతునని తెలిపి అతనిని పిల్చుకొని వచ్చుటకై గరుత్మంతుని తలచెను. అతడు వెంటనే వచ్చి కార్య మడుగగా కృష్ణుడాతనికి నారద తుంబురులజూపి వారి గానకళా ప్రావీణ్య పరీక్షకై నిర్ణయాధికారిగా సామీరిని గంధమాదన పర్వతమునుండి రప్పించవలసి యున్నదని తెలిపి 'నీ ఘనతేజోబలయుక్తితో ఉద్యద్వేగివై వెళ్ళి హనుమంతుని తీసికొనిరమ్ము' అని ఆదేశించెను. గర్వమెక్కియున్న గరుక్మంతుడా పలుకుల సరకుసేయక "ప్రభూ! నా బలమూ, జవమూ, భక్తీ గాసి చెందంగజేసి క్రోతిః బిల వేగంబేగుమన్నావ నాయాసంబేల ఘటించితిరి. ఈ పని నాకర్హమైనదా? నాకు బాగా సన్మానంచేస్తున్నారే! హీనాధిక్యము లెంచకుండా ఒక్క కపిమాత్రుని పిలుచుటకు నన్ను పొమ్మంటారే? అతడు నాకు

సాటి రాగలడా! నాతో ఒక్కదానిలోనూ సమానుడు కాడే. కానీ మీ అజ్ఞ నెలా కాదనగలను" అని ఎఱుకమాలి పలికిన గరుడిని చూచి కృష్ణుడతని నాలింగనమొనర్చి "పక్షిశ్రేష్ఠా విచారింపకుము. నీవు మా భక్తుడివికదా! ఆంజనేయుడు సాక్షాత్తు శివుడే; వైష్ణవాగ్రణియే; భవిష్యద్బ్రహ్మయే. అత డున్న కదళికోద్యానవనము దుర్లక్ష్యమైనది. ఆ త్రినేత్ర బ్రహ్మాదులకంటే నీవు ఉన్నతుడవని తలంచి నిన్నే పంపుచున్నాను సుమీ. నీవు లావరివి. బలరయములతో పోగలాడివి. నా వచనము నీవు మీరజాలవు కదా!" అని పలుకగా, గరుక్మంతుడు 'తారతమ్యమెరగి దాసునేలని రేనికిలేని హాని నాకేల యుండును' అని తూష్ణీంభావముతో పలికి "నేను గంధమాదనమునకు వెళ్లి ఆ కోతిని రమ్మని పిలిచెదను. వస్తే మంచిదే. రానిచో నా బలమెంతో తెలుసుకుంటాడులెండి" అని పలికి కృష్ణునికి నమస్కరించి వెళ్లెను.

గంధమాదనమున గరుడుడెంత వెతకినా ఆ హనుమంతుడు కనపడ లేదు. తన వాలాన్ని సాలము పోలిక చుట్టును చుట్టుకొని హనుమంతు డుండెను. కొద్ది సమయమునకు గరుడుడది గమనించి 'తుది మొదలు లేకుండా తన తుచ్ఛపు పుచ్ఛపుగోక కట్టుకొని అందులో రాజసవృత్తిలోనున్న ఈయనకు ఎదుటివారి ఘనత తెలియదు. అతనిని గూర్చి స్వామి అంత గొప్పగా చెప్పినాడే కానీ. జాతికి తగిన బుద్ధి వుంటుందే కానీ గొప్పతన మెక్కడినుండి వచ్చును. ఒక బ్రహ్మచారినే శతమర్కటుడంటారు. అందులో బ్రహ్మచారియై కోతియై యున్నచో ఇంక ఆ చేష్టలు వేరే చెప్పాలా? నా రెక్కల తాకిడికి తోడు నిల్వగలడా' అని తనలో తలంచి గరుక్మంతుడు హుంకరించి వాయుకుమారుని వాల వలయాన్ని 'రెక్కలతో గడలు కొలిపె'. ముక్కుతో పొడిచి నఖాంకురములతో తాడించి, చుట్టుచుట్టూ తిరిగెను. అనిలసుతుని కదిలించలేకపోయెను. ఇంద్రుని వజ్రాయుధముకానీ, ఆదిశేషుడుకానీ, ఆది కూర్మనాధుడుకానీ తన బలమునకు ఆగజాలరని అనుకొనుచు తన దెబ్బలకు హనుమంతుని తోక తెగకుండా, పగులకుండా, నొగులకుండా, బలుపు చెడ కుండా ఉండుటను చూచికూడ అతని మహిమను గుర్తించలేక ఈర్ష్యబూని తోకకు ఎగబ్రాకి దుముకదలచెను. సూర్యునిముందు ఖద్యోతలంలాగా, ఏనుగుముందు దోమలాగా, నిండు చంద్రునిముందు చుక్కలాగా ఆ కపీంద్రుని వాలలతికాప్రాకారంలో అణుమాత్రమై పక్షీంద్రుడు కనిపించగా సురల

కాశ్చర్యమాయెను. గరుడిని అంగమంతా చెమర్చి, వడిచెడి, గుండె తల్లడిల్ల, వస్త్రము వెల్వెలపోయి, పాదాలు తడబడి, ఈకలకు జడిమహెచ్చెను. మారుతి వాలము కడగానకున్నా గర్వం మాత్రం తగ్గని గరుక్మంతుడు ఇంకా తన పట్టు దలను పెంచుకొని "ఇతడు కోతి. నాలాంటి మహామహుడు తోకమీద ప్రాకినా ఊరుకొన్నాడేకాని ఉచితజ్ఞత చూపడయ్యె. ఇతనిని ప్రియోక్తులతో పిలిచి చూస్తాను. పలుకనిచో బంటుతనాన్ని అపుడే ప్రయోగించెదగాక" అని భావించి 'ఓ కపీంద్రా! శౌరి నిన్ను పిలుచుకొని రమ్మనెను' అని బిగ్గరగా గొంతెత్తి అంజనేయుని పిలిచెను. పావని ఆ పలుకుల నాలించనందున గరుడుడీమారు "బ్రహ్మాదుల శాసింపగల కృష్ణుడు నిన్ను రమ్మని పిలిచెను" అని అరచెను రామధ్యాన తత్పరుడైన హనుమంతుడు పలుకనందున గరుక్మంతుడు 'ఇతడు పలుకడు; రాడు; ఒకవేళ చెవుడేమో! లేక వివేక హీనతయో?' అని తలంచి అంజనేయుని దండోపాయమున సాధింప నెంచెను. అపుడాపక్షి —

"పదనఖరాజిఁ బైనదిమి పట్టి శతారము మీరు ముక్కునం
బొదివి కపీంద్రు వాలలత బోరన వెన్కకు బెల్లగిల్లి నీ
డ్చెదనని కంట నిప్పుకలు విప్పిల నిట్టట్టు చుటును"....

—ఊగసాగెను. ఇది గమనించి అంజనేయుడలవోకగా తన వాలాన్ని ఒక్క సారి అదల్చెను.

వాతజుని వాలవాయువును సైరింపజాలక గరుడుడు చక్రంలాగా గిరిగిరా తిరుగుచు, భ్రాంతుడై చెమటలు కాలువలై పారుచుండగా ద్వారకా నగరంలో కృష్ణుని కొలువుకూటములో వచ్చి పడెను. మేరుపర్వతమే పగిలి ఇక్కడవచ్చి పడెనా అనునట్లున్న అతనిని చూచి శ్రీకృష్ణుడు అతని అవస్థను గమనించికూడ ఏమీ యెరుగనివానివలె అదరిపడుతూ, పీఠముదిగి 'ఎన్నడూ పన్నగవైరి విన్నదన మొందగ లేదే, ఇపుడేమి వచ్చెనోకదా' అని చేరి వాని శరీరమునుండి కారే రక్తాన్ని గడిగించి, వానిని ఎత్తి తన తొడలపై పెట్టుకొని తేరుకొనేవరకు అనేకోపచారములు చేసి తన కటాక్షామృతం వలన పక్షీంద్రు నికి చైతన్యం కలిగి కండ్లు తెరువగా శ్రీకృష్ణుడు "నీవు హనుమంతుని వన చరుడని దుర్బుద్ధితో ఎదిరించావా! రామధ్యానములో ఉండి నీతో పలుకలేదని దౌర్జన్యమేమైనా చేసితివా! అక్కడ నిన్ను బాధింపగలవారెవరు లేరుగదా!

రామకింకరుడు కోపించినచో సహింపగల్గుదురా!" అని హనుమన్మహిమ నుగ్గడించుచు పలుకు కృష్ణుని చూచి గరుడుడు కనుల నీరు నిండగా, కృష్ణునికి ప్రణామముచేసి గద్గదస్వరముతో 'మీ మాటల నిర్లక్ష్యపరచినందుకు ఆ సంజీవదేవు వాలలతచే నా శౌర్యం భంగపడినది స్వామీ' అని బదులిచ్చెను. అంత కృష్ణుడు 'ఎట్టివానికైనా ఒక్కొక్కసారి బుద్ధి దూరమవుతూ ఉంటుంది. దానికి పరితాపమొందరాదు. ఇపుడు నీవు మరల వెళ్లి జానకియు, రాముడును నిన్ను రమ్మనుచున్నారని పిల్చి రమ్ము' అని గరుత్మంతుని శౌరి ఆదేశించగా, వైనతేయుడు భయపడుచు 'ఒకసారి పోతేనే తోకతో విదిలించినాడే ఇంక రెండోసారి పోతే తోకతోచుట్టి కొట్టునేమో స్వామి. అపుడాతికమక నేనోర్చు కొనలేను స్వామి. అంజనేయుని చేరడానికే నాకు భీతిగా ఉన్నది. కావున నేను పోజాలను' అని పలుకగా, శ్రీకృష్ణుడతనిని బుజ్జగించి ధైర్యవచనాల తెల్పి మరల ఒప్పించి పంపెను.

చెప్పినట్లే గరుక్మంతుడు వెళ్లి వానరచక్రవర్తి వాలము కడనిల్చి "ఓ బ్రహ్మరుద్రాదిదేవతా వినుతా, సద్గుణరత్నమా అంజనేయా, నిన్ను ద్వారకా వాసులై సీతాదేవియు శ్రీరాముడును రమ్మనుచున్నారు" అని పలుకగానే హను మంతుడాతని చూచి, లేచి, ఆనందాశ్రువులు కలుగుచుండగా పక్షీంద్రునికి నతుడై నమస్కరించి, రూపమున కొంచెమై అతనితో "మహాత్మా, భక్తజనుల చింతాఘముల దొలగించు సీతారామనామార్థములను నేడు నీద్వారా ఆలించు చున్నాను. నా ప్రభువు నన్ను రమ్మని పిలచెనంటివి కాన నా జపము ధన్య మైనది. రమ్మని పిలువవచ్చిన నీకు అపరాధ మొనర్చితిని. అజ్ఞానినైన నన్ను మన్నించుము" అని పలుకగా గరుక్మంతుడు "అయ్యా, తమరు త్రిజగత్సేవ్యులు; అప్రతర్క్యమహిమోద్దీపులు; అశ్రాంతరామధ్యానతత్పరులు, దాసుడనైన నన్ను అట్లు పలుకజనదు" అని బదులాడగానే హనుమ అతనిని కౌగిలించి అతనిని అనుసరించి ద్వారకకు బయలుదేరెను.

ద్వారక చేరగానే గరుక్మంతుడు హనుమంతుని కృష్ణ మందిరమున ఉచితాసీనునిగాచేసి ఆవార్త తెలుపుటకై తన స్వామివద్దకు వెళ్ళెను. అంత కృష్ణుడు సత్యభామను చూచి "సీతారాములు రమ్మని పిలిచినారనినందున సామీరి వచ్చి యున్నాడు. కావున మనము ఇపుడు సీతారాముల రూపముల ధరించాలి. నేను రామునిగా నీవు సీతగా రూపొందాలి అని కోరెను. సత్యభామ

ఎంత ప్రయత్నించినను సీతారూపము పొందలేక రూపభాగ్య జనితాహంకారము తొలగిపోగా గోడమీది చిత్రమువలె నుండెను. అపుడు కృష్ణుడు రుక్మిణిని సీతారూపము పొందుమని కోరెను. ఆమె తక్షణమే తద్దేవిరూపము నొందగా రామునిగా తానుమారి శ్రీకృష్ణుడు సీతాసహిత శ్రీరామ దర్శనమును ఆంజ యునకనుగ్రహించెను. వారిని చూచినంతనే హనుమంతుడు లేచి వారికి ప్రణా మము లాచరించి, 'రగడ' ఛందస్సులో ఒకపాదములో సీతను, రెండవపాద ములో రామునిస్తుతించుచు శ్రీ సీతారాముల అద్వైత స్వరూపాన్ని సేవించగా, రాముడతనిని కౌగిలించి కరుణాలోకనములతో చూచి "మము నుల్లములోపల నెల్లవేళల బాయక చింతన సేయుచు దపంబున నెపంబుననున్న నిన్ను నేడు నారదతుంబురుల గాన కళా ప్రావీణ్యాసంబంధ వివాదమును పరిష్కరించు పెద్దగా నిన్ను పిలిపించితిని. వారి వివాదమును తీర్పుము" అని ప్రభువు కోరగానే పావని తన స్వామికి నమస్కరించి 'అయ్యా, తమరు సర్వేశ్వరులు తమకు తెలియనిదుండునా? కాని మీ ఆజ్ఞాబద్ధుడను కావున మీ కృపతో వీరి వాదమును పరిష్కరించు ప్రయత్నము చేసెదను' అని చెప్పి, నారదతుంబురుల దగ్గరకు చేరెను.

వారినిచేరి వారితో వాయుపుత్రుడు 'ఠాయిగ ఒక్క రాగమనుడా' అని కోరెను. వారు తమ వీణెలుపూని తంత్రుల దీటించి తెనెలొలుక పలికించగా హనుమ విని 'గానము బాగున్నది' అని వారిని మెచ్చెను. 'శ్రీ రఘునేతకు నేను నేర్చిన కొన్ని గీతముల వినిపింతును. మీరుకూడ వినుడు. అని వారికి తెలుపగా వారు 'తమ పాటముందర ఇతరులపాట కందళమొందునా' అని లోన తలంచి, 'మంచిదే యిందర రక్తిగుల్కుడని' వీణల నివ్వరాగా వారి అతిప్రియోక్తి వినయోన్నతిలో ధూర్తతను హనుమంతుడు గమనించి నార దుని వీణను గ్రహించి తంత్రులు మొరయించి మంద్రమధ్యమతార స్థాయులు మెరయునట్లుగా ఇంపు సరళియు మునుకొన కొన్ని గీతముల పలికెను. ఆ గానంతో హనుమంతుడు—

పరఢవించె మోటులఁ బల్లవములు
నిగిడించె నెలరాల నిర్ఘరములు
మొనయించె సకల మోహన నిరూఢి
అలరించె జనహృదయాంబుజములు.

—అతని అనవద్యవల్లకీవాద్యమహిమ నివాసబర్హులకు జీమూతయుత భద్ర రావ ప్రమోదాన్ని కల్గించెను. అలంకారపర్యాప్తితో వారకాంతను, ఆలాప సంబంధవైఖరిలో కవి వాణిని, రాగసంపదాస్ఫూర్తిలో నృపుని, తారకాంతర స్ఫురిత నాదప్రౌఢిలో యోగిని హనుమంతుని సంగీతము భుజంగమోహనో ద్వేలమై, పారవశ్యహేతువై, మాధుర్యముతో మించగా ఆ సభలో పారవశ్య మొందనివారు లేరు. ఆకాశగంగా విహారులగు అమరజనము కూడ పరవ శించెను. ఆంజనేయుడాలపించిన మేఘరంజని రాగానికి ఆకాశం మేఘావృతము కాసాగెను. కొద్దిగా వాన కురిసెను. నెమళ్లు నర్తించెను. పాతాళలోక లోకమందలి ఫణులు పడగలెత్తెను. కొలువునందలివారి అభరణములు కరగి పోసాగెను; శశిమణిస్తంభాలార్ద్రీభూతములాయెను. ఆకాశ సంచారులకు పారవశ్యము హెచ్చెను; కైలాసనాథుడగు హరుని కానందమాయెను. విను చున్న కృష్ణుడు అతని గానాన్నీ, దాని శ్రుతినీ, కంపితమును, మూర్ఛనను పలువురు వినునట్లుగా మెచ్చుకొని అభినుతించెను. అంత హనుమంతుడక్కడి పెద్ద శిలనొకదానిని చేతబట్టి నారద తుంబురుల తాళములనడిగి వాటిని చేత పట్టుకొని తన గానమునకు కరిగిపోవుచున్న ఆ శిలలో తాళములనుపెట్టి గాన ప్రౌఢితో మరల ఆ శిలను 'గుండు'గా చేసి వీణను నారదునకందించుచు 'ఈ గుండును కరగిపోవునట్లుగా రాగము ఆలపించి తాళముల తీసుకొనువారే గాన విద్యలో అధికులు. కావున మీరు ఆ విధముగా చేయవలసినది' అని వారికి తెలిపెను. నారదుడు తన చాతుర్యముచూప ప్రయత్నింపగా ఆ రాయి ఇంకా గట్టిగా ఘనీభవింపసాగెను. తుంబురుడును ప్రయత్నించి చూచెను. అతడు విఫలుడై వీణను నేలపైపెట్టి తల వంచుకొని సిగ్గుతో ఉల్లము తల్లడిలు చుండగా చేష్టలుదక్కియుండెను. ఆంజనేయుడపుడు—

"గానవిద్యలఁ బ్రసిద్ధులు రా గరగింపలేక పోఁ జెల్లునె?
యిట్టులైన నికఁ జెప్పెడి దేగతి తారతమ్యముల్"

—'గాయక పంతముతో మీరు మీ తాళముల దిగవిడిచిపోవుటుచితమా?' అని పలుకగా గర్వభంగమై వారిరువురూ వాయునందనునకు నమస్కరించి 'తమ మదోద్వృత్తిని యెంచినచో నగుబాటగునని పలికి క్షమింపవేడి తమతమ తాళముల నిప్పింప'మని కోరిరి. వారు—

ఎంతటి వారము మే మీ
చెంతను గానంబు సేయ శ్రీరామ మహా

హంత వహించిన దుర్మతు
లింతేనియు నెదురుఁ దమ్ము నెఱుగంగలరే.

గ్రావంబున్ గరిగింపనోపిన భవత్కల్యాణ సంగీత వి
ద్యా విస్ఫూర్తికి దీటుగా దెలియలేక జ్ఞస్థితిన్ గ్రమ్మఱన్
మా వీణల్ మొరయింప బోయితి మహో మా బెద్దయముల్ మాకు మా
కే విభ్రాంతి ఘటించెఁ బ్రోవగదవె హీనాత్ములన్ మమ్ములన్.

—అని బహుభంగుల నుతింపగా హనుమంతుడు మరల మేఘరంజి పలికించి ఆ శిలను కరగించి వారి తాళాలను తీసియిచ్చి "మీరిద్దరూ గానప్రౌఢిలో సమానులై కూడ హీనాధిక్యములెంచి వచ్చినందున శ్రీరామ ప్రభువు మీ కీవిధంగా గర్వభంగమొనర్చెను. ఇంకెన్నడును వివాదమొందుకుడు" అని బోధించగా వారు హనుమంతుని, దేవదేవుని నుతించుచు వెళ్లిపోయిరి. సత్యకును, గరుడునకును, నారదతుంబురులకును గర్వభంగమొనరింపజేసిన ఆంజనేయుని కృష్ణుడు కొనియాడి అనుమతించగా మరల హనుమంతుడు గంధమాదనాద్రికి వచ్చెను.[199]

పరాశరసంహితలో ఇదేకథ స్వల్పభేదములతో కలదు. త్రిశూల రోముడను రాక్షసుడు హనుమంతునితో పోరుచు పారిపోయి ఒక శిలలో దాగుకొనగా హనుమంతుడు వానిని వెన్నంటివెళ్లి వాడు కనరానందున వాడు శిలలో దాక్కొని యున్నాడని తలంచి గూడ క్రియాగానముతో శిలను కరగించి వానిని బయటకు లాగి వధించెను. అపుడు మైత్రేయుడు పరాశరుని ఆ గుండ క్రియాగానముతో ఇంకెవరైనా ఈ విధముగా శిలలను కరగించిరా అని ప్రశ్నించగా, పరాశరుడపుడు నారదతుంబురులు వివాదపడిన కథను తెలిపెను. ఇందులో శ్రీకృష్ణుని వద్దకు కాక వారు సరాసరి హనుమంతుని వద్దకే వచ్చినట్లునూ, అతడు గుండ క్రియాగానముతో శిలను కరగించి వారి వీణలను శిలలలో ఇమిడ్చి గానమాపెననియు తర్వాత వాటిని గానశక్తితో వారిని తీసుకొనమని కోరగా వారు అశక్తులై ప్రార్థించగా, మరల మారుతి తన గుండ క్రియాగానముతో శిలను కరగించి వారి వీణలు వారికిచ్చి గానములో వారిరువురూ సమానులేనని చెప్పి పంపెను.[200]

హనుమాన్ లీలాతరంగిణిలో కూడ ఈ కథలున్నవి. శ్రీరాముని కొఱకై హనుమ ద్వారకలో ప్రవేశింపబోవుచో సుదర్శనచక్రమతనిని నిరోధించగా

హనుమంతుడు దానిని నోటకరచుకొని ప్రవేశించెనని రచయిత పేర్కొని యున్నాడు.[201]

2 ఆంజనేయుడు అర్జునకపిధ్వజమగుట

ద్వాపరయుగమునందాంజనేయుడు పాండవులకు తోడ్పడిన సన్నివేశములు పురాణములలోను, పరాశరసంహితలోను, భారత భాగవతములలోను సమీరకుమారవిజయమునను కలవు. వానిలో స్వల్పభేదములు కనిపించినను మూలకథాంశములొకేతీరున సంగ్రహముగా నున్నవి.

పరాశరసంహితోక్త కథ : జగద్విజయసాధనాదీక్షతో బయలుదేరి అర్జునుడు వచ్చి దక్షిణ సాగరసమీపమందలి సేతువును చూచి దానిని గురించి తెలుపుమని సూతునడిగెను. అది శ్రీరాముడు లంకను చేరుటకై నిర్మించెనని సూతుడు తెలుపగా, అర్జునుడది విని కోదండపాణియై కూడ రాముడు తన బాణములతో వంతెన నిర్మింపజాలక కోతుల సహాయముతో శిలలతో సేతువు కట్టినాడని హేళనగా పలుకుచుండగా అతని దుర్వినీతవచనముల వారింప హనుమంతుడే స్వయముగా అచటికి వచ్చెను. అర్జునుడు ఆంజనేయుని మాటలు వినక అతనితో వివాదము పెంచుకొనెను. తాను తన బాణములతో సేతువు నిర్మించి ఆంజనేయుని దానిని త్రొక్కి విరుగకొట్టుమని పందెం వేసెను. హనుమంతుడా సేతువు నవలీలగా విరుగదన్నగా అర్జునుడు ప్రాయోపవేశము చేయబోగా, కృష్ణుడచటికి వచ్చి మధ్యవర్తిలేని పందెం పనికిరాదని రెండవపర్యాయము అర్జునునిచే బాణసేతువు నిర్మింపజేసి పందెము జరిపించి విజయము అర్జునునకు కలుగునట్లు చేసెను. ఆంజనేయుడు కృష్ణుని సాహాయ్యమును గౌరవించి అర్జునుడు తొలిజన్మమున తన భక్తునిగా నెఱింగి 'నేనోడితిని' అని పల్కి అర్జునునికి ధ్వజలాంఛనమయ్యెను.[202]

శివపురాణోక్త కథ : రుక్మిణీదేవికొక రోజున సౌగంధిక పుష్పములపై ముచ్చట కలిగెను. ఇది విని కృష్ణుడు అర్జునుని పిలిపించి "అర్జునా కదళీవనమున వానరులు కాపుండుచోట సౌగంధిక పుష్పములుండును. వానిని రుక్మిణి కొరకు తీసికొనిరమ్ము" అని ఆదేశించెను. కృష్ణునివద్ద తత్ప్రదేశ వివరముల నడిగి తెలుసుకొని కిరీటి కిరాతవేషంలో బయలుదేరెను. ఆ వనమున ప్రవేశించి పూలను కోయుచుండగా కాపుండిన కపులతనిని బెదరించగా అర్జునుడు వారిపై

బాణవర్షం కురిపించెను. వారు పారిపోయి తమ యేలిక అగు అంజనేయునకు తెలుపగా హనుమంతుడు వెంటనే అక్కడకు వచ్చి అర్జునుని చూచి "ఓ భిల్లోత్తమా, నీవు నిర్భయుడవై నా పాలనలోనున్న ఈ వనమున ప్రవేశించి యీ సరోవర పుష్పాలను కోయుచున్నావు. ఇవి శ్రీరామచంద్రుని పూజకై నేను పెంచుకొనునట్టివి. నీవు విష్ణ్వపరాధం చేసినావు. ఇది నీకు తగదు సుమా"అని చెప్పగా నరుడు 'వానరులు మృగసంతతివారుకదా! వారికినీ పూజలుండునా? అంతేకాక వనధ్వంసకులగు మీకు పూజలేల?' అని ప్రశ్నించెను. హనుమంతుడు ఆ మాటలువిని కోపించి 'ఓరీ! నీవు అఖిలాండకోటి నాయకుడగు శ్రీరాముని కార్యముల చక్కదిద్దజాలిన వానరులను గేలి వేయుచున్నావు. జాగ్రత్త' అని హెచ్చరించెను. అర్జునుడపహసించి 'ఓ వానరశ్రేష్ఠా! నీ కోతి చేష్టలకు, ఆ రాముని కార్యాలకు సరిపోయింది. వనచరుడవగు నీకు వనవాసయోగ్యుడగు రాముడు గురువగుటలో ఆశ్చర్యములేదు. నీ భృత్యత్వ మాయనకే సరిపోయినది. అయనకేమి మహిమ కలదు. సాగరానికి వంతెన కట్టుటకు కోతులతో రాళ్లు తెప్పించవలెనా! బాణములతో వంతెన కట్టలేని అతని ధనుష్పాండిత్య మేమి పాండిత్యము?' అని పలుకగా అంజనేయుడు 'ఓయీ! అట్టి వంతెన రాముడు కట్టియుండినచో నావంటివాడు నడచి వెళ్లినచో అది కూలిపోకుండునా?' అని బదులు ప్రశ్నించెను. అపుడర్జునుడు 'ఇదిగో నేను ఇపుడు నా బాణములతో వంతెన కట్టెదను. నీవు కాదుగదా నీ తల దన్నినవాడు నడచినా అది చెక్కుచెదరదు. కట్టమందువా?' అని అనగానే హనుమ అంగీకరించి అతనిని సముద్రతీరానికి తీసికొని వచ్చెను. ంజనేయుడు చూచుచుండగా అర్జునుడు తన బాణములతో వారధి కట్టెను. ంనిని చూచి 'వీడు అసాధ్యుడే' అని హనుమ తనలోనే అనుకొని యీతనితో ఈ కలహము అనవసరమేమోనని భావించుచుండెను. పని పూర్తిచేసి అర్జునుడు అంజనేయునివైపు చూడగానే హనుమంతుడు పశ్చిమాభిముఖుడై వెళ్ళి ఒక మహీధరము చాటున త్రికరణశుద్ధిగా శ్రీరాముని ధ్యానించి, ఒడలుజలిపించి విశ్వరూపుడై భూమ్యాకాశాలునిండి పెద్దపెద్ద అంగలువైచుచు వచ్చెను. అది చూచి అర్జునుడు తనకు పరాభవము తప్పదని మనసులోనే గుర్తించి కృష్ణుని ధ్యానించి శరణువేడెను. అతని ప్రార్థన విని కృష్ణుడచటకుచేరి కూర్మరూపముతో ఆ వారధిక్రింద నుండెను. అంజనేయుడు ఆ వంతెనమీద ఎన్ని గంతులు వేసినా అది కూలిపోక కేవలము జవజవలాడెను. కొంతసేపటికి

సాగరజలములు రక్తమయముకాగా హనుమంతుడదిచూచి 'ఇదియేమి' అని కిరాతుని ప్రశ్నింపగా అర్జునుడు నవ్వి 'అయ్యా! నా బాణాలు పనిలేక త్రుప్పు పట్టినవి. నీ దేహభారంతో అవి రాపిడి జలములకలిసి రక్తవర్ణమైనవి' అని చెప్పెను. హనుమంతుడామాటలను విశ్వసింపక తన దివ్యదృష్టితో చూడగా, కూర్మరూపుడై విష్ణువు వంతెనను మోయుచుండుట చూచి తాను భగవదపచారము చేసినట్లు తలంచి దానికి శిక్షగా తానే సముద్రమునపడి మరణింప దలంచుచుండగా కృష్ణుడు విష్ణురూపుడై అచట వెలసి ఆంజనేయు నెంత నివారించినను అతను పంతమును వీడనందున కోదండపాణియైన శ్రీరామునిగా సాక్షాత్కరించి ఆతనిని బుజ్జగించి "హనుమా! నేటినుండి పాండవులు నీకు సోదరులు. వీరిని నీవు సమయములో కాపాడుచుండుము" అని చెప్పి అంతర్ధానమొందెను. అంత అర్జునుడు ఆంజనేయునకు తా నొనర్చిన అపరాధమును క్షమింపుమని ప్రార్థించి అతని కృపకు పాత్రుడై సౌగంధిక పుష్పములను తీసికొని వెళ్లెను.[2] [3] ఈ కథలో అర్జునుని ధ్వజమగుటకు ఆంజనేయుడు పందెము కాసినట్లు మాత్రము లేదు.

సమీరకుమారవిజయము ప్రకారం: ఈ కథ పుష్పగిరి తిమ్మన విస్తరించి వ్రాసియున్నాడు. ఒకనాడు క్షారపయోరాశి వద్దకు కృష్ణార్జునులు చేరియుండ, కృష్ణుడు ఆ సముద్ర వైభవమును కిరీటికి వర్ణించి చెప్పసాగెను. 'ఈ సాగరాన్ని ఒక వానరం దాటింది. ఒక చక్రవర్తి దీనిపై ఉగ్రాస్త్రముల ప్రయోగింప బూనెను. దీనినే ఒక ముని మ్రింగెను. అందువల్ల నా దుస్తరత్వ, దుశ్శకత్వ, దురాపహకత్వ గుణములు పొల్లుపోయినవి' అని కృష్ణుడు తెలుపగా, అర్జునుడు ఆశ్చర్యపడి దాశరథికి కోదండవిద్యాపాండిత్యం ఉండి కూడా అక్షయబాణములుపయోగింపక సాగరమునకు సేతువే ఏలకట్టెనో తెలుపుమని కోరుచు "రామునకు ధీసంపద కరువైనదా? లేక ధనుర్విద్యా పాండిత్యము లేదా?" అని అడిగెను. అర్జునుడూహించిన కారణములను త్రోసిపుచ్చుచు కృష్ణుడు 'అర్జునా! ధీరులు, వీరాధివీరులు రాముని సైన్యములో ఎందరో కలరు. బాణములతో బాట నిర్మించి యుండినచో వారి పాదముల ఘట్టనకది పటాపంచలై పోవుననియే రాముడు సేతువును నిర్మించెను. అంతే కాక వాయుసూనుడగు హనుమంతుని వేగానికది తాళజాలదు. అతడు మహాబలవంతుడు. కావుననే శతముఖుడను రాక్షసుని చంపు సందర్భములో 'నందర మైనిడుకొని, చతురబ్ధుల కవలగాదె క్షణమున చేర్చెన్'అని తెలిపెను.

ఈ కథ వినిన విజయుడు వాయుపుత్రుడంతటి బలశాలియైనచో నేను కట్టే సేతువును పదప్రహతులతో కూల్చగలడా? అని ప్రశ్నించెను. అంత కృష్ణుడాక్షణముననే హనుమను స్మరించి అతనిని వెంటనే అక్కడికి రప్పించి గారవించి 'కపివరా! నరుడు శరాళితో సేతువు కట్టినచో అది నీ పాదహతు లకు నిల్చునో నిలువదోనన్న సంశయము కలిగియున్నాడు. తన్నివృత్తికై నిన్ను పిలిపించితిని' అని తెల్పెను. కృష్ణానుమతితో అర్జునుడు అంపకట్ట లతో సేతువును కట్టగానే దానిని త్రొక్కుమని కృష్ణుడాంజనేయునాదేశించగనే హనుమ —

"గుప్పునం దుమికి నంతనె దారునవిచ్చి నుగ్గులై
గప్పె శర ప్రకాండ శతఖండము లంబుధి నెల్ల ఫేనముల్
జొప్పదెఁ గట్టికట్టు నరుజూచి పయోధి హసించెనో యనన్."

—నరుని బాణములు వానరుని పాదహతి కోర్వక గుభగుభ స్వానములతో శిథిలముకాగా క్షోభించిన సముద్రజలాలు ఆకాశానికెగిరెను. అన్యసముద్రము లలో క్షోభ యేర్పడెను. నానావిధ జంతు సంతానములు ప్రాణములపై ఆశలు వీడెను. శరసేతువట్లు గ్రుంగిపోగా, ఈర్ష్యారోషాదులనొంది అర్జునుడు అంజనేయుని చూచి యింకొకమారు 'ఘటించెద నిల్వదేని గాండీవముతో శిఖం చడుదు నిక్కమని' అనగా అతని పందెము నంగీకరించి వాయుసూనుడు నా దెబ్బలకది నిల్చినచో నీ చెలినై, నీ రథకేతనమై యుండెదనని మారు పందె మును పలికెను. ఇది గమనించిన కృష్ణుడు అర్జున రక్షాదీక్షలో కూర్మరూపము ధరించి శరసేతువుక్రింద చేరెను. ఆంజనేయుడు ఎన్నివిధాల దుమికినా, త్రొక్కినా అది కూలిపోకుండుటను గమనించి, యీర్ష్యారహితుడై అది కృష్ణుని మహత్తుగా గుర్తించి అర్జునునికి ఓడినట్లు అంగీకరించి అతనిని కౌగ లించి 'సఖివృత్తి వహించితిఁ డెక్కెమెక్కెదన్' అని పలికి శౌరికి నమస్కరించి వెళ్ళిపోయెను. అతడటుపోగానే కృష్ణుడు బొడబొడమని నెత్తురు కక్కసాగగా నివ్వెఱపడి చూచి నరునకు నారాయణుడు—

పరమ పావనుండు పవమాన తనయుండు
దుముక నీ శరాళి దునిసెనేని
దప్పుఁ గార్యమనుచుఁ దామేటి బలెక్రింద
నుండినాడ నగుట గుండె పగిలె.

— అని దొప్పుతూ కృష్ణుడు పలికెను. మహావేగమూ, బలమూ కలిగిన హనుమంతుని బరువునకు తన వీపు బ్రద్దలైందనీ, తన యేపు తీంరిదనీ, తన చూపు బెడగారిందనీ, తన గుండె చెదరిందనీ, తనకు మూర్ఛవచ్చిందనీ, ఎలాగో ఓర్చుకొనగా కొంత తడవునకు సేద తీరందనీ 'నీతోడి కూర్మికి నిటువలె నైతి'నని తెలుపగా, సవ్యసాచి ఆశ్చర్యమొంది, హనుమంతుని మహిమ నంగీకరించి తన ధ్వజమందున్న సామీరిని గౌరవించెను. భారత యుద్ధములో గాండీవి టెక్కెముమీద నున్న పావని కౌరవ సైనికులకు మిరుమిట్లు గొల్పుచుండుటేకాక ప్రత్యర్థి నేత్రముల కొక్కొక్కమాటు బృహద్రూపంతోనూ, ఒక్కొక్కమాటు గుండెలదరించు హుంకారముతోనూ తోచెడివాడు. దిక్కులదరునట్లు అర్చుచు, సూర్యరశ్మిని కవ్వించు కాంతితో తేజరిల్లుచు శత్రుసైనికులను తాను సగము చంపగా అర్జుననకు శేషకార్యము సులభమగునట్లుండెను. అంజనేయునిపేరు స్మరించగనే నిర్జరరిపు సంగ్రామవిజయము కల్గుననగా, ఇంక అంజనేయుడే తోడైయుండగా జయమరుదగునా అని ద్వాపరయుగ ప్రజ భావించుచుండెడిది.[204]

3 హనుమంతుడు భీమసేనునకు తోడ్పడుట

భారతమున అరణ్యపర్వమున భీముడు ద్రౌపది కొఅకై సౌగంధిక పుష్పములను తెచ్చు సందర్భమున భీమునకు హనుమంతుడు తోడ్పడినట్లు సంగ్రహముగా కథ కలదు. భీమునకు తన విశ్వరూపము చూచి యుగధర్మములను హనుమంతుడు విశదపరచినట్లున్న ఈ కథను గ్రహించియే సమీర కుమార విజయకర్త విపులీకరించి యున్నాడు. శివపురాణమున కూడ ఈ కథ కలదు.

శివపురాణోక్త కథ: నల్లని కమలములతో శివుని పూజించినచో శత్రు వినాశకరమగు వరముల నాతడియ్యగలడని ద్రౌపది భావించి అట్టి పూవులను వేయింటిని తన పూజకొఅకై తెప్పింపుమని ధర్మజుని కోరెను. తత్పేకరణకై ధర్మజుడు భీముని నియోగించి పంపెను. ఆ పుష్పముల కొఅకై అనిలసుతుడు అంజనేయుడున్న గిరిగహ్వర ప్రాంతమునకు భూమి దద్దరిల్లునట్లుగా నడచి వచ్చుచుండగా అ పాదధ్వని అంజనేయుని తారకరామనామ జపభంగకారణము కాగా హనుమంతుడు గిరిగహ్వరములో నుండి యీవలకు వచ్చి అ వచ్చువాడు

తన సోదరుడగు భీముడని తెలిసికొని, అతని ప్రయత్నమును గుర్తించి కుంతీ సుతుని బలపరాక్రమాదుల పరిక్షింపనెంచి దారి కడ్డముగా తన తోక నుంచి పండుకొనెను. భీముడతని నొక ముసలికోతిగా భావించి గర్వముతో "ఓ మర్కటమా, నీ వాలము దారికి అడ్డముగా నున్నది దానిని తొలగించుము" అని కోరెను. అంత ఆంజనేయుడు 'అయ్యా, నేను వృద్ధుడను మార్గమును ప్రక్కకు తప్పించుకొని వెళ్లుము' అని వినయముగా చెప్పెను. అహంకారియగు భీముడు 'ఒక క్షత్రియవీరుడు కోతికిలొంగి మార్గము తప్పి చనునా' అని ప్రశ్నించెను. హనుమంతుడింకనూ వినయమభినయించి 'అయ్యా, అట్లయినచో నీ దారికి అడ్డముగా నున్నది నా వాలమేకదా! దయయుంచి దానినొక ప్రక్కకు గెంటివేసి మార్గము చేసికొనిపొమ్ము' అని అనెను. భీముడా పలుకుల విశ్వసించి, తన కాలిచే వాలము నొక ప్రక్కకు గెంటబోయెను. అంతమాత్రానికే అది కదల నందున ఎడమచేతితో ఎత్తి అవలకు పారవేయబోయెను. అదికూడ సాధ్యపడ నందున రెండుచేతులతో ఎత్తి ప్రక్కకు తప్పింప చూచెను. అదియు విఫలము కాగా, మోకరించి 'హుం' అని వూపిరి బిగబట్టి రెండుచేతులతోపట్టి ఎత్తబోయి ఒడలంతా చెమటపట్టి నీరైనా ఆ తోకను కాస్తకూడ కదిలించలేక అహంభావ మంతరించగా, ఆతడెవడో మహానుభావుడై యుండునని తలంచి, ఎదుటకు వచ్చి నమస్కరించి 'అయ్యా, తమరెవరో మహాత్ములవలె నున్నారు. శివకేశవు లలో నొకడివో! నాతప్పు మన్నించి మీ వృత్తాంతం నాకుతెల్పి నన్ను ఆశీర్వ దించండి.' అని ప్రార్థించెను. వానిపై కనికరము వహించి హనుమంతుడు దిగ్గునలేచి 'తమ్ముడా,' అని భీముని కౌగిలించి తన వృత్తాంతము తెలిపి 'విజయోస్తు'ని భీమునాశీర్వదించెను. అంత భీముడతనికి ప్రదక్షిణ నమస్కా రముచేసి, అంజలించి తన అపరాధము మన్నింప ప్రార్థించెను. 'అన్నా, రుద్రావతారా, మహాబలా, నాకొక సంశయమున్నది. నివారింప వేడుచున్నాను. దుర్జయులగు రాక్షసులను ఈ నీ అల్పాకారముతో ఎట్లు నిర్జించితివోనని నాకు ఆశ్చర్యమగుచున్నది. శ్రీరామునకు నీవుచేసిన సహాయమపారము నీ వలననే ఆ దంపతులు కలసికొనిరి. నిన్ను స్మరించు భక్తులకు శత్రువుల బాధలేగాక, భూతప్రేత పిశాచాదుల బాధలుకూడ నశించును. నీవు మా పాండవుల కొఱకై నాకొక వరము ననుగ్రహింప కోరుచున్నాను. కౌరవులు మా సోదరులనడవుల పాలు గావించిరి. మా రాజ్యమపహరించిరి. వారికిని మాకును పోరు తప్పక జరుగును. అందులో నీవు మాకు సర్వవిధాలా తోడ్పడి మాకు విజయము

చేకూర్చ కోరుచున్నాను" అని వినయముగా పలికిన భీముని మాటలకానందించి హనుమంతుడు "తమ్ముడా, నీవు కోరినదొక పెద్ద కోరికయేకాదు; దుర్ఘట కార్యమునుకాదు కాని, నేను త్రేతాయుగపువాడను ఇది ద్వాపరయుగము. మీకును, నాకును సుమారు రెండు యుగముల వ్యత్యాసమున్నది. యుగభేద మును బట్టి మీకునూ, నాకునూ అత్యంత పరిమాణ భేదమున్నది. నాటి నా స్వరూపమును ఇప్పటి మీరు చూడనైన చూడజాలరు. నేను మీ మానవులలో వీరవిహారమెట్లొనర్తును? అది అసంభవము. కృతయుగమున నరవానర ప్రమా ణము ఇరువదియెనిమిది మూరలు. త్రేతాయుగమున పదునాలుగు మూరలు. ద్వాపరమున ఏడుమూరలు. కలియుగమున మూడున్నర మూరలు మాత్రమే యుండును. ఈ మూరల ప్రమాణము ఎవరిమూర వారికే వర్తించును. కావున ఇపుడు నేను మీతో కలిసి యుద్ధము చేయుట అనగా మేకలతో ఆబోతు తలపడినట్లగును. కావున అది పొసగదు. నేను నా యథారూపముతో యుద్ధము చేసితినేని ఆ కదనరంగమంతయు పాతాళమునకు క్రుంగిపోవును" అని తెలిపెను. భీముడు మరల "సోదరా, భీష్మద్రోణకృపాదులు పరశురాముని కన్నా బలవంతులు. వారితో పోరుట నీకు సరిపడునుగదా!" అని అనగానే, అంజనేయుడు "ఓయీ అమాయకుడా, నావంటి వానికి మీ భీష్మద్రోణాదులొక లెక్కా? నిజంగా వారు నా రూపం చూడగనే మూర్ఛిల్లి పడిపోవుదురు. తనకంటే అల్పులతో పోరుట వీరలక్షణం కాదు. కావున నీవు కోరినట్లు చేయుటకు వీలుకాదు" అని జవాబిచ్చెను. భీముడు సంతసించి వాయుసుతుని బృహద్రూపం చూపుమని ప్రార్థించెను. తృటిలో అంజనేయుడా బ్రహ్మాండ పర్యంత రూపము దాల్చెను. అపుడతని శిరస్సున శ్రీరాముడు, దక్షిణ భుజమున సౌమిత్రి, వామభుజమున సీతాదేవి శ్రీరాముని చరణసన్నిధిని విభీష ణుడును చూపట్టగా భయవిహ్వలుడై భీముడు మూర్ఛపోయెను. అంత హను మంతుడు తన విశ్వరూపము నుపసంహరించి భీముని మూర్ఛనుండి తేర్చి లేవనెత్తి, బుజ్జగించి, భయంబుడిపి, ధైర్యముచెప్పి తన దేహమునుండి ఒక రోమము నూడదీసి భీముని చేతికిచ్చి "దీనిని భద్రముగా కొనిపోయి అర్జునున కిచ్చి అతని రథమునకు కట్టుకొనుమని చెప్పుము. అంతటినుండి నేను ఫల్గును నకు విజయము సేకూర్తును. ఆ రథమును గాంచినంతనే శత్రువులు భయకంపి తులై వెలవి పాఱుదురు. అంతటి నుండి పార్థుడు కపికేతనుడను సార్థక నామము కలిగి జగద్విఖ్యాతమగును. నీకును సర్వదా జయసిద్ధికై నేను నీ

గదాదండమున నివసించుచుందును." భీముడతనికి వినమ్రుడు కాగా, అంజనేయుడతనికి గంధర్వోద్యానమునకు దారిని తెలిపి అచట దేవగంధర్వ గురుజనులయెడ ఎట్లు వినయవిధేయతలు చూపవలెనో తెలిపి దీవించి పంపెను.[205]

సమీరకుమారవిజయములోని కథ ప్రకారం: పాండవులు అరణ్యవాసమొనర్చు సమయములో గంధమాదన పర్వత ప్రాంతములో భీముడు పాంచాలితో స్వేచ్ఛగా సంచరించుచుండెను. వాయుదేవుడు తన పుత్రుని సంప్రీతికై 'కాంచన సౌగంధిక పుష్పము వేయగా దానిని చూచి ద్రౌపది అలాంటి పుష్పాలను తెచ్చి యివ్వమని భీముని కోరెను. దానిని తెచ్చుటకై భీముడు శర, శరాసన గదాబంధురపాణియై బయలుదేరెను. అతనికి కనకపుటనటి తోట కనిపించగా దానినిచూచుచు దిక్కులదరునట్లుగా శంఖకలిత నినదమొనర్చెను. అచట యోగముననున్న ఆంజనేయునకాధ్వని వినపడెను. వచ్చినవాసిని భీమునిగా గుర్తించి అతని బలాన్ని పరీక్షింపనెంచి దారికడ్డంగా వుండునట్లు తన తోకతో కొన్ని చెట్లను చప్పుడు కలుగునట్లుగా లాగి పడవేసెను. అంజనేయుని లాంగూలస్ఫాలనము భీమునికి మేఘగర్జనవలె వినబడెను. ఆ శబ్దాన్ని అనుసరించి వచ్చిన కౌంతేయునకు కదళీషండ మధ్యభాగంలో చంద్రకాంత శిలపై శయనించినవాడూ, గొప్ప వక్షఃస్థలముతోనూ, కొంచెం వంగిన హనువుతోనూ, ఎట్టని పెదవితోనూ, అజానుబాహువులతోనూ, పిశంగ నేత్రముతోనూ యోగనిద్రారతుడైన ఒక వ్యక్తిగా అంజనేయుడగుపించెను. అతని యోగసమాధికి భంగము కలుగునట్లు భీముడు గొప్ప 'రవళి' చేయగా, హనుమంతుడు విని—

జరా రోగ తప్తాంగు సంప్రాప్త నిద్రా
భరా కుంచితా పాంగు భ్రాతృత్వ నిత్యా
దర స్ఫూర్తి పోనాడి ధర్మంబో శ్రాంతి
స్ఫురచ్చిత్తు నన్నిట్లు బోధింప నీకున్.

—అని అనాదరముగా పలికెను. 'అయ్యా! తిర్యగ్జాతులకు ధర్మములు తెలియవు. కాని నీవంటి సత్కార్యాకార్య వివేకవంతులిట్లా చేస్తారా? నీకు హతదయ లేదా? ఇట్టి దుశ్చర్యలవల్ల మావంటి వృద్ధజంతువుల మనస్సు క్షోభించదా? ఇది నరుల కగోచరమైన వనముకదా! ఇక్కడికి ఎవరూ చేరలేరు. నివు ఎవడవు? ఎవరి తనయుడవు? ఇక్కడికెందుకొచ్చితివి? ఇంకపై వెళ్లుటకు

ఖేచరత్వమున్నవారికే అది సాధ్యము. అమృతోపమానములైన ఫలము లిందున్నవి. వానిని నీవు భుజింపుము' అని అనెను. భీముడు పాండురాజ క్షేత్రమున వాయువరమున జన్మించినవాడనని తన ప్రవర చెప్పి తానొక ప్రయోజనమును గూర్చి యేగుచుంటినని తెలిపి—

"....   ....   తెరువిమ్ము నీ వీనినాడు నాడు
కడలి లంఘించు హనుమ కైవడిని వడిని
బొసగ గిరితోడ నిను దాటిపోదు...."

—నని బెదిరించెను. అదివిని ఆంజనేయుడు 'అయ్యా! హనుమంతుడు సముద్రాన్ని ఎందుకు లంఘించెనో తెలుపుము' అని కోరగా, భీముడు శ్రీరాముని కథను తెల్పి, హనుమంతుడు సీతాన్వేషణ తత్పరుడై సముద్రమును దాటిన మహాజవసత్త్వుడని తెలిపి—

నే హనుమంతుని యంతటి
బాహుబలాటోప సత్త్రభావాఢ్యుడ నా
సాహసము సూచెదే యన
నా హనుమ నిగూఢ మందహాసాననుడై.

అన్నా, నే ముదివాడ లేవ వడి లేదెందెందో నీ వేగగా
సన్నాహంబున వచ్చినాడవుగదా జాగేల నీకేల నీ
సన్నంబైన మదీయ పుచ్ఛమొక పార్శ్వంబందుఁ బొందించి

—పొమ్మని కోరెను. అంజనేయుని మహిమ తెలియని భీముడు అహంకార పంకాత్ముడై అతనిని సామాన్యునిగా భావించి, పొగరుగలవాడై ఎడమచేతితో ఆ వాలమును కదల్చుటకై పూనెను. అది కదలనందున తన శరశరాసనాదుల ప్రక్కనబెట్టి వస్త్రాదులను గట్టిగా బిగించుకొని తోకను రెండుచేతులతో ఎత్తుటకై ప్రయత్నించెను. బలమంతయు కూడదీసుకొని పల్మారు వూగివూగి కదిలించి, నిస్సత్త్వుడై మోకరిల్లి పడి మొగము వెలవెలపోగా తలవంచుకొని దిగులు చెందుతూ, తడబడుతూ, ఒళ్ళంతా చమటపట్టినందున కొంత విశ్రమించగనే అతనికి కనువిప్పుకలిగి ఆంజనేయుని పాదాలపై వ్రాలి భక్తి వినయాదుల చూపుచూ 'స్వామీ! మీ మహిమ తెలియక వెఱ్ఱివెఱ్ఱి మాటల నంటిని. నేను గుణహీనుడను. నన్ను కనికరించండి. మీరు వానరాకార

ములో నున్న లోకనాధులో? ఇంద్రులో? శివుడో? విష్ణువో తెలుపండి' అని శరణువేడెను.

అంత హనుమంతుడు చిరునవ్వుతో 'అన్నా! నేనే వాయుపుత్రుడనగు అంజనేయుడను. ఈ లోకమున రామకథా సుధాంబుధి ఎన్నాళ్ళుండునో అన్నాళ్ళు నా తనువుండునట్లుగా సీతారాములు నాకు వరమునిచ్చియున్నారు. కావున నేను ఈ కదళీవనమున నివసిస్తూ ఉన్నాను' అని పావని చెప్పగానే భీముడు భయభక్తులింపార ప్రణామమొనర్చి యిన్నాళ్ళకు అంజనేయుని తాను చూడగల్గు సుకృతమునకు ఆనందించి, అంజనేయుని స్తుతించి తనజన్మ ధన్యత గాంచెనని పలికి వినయముతో అతనినిచేరి సాగరలంఘనమునాటి అతని రూపమును చూపునట్లుగా ప్రార్థించెను. అపుడు మారుతి 'కాలస్వభావమును' గూర్చి తెలిపి, 'మునుపటి రూపము చూపగా గూడునే' అని తెలిపెను. 'యుగ ధర్మములనుబట్టి ఒక యుగములోని రూపమునకు మరియొక యుగములోని రూపమునకు వ్యత్యాసములుండుననియు, కాలము నతిక్రమింప త్రిమూర్తులకు కూడ దుశ్శకమ'ని బోధించెను. భీముడంత 'నాకు చతుర్యుగ ధర్మములనైనా తెలుపు'డని కోరెను.

హనుమంతుడు కౌంతేయునియెడ ప్రసన్నుడై 'కృతయుగమున ధర్మ దేవతా రూపమగు వెలిగిత్త నాలుగు పాదములతో నడచును. విష్ణువు తెల్లనివాడై యుండును. జనులు సత్క్రియాశీలురై క్షేమమొందుదురు. మదగర్వ ఈర్ష్యామాత్సర్యాదులు లేక కీడుహొందకుండా జనులు వర్తింతురు. త్రేతాయుగమునందు గోవు మూడు పాదములపై నడచును. హరి రక్త వర్ణుడై యుండును. జనులు సత్యవ్రతాఢ్యులై యజ్ఞతపోదాన రూపమగు కార్యములొనర్చి తత్ఫలమగు సుగతులనొందుదురు. ద్వాపరయుగమున ధర్మవృషభము ద్విపాదములతో చరించును. హరి నల్లనిరూపములో నుండును. ప్రజలు సత్యశమదమములు కలిగికూడ కామార్థములకు ప్రాముఖ్య మిత్తురు. కలియుగమున ధర్మవృషభము ఏకపాదమున చరించును. హరి పీతవర్ణుడై యుండును. కలిలో ప్రజలు అనృతమూ, హింస, కాపట్యము, నాస్తికతాది దోషభూయిష్ఠులై యుందురు. సర్వేశ్వరుడే ఈ నాలుగు యుగము లలో నాలుగు రీతులలో వెలయుచుండగా కాలాతీతునిగా నుండుట వా తదసహో దరా' అని అంజనేయుడు తెలుపగా విని కుంతీసుతుడు 'మహాత్మా! కోటును

నీకు అడ్డుగానుండునా? నీకును షడ్వికారములున్నవా? నీకు వృద్ధత్వమున్నదా! నీవు సాక్షాదీశ్వరుడవే కానీ వనచరుడవా? నీచేత కానిదేమున్నది. నన్ను మాయపుచ్చక నీరూపం ఎటులైనా చూపుము' అని పరిపరివిధాల ప్రార్థింపగా అంజనేయుడంగీకరించి తన నిజరూపము చూపింతునని కొంచెము సేపటిలో విశ్వరూపము చూపగా భీముడు కన్నులురెండునూ మూసి శిరోదిక్కలిత ప్రాంజలియై 'రగడ'లో అతనిని నుతించుచు—

మొలపూసలో పాదముల గజ్జెలో చుక్క
లెటిగింపు నీకు లోకేశ వినుత
విరిబంతులో సన్నవిడిరాలో నీ కిలా
ధరములు వివరింపు పరమ ధైర్య
పల్వలోపమమో గోష్పదమో తెల్పు సము
ద్రము నీకు గారుణ్య సముద్ర
మక్షికలో లేక మశకంబులో నీకు
దనుజులు వచియింపు దైత్య హరణ
యౌర నీయంతవాడు తోడయి నడవగ
రావణు జయించుటే దొడ్డ రాఘవునకు.

—అని వినుతించి మరల పూర్వ రూపమునే ధరింపుమని కోరెను. అంత హనుమంతుడు తన తొంటి రూపమున భీమునకు ప్రసన్నుడై 'భీమా! శత్రువులు చూచునపుడు నేనింకను ఏడురెట్లు ఘనతరముగా నుండెదను. నీవు నాకు తమ్మునివి కావున నన్ను నీవు యింతగా పొగడవలసిన పనిలేదు. నీవు వెళ్ళుచున్న పనిని నా భావమున నేను గుర్తించినాను. దైవతములమీద సాహసము పనికిరాదు. దేవతలు ధ్యాన, దాన, యజ్ఞ తపో తృణాదులకు సాధ్యులగుదురేకానీ వారిపై కోపించి సాధించుట కష్టము. నీకు ఆపద కలుగకుండా నీవు తలంచిన కార్యము నెరవేరగలదు. అంతేకాదు, ధార్తరాష్ట్రుల నందరిని నేను నాభుజబల స్ఫూర్తితో గెలువగలను' అని ఆంజనేయుడు తెలుపగా, భీముడు 'మీ కరుణా కటాక్షమున్నచో శత్రువులుడిగినట్లే కదా! మేము సాధింపవలసిన శత్రునిర్మూలనమనే కించిన్మాత్ర కార్యమునకు స్వయముగా మీరు ప్రయత్నింపవలసినపని మీకిచ్చుట మాకు భావ్యముకాదు. మీ శుభాశీస్సులున్న చాలు'నని పలుకగా హరీశుడు 'మీకు శ్రీకృష్ణుడు తోడు

న్నాడు. కావున ఇతరులతో మీకు పనిలేదు. అయినా, నరుని కేతనములో నుండు నన్ను నీవు స్మరింపుము. భారతయుద్ధములో నీ 'బలోద్ధతి చూతు' నని చెప్పి కార్యసిద్ధి కలుగునట్లు ఆలింగన పూర్వకముగా ఆశీర్వదించి, అనుమతించి ఆంజనేయు డంతర్ధానముకాగా 'హనుమంతుని పరిరంభణమున మహిత బల శ్రీమంతుడై యక్ష రాక్షస సంతానము గెల్చి సౌగంధిక ప్రసూనముల దెచ్చి ద్రౌపదికిచ్చెను.[206]

4 పురుషామృగమును తెచ్చుటలో భీమునకు హనుమంతుడు తోడ్పడుట.

ఈ వృత్తాంతము పరాశరసంహితలోను, సమీరకుమారవిజయములోను మాత్రమే కలదు. ధర్మరాజు అఘనిష్కృతికై చేసిన అశ్వమేధయాగములో బహుద్విజ భోజనాదులవలన ఉచ్ఛిష్ట సమిష్టిచే యాగశాల శుద్ధిని కోల్పోకుండా నిత్య సంశుద్ధికై ఏమి చేయవలయునో తెలుపుమని ధర్మజుడు కృష్ణుని ప్రార్థించగా పురుషామృగమును రప్పించినచో అది యున్నచోట ఎంత అంటు అయినా పరమ పవిత్రమై పరిఢవిల్లునని కృష్ణుడు తెలిపెను. పరాశరసంహితలో ఈ కథలో కూడ భీముడురాగా హనుమంతుడతనిని పరీక్షించుట, యుగధర్మములు తెలుపుట, హనుమద్విరాట రూప సందర్శనములున్నవి. హనుమంతుడు పురుషామృగ తత్వము తెలిపి అది పురుషుల భక్షించు అతి క్రూరమైనదని తెల్పి దానికి చిక్కకుండా పరిగెత్తినచో ప్రమాదము తప్పించుకొనవచ్చునని తెలిపి తన వాలమందలి రోమముల మాహాత్మ్యము తెలిపి కొన్ని రోమములనిచ్చి పంపెను. భీముడు పురుషామృగమునుచేరి ధర్మజుని యాగ వృత్తాంతముతెల్పి హస్తినాపురమునకు రమ్మని కోరెను. ఆ మృగముకూడ తనకుచిక్కకుండా పరిగెత్తినచో తానెట్టి హానిచేయననియు, చిక్కినచో భక్షింతుననియు చెప్పి బయలుదేరెను. రుద్రకుమారుని రోమ ప్రభావమువలన భీముడా మృగమునకు చిక్కకుండా పరిగెత్తి ఆఖరురోమము ముగియుసరిగి నగర ద్వారమున ఒక కాలు ఉంచిన తర్వాత మృగమున కతడు చిక్కెను. అతనిని తినుటయా, మానుటయా అని విచికిత్సలోనుండగా ధర్మరాజువచ్చి ధర్మసూక్ష్మము తెలిపి నగరద్వారానికి వెలుపలగల భీముని దేహము తినవచ్చునని చెప్పగా అతని నిష్పక్షపాత న్యాయనిర్ణయమునకు ఆ మృగము హర్షించి భీముని చంపకుండా వదలి యాగశాలకు చేరెను.[207]

సమీరకుమారవిజయమందలి కథ : ధర్మజుని యాగశాలలో పురుషా మృగము సంచరించినచో అచట నిత్యసంశుద్ధియగునని కృష్ణుడు తెలిపి "పురుష భావము మృగస్ఫురణతోనుండి నిష్పురుషగ్రావ విపినసీమలో పురుషామృగ ముండుననియు, అది యున్నచో నెంత యంటైనా పరమ పవిత్రమై పరిఢవిల్లు ననియు" తెలిపెను. ఆ మృగమును స్మరించి త్రివారము పఠించినచో దుస్స్వప్న భయములు తీరుననియు, దానిని యక్ష రాక్షస సిద్ధ విద్యా ధరాధి పతులు సపర్యలందించుచుందురనియు, ఆంజనేయుని సాహాయ్యమున భీముడు దానిని కొనిరాగలడనియు తెలుపగా ధర్మజుడు తన తమ్ముని తత్కార్య సాధనకై ప్రేరేపించి పంపెను. భీముడు గంధమాదనమునకుచేరి హను మంతుని ప్రసన్నుని చేసికొని తనతో పురుషామృగమును తీసికొని పోవుటకు తగిన ఉపాయమును తెలుప ప్రార్థించెను. హరీశుడపుడు 'తమ్ముడా! ఆ మృగముండు అడవికి చేరుటకు సురలైనా భయపడెదరు. నీవు కృష్ణానుమ తితో వచ్చినాడవు కాన నీకు నేనొక ఉపాయమును బోధించెదను. ఈ మృగమువద్దకుచేరి అశనిధ్వానోద్ధతితో తర్జించినచో అది ఆ ధ్వని చేసినవానిని వెంబడించి పట్టుకొని, కినుకతో వానిని చెండాడును. అది వెన్నంటినపుడు ఎంత బలవంతుడుకూడ దానితో సమానమగు వేగముతో వెళ్ళజాలడు. నీకు నా శరీరమందలి యేడు రోమముల నిచ్చెదను. వీనిని నీ దగ్గరుంచుకొని మృగమువద్దకు వెళ్ళి గట్టిగా గర్జింపుము. అది కినుకతో నీపై బడుటకు వచ్చును. నీకు బడలిక వచ్చువరకు నీవు పరిగెత్తి ఆ మృగము సమీపించ గనే నేనిచ్చిన రోమములలో ఒకదానిని దాని ముందర వేయుము. నా ప్రభా వము వలన ఆ రోమ మొక లింగముగా మారును. 'లింగముగన్నఁ బూజ సేయక రాదు పురుషమృగము'. అది పూజించుచున్న సమయములో—

" .... నీ వేగు మింతలోన
జాడబట్టుక యేతేర జోడు తోడ
నిటుల యెలయించుకొని పొమ్ము హస్తిపురికి"

— అని తెలిపి ఆశీర్వదించి పంపెను.

ఆ సప్తరోమముల గ్రహించి భీముడా మృగమున్న కారడవిజొచ్చి ప్రళయాభీలంగా ఘోషించగానే ఆ మృగము లేచి, అర్చి, బిడిముడిపడి, వడముడిని వెంటబడగా భీముడు జవము కొద్దీ పరుగెత్తి శ్రమ కల్గిన క్షణంలో

సామీరి యిచ్చిన రోమములతో నొకదానిని తీసి మృగముపై విసరగానే పరమళించు పూవులతోటలో కమలకైరవములతో గూడిన సరోవరములతో రత్నగోపురములతో కూడిన శివలింగముతోడి ఆలయమక్కడ ఆవిర్భవించెను. ఆ మృగము వెంటనే హరునకు నమస్కరించి, సరస్సులో మునిగి వివిధ పుష్పవ్రాతముదెచ్చి నిష్ఠతో శివపూజచేసి ఆ తర్వాత రెండింతలు కోపముతో భీముడెంతదూరము పోయెనో అని చలముతో అనుసరించి రాగా భీముడు పరుగెత్తుచు అలపువచ్చిన వేళలో చేతనున్న ఆంజనేయుని రోమముల విసరుచు దానిని భ్రమింపజేయుచు రాగా అది వేసారినదై భీముడు హస్తినాపురములోని గృహద్వారము దూరిపోవు సమయముతో అతని కాలొకటి చిక్కించుకొని లాగసాగగా కృష్ణసహితుడై ధర్మజుడచటికిచేరి తన సోదరుని బాధింపవలదని ప్రార్థింపగా అతని స్తోత్రముల కానందించి ఆ మృగమతని యిష్టము తెలుపుమని కోరెను. అంత ధర్మజుడు—

....."మృగేశ్వర నా మఘమైన యంతకున్
సృష్టి దొలంగ నీయెడ వసింపగదె యన నుండెనయ్యెడన్.

—ఈ విధంగా అంజనేయుని కటాక్షవీక్షణముచేత భీముడు ధృతి బలోన్నతి జవముపొంది మృగభీతినొందక కార్యసాధన కావించెను.[208]

అధ్యాయము — 9

హనుమంతుని పాత్రచిత్రణ.

1 ఉపోద్ఘాతము

భారతీయ సాహిత్యములలోనేకాక ప్రపంచమందలి యే భాషా సాహిత్యములోను హనుమంతునివంటి పాత్ర ఇంకొకటిలేదు. దానికదియే సాటియై, అద్వితీయమై అపురూపమైన పాత్రయిది. కృతయుగము మొదలుకొని కలియుగము వరకు హనుమంతునికథ ప్రసరించిననూ, త్రేతాయుగపు సాహిత్యములో వ్యక్తమైనంతమేర ఇతర యుగసాహిత్యములలో ఈ కథ వ్యక్తము కాలేదు. మానవ సమాజములకితని గాథ తెల్సిననాటినుండి హనుమంతుని పాత్ర — బాల్యమాదిగా ప్రౌఢదశవరకు - జనహృదయాలను సంభ్రమాశ్చర్యములతో ముంచెత్తుచున్నది. 'పరిచితమివాపి గహనం' అను ప్రసిద్ధికి లక్ష్యమై ఎంతో తెలిసినట్లుగా కనబడు ఈ పాత్ర చాల విశిష్టమైనది.[209]

ఈ పాత్ర ఏ ఒక కవియో, రచయితయో సృష్టించిన పాత్రకాదు. ఈ పాత్ర నందరికన్న ఎక్కువగా పోషించిన వాల్మీకి కవియే దీనిని సొంతముగా సృష్టించెనని చెప్పుటకు వీలులేదు. ఇది పురాణపాత్ర. హనుమంతుని వృత్తాంతము శివపురాణము, పద్మపురాణము, అగ్నిపురాణము, స్కందపురాణములలో కన్పించును. ఈ పురాణపాత్రను తన కావ్యకళాధ్యేయమునకు తగినట్లుగామలచుటలో భగవానుడగు వాల్మీకి శ్రీమద్రామాయణమున ఎంతయో కృషిచేసెను. పరాశరసంహిత, ఉమాసంహిత, ఆనందరామాయణము, ఆశ్చర్యరామాయణము, ఉత్తరరామాయణము, అద్భుతోత్తరరామాయణము అవాల్మీకములగు కల్పనలుగల సంస్కృతేతర భాషాసాహిత్యములు మొదలగునవి హనుమంతునిపాత్రను తమతమ విశ్వాసములకూ, అవసరములకూ తగినట్లుగా కాలగమనమున రూపొందించినవి.

హనుమంతుని జీవితమఖండమైనది. అజరామరమైన వ్యక్తి. గత జీవితమును సాగించుచూ ఈ పాత్ర తన కాలపు సంఘములోని సామాజిక జీవితమున బహు ప్రభావము చూపుచు దానితో యేకమై, విడదీయరాని సంబం

ధము కలదై అందంతర్భూతమైనది. నాటి స్థల కాల సన్నివేశములనుండి ఈ పాత్రను వేరువేసి చూచుట పరిశోధనకు పనికివచ్చు విషయమైనను అది అవయవినుండి అవయవములను వేరువేసి చూచినట్లుగానే యుండును; పాత్ర సమగ్ర స్వరూపమునది చక్కగా ప్రదర్శింపజాలదు. "It was a simple life, and was not only of a piece, it also merged with the history of times. The attemt to isolate a part from the whole for clinical analysis may have the advantages for the accademic researcher, but only at the expense of the integral truth"[210] అందువలన హనుమంతునిగూర్చి, హనుమంతుని పాత్రచిత్రణనుగూర్చి పరిశోధనకందిన అంశములను ప్రతిఫలింపజేయుటయే నా కర్తవ్యము. అమేయమైన ఈ పాత్ర స్వరూపము రసజ్ఞుని ఊహాశక్తికీ, లోనారాయగల భావనాశక్తికీ, ఇంకనూ ఎంతో ఉండుననుట స్పష్టము.

తెలుగు సాహిత్యములో ప్రతిబింబించిన హనుమంతుని కథను తెలిసి కొనినట్లే, ఇతని పాత్రచిత్రణ ఈ భాషలో ఎట్లు జరిగెనో తెలిసికొనుటయే ప్రస్తుత పరిశీలనాధ్యేయము. కావ్యములలో ఇతివృత్తానికీ, రసభావములకూ, పాత్రలకూ గల సంబంధము గుర్తించనిదే పాత్రచిత్రణను గురించి తెలియుట కష్టము. "Plot, charecter, thought - the TRIO is destined to play a big part in literary criticism. You cannot have an important plot without character. Plot presuposes both character and the thought."[211A] ప్రధానేతివృత్తమేదైనా పాత్రలు లేకుండా ఉండజాలదు. సార్థకమగు సన్నివేశ కల్పనానికి పాత్రయేసాధనము. "Character is an instrument for creation a significant situation."[211B] కవిత్వము చరిత్రవలె జరిగినవాటిని చెప్పడంకాదు. ఏవి జరుగుట కాస్పదమై యుండునో, ఏవి సుసంభవములో వాటిని స్వీకరించి విశ్వజనీనం చేయడమే కవిత్వం పని. The poet's business is not to write of events that have happened, but what may appen of things; of things, that are possible in the light of robability or necessity. While history deales with particular only, this event or that event poetry deals with the universal.[211C] సాహిత్యములో ఉన్న ప్రక్రియలలో కావ్యనాటకాలు ప్రధానములు. అయితే నాటకంలోకన్నా, మహాకావ్యాలలోనే అద్భుతమైన

విషయాలూ, అలౌకిక విషయాలూ, నమ్మశక్యంగాని కల్పనలూ ఉంటాయని అరిస్టాటిలు పండితుని అభిప్రాయము. "The epic enjoys one advantage over the drama, in that, it affords wider scope not merely for the marvellous, but even the irrational. A thing is ~~time~~ for a poet if it is time for the MIL'IEV in which the true characters are placed. So the plot of an epic poem may rest upon events some of which may be super human and irrational."[211D] రామాయణము మహాకావ్యము కావున అతిమానుష శక్తులకూ, ఊహాతీత కల్పనలకు అందు స్థాన మీ కారణముననే కల్గినది. ఆంజనేయుడు సముద్రాన్ని లంఘించినా, పర్వతాలు మోసి తెచ్చినా, సైన్యాలను వీపుపై మోసుకొని వెళ్ళినా, తోకను వారిధులకు వారధిగా వాల్చినా, చతుర్దశ భువనాలలో సంచరించినా, సూర్యుని పట్టుకొనినా, స్థూల సూక్ష్మ రూపముల ధరించినా అది మహాకావ్య విధానానికి తగిసట్టిదనే భావించాలి. ఇట్టికల్పనలున్నప్పుడు ఏ పాత్రయైనా అది తన స్వభావాని కనుగుణమగు పనుల జేసినట్లు చూపవలసియుండునేకానీ స్వభావ వ్యతిరేక రూపమగు కార్యముల నొనర్చినట్లు చూపరాదు. కవి తన కావ్యములో సంభవార్హమగు అసాధ్యకార్యములకే మొగ్గుతాడుకానీ అసంభవములగు సుసాధ్యముల జోలికి పోడు. "The character must not be represented as commiting actions inconsistent with his character - that would be poetic falsity. The poet will prefer probable impossibilities to improbable possibilities.[211E] అందువలన ప్రపంచమందలి మహాకవులందరూ అక్షరమైనదానికే ప్రాధాన్యమిచ్చి తమ్ముద్ధరించు ధీశక్తిని పొంది దైవత్వానికి చేరుకోవాలని ప్రయత్నించుచుండుట. All greate writers are above what is mortal. Sublimity lifts the near the great mindedness of god.[211F]

ఋషితుల్యులగు ఉదాత్త సాహిత్యస్రష్టలు అందువలననే దేహానికీ ఆత్మకూ, రాక్షసులకూ దేవతలకూ, పాపులకూ పుణ్యులకూ అనాదిగా జరుగు సంఘర్షనాత్మకమగు కథలనే ప్రధానంగా చేపట్టి తదర్హమగు ఇతివృత్తాన్ని పోషించిరని తెలియుచున్నది. పురాణకాలపు జనులు దైవికశక్తులపై, దేవాసుర దైత్య దానవ గణాల ఉనికిపై నమ్మకముండినవారగుట వలన నాటి కవులు ఆ అంశమునకు సాహిత్యమున స్థానమిచ్చి రచించిరి. "The mass

of peaple believed whole heartedly in the existence of good and bad spirits and the literature of the time exhales this belief."[212] ప్రాచీన సాహిత్యములోని పలు పాత్రలు అప్రాకృతమైనవి. దివ్యాంశ సంభవమై లోకాతీతమగు రీతిలో పుట్టుట, పెరుగుట, జీవించుట కలిగి భగవంతుని లీలావిభూతి కనుగుణముగా, ఆతని ఆశయముల నెరవేర్ప వలసిన కారణజన్ములుగా కల్పింతురు. సామాజిక జీవనమున క్రౌర్యమూ, హింసా, సాధువ్యథా, దౌష్ట్యమూ ప్రబలినపుడు పరమాత్మ ధర్మరక్షణకై తానవతరించుటేకాక తన పరివారములోని వారిని, దూతలను, భృత్యులనూ అవతరింపజేయుచుండును. వీరికాభగవంతుడు సామాన్య మానవులకువలెకాక విచిత్రమైన ఆకారములను, విశేషమైన శక్తులనూ ప్రసాదించి పంపుచుండును. ఆ దేవుని కార్యములను సాధించుటలో వీరు తమ జీవితములను చరితార్థ మొనర్చుకొనినవారై, జనవంద్యులై సమాజ గౌరవమునకు పాత్రులగు చుందురు. ఇట్లు రూపొందించబగా వెలసిన పాత్రలలో హనుమంతునిపాత్ర కూడ ఒకటి. సకల దేవతల అంశలు త్రిమూర్తులలోచేరి పెంపొంది దివ్యా ద్భుత రీతిలో జన్మించి, దివ్య వరాలుపొంది ఒక విశిష్టమైన వ్యక్తిత్వముతో హనుమంతునిపాత్ర వెలసినదని చెప్పవచ్చును. ఈ కల్పనకు ఏ ఒక కవియో, ఏ ఒక గ్రంథమో కారణమని చెప్పజాలము.

హనుమంతుని పాత్ర రూపకల్పనలో ఏ కవి యేమి కల్పించి ఏ స్థితికి తెచ్చెనో చెప్పుట చాలా కష్టము. ఎందుకనగా ఈ పాత్ర పురాణపాత్ర. పురాణములను ఒకరే వ్రాసిరో, అనేకులు వ్రాసిరో ఇంకనూ తేలవలసియున్నది. అష్టాదశపురాణములను వ్యాసుడొకడే వ్రాసెనని నమ్మువారితో మనమూ అంగీకరించిననూ, హనుమంతుని పాత్రరూప కల్పనలో వ్యాసుని భాగమెంతో స్పష్టపరచవలసియుండును. ఆ పురాణములలో కూడ హనుమంతుని స్వరూప స్వభావ జీవితములలో ఏయే అంశములు (Aspects) ఏయే పురాణములలో ఏయే మేరకు పోషితమో కూడ పరిశోధించినగాని తెలియదు. శ్రీమద్రామాయణ మున వాల్మీకి హనుమంతుని పాత్ర చిత్రణలో విశేషమైన శ్రద్ధతో కృషి చేసియున్నాడు. తెలుగు, తమిళము మొదలగు ద్రావిడభాషలతోపాటు ఉత్తర హిందూదేశభాషలగు హిందీ, బెంగాలీ, మరాటీ భాషలలో వారివారి కవులు హనుమంతుని పాత్రను మలచుటలో ఎన్నో నూతనాంశములను (వాల్మీకి తెలుపనివి) తెలిపియున్నారు. ఈ కల్పనల కాలక్రమమెట్టిదో తేలినగాని

ఎవరెవరి కృషి ఎంతమాత్రమో నిర్ణయింపజాలము. అందువలన హనుమంతుని పాత్ర బహుభాషలలోని రచయితలచే జన సమాజములలోని వారి అభీష్టములకు, అవసరములకు తగినట్లుగా, కాలక్రమములో రూపొందుతూ వచ్చిన పాత్ర అని చెప్పవచ్చును. జాతీయ జీవనమందలి సకల భాషాకవుల భావనకు ఫలముగా వెలసినట్టిదే హనుమంతునిపాత్ర (Hanuman's character is the creation of a master mind - the Nation's mind.) ఈ పాత్ర ఆవిర్భావము శ్రీరామ శ్రీకృష్ణుల పాత్రలవంటిదేనని చెప్పవచ్చును.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు భారతీయ సాహిత్య సంస్కృతులలో ప్రభవించిన ఉత్తమోత్తమ పాత్రలు. దేశము ఎన్ని దండయాత్రలకు విదేశీదాడులకూ గురియైనా, ఎన్ని అన్యమతాల ప్రభావానికి గురియైనా, చారిత్రకమైన ఎన్నో మార్పులకూ చేర్పులకూ గురియైనా శ్రీరాముని, శ్రీకృష్ణుని పాత్రల ప్రభావం ఈ నాటికి మన సంస్కృతిలో చెరగకుండా ఉన్నది. దేశమందలి ఏ ఒక భాషలోని ఏ ఒకరో ఇద్దరో కల్పించిన పాత్రలు కావివి. భిన్నత్వంలో ఏకత్వం గల భారతీయుల సంస్కృతిలో భాషా భేదానికతీతమైన క్రాంతదర్శుల అనారతమగు సమగ్రమగు కృషికి ఫలముగా ఈ పాత్రలు రూపొందినవని తత్త్వవేత్తల అభిప్రాయము. They do not belong to one language, one sect, one religion; they belong to not only to india but to humanity also.) హనుమకూడ ఇదే విధముగా రూపొందిన పాత్ర. రామకృష్ణులు సామాన్యులవలెనే జన్మించి, జననమాదిగా మరణమువరకు తమ కాలపు జనజీవితముపై ప్రభావం చూపిరి. కాలక్రమమున వీరికి సంబంధించిన వాఙ్మయము పెరుగుతూవచ్చేకొద్దీ వారికి జాతిలో పూజార్హత, దైవత్వసిద్ధి సంక్రమించినట్లే హనుమంతుని పాత్రకూడ ఆరాధనీయమగు దైవత్వాన్ని పొందింది అలంకార శాస్త్రములలో కావ్యాత్మచర్చ శతాబ్దములు సాగినట్లుగా, వైజ్ఞానికశాస్త్రములో అణుసిద్ధాంతచర్చ జరిగినట్లుగా, కాలములో హనుమంతునికి సంబంధించిన వాఙ్మయము బహుభాషలలో,అనేకులచే ప్రతిపాదింపబడు చిత్ర విచిత్ర విషయములతో నిండిపోవుచూ రాగా అనేకానేక గుణములతో ఒక విశిష్టరూపమూ, వ్యక్తిత్వమూ హనుమంతునిపాత్ర సంతరించుకొనినది. కానీ ఎవరెంతచేసినా, వాల్మీకి ఋషిసత్తముని కృషి వాటికి వరవడిని, లక్ష్యాన్ని నిర్దేశించినదని చెప్పవచ్చును. క్రౌంచమిథునమును వేరు చేసిన వేటగానిపై 'మానిషాద ప్రతిష్ఠాం' అను శ్లోకమున తన శోకమును

గ్రక్కిన విషయము కవితావిర్భావానికి హేతువుగా తెలిపి తన కావ్యానికి హృదయాలను కదిలించే ఆరంభాన్ని వాల్మీకి ఇచ్చినా, అతని కావ్యఫలమగు రామాయణము ఉద్రేకములో కేవలము కొన్ని క్షణములలో వెల్వడినదని మనము నమ్మజాలము. సప్తకాండ సమాహారమగు తన రామాయణగాధ నతడు సమాజ సంస్కారానికినీ, ధర్మప్రతిపాదనకునూ ఉద్దేశించెను. తన కార్యోద్దేశమునకు తగిన అనుకూలమగు ఎట్టికథ ఉండాలో, ఏలాంటి పాత్ర లుండాలో అతడెంతో జాగరూకతతో భావించి, సకలోహసనాధమగు తన కమనీయ కవితాకళకు వన్నెలుదిద్దు సన్నివేశకల్పనల కుపక్రమించియుండును. జనావళినాడి తెలిసిన మహనీయుడతడు. తన కాలానికేకాక కాలాంతరముల కునూ నిల్వగల్గు విశ్వజనీనతనతడు తన కావ్యమున సాధింపదలచెను. కావున సుబోధకమగు సరళ సంస్కృతముననే తన కావ్య మధువు నతడు మన కందింప యత్నించి కృతకృత్యుడయ్యెను. (Through his insight into human nature, and in comparable poetry, which was deeper in feeling and greater in range, he composed his poem THE RAMAYANA.)

రామాయణమున వాల్మీకి కవితాశిల్పము తెల్సికొనేకొద్దీ తెలియదగిన రమణీయాంశములతో కూడినట్టిది. సృష్టిలోని సకల స్థావర జంగమ మృగపక్షి సంతానములతోపాటు, దేవ, రాక్షస, నర, వానర, ప్రాణిసంతతులను తన పాత్రలుగా స్వీకరించి శ్రీరాముని సకల సద్గుణాభిరామునిగా సకల ప్రాణికోటికి ప్రియరంజకునిగా, చిత్రించు ప్రయత్నము ప్రాచేతసు లొనరించి యున్నారు. భూమిని, నీటిని అగ్నినీ, వాయువునీ, ఆకాశాన్నీ (పంచభూతములు) వన పర్వతములనూ, జంతు ప్రపంచాన్నీ, తరులతా సమూహాన్నీ, పక్షివర్గాన్నీ, వింతవింత ఆకారాలు గల రాక్షసులనూ, భల్లూకాలనూ, వానరులనూ, నరులనూ, నిషాదులనూ, సాధులనూ, మునులనూ, ఋషులనూ దేవతలనూ తన కావ్యమున ప్రవేశపెట్టి, కావ్యకళాధర్మమునకూ కథనమునకూ భంగము కాకుండా సమ్మేళనమొనర్చి తన కావ్యప్రయోజనము నతడు సాధించెను. శ్రీరాముని సాధారణ మానవునిగానే చిత్రించినా, పుత్రునిగా, శిష్యునిగా, భర్తగా, సోదరునిగా, మిత్రునిగా, సాధురక్షకునిగా, సత్యశీలునిగా, ప్రభువుగా, నీతికోవిదునిగా, ధర్మావతారమూర్తిగా అతనినే ఆదర్శముగా స్వీకరించునట్లు రూపొందించెను. ఆదర్శములతోఅతని అడుగుజాడలలో చరించు భరత లక్ష్మణ

శత్రుఘ్నులతోపాటు, గుహ, భరద్వాజ, వసిష్ఠ, విశ్వామిత్రాది మానవ పాత్రలతోపాటు, జటాయువు, సంపాతి వంటి పక్షిపాత్రలు, విభీషణాది పాత్రలను అతడు కల్పించెను. ప్రధాన పాత్రయగు శ్రీరాముని గుణగణముల శోభింపజేయుటకే ఈ పాత్రలను సమాంతరముగా అతడు నిలిపినట్లే పోలికకై (Contrast) రావణాది పాత్రలను కల్పించెను. సమాంతరశ్రేణిలో వానర భల్లూకాదులగు సుగ్రీవ జాంబవంత అంగద హనుమానులను రూపొందించి నరవానరమైత్రిని సాధించు ప్రయత్నమతడు చేసెను. నరులలో రాముడుత్తమునిగా వానరులలో హనుమంతుడుత్తమునిగా అతడు భావించెను. మర్యాద పురుషోత్తమునిగా రాముడెట్లు మహనీయ గుణాత్ముడయ్యెనో హనుమంతుడు ఉత్తమ సేవకునిగా, రామదాసుగా, రామదూతగా, రామకింకరునిగా, రామ భక్తునిగా, రాజనీతిజ్ఞునిగా, రాయబారిగా, వీరునిగా, ఆపన్నివారకునిగా, యోగిగా, జీవన్ముక్తిమార్గ ప్రదర్శకునిగా, అజన్మ బ్రహ్మచారిగా, అభయ ప్రదాతగా, నవవ్యాకరణవేత్తయైన వాచాదక్షునిగా, ఈషణత్రయదూరునిగా, జ్ఞానిగా, ఆచార్యునిగా, మహాత్మునిగా బహుముఖమైన వ్యక్తిత్వము కలవానికిగా హనుమంతుని పాత్రను వాల్మీకి తీర్చియున్నాడు. అద్భుత బలపరాక్రమాది గుణ విశేషములు గల శ్రీరామ లక్ష్మణ వాలి సుగ్రీవ రావణాదుల సరసన హనుమంతుని వంటి పాత్రను కల్పించి, వారితో సమానమగు గౌరవమును పొందునట్లుగా ఈ పాత్రను వాల్మీకి తీర్చెను. ప్రపంచ సాహిత్యాలలోనే ఇది అపూర్వము. ఏలన, ఒక యుగములో దైవమని భావింపబడిన వ్యక్తి, ఇంకో యుగములో ఆరాధనకు దూరం కావచ్చు. The idol of one age is often relegated to the lumber room of the next) కనరాని మార్పులదెచ్చు కాలపు దిబ్బలలో కనుమరుగై పోయిన పాత్రలవలెకాక కాల క్రమమున హనుమంతునిపై ఆదరణతోపాటు ఆరాధనాభావము కూడ పెరుగునట్లు వాల్మీకి యీ పాత్రను చిత్రించి యున్నాడు. తన మధురకవితాశిల్పము ద్వారానేకాక, మానవ స్వభావ పరిశీలనను సూక్ష్మముగా పరిశీలించు తన నైపుణ్యముతోకూడ అతడీపనిని సాధించెను. ఏవిధమగు యుక్తిచాతుర్యములతో కాక మానవ స్వభావములోని విశ్వజనీన సహజగుణముల స్పృశించి యీ సాధనలో అతడు కృతకృత్యుడైనాడు. (He appeals to the universal instinct of human nature and compels our interest by no literary trick, but by making us feel that his characters were as real as we are)

సమాజములు మారవచ్చు, మనుష్యులు మారవచ్చు. యుగములు మారవచ్చు, సమాజధర్మాలు, సంప్రదాయాలు మారవచ్చు, సాంఘిక వ్యవస్థ మారవచ్చు కాని, మానవ స్వభావములో అనాహతముగా ఉండే కొన్ని అంశములు మాత్రము మారవు. ఋషిచేతి పాత్రచిత్రణలో ఈ కార్యమందలి పాత్రలు నేటివరకు సకల మానవాళిచే ఆదరింపబడుచునే యున్నవి. ఇతని పాత్రచిత్రణా, కథాసంవిధానమూ ఎంతస్థాయికి ఎదిగినవనగా, ఈ రామాయణ కథ అసంభవమైనదనిగాని, అభూతకల్పన అనిగాని మనకెక్కడా అనిపించదు. కేవలము కథను తెల్పడమే కవి ధ్యేయముకాదు. పాఠకునిపై ఏ ప్రభావము పడవలెనో దానినే పడునట్లుచేసి కావ్యపఠనము ద్వారా సంస్కారమునందించునట్లు ఉన్నతాశయముల ప్రేరేపించునట్లు చేయుట దానికన్నా ముఖ్యము. ఇట్లొనర్చిన కవి కల్పిత పాత్రలు సజీవమై, సమాజముపై చెరగనిముద్ర వేయగల్గును. ఆయా పాత్రల ఆకారములలో, గుణములలో, భేదములెన్నో ఉన్ననూ, వాటివాటి ప్రయోజనములను అవి నెరవేర్చుకొనుచు కవి నిర్దేశించిన ప్రయోజనముల సాధింపగల్గినవి. వాల్మీకి కవి గొప్ప శక్తి సామర్థ్యములకు ప్రతిఫలమైన ఎన్నో పాత్రలలో ఆంజనేయుని పాత్ర కూడ ఒకటి.

రామాయణము సీతారాముల చరిత్రమైనప్పటికిని దీనిలో హనుమంతుని పాత్రకు వాల్మీకి సముచిత ప్రాధాన్యమునిచ్చి యున్నాడు. వానరులలో ఇతని కిచ్చినంత ప్రాధాన్యమింకే వానరునకు ఇవ్వలేదు. రామరావణుల తర్వాత రామాయణమున హనుమంతుని పాత్రయే ముఖ్యమైన పాత్ర. ఇతడు సాధించిన కార్యములరాశిని బట్టి చూచినా, వాటిని సాధించుటలోని క్లేశములను బట్టి చూచినా ఈ పాత్రద్వార నెరవేరినన్ని కార్యములింకే పాత్రద్వారా నెరవేర లేదు. అంతేల! అసాధ్యక సాధ్యకార్యములు, ఆకార్యముల చేయుటకు వేరెవ్వరూ పూనలేని వాటి దుర్ఘటత్వములను గమనించినచో ఇట్టి పనుల సాధించుటకే వాల్మీకి యీ పాత్రను ప్రవేశపెట్టినాడని అనిపించును. ఇతని జననమూ, దేవతలిచ్చిన వరాలవలన సిద్ధించిన అజేయత, అవధ్యత, అస్త్రశస్త్ర ప్రభావములకు లోబడకుండుట, అజన్మ బ్రహ్మచర్యము, కామరూపత, కామగమనము, చిరంజీవిత, రామకార్యతత్పరత మొదలగు విశేషములతో కూడిన పాత్రగా ప్రవేశపెట్టినందున ఇతడమిత ధైర్యసాహస పరాక్రమ పాండిత్య రాజనీతిజ్ఞతలను ప్రదర్శించుటలో ఔచిత్యముండునట్లుగా వేసిన కవి కృషి ప్రశంసాపాత్రము.

వాల్మీకికవి కావ్యమునకు యథామూలముగా కొన్ని అనువాదములు వెలసినవి. అందువలన వాని ఆధారముగా వాల్మీకి పాత్రచిత్రణనే తెలుగు కవుల పాత్రచిత్రణగా స్వీకరించుట కర్తవ్యము. ఆనందరామాయణము, ఆశ్చర్యరామాయణము, మైరావణ చరిత్రము మొదలగు కావ్యములు వ్రాసిన కొందరు కవులు హనుమంతుని గుణగణములను చిత్రించుటలో కొన్ని అవాల్మీకములగు కల్పనల గూర్చి యున్నారు. హనుమంతుని అమాయకత్వమును తెలుపుటకో, అతనికి రామునిపై గల (మూఢ) భక్తి తెలుపుటకో, అతని జాతికర్హమగు చేష్టలను చూపుటకో వారా కల్పనల చేసినట్లు భావించవలసినదే కానీ లోకజ్ఞత, ఔచిత్యజ్ఞానము లేనివానిగా మనము భావించరాదు. రాముడు బహుమతిగా ఇచ్చిన ముత్యాలహారమును కొరికి చూచుట, రాముని భోజన పాత్రను ఎత్తుకొని చెట్టెక్కి కూర్చొనుట, సీతారాముల దాంపత్యక్రీడలకు ఆటంకముగా నుండినట్లుగా, శ్రీరాముని రూపమునతప్ప ఇంకే రూపములోను దైవమును గుర్తింపజాలకుండుట, సీతాదేవిని హింసించిన రాక్షసాంగనల చంపుటకై సీతను అనుమతికోరుట, లంకను దహించుటలో కొన్ని కోతిచేష్టలు చూపుట మొదలగు చర్యలను వాటిని సృష్టించిన కవుల కాలమునుబట్టి ప్రజలను నవ్వించుటకై కవులొనర్చిన మార్పులుగా మాత్రం గుర్తించవలెనే కానీ వాటి కధిక ప్రాధాన్యమీరాదు. భక్తినీ, యోగాన్నీ అతడు శాస్త్రీయముగా అభ్యసించినా, కేవలము శిలాసదృశమైన శుష్కశాస్త్రీయ పద్ధతికి అతడు విలువ నీయక చిత్తశుద్ధితో కూడిన ఆచరణకే ప్రాధాన్యము నిచ్చినవాడు. ఇతడు సంప్రదాయ విధేయుడైనట్టి తీవ్రవాది (He is a conservative revelu-tionry) ఇతని భక్తి విశ్వాసతీవ్రత (Intensity of faith) అనితరసాధ్యమై విలక్షణమైనందున ఇతరులకది సులభముగా బోధపడనందున ఇతని భక్తిని మూఢభక్తిగా వారు ముద్రవేసిరని చెప్పవచ్చును.

హనుమంతునంతటి రాజనీతి పరిజ్ఞానముగలపాత్ర రామాయణమున నింకొకటి కనబడదు. ఇతని లోకజ్ఞత, ఔచిత్యపాలన, దయ, శీలము, సంభాషణా చాతుర్యము, సమయోచిత నిగ్రహము, ఇంగితజ్ఞత, పరాక్రమము, ఆలోచనాశక్తి, ధార్మికత సహజసుందరమైనవి. సకలశక్తులు సామరస్యంతో ఇతనిలో మేళవమొందినవి. [He is a full grown personality wiih a harmonious blend of all the faculties of a human being.] ఇంతటి శక్తిశాలియై కూడ ఇతడు గర్వములేనివాడై, నిర్మలుడై సద్గుణము

 లతో ప్రకాశించినవాడు. 'ఏకోపి దోషో కిరణేష్వి వాంకః' అను రీతిలో రామాయణ భారత పాత్రలలో ఏ పాత్రను చూచినా ఏదో ఒక లోపమో, దోషమో ఉండని పాత్ర కనబడదు. వానరుడయ్యు, ఏలాంటి మచ్చలేని నిర్మలమైన పాత్రకు హనుమాన్ ఆదర్శము.

3 కావ్యములలో పాత్రచిత్రణ

కావ్యములలో పాత్రచిత్రణకూ, మానవ నిత్య జీవనమునకు చాలా సంబంధమున్నది. ప్రతి వ్యక్తికి ఒక జీవితం ఉంటుంది. అందులో పుట్టుట, పెరుగుట, ఆహారవిహారములు, నిద్ర, తోడి మానవులతో మైత్రీ ప్రణయాది భావాలు, మరణించుట అనునవి ప్రధానాంశాలు. నిజజీవితములో నున్నట్లే కావ్యములలోకూడా ఉండాలని నియమములేదు. ఇవి ఏవిధంగా ప్రతిబింబించాలో ఆ పాత్రకు కవి తన కావ్యశిల్పమను చట్రములో కల్పించిన చిత్రంమీాద ఆధారపడియుండును. మానవుల జీవిత నాటకరంగంలో పాత్ర ధారులగుటవలన వారు నిజజీవితములో సమాజ సంస్కారములకు, నాగరికతకు, సభ్యతకు లోబడి స్థల కాలోచితముగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఒక వ్యక్తి బాహ్యారూపాన్ని, చేష్టలనూ కవి వర్ణించవచ్చు. తోడివారితో చేయు ప్రసంగములలో వారివారి స్వభావములను సూచించవచ్చు. కాని, వ్యక్తిలోని అంతరంగిక అనుభూతులను తెలుపనిదే ఆ పాత్ర నర్థముచేసికొనుటకు వీలు కాదు. ఆవేశానుభూతులు, కలలు, సుఖదుఃఖాలు వగైరాలను సభ్యతా విధేయుడైన పాత్ర పూర్తిగా వ్యక్తీకరించుట జరుగదు. The passions, dreams, joys and sorrows and self communings which politeness or shame prevent one from expressing them.][213]

హనుమంతునికి సంబంధించిన కావ్యాలలో పలువురు కవులతని జీవిత మందలి సకలాంశములను స్పృశించి చిత్రింపరైరి. జన్మాత్ ప్రభృతి గడచిన జీవితమంతా చిత్రించే ప్రయత్నము ఏకవీ కూడా చేయలేదు. అంజనేయుని జీవితములోని కొన్ని ముఖ్యాంశములే పలువురు చిత్రించినారు. అతని అద్భుత జననమును గూర్చి ప్రథమాధ్యాయములో తెలిసికొన్నాము. దేవతల వరముల వలనను, సీతారాముల వరముల వలనను ఇతడు చిరంజీవి యైనందున మరణమును గూర్చి చిత్రించు పని తప్పినది. ఇతని శైశవక్రీడలలో ఒక్కటో, రెండో

అంశములు తప్ప ఎక్కువగా ఏ వివరమూ మనకు లభించుటలేదు. సూర్య బింబాన్ని పట్టబోవుట, ఋషుల ఆశ్రమములలో అల్లరి చేయుట, సూర్యునివద్ద విద్యాభ్యాసము తప్ప ఇతని బాల్యవిశేషములను వివరంగా చిత్రించినవారు లేరు. రామాయణములో రాముడే నాయకుడు కావున అతని గుణగణముల చిత్రించుటలో చూపిన ప్రాధాన్యము అంజనేయుని యెడ కవులు చూపలేదు. శ్రీరాముని సుఖదుఃఖాది అనుభూతులను వర్ణించినారే కానీ అంజనేయుని ప్రతిక్షణ మనోనుభూతులను తెలుపు ప్రయత్నము చేయలేదు. అందువలన అంజనేయుని పాత్రచిత్రణలో లభ్యసాక్ష్యముల నుండి ఊహించి తెలిసికొనవలసిన పని తప్పనిసరియగుచున్నది.

కోటివిద్యలు కూటికొఱకే అనినట్లు మానవజీవితములోనే కాక సర్వప్రాణికోటి జీవితములో ఆహారసేకరణ మొక ప్రధానాంశము. హనుమంతుని ఆహారవిహారాదుల గూర్చి మనకు ఎక్కువగా తెలియదు. సీతాదేవిని అశోకవనములో సందర్శించిన సందర్భమున అతడు ఆహారము కోరినట్లు కొన్ని రామాయణములలో (అవాల్మీకమగు కల్పన) కలదు. సీతావార్త తెచ్చిన పిమ్మట సుగ్రీవుని మధువనములో కపులందరితో కలిసి మధువులనానినట్లు వాల్మీకి వర్ణనయే కలదు. సాగరలంఘన సందర్భమున మైనాకుని ఆతిథ్యమును గూడ నిరాకరించి వెళ్ళినేకాని ఆహారస్వీకారమొనర్చలేదు. ప్రాణికోటి ఆహారమునకై చేయు యత్నములు, బ్రతుకుతెరువునకై చేయు పనులు జిహ్వాకింపగు విందుల నారగింపవలయునను తహతహ ఇవన్నియు నిత్యజీవితములో చాలా ప్రధానమైనవి. హనుమంతునకు ఎట్టి ఆహారము ప్రియమో, ఏయేవేళలలో అతడు ఆహారము స్వీకరించెడివాడో, ఎట్టి పానీయముల సేవించెడివాడో తెలుపు గ్రంధాలులేవు. హనుమంతునకు మలమూత్రాదులు కానీ, ఆకలిదప్పులుగాని లేవని కొందరి కల్పనలున్నవి. వానరులధిక భోజనప్రియులుగాను, సుగ్రీవుని వలె మధుపానాసక్తులుగాను మనకు తెలిసియున్నను హనుమంతుడు వారివలెనే అట్టి అభిరుచులతో చరించినట్లు సాక్ష్యములు లేవు.

ఆహారము తర్వాత స్వప్నసుషుప్తులు ప్రతిజీవికి ఉండునట్టివే. హనుమంతుని నిద్రను గూర్చికానీ అతనికి ఏలాంటి కలలువచ్చెడివో మనకే సాక్ష్యము లభించుటలేదు.

జీవి జన్మించిన వెంటనే శిశుచైతన్యము తర్వాత గమనించు విశేషములో "స్త్రీ–పురుష" లింగనిర్ణయము ముఖ్యమైనది. వ్యక్తి జీవితములో ఈ లింగ విభేదము ప్రధానపాత్ర వహించును. పుట్టినప్రాణి చిత్తవికాసానికి, జీవిత స్వరూపానికి, అశలకు, ఆశయాలకు లింగమే కారణము. భాగవతమున శ్రీకృష్ణ నిర్వాణ ఘట్టమున—

"శోకహేతువహంకార మమకారాత్మకంబైన ద్వైత భ్రమంబనియు, ద్వైతభ్రమంబునకుఁ గారణంబు దేహంబనియును, దేహంబునకు బీజంబు లింగంబనియును, లింగంబునకు మూలంబు గుణంబులనియు, గుణంబులకు నిదానంబు ప్రకృతియనియును, బ్రహ్మోహమ్మనియెడు జ్ఞానంబున లీనమై ప్రకృతి లేకుండుననియు, ప్రకృతి యడంగుటయి నైర్గుణ్యంబనియును, నైర్గుణ్యంబు వలన కార్యలింగనాశనంబనియును, కార్యలింగనాశంబున నసంభవంబగు ప్రకృతింబాసి క్రమ్మఱ స్థూలశరీర ప్రాప్తుండుగాక పురుషుండు సమ్యగ్భోగంబున నుండుననియును నిశ్చయించి అర్జునుండు విరక్తుండై యూరకుండె".... అని కలదు.[214] (శ్రీ మహాభాగవతము ప్రథమ స్కంధము–37) కనుక లింగము (Sex) వ్యక్తి జీవితములో జీవితాంతము ప్రధానపాత్ర వాహించు నట్టిది. వ్యక్తి స్త్రీయా, పురుషుడా అను లింగస్థితినిబట్టియే వేషభాషాది నాగరికతా సంస్కారములు జరుగుచుండును. జననమొందిన తర్వాత శైశవమున నిద్రాణముగానున్న లైంగికజ్ఞానము (Sex Sense) వ్యక్తితోపాటే పెరిగి, ప్రౌఢత్వము వచ్చుకొలది, శరీరములోవచ్చు మార్పులతోపాటు లైంగికోచితమగు భావములు చిత్తమున స్థానము పొందుచుండును. రూపాభిమానము, అలంకరణప్రియత్వము, ఇతరుల నాకర్షించుటకై పాటుపడుట అనునవే ఆ భావములు. "Sex begins before adolosence, and survives sterility, it is indeed co-eval with our lives, although at the mating age its effects are more obvious to society."[215A]
లైంగిక ప్రేరణమున సౌందర్యారాధన,, ఆకర్షణ, ప్రేమ, స్నేహము, తృష్ణ ఇత్యాది భావములు కలుగుచు భిన్నలింగమునకు చెందిన వ్యక్తి స్పర్శకై తోడుకై, కలయికకై ప్రాణి అలమటించును. ఈ ప్రేరణయే మిధునక్రీడకు, ప్రజోత్పత్తికి మూలము. దీనినే ప్రణయానుభూతిగా పేర్కొనవచ్చును. ఈ ప్రణయభావంతో ఏవేవో తెలుపలేనన్ని అనుభూతులు కలుగుచుండును. ఆ అనుభూతుల అనుభవములో పరవశించి, వాటిని భిన్న లింగశ్రేణికి చెందిన

ప్రాణికి అందించి వాటికి బదులు ఆ ప్రాణినుండి తనకందని అనుభూతులను, ఆనందమునూ పొందాలని తపన ఉంటుంది. When human beings love they try to get something. They also try to give something, and this double aim makes love more complicated than food and sleep.[215B] తానాకర్షించిన వారితోనో, తన నాకర్షించిన వారితోనో సంబంధమును వాంఛించుట సహజ మానవగుణం. దర్శన, స్పర్శన, సంభాషణ, సంభోగ వియోగ సహజీవన సహగమనత్వ ములకు స్త్రీపురుషులెలా ప్రవర్తిస్తారో కవుల పాత్రచిత్రణలో అధికముగా గోచరించును. హనుమంతుని ప్రణయజీవితము, అతని లైంగిక భావవికార ములు (Sexval urges) తెలుపు సన్నివేశములను ఏ కావ్యములోనూ, ఏ కవి కూడా కూర్చ ప్రయత్నించలేదు. ఆంజనేయుని ఆజన్మ బ్రహ్మచారిగా, జితేం ద్రియునిగా చూపే ప్రయత్నములో వారాతని లైంగిక 'వాసన'ల తడవలేదు. స్త్రీగానో, పురుషుడుగానో పుట్టి ఈ సామాజిక జీవితమున భిన్నలింగ వ్యక్తుల ఆకర్షణాపకర్షణలకునూ, భావవికారములకునూ లోనుకాకుండా జీవించుట ఎవరికినీ సాధ్యముకాదు. ఆంజనేయుని లైంగిక అనుభూతులను (Sexval impalses) వికారములను ఏ కవిగూడా ఏ గ్రంథములోగూడా సూచింపనైనా సూచింపలేదు. రావణాంతఃపురములో నిద్రించు రాక్షస స్త్రీలను చూచినపుడు హనుమంతు డేవికారమును పొందలేదు. తాను వారిని దర్శించుటలోని ధర్మాధర్మముల గూర్చిన విచికిత్సయే అతడు పొందెనుగాని దర్శనీయులగు వారి అవయవ సౌందర్యాదులకు స్పందించడయ్యె. .

కావ్యమొక కళాసృష్టి· ప్రతికళకు కొన్ని సూత్రాలుంటాయి. ఈ సూత్రాలు నిత్య జీవిత ప్రాపంచిక సూత్రాలవంటివికావు. కావ్యకళాధర్మాలకూ. కావ్య నిర్మాణోదేశమునకు లోబడియె పాత్రలు కవిచేత రూపొందింపబడును A work of art has its own laws. They are not those o, real life, and that a character is real when it lives according to its laws. The barrier of art divides them from us. They are real not because they are like ourselves, but because they are convincig. తన కావ్య ప్రయోజనమున కనుగుణము ఏ పాత్ర యొక్క బాహ్యాంభ్యంతర మనోజీవితాలెంతవరకు సహృదయులకు వ్యక్తం కావాలో అంతవరకే రచయిత తెలియజేస్తాడు. The characters must

adopt themselves to the other requirements of their CREATOR.[215C] అంతేకాక పాత్రచిత్రణలో రచయిత శక్తికీ, కావ్యపరిధికి గల పరిమితులనుగూడ గుర్తించియే మనము వ్యవహరింపాలి. His range and limitations must not be left out of cosideration.[216A]

కావ్యమున కథకూ, పాత్రచిత్రణకూ ఎంతెంత ప్రాధాన్యం ఇయ్యబడునో ఆ అంశముపై కూడా పాత్రచిత్రణ ఆధారపడియుండును. కథకే ప్రాధాన్య మున్న కావ్యంలో కార్యకార్యము నెరవేర్చుటలో "పాత్రలు" సాధనాలుగా ఉంటాయి. పాత్రయే ప్రధానమైన కావ్యంలో ఇతివృత్త రూపానికీ, కథా వికాసానికీ కొంత భంగమేర్పడును. 'When the interest of the plot is upper most, characters are used simply or mainly to carry on the action. Where attention is paid primarily to characters the expansion of personality will prove fatal to the regularity of the plot design.[216B] కాబట్టి ఇతివృత్తానికీ, పాత్రలకూ గల సంబంధము సరైనపాళ్ళలో నిర్వహింపబడుట చాలా ముఖ్యం. పాత్రద్వారా ఇతివృత్త వికాసం జరుగుచో అది ఔచితీ శోభితమై కావ్యకళా ధర్మాలకు గొడ్డలిపెట్టుకాని రీతిలోనే సాగాలి. కొన్ని గుణవిశేషములుగల పాత్రలు తమతమ భావోద్రేకాలకు తగినట్లు కావ్యమందలి కొన్ని విశిష్ట స్థితులలో తారసపడి ప్రతిస్పందిస్తూ, కథావికాసానికి తోడ్పడుతూ ఉండునట్లు రచన జరుగుతుంది. కథారూపానికి తగినట్లుగానే పాత్రచిత్రణ ఉంటుంది. పాత్ర సకలగుణాలనీకాక కథయొక్క కార్యానికి ఎంతమాత్రం అవసరమో అంతే ఆ పాత్రగుణాలను ప్రస్ఫుటీకరించాలి. అతిగా పాత్ర గుణస్వరూపాదుల వ్యక్తం చేయడం కావ్యకార్యావసరములకు మించి చేసిన పాత్రచిత్రణగా కనబడును. (Characterisation in excess of the reeds of the action of the plot.) In the evolution of plot out of character, the motives which prompt the persons of the story to act as they do, must impress ~~his~~ both in keeping with their natures and adequate to the regulating incidents.... Simple or complex, the plot evolves, as natural consequence of the fact that a number of given people of such and such dispositions and impelled by such and such motives and passion, are brought together in circumstances which give rise to an

interplay of influence or clash of inrests among them. Every charater should be presented as to appear absolutely adequate to all the demands which the plot makes upon it. According to prof. TOLMAN 'only those characteristics of a hero (of a personage) should be made prominent which really influence the course of action. and that these characteristics should be unmistakable.[216C]

కథలో పాత్ర ప్రవర్తన చూచినపుడు అతని ఉద్దేశములు అతడెందుకు అతని పాత్రలో అలా ప్రవర్తింవాడో సహృదయునకు విశ్వసింపదగిన తీరులో చిత్రింపబడాలి. పాత్రల సంవాదములద్వారానే వారి అనుభూతులూ, అభిప్రాయాలు మనకు తెలియును. నిజజీవితంలో వ్యక్తులొకరితో ఒకరు సంఘటితమగుచూ తోచినట్లే కథా ప్రపంచంలో కూడ ఆయాపాత్రలు ఇతర పాత్రలతో తటస్థపడినపుడు తమతమ అంతరంగిక వృత్తులను దాపరికం లేకుండా ప్రదర్శింపజాలరు. అతి సన్నిహితత్వము, స్నేహమూలేనిచో, ఒక పాత్ర ఇంకొకపాత్రతో వ్యవహరించుచో మాటలకూ, చేతలకూ ఒక అచ్ఛాదన తరచుగా పడుచుండును. (delibrate disguise) పాత్ర తన ఏకాంతములో తనలో తాననుకొను స్వగతములలోను, తన ప్రాణసమానులగు వారివద్దనో దాపరికములేకుండా తమ మనోభావాల వ్యక్తమొనర్తురు. అప్పటివారున్న స్థలమునుబట్టి సన్నివేశాన్నిబట్టి పాత్ర స్వభావాన్నిబట్టి దాని ప్రవర్తనను పరిశీలించి సముచితమైన అంశాలనే ఆపాత్ర పాత్రచిత్రణను పరిశీలించడం కోసం మనం గ్రహించాలి. (Every utterance must be tested by reference to the charecter of the speaker; his own situation and relation to the action; the possible bias given by his incidents, his sympathy and antipathy. To catch a phrase here and there and without thought of its context, to treat it as an impartial and authentic expression of opinions is in the last degree uncritical.[216D]

పాత్రచిత్రణలో వివిధ పాత్రల స్వభావాలలోని భేదసాదృశ్యముల చూపు పరిశీలన కొందరు చేస్తుంటారు. (comparison by contrasting characters) పాత్రలోని గుణాలకు సమాంతరంగా నిలుచునట్టి ఇంకోజాతి పాత్రను కల్పించడం రెండో పద్ధతి. శ్రీరాముని పాత్రకు భిన్నంగా రావణుని

పాత్రనూ అతని గుణగణాలకు 'తోడుగా,' 'సమాంతరంగా' హనుమంతుని పాత్రను కవులు ప్రవేశపెట్టియున్నారు. ఆంగ్లకవి ధాకరీ అనునతడు "I don't control my character; I am in their hands, and they take me where they please" అని అనుట గమనార్హము. ఈ వాక్యమననుసరించి చూచినపుడు ఒక విషయము స్పష్టపడును - తన ఇష్టమునకు తగినట్లుగా పాత్రల కల్పించి తాననుకొనినట్లే అవి ప్రవర్తించునట్లు చేయు రచయితగా ఒకడుంటే, పాత్రమీద యాజమాన్యమేమీ లేకుండా అది ఏ విధంగా లాక్కొనిపోతే ఆ విధంగా కథను నడిపే రచయిత ఇంకొకడున్నాడని - మొదటి కోవచెందినవాడు కావ్యనిర్మాణ సూత్రములను వల్లించిన సుశిక్షితుడు. ఇతడు తన పాత్రలను తన అదుపులో ఉంచుకొని తన కథాక్రమానికి తగినట్లుగా వారిని రూపొందిస్తాడు. రెండవకోవకు చెందినవాడు స్వతంత్రమైన ప్రతిభకలవాడై తన పాత్రలను చాలినంత స్వేచ్ఛనిచ్చి అవి తమంత తాము (బ్రహ్మ చేసిన సృష్టికి ప్రతిసృష్టిగా) అవిర్భవించునట్లు చేస్తాడు. వాల్మీకి భగవానుడీ రెండోకోవకు చెందినవాడు ఇందులో స్రష్ట కేవలము సాక్షీభూతుడు. పాత్రయే తన స్వభావాదుల నావిష్కరించుకొనినట్లుండును. (The former simply manufactures, and its effects are always within the fieldg of conscious and deliberate effort. The latter really CREATES, and for this reason, its out workings are often as stronge and inexplicable to tbe anthor himself. It is always better that a character should be mode to reveal itself than that it should be dissected from the outside, is thoroughly sound.[21ɛE]

సంస్కృతాంధ్ర తమిళాది భాషణలోని కవులు అంజనేయుని పాత్ర ఏలాగుంటే బాగుంటుందో, ఏఆశయ సాధనకై అతనిని దేవతలావిర్భవింపజేసి అనుగ్రహించిరో ఆ విధముగా దానిని తీర్చి అదర్శమైన పాత్రగా (Idealized charater) రూపొందించారు. రామకార్య నిర్వహణకు తగిన సామర్థ్యాన్నిచ్చి అతనికిచ్చి తన్నిర్వహణలో కృతకృత్యుడగుట కర్హమైన గుణగణాలనూ, శక్తులనూ అతనికి కల్పించి సహృదయునకు అతని పాత్రలోని ప్రముఖాంశములు తమంత తాము తెలియవచ్చునట్లు సన్నివేశముల కల్పించి ఆ పాత్ర ప్రవర్తనకు తగినంత స్వేచ్ఛనిచ్చి పోషించి యున్నారు.

సామాన్యులు కలలోకూడా చేయుటకు సాహసింపజాలని అలౌకికమైన, అద్భుత పరాక్రమ సాహసకృత్యములను హనుమంతుడు చేయగల్గెను. అందు వలన ఈ పాత్రకు కొన్ని విశేషగుణముల కవి ప్రసాదించి యుండెను. అలౌకికాద్భుత సాధనలచేయు పాత్రను ప్రవేశపెట్టుట శ్రవ్యకావ్య కళారంగంలో సర్వసాధారణంగా సహృదయాభిరుచికి విందొనర్చుటకై చేయు కల్పనమే. అందువలన ఈ పాత్రలరూపమూ, చేష్టలూ, విచిత్రముగానూ, లోకాతీతముగాను ఉన్నట్లు కల్పించి కవి ఎన్నో కావ్యప్రయోజనాలను పొందును. (Fantastic, super human and abnormal qualities attributed) పాఠకునుత్తేజపరచుట, ఆశ్చర్యమున ముంచుట, కావ్యపఠనావ్యగ్రతలో విరతినిచ్చుట (Comic relief) కథనానికి కమనీయత నాపాదించుట, సన్నివేశ వైవిధ్యాన్ని సాధించుట, రసపోషణ చేయుట – ఇత్యాది ప్రయోజనములు వానిలో కొన్ని. ఇది భారతీయ సాహిత్యములన్నింటా గల్గినవిశేషమే. కావుననే దేవతలూ, రాక్షసులూ, భూతప్రేతపిశాచాలూ, వింత ఆకారాలు గల వ్యక్తులు, సింహాలూ, పులులూ, ఎద్దులూ, దున్నపోతులూ, కోతులూ, ఎలుగులూ, పాములూ, మకరములూ, ఏనుగులు, పక్షులూ మొదలగునవి ప్రవేశపెట్టబడి కావ్యానికి ఆకర్షణ కల్గించుచుండును. ఒకే జాతిలో కూడ స్థూలరోమ, వృశ్చికరోమ, విద్యుజ్జిహ్వ కుంభకర్ణ, మూషికముఖ, శుకముఖాదులగు వారిని కూడా ప్రవేశపెట్టుట కలదు. పాశ్చాత్యులకు వీనిని అర్థము చేసికొనుట కష్టము కానీ భారతీయులకు ఇందులో క్లేశములేదని మానియర్ విలియమ్సు పండితుని అభిప్రాయము. "In the indian epics, the boundaries between the natural and the super natural, between earth and heavan, between the divine, human and animal creations are singularly vague and undefined; troops of deities and semidivine parsonages appear on the stage on every occasion. Gods and animals are ever changing places. The myths of indian epics are still closely intervowen with present indian faith."[217]

4 హనుమంతుని పాత్ర గూర్చి కొందరు పండితుల అభిప్రాయాలు.

ALIOUS WVRM అను అంగ్ల పండితుడు వాల్మీకి రామాయణ పరిశీలనలో హనుమంతుని పాత్రనుగూర్చి తెలిపియున్నాడు. 'రాముని సచివు

లలో ఇతడు ముఖ్యుడు. ప్రభువు ఆజ్ఞల నమలు చేయుటకు అందరికన్న ముందుగా నియమింపబడు కార్యనిర్వాహకుడితడే (Executive) దౌత్య రాజనీతివేత్తగా (Diplomat) దూతగా (సందేశహరునిగా) పరరాజ్య పరిస్థితులను ప్రచ్ఛన్నంగా పరిశీలించు గూఢచారిగా (Reconnaiteur) రాజకీయ సలహాదారుగా, ఆదర్శ అమాత్యునిగా వాల్మీకి హనుమంతుని సృష్టించెను. తన ప్రభువులగు రామసుగ్రీవుల కార్యముల నన్నింటిని తన బహుముఖమైన ప్రతిభతో నిర్వహించుటలో ఇతని కుశాగ్రబుద్ధి, ఔచితీపరిజ్ఞానమూ, మానవ మనస్తత్వ పరిశీలనాదక్షత, సందేశముల నందించు సామర్థ్యము అతడు సువ్యక్తమొనర్చెను. దుర్ఘటములైన కార్యముల ననేకముగా సాధించుట గడువులోపల సాధించుట అను పరిమితులున్నప్పుడు కార్యావసరములోని తొందరలనుబట్టి వ్యక్తి తాను సాధించు లక్ష్యమునే ప్రధానముగా నెంచి సాధనా మార్గములను ఎట్టివైనా పాటించుట జరుగును. ఒత్తిడికి లోనైనపుడు ఏకైకముగా కృషిచేయుచో నీతి నిజాయితీల కుద్వాసనచెప్పి ప్రయత్నించుట దోషముకూడ కాదని అనిపించును. ఎట్టి కార్యముల సాధించినా హనుమంతుడుత్తమ సాధనాసంపత్తిచేతనే తన కార్యముల సాధించెనేకానీ నీచపు పద్ధతులను పాటించలేదు. "In the author's general conception, HANUMAN, is an ideal minister characterised by his skill in reconnoitring and his discretion in tackling affairs. his psychological depth of counselling and his responsibility in his role as messenger, all his actions being motivated by loyalty to and concern for his master as well as Rama and endowed with a gamut of ideal character traits. Though, Valmiki, often employs the pattern of spontaneous improvisation in expliciting this side of HANUMAN'S character in different situations, its uniform ontlook clearly reveals the author's distinct conception of HANUMAN as an ideal minister."[218A]

ఎక్కడ ఏ విధంగా ప్రవర్తించాలో, ఏ రూపమున చరించాలో, ఎవరెవరితో ఏ తీరున భాషించాలో సుందరకాండమున చిత్రింపబడిన హనుమంతుని పాత్రలో గోచరించును. అపార్థమున కవకాశమివ్వకుండా, తన సందేశమును సీత వినునట్లుగా మాట్లాడి, ఆమె తనను విశ్వసించునట్లు చేయు

సట్లు చేయుటలో అతనిశైలి, రావణునివంటి అధికార మదాంధుని వద్దకు చేరి వానికి నీతి బోధించుటలోని ధైర్యసాహసములు, లంకలో సాగించిన శత్రు నిర్మూలనారూప విధ్వంసక చర్యలు వాల్మీకి పాత్రచిత్రణలో ముఖ్యంగా గోచరించును. "The imaginative depiction of HANUMAN'S fabulous super human powers of locomotion, super natural lustre, strength and valour, his HERCULEAN power and rage of demolition, his ardour for fight and pugnacity, mightvalone, heroism and skill in fighting the most valiant warrions and of his boastful and bombastic selff assertions ....in all these, the poet has an apportunity to project before the audience scencs ot awe imbued with a sentiment of heroic wonderment, so as to thrill the audience. In projecting such scenes, the poet, in order to bring them to their climax, exhausts all the resources of his poetic imagination, following the inspirations of the moment. As he makes HANUMAN the hero of such scenes, he will invest him with character traits fully appropriate to the highly imaginative and fubalous timbre which pervades these scenes. Thus, we can say, that the depiction of HANUMAN'S super human dimension is based on the bardic pattern of spontaneity. Yet, the consistency which emerges in all such similar scenes, never the less, shows that Valmiki had formed some definite conception of HANUMAN'S super natural dimension in his mind.' [218B]

అందువలన ఈ పాత్రను ఉదాత్తఫణితిలో తీర్చంమేకాక ఉదాత్త శైలిలో దానిని రూపొందించినాడను శ్రీ శ్రీనివాసశాస్త్రిగారి అభిప్రాయము సమంజసముగా నున్నది. The poet has conceived character of HANUMAN in the great style and executed it also in grand style.[219]

మండోదరినిచూచి సీతగా భ్రమపడి ఆ సంతోషములో సంబరమొంది కొన్ని మర్కటచేష్టలు చేయుట, సీతను తన వీపుపై మోసుకొనిపోవుటకై ఆమె అనుమతి కోరుట, రావణ వధానంతరము సీతాదేవివద్దకువచ్చి ఆమెను

కూడ. డాక్టర్ అప్పజోడు వెంకటసుబ్బయ్యగారు తెలిపినట్లుగా "అమేయమైన ఒక శక్తి, అద్భుతమైన యుక్తి, అచంచలమైన భక్తి సంగమించిన ఒక మహా పవిత్ర త్రివేణీతీర్థం ఆంజనేయుని వ్యక్తిత్వం. అనంత కల్యాణగుణపరిపూర్ణుడగు శ్రీరామునివంటి ప్రభువునకు సేవకుడై అతనిముందు తనప్రజ్ఞలచూపి, పొగడ్తలొంది, ప్రశస్తిని పొందుట ఆంజనేయునికొక్కనికే చెల్లినది. వ్యక్తి ఔన్నత్యానికీ, సమాజకల్యాణానికీ దోహదం చేసిన ఒక మహనీయ జీవితమార్గం ఆంజనేయునిది. శక్తి, సామర్థ్యాలతోపాటు అవరోధాలను దాటగల్గు ఉపాయముకల్గి, అనుకొన్నదానికంటే అధికంగా విజయం సాధించుటవలననే 'చూచి రమ్మనిన కాల్చివచ్చినాడనుఖ్యాతికి ఆలవాలమైన శీలము హనుమంతునిది.'[223]

సీతాపహరణానంతరం రామాయణకథను నడిపించుటలో హనుమంతుని పాత్ర సూత్రధారుని పాత్రయే.[224] బహుముఖ వ్యక్తిత్వము కలిగిన హనుమంతుని జీవితము రామపరతంత్రమైనది రామభక్తునిగా, రామదాసునిగా, రామసేవకునిగా, రామదూతగా, రామసచివునిగా, రామసలహాదారుగా, రామవాహనముగా, రామకార్యతత్పరునిగా, రామరక్షాదీక్షితునిగా ఈతని శీలమెల్లవేళలా రామపరతంత్రమైనది. సకలవిద్యావేత్తగా, నవవ్యాకరణవేత్తగా, కళాకారునిగా, సంగీతకళానిధిగా, వాక్యకోవిదునిగా, మహాబలునిగా, మహావీరునిగా, మహావేగశాలిగా ఉండికూడ నిరహంకారుడై నిర్మలచిత్తుడై శిశుసదృశ అమాయకత్వముతోనుండుట (Child like innocence) ఇతని వ్యక్తిత్వమందలి విశేషము. ఒక కార్యమునుగురించి తెల్సికొని, దానిని సాధించాలను ఇచ్ఛతోపాటు సామర్థ్యము కలిగికూడ ఏమీ తెలియనట్లుండుట గొప్పవిషయమని ఆంగ్లోక్తి. (To know, to will and to do and yet keep silent about one's powers is a great thing.)

హనుమంతుని పాత్రకున్నంత ఆకర్షణ రామాయణమందలి యితర యే పాత్రకును లేదు. (Charisma) దానికనేక కారణముల చూపవచ్చును. దేహబలముతో సాధించు కార్యములనతడు మహాసాహసముతో సాధించెను. ఇతని తోడి వానరులెవ్వరును ఇతను చూపినంత జవసత్త్వ పరాక్రమములను చూపలేదు. కార్యనిర్వహణకు కేవలము బలమున్నంతనే చాలదు. దానికి అవసరమగు బుద్ధిబలమును, యుక్తిని, ఉపాయమును హనుమ కొల్లగా కలిగియుండెను. ప్రయత్నించిన ప్రతికార్యమున ఫలసిద్ధిని పొందినవాడు పావని.

ఇతనికేవిషయములోను ఓటమిలేదు. ఏ పనికి నియోగింపబడినా, మారు మాటాడకుండా, ముందు వెనుక ఆలోచించకుండా, ఇతరుల సాహాయ్య మర్థించకుండా, జాగుచేయకుండా తక్షణం ఆ పనిని సాధించడానికి పూనడం హనుమంతునికొక్కనికే చెల్లినది. తలచినపని నెరవేరువరకు మనసును ఇతరత్రా మళ్ళించకుండా, విశ్రాంతికై వేకారకుండా, రామబాణం లక్ష్యశుద్ధి కలిగినట్లుగా కార్యంసాధించుట ఇతనిప్రత్యేకత. వాలి సుగ్రీవులకన్నా బలశాలియై కూడ వారిని యెల్లప్పుడు గౌరవించెనేకాని మీరి చరించలేదు. రామునికి రాక్షస వినాశమున ఇతని సహాయ మనల్పమైనది. రామకైంకర్యదీక్షలో ఇతనికి సాటిరాగలవారే లేరు. సందర్భోచిత సలహాలనిచ్చు సచివునిగా, రాజకీయపుటెత్తులను పరిశీలించి రాబోవు పరిస్థితులనూహించి, ప్రమాదములు రాకమునుపే వానిని ఊహించి నిర్భయముగా ప్రభువుయెదుట తన అభిప్రాయముల ప్రకటించి ప్రభువు కర్తవ్యమును సరిగా నిర్ణయించుకొనుటకు సామీరి నిర్వహించినపాత్ర గొప్పది· శ్రీ శ్రీనివాసశాస్త్రిగారి మాటలలో: "Many things in his character attract one; People yield their thearts so thoroughly to him. He was great nearly in every sense of the word. He performed great deeds of volour, of physical strength which no other living character of his time could have performed. These deeds required the greatest strength, greatest will power, fell to his lot, and he performed then with admirable thoroughness of execution. They were done on the highest level of devotion, rectitude, and sense of duty. Superlatives crowd HANUMAN as you contenplate him. He was most devoted to Rama and allowed no man to come near him in his love for Rama, and his desire to perform all the things, whether he ordered them or not. He is wise, he is moderate in his counsel. He is always ready to see things while yat they are only comming. Few can approch HANUMAN in sheer greatness, in weight of achievement, He belonged to the VANARA race, which is inferior to the race of man. It is therefore from the nature of a monkey that HANUMAN, has risen. Our appreciation of his greatness will be enhanced when

we remember the fact that by nature, by constitution, he was a monkey "[225] వానరుడై కూడ నరులకన్నా ఘనకార్యాలు సాధించి నాడు కనుకనే హనుమంతునికింత ఖ్యాతి.

హనుమంతుడు సాధించిన ఘనకార్యములు : బాలుడుగా నున్నప్పుడే సూర్యబింబం పట్టుకొనపోవుట, సూర్యునివద్ద సకలవిద్యల నేర్చుట, రామ సుగ్రీవ మైత్రీ సంఘటనము, సాగరలంఘనము, సీతాన్వేషణము, లంకా దహనము, రావణసభలో రావణునికి నీతివాక్యముల బోధించుట, సేతునిర్మాణ కార్యభారము పూనుట, విభీషణునికి శరణాగతి నిప్పించుట, యుద్ధమున శ్రీరామాదుల పక్షమున పోరుట, సంజీవనీ పర్వతము ననేకమార్లు తెచ్చుట, శ్రీరామలక్ష్మణులను కాపాడుట, రామ సైన్యమునకు పెట్టనికోటగానుండుట. మైరావణవధలో గుట్టుగా కార్యసాధనచేయుట, శతకంఠ (సహస్రకంఠ) వధలో తోడ్పడుట, అశ్వమేధయాగమున హయము ననుసరించివెళ్లుట, రాముని కి సన్నిహిత పరిచారకుడై ఉండుట, సీతారాములవద్ద తత్త్వరహస్యముల నెఱుగుట, మోక్షమును కోరకుండా రామధ్యానదీక్షలో నిత్యకైంకర్యాసక్తితో చిరంజీవిగా నుండుట, సత్యభామ, గరుక్మంత, తుంబురు నారదుల గర్వభంగ కారకుడగుట, భీమార్జునులకు తోడ్పడుట, నరవానరుల నాపదలో ఆదుకొనుట ఇత్యాది కార్యములు.

హనుమంతుడు చంపిన (చంపుటకు హేతువయిన) రాక్షసులు:

అశోకవన విధ్వంసవేళలో 1 జంబుమాలి మరియు 8000ల మంది రాక్షసులు, మంత్రిపుత్రులేడ్గురు, పంచసేనానులు, అక్షకుమారుడు. మొత్తం ఎనిమిదివేల పధ్నాలుగురు.

యుద్ధరంగమున ఇతనిచే చచ్చినవారు :

1 జంబుమాలి, (వీడింకొకడే) 2 ధూమ్రాక్షుడు, 3 అకంపనుడు, 4 దేవాంతకుడు, 5 త్రిశిరసుడు, 6 కాలనేమి, 7 మాల్యవంతుడు, 8 స్థూల జంఘుడు, 9 మహాదంష్ట్రుడు, 10 మహోదరుడు, 11 శార్దూలముఖాదులగు ఏడ్గురు, 18 మైరావణుడు, 19 నికుంభుడు, 20 ఖడ్గరోముడు (వీడు రాముని చే హతుడైనట్లు కొన్ని రామాయణములలో కలదు.)

హనుమంతుని వ్యక్తిత్వములోని ముఖ్యాంశములు :

1 పాండితీబుద్ధివిశేషములు – వాక్యకోవిదత్వము, 2 సకలశాస్త్ర, సకల కళావేత్తృత్వము - తత్త్వజ్ఞానము, 3 భక్తి, 4 రామసేవ, 5 రామనామ ప్రచారకత్వము, 6 దూతగా – దౌత్యవ్యవహర్తగా – సందేశహరునిగా, 7 ఆజన్మ బ్రహ్మచారిత్వము - జితేంద్రియత, 8 నిరహంకార వినయసౌశీల్యం, 9 రాజనీతిజ్ఞత, 10 పరాక్రమ ధైర్యసాహస శౌర్యము, 11 ఆపద్రక్షకత, 12 కామరూపత, 13 చిరంజీవిత్వము-అజరామరత్వము, 14 ఆచార్యునిగా, 15 యోగిగా, 16 జీవన్ముక్తిమార్గ ప్రదర్శకునిగా, 17 మహాత్మునిగా, 18 ఆరాధ్య దైవముగా, 19 భావిబ్రహ్మగా, 20 జ్ఞానిగా ఎన్నో అంశము లున్నవి. వీనినిగూర్చి ప్రత్యేకముగ కృషిచేసి తెలియదగిన విశేషములెన్నో ఉండును కాన వానిని భవిష్యత్పరిశోధనకు విషయముగా ఎంచి విరమించు చున్నాను. (10వ అధ్యాయములో తెలిపియున్నవి తప్ప)

హనుమంతుని వ్యక్తిత్వ గుణగణాది విశేషములు.

1 దివ్యాంశసంభూతుడు

హనుమంతుడు దివ్యాంశసంభూతుడు. సర్వదేవతల అంశలు త్రిమూర్తులలో చేరి రుద్రునిద్వారా తేజోరూపమున వెల్వడి పృథ్వి. అగ్ని, వాయుదేవతల సహకారముతో అంజనాదేవికి లభించి జన్మించినవాడు. పంచభూతములకీతని జన్మతో ప్రత్యక్షసంబంధముండుట విశేషము. దుష్టసంహారమునకు భగవంతుడు శ్రీరామావతారము దాల్చగా అతనికి కింకరుడై సేవింపులొనర్చుటకు సాక్షాత్తు శివుడే ఆంజనేయుడై జన్మించెను. రుద్రాంశ సంభూతత్వములతో పాటు, వాయునందనత్వము ఇతని విశిష్టతకు కారణమైనది. శ్రీ రాముని తన ఆరాధ్య దైవముగాపొంది అతనినే సేవించుచుండి శ్రీ సీతారాముల కలయికకు హేతుభూతుడైనందున రామాయణమున శ్రీ సీతారాములీతని తమ పుత్రునిగానే భావించి వాత్సల్యము చూపిరి. అందువలన శ్రీ హనుమంతుడు శ్రీ సీతారామ పుత్రునిగా భక్తాదులు భావించుచుండుటకు వీలయినది. పుట్టుకతో వాయునందనుడగుట అనిలవేగమును, రుద్రతేజోరూపమున సకలదైవాంశముల పొందినందున లోకాతీతమగు అసాధ్యక కార్యముల సాధింపగల్గినవాడయ్యెను. ఇంద్ర వజ్రాయుధపు దెబ్బను సహించి జీవించినవాడై, సర్వదేవతలను తపముచేసి మెప్పించకయే వారినుండి వరములను అయాచితముగా పొందిన అదృష్టశాలి యితడు. దేవతలను తా నుపాసించకపోవుటేకాక, దేవతల బాధలనే తీర్చుటకు అవతరించిన సుకృతి యితడు. శ్రీరాముని వలెనే ఆంజనేయుడు కూడ జగద్రక్షకై అవతరించెను. 'అంజనేయావతారేణ జాతః సంరక్షితం జగత్.'[226] పురాణములలో అనేకులు యక్ష రాక్షస గంధర్వాదులు తపోదీక్షలో బ్రహ్మ రుద్రాదుల మెప్పించి వరములపొంది ఆ తర్వాత గర్వముతో విర్రవీగి లోకకంటకులైనట్లు జగద్విదితము. హనుమంతుడట్లుకాక ఎన్నో అద్భుతమగు వరములను పొంది లోకకల్యాణ రూపమగు కార్యములకు, శ్రీరామసేవకు తన శక్తి యుక్తులను ధారపోసెను.

దీనివలన ఇతని నిష్కామకర్మనిరతి వ్యక్తమగును. నిజ మనోరథమునొక దానిని ఏర్పరచుకొని, స్వార్థమునకై ఇతడు పాటుపడినట్లు చూపజాలము. శ్రీ విష్ణువవతారమగు శ్రీరాముని సమాశ్రయ కారణమున ఇతడు గొప్ప పదమును పొందెను.

పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః।
తేనైవ తే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమాం పదం॥

హనుమంతుడు దివ్యాంశ సంభవుడు కావుననే ఇతనికి దివ్యదృష్టికలదు. అర్జునునితో పందెం వేసినపుడు సేతువు క్రుంగనందుకు కారణము నతడు తన దివ్యదృష్టితోచూచి కూర్మరూపమున భగవంతుడుండెనని గ్రహించి తన ఓట మిని అంగీకరించెను. సౌగంధిక పుష్పముకొఱకై భీముడురాగా, అతడు తెలుపకముందే అతడు తన తమ్ముడని దివ్యదృష్టితో గుర్తించెను. త్రిశూల రోముడనువానిని చంపుచో వాడు 'స్ఫటికశిలలో దాగినట్లు ఈ దివ్యదృష్టి తోనే తెలిసికొనెను.

"హనుమంతుడు సర్వదేవతలకు శరణ్యుడు, భక్తవత్సలుడు, త్రాత, సర్వకామదుడు, సకలదేవతలచే నుపాసింపబడువాడు. ఒక ముఖమున శివ బీజాక్షరముకలవాడు. మూడు భాగములలో త్రిమూర్తులుకలవాడు. భవిష్య ద్బ్రహ్మ, మహాయోగి. మహాజ్ఞాని. ఇతడు నారసింహ, గరుడ, వరాహ, హయగ్రీవ ముఖములనుగూడ కలిగి పంచముఖుడనబడును. ఇతడు ద్వాదశా దిత్య, ఏకాదశరుద్ర, అష్టవసు, బ్రహ్మ విశ్వదేవతలచే సదా కూడి యుండు వాడు. షోడశ శక్తులతో కూడినవాడు. ఇరువది క్షేత్రపాలకులతో, వటు కాదులతో అలంకరింపబడినవాడు సర్వతత్త్వములతో, వివిధ ఛందస్సులతో సేవింపబడువాడు. ముప్పదిరెండు నృసింహ రూపములతో పరివేష్ఠింపబడి యుండువాడు. అట్లే యోగినీగణములతోనూ, భైరవగణములతోను అరువది నాలుగు వాయుజనిత రూపములతోను పరివేష్ఠింపబడి యుండువాడు.[227]

శ్రీమద్భాగవతంలో కృష్ణుడు తన విభూతులను పేర్కొనుచో హనుమం తుని కూడ తన విభూతులలో ఒకటిగా పేర్కొనెను.

వాసుదేవో భగవతం త్వంతు భాగవతేష్వహం।
కిం పురుషాణాంతు హనుమాన్విద్యాద్రాణాం సుదర్శనః॥
(అధ్యా 16 శ్లో 29)

అందువలన హనుమంతుడుపాసనలకు, పూజలకు దైవముగా గుర్తింపబడెను. వాల్మీకి మహర్షి హనుమంతుని అప్రాకృతపురుషునిగానే వర్ణించెను. 1 రావణునుని ఎత్తుకొని అగ్నికుండము కడకు హోమముచేయుటకై యజ్ఞపశువును కొనిపోయినట్లు కొనిపోయెదననుట, (సుందర. సర్గ 13 శ్లోం 50 అధవైనం) 2 'నహి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ' అని సీత అనినది, (సర్గ 36 సుందర. శ్లో 9) రావణుడు హనుమంతుని తన సభలోకి తేబడుచుండగా చూచి 'కిమేష భగవాన్నందీ భవేస్సాక్షాది హాగతా' అని అనుకొనెను. (సందర. సర్గ 50 శ్లో 2) శ్రీ సీతారాముల కలయికకు కారణమై వారిద్వారా శ్రీరామపరిష్వంగము, చిరంజీవత పొందిన హనుమంతుడు రామాయణములోనేకాక ఏ సాహిత్యములోనూ కనబడని విశిష్టమైనపాత్ర.

2 హనుమంతుని వినయ సౌశీల్యాదులు

హనుమంతుడు అజన్మ బ్రహ్మచారి. బ్రహ్మచర్యమను దానిని గూర్చి. తదావిర్భావమును గూర్చి తెలియదగిన అంశమున్నది.

బ్రహ్మ ఆవులించగా రుద్రుడు జన్మించెను. ఆ జన్మించిన రుద్రుడు సగము స్త్రీగా, సగము పురుషునిగా అవతరించెను. బ్రహ్మ అతనిని వేరు వేరుగా రూపొందించెను. అట్లు వేరైన రూపములనుండి పురుషరూపమునుండి ఏకాదశ రుద్రులు జన్మించిరి. అట్లే స్త్రీభాగముగా ఉన్న రూపంకూడ అనేక రూపములైనది. ఏకాదశరుద్రులు బహు తేజోగుణవిశిష్టులు. స్త్రీ పురుషాంశలు కల రుద్రునినుండి కాక కేవలం పురుషాంశంనుండి వచ్చిన ఏకాదశరుద్రుని నుండి ప్రభవించిన కారణముననే హనుమంతునకు అజన్మ బ్రహ్మచారిత్వము కలిగెను. ఈ అంశము విష్ణుపురాణమునందున్నది. ఈ అజన్మ బ్రహ్మచర్యమతి కఠోరమైనది. లోకస్థులకు జనులకీస్థితి నూహించుటకుకూడ వీలుకాదు. (జీవశాస్త్రమీనాడెన్నో వైజ్ఞానిక సత్యముల తెలుపుచున్నది. సృష్టిలో ప్రతి ప్రాణిలో 'X' 'Y' అను క్రోమోజోములుండు స్థితినిబట్టియే సృష్టిలో స్త్రీ పురుష విభాగ మేర్పడుచున్నదని నిరూపితము. కేవల పురుషధర్మమూ, కేవల స్త్రీ ధర్మమూ ఏ పాత్రలోనూ ఉండవనియు స్త్రీ పురుషుల కలయిక వలన జన్మించువారిలో స్త్రీ కావడానికి గానీ, పురుషుడు కావడానికి గానీ గర్భస్థ శిశువుగానున్న సమయముననే ఈ క్రోమోజోముల ఏర్పాటు నిర్ణయింప

బడి శిశువునకు లింగనిర్ణయము జరుగుచున్నది శాస్త్రీయసత్యము. ఈ కారణమున వయోచితమగు భావములు స్త్రీలకు పురుషులయెడ, పురుషులకు స్త్రీలయెడ ఆకర్షణాది వికారములు కలుగుచుండుననియు సభ్యతా సంస్కారాల వలన, ప్రవర్తనా నియమాదుల వలన వ్యక్తులు తమ హృదయస్థ వికారాదులు దాచ గల్గినా, స్పందనను ఆపజాలరని శాస్త్రజ్ఞుల అభిప్రాయము.) ఆంజనేయునికి స్త్రీ దర్శనమాత్రమున ఎట్టి స్పందనగానీ, భావవికారముకానీ కల్గినట్లు సాహిత్యాధారాలు లేవు. అందువలన ఇతనిని అస్ఖలిత బ్రహ్మచారి అని వ్యవహరించుచున్నారు. రావణాంతఃపురములో వివిధ స్థితులలో అనాచ్ఛాదితలై వివిధశృంగారావస్థలలో, రతిసంరంభముతో, రతిశ్రమాదులతో నుండిన ఎందరో స్త్రీల నీతడు చూచికూడ ఏవిధమైన మనశ్చాంచల్యము పొందని స్థిరచిత్తుడాంజనేయుడు.

సుగ్రీవాది వానరులందరు బహు స్త్రీ లోలురుగా నుండగా తమ జాతి ధర్మమునకు భిన్నముగా ఆంజనేయుడుండెననగా ఆతని ఆజన్మ బ్రహ్మచర్యమే అందుకు కారణమనవచ్చును. ఈషణత్రయదూరుడైనందున ఈతని శరీరమున రోమరోమముననేకాక హృదయమందుగూడా రాముడే నిండియుండెను. 'అంతా రామమయం బీజగమంతా రామమయం'బని రామదాసు కీర్తనలలోని భావ మాంజనేయునియెడ అన్వయించినంత ఔచిత్యముతో ఇంకెవరికినీ చెప్ప జాలము. 'సర్వం విష్ణుమయం జగత్' అని అనినట్లుగా హనుమంతునికంతా సీతారామ మయమే.

బ్రహ్మచర్యమనగా దేహమూ, బుద్ధీ రెండూ విశుద్ధములై అనుభూతికి గల ముఖ్యావరణనిరోధము తొలగియుండుట. కేవలము సంభోగత్యాగము బ్రహ్మచర్యముకాదు.—

కాయేన మనసా వాచా సర్వావస్థాసు సర్వదా।
మైథున దర్శన త్యాగో బ్రహ్మచర్యం ప్రచక్షతే॥

—అని యాజ్ఞవల్క్య ప్రమాణము ప్రకారము వాక్కునను, మనస్సునను (భావములోను) అట్టి భావము లేకుండుటే బ్రహ్మచర్యము. మైథునదర్శనము, స్పర్శనము, కేళీ, కీర్తనము, గుహ్యభాషణము, సంకల్పము, అధ్యవసాయము, క్రియానివృత్తి అని విషయతృష్ణ ఎనిమిది విధములని శంకరభగవత్పాదులు పేర్కొని యున్నారు. భగవద్రామానుజులు విషయతృష్ణను స్త్రీ భోగ్యతా

బుద్ధిగా పేర్కొనిరి. ఆత్మరతుడైనవానికి బ్రహ్మచర్యమే ముఖ్యము. శంకర రామానుజుల జీవితమే ఇందుకు నిదర్శనము. ముఖ్య భక్తుడగునేని గృహస్థుడుగా నుండియు సదా బ్రహ్మచారిగానే యుండును.

బ్రహ్మచారి యైనందున హనుమంతుని జితేంద్రియునిగా చెప్పవచ్చును.—

ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే।
ఏతై ర్విమోహ యిత్యేష జ్ఞాన మాకృత్య దేహినం॥
తస్మా త్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనం॥

—అని గీత (3 అధ్యా. 40-41 శ్లో.)లో తెలిపినట్లుగా పంచేంద్రియములను తొలుత నిగ్రహించి ఆత్మజ్ఞానమును అనుభవజన్య జ్ఞానమును నశింపజేయునదియు, పాపస్వరూపమైన కామమును లెస్సగా విడుచుటయే జితేంద్రియత. ఆహార నియమము, అప్రతిగ్రహము, కామజయము, యోగాభ్యాసము కలవారు నిగ్రహానుగ్రహ సమర్థులగుదురని అందువలననే ఆంజనేయుడు అష్టసిద్ధుల నొసగగల్గువాడయ్యెనని పెద్దలందురు.

3 హనుమంతుడు అహంకార రహితుడు

ఇతడు నిరహంకారి. ఇతనికి స్వాతిశయమనునదియే లేదు. సీతాదేవికి శ్రీరామసందేశమందించు వేళలో తన బలము నుగ్గడించుచో తాను సామాన్యమైన ఒక కోతినని చెప్పుకొనెను. తనకంటే ఎంతో గొప్పవీరులు రామ సుగ్రీవులవద్ద నున్నారని చెప్పెను. ఏదైన ఒక కార్యముపై పంపుచో ప్రభువగువాడు తక్కువశ్రేణిలోని వారినే దూతగా, సందేశహరునిగా పంపుదురనియు, కావున తనను చూచిమాత్రమే సుగ్రీవసైన్యములోని బలాబలముల మదింపు చేయరాదని సీతకు తెల్పిన నిరహంకారి సామీరి. సాగర లంఘన సమయమున సూర్యునికి, ఇంద్రునికి, వాయువునకు, బ్రహ్మాదులకు, సీతారాములకు నమస్కరించి సాగిపోవుట ఈతని వినయశీలమును తెలుపును. సీతాసందేశము కొనివచ్చిన తర్వాత వానరులాంజనేయుని పొగడుచుండగా, సుగ్రీవుని కార్యము శ్రీ సీతారాముల కృపాప్రసాదముచే తనచే సాధింపబడెనని చెప్పెనేకానీ తన శ్రమనుగూర్చి, గొప్పతనాన్నిగూర్చి చెప్పలేదు. ఇట్లే సంజీవనిని తెచ్చిన వేళలోను, శతకంఠాది రాక్షసులపై దాడి వెడలుచో తా

నొనర్చిన జవసత్త్వాది పరాక్రమపూరిత కార్యములకు రామానుగ్రహమే కారణమని పేర్కొనుట ఈతని నిరహంకారత బాటును. రావణసభలో "దాసోహం కోసలేంద్రస్య" అని తనను రాముని దాసుగానే చెప్పుకొనెనేగాని తననుగూర్చి గొప్పలను పలుకలేదు. సావధానముగా స్వామికార్యమును చూచువాడే దాసుడని అందురు. (దంసయతే స్వామి కార్యాణి వావధానేనేం దాసః) తన స్వామికి పరతంత్రుడై జీవించినవాడు ప్రాణనందనుడు. He came to know the truth of the cycle of time; the purpose of the YUGAS (యుగములు) each turn of the wheel cansing tne advent of the lord with all the attendant paraphernalia. He realized the importance of time, its consant movemeut and his own state as a bird of passage. Through devotion and love to his lord he should seek to escape the merciless fargs of time, that he should utilise every movement of his life according to the will of his master.[228] అందువలన ప్రసన్నుడు తనను అందరికన్నా తక్కువగా భావించుకొనునేకాని తనను శ్లాఘించుకొనడను సూత్రమునకీతడుదాహరణము. ('కార్యం నైచ్యాను సంధానం' ప్రసన్నామృతం)[229] తాము హనుమంతుడొనర్చిన ఉపకారములకు ప్రత్యుపకారము చేయలేక అతని ముఖమును చూడలేకున్నామని శ్రీరాముడు తెలిపినపుడు హనుమంతుడు 'ప్రభూ! మీరు సర్వజ్ఞులు. మేము వానరులమగు శాఖామృగములము. సముద్రమును దాటుట, లంకను దహించుట, రాక్షసులను చంపుట, తమరాజ్ఞాపించిన కార్యముల చేయుట ఇవి మీ ప్రతాపమువలననే జరిగెను. వీనిలో నా ప్రయోజకత్వము శూన్యము. మీ ముద్రికాబలముచే సముద్రమును గోష్పాదమువలె దాటితిని. ఆ ముద్రికనుచూచి జానకి శాంతించెను. అమె శోకాగ్నియే లంకను దహించెను. ఆమె చూడామణి బలముచే నేను మరల సముద్రమును లంఘించి మిమ్ము చూచితిని. నాకు నిత్యానపాయినియైన భక్తిని మీయందు ప్రసాదించిన చాలును' అని హనుమంతుడు పలికిన పలుకులు కేవలముపచార వాక్యములు కావు. అతని నిజ చిత్తస్థితియే అది.[230]

శ్రీమద్రామాయణారంభమున వాల్మీకి మహాముని నారదులవారిని తన కావ్యనాయకుడగు శ్రీరామునకుండదగు షోడశగుణముల పేర్కొనియున్నాడు. ఇట్టి దుర్లభములగు గుణములుకల శ్రీరాముని ఆశ్రయించి అతనివలె ఆ

గుణముల నన్నింటినీ కలిగినవాడు కాకున్నను ఆ గుణ ప్రపూర్ణుడగు పర మాత్మ నాశ్రయించిన సజ్జనుడు ఆంజనేయుడు. (కోన్వస్మిం త్సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్ .... జాతరోషస్య సంయుగే.— (బాలకాండ 2, 3, 4 శ్లో. 1 సర్గ.)

1. గుణవాన్ అనగా తనకన్నా అల్పులతోకూడ కలసియుండగల సౌశీల్యం కలవాడు.

2. వీర్యవాన్ అనగా చేయదలచిన పనిని చేయునట్టివాడు. (పట్టుదల కలవాడు.)

3. ధర్మజ్ఞః అనగా ఇహలోక పరలోక ధర్మముల తెలిసినవాడు.

4. కృతజ్ఞః అనగా అపకారములను మరచి ఉపకారములను గుర్తుంచుకొను వాడు.

5. సత్యవాక్యః అనగా పొగడ్తలకై అబద్ధములాడక, హితవాక్యములగు సత్యములను భాషించువాడు.

6. దృఢవ్రతః అనగా ప్రతిజ్ఞ నెరవేర్చుకొనువాడు.

7. చారిత్రేణ చకోయుక్తః అనగా పెద్దలు మెచ్చుకొను నడవడికలవాడు.

8. సర్వభూతేషు హితః — సమస్త ప్రాణుల హితము కోరువాడు.

9. విద్వాన్— సకలమైన పాండిత్యము కలవాడు.

10. సమర్థః— కార్యనిర్వహణాదక్షుడు.

11. ఏక ప్రియదర్శనః — ఏ అవస్థలో చూచినను ఆకర్షకమైన అందము కాలవాడు.

12. ఆత్మవాన్— ధైర్యము కలవాడు.

13. జితక్రోధః— కోపము నధిగమించినవాడు.

14. ద్యుతిమాన్— ఆధ్యాత్మిక తేజస్సుతో వెలుగువాడు.

15. అనసూయకః— పరుల అతిశయమునకు సంతోషపడువాడు.

16. జాతరోషుడు— ఇతని కోపమునకు ఎదుట దేవతలు మొదలుకొని ఎవ్వ రును నిలువజాలకుందురు.

--కావున హనుమంతు డీవిధమగు షోడశగుణపూర్ణు నాశ్రయించి ఆ గుణములనారాధించి వాని నాకలించుకొనిన సత్ జనుడు. భగవదర్పితమైన కర్మమును 'సత్' అని అందురు. అది కలవాడు సజ్జనుడు.

హనుమంతుడు శ్రీరాముడు ప్రతిష్ఠించిన లింగమును పెకలించుటకు ప్రయత్నించిన కథలో హనుమంతు డహంకరించినట్లు భావించుటకు వీలులేదు. రాము డెంతచెప్పినను వినకుండా హనుమంతు డీపనిని చేసినందుకు శతానందుడే ప్రశ్నింపగా వసిష్ఠమహర్షి తెలిపిన సమాధానము దానిని విశదపరచునదై యున్నది.

శ్రీరామ లింగంబు సికతా మయంబుగాఁ
　　జింతించు లోకుల భ్రాంతిబాపఁ
బదం సాంబద్రోహ మొదవించి ఘనుడైన
　　నెఱి దూలునను మాట నిర్వహింప
నతలాది లోకముల్ వ్యాపించె శివుడన్న
　　రామువాక్యము నిదర్శనముసేయ
నణు రేణువైన రామావనీశుడు నిల్పె
　　నారుల కసాధ్యమౌ టెఱుకపరుప
దలచి రామనాథ దైవ లోత్పాటనో
ద్ధతి వహించెఁగాక ధర్మవేది
పరమ పుణ్యుడతడు ప్రత్యక్ష పరమేశు
డజ్ఞుడే చెలంగ.[231]

4 రామభక్తుడు – రామనామ (భక్తి) ప్రచారకుడు

ఈశ్వరుని యందలి పరమ ప్రేమయే భక్తి. 'సాపరానురక్తిరీశ్వరే' 'సాతస్మిన్ పరమ ప్రేమరూపా'. భగవంతుడు నావాడు అను మమకారమే భక్తి. సర్వేంద్రియములకు నధిష్ఠానమైన భగవానుని నిర్మలమైన ఇంద్రియములచేత తత్పరబుద్ధితో ఫలాభిసంధి రహితముగా సేవించుటయే భక్తి. ఇది కేవలము అనుభూతి యోగ్యమే. ఇది అలౌకికము. భక్తికిని లోకసాధారణమగు ప్రేమకును ఎంతో తారతమ్యమున్నది. భక్తి ఇట్టిది అని

ఊహించుటకు బుద్ధిశక్తి చాలదు. దాని స్వరూపము తెలుపుటకు భాషాశక్తి చాలదు. భక్త్యనుభవము అంతఃకార్యము: ఇతరులకది గోచరింపదు. కాయికభక్తి, వాచకభక్తి, మానసికభక్తి అని యిది స్థూలముగా మూడువిధములు. భక్తుని భక్తితీవ్రతనుబట్టి భగవంతునకు చేతనునకుగల సంబంధమునుబట్టి ఇది తొమ్మిదివిధములుగా మారును. పరమార్థదృష్టికిది ఏకరూపమే అయినను చేతనుల పూర్వసంస్కారమునుబట్టి, అభిమానాదులనుబట్టి పలు రూపముల నొందుచుండును. ప్రహ్లాదునిలో స్మరణాసక్తిగా, అంబరీషునిలో పూజాసక్తిగా, పృథవార్జునునిలో సఖ్యాసక్తిగా, దేవకీ యశోదా కౌసల్యలలో వాత్సల్యాసక్తిగా, రుక్మిణీ సత్యభామలలో కాంతాసక్తిగా, బలి విభీషణులలో ఆత్మనివేదనాసక్తిగా, సనత్కుమారాదులలో తన్మయాసక్తిగా, గోపికలలో పరమ విరహాసక్తిగా, నారద వ్యాసులలో గుణసంకీర్తనాసక్తిగా ఉన్నట్లు శ్రీ హనుమంతునిలో దాస్యాసక్తి రూపమగు భక్తికలదు. అందువలన విరహాసక్తి భక్తియొక్క పరమలక్షణమని శ్రీ యామునాచార్యులనినట్లుగా శ్రీరాము నెడబాసియుండని సాన్నిధ్యమునే అంజనేయుడు సదా కోరుచుండుట కిదియే హేతువు. "దర్శనం పరభక్తిః స్యాత్, పరజ్ఞానంతు సంగమః, పునర్విశ్లేషణా భీరుత్వం పరమా భక్తి రుచ్యతే" భగవద్దర్శనం పరభక్తి; ఐక్యము పరిజ్ఞానం; అట్టి యైక్యమునకు భంగము రాకూడదనెడి ఆకులపాటు పరమభక్తి.[232]

భక్తియోగాదులగూర్చి భగవద్గీతలో ఎంతయోవిలువైన విషయమున్నది. 'యోగినామపి సర్వేషు మద్గతే నాన్తరాత్మనా' 'మచ్చిత్తా మద్గత ప్రాణా' 'మయ్యావేశ్య మనోయేమాం' 'యోనహృష్యతి నద్వేష్టి' అను శ్లోకములలో తెలుపబడినట్లుగా హనుమంతుడు యోగులలో శ్రేష్ఠుడై భగవంతునకు ప్రియుమైన వాడయ్యెను.[233] ఇట్టిభక్తుని ఏకాంతిక భక్తుడందురు. ఇతనినే ముక్తుడనియు, భాగవతుడనియు, సత్పురుషుడనియు వ్యవహరింతురు.

"యదైకాంత్యం గతౌ విష్ణౌ భగవత్యాత్మ భావనే।
తద్వైష్ణవా భాగవతః సంత యిత్యాభి ధీయతే॥"

హనుమంతునిభక్తి త్రిగుణాతీతము కావున లోకవాసనలతని నంటలేదు. ఇట్టి ముఖ్యభక్తులు తీర్థస్థానములకు పవిత్రతనుగూర్తురు. ఎల్ల కర్మంబులును పావనము చేయుదురు. సర్వశాస్త్రములకు ప్రమాణము నాపాదింతురు. (తీర్థీ కుర్వన్తి తీర్థాని, సుకర్మీ కుర్వన్తి కర్మాణి, సచ్ఛాస్త్రీ కుర్వన్తి శాస్త్రాణి) లోక

మున జనులు స్వీయభోగార్థమే పాటుపడుచుండగా, భక్తుడు లోకకల్యాణార్థమై పాటుపడును. అందువలన భక్తుడు ఏ జాతిలో పుట్టినా, విద్యావంతుడైనా, కాకున్నా పూజ్యుడే. 'నాస్తితేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాదిభేదః' (నారద భక్తిసూత్రములు - పుట 271-276.) వానరజాతిలో జన్మించినను హనుమంతుడు తన భక్తిచేతనే ఆరాధనీయుడయ్యెను.—

ధ్యానాకర్ణన దర్శన
గానంబుల నా తలంపు గలిగిన జాలున్
బూనెదరే కృతార్థత్వంబున్.[234]

—'శ్వపచోపి మహీపాల' అను సూత్రముతో శ్రీ వచన భూషణమున తెలుపబడినట్లుగా నైచ్యము జన్మసిద్ధము. తక్కువజన్మమే శ్రేష్ఠము. ఉత్తమ జన్మము దోషయుక్తము. తక్కుజన్మ మైనచో శేషత్వమున కనుకూలించినదై యుండును. నీచకులజుడైనను విష్ణుభక్తు డయ్యెనేని వాడు బ్రాహ్మణునికన్న అధికుడు.[235] "జన్మము, వంశావళి, సత్కులము, ధర్మము, మానము, కుటుంబము, బలము, గుణము, చాతుర్యం వీనికన్నా భక్తియే ఎక్కువ" అని తులసీదాసు.[237]

రామాయణకావ్యములో ఎందరో భక్తులున్నా, వారందరిలో హనుమంతుడొక్కడే నిష్కామభక్తుడు. సుగ్రీవ విభీషణాదులు రాజ్యార్థులుకాగా, హనుమంతుడొక్కడే ఫలాపేక్షలేని భక్తిని చూపినవాడు. అవతార పరిసమాప్తి కాలమున హనుమంతుని రాముడు సంభావించి తన నేదైనా కోరుమని పలికినపుడు హనుమంతుడు 'ప్రభూ నామనస్సు మీ యెడ నెయ్యము పూనునట్లుగా, మీ భక్తి నాకు చెలువారునట్లుగా, నా మనస్సు ఇంకెందును ప్రవర్తించకుండా, మీ నామానుసంధానమునే లయించునట్లు, మీ చరిత్ర లోకమునందెంత కాలము నిలుచునో అంతకాలము నా శరీరమున ప్రాణములుండుగాక' అని కోరెను. ఇట్లు హనుమంతుడు కోరుట దేహాభిమానముచేత కాదు. ఏలన, దేహము సాధనమును, వాహనమును. దానిని విడిచినచో ఏకార్యమును సాధ్యముకాదు. మరియొక జన్మమనినచో కాలమెంతో వ్యర్థమగును. కావున సాధింపవలసినదొక్కజన్మమునందే. సమగ్రముగా సాధించుట కర్తవ్యము రామనామామృత పానమున జీవించుభాగ్యము మోక్షసుఖముకన్నా ఎక్కువైందని హనుమంతుడు తలంచెను. 'సత్యం శపే వారణ శైలనాథ. వైకుంఠ

వాసేపి నమే అభిలాష' అను ఆళ్వార్ల సంప్రదాయమునకు అనుగుణమైన నడవడి తిరువడిది. కావుననే శ్రీవైష్ణవ సంప్రదాయమున ఇతనిని 'శిరియ తిరువడి' అనియు, హనుమదాళ్వార్లనియు వ్యవహరించుట.

అమలిన భక్తి కొందఱు మహాత్ములు మచ్చరణారవింద యు
గ్మము హృదయంబునన్ నిలిపి కౌతుకులై యితరేతరాను లా
పముల మదీయ దివ్యతను పౌరుషముల్ గొనియాడుచుండి మో
క్షము మదిగోరవొల్ల రనిశంబు మదర్పిత సర్వకర్ములై.

కాన విజ్ఞాన వైరాగ్య కలితమైన
భక్తియోగంబునం జేసి పరమపదము
కొఱకు నయ్యోగివరులు మచ్చరణ భజను
లగుచు జరియింపుదురు నిర్భయాత్ములగుచు.

గురుభక్తిం జిత్తము మ
త్పరమై విలసిల్లు నంత పర్యంతము స
త్పురుషుల కిహలోకంబునఁ
జిరతర మోక్షోదయంబు సేకురుచుండున్.[237]

భగవద్రామానుజులు తెలిపినట్లుగా భక్తులకు ధారక పోషక భోగ్యములు నీరు, అన్నము, తాంబూలము మొదలగునవన్నియు భగవంతుడే. 'ఉణ్ణుం శోఱుం పరుకుం నీరుం తిణ్ణుం వెత్తిలయుం ఎల్లం కణ్ణన్' అని తమిళమున సూక్తి. వివేకము (హితాహిత పదార్థ విజ్ఞానము) విమోహము (ఆశారాహిత్యము) అభ్యాసము (అనుష్ఠానము) క్రియ (పరోపకారము) కల్యాణము (ఋజువర్తనము, సత్యము, అహింస, దయ, దానగుణములు కలది) అనవసాదనము (సంతోషముగా నుండుట) అనుద్ధర్షము (ఉద్వేగరాహిత్యము) ఏ భక్తునిలో ఉండునో అతని భక్తియోగము శీఘ్రఫలకారి అగునని శ్రీమద్రామానుజుల వాక్యము. హనుమంతునిభక్తి ఇట్టి విశిష్టలక్షణ భూయిష్టము.

భగవద్భక్తునకు భగవత్కథాశ్రవణమున్నచో దర్శన మక్కరలేదు. ఏలన, కనుకలికన్న వినుకలియే గొప్పది కనుక. ఏకాంత భక్తునకు భగవత్కల్యాణ గుణములుతప్ప, తత్కీర్తనముతప్ప మరియొకటి తలపునకేరాదు.—

"యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిం

బాష్పవారి పరిపూర్ణ లోచనం
మారుతిం...................."

—అను ప్రతీతినొందిన హనుమంతునకు శ్రీరాముని మహాప్రస్థానము సాక్షాత్తుగా దర్శనీయమైనను ఆ శ్రీరాముడు తన చర్మ చక్షువులయెదుట లేడను భావమే కలుగదయ్యె. ఆ రాముని తనలో నిల్పుకొని రామస్మరణతో రామమయమైన శరీరముతో అతడు చిరంజీవిగా నిల్చిపోయెను. శ్రీరాముని అతడనుదినము అర్చించు విధానము ఈశ్వర ప్రణిధానమైనది.

కరణంబు లఖిలోప కరణంబులును గాఁగ
ఘ్రాణంబు లుపచార భటులుగాఁగ
గంగా ప్రముఖ నాడికలు జలంబులు గాఁగ
షట్కమలములు పుష్పములు గాఁగ
జఠరాగ్ని హోత్ర ముజ్జ్వల ధూపంబు గాఁగ
బటు జీవకళలు దీపంబు గాఁగ
నందితానందంబు నైవేద్యము గాఁగ
రవి శశిజ్యోతు లారతులు గాఁగ
అంగ దేవాలయమున సహస్ర కమల
పీఠమున శాంతిజనకజో పేతుడగుచు
వెలుగు పరమాత్మ రాము నర్చించువాడు.[238]

హనుమంతుని భక్తి ఆత్యంతికమైనది. దీనిని కొందరు సరిగా అర్థము చేసికొనజాలక హనుమంతునిభక్తి మూఢభక్తి అని ముద్రవేసిరి. భక్తి దశలలో భక్తుడు తన ఇష్టదైవమును తప్ప అన్యములనెల్ల నిరసించి యుండును. అన్యులను తూలనాడుట కూడ జరుగును. దీనిని భక్తి బాల్యవిచేష్టితమని అందురు. ఇట్టి భక్తుడు అమాయకునివలె తోచును. దైవమున కెన్నో రూపములు అవతారములు ఉన్నను, తానుపాసించు రూపమునొక్కదానినే విశ్వసించును గానీ ఇతర రూపమును గుర్తింపడు. 'పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్' ("బ్రహ్మజ్ఞానముపొంది బాల్యములో నుండవలెను.") భక్తుడు శిశుసదృశమైన ఆర్జవముకలిగి తనను రక్షించుకొను ప్రయత్నమే చేయడు. భగవంతునికి పరతంత్రుడై తదనుభవముననే ఉండును. ఇట్టి అనుభవము కలిగినందుననే హనుమంతుడు ఈ చేతనా చేతనాత్మకమగు సకల జగత్తు

రామమయమని యెఱిగినవాడై ఏమీ తెలియనివానివలె నుండెను. అందు వలననే అర్జునునితో పందెం కాచినవేళలో శ్రీకృష్ణుడు తన రూపముమార్చి శ్రీరామునిగా కనపడి హనుమంతునికి అర్జునునకు సఖ్యమేర్పరచగలిగెను. శ్రీకృష్ణుడు పిలుచుచున్నాడని చెప్పిన గరుడునకు పలుకని హనుమ శ్రీరాముని పేరు చెప్పగానే క్షమాపణవేడి అనుసరించి వచ్చెను. తన సభలో ప్రవేశించు హనుమంతునికి శ్రీకృష్ణుడు తాను రామునిగా, రుక్మిణి సీతగా రూపొంది కనబడి రనగా, హనుమంతుని ఈ భక్తిలోని అమాయకతను, స్వచ్ఛతను గౌరవించియే 'యేయథామాం ప్రపద్యంతే తాంతథైవభజామ్యహం'అని గీతావాక్కు. ఇట్టిభక్తి ఆత్యంతిక భక్తి అని భాగవత ప్రమాణము. దీనిని మూఢభక్తి అనుట మూఢ లక్షణము. "నిష్కాములైన మదీయ భక్తులకు నట్టి భక్తియోగంబు సాలోప్య, సామీప్య, సారూప్య, సాయుజ్యంబులకు సాధంబుగావున మహాత్ములగు వారలు తమ మనోరథ ఫలదాయకంబులైనను మదీయసేవా విరహితంబులైన యితర కర్మంబుల నాచరింపనొల్లరు. దీని నాత్యంతిక భక్తియోగంబందురు.[239]

5 రామనామ ప్రచారకుడు — రామదర్శన కారకుడు

హనుమంతుని జీవితమున రామనామ ప్రచారము ప్రముఖమైనది. తన మహత్తును భగవంతుడు తానె వచ్చి నేరుగా చెప్పకొనజాలడు. దానిని విశదవాక్ శిఖామణులగు భక్తులద్వారా జరిపించుకొనును. భగవంతుడు వాచ్యముకాగా తన్నామము వాచకము. భగవంతునికిని ఇతరులకును ఎంత తేడా కలదో, భగవంతునకు అతని నామమునకు అంతే తేడా కలదు. భగ వంతునికన్నా అతని నామమే గొప్పది. భక్తునకు ఇది సర్వదా దగ్గరుండునది. అన్నివేళలలో, అన్నిచోట్లా మెలగునట్టిది. భగవత్ప్రీతిని, భగవత్సంశ్లేషమును కలిగించుటకు నామమే శరణ్యము. జీవించియున్నంతకాలము చేయుటకు వీలయిన సులభసాధనము నామానుసంధానము. మంత్రానుష్ఠానమునకు నియమము, నిష్ఠ, ఋజువర్తము, సదాచార మావశ్యకము. నామానుసంధాన మునకు ఏ నిబంధనలు లేవు. అన్ని నామములు భగవంతునివే అయిననూ త్యాగరాజస్వామివారనినట్లుగా, నారాయణాష్టాక్షరిలోని 'రా' శివ పంచాక్షరి లోని 'మ' కలువగా హరిహరాత్మకమగు రామనామమయ్యెను. ఇది తారక మైనది. 'మీ స్మరణం దసర్చు మానవులు సద్గతి పొందుదురు ఎంతవింత' అని గోపన్న తెలిపియున్నాడు. ఈ రామనామమును ప్రచారము చేసినవాడు

పావని. రామమయమైన జీవితముకలవాడై, సంకటమోచనుడై సర్వశక్తి సమన్వితుడయ్యెను. నీలుడు సేతువు నిర్మించుచో రాళ్ళను అందించుచు హనుమంతుడు ప్రతి శిలమీద రామనామము వ్రాసెడివాడు. అవి సముద్రముపై ఉంచగా తేలుచు నిల్చియుండెడివి. 'రామ' అను అక్షరము వ్రాసిన ఫలకమునకు ప్రదక్షిణమొనర్చుచో విశ్వమునకే ప్రదక్షిణము కావించనట్లే. ఎవనియింట 'రామ' అను నక్షరము అహోరాత్రములు మ్రోగుచుండునో వానియింట సమస్త భోగభాగ్యాలు వేరునని పద్మపురాణ సాక్ష్యము.

"మంగళాని గృహేతస్య సౌభాగ్యాని చ భారత।
అహోరాత్రం చ యేనోక్తం 'రామ' ఇత్యక్షర ద్వయం॥"

శాండిల్యాది మహర్షులు, యోగులు. ప్రహ్లాదాది భక్తులు హనుమంతుని చేరి చతుర్వేదములలో, పురాణములలో బోధింపబడిన తత్త్వమేదియో తెలుపమని కోరిరి. అపుడు సదాగతిపుత్రుడు—

ఏతేష్వైవ సర్వేషు తత్త్వంచ బ్రహ్మతారకం।
రామ ఏవ పరంబ్రహ్మ రామ ఏవ పరంతప॥

—అని తెలిపినట్లు రామరహస్యోపనిషత్తులో కలదు.—

కేవలం రామనామైవ సదా సజ్జీవనం మునే
సత్యం వదామి సర్వస్వ మిద మేకం వదామమ

—అని హనుమంతుడు రామనామమే తన జీవనము, తన సర్వస్వముగా చెప్పుకొనెను. 'నా స్వామియగు శ్రీరాముని మంగళ నామమును ప్రేమతో ఎవరు జపింతురో వారికి నేను అనుక్షణంబు ప్రయత్నపూర్వకముగా ప్రదాతనై కోర్కెలదీర్చి సుఖమునిత్తును' అని హనుమంతుడే చెప్పుకొనెను.

"ఏ జపంతి సదా స్నేహాన్నామ మాంగల్యకారణం
శ్రీమతో రామచంద్రస్య కృపాళో మమ స్వామినః
తేషామర్థీ సదా విప్రప్రదాతాహం ప్రయత్నతః
దదామి వాంఛితం నిత్యం సర్వదా సౌఖ్యముత్తమం"

భీమునకు యుగధర్మముల తెలిపిన సందర్భములో కృతయుగమున తపోధ్యానాదుల చేతను, త్రేతాయుగమున యజ్ఞయాగాదుల చేతను, ద్వాపరమున అర్చనాదుల చేతను, కలియుగమున నామసంకీర్తం చేతను జీవులు తరింపగలరని తెలిపియున్నాడు.

సుగ్రీవునికి శ్రీరామ స్నేహప్రాప్తి కలిగించినవాడు హనుమంతుడు. శరణాగతి సందర్భమున విభీషణునికి శ్రీరాముడను కూలుడగునట్లుగా చెప్పిన వాడు హనుమంతుడే. శ్రీరామ యుద్ధ విజయవార్తను సీతకందించినవాడు హనుమంతుడే. శ్రీరామాగమనవార్త భరతునకు, గుహునకు అందించినవాడు గూడ ఇతడే. గోవర్ధనపర్వతమును వ్రజభూమిలోనిల్పి శ్రీరాముని దర్శనమునకు బదులు ద్వాపరమున శ్రీకృష్ణుని స్పర్శకు మర్గోపదేశము చేసినవాడు మారుతియే. తులసీదాసు రామాయణము వ్రాయుచో దానివలన ఒక బ్రహ్మరాక్షసునికి శాపవిముక్తి అయ్యెను. ప్రత్యుపకారము వేడుమని బ్రాహ్మణుడడుగగా తనకు రామదర్శనము కావలెనని తులసీదాసు కోరెను. అపుడతడు నీవు రామభజన చేయుచో ఒక వృద్ధబ్రహ్మచారి రూపమునవచ్చి వింటూవుండే వ్యక్తిని ఆశ్రయించినచో ఆ కోరిక నెరవేరగలదని చెప్పెను. తులసీ అట్లే చేయగా ఆ వృద్ధుడు రేపు నీకు దర్శనమిచ్చునని చెప్పెను. ఈ వృద్ధుడు హనుమయే. కాని రాముడు తన సహజరూపమునకాక పాదుషా రూపమున వచ్చెను. తులసి అతనిని గుర్తింపకపోయెను. మరునాడు వృద్ధుని (హనుమంతుని) అడుగగా 'పాదుషా రూపమున వచ్చెనే నీవు చూడ లేదా' అని పలికి తన దైవమును ప్రార్థించి తులసీదాసుకు రామదర్శనము కలిగించెను.[240]

6 హనుమంతుని పాండితీ బుద్ధివిశేషములు — వాచాదక్షతేత్యాచులు

సుగ్రీవునికి శ్రీరామునితో స్నేహము కల్గునట్లు చేయుటలో హనుమంతుని పాండితీబుద్ధి విశేషమును, వాక్యకోవిదత్వమును మహర్షి విపులంగా వర్ణించియున్నాడు. సమయజ్ఞుడై ఎప్పుడెట్లు మాట్లాడవలయునో ఇతనికి తెలియుననియే శ్రీరాముడితనినే సీతకు సందేశము నందింప పంపుచూ తన అంగుళీయకము నితనికే ఇచ్చెను. ఆమెకు ఎట్లు తమ సంగతి తెలుపవలెనో రాముడు తెలుపలేదు. వృక్షమున కూర్చొని శ్రీరామకథ గానంచేసి సీతాదేవిలో కలుగు అనుమానములను తొలగించి ఆమె నమ్మునట్లుగా భాషించినాడు. ఆ మాటలలో స్నిగ్ధత, మాధుర్యము, విశ్వసనీయత చూపగల్గెను.

అతి లక్షణ సంపన్నం
బతి మాధుర్య గుణ భూషణాంచితమును స
మ్మత మష్టాంగ యుతంబగు
మతి యొప్పగ నీవనేర్తు మాటాడంగన్.

—అని సీతయే యీతని వాచాదక్షతను మెచ్చుకొనినది. తన విజయవార్తను సీతకు తెలుపుటకును, తన ఆగమనవార్త భరతునకు తెలుపుటకు శ్రీరాముడు హనుమంతునే నియోగించెననగా అతనిపాండిత్య వాగ్విశేషమును గమనించియే యని చెప్పవచ్చును.

రావణసభలో శ్రీరాముని ఘనతను చాటుటయేకాక రావణుడు ఇంకపై క్షీణపుణ్యుడై పాపఫలమును అనుభవింపక తప్పదని హెచ్చరించుటలో అతని ధైర్యము, శత్రువులతో భాషించుటలో అనుసరింపదగిన వైఖరి తెలియు చున్నది. రామాయణమందలి 'సుందరకాండ'లో హనుమంతుని పాండితీ బుద్ధివిశేషములు, వాచాదక్షత, ఇంగితజ్ఞత, లోకజ్ఞత బ్రహ్మాండముగా పోషింప బడియున్నది. వానినిగూర్చి 'తత్త్వదీపిక' ఇత్యాది గ్రంథాలలో చూడ దగినది.[41]

సీత అగ్నిప్రవేశము చేయుటకు రాముడు కారకుడయ్యెను. ఆ సందర్భ మున హనుమంతుడు చూపిన వాచాసంయమనము గొప్పది. అగ్ని సీత నేమియు చేయదను నమ్మకము లంకాదహన వేళలో హనుమంతునికి తెలిసి వచ్చిన విషయము. శ్రీరాముడు ధర్మమే అవతారముగొనిన మూర్తి కావున (రామో విగ్రహవాన్ ధర్మః) సీతాదేవికి ఆపద రాదనియు, రాముని ధర్మ నిరతిపై అచంచల విశ్వాసముంచి మౌనముగా నుండెను. ఈ మౌన మతని వాజ్నిగ్రహమునకు సాక్ష్యము.

సాగరలంఘన వేళలో తనను పరీక్షింపవచ్చిన నాగమాతను 'తల్లీ' అని సంబోధించి, సీతను వెదకుట అను స్త్రీనిమిత్త కార్యమునకై తాను వెళ్ళుచుంటి ననియు తెలిపి ఆమె మెప్పుపొంది వెళ్ళెను. అదేమాదిరికాక ఛాయాగ్రాహిని గౌరవింపక వధించివెళ్ళెను. ఏ కార్యము నెట్లు సాధించవలెనో అట్లు సాధిం చుట సామీరి ప్రత్యేకత.

సీత హనుమంతుని పరీక్షింపగోరి శ్రీరామ లక్ష్మణుల రూపములను వర్ణింపుమని కోరినది. వారిని వర్ణించుచు హనుమంతుడు తనకుగల సాముద్రిక

శాస్త్ర పాండిత్యమును ప్రదర్శించుటేకాక భగవంతుడగు శ్రీరాముని, భాగవతుడగు లక్ష్మణుని వర్ణించి భగవద్భాగవత స్వరూపానుసంధానరూప స్తోత్రము ద్వారా పండితురాలగు సీతను నమ్మించెను. ఇది హనుమంతుని బుద్ధిబలమునకు నిదర్శనము.

7 హనుమంతుని జవసత్త్వ పరాక్రమ ధైర్యసాహస విశేషములు

ఈ అంశముగురించి రామాయణము సుందరకాండము, యుద్ధకాండము, సమీరకుమారవిజయము, పరాశరసంహితలలో ఎంతో విషయము హనుమంతుని జీవిత వృత్తాంతముననే తెలిపియున్నాను. వాయుపుత్రుడగుటవలన హనుమంతుని జవసత్త్వములు సహజసిద్ధములు. రుద్రవీర్యసముద్భవుడగుటవలన మహావీరుడయ్యెను. దేవతల వరములవలన అపజయమెరుగని విజయుడయ్యెను. బాల్యమున సూర్యబింబమును పండని పట్టుకొనబోవుట అతని జవసత్త్వములకు తొలి పరిచయమునిచ్చు సంఘటన. సాగర లంఘనము రెండవ ఘనకార్యము. ఈ సముద్రమును దాటివచ్చినవారిలో శూర్పనఖ, మారీచ సుబాహులు, రావణుడు, అకంపనుడు, శ్రీరామాదులు కలరు. రావణునకు పుష్పకవిమానము సాధనము. తక్కిన రాక్షసులకు మాయాజాలము శరణ్యము. పుష్పకవిమానమునవెళ్లు రావణునకు జటాయువెదురుకాగా తికమక పడినాడు. శ్రీరాముడు సేతువు నిర్మించెను. హనుమంతుడొక్కడే దీనిని తన భుజబలముచే తరించెను. సంజీవనీపర్వతమును తెచ్చుటలో శత యోజనములకన్న ఎక్కువదూరము వెళ్ళుటయేకాక సకాలములో కార్యసాధన చేయుట ఇతని వేగమునకు తార్కాణము. శతకంఠాదులపై దాడివెడలుచో వాలసేతువు నిర్మించి వారిని దాటించుట, శ్రీరాముని, వారి సోదరులను వీపున మోసి తెచ్చుట ఇతని బలమునకు నిదర్శనము. ఈ బృహత్తర కార్యముల నొనర్చుటకన్నా, వానిని సాధించినతర్వాత విశ్రాంతికై ఒక్క నిశ్వాసము కూడ హనుమంతుడు తీసికొనకుండుట ఇతని బలసాహసములకు ప్రబల సాక్ష్యము. పర్వత, వన, భవన, ప్రాకార, నగర, ద్వారసహితముగా లంకా పట్టణమునే తాను ఎత్తుకొని పోగలనని హనుమంతుడు సీతతో పలుకుట అతని సామర్థ్యమునకు గుర్తు. తనకు బలము వున్నను ఉత్తరకుమారునివలె గొప్పలు

చెప్పుకోకుండా, అణగి మణగి యుండుట అంజనేయుని ప్రత్యేకత. ఇతనికి దేహబలము ఎక్కువయా? బుద్ధిబలము ఎక్కువయా? అని మనలో విచికిత్స కల్గును. కిష్కింధకు, అయోధ్యకు నెయ్యాన్ని కలుపుటలో ఇతని బుద్ధిబలమే హేతువైనది. శారీరక బుద్ధిబలము ఎంతవున్నా దానికి తగిన అప్రమత్తత, చతురత, యుక్తి. ఉపాయము లీతనికధికముగానుండుట మరొక విశేషము. ఒక్క చేతి దెబ్బతో ఎనుబదివేలమంది రాక్షసుల చంపగలశక్తి ఇతనిది.

ఇంద్రజిత్తు బాణములకు మూర్ఛపోయిన సందర్భమున సైనికులను పరామర్శించును విభీషణుడు రాగా జాంబవంతుడు 'హనుమంతుడు జీవించి యున్నాడా?' అని అడిగెను. రామ సుగ్రీవాదులనడుగక హనుమంతునే అడుగుటలో ఆతని ఆంతర్యమేమిటో తెలుపమని విభీషణుడుకోరగా, 'హనుమంతుడున్నచో వానర సైన్యముతోపాటు శ్రీరామ లక్ష్మణ సుగ్రీవులందరూ ఉన్నట్లే' అని జాంబవంతుడు తెలిపెను. హనుమంతుని సామర్థ్యమునకూ, బలమునకు, కార్యదక్షతకు ఇంతకన్న వేరే నిదర్శనము చూప నక్కరలేదు. లక్ష్మణుడు మూర్ఛనొందినపుడు లంకలోని సుషేణుని తేబోయి సూక్ష్మరూపమున హనుమంతుడు వెళ్ళెను. వాడు వచ్చునో, రాడో అని అనుమానముతో వానిని ఇంటితోసహా తెచ్చెను [241] సూక్ష్మరూపముతోపాటు బృహద్రూపం ధరించుటకూడ ఇతనికి కార్యసందర్భములలో ఉపయోగపడెను. త్రివిక్రముడగు వామనునికి, శ్రీకృష్ణునికి సాధ్యమైన ఈ శక్తి రామ కార్యములలో హనుమంతు డెన్నిమారులో ప్రయోగించెను. మృగ పక్షి మానవశక్తులన్నీ హనుమంతునిలో సంగమించినవి. (He possessed supreme animal, bird and human powers).

వాలి, దశకంఠుడు సాటిలేని పరాక్రమముకలవారైనా హనుమంతునికి సరిరారని ఉత్తరరామాయణమున రామునితో అగస్త్యుడే చెప్పియున్నాడు. "హనుమంతుడు జగములముంచు సాగరుడు; భువనములకాల్చు అగ్ని; ప్రళయకాలమున రేగు యముడు. శౌర్యము, నయసాధనము, ధైర్యము, పరాక్రమము, దార్ఢ్యము, బలము, స్థైర్యము, ప్రాజ్ఞత, మహిమ హనుమంతునిలో నెలకొనియున్నవి—

"స్థైర్య ధైర్య పరాక్రమ సాహసంబుల శౌర్య గాం
భీర్య బుద్ధులఁ జాతురీనయ వీర్య యుక్తుల సూక్తి మా

ధుర్య కార్యాధురీణతా జనతుష్టి కారణ చర్యలన్
సూర్య శిష్యున కీ ప్రభంజన సూతికిన్ సములుందురే."[242]

—త్రేతాయుగమున సాక్షాత్తుగా శ్రీ హనుమంతుడు భగవంతునకు తోడై యుండగా ద్వాపరయుగమున హనుమంతుని కేతనమే అంతటి విజయమునకు కారణమగుట గమనార్హము. మరియు సాగరుడు శ్రీరాముడెంతప్రార్థించినా ప్రసన్నుడుకాక రాముని అగ్రహమునకు గురికాగా రామ కింకరుడగు హనుమంతునికి వశపడుటయేకాక తనలోని మైనాకునిపిల్చి ఆతిధ్యముకూడ ఇప్పింప ప్రయత్నించెను. Hanuman's great valour power and skill is morvellously exhibited in his facile leap cver the sea. His fearlessness of Ravana is an indirect eulogy of HANUMAN'S heroic nature and mind.[243] రాముని సైన్యములోని వీరులను రావణునికి తెలుపుచు శుకుడు 'హనుమంతుడు, హనుమంతుడు, హనుమంతుడు' అని మూడుసార్లు పలికెను. అతని ప్రముఖ పరాక్రమమున కింతకన్న నిరూపణ అక్కరలేదు

8 హనుమంతుని పోరాట విధానము

హనుమంతుడు యుద్ధముచేయుటలోనేకాక ఎగురుటలోనూ, చెట్లను పెకలించుటలోనూ, పర్వతాలను ఎత్తి విసరుటలోను ఘనుడు. యుద్ధములో ఏ అయుధమును పట్టకయే తన పిడికిలితోను, చేతి ప్రహారములతోను, వాల తాడనముతోను శత్రువుల వధించెడివాడు. ఇతనికితోక ఒక ఆయుధము. దానినాడించి, జాడించి, నేలపైకొట్టి సింహనాదము చేయగానే అ ధ్వనికి పక్షులు, మృగములు శత్రువులు మూర్ఛనొందెడివారు. శరీరాన్ని పెంచి 'శ్రీరామజయం' 'సుగ్రీవునకు విజయం' అని జయోక్తుల వల్లిస్తు రిరంసతో ప్రారేయాకృతి నొంది మూపులనుప్పొంగించును. సౌధములకున్న దూలములు, పరిఘలుగా వాడును. భవన స్తంభాలను పీకి వానిని విసరివేయును. తన ధ్వనులతో శత్రువులను నిర్వీర్యులజేయును. పోరాటమునకు తగిన అనుగుణమగు వైఖరి నీతడు ప్రదర్శించును. బాహుయుద్ధ దక్షులైన పాదచారులతో ఒక రకముగానూ, అయుధధారులతో ఇంకొక రకముగానూ పోరాడెడివాడు. రథవాహనాదులు కలిగినవారు తారసిల్లినచో ఆకాశానికి ఎగిరి ఆకాశములోనే సంచరించుతూ పోరాడెడివాడు —

కొందఱఁ గేల బాది మఱికొందఱ నేలనుమోది, గ్రుద్దుచుం
గొందఱ పిండి కొందఱను గోళ్లను జీల్చుచు, నట్టెతాకుచున్
గొందఱ గుండువోలె నొక కొందఱ దిరిగద్రిప్పి వైచుచున్
గొందలమంద గూల్చె రిపుకోటి వనాట విభుండునుగ్రుడై [244]

—చైత్య పాలకులను, జంబుమాలిని, మంత్రికుమారులను వధించిన పద్ధతిలో విరూపాక్షులను వధించలేదు. దుర్ధరుడనేవాని రథముపై కొండలాగా ఒక్కసారి దూకినంతనే వాడు మరణించెను. విరూపాక్షయూపాక్షులు పైకెగిరి వేగముగ పడుచుండగా చెట్లను వారికి ఎదురుగా విసరి వారి పతనవేగముచేతనే వారికి నాశనము కలిగించెను. కొందరిపై కొండల విసరి చంపెను. ఈ విధముగా హనుమంతుని కదనపాండితి వైవిధ్యముతో కూడినది. అక్షకుమారుని పాదాలు పట్టుకొని గిరగిర త్రిప్పిచంపగా, వానిసేనలను వాహనాలను చూపులతోనే భస్మీకృతమొనర్చెను. ఇంద్రజిత్తుతో పోరాడుచో ఆకాశానికి ఎగిరి వానిబాణములు తగులకుండా ఎగురుతూ, క్షణముకూడా ఒకచో నిలువక కదలుచూ కంటికి కన్పించుచూ అదృశ్యమగుచు పోరాడెను.

9 రాజనీతిజ్ఞత

సీతజాడ తెలియనందున అంగదాదులు స్వయంప్రభ ఉండిన గుహవద్ద ప్రాయోపవేశ మొనర్చుటయే కర్తవ్యముగా నిర్ణయించిరి. సీతవార్త లేకుండా కిష్కింధకు వెళ్ళినచో వారు సుగ్రీవుడు విధించు మరణదండనకు పాత్రులగుదురను భయముండెను. కాని తారుని ఆలోచనను, అంగదుని ఆలోచనను ఆంజనేయుడు వ్యతిరేకించి తన రాజనీతిజ్ఞతతో వారి దురాలోచనను బట్టబయలు చేసెను. అంగదుడు బలముతో నుండినచో అదిరెండవ వానరరాజ్య స్థాపనమేనని హనుమంతుడు భావించెను. ఈరెండు రాజ్యములమధ్య ఐకమత్యములేక ఉభయులు చెడిపోవుదురనియు, ప్రారంభించిన సీతాన్వేషణ కార్యము నెరవేరదనియు తలంచి అంగదునితోపాటు అతని ఆలోచనా సరళితో సాగువారిని కూడా తన మార్గమునకు త్రిప్పుటకై ప్రయత్నించి హనుమంతుడు కృతకృత్యుడయ్యెను. ఇందీతని ఆలోచనా విధానము, స్పష్టత, వానరమనస్తత్త్వ పరిశీలనము, వివాదాస్పద నిర్ణయములందలి కష్టనిష్ఠూరములు గుర్తింపగల మంత్రాంగమునకు నిదర్శనములు. అంగదునకు ఆంజనేయుని మాటలు ఇష్టము

కాకున్నను ఆంజనేయుని మార్గమును అనుసరింపక తప్పనట్లుగా తన మాటలతో సాధించుట హనుమంతునికే చెల్లినది. అంగదుని పొగడి, వాని ఉత్తమ గుణముల నుగ్గడించి, తన వచనములను వినునట్లుగా లోబరచుకొని కొత్త రాజ్యాన్ని స్థాపించువానికి చతుర్దశగుణములు, అష్టాంగములు, చతుర్విధబల ములు ఉండవలెనని హెచ్చరించెను. (కిష్కింధాకాండలో వాల్మీకి చక్కగా విశదపరచినాడు) సుగ్రీవునిమీద గల ప్రభుభక్తికి ఇది తార్కాణము. విభీష ణునకు శరణాగతినిచ్చుచో, రావణునిసభలో ప్రసంగించిన వేళలో ఇతని రాజనీతిజ్ఞత ఎంతయో ప్రదర్శితమైనది.

10 దూతగా-దౌత్యవ్యవహర్తగా హనుమంతుడు

రాజకీయ దౌత్యము నెఱపుటలోనూ, నాయికానాయకుల హృదయాంతర సందేశముల నందించుటలోను హనుమంతునివంటి దూత ఇంకొకడు కనబడడు. భారతమున సంజయుడు, శ్రీకృష్ణుడు రాజకీయ దౌత్యము నిర్వహించిరేకానీ నాయికానాయకుల అన్యోన్య సందేశములను తెలిపెడి అవకాశము వారికిలేదు. శృంగారనైషధమున హంస, ప్రభావతి ప్రద్యుమ్నమున శుచిముఖి ఇత్యాదు లున్నా వారికి రాజనీతి స్పర్శలేదు. కావున దూతగా హనుమంతుడు రెండు బాధ్యతల వహించిన విశిష్టుడు. 'మందరము' వ్యాఖ్యలో శ్రీ వాసుదాసుగారు దూత లక్షణములను ఎన్నియో తెలిపియున్నారు. (చూడుడు సుందర కాండము 40-41 సర్గలు) తన ప్రభువుకై విశ్వాసపాత్రతతో పనిచేయుచు శత్రుస్థావరమున తన 'ఆంతర్యము' తెలియకుండా తిరుగుట; తారసిల్లిన వారికి తప్పించుకొనునట్టి మాటలతో జవాబిచ్చుట; తన నడవడిక, హావభావములపై విశ్వాసము కలుగునట్లు చేసుకొనుట; తన శీలము నితరులు గమనించుచున్నను వారచక్షువులతో శత్రురహస్యముల గుర్తించుట; తన ప్రభువు గౌరవానికి, ప్రతిష్ఠకు (Image) తగినట్టి రీవితో వ్యవహరించుట; గొప్ప అభినయ సామర్థ్యం చూపుట; సమయోచితమగు కర్కశత్వము, ప్రసన్నత, నిగ్రహము దూతకు చాలా అవసరమైన గుణములు. ఇవి అన్నియు హనుమంతునిలో పుష్కలము.

సీతను వెదకునపుడు ఆయా దశలలో హనుమంతుడు పొందిన అను క్షణోచితభావాలు గమనార్హములు. సున్నితమైన విషయములు (Delicate

situation) ధైర్యసాహసములతోగాక ఓర్పుతో, దూరదృష్టితో, వివేకముతో, స్నిగ్ధతతో, ప్రసన్నతతో సాధించవలెనను సూక్తికి హనుమంతుడు చక్కని ఉదాహరణము. సీత కనరానందున చింత కలిగినపుడు, రావణుని వధింప వలెనను కోపము కలిగినపుడు, హనుమంతుడెంతో నిగ్రహము ప్రదర్శించెను. శింశుపావృక్షముపై హనుమంతుడుండగా సీత వద్దకు రావణుడేతించి ఆమెను లోబరుచుకొను మాటలనాడగా వానికి తగిన రీతిని సీత సమాధానము చెప్పుటను హనుమంతుడు వినెను. ఆమె స్వభావమతనికి తెలిసినందున రావణుడు వెళ్లిన పిమ్మట ఆమెతో ఎట్లు మాట్లాడవలెనో అతడు నిర్ణయించుకొనెను. ఈ నిర్ణయ మున అతడెంత సూక్ష్మాతి సూక్ష్మాంశములను ఆలోచించెనో లోగడ తెలిసికొని యున్నాము. తానే భాషలో మాట్లాడవలెనో! సీతకు అర్థమగు ప్రాకృతమున మాట్లాడదలచుట, చెట్టుపైనుండి రామకథను గానముచేయుట దూతగా అతడు తన బాధ్యతనెట్లు నిర్వర్తించెనో తెలియును. ఒంటరిగాఉండి ఏ కార్య మూలేక కేవలము శోకముతో రామధ్యాన తత్పరతలోనుండు సీతకు (ఇష్టమైనా కాకున్నా) హనుమంతుడాలపించు 'రామకథ'ను వినుటకొాక శ్రోతగా సంసిద్ధు రాలగునట్లు సామీరి చేసికొనెను. 'One of the greatest things in the life of Hanuman is the way in which he went through scenes of great tenderness, and came out of all of them with credit to himself.'[245] "He weighs carefully all the ways and means of how best to communicate with sita without entailing any risk of ~~ligh~~frightening her or incurring an indiscretion which would lead to a frustration of the entire task—which reveals. Par excellcnce his nature of prudent and discreet counseller."[246]

బలమున నీతి బుద్ధి మృదుభావమునన్ సరసోక్తి నెల్ల వి
ద్యల బహుకార్య నిర్వహణతాగతి సత్య వివేక కీర్తులన్
బలియుడు గాన మెప్పొసగె భర్తకు మారుతి యిట్టు లన్నిటన్
మెలకువ లేకయున్నఁ దరమే నరనాథుని కొల్వు సేయగన్.[247]

హనుమంతుని రాజనీతిజ్ఞత, దూతగా అతని సామర్థ్యములగూర్చి జీవిత చరిత్రలో వివరముగ తెలిపినందున పునరుక్తియగునని యింతట విరమించు చున్నాను.

11 ఆంజనేయుని చిరంజీవత్వము

దేవతలిచ్చిన వరము వలన అంజనేయునకు స్వేచ్ఛామరణము సిద్ధించెను. సీతారాములితనికి వరములనిచ్చినందున 'రామకథ' ఉన్నంతవరకు ఆతడు జీవించుటకు వీలు కల్పింపబడెను. సీత తనకు హనుమంతుడొనర్చిన మేలుకై —

"నేనుపకారమేమియున్ దవిలి యొనర్పలేను
వసుధాస్థలి వర్థిలు బ్రహ్మకల్పముల్"

— అని పలికినందున పరాశక్తియగు ఆమె వాక్కువలన అతడు చిరంజీవి అయ్యెను. (మొల్ల రామాయణము)

అశ్వత్థామ, బలి, వ్యాస, హనుమంత, విభీషణ, కృపాచార్య పరశు రామ, మార్కండేయులు ఎనిమిదిమంది చిరంజీవులని ప్రసిద్ధి. కాని వీరిలో చిరంజీవిగా సార్థకతను పొందినవాడు హనుమంతుడొక్కడే. హనుమంతునికి రూపము కామరూపత్వము కావున అజరామరత్వమతనికి వరమైనందున "జాయతేఽస్తివర్ధతే విపరిణతేఽపక్షయతే నశ్యతి" అను షడ్వికారములు (పుట్టుట, ఉండుట, పెరుగుట, మారుట, తరుగుట, నశించుట) సమీర నందనునికి లేవు. భాగవతము ద్వాదశస్కంధమున మార్కండేయోపాఖ్యాన మున మార్కండేయుడు శివుని 'దేవా యీ శరీరముతోడన అనేక యుగంబులు బ్రదుకునట్లు' వరము కోరగా, అతనిని శివుడు పార్వతి సమేతుడై నారాయణుని వద్దకు తీసికొనివెళ్ళి అతనికి వరమును కోరగా విష్ణువు అతనికి జరారోగ వికృతులులేని ఆయువును ప్రసాదించెనను కథ కలదు.[248] అంజనేయుడు తాను చిరంజీవిగా నుండవలెనని కోరకయే రామానుగ్రహమున రామకైంకర్యా ర్థమై దానిని పొందెను. భగవద్గీతలో —

"జన్మకర్మచమే దివ్యం ఏవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వాదేహం పునర్జన్మం నైతి మామేతిసోఽర్జున"

— అని కలదు. శ్రీ సీతారామ మాహాత్మ్యమును దివ్యమైనదిగా నెఱింగిన హనుమ దేహత్యాగము లేకుండానే వారి అనుగ్రహమున నిత్యకింకరుడై వరలెను.

భగవంతునితో నిరంతరముండుటే కాక తాను చూచునదెల్ల భగవద్విభూతి విలాసములేనని గ్రహించుట సామీప్యముక్తి. ఈరెండు ముక్తిదశల దాటిన వారు భగవత్స్వరూపమునుచేరి సామీప్యముక్తి కర్తలగుదురు. ఈ స్థితిలో భేదముకొంత ఉండనే ఉండును. భగవత్సారూప్యమున్నంతనే భగవంతునకు వలె భక్తునకు కూడ జగత్సృష్టి లయశక్తులుండునని భావింపరాదని శంకరులే తెలిపియున్నారు. భేదభావము సమూలముగా నశించి భగవంతునిలో ఐక్యమొందుటే సాయుజ్యమని అద్వైత సిద్ధాంతము. దీనిని భక్తికి ఫలముగా భగవంతుడనుగ్రహింప వలయునేకాని ప్రయత్నఫలముగా నెవరును పొందరు.

భక్తియోగమున సిద్ధుడై "సత్త్వరజస్తమో గుణహీనుండైన జనుండు మత్సమానాకారతంబొందు"నని భాగవతమునన్నను[259] భక్తుడు భగవంతుని సేవించుచు తద్రూపగుణానుభవానందము ననుభవించుటకే ఇష్టపడునుకాని అతనిలో ఐక్యమగుటకు ఇష్టపడడు. ఐక్యము నందానందానుభవములేదు. (చూడుడు భాగవతం 3 స్కంధం, 11వ స్కంధం) శ్రీరామకృష్ణ పరమ హంసగారు చెప్పినట్లుగా పంచదార మాధుర్యమునను భవించుటలో ఘనతకాని. తానే పంచదార కావాలని తలంచడం గొప్పకాదు. There is greater thrill, greater freedom, greater warmth in remaining a servant (కింకర) than in becoming the master.[258]
'నిర్హేతకుమైన భగవత్సేవ ముక్తికంటే గరిష్ఠంబ'ని భవానందవిత్తుడైన హనుమను జీవన్ముక్తిమార్గ ప్రదర్శకునిగా గుర్తింపవచ్చును.

భగవత్సాక్షాత్కారము నెట్లు సాధింపవలయునో హనుమంతుడాచరణ పూర్వకముగా సాధించి, మంధాధికారి, మధ్యమాధికారి, ఉత్తమాధికారి అవస్థలుదాటి ముముక్షువులకు తరణోపాయము సూచించుటకు మార్గదర్శకుడయ్యెను. మానవుడు మల విక్షేపావరణములను తొలగించుకొని, స్థూలసూక్ష్మ కారణశరీరముల నధిగమించి, సత్త్వరజస్తమో గుణముల నిర్మూలించినచో, ఆత్మసాక్షాత్కారము నొందును. హనుమంతుడు త్రికరణశుద్ధిగా నిష్కామముగా, శ్రీరామ ప్రీతికరముగా కర్మల నొనర్చెను. మనస్సుతో రామమంత్రము జపించెను. వాక్కులతో రామగుణ గానము చేసెను. దేహముతో రామకార్యము లాచరించెను. త్రికరణశుద్ధిగా ఇట్లు రామదాస్యము సలిపి ఇంద్రియ వృత్తులను

★

శ్రీరామపరముగా నొనర్చి బాహ్యవిషయము నుండి మరల్చెను. ఈ దాసత్వముతో జీవుడువేరు, పరమాత్మవేరు అను ద్వైతభావమున్నను మందాధికారికి అది తగినభావమేనని సీతారామాంజనేయ సంవాదమున "దేహబుద్ధ్యాఽస్మి దాసోహం" అని ప్రకటించి అంగీకరించెను.

నిజమనోరథ ఫలదాయకములగు కార్యములకై కాక రామకార్యాచరణమునకే కాలము గడిపి ఇంద్రియ నిగ్రహము వలన మధ్యమాధికారియై ప్రాణాయామ, మంత్రజప, సజ్జన సాంగత్యములను మూడు మార్గముల ద్వారా మనోలయమును సాధించెను. మానసపూజ అను నాల్గవ మార్గము ద్వారా ద్వైతభావము తొలగి ఉత్తమాధికారియై తాను పరమాత్మ అంశయే ననుభావమును గుర్తించెను. "జీవబుద్ధ్యాత్వదంశకః" సీతారాములతనికి ఆత్మసాక్షాత్కారము కల్గించు ఆత్మానాత్మవిచారము బోధించినందున సాధన చతుష్టయములను సమకూర్చుకొని, అమనస్కతను పొంది ఉత్తమాధికారియై జీవన్ముక్తుడయ్యెను.[259] 'ఆత్మబుద్ధ్యాత్వమేవాహమితిమే నిశ్చితామతిః'.

పరమ ప్రేమరూపమైన భగవద్భక్తి కలవాడు భగవదనుభవ ప్రాపకమగు కైంకర్యమునే కోరి మోక్షమునుగూడ పొందక జీవన్ముక్తులై యుందురు. 'మోక్షము మదిగోరనొల్లరు మదర్పిత సర్వకర్ములై' (భాగవతం) ఈ విధముగా త్రివిధ అధికారులకు సాధకులకు, ఆచరణ రూపమగు సాధన నీతడు జీవన్ముక్తిమార్గ ప్రదర్శకుడయ్యెను. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సంప్రదాయస్థులు, అన్ని మతములవారు, యోగులు ఇతనిని ఆదర్శసాధకునిగా గుర్తించి సేవించుచున్నారు.

విభవావతారములందుగానీ, అర్చామూర్తులందుగానీ పరిపూర్ణ భగవదనుభవము కలవారు జీవన్ముక్తులవలె నుందురు. సర్వ జగద్రక్షకుడగు శ్రీరాముని కాపాడుకొనవలెనను ప్రేమ హనుమంతునిది. ఇట్టి ప్రేమ, జ్ఞానమును కూడా మరుగుపరచును. గోపికలిట్లే శ్రీకృష్ణుని భద్రతనే సదా కోరుకొనిరి. హనుమంతుని వంటి భక్తుని సేవకు సరియైన ప్రతిఫలము భగవంతుడు కూడ ఇయ్యజాలడు. కర్మమునందుగానీ, ఫలమునందుగానీ, భక్తికి సరియైనది భక్తివినా ఇంకొకటిలేదు. తన భక్తునికి ప్రియమైన తన దివ్యమంగళరూప సంశ్లేషకు స్పర్శానందము రాముడిచ్చెను. ఇదియే వేదాంతముక్తి 'పరమ పురు

షుండు నజుండు యోగీశ్వరేశ్వరుండైన హరిని సోకిన స్థావరంబైన ముక్తంబగు[260A]

గురుభక్తిం జిత్తము మ
త్పరమై విలసిల్లు నంత పర్యంతము స
త్పురుషుల కిహలోకంబునఁ
జిరతర మోక్షోదయంబు సేకురుచుండున్.[260B]

16 హనుమంతుని కామరూపత్వము

హనుమంతుడు వరిముల్లుకంటె వన్నెగలవాడని యిదివరకే తెలిసికొని యున్నాము. "అంజనేయుడు మేరుపర్వతమువలె ఉండును. ఇతని వెంట్రుకలు బంగరు తీగలమాదిరి నేలమీద జీరాడుచుండును. అప్పుడప్పుడితడు పంచముఖుడుగాకూడా ద్యోతకమగుచుండును. ఇతడు శక్తి, పాశం, శూలం, పరుశు, హలం, చక్రం, ముసలం, గద, పట్టిసం, ముద్గరం, గాండీవం, చర్మం, ఖడ్గం, కుంభం మొదలుగా పద్దెనిమిది ఆయుధాలను ధరించుచుండును."[261]

భారత యుద్ధమునకు ముందు రాయబార సందర్భమున శ్రీకృష్ణుడు విరాడ్రూపము చూపినట్లే హనుమంతుడు తన విరాడ్రూపమును సీతకు చూపెను. నాగమాతతో కలిసి అమెను ప్రసన్నను చేసుకొను వేళలోను, శతకంఠుని చంపు వేళలోను, మరి యింకెన్నో సందర్భములలో ఇతడు తన విరాడ్రూపం చూపెను. భీమునకుకూడా ఈ రూపము దర్శనీయమొనర్చెను. ఇతడు తన రూపమును తనకు ఇష్టమైనట్లుగా చిన్నదిగాకానీ, పెద్దదిగాకానీ చేసికొనగల శక్తిమంతుడు. రాముని చూచుటకు మొదటిసారిగా వెళ్ళినపుడు భిక్షురూపము, భరతునకు సందేశము అందించువేళలో బ్రాహ్మణరూపము, భీమసేనునికి మర్కటరూపమున ప్రవర్తించెను. మహిరావణుని వధించు సదర్భములో పంచముఖ ఆంజనేయరూపమొందెను. "The Pancha Mukha HANUMAN is purely a Vaishnava conception. The image of Pancha Mukha HANUMAN shows that Hanuman possessed all the attributes and powers of VISHNU. The protection of Pancha Mukha Hanuman is very beneficial and protects the devotee against all kinds of wils and dangers and adversities "[262]

ఇతరుల ప్రేరణలేకుండా హనుమంతుడనంతరూపములతో అవతరించు చుండునని పరాశర సంహిత.

మమావతారః బహవః మద్రూపాని బహూనిచ
యథా మాం భజతే భక్తస్తథైవావిర్భవామ్యహం

17 హనుమంతుని కపిలక్షణములు (వ్యక్తిగత లోపములు)

శ్రీ కరణం అశ్వత్థరావుగారి దండక రామాయణమునకు పీఠిక వ్రాయుచు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు "వాల్మీకి హనుమంతుని ఎంత గొప్ప వ్యక్తిగా చిత్రించినను ఒక్కచో మాత్రము పచ్చి కోతిగానే చిత్రించి యున్నాడు. అతని గొప్పతనమంతయు సంపాదితమేకానీ, సహజమైనది కపిత్వమేనని వాల్మీకి సమాధానము" అని తెలిపియున్నాడు. మండోదరిని చూచి సీత అని తలంచిన సందర్భమున తన జాతిలక్షణములగు చేష్టల నతడు చేసెను. (సుందరకాండం శ్లో॥ 54, సర్గ 10 ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం) సీతను తన వీపుపై మోసుకొని పోవుదునని తెలిపినపుడు ఆమె 'నీవు నీకోతి స్వభావాన్ని చూపితివికదా! అని అనినపుడు హనుమంతుడామె తీవ్ర వాక్య సరణికి చిన్నబుచ్చుకొనినట్లుకానీ, కోపగించుకొనినట్లుగానీ మహర్షి వర్ణించకున్ననూ అతనికది ఎదురుచూడనిమాట. ఆమెస్థితిని, తన నూతన పరిచయమును గుర్తించి మిన్నకుండెను. సీతవార్త తెలిసిన పిమ్మట వానరులు దధిముఖుని అధీనములోని మధువనమునచేరి విచ్చలవిడిగా విహరించుచో వారిని వారించకపోవుట అతని సంస్కారమునకు కళంకముగా భావింపక వానరుల జిహ్వాచాపల్యమునకు విందు చేయదలంచిన ఔదార్యముగా గుర్తించ వలెను. నిద్రాహారాలుమాని అన్వేషణాసక్తులై విజయోపేతులై వచ్చినందున వారికీవిధమగు ప్రవృత్తి సహజమేకదా.

హనుమంతుడు బాల్యమున మున్యాశ్రమములో దూరి చిలిపిపనులు చేయుచుండగా వారతనికి శాపము పెట్టుటకు వీలులేని కారణమున ఇతనికి ఇతని బలము గుర్తుచేయువరకు తెలియనట్లు మరుపుతో నుండునని తలంచిరి. ఆ కారణమున అతడు సాధువై తన బలము తా నెరుగనట్లు ప్రవర్తించెను. కాని, కొన్ని సందర్భములలో తనకు తెలిసిన విషయములగూడ ఇతడు మరచిపోయినట్లు తోచును. సుగ్రీవుని వాలి తరుముచు వెన్నంటివచ్చినపుడు

12 హనుమంతుడు-రచయితగా-సకల కళావేత్తగా

హనుమంతుడు శ్రీమద్రామాయణము వ్రాసెననియు దానిని వినిన వాల్మీకి తన రచనకు ప్రచారము లభింపదనుచు దుఃఖపడుచుండగా హనుమంతుడు తన రచనను సముద్రమున పారవేసెనని ఒక కథ జనులలో ప్రసిద్ధి వహించి యున్నది. "హనుమంతుడు నవవ్యాకరణములను సూర్యునివద్ద అభ్యసించెను. భగవద్గీతకు భాష్యము వ్రాసెను. రామాయణము రచించి గానము చేసెను. మంత్రరాజ నృసింహస్తోత్రము రామపరముగా వ్రాసెను. ఇతడు నాదబ్రహ్మరూపియగు శివుని అవతారము. నాట్యకళాకోవిదుడు, నారదతుంబురులకు, రంభాదులకు గానకళాప్రావీణ్య సంబంధమగు గర్వమును తొలగించెను."[49] హనుమంతుడు నృత్యకళా విశారదుడు. శాస్త్రీయ సంగీతాచార్యులలో శివుడూ, భరతమునీ తర్వాత హనుమయే ముఖ్యుడు. "సంగీత పారిజాతము" అను గ్రంథము హనుమంతుని సంప్రదాయమునకు చెందినదే. శార్దూలుడు, కాహలుడు హనుమంతుని సంగీత సంప్రదాయ ప్రవర్తకులు[250A]. హనుమంతుడు హనుమన్నాటకం రాతిఫలకములపై వ్రాసెను. దీనినే రాజభోజుడు పొంది తన పండితుడగు దామోదర మిశ్రులచే పరిష్కరింపజేసెను.[250B]

హనుమంతుడు భగవద్గీతకు వ్యాఖ్య వ్రాసెననియు, దానికి పైశాచిక వ్యాఖ్య అని అందురనియు 'హనుమద్విలాసమ'ను గ్రంథము పేర్కొనినది. "సంగ్రామ విముఖుడైన అర్జునునికి కృష్ణుడు గీతలను బోధించెను. అవి విని తనకవి జ్ఞాపకమున నుండుటలేదని కిరీటి అనగా అతని రథకేతనముననున్న హనుమంతుడు --

"సమ్యక్ బుద్ధం మయా సర్వం ధృతంచ హృదయే తథా
కాలాంతరే ప్రవక్ష్యామి తుభ్యం సాధు మహామతే"

—అని పలికెను. అది వినిన కృష్ణుడు "గురువు చెప్పకుండా మంత్రాన్ని వినినచో పిశాచము కాగలరు. నీవు నేను అర్జునునకు తెలుపగా రహస్యముల వింటివి. కావున పిశాచము కాగలవు" అని తెలుపగా హనుమంతుడు కృష్ణునే ఆశ్రయించెను. "భారతయుద్ధ పరిసమాప్తితో నీకు పిశాచరూపం తొలగిపోతుంది. ఆ తర్వాత నీవు సేతు బంధనంలోని పైశాచిక తీర్థస్నానంచేసి

రామలింగేశుని పూజించినచో పిశాచరూపం తొలగును. నీవు గీతలకు భాష్యం వ్రాయుము" అని పలికిన కృష్ణుని మాటలను విని హనుమంతుడు సేతు బంధనమున పైశాచిక తీర్థస్నానానంతరం శివపూజచేసి భగవద్గీతలకు వీనుల విందగు వ్యాఖ్య వ్రాసెను. దీనికి పైశాచిక వ్యాఖ్య అని పేరు వచ్చినది.[251]

13 హనుమంతుడు భావిబ్రహ్మ

హనుమంతుడు కల్పాంతములందు లోకముల సృష్టించు భావిబ్రహ్మ పదవి నొందునని అగ్నిపురాణమున కలదు.[252A] పరాశరసంహిత ముప్పది ఎనిమిదవ పదిలముననూ, యేబదినాల్గవ పటలమునను హనుమంతుడు భవిష్య ద్బ్రహ్మ కాగలడను విషయమున్నది. 'శ్రీరాముడు నా కథ భూమిపై నిలుచు వరకు జీవించి ఆ తర్వాత బ్రహ్మవై లోకముల సృష్టించి, ముల్లోకవాసుల గూడి నా స్వరూపమునే పొందగలవు' అని వరమునిచ్చినందున ఇతడు భవిష్య ద్బ్రహ్మ అయ్యెను.[252B] శ్రీరాముని అంగుళీయకమును బ్రహ్మకు పంపియుండె ననియు, దానిని తెమ్మని హనుమంతుని కోరగా అతడు బ్రహ్మలోకమునకువెళ్లి వారు తనకా ముద్రికనీయనందున వారితో పోరాడెను. ఎన్నో కల్పములలో ఎందరో రాములు ఇచ్చిన ముద్రికలుగల సరస్సులో అసలగు రామముద్రికను తీసికొనలేకపోయి, ఆ ముద్రికలకు నమస్కరించి శూన్యహస్తములతో రాముని వద్దకు వచ్చెను. ఎన్నో కల్పములలో ఎందరో రాములూ ఎందరో హను మంతులు వెలసిరని హనుమకు ఈకథ తెలియపరచెను. చివరకతడు భక్తితో బ్రహ్మలోకమందలి హ్రదమందలి ఒక అంగుళీయకమును రామునకు తెచ్చి యిచ్చెను. రాముడు సంతసించి 'బ్రహ్మలోకమును చూచి నీవు ముచ్చట పడి నావు కావున నీవు బ్రహ్మలోకాధిపత్య మొందగలవని' వరమిచ్చెను. అందు వలన హనుమంతుని భవిష్యద్బ్రహ్మగా పేర్కొందురు.[252C]

14 హనుమంతుడు — ఆచార్యునిగా

ఈ అంశమును శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులగారి 'సుందర కాండము—తత్త్వదీపిక' అను గ్రంథమున విపులముగా చర్చింపబడియున్నది. శాస్త్రార్థముల నెరిగి తనకు తెలిసిన దానిని ఇతరులకుచెప్పి, చేయించుచుతాను ఆ ప్రకారము వర్తించువాడే ఆచార్యుడు. (అచినోతిహిశాస్త్రార్థానాచారే స్థాప యత్యపి, స్వయమాచారితే యస్మా దస్మాదాచార్య ఉచ్యతే)

శ్రీరాముని ప్రథమముగా దర్శించినపుడాతని మంగళగుణముల ప్రశంసించి మంగళస్వరూపమునే దర్శించి పరమాత్మయని గుర్తించినవాడు హనుమ. రాముని కేవలము దాశరథిగా కాక సర్వజగద్రక్షకునిగా గుర్తించిన ప్రథముడితడే. ఇతనిని చూచిన రాముడు ప్రహృష్టవదనుడై శ్రీమంతుడయ్యెనని మహర్షి వాక్యము (ప్రహృష్టవదన శ్రీమాన్.... 3 సర్గ శ్లో 25) జీవుల తరింపజేయు ఆచార్యుడు లభించినందుకు పరమాత్మ సంతసించెను భగవంతుని సందేశము జీవునకందించు దూతయే ఆచార్యుడు. భగవద్దూతయై, భగవద్వాహనమై, భగవత్ప్రాప్తికి విరోధులగువారికి సంహర్తయై భగవత్పరతంత్రమైయుండెడి శబ్దమే హనుమంతుడు. కావున ఇతడే మంత్రమూ ఇతడే గురువు.[253] ఇతని ద్వారానే సుగ్రీవునకు భగవత్ప్రాప్తి కలిగినది.

శ్రీ వేదాంతదేశికులవారు "దర్పోదగ్రదశేంద్రియ" అను తమ శ్లోకమున (సంకల్ప సూర్యోదయ గ్రంథమున) హనుమంతుని ఆచార్యకత్వమును గూర్చి తెలిపియున్నారు. "లంకయందు నిర్బంధింపబడిన సీత ఏవిధంగా రాక్షసాంగనలచే బాధింపబడి, తర్జనభర్జనలకు గురియై శ్రీరాముని ఉనికిని తెలియక బాధపడుచు, హనుమంతుని ద్వారా వృత్తాంతము విని శ్రీరామపదప్రాప్తి కలుగునని సంతోషముపొంది ప్రాణధారణ ఎట్లు చేసినదో అట్లే సంసార సాగరమందుండి ప్రబలమైన మనస్సుయొక్క అధికారముతో విజృంభించిన పది బాహ్యాంతరింద్రియములకులోనై హనుమత్సహాయుడైన ఆచార్యుని వలన సర్వేశ్వర విషయక జ్ఞానము పొంది ఊరటచెంది తత్ప్రాప్తికై చేతనుడు నిరీక్షించుచుండును."

సుందరకాండమున హనుమంతుడు ఆచార్యునిగా తోచినట్లే యోగసాధకుడగు శిష్యునిగాకూడ గోచరించును. యమనియమ, ఆసన, శ్వాసబంధ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులు అను ఎనిమిది అంగములు గల యోగాభ్యాసాది విధము హనుమంతుని చర్యలలో కననగును—

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాంవేత్తి తత్త్వతః"

—అని పరమాత్మ ప్రవచించినట్లుగా[254] కోట్లమంది కపులలో హనుమంతుడొక్కడే కార్యసిద్ధి నొందెను. హనుమంతుడు యోగియైనను ఇతరోపాయము

లను వదలి శ్రీరామదాసోహమ్ అను మంత్రభావనతో రామునకే ప్రపన్నుడై సాగినందున సముద్రమును దాటగలిగెను.

ఆచార్యుడగు ఆంజనేయుడు ప్రసన్నుడైన తర్వాతనే శ్రీరాముడను దైవము ప్రసన్నుడగును. ఎంబెరుమార్ల (శ్రీరామానుజులు) అనుమతిలేనిదే నంబెరుమాళ్ల అనుగ్రహం (దైవానుగ్రహం) కలుగదను వైష్ణవసంప్రదాయము వలెనే హనుమదాళ్వార్ల అనుగ్రహము ద్వారానే శ్రీరాముని అనుగ్రహము సులభసాధ్యమూ మోక్షార్థి నిరంతరం భగవంతుని కలిసి ఉండాలనీ అట్లా ఉన్నవారికి భగవంతుడు ముందుగా బుద్ధియోగాన్ని ప్రసాదించునని దానిద్వారా సాధనచేసినచో ముక్తి పొందుదురని భగవద్గీత—

"తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం
దదామి బుద్ధియోగం తం యేనమాముపయాంతితే"

—తెలిపిన ఆచార్య ఆదర్శమాంజనేయునిది.[255]

15 హనుమంతుడు—జీవన్ముక్తి మార్గ ప్రదర్శకుడు

బాంధవముననైనఁ బగనైన వగనైన
ప్రీతినైనఁ బ్రాణభీతినైన
భక్తినైన హరికిఁ బరతంత్రులైయుండ్రు
జనులు మోక్షమునకు జనుదు రధిప.[256]

—రామ పరతంత్రజీవనుడై ఆంజనేయుడు జనులకు జీవన్ముక్తిమార్గ ప్రదర్శకుడైనాడు. ముక్తి అనగా జ్ఞానము నొందుటయే. "తత్త్వజ్ఞానాన్ముక్తిః" శంకరులవారు—

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

—అని చెప్పియున్నారు. దుఃఖవిధ్వంసనమే ముక్తి. 'ముక్తిర్మోక్షో మహానన్దః' (మహానందమనుభవించుటే ముక్తి) అని యామునాచార్యుల వాక్కు. సదా భగవంతునకు కైంకర్యముచేసి అనుభవించు ఆనందమాత్మైకవేద్యమ్మని స్తోత్రరత్నమున 'కదాహమైకాన్తిక నిత్యకింకరః ప్రహర్షయిష్యామి' అని చెప్పినట్లుగా, భగవంతునితో ముఖాముఖిగాచేరి చూడగల్గుట సాలోక్యముక్తి అగును.

అకనితో తానుగూడ పారిపోయెనేకాని ఉపాయములు తెలుపడయ్యెను. వాలి ఋష్యమూకాద్రిపైకి రాజాలడను మునిశాప విషయము హనుమకు ముందే తెలిసినను అతడుసుగ్రీవునికిచెప్పకుండుటకు స్మృతిభంగముగా తలంపవచ్చును. లంకాదహన సందర్భమున సీత అశోకవనముననున్న విషయము ఇతడు మరచిపోయెను. దహనకాండ ముగియువేళలో దాని నెఱింగి తన స్మృతి విభ్రమమునకు కోపమే కారణమని గుర్తించి పశ్చాత్తప్తుడయ్యెను.

సీత అశోకవనమున నున్నట్లుగా లంకిణి హనుమంతునకు తెల్పినట్లు అధ్యాత్మరామాయమునను, విభీషణుడుకూడా హనుమంతునికి ముందే ఈ వృత్తాంతము తెలిపినట్లు ఆనందరామాయణమునను కలదు. కాని లంకా నగరాంతఃపురములలో హనుమంతుడు సంచరించుట అతనికాసంగతి గుర్తు లేదేమోనని అనిపించును. అవాల్మీకమగు ఈ కల్పనల నంగీకరింపనిచో సమస్యయేలేదు.

రామాగమనవార్త భరతునకు హనుమంతుడు తెలిపినపుడు, సీతా వహ్ని ప్రవేశవిషయమును తెలపలేదు. రాముని విజయవార్త తెలుపుటయే కాని సోదరుల కానందహేతువగు సమావేశసమయమున ఆ వృత్తాంత మసందర్భమని భావించి అతడట్లు విషయమును మరుగుపరచెనని సమర్థించుకొన దగును. ఇది సభ్యతా సంస్కారవంతులగు సామాన్యజనులకు సహజమేనని శ్రీ శ్రీనివాసశాస్త్రిగారి భావము. 'He was very tender to BHARATA, that the shocking story need not reach his ears.... We do not like to tell unpleasant things, until they become terrilly unpleasant and reveal themselves. If so' it is only just an ordinary weakness that prevents people from telling the whole of astory."[264]

18 హనుమంతుడారాధింపబడుటకు కారణము

హనుమంతుడు కోతిముఖముతో నున్నను హిందువులకు ఆరాధనా పాత్రులగు దేవుళ్ళలో నొకడైనాడు. ఇతనికున్నంత ప్రచారమూ, ఇంక చాలకొద్దిమందిని మనహాయించినచో, వేరెవ్వరికినీ లేదు. విగ్రహారాధకులగు భారతీయులకు వేదాలలో తెలుపబడిన ఎనిమిదిమంది వసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇద్దరు అశ్వనీ దేవతలు మొత్తం ముప్పది

మూడుమంది మాత్రమేకాక పితృదేవతలు, బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులతో పాటు పక్షీంద్ర, పన్నగ, గజానన, హయముఖాది దేవతలుకూడ ఆరాధనీయులే. 'His (the india's) faith in deities is so strong so deep rooted, that it is not shakan by the semi human or semi animal forms. He is well aware of the symbolism and psyehic powers assoeiated with each one of the deities". "The religious ideas of HANUMAN are conceptual and have a symbolic signficance'.[265A] మానవుని మనస్సు పసిబాలునికిగల కుతూహలముతో నుండును. ప్రాచీనకాలమునుండి నాలుగు జంతువుల ద్వారా అతనికానందము కలుగుచుండెను. ఏనుగు, డేగ, కోతి, సింహము. ప్రతి ప్రాచీన నాగరికతా చరిత్రలలో దేవతారాధన ఈ రూపాలలోనే గోచరించును. అవతారముల రూపకల్పనచేసిన పురాణములు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, హయగ్రీవ, గజానన, ఫణి, వృషభ, భైరవ రూపాదుల ఆరాధనకు దోహదమొనర్చినవి. ఇట్లే హనుమంతుని ఆరాధన కూడ జనాదరపాత్రమైనది. మర్కటరూపుడై హాస్యాస్పదమగు రూపముగలవాడని కొందరు పాశ్చాత్యులు తలంచినట్లుగాకాక హనుమంతుని భక్తి శ్రద్ధలతో భారతీయులందరు అర్చించుచుండుట జరుగుచున్నది. HANUMAN, the Simian God, is cetainly not a ludicrons figure as ~~cetain~~ some westerners mistake him to be. On the contrary, he is an eminently loved and exclusive figure among the Hindu Deities, and occupies a prominent position."[265B]

"ఋక్షులు, వానరులు ఆదిమజాతులలోనివారు. వీరు రామాయణ కాలపువారు. వీరిని కోతులని పేర్కొనుట తప్పు. వీరు విద్యావంతులై సుఖజీవనం చేసినవారు. హనుమంతుడు వేదముల నెఱింగిన పండితుడేకాక వానరజాతిలో శక్తివంతుడని" డాక్టర్ శాంతకుమార్‌వ్యాస్‌గారి అభిప్రాయము. (The Rikshas and Vanaras were two aborginal ~~tries~~ races during the RAMAYANA period. It is a mi take so call them as monkeys. They were educated and lived comfartably. HANUMAN was a learned pandit in vedas and was a powerful man of vanara race. Hanuman was from the

Varnare

caste and Jambavan from the Riksha caste. They were called after the monkeys and bears.)[266]

నేడు మనముచూచు కోతులలో ఇప్పటికి విద్యాసంస్కారాలు లేవు కావున హనుమంతుని, వాలి సుగ్రీవాదులను కోతులుగా తలంచుట నాగరికతా చరిత్రను దృష్టిలోనుంచుకొని చూచినచో (From the history of civilization and anthropology) దోషమేనని చెప్పవలసియుండును. శ్రీరా మునివంటివాడు హనుమంతుని వాక్యకోవిదత్వము ప్రశంసించెననగా నాటి వానర శబ్దమునకు 'కోతి' అని అర్థము చెప్పుకొనుట తప్పనితోచును. కవుల కల్పనలకు, హాస్యరస పోషణకొరకు, రావణునికి నందిశాపానుసారముగా నరులుగానివారిచేత పరాభవము జరుగవలెనని యుండుట వలనను, ఈ జాతి వారు కారణజన్ములుగా, ఉత్తమ సంస్కారముగలవారుగా నేటి శాఖాచరులగు కోతులకన్నా భిన్నరూపములుగా భావించక తప్పదు. అంతేకాక రామాయణ మందలి కపులందరు దేవతాంశములలో జన్మించినవారే. వాలి ఇంద్రాంశ మున, సుగ్రీవుడు సూర్యాంశమున జన్మించిరి. కాని వారికి పూజార్హతరాక హనుమంతునకే ఆ విశిష్టత కలిగెననగా హనుమంతుడు వాలి సుగ్రీవులవంటి వాడు కాదనుట స్పష్టము. భారతీయ మత సంప్రదాయము హనుమంతునికి ఆదర్శప్రాయమైన ఉదాత్తస్థానము నిచ్చినది. "HANUMAN was of a different order form Sugriva and Vali and in whom all the early religious systems have achieved a spiritual status and made lasting contribution to the idealism of man."[267]

HANUMAN'S facial expression shows that he i humbly aspiring by Virtue of his good deeds to a highe state." జనసామాన్యమందీతనికిగల ఆకర్షణకిదియే కారణము. రాముడు, కృష్ణుడు, శివుడు మొదలగు దేవతలను జ్ఞానులు, సంపన్నులు ఎక్కువగా ఉపాసించుచుందురు. వారికి శ్రీవైష్ణవ సంప్రదాయమని, శ్రీ శైవ సంప్ర దాయమని సంప్రదాయములున్నవి. కాని హనుమంతుడు అతి సాధారణ జనబాహుళ్యముచే నారాధింపబడుచున్నాడు. ఇతని ఆరాధకులకు హనుమ త్సంప్రదాయములేదు. హనుమదారాధనా విధానముపై శ్రీవైష్ణవ ప్రభావము అధికముగా కలదు. అంజనేయుని నుదుటిపై ఊర్ధ్వపుండ్రములు ఈ సంప్ర దాయ ప్రభావమే. ఇతని పంచముఖ ఆరాధనలో వానరరూపారాధన వలన

తేజోశక్తులు పొందుటకును, నరసింహరూప ఆరాధనవలన భయనివారకమగు రక్షను పొందుటకును, గరుడముఖారాధన పన్నగములుతదితర దుష్టశక్తుల నిర్మూలనకును, వరాహముఖారాధన రోగ నిర్మూలనకును, హయముఖారాధన జాడ్యనిర్మూలనకు, జ్ఞానసిద్ధికిని అని పెద్దలందురు. హనుమంతుని ముఖమున కుంకుమతో ఎఱ్ఱని పైపూత పూసియుండుట పూర్వకాలమున యుద్ధమున గాయములైనచో ఆ గాయములను మాన్పుటకు నేతితో కలిపిన కుంకుమను పూసెడివారను నమ్మకమువలన కలిగినదే. ఇట్లు ఎఱ్ఱని కుంకుమను ముఖమునకు పూయుట అతడు కర్మవీరుడని తెలుపుటకే. సీతామాత తన నుదుటి కుంకుమను (సిందూరం) అతనికిచ్చినందున అది హనుమంతునకు ప్రియమైననది. ఆ కారణముననే సిందూరముతో ఆంజనేయుని పూజించుట. (ఇతర ఏ దేవతలకును కుంకుమార్చనము లేదు). హనుమంతుని చేతిలో ఒక చేత గద, మరియొక చేతిలో పర్వతమున్నట్లు విగ్రహములు మలచబడియుండును. గద శక్తికి సాంకేతికము. పర్వతము అసాధ్యక సాధకత్వమునకు సాంకేతికము. ఇతని కేతనమందలి చేప అజరామరత్వమునకు సాంకేతికము. "The mace symbolises strength and is used to destroy evil forces and restore peace and righteousness. The mountain symbolises HANUMAN'S atrility to overcome inseperable difficulties or obstacles, i.e., to do the impossible. Such a deity alone is capable of delivering the devotees from all misfortunes and difficult situations. The fish symbol on the flag in HANUMAN'S hand is the symbol of eternity and immortality."[267B]

వాయవీయసంహిత, శివపురాణ శతరుద్రీయ సంహితలలో శ్రీరాముని ఆరాధనను ప్రవర్తింపజేసిన వానిగా హనుమంతుని పేర్కొనుట జరిగినది. శ్రీరామార్చకుడగుట వలన హనుమంతునికి కూడ ఆరాధనీయత కలిగెను. భాగవతసేవ భగవత్సేవకన్న ప్రశస్తమని శ్రీవైష్ణవ సంప్రదాయమున్నందున హనుమదారాధన శ్రీరామారాధనలో అంతర్భాగమైనది.

శ్రీమద్రామాయణమునకు నాయకుడగు శ్రీ సీతారామచంద్రు నుపాసించుట హనుమంతునికిష్టము. రామదాసుడగు హనుమంతుడు రామాయణమందలి సుందరకాండలో ప్రధానపాత్ర. ఇతని నుపాసించుటకై సుందరకాండ

పారాయణము జగత్ప్రసిద్ధి పొందెను. హనుమంతుని లంకావిజయ ఘట్టము దుష్టప్రేత పిశాచభూతగణ బాధనివృత్తికిని; పదమూడవసర్గ అను మారుతి నిర్వేదఘట్టము చిత్తభ్రమ నివారణకును; సీతా సందర్శనమను పదిహేనవసర్గ దారిద్ర్య నిర్మూలనకును; ఇరువదియేడవసర్గ అను త్రిజటాస్వప్న వృత్తాంతము దుస్స్వప్నశాంతికిని; అంగుళీ ప్రదానమను ముప్పది అరవసర్గ తప్పిపోయిన ఆత్మీయులు ఇంటికి వచ్చుటకును; కాకానుగ్రహ ఘట్టమను ముప్పదియెనిమిదవ సర్గ రామాపచార శాంతికిని; యుద్ధకాండమందలి విభీషణ సంగ్రహమను భాగము ఆపద నిర్మూలనకును; సీతాంజనేయ సంవాదమను నూటపదహారవ సర్గ సకల దుఃఖనివృత్తికినీ, ఇదే కాండలోని సీతానయన సన్నివేశమను నూటపదహేడవసర్గ కారాగృహభయనివృత్తికిని పఠించుట లోకులకు తెలిసిన విషయము - సుందరకాండ పారాయణము. ఇహలోక సుఖానుభవమునిచ్చి క్రమముగ మోక్షము నిచ్చునని ఫలశ్రుతి.

అంజనేయుని పూజించినచో సర్వదేవతలను పూజించినట్లే. కారణము: అతడు సర్వదేవతాంశ జనితుడగుటయే. ఉమా సంహితలోను, సుదర్శన సంహితలోను, పరాశర సంహితలోను అంజనేయుని స్తోత్రములు వాని మాహాత్మ్యములు తెలుపబడియున్నవి. మూఢులనూ దరిద్రులను, కాపాడు దేవతలలో హనుమంతుడే ముఖ్యుడని పరాశర సంహితలోని ధ్వజదత్త చరిత్రము తెల్పును. (9వ పటలము)

అంజనేయః పూజితశ్చేత్ పూజితా సర్వదేవతా: (7వ పటలము పరాశర సంహిత). బ్రహ్మ తన అస్త్రమునకు క్షణమాత్రకాలము కట్టుబడియుండుమని అంజనేయుని కోరెను. శ్రీరామోత్తర తాపిన్యుపషత్తులో శ్రీరాముడు కూడ హనుమన్మంత్రోపాసకుడుగా తెలుపబడినాడు. ఐహిక సుఖములు కావలసిన వారు తననూ, మోక్షము కావలసినచో తన ప్రభువగు శ్రీరాముని అర్చించవదగునని శ్రీరామ రహస్యోపనిషత్‌లో హనుమంతుడే సెలవిచ్చి యున్నాడు —

ఐహికే సమనుప్రాప్తేమాం స్మరేద్రామ సేవకం
వాంఛితార్థం ప్రదాస్యామి భక్తానాం రాఘవస్యతు
ఐహికేషుచ కార్యేషు మహాపత్సు చసర్వదా
నైవయుజ్యో రామమంత్రం కేవలం మోక్షసాధకః.

—రామభక్తులగు వారెవరెవరు ఐహిక భోగముల కోరుదురో వారికి తానవి ఇచ్చి, వారి ఆపదలను తొలగింతుననియు, మోక్షమే కావలసినచో శ్రీరామునే ఆశ్రయింపవలసినదిగా ఆంజనేయుడు పై శ్లోకమున తెలిపిన దీనిని వివరించుచు శ్రీ రామకృష్ణ పరమహంసగారొక చతురమగు కథను తెల్పియున్నారు. తన దైవమగు శ్రీరాముని చేరి ప్రతి చిన్నవిషయానికి అతనికి నివేదించి తన రామ కైంకర్యమునకు అంతరాయము కలిగించుచున్నందున హనుమంతుడు "జను లార మీకు ఆపదలు పోవాల్సినచో, ఇహలోకభోగాలు కావల్సినచో నా దగ్గ రకే రండి. నా ప్రభువును చేరి ఆయనను వేధించకండి. మీకు మోక్షమే కావలసినచో ఆయననే ఆశ్రయించండి" అని చెప్పెనట. శ్రీరామునికి కేవలము మోక్షాధికారమును మాత్రమిచ్చి, తక్కిన శక్తులు అన్నీ తనవద్దనే ఉంచుకొనిన హనుమంతుని విధానము నేటి కేంద్రము - రాష్ట్రములమధ్య అధికారముల పంపిణీవంటిదిగానే తోచును.[268]

"శ్రీ మహావిష్ణువుయొక్క నిత్యవిభూతిత్వ ఆళ్వార్లుగా గరుక్మంతునీ, (పెరియతిరువడి) లీలావిభూతిత్వ ఆళ్వార్లుగా హనుమంతునీ (శిరియతిరువడి) విష్ణువాహనములుగా శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రవర్తకులు భావించుచున్నారు. రాముని విభవావతారము కాన ఈ కాలముననున్న హనుమంతుడు గరుడుని వంటివాడని తలంపరాదు. బృహద్బ్రహ్మ సంహితలో "నిత్యభూతాత్మకమగు పరమపదమున ఏకాంతమందిరమున శ్రీరాముడను పేరుగల పరమపదవాసుని సన్నిధియందు ఎల్లప్పుడు హనుమంతుడుండునని కలదు. భృగుప్రోక్త వైఖానస సంహితలో భగవంతుడగు నారాయణునకు పదిరోజులుచేయు ఉత్సవములలో చెప్పబడిన పదివాహనములలో హనుమంతుడు మూడవ వాహనముగా చెప్ప బడి యున్నాడు. గరుక్మంతుడు ఐదవవానిగా తెలుపబడినాడు. పాంచరాత్రాగ మములలోను ఇట్లే కలదు. గరుక్మంతునివలె హనుమంతుడు కూడ భగవంతుని అర్చావతార మాహాత్మ్యము దర్శింపజేయు వాహనమై యున్నాడు. ఆదిశేష, గరుక్మంతులకు ముందరి స్థానము హనుమంతునిది. గరుక్మంతుని గర్వము పోగొట్టిన కథలున్ననూ వీరిరువురూ తుల్య ప్రభావులే"[269]

పూజనీయులగు దేవతలనుపాసించుచో ఒక్కొక్క దేవత ఒక్కొక్క విధమగు ఫలమునే ఇచ్చుచుండగా హనుమంతుడొక్కడే సర్వసిద్ధికారకుడు—

ఆరోగ్యసిద్ధి రాదిత్యాత్కార్యసిద్ధి ర్గణేశ్వరాత్
జ్ఞానసిద్ధి ర్మహాదేవాన్మోక్షసిద్ధి ర్జనార్దనాత్
హిరణ్యగర్భాదాయుశ్చ వైరాగ్యం చ ప్రజాపతే
శత్రు నాశో మహేంద్రాద్వాప్యర్థసిద్ధి ర్హుతాశనాత్
విజయశ్చండికాయాశ్చ లక్ష్మ్యా సంపద ఏవచ
విద్యాసిద్ధి స్సరస్వత్యా సర్వసిద్ధి ర్హనూమతః[270A]

— తల్లిని మించిన దైవములేదనియు హనుమంతునికి సమానమగు దేవుడు లేడనియు హనుమద్విలాసమున తెలుపబడినది.[270B]

శ్రీరామ పట్టాభిషేక సమయమున సీతాదేవి హనుమంతునకిచ్చిన ముత్యాలహారమునతడు సీతారాముల నన్వేషించు నెపమున కొరుకుచుండగా సీత అతని ఆశయము గుర్తించి తనవద్దకుపిల్చి తత్త్వోపదేశమునకు యోగ్యత కల్గించుటకై తన పాపిటలోని సిందూరము నిచ్చెను. దానిని హనుమంతుడు శిరస్సుపై ధరించి ఆమెవద్ద తత్త్వోపదేశమొంది జ్ఞానసిద్ధి పొందెను. ఈ సన్నివేశమునకు గుర్తుగా హనుమంతుడు "ఇకపై నన్నెవరు సిందూరముతో పూజింతురో వారిని నా భక్తులుగా స్వీకరించి వారిని నేను సదా కాపాడుచుండెద" నని తెలిపినట్లు స్కాందపురాణం.

రాముడు మూలకాసురుని వధించుటకై వెళ్లగా సీతాదేవి రామవియోగ తప్తయై గోమయముచే ఆంజనేయుని రూపమును గోడమీద చేయించి దానిని పూజించుచు ప్రతిదినము హనుమంతుని తోక అంగుళమాత్రము పెరుగునట్లు చేయుచుండెను. దుర్గనూ గణపతిని, శంకరుని; ఆంజనేయుని జలవర్తి మూర్తులుగా కూడా ఆమె పూజించెను. ఈ కారణము చేతనే నేటి మానవులు ఆంజనేయుని తోకకు రోజుకొక చుక్కను శ్రీ గంధముతో పెట్టి ఆరాధించుట ఏర్పడినది.[271] శనిగ్రహ దోషనివారణకు హనుమదుపాసన కర్తవ్యమని హనుమాన్ లీలాతరంగిణిలో కలదు. (పుట 191)

ఇంక మంత్రతంత్రముల ద్వారా హనుమదుపాసనచేయు పద్ధతి కలదు. దానిని గురుముఖమున అధికారమునుబట్టి చేసికొనవలయునేకాని స్వేచ్ఛగా చేయరాదు. హనుమదుపాసనా కల్పద్రుమమూ హనుమత్సాధి విధానమూ పరాశర సంహితలలో వానిని తెలిసికొనదగినంత వివరముగా కలవు. 'In Kaliyuga, the worship of HANUMAN is not only

essential, but ~~extrnely~~ extremely beneficial. He is the given of RIDDHI(Woddlygains)and SIDDHI(spiritual achievement."[272]

19 హనుమన్మహిమలు

పరాశర సంహితలో హనుమంతుని మహిమల తెలుపు కథలెన్నో కలవు. రాజ్యభ్రష్టత తొలగించి ఇహపరసౌఖ్యముల నిచ్చుటకు సోమదత్త చరిత్ర (4, 5 పటలములు) స్వర్గమందలి చింతామణ్యాదుల సాధించు నలునికథ (5వ పటలం) దారిద్ర్యమును, వ్యాధి నిర్మూలించుటకు ధ్వజదత్త చరిత్ర (8, 14 పటలములు) విజయుడనుంచి కథ విజయసిద్ధికినీ (15వ పటలము) కపిలుని కథలో భక్తుని బాధలను తొలగించుట పావని ఎంతటి భారమునైనా మోయగలడను కథ (20, 21 పటములు) కశ్యపునికథ ద్వారా చోరభయనివారణమును (22 పటలం) ఆపన్నివారకతనుతెల్పు హరిశర్మ కథ (23వ పటలమున) ఐహికాముష్మిక ప్రాప్తికి సుముఖుని కథ (34వ పటలం) వ్యాధి నిర్మూలనమునకు యువనాశ్వుని కథ (38 పటలం) మైందుని కథ (35 పటలం) తప్పిపోయినవాడిల్లు చేరునట్టి ధర్మకీర్తి కథ మొదలగు ఎన్నో కథల రూపమున హనుమన్మహిమలు తెలుపబడి యున్నవి.

హనుమంతుడే కాక హనుమంతుని రోమములకును గొప్ప ప్రభావ మున్నది. భీమునికి పురుషామృగమును రప్పించుటలో సాహాయ్యముగా హనుమంతుని రోమములే తోడ్పడిన కథ తత్సందర్భమున తెలిసికొని యున్నాము. తన రోమాన్ని అర్జున ధ్వజానికికట్టినచో విజయసిద్ధి కలుగునని తెల్పినవాడు అంజనేయుడు. ధర్మారణ్య ప్రదేశమున శ్రీరాముడు బ్రాహ్మణులకు దానధర్మములచేసి భూములను వృత్తులను ఇవ్వగా జైనమతావలంబియగు కుంభీపాలుడనువాడు హరించగా వానికి బుద్ధి వచ్చునట్లు వాని వినాశమునకు హనుమంతుని ఎడమ కక్షమూలరోమమునూ తిరిగి వానికి పశ్చాత్తాపము కలుగగా కూడికక్షములములోని రోమమును వాడినట్లు కథ కలదు.[273]

లోకములో చెడుగులు నశించుటకు హనుమదాలయము ప్రతి గ్రామమున ప్రతిష్ఠింపబడవలెనని బ్రహ్మవాక్కు (పరాశర సంహిత 6వ పటలము)

హనుమదారాధకులకనేక నియమములున్నను అజ్ఞాన జనితమగు దోషములున్నను దయాశాలియగు హనుమంతుడు వానిని సరకుసేయక అనుగ్రహించునని పరాశర సంహిత పదునెనిమిదవ పటలము తెల్పును.

బుద్ధిర్బలం యశోధైర్యం
నిర్భయత్వ మరోగతా
అజాడ్యం వాక్పటుత్వంచ
హనుమత్స్మరణాద్భవేత్.

20 సింహావలోకనము

హనుమంతుని కథను గూర్చి పాత్రచిత్రణను గూర్చి పది అధ్యాయములలో నేను తెలిపిన అంశములు దాదాపు ఎనిమిది సంవత్సరములపాటు నేను పరిశోధించి సేకరించిన అంశములే. హనుమంతుని జన్మక్రమమును (గూర్చి) మొదలుకొని ద్వాపరయుగాంతము వరకు గల చరిత్రను విపులముగా తెలియజేసి యున్నాను. ఇంతటి గొప్ప విషయమును గూర్చి నేను తెలిపిన అంశముల సమగ్రతా సమగ్రతల గురించి సమీక్షించి, ఇంకనూ పరిశోధించి తెలిసికొను అంశమును గూర్చి తెలియజేయుట భవిష్యదుపయోగకారిగా నుండును. జన్మాత్ప్రభృతి గంధమాదనమున నివసించుటకు వేరువరకు హనుమంతుని జీవితమునందలి కార్యముల కాలక్రమమును సమీరకుమార విజయముననున్న దాని ప్రకారమే నేను పాటించితిని. శ్రీరాముడు పదునొకండువేల సంవత్సరములు పాలించెనని ప్రతీతి - త్రేతాయుగపు కాలప్రమాణము నేటి యుగకాల ప్రమాణమునకు వ్యత్యాసముండును. కాని యీ యిన్నేళ్లు రాముని చరిత్ర శ్రీమద్రామాయణమున కేవలము శ్రీరాముని జన్మ మొదలుకొని పట్టాభిషేకం వరకే విపులముగా తెలుపబడియున్నది. మొత్తము మీద శ్రీరాముని బాల్యము మొదలు రాజ్యపరిపాలనాకాలము వరకే వాల్మీకి తెలిపియున్నాడు. ఉత్తరకాండమున శ్రీరాముని మహాప్రస్థానము వర్ణించినను అంతవరకు గల శ్రీరాముని జీవితము గురించి తెలిపియుండలేదు. శ్రీరామాయణమున హనుమంతుడు కిష్కింధాకాండమున మనకు తొలుతగా వాల్మీకిచే పరిచయము కావింపబడినందున హనుమంతుని జీవితమందలి ప్రధానాంశములన్నియు మనకు తెలియవచ్చుటలేదు. త్రేతాయుగమున తెలిసిన హనుమత్కథకు ఇచ్చిన ప్రాధాన్యము, ద్వాపరాదియుగమందలి కథకు కవులు ఇవ్వరైరి. శ్రీమద్రామాయణమున రామకథ ప్రధానము; హనుమత్కథ గౌణము. అందువలన ఇతని కథలోని సర్వాంశములు మనకు ఇంకనూ తెలిసికొనదగినవి ఎన్నియో యుండును.

వాల్మీకి మహర్షి శ్రీరాముని ఆదర్శ పురుషోత్తమునిగా, చిత్రించు ప్రయత్నముచేసి అతని ధర్మతత్పరతకు ప్రాధాన్యమునిచ్చి పోషించినందున శ్రీరాముని అర్థము చేసికొనుట జనులకతిసులభమైనది. ద్వాపరయుగమున అవతారమూర్తియగు శ్రీకృష్ణుని లీలలు విలాసములు చిత్రములైనవగుట వలన కృష్ణతత్త్వము సులభముగా తెలిసికొన వీలులేనిదైనది. అందువలన త్రేతా యుగపు పాత్రఅగు హనుమంతునికి యుగసాహిత్యము నందధిక ప్రాధాన్యము కలుగలేదు. ద్వాపరయుగమునాటికే (ఆ తర్వాత కలియుగమున పేర్కొన వలసిన పనిలేదు) ఆంజనేయునికి మహిమలు, దైవత్వసిద్ధి యేర్పడి యున్నందున నిత్యజీవితాంశములలో సత్యప్రకటనమునకన్న ఆరోపితాంశము లకు స్థానమధికమైనది. కృష్ణార్జునుల పాత్ర ముందీతని పాత్ర గౌణమైనది. ఇక కలియుగమున ఆంజనేయుడు కేవలము రామాయణకాలమున ప్రసిద్ధి వహించిన పాత్రగనేకాక ఆరాధ్యదైవముగా కూడ భావింపబడుచున్నందున సాహిత్యాదు లలో వాస్తవాంశములకన్న మహిమల తెలుపు అంశములే అధికముగా వ్యక్తమైనవి. వీనినన్నింటిని పరిశోధించి చతుర్యుగములలో హనుమంతుని వృత్తాంతము నింకనూ సమగ్రముగా సత్య ప్రతిబింబకముగా తెలుపగల్గుటకు వీలున్నది. (1)

త్రిమూర్త్యంశలో జన్మించిన హనుమంతుడు నరుడుగా నవతరించిన భగవంతునకు సేవచేయగా, ద్వాపరయుగమున నారాయణుడు నరునకు సారథియై, సచివుడై సేవ చేసెను. ఆ నరునను హనుమంతుడు కేతనమై (సశరీరుడుగా కాకుండా) విజయసిద్ధి కారకుడయ్యెను. వాల్మీకి నరజాతికి వానరజాతికి సామరస్యము సాధించిన యత్నమే రామాయణము.

హనుమంతుని జీవితమందలి ఎన్నో అంశములు సాహిత్యములోని ఆధారములను గైకొని ఊహించినవి కొన్నియున్నవి. వానిని గూర్చి ఇతోధిక పరిశోధనము కర్తవ్యము. ముఖ్యముగా హనుమంతునికి సువర్చలతోడి వివాహమైన అంశము; పాండిత్యము; గానకళా ప్రావీణ్యము; శాస్త్రపటిమ; రాజ నీతిజ్ఞత; దౌత్యవేత్తగా చేసినకృషి; అతని కదనశైలి; శివలింగప్రతిష్ఠ సందర్భ మున హనుమంతుని వైఖరి హనుమదుపాసనను గూర్చి పరిశోధింపదగిన అంశములు ఎన్నో ఉన్నవి. (2) తెలుగు సాహిత్యములోను, సంస్కృతము నను, నాకు లభించిన అంశములను చాలవరకు నేను సేకరించి ప్రతిపాదించి

నమూ, ఇతర భాషా సాహిత్యములద్వారా పోల్చుకొని చూచి ఇంకనూ సమగ్రమగు రూపము నీ కృషికి జతపరచుటకు వీలున్నది. రచయితగా, వ్యాకర్తగా సంగీతవేత్తగా హనుమంతుని కృషి యెట్టిదో తెలుపు ప్రయత్నము జరుగవలసి యున్నది. (3)

హనుమంతుని సాగరలంఘన సన్నివేశమున ఎన్నో వైజ్ఞానిక శాస్త్రాంశములను తెలిసికొనుటకు వీలున్నది. కొండమీాద నుండి అతడు సాగరముపైకి ఎగురుట (Take off) సాగరోపరితలముపై పోవుట ఆ పోవుచో ప్రతిబంధక నాగమాతను, మైనాకుని వదలించుకొనుట, ఛాయాగ్రాహికను (ఇది రాడార్ సంటిదేమో) ధ్వంసమొనర్చుట, దారిలో శక్తిక్షీణత (Loss of energy) కాకుండా ఆగకుండా పోవుట దిగబోవుచో కొండ నిర్ఝరములో పడుట (Landing) మొదలగునవి యీనాడు శాస్త్రజ్ఞులు ప్రయోగించు ఉపగ్రహముల విధానమునకు పోల్చదగినట్లుగా నున్నవి. గరుక్మంతునికి రెక్కలుండగా హనుమంతునకు రెక్కలులేవు. అయినను అతడు సాగరమును లంఘించుటలోని ప్లవనసూత్రములూ భూమ్యాకర్షణ శక్తికి లోనగుటలోగల కష్టము (Laws of floatation, Gravitational pull) మొదలగునవి పరిశీలించి పరిశోధింపవలసిన అంశములే (4) ఇట్లే హనుమంతుడు రెండుమార్లు సంజీవనగిరిని తెచ్చుటలో అమితవేగముతో పోవుట, అంతటి భారముతో కూడ ప్రమాదము లేకుండా వేళకు (PUNCTUAL) గమ్యము చేరుట మొదలగునవి సాహిత్యపరముగనేకాక భౌతికశాస్త్ర దృష్ట్యా, యుద్ధసైనిక సంప్రదాయముల దృష్ట్యా (Miltary Science) పరిశోధించుట కుతూహలమును తీర్చుటయేకాక జాతికి మేలునుగూడ చేయును. ఇతడు బాలుడుగా నున్నప్పుడు సూర్యమండలం గ్రహింపబోవుటగూడ శాస్త్రీయదృష్టితో చూడదగినదే. సూర్యుడు, వాయువు శక్తినిచ్చువారు. హనుమంతునికి వీరి సంబంధముగూర్చి (Hypothesis) అనుమానించి ఆరాతీయవలసిన విజ్ఞానము చాలా కలదని నా భావన. (5)

హనుమంతుని పాత్రను సమీక్షించినపుడు కవులు ఇతనిని అలౌకిక అద్భుతశక్తి సంపన్నునిగా చిత్రించినారాఅని తలంప వీలున్నది. బలముగాని, వేగముకానీ, బుద్ధికానీ, సాహసంకానీ, పరాక్రమముకానీ, భక్తికానీ, అమాయకతగానీ, ఏ గుణము తీసికొనిచూచినా హనుమంతునిలో ఆ గుణమును తీవ్రస్థాయిలో (Greater intensity) పోషించినట్లు తోస్తుంది. సాధారణముగా

లోకమందలి మానవులలో గల గుణములన్నీ ఒకే స్థాయిలో హెచ్చుతగ్గులు లేకుండా పరాకాష్ఠస్థితిలో ఉండవు. పరిమితమగు పాళ్లలో కొన్ని అధికంగా ఉంటే కొన్ని మృగ్యమై యుండును. కొన్ని స్పర్శమాత్రమైయుండ, మరి కొన్ని గుణములు తారస్థాయిలో నుండును. హనుమంతుని పాత్రలో నెలకొనిన ఏ గుణాలనైనా తీసికొని చూచినచో అవి అన్నీకూడా పరాకాష్ఠనందుకొని పరిపూర్ణముగా గోచరించును. అందువలన ఇతడు మహాబలుడు, మహావీరుడూ మహాకాయుడూ మహాదర్పుడు; మహాతేజుడు, మహావేగుడు; మహా మహా భక్తుడు, మహాత్ముడు, మహాయోగి; — ఏది తీసికొనినా దానికి మహత్త్వము (Super quality) చేరి లోకాతీతమగు వ్యక్తిగా (Super being) రూపొందింపబడినట్లు కనిపించును. ఇన్ని ఉత్తమ గుణములు ఇంత ఉదాత్తస్థాయిలో మేళవించుకొని ఉండి లోకకల్యాణార్థమై పాటుపడినట్లుగా చిత్రింపబడిన పాత్ర ప్రపంచ సాహిత్యములోనే లేదనవలసియున్నది. అంతేకాక యౌవనములో ఉన్నతస్థితిలో ఏ గుణములుండునో జీవితావసానవేళలో అదే స్థితిలో ఆ గుణములుండుట మానవులలో అసాధారణమగు అంశము. వ్యక్తి జీవితానుభవ సంస్కారాదుల వలన, కాలపరిణామము వలన గుణములు కూడ మార్పునకు గురియగుచుండును. బాల్యమునందే యే గుణములైతే హనుమంతునిలోనున్నవో, అవి యే స్థాయిలోనున్నవో అతని జీవితమంతా అదే స్థాయిలో ఆ గుణములన్నీ ఉండుట హనుమంతునిలోని విశేషము. ఇట్లు చిత్రింపబడిన పాత్ర "నభూతో నభవిష్యతి" అని తోచును.

హనుమంతునిలో, తనలోగల ఉత్తమ గుణముల గురించిన జ్ఞానము కానీ, వానికి అతడు ప్రతిస్పందించి (React) తన నడవడికను మలచుకొనుట గానీ కనబడదు. అతడెక్కడ వర్తించినా తనకు సహజమైన స్వభావానికి తగినట్లుగా ప్రవర్తించినేకానీ కృత్రిమమగు ఆకర్షణను కల్గించు పద్ధతిని పాటించడయ్యె (Image Building) "He is what he is and appears to be." లోకమునందు ప్రతి వ్యక్తిలో రెండు రకాల స్వభావాలు దర్శనీయమగును. అందొకటి ఉదాత్తమైనది, రెండవది నీచమైనది. ఈ రెండవది వ్యక్తి స్వప్రయోజనములకుపయుక్తమై స్వార్థప్రేరకమై యుండును. కాని వ్యక్తి దీనిని ఇతరులకు తెలియరాకుండా అణచివుంచి, గోప్యంగా ఉంచును. తన స్వార్థాన్ని సాధించుకొనుటకై కాపట్యం (HYPOCRISY) అనే ముసుగుతొడిగి ఉదాత్త

ప్రకృతి తనలో ఉన్నట్లు ఇతరులను కొనునట్లుగా 'నటన'తో ప్రవర్తించును. ఉదాత్తమగు ప్రకృతి నిజముగా గలవాడు ఈవిధమగు నటనను చేయజాలడు. తనలోని నీచప్రకృతిని తుడిచిపెట్టి తన గురించి ఇతరులెంతటి ఉన్నతాభిప్రాయములను పొందుచుందురో దానికి తగినట్లుగా ఉదాత్తమైన మార్గంలో, నిష్కపటముగా, నిజాయితితో నైతికౌన్నత్యముతో ప్రవర్తించుచు "లోన - బయట" ఒక్కటిగానే ఉందురు. హనుమంతుడీ రెండవకోవకు చెందిన వ్యక్తి. నిష్కాపట్యత ఇతని శీలమునకు గీటురాయి వంటిది.

దుష్టశిక్షణకై పరమాత్ముడు శ్రీరామునిగా అవతరించగా, ఆయన సేవకై, రావణవధకై మహాద్భుత గుణములతో వరసిద్ధినిపొంది అజరామరత్వముతో అజేయుడై అసాధ్యములను సాధించు మహావ్యక్తిగా మహర్షిచే రూపొందింపబడిన మారుతిపాత్ర ప్రపంచ సాహిత్యములోనే విశిష్టతనొందినది. (unique character) ఇన్ని ఉదాత్తగుణములున్న పాత్రయైకూడ శిశుసహజమగు అమాయకతతో (childlike innocence) స్వచ్ఛమైన మనోస్థితితో, నిరహంకారమైన విధేయతతో, ఋజువర్తనతో, ఉదాత్తసంస్కృతితోనున్న పాత్ర ఇంకొకటి కనరాదు. అవతారపురుషులగు శ్రీరామునిలో, శ్రీకృష్ణునిలో మనము లోపములను చూపవచ్చునేమోకానీ హనుమంతుని పాత్రలో చూపజాలము. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అనంత కల్యాణ గుణపరిపూర్ణులని తెలుపబడినారే కాని సాహిత్యములలో వారి యీ గుణములన్నింటిని స్పష్టముగా, సాకల్యముగా చిత్రించు ప్రయత్నమును ఒకే ఒక్క కావ్యములోనే ఏ సాహిత్యస్రష్ట చేసియుండలేదు. కాని ఆంజనేయుని బహుముఖమైన వ్యక్తిత్వాన్ని చాలవరకు రామాయణమందించుచున్నది. అట్లని ఈ పాత్ర రామాయణ కథ కోసము మాత్రమే కల్పింపబడినదని చెప్పజాలము. ఇది జాతీయ అవసరములకై వెలసిన పాత్ర. దౌష్ట్యం, అధర్మం, స్వార్థం, క్రౌర్యం పెరిగినపుడు వాటితో పోరాడడానికి ఉత్తమ గుణములుగల ధీరుడవసరము. అట్టివ్యక్తి మహాద్భుతమగు చిత్తశుద్ధితో, శ్రద్ధతో, దయతో, ధర్మముతో, పరోపకారశీలతతో, విధేయతతో, నిస్స్వార్థసేవతో, కార్యదీక్షతో కర్మయోగిగా ఎలా వుండాలో దానికి ప్రతిబింబముగా రూపొందిన పాత్రయే హనుమంతుని పాత్ర. శ్రీరామునివంటి మహావీరుని సరసనవుండి తన ప్రత్యేకతను, ఘనతను నిల్పుకొనగల పాత్ర పావనిపాత్ర. శ్రీరామునకు హనుమంతుడు ఒక్క రకంగానే కాక అనేకంగా అన్నీ అయినవాడని చెప్పవచ్చును. (All in one)

"హనుమంతుడు పరమమగు శక్తికి, ఉత్తమమగు ప్రభుభక్తికి ప్రతీక ఉత్సాహము, దార్ఢ్యము, విమలదృష్టి, నిర్భీకత్వము, అకలుషత్వము, మానసికధృతి, అద్భుత బలపరాక్రమములు మొదలగునవి అన్నియు కలిసి హనుమంతునిగా రూపెత్తినవి. అలౌకిక శక్తిసంపన్నునిగా, సకల విద్యా వేత్తగా, అద్భుతమైన వ్యక్తిగా, వక్తగా, నిర్భీకునిగా, నయవిశారదునిగా, అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహయుక్తునిగా, ప్రభుభక్తి పరాయణునిగా, కార్యకారణ శక్తిగల దౌత్య కర్మనిపుణుడైన రామదాసుగా, రామదూతగా వాల్మీకి ఇతనిని చిత్రించియున్నాడు."[274] "నిస్స్వార్థసేవకు, నిరాడంబరతకు, నిరహంకారతకు హనుమంతుడే ఆదర్శము. అట్టి ఆదర్శములను నేటికాల మున మరచిపోయినందున మనకు ఇతని ఆరాధన అత్యంతావశ్యకమైనది. పతనమగుచున్న మన జాతికి హనుమంతు ననుసరించుటే గతి" అని ఒకచో స్వామి వివేకానందులవారు తెలిపియున్నారు. "HANUMAN was an ideal character he had perfect control over his senses and he was a great Visionary. He was obedience itself; when RAMA told him to go in search of SITA, he did not tarry even for a second to think of his own comfort."—VIVEKA-NANDA SWAMIJI.

హనుమత్పూజ వలన నైతికబలము. దేహదార్ఢ్యము, మనోవికాసము కలిగి అవాంతరములు తొలగును. భారతీయ పునర్వికాసోద్యమములో జనుల ను త్తేజపరచి ప్రబోధించుటకు హనుమంతునాశ్రయించినట్లు చరిత్ర తెలుపును. 'జై భజరంగబలి' అను ఇతని నామమనుచ్చరించుచు భారతవీరులు (రాజ పుత్రులు. మహారాష్ట్రులు) ఇతని అనుగ్రహమును కోరెడివారు. "It is a common belief among the Hindus, that the worship of HANUMAN inspires one with moral courage, removes all obstacles and endows the worshipper with physical energy and intellectual enlightenment. During all their revivalist movements the Hindus turned only to HANUMAN for inspiration and moral support. Such a belief prompted the RAJPUT and MARATHA chiefs to invoke the divine aid of HANUMAN and SHIVA by shouting slogans such as 'భజరంగబలి'. This slogan is adopted by westerners too."[275]

"అలీగంజ్ కా హనుమాన్ మేలా" అను సూరజ్ నారాయణపండితుని వ్యాస మాధారముగా శ్రీ K C. ఆర్యన్‌గారు హనుమంతుని అయోధ్య నవాబగు మహ్మద్ అలీషా (19వ శతాబ్దం) భార్య బేగం రబ్బియా సంతానార్థమై అరాధించినట్లు తెలిపియున్నారు. ఆమె హనుమంతునికి లక్నో పట్నములో అలీగంజ్ ప్రాంతములో ఆలయమొకటి కట్టించినట్లు పేర్కొని నారు. ఈ విధముగా నేడేకాక షాజహాను చక్రవర్తికూడ తన భార్య ముంతాజ్ బేగం ఆరోగ్యసిద్ధికై హనుమత్పూజల చేయించినట్లు తెలిపియున్నారు.[276]

తెలుగు సాహిత్యములో 'సమీరకుమారవిజయము' వ్రాసిన పుష్పగిరి తిమ్మన హనుమంతుని చరిత్రను వ్రాసినవారిలో ప్రథముడని భావింపవచ్చును. వాల్మీకి తెలుపని ఎన్నో అంశములను ఇతడు బహుభాషా సాహిత్యముల పఠించి సేకరించి తన గ్రంథమున పేర్కొనియున్నాడు. ఇది తెలుగువాడొనర్చిన ప్రథమయత్నము. నాటికిది ఎంతో మెచ్చుకొనవలసిన విషయము. పుష్పగిరి తిమ్మన పదునెనిమిదవ శతాబ్దమువాడు. ఆనందరామాయణము, ఆశ్చర్యరామాయణము మొదలగువానిలో ఎన్నో అవాల్మీకములగు కల్పనలను తిమ్మన పరిహరించియున్నాడు. ఆంజనేయ చరిత్ర వ్రాయుటలో తిమ్మనచేసిన కృషిని, ముఖ్యంగా రచనా శిల్పము పరముగా, ప్రత్యేకించి పరిశోధించుట కెంతయో తగిన విషయముగా నుండును.

లోకహితంకోసం సమాజ జీవితమున ముఖ్యపాత్ర వహించినవాడు హనుమంతుడు. ప్రపంచ సాహిత్యాలందించు ఉత్తమ సంస్కృతిలో వ్యక్తమగును. ఉత్తమ ధర్మాలకు ఆదర్శముగా నిల్చునట్టి పాత్రకు హనుమంతుడే ఉదాహరణ. హిందువులు, క్రైస్తవులు, ముస్లిములు, ఆంగ్లేయులు మతభేదము లేకుండా ఈతని ఘనత నంగీకరించి గౌరవము చూపుచుండుట ఈపాత్రకు ప్రత్యేకత. తనకొఱకై ఏమీ కోరనివాడై "స్పృహ" లేని యోగిగా, నిత్యతృప్తునిగా, ఆత్మానందపరునిగా గోచరించు హనుమంతుడు వానరుడే అను అంశము ఎవరుగూడ తలంచకుండుట గొప్ప విశేషము. ఆత్మ సౌందర్యమునే ఉన్నతముగా భావించు సంస్కారముగల ఈ జాతికి, శారీరక అవయవ నిర్మాణములోని నైచ్యత వారి ఆరాధనాతత్పరతకు అంతరాయం కాజాలదని నిరూపించుటకు హనుమంతుని పాత్రయే చాలును. నాల్గు

యుగములలో వుండినా, త్రేతాయుగమున రామ కింకరుడై సీతారాములకు 'శం'కరుడై, జన వ'శం'కరుడై ప్రవర్తించిన అంజనేయుడు దైవముగా మారుటలో ఆశ్చర్యము లేదు. కోరికలను నెరవేర్చుటకు ప్రార్థింపవలసిన దైవముగాకన్న ఇతనికి అధికమగు అర్హత కలదు. నిత్యజీవితములో దైనందిన కష్టసుఖముల సన్నివేశములలో ఏ యే వేళలలో ఎట్లు ప్రవర్తింప వలెనో ఉదాత్తమగు ఉదాహరణ నందించిన అసాధారణమైన మహాత్మునిగా మరున్నందనుని మనసా స్మరించుట శ్రేయోదాయకము.

నీకె మ్రొక్కెద బ్రోవు మున్నత కృపా నిర్మాణ దీవ్యత్కటా
క్ష, కాకుత్స్థ కులాగ్రగణ్య కరుణాకల్పా యనల్ప వ్రతా
పాకారి ప్రముఖస్తుత ప్రతిభ దుర్భావాక్ష శిక్షైక ద
క్షా కోకాప్తరుచి ప్రకార గుణవిస్తారా సమీరాత్మజా.

(సమీరకుమారవిజయము లోనిదే పై పద్యము)

— —

ఉపయుక్త గ్రంథసూచి

పరిశోధనలో పరిశీలింపబడిన గ్రంథములు

(ఇచ్చిన పట్టికలో కొన్ని గ్రంథముల ప్రకటన దారుని పేరు, ప్రకటింపబడిన సంవత్సరము, ఆ యా గ్రంథముల మొదటి పుటలు శిథిలమై యుండినందున తెలుపుటకు వీలు కాలేదని మనవి.)

తెలుగు, సంస్కృతానువాద, సంస్కృతాది గ్రంథములు

1. శ్రీమద్రామాయణము (మందరమను వ్యాఖ్యతో) శ్రీ వావిలి కొలను సుబ్బారావుగారు (శ్రీ కోదండ రామసేవక ధర్మసమాజము, అంగల కుదురు) బాలకాండనుండి - ఉత్తర కాండవరకుగల సంపుటములన్నీ 1971
2. శ్రీమద్రామాయణము మూలము - తెలుగు తాత్పర్యముతో; శ్రీ చదలవాడ సుందరరామశాస్త్రులు గారు, (వావిళ్ల రామస్వామిశాస్త్రి & సన్స్, మద్రాసు.) బాల కాండనుండి యుద్ధకాండవరకు. 1954
3. ఆశ్చర్య రామాయణము (అన్ని కాండలు) శ్రీ లక్కావఝుల వేంకట కృష్ణశాస్త్రి వెంకట్రామ అండు కంపెనీ, ఏలూరు. (మూలమునకు తెలుగు వచనము) 1945
4. ఆనందరామాయణము శ్రీ సిద్ధాన్తి శంకరశాస్త్రి, మద్రాసు 1902
5. ఆనందరామాయణము శ్రీ నోరి గురులింగశాస్త్రి, మద్రాసు.... 1926
6. ఆనందరామాయణము శ్రీ బులుసు ఉదయభాస్కరం, రాజానగరం (Eg. Dt.) 1980

7.	ఆనందరామాయణము	డాక్టర్ డి. శేషగిరిరావు, కాకినాడ	1982
8.	దినచర్య	డాక్టర్ డి. శేషగిరిరావు. కాకినాడ	1982
9.	వాల్మీకి రామాయణము (అన్ని సంపుటములు తెలుగు వచనము)	శ్రీ దివాకరుని వేంకట సుబ్బరావు, 7, చక్రపాణి వీధి, మద్రాసు. 33	
10.	రంగనాథరామాయణము	గోన బుద్ధారెడ్డి (వావిళ్ల)	1966
11.	భాస్కరరామాయణము	భాస్కరాదులు (వావిళ్ల)	1923
12.	ఉత్తర రామాయణము	కంకంటి పాపరాజు (వావిళ్ల)	1966
13.	రామాయణము	మొల్లకవయిత్రి [వావిళ్ల]	1960
14.	నిర్వచనోత్తర రామాయణం	తిక్కన [వావిళ్ల]	1960
15.	రామాయణము	గోపీనాథం వేంకటకవి	
16.	మడికిసింగన వాసిష్ట రామాయణము	వేదం వెంకటరాయశాస్త్రి&సన్సు మద్రాసు.	1935
17.	అచ్చ తెనుగు రామాయణము	కూచిమంచి తిమ్మకవి	1954
18.	సమీరకుమారవిజయము	పుష్పగిరి తిమ్మన [వావిళ్ల]	1929
19.	అంతరార్థ రామాయణము	డా॥ వేదుల సూర్యనారాయణశర్మ విజయవాడ.	1981
20.	శ్రీమద్రామాయణ కల్పవృక్షము	డా॥ విశ్వనాథ సత్యనారాయణ విజయవాడ.	1969
21.	జనప్రియ రామాయణము	డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు, కడప.	1979
22.	అధ్యాత్మ రామాయణము	వెదలవాడ సుందరరామ శాస్త్రులు (వావిళ్ల, మద్రాసు)	1954
23.	రామాభ్యుదయము	అయ్యలరాజు రామభద్రుడు, (వావిళ్ల)	1917
24.	ధర్మసార రామాయణము	జనమంచి శేషాద్రిశర్మ (వావిళ్ల)	1937

25.	విచిత్రరామాయణము 1, 2 భాగాలు	నరసింహదేవర వేంకటశాస్త్రి,	....	1888
26.	శ్రీమదుత్తర రామాయణము	పెన్మెత్స సూర్యనారాయణరాజు, మద్రాసు.	....	1949
27.	శ్రీరామాయణ సారోద్ధారం	శ్రీ ములుకుట్ల నరసింహావధానులు విజయవాడ.	....	1938
28.	సంపూర్ణరామాయణము	కలవటాల జయరామరావు,		
29.	దండకరామాయణము	కరణం అశ్వత్థరావు,	....	1947
30.	శతకంఠరామాయణము	మర్దనకవి [వావిళ్ల]	....	1954
31.	ఆనందరామాయణము	సి. రామశాస్త్రి, జి. లక్ష్మణశాస్త్రి,		
32.	మైరావణ చరిత్ర	మాడయకవి		
33.	మైరావణ చరిత్ర	పురాణం పిచ్చయ్య, మద్రాసు,	....	1982
34.	నిర్వచన కందరామాయణము	అనపల్లి సుబ్బరామిరెడ్డి,	....	1981
35.	శ్రీవిద్యారామాయణము	ఆచార్య దివాకర్ల వేంకటావధాని	....	1976
36.	చంపూరామాయణము	శ్రీ తట్టా నరసింహాచార్యులు చిట్టిగూడూరు		
37.	అద్భుతోత్తర రామాయణము	నాదెళ్ల పురుషోత్తమకవి	....	1907
38.	హనుమద్రామాయణం	నాదెళ్ల మేధా దక్షిణామూర్తి	....	1970
39.	చతుర్ముఖ రామాయణము	గాదె పాపరాజుకవి	....	1977
40.	ద్విపదరామాయణము	కట్టా వరదరాజకవి Govt. Oriental Serier, Madrass	....	1952
41.	శ్రీమద్వాల్మీకి రామాయణము	ఎం. వి. ఆర్. కృష్ణశర్మ	....	1982
42.	సహస్రకంఠ రామాయణము	రామావఝుల కొండయశర్మ [వావిళ్ల]	....	1954

43.	గణపతి రామాయణసుధ	చర్ల గణపతిశాస్త్రి, వాల్తేరు.	 1982
44.	కంబరామాయణము	శ్రీ పూతలపట్టు శ్రీరాములరెడ్డి	 1969
45.	మూలరామాయణము	ముద్దుల లక్ష్మీనారాయణకవి	
46.	శ్రీవాల్మీకి రామాయణము	బులుసు వేంకటేశ్వర్లు, కాకినాడ	... 1981
47.	శ్రీమద్రామాయణసుధ	దంగేటి అప్పారావు గుప్త, మాడుగుల.	 1971
48.	తత్త్వసంగ్రహ రామాయణము	బ్రహ్మానంద భారతి రచనకు అకొండి వేంకటకవి అనువాదము	
49.	ఉత్తరరామాయణ ద్విపద	ముడుంబై వేంకటకృష్ణమాచార్య	
50.	శ్రీకృష్ణరామాయణము	శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి వేంకట్రామ & కంపెని, ఏలూరు	 1948
51.	దొడ్డ రామాయణము	డి. వెంకటరామిరెడ్డి	 1950
52.	అద్భుతోత్తర రామాయణము	జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ కడప	 1969
53.	గోవిందరామాయణము	ఆత్మకూరి గోవిందాచార్యులు	 1960
54.	శ్రీమద్రామాయణ వచనం	దేవరాజసుధీ ఆనందాప్రెస్, మద్రాసు.	 1944
55.	శ్రీమద్రామాయణ వచనం	శ్రీనివాస శిరోమణి (వావిళ్ల)	 1960
56.	వచనరామాయణము	సరస్వతుల సుబ్బరామశర్మ, [వావిళ్ల]	 1951
57.	వచనరామాయణము	మోడేకుర్తి గున్నయ్య, రాజమండ్రి.	 1967
58.	సంగ్రహరామాయణం	జనమంచి శేషాద్రిశర్మ, కడప.	 1914
59.	రామాయణము	కాళూరి వ్యాసమూర్తి	 1954
60.	రామరాజ్యము - కుశలవులు	కాళూరి వ్యాసమూర్తి	 1962

61. నవ్వులరామాయణము	వేలూరు గంటాల రామకృష్ణ నాయనింగారు		
62. అష్టాదశపురాణ సంగ్రహం	వాడ్రేవు శేషగిరిరావు రాజమండ్రి.	....	1963
63. శివకవచము	వీ॥ రా॥ ఆచార్య, శ్రీకాళహస్తి.	....	1982
64. హనుమత్కల్యాణ్యం	చల్లా పిచ్చయ్యశాస్త్రి తెనాలి (కల్యాణి ప్రెస్)	....	1956
65. సుందరకాండము-తత్త్వదీపిక	శ్రీ భాష్యం అప్పలాచార్యులు కాకినానాడ.	....	1980
66. తిరుప్పావై	శ్రీ భాష్యం అప్పలాచార్యులు కాకినాడ.	....	1975
67. శ్రీతత్త్వం-భగవతత్త్వం	శ్రీ భాష్యం అప్పలాచార్యులు కాకినాడ.	....	1974
78. సుందరకాండము	మైలవరం సుబ్రహ్మణ్యశర్మ రాజమండ్రి	....	1982
79. సుందరకాండమెందుకు	అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి విజయవాడ	....	1982
70. సుందరమందారము	జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి గుంటూరు	....	1982
71. సుందరకాండము	తెన్మఠం రంగాచార్యులు మద్రాసు	....	197[illegible]
72. శ్రీమద్రామాయణ పారిజాతము	పంతుల వినజోగారారు విశాఖపట్నం	....	1983
73. శ్రీమద్రామాయణ రత్నాకరం	శ్రీ విద్యా ప్రకాశానందస్వామి శ్రీకాళహస్తి	....	1982
74. శ్రీరామపట్టాభిషేకం	బి. రామనారాయణశరణ్ గుంటూరు	....	1983
75. ఆంజనేయచరిత్ర అనుపేరిట పరాశరసంహిత	శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి ఒంగోలు (13 సంపుటాలు)	....	1980

76.	హనుమద్విలాసము	శ్రీ శిష్ట్లా చంద్రమౌళిశాస్త్రి పెద్దాపురం	1981
77.	శ్రీహనుమద్వ్రత నిష్ఠాకల్పము	శ్రీ శిష్ట్లా చంద్రమౌళిశాస్త్రి పెద్దాపురం	1981
78.	శ్రీహనుమద్వైభవము	శ్రీ శిష్ట్లా చంద్రమౌళిశాస్త్రి పెద్దాపురం	1981
79.	శ్రీహనుమదుపాసనా కల్పద్రుమము	శ్రీ శిష్ట్లా చంద్రమౌళిశాస్త్రి పెద్దాపురం	1981
80.	హనుమద్విజయము	జనమంచి శేషాద్రిశర్మ, కడప.	1981
81.	ఆంజనేయ చరిత్ర	శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి	
82.	హనుమోదాహరణము	చిత్రకవి పెద్దన	
83.	ఆంజనేయ దండకము	వాసుదేవకవి (వావిళ్ల) ముడుంబై వేంకటేశకవి	
84.	హనుమచ్చరిత్ర	పురాణపండ రాధాకృష్ణమూర్తి రాజమండ్రి	1977
85.	తుల దాసకృత రామచరిత మానస్‌అనురామాయణము	శ్రీ శ్రీనివాసశర్మ (వావిళ్ల)	1960
86.	తెలుగులో రామాయణాలు	శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, రాజమండ్రి	1975
87.	తెలుగుసాహిత్యములో రామకథ	శ్రీ రావూరి దొరస్వామిశర్మ (త్రివేణి పబ్లిషర్సు బందరు)	2972
88.	తెలుగుసాహిత్యములో రామకథ	కుమారి పండాశ్యమంతకమణి ఆ. ప్ర. సారస్వత పరిషత్ హైద్రాబాదు	192
89.	ద్వాదశోపనిషత్తులు	వావిళ్ల రామస్వామి, మద్రాసు.	1950
90.	శ్రీరామావతారతత్త్వము	జనమంచి శేషాద్రిశర్మ, కడప.	1935
91.	శ్రీమద్రామాయణ వైభవము	డా॥ మల్లాది గోపాలకృష్ణశర్మ అమలాపురం	1971

92. గణపతి	శ్రీ M. శ్రీధరమూర్తి కన్నడరచనకు శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అనువాదము, కడప.	....	1971
93. హనుమాన్ చరిత్ర	స్వామికృష్ణదాసజీ, హైద్రాబాదు.	....	1984
94. శ్రీరామాయణ సర్వస్వము	నడాదూర్ శఠగోపాచార్య చిత్తూరు	....	1982
95. రామకథ	నారు నాగనార్య	....	1972
96. రామాయణ సుధాలహరి	జాగర్లమూడి చంద్రమౌళి		
97. శ్రీరఘురామ కథామృతం	శ్రీ పల్లెపూర్ణ ప్రజ్ఞాచార్యులు గుంటూరు	....	1969
98. శ్రీసీతారామాంజనేయ సంవాదము	పరశురామపంతుల లింగమూర్తి గురుమూర్తి (వావిళ్ల)	....	1962
99. హనుమాన్ లీలా తరంగిణి	కుంటముక్కల రామరావు కొవ్వూరు	....	1977
100. సుగ్రీవవిజయము	కందుకూరి రుద్రకవి		
101. షోడశి రామాయణ రహస్యము	గుంటూరు శేషేంద్రశర్మ (T T D ప్రచురణ)	....	1980
102. శ్రీమద్రామాయ ణాంతరార్థం	పాతకోట రంగనాయకులు మాచర్ల	...	1973
103. శ్రీమద్భాగవతము	పోతన (ఆం. ప్ర. సాహిత్య అకాడమీ ప్రచురణ)		
104. కవితానంద రామాయణము	సంపత్ కృష్ణమూర్తి, తిరుపతి.	...	1966
105. మహాభారతము	కవిత్రయము (వావిళ్ల)		
106. శ్రీమహాభాగవత హృదయము	మామిళ్లపల్లి నరసింహం ప్రొద్దుటూరు	....	1981
107. జీవన్ముక్తి మార్గము	మామిళ్లపల్లి నరసింహం ప్రొద్దుటూరు	....	1982

108.	జీవనచిత్రాలు	డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య కర్నూలు	1985
109.	శ్రీమద్రామాయణ కథామృతము	మోచర్ల రామకృష్ణయ్య నెల్లూరు	1961
110.	వివేకచూడామణి	శంకరాచార్యులవారి రచనకు పేరి సుబ్రమణ్యశాస్త్రి తాత్పర్యం	వావిళ్ల 1964
111.	కృష్ణాంజనేయయుద్ధం	తాండ్ర సుబ్రమణ్యం, రాజమండ్రి	1984
112.	హనుమద్రామ సంగ్రామం	బద్దె కొటేశ్వరరావు	1980
113.	యమాంజనేయ యుద్ధము	పి. రాఘవరాజు అనువాదం [హిందీకి] విజయవాడ	1971
114.	నారదభక్తిసూత్రాలు	దొడ్ల వెంకటరామిరెడ్డి తాత్పర్యం రామకృష్ణమఠం మద్రాసు	1979
115.	భగవద్గీత	జంధ్యాల సుబ్రమణ్యశాస్త్రి సికింద్రాబాదు	1950
116.	శ్రీవచనభూషణము	పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకటలక్ష్మీనృసింహాచార్యులు మచిలీపట్నం	1985
117.	అర్థపంచకము	శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజజీయర్‌స్వామివారు శ్రీవిశిష్టాద్వైత ప్రచారక సంఘం విజయవాడ	1954
118.	శ్రీహనుమద్వ్రత విధానం	అన్నదానం చిదంబరశాస్త్రి	1982
119.	గాయత్రీ రామాయణము	అన్నదానం చిదంబరశాస్త్రి	1983
120.	పూర్వగాథాలహరి	వేమూరి శ్రీనివాసరావు	
121.	ప్రసన్నామృతము	టి. వి. చూడామణి, నడిగడ్డపాలెం	1938

17. Lectures on Ramayan,
RL. Hon. V, S. Srinivasa Sastri,
(S. Viswanathan) ... 1986

18. Indian Myths and Legend,
Donald A. Maekenjie

19. Valmiki Ramayana an appriciation,
Prof. S. Nagaiah, Tirupati. ... 1981

20. A Socio Political Story of Valmiki Ramayana,
Rama Shraya Sarma, (Motilal Banarani Das Put) 1971

21. Ramayana - Myth or Reality,
H. D. Sankaly, New Delhi. ... 1977

22. Character Portryals in Valmiki Ramayana,
Alios Wurm, Delhi ... 1976

23. The Concept of Avataras,
R. K. Pandey, Delhi. ... 1978

24. Religion and Philosaphy of Naalaayiram,
Prof. N. Subba Reddy, Tirupati, (SVU. Pub.) ... 1977

25. Gospel of Sri Rama Krishna,
Inarlated by Sri Nikhilananda Rama Krishna
Mutt, Madras ... 1974

26. Aspect of the Novel,
E. M. Forster, (E. Arnold Hill Pub. Londan) ... 1960

27. An introduction to the Story of Literature,
W. H. Hudson, (Gig Hernap & Co, Londan) ... 1944

28. The Making of Literature,
R. A. Scott James, Seeker Warbing, Londan ... 1962

29. The Ramayana of Kamaban,
R. K. Narayan, Indian Thought Pubs. Mysore ... 1973

30. A History of English Literaturr,
A Compton Rickett, Londan. ... 1958

31. Poetics and Rhetoric,
Aristotcl, (SLBS) Loudan. ... 1953

సందర్భోచిత సూచనల పట్టిక

1. శ్రీమద్భగవద్గీత – అధ్యా 4 – శ్లో॥
2. శ్రీమద్రామాయణము (మందరము) వావిలికొలను సుబ్బరావు (ఇకపై శ్రీ. రా. మా అని సంపుటీకరించి చూపియున్నాను) యుద్ధ సర్గ 120 శ్లో॥ పద్యం 2705 పుట 320.
3. ధర్మసార రామాయణ పీఠిక – జనమంచి శేషాద్రిశర్మ
4. శ్రీ. రా. మా. పద్యం 853 (సుందర)
5. శ్రీ, రా. మా. పద్యం 1406 – 1418 వరకు (కిష్కింధ)
6. శ్రీ. రా. మా. పద్యం 793 (ఉత్తర)
7. పరాశర సంహిత – 6వ పటలం (అన్నదానం చిదంబరశాస్త్రి)
8. అష్టాదశపురాణ సంగ్రహము – శివపురాణము పు 47-53
9. అష్టాదశపురాణ సంగ్రహము – శివపురాణము పు 26-27
10. రామాయణము – (సుందర) దివాకరుని వేంకటసుబ్బరావు పు 41
11. ఆనందరామాయణము – సిద్ధాంతి శంకరశాస్త్రి పుట 143-147
12. ఆనందరామాయణము – గురులింగశాస్త్రి పు 192

    వాయుదేవుడు అధిక కామము కలవాడనియు ఇతనికి విశ్వకర్మని పుత్రిక భార్యగానున్ననూ కుశనాభుని నూర్గురు కుమార్తెలనితడు కామించి వారిని కోరగా వారు నిరాకరించినందున వారిని గూని వారిని చేసెను. పాండు రాజపత్నియగు కుంతియందు భీముని ఇతడు పొందెను. Vayu is a destructive God of intemparate character and voilent desires. His lusts seen to have been equally indiscriminate. Page 80, Indian mythology by Veromica lons.

13. సమీరకుమారవిజయము (ఇకపై స॥ కు॥ వి॥ అని సూచింపబడును.) ఆ 1 పద్యం 4–142 వరకు
14. ఆ 1 పద్యం ఆ 2 ప 25-115 వరకు
15. ధర్మసార రామాయణము – పుట 285
16. శ్రీమదాంధ్ర వచనరామాయణము – మోడేకుర్తి గున్నయ్య పు 60 మరియు సరస్వతుల సుబ్బరామశాస్త్రి గ్రంథమున పుట 194

17. సంపూర్ణరామాయణము – కలవటాల జయరామరావు పుట 196
18. గణపతి రామాయణసుధ – చర్ల గణపతిశాస్త్రి పు 196-229
19. ఆశ్చర్య రామాయణము – L. V. కృష్ణశర్మ పు 169-71
మరియు శ్రీకృష్ణ రామాయణము – శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి పు 8-12
20. హనుమాన్ లీలా తరంగిణి – పుట 3 [కుంటముక్కల రామరావు]
21. హనుమాన్ లీలా తరంగిణి – పుట 5 [కుంటముక్కల రామరావు]
హనుమద్విలాసము శిష్ట్లా చంద్రమౌళిశాస్త్రి పు 8-19 మరియు
శ్రీమద్రామాయణాంతరార్థం పి. రంగనాయకులు పు 46, 47
22. శ్రీ R. లక్ష్మణమూర్తిగారి వ్యాసం 'సప్తగిరి' టి. టి. డి. [ప్రచురణ]
జూన్ 86 జూలై 86 సంచికలు.
23. శ్రీమద్రామాయణ వైభవము డా॥ మల్లాది గోపాలకృష్ణశర్మ పు 330
24. విష్ణుపురాణము [1-15-79]
25. Quoted in page 472 Prf. S. Nagaion in his 'Valmiki Ramayana'.
26. Hanuman in Art and Mythology P. 73
27. Transformation of Nature in Art.
Ananda Comara Swamy P.
28. Hanuman in Art and Mythology, K. C. Aryan P. 72
29. పరాశర సంహిత 6వ పటలము మరియు
ఆశ్చర్య రామాయణము పు 171 మరియు
కిష్కింధకాండ – దివాకరుని వేంకటసుబ్బరావు పు 168 – వైధృతీ
యోగమనగా అయిదు గ్రహములొకేయింట నుండుట.
30. ఆనందరామాయణము [గురులింగశాస్త్రి] 192
రామకథ [పండా శమంతకమణి] పు 34
శ్రీరామాయణ సారోద్ధారము [సుందర]
31. కిష్కింధాకాండ [ది॥ వీ॥ సుబ్బారావు] పు 168
32. పరాశర సంహిత 6వ పటలము పు 92, 93
33. స॥ కు॥ వి॥ ఆ 2. ప 120
34. అష్టాదశపురాణ సంగ్రహము [అగ్నిపురాణము] పు 1008
35. హనుమాన్ లీలా తరంగిణి పు 12, 13

36. శ్రీమద్రామాయణాంతరార్థం పు 69-110
37. శ్రీ. రా. మ. ఉత్తర ప 793
ఉత్తరరామాయణం [కంకంటి పాపరాజు] ఆ 5. ప 85
శ్రీమదుత్తర రామాయణము పెన్మెత్స సత్యనారాయణరాజు పు 97
38. పరాశర సంహిత 6వ పటలము
39. స॥ కు॥ వి॥ ఆ 2. ప 118-121
40. రామరాజ్యము – కుశలవులు కాశూరి వ్యాసమూర్తి పు 46-47
41. శ్రీ. రా. మ. ఉత్తర ప 819-25 మరియు
ఉత్తర రామాయణము కంకంటి పాపరాజు ఆ 5. ప 97-129
42. పరాశర సంహిత పు 93-98 (6వ పటలము)
43. స॥ కు॥ వి॥ ఆ 2. ప 122-184 వరకు
44. గణపతి రామాయణసుధ పు 230 మరియు
ఉత్తర రామాయణము పెన్మెత్స సత్యనారాయణరాజు పు 97
సుందరకాండ ది॥ వే॥ సుబ్బరావు పు 44
45. షోడశిరామాయణ రహస్యము పు 44 మరియు
సుందరకాండ – ది॥ వే॥ సుబ్బరావు పు 183
46. కె. కోదండరామాచార్యుల వ్యాసము 'సప్తగిరి' జూలై 86
(తిరుపతి దేవస్థానం)
47. సుందరకాండ తత్త్వదీపిక శ్రీ భాష్యం అప్పలాచార్యులు
48. అంతరార్థ రామాయణము పు 93
49. శ్రీ. రా. మ. ఉత్తర పద్యం 823-30 మరియు
ఉత్తర రామాయణము కంకంటి పాపరాజు ఆ 5. ప 131
50. రామచరితమానస్ తులసీదాస్ 4వ విశ్రా.చే 219-20
బాలకాండ 5వ విశ్రా.చే 227
బాలకాండ ది॥ వే॥ సుబ్బరావు పు 60
హనుమాన్ లీలా తరంగిణి పు 18
హనుమచ్చరిత్ర పురాణపండ రాధాకృష్ణమూర్తి పు 19-21
51. శ్రీమద్రామాయణాంతరార్థము పు 166-68

52. శ్రీ. రా. మ. కిష్కింధ సర్గ 3 ప 28-36
శ్రీ. రా. మ. ఉత్తర సర్గ 34 ప 834-37
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజు ఆ 5. ప 135-39
53. రంగనాథ రామాయణము కిష్కింధ పు 170
54. పరాశర సంహిత పు 98-99 ఆరవ పటలము
55. స॥ కు॥ వి॥ ఆ 2 ప 215-29
స॥ కు॥ వి॥ ఆ 3 ప 9-10
56. శ్రీ. రా. మ. యుద్ధ. ప 2801
57. పరాశర సంహిత పు 84-100 ఆరవ పటలము
58. శ్రీ. రా. మ. సుందర పద్యం 611 పుట 287
59. భాస్కర రామాయణము సుందర పు 223
60. అష్టాదశపురాణ సంగ్రహము (స్కాంధపురాణం) పు 70
61. ఆనందరామాయణము శివశంకరశాస్త్రి సారకాండము పు 10
62. పూర్వగాథాలహరి వేమూరి శ్రీనివాసరావు పు 510
63. హనుమచ్చరిత్ర అభినవ జయదేవ చల్లా పిచ్చయ్యశాస్త్రి
64. శ్రీమద్రామాయణాంతరార్థము పు 245-275
65. హనుమాన్ లీలా తరంగిణి పు 19-21
66. "భక్తినివేదన" వేదాంత మాసపత్రిక నడిగడ్డపాలెం ఫిబ్రవరి 82,
ఫిబ్రవరి 83.
67. షోడశి రామాయణ రహస్యములు జి. శేషేంద్రశర్మ పు 79
68. అన్నదానం చిదంబరశాస్త్రిగారి లేఖ తే. 31-7-81
69. రామరాజ్యం - కుశలవులు కాశూరి వ్యాసమూర్తి పు 47
70. కె. కోదండరామాచార్యులు "సప్తగిరి" (తిరుపతి దేవస్థానం) జూలై 86
71. ఆశ్చర్య రామాయణము పు 363
72. శ్రీరామాయణ సారోద్ధారము పు 21-85
73. నారదభక్తి సూత్రాలు పు 95
74. సీతారామాంజనేయ సంవాదము
75. శ్రీ. రా. మ. కిష్కింధ పుట 451
76. నిర్వచనోత్తర రామాయణము ఆ 7. ప 98-131

77. స॥ కు॥ వి॥ ఆ 2. ప 201 మరియు
ఆ 3 - ప 3 నుండి 6 వరకు
78. శ్రీకృష్ణ రామాయణము కిష్కింధ పుట 111
79. అంతరార్థ రామాయణము పు 84–98
80 కిష్కింధాకాండ దిॱ వేॱ సుబ్బరావు పు 171
81. శ్రీ. రా. మ. కిష్కింధ సర్గ 2 నుండి 11 సర్గ వరకు
82. రామకథ పండా శమంతకమణి పు 33
83. రంగనాథ రామాయణము కిష్కింధ
ఆనందరామాయణము సారకాండ 8వ సర్గ (గురులింగశాస్త్రి)
ఆశ్చర్య రామాయణము కిష్కింధ పు 47
84. అద్భుతోత్తర రామాయణము పు 104 పద్య 162-68
85. ఆశ్చర్య రామాయణము కిష్కింధ పుట 47, 48 మరియు
విచిత్ర రామాయణము.
86. స॥ కు॥ వి॥ ఆ 3 ప 22-39 వరకు
87. ధర్మసార రామాయణము పు 254
88. ఆశ్చర్య రామాయణము కిష్కింధ పు 51
89. దండకరామాయణము పు 99-100
90. శ్రీమద్రామాయణ కల్పవృక్షము కిష్కింధనూపుర శీర్షిక పు 77-87
91. అద్భుతోత్తర రామాయణము పు 53-72
కిష్కింధాకాండ ది॥ వేం॥ సుబ్బరావు 174-79
92. కంబ రామాయణము పు 392-413
93. రామచరితమానస్ కిష్కింధ విశ్రా 1 చౌ 1-4 దోహ 1–4
94. రామాయణ సర్వస్వము శఠగోపాచార్య
95. కిష్కింధకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 179
96. శ్రీ॥ రా॥ మ॥ కిష్కింధ సర్గ 21 నుండి 44 వరకు
97. భాస్కర రామాయణము సుందర పు 297
ఆనంద రామాయణము శివశంకరశాస్త్రి పు 127
ఆనంద రామాయణము బి. ఉదయభాస్కరం పు 162-67
98. స॥ కు॥ వి॥ ఆ 3 ప 38-42
99. కిష్కింధకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 254-55

100. రామచరితమానస్ కిష్కింధ విశ్రా 3 చే 33 విశ్రా 4 చే 4
101. శ్రీ॥ రా॥ మ॥ కిష్కింధ సర్గ 54-67
102. భాస్కర రామాయణం కిష్కింధ పద్యం 828
103. శ్రీమద్రామాయణకల్పవృక్షము కిష్కింధ అన్వేషణశీర్షిక 409-425
104. స॥ కు॥ వి॥ అ 3 ప 43-54 వరకు
105. శ్రీ॥ రా॥ మ॥ సుందర 1, 2 సర్గలు 1-32, 2-135
106. ఆనంద రామాయణము గురులింగశాస్త్రి పు 105
107. షోడశి రామాయణ రహస్యము పు 43, 58
108. శ్రీ॥ రా॥ మ॥ సుందర సర్గ పుట 62
109. శ్రీ॥ రా॥ మ॥ సుందర సర్గ 3 79–84
110. పరాశర సంహిత 38వ పటలము
సుందరకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 42
111. స॥ కు॥ వి॥ అ 3 ప 74–76
112. రామచరితమానస్
113. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 743 పుట 356
114. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 762 పుట 363
115. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 805 పు 383
116. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 860 పు 416
117. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 891 పు 431
118ఎ. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 993 పు 476
118బి. శ్రీ॥ రా॥ మ॥ సుందర పద్యం 1 నుండి 42 సర్గల వరకు
119. ఆనందరామాయణము సారకాండ 104–115 శివశంకరశాస్త్రి
120. శ్రీకృష్ణరామాయణము పు 73
121. శ్రీకృష్ణరామాయణము పు 74
122. శ్రీమద్రామాయణ కల్పవృక్షము సుందర పరరాత్రఖండం పు 82-84
123. సుందరమందారము జె. వెంకటేశ్వరరావు పు 128–132
124. సుందరకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 185–186
125. రామచరితమానస్ సుందర చే 8. విశ్రా 2, చే 13 విశ్రా 2
125. హనుమాన్ లీలా తరంగిణి పు 34–35

126. Character Potrayals in Ramayana, Alioswurm, P. 107
127. Leelases on Ramayana, (V. S. S. Sastri) 265-66
128. శ్రీ॥ రా॥ మ॥ సుందరకాండ సర్గ 42 పద్య 1035
శ్రీ॥ రా॥ మ॥ సుందరకాండ సర్గ 51 పద్య 1167
129ఎ. ఆనందరామాయణము (గురులింగశాస్త్రి) సారకాండ పు 113
బి. ఆనందరామాయణము (గురులింగశాస్త్రి) సారకాండ పు 114
సి. ఆనందరామాయణము (బులుసు ఉదయభాస్కరం) పు 155
130. రామాభ్యుదయము ఆ 6. ప 250
131. తత్త్వసంగ్రహ రామాయణము
132. శ్రీమద్రామాయణ కల్పవృక్షము సుందర దివాఖండము పు 284-90
133. స॥ కు॥ వి॥ ఆ 3. ప 107-123
134. సుందరమందారము పు 150
135. షోడశి రామాయణ రహస్యము
136. శ్రీమద్రామాయణాంతరార్థము పు 171
137. రామచరితమానస్ సుందర విశ్రా 3 చే 17-24
138. శ్రీ. రా. మ. సుందర 1290-1305 పద్యాలు మరియు 1381
యుద్ధ 128-134
సుందర ప 933
140. భాస్కర రామాయణ సుందర ప 297
141. ఆనంద రామాయణం (శివశంకరశాస్త్రి) పు 127
ఆనంద రామాయణం బులుసు ఉదయభాస్కరం పు 162-66
142. రామచరితమానస్ సుందర విశ్రా 4 చే 34
143. ఆనంద రామాయణం (శివశంకరశాస్త్రి) పు 128 మరియు
స॥ కు॥ వి॥ ఆ 3. ప 179
144. రామాభ్యుదయము ఆ 1. ప 153
145. శ్రీ, రా. మ. యుద్ధ–సర్గ 17, 18 పద్యాలు 350-388
146. ఆనంద రామాయణము పు 130 (శివశంకరశాస్త్రి)
147. స॥ కు॥ వి॥ ఆ 3. ప 137-158
148. స॥ కు॥ వి॥ ఆ 3. 172-178

149. రామచరితమానస్ లంకాకాండ విశ్రా 1 చే, 2, 3 మరియు
హనుమాన్ లీలా తరంగిణి పు 56
150. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గలు 2, 43, 52, 59, 67, 70, 74, 77
పద్యాలు 484–1665 వరకు
151. స॥ కు॥ వి॥ ఆ 3. ప 179 నుండి
152. రామచరితమానస్ లంకాకాండ విశ్రా 5. చే పా 69
153. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గ 78. ప 1863 మరియు 84-92 సర్గలు
154. భాస్కర రామాయణము యుద్ధ 1608 పద్యం
155. స॥ కు॥ వి॥ ఆ 3. ప 179, 80
156. రంగనాథ రామాయణము యుద్ధ 431-441 మరియు
భాస్కరరామాయణము పు 550
157. స॥ కు॥ వి॥ ఆ 3. ప 180-286 వరకు
158. రామచరితమానస్ లంకాకాండ 5 విశ్రా చే. 73 మరియు
7 విశ్రా చే. 88-95
159. పరాశర సంహిత 44 నుండి 47 పటలములు (9, 10 సంపుటాలు)
160. స॥ కు॥ వి॥ ఆ 3. 179-286 మరియు ఆ 4. ప 23-32
161. రామచరితమానస్ (లంకాకాండ) 8వ విశ్రామము
162. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ ప 1863
163ఎ. స॥ కు॥ వి॥ ఆ 3. ప 191
బి. రంగనాథ రామాయణము యుద్ధ పు 455 మరియు
స॥ కు॥ వి॥ ఆ 4. ప 31, 32
164. ఆనంద రామాయణము (శంకరశాస్త్రి) రాజ్యకాండ 7వ సర్గ మరియు
రామచరితమానస్ లంకాకాండ 10వ విశ్రా
165. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గ 116 ప 2613-36
166. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గ 126 ప 2799
167. రంగనాథ రామాయణము యుద్ధ. పుట 484-85
168. స॥ కు॥ వి॥ ఆ 4. ప 65-161
169. స॥ కు॥ వి॥ ఆ 4. ప 39-53
170. హనుమాన్ లీలా తరంగిణి – పుట 75-77

171. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గ 128, 129
172. స॥ కు॥ వి॥ ఆ 4. ప 166-69
173. శ్రీ॥ రా॥ మ॥ యుద్ధ సర్గ 131
ఉత్తర సర్గ 39, 40 పద్యాలు 884, 907, 902
174. ఆశ్చర్య రామాయణము యుద్ధ 16 సర్గ 11-18 పద్యాలు
175. స॥ కు॥ వి॥ ఆ 4. ప 166-69
176. రామచరితమానస్ ఉత్తరకాండ విశ్రా 2 చే. 13-15
177. శ్రీకృష్ణరామాయణము యుద్ధ పుట 75
178. సుందరమందారము పు 175
179. సీతారామాంజనేయ సంవాదము ఆ 1 – 71, 85, 105, 114, 130, 161, 169
ఆ 2–124. 126–172
ఆ 3–3, 25, 193, 195
180. పరాశర సంహిత 7వ పటలము పు 111–119 1 సంపుటి
181. స॥ కు॥ వి॥ ఆ 1 ప 68-73; ఆ 3-178-207; ఆ4 ప 1-104
182. శతకంఠరామాయణము ఆ 1 (31-150) ఆ 2 (8–140)
ఆ 3 (ప 6–88)
183. ఆశ్చర్య రామాయణయము ఉత్తర పు 19–66
184. అద్భుతోత్తర రామాయణము పు 75–194 నాదెళ్ల పురుషోత్తముడు
అద్భుతోత్తర రామాయణము జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ
185. స॥ కు॥ వి॥ ఆ 5–112 మరియు 138–161 వరకు
186. హనుమాన్ లీలా తరంగిణి 85–86 పుటలు
187. ఆశ్చర్య రామాయణము ఉత్తర పుట 87
188. స॥ కు॥ వి॥ అ 5. ప 163–65
189. ఆశ్చర్య రామాయణము ఉత్తర పు 179
190. ఆశ్చర్య రామాయణము ఉత్తర 247 (మరియు పద్మపురాణము)
191. ఆశ్చర్య రామాయణము ఉత్తర పు 269–82
112. ఆశ్చర్య రామాయణము ఉత్తర 284–90 మరియు
శ్రీమద్రామాయణాంతరార్థము పు 318

193. హనుమాన్‌లీలా తరంగిణి పుట 87–105;114-121,126-131
హనుమద్రామ సంగ్రామము (బి. కోటేశ్వరరావు)
యమాంజనేయ యుద్ధము (పి. రాఘవరాజు)
194. హనుమాన్ లీలా తరంగిణి 87-105 మరియు
శ్రీమద్రామాయణాంతరార్థం పు 288–330
195. స॥ కు॥ వి॥ ఆ 5. ప 163–229
196. కిష్కింధకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 173
హనుమాన్ లీలా తరంగిణి పు 134
షోడశి రామాయణ రహస్యము పు 92
197. స॥ కు॥ వి. ఆ 5–229
198. శ్రీ. రా. మ. ఉత్తర ప 1660–64
199. స॥ కు॥ వి॥ ఆ 6–ప 123 నుండి 230 వరకు మరియు
పరాశర సంహితలో గరుడ గర్వభంగకథ హనుమంతుని కుంభక పూరక రేచక ప్రాణాయామము చేయుచో గరుక్మంతుడాతనిని చేరలేక, హనుమంతుని నిశ్వాస పవనమునకు ఓర్వలేక విసరబడెను. హనుమ అతనిని తోకతో కొట్టగా పాలసముద్రములో పడెను. (48వ పటలము)
200. పరాశర సంహిత 31వ పటలము 7వ సంపుటి
201. హనుమాన్ లీలా తరంగిణి పు 157
202. పరాశర సంహిత 16వ పటలం పు 248-244-(2వ సంపుటి)
203. అష్టాదశపురాణ సంగ్రహము (శివపురాణము) పు 35
206. స॥ కు॥ వి॥ ఆ 7-ప 45-106
207. పరాశర సంహిత 50, 51 పటలములు
208. స॥ కు॥ వి॥ ఆ 7. ప 205–129
209. రామాయణ సర్వస్వము శఠగోపాచార్య పు 147
210. Article on (a diffrent) personality by
Dr. K. R. Srinivasa Iyengar. ,THE HINDU' D/ 3-3-8'
211. A to F. The Making of Litt, R. A. Scott James.
Pg. 62, 63, 67, 68, 69, 93.
212. A History of English Litt, A. Compton Rickett, P.12
213. Aspect of the Novel, E. M. Forster, P. 46

215. A. B. Aspects of the Novel, E. M. Forster P. 49, 61
216. A to E. An introduction to the Story of Litt.
W. H. Hudson, P. 146-222
217. Valmiki Ramayana, Prof. S. Nagaiah, P. 422
218A, B. Character Portrayals in Ramayana,
Alios Wurm, P. 142-43
219. Lectvres on Ramayana Rt. V. S. S. Sastri, P. 268
220. Character Portrayals in Ramayana, Alioswurm.
P. 148-49
221. స॥ కు॥ వి॥ ఆ 3. ప 9, 12
222. రామాయణ రత్నాకరము శ్రీవిద్యా ప్రకాశానందస్వామి పు 337-52
223. జీవనచిత్రాలు డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య పు 195-206
224. కిష్కింధకాండ ది॥ వేం॥ సుబ్బరావు పు 150
225. Lectures on Ramayana, Sri V.S.S. Sastri. P. 253-54
226. పరాశర సంహిత 29వ పటలము
227. పరాశర సంహిత 58వ పటలము
228. Thoughts on Indian Mysticsm, P. 123
229. ప్రపన్నామృతము అధ్యా 31. శ్లో 7
230. రామచరితమానస్ - సుందర 4 విశ్రా. 34 చే పాయి మరియు
బోధాయన రామాయణములోను ఇట్లే కలదని శ్రీ దివాకరుని వెంకట
సుబ్బరావు సుందరకాండ పు 190లో
231. స॥ కు॥ వి॥ ఆ 4. ప 128
232. నారదభక్తి సూత్రాలు పుట 17 నుండి 23, 301
233. భగవద్గీత - అధ్యా 6–శ్లో 47
భగవద్గీత - 10–9
భగవద్గీత - 12–2, 17, 20
234. మహాభాగవతము - దశమస్కంధం - ప 971, 972
235. శ్రీవచనభూషణము - అధ్యా 2 సూత్రం 101–103
236. రామచరితమానస్ - అరణ్యకాండ–5వ మిశ్రా
237. మహాభాగవతము - తృతీయస్కంధము - ప 870, 77, 78
238. శ్రీసీతారామాంజనేయ సంవాదము 120

239. నారదభక్తి సూత్రములు – సూ 79 పు 292 మరియు
తిరుప్పావై–(శ్రీ భాష్యం అప్పలాచార్య వ్యాఖ్యతో) పు108–147
మహాభాగవతము–తృతీయస్కంధము ప 947, 48
240. రామచరితమానస్ – పీఠిక పు 22-24
241. సుందరకాండ – తత్త్వదీపిక
241. రామచరితమానస్ లంకాకాండ - 5 విశ్రా. దే 69
242. శ్రీ॥ రా॥ మ॥ ఉత్తర ప 785–791, 834
243. Character Portrayal in Ramayana, Alioswurm, P. 125
244. శ్రీ. రా. మ. సుందర సర్గ 45 ప 1064
245 Lectures on Ramayana, V.S.S. Sastri. P. 268
246. Character Portrayals in Ramayana, Alioswurm. P.11z
247. స॥ కు॥ వి॥ – అ 3–ప 171
248. మహాభాగవతము – ద్వాదశస్కం అధ్యా 10 ప 39
49. జీవన్ముక్తి మార్గము పు 44–46
250. A,B. Hanuman in Art and Mythology, P. 71, 92
251. హనుమద్విలాసం పు 220
252ఎ. అగ్నిపురాణము (అష్టాదశపురాణ సంగ్రహము 1013)
బి. పరాశర సంహిత 38వ పటలము
సి. పరాశర సంహిత 54వ పటలము
253. సుందరకాండము – తత్త్వదీపిక పు 3, 4, 5, 80
254. భగవద్గీత–అధ్యా 7 శ్లో 3
255. భగవద్గీత–అధ్యా 0 శ్లో 10
256. మహాభాగవతము – దశమస్కంధం–ప 971
257. మహాభాగవతము – తృతీయస్కంధం–947, 949
258. Gospel of Sri Rama Krishna
259. జీవన్ముక్తి మార్గము – పీఠిక
260ఎ. మహాభాగవతము – దశమ ప 972
బి. మహాభాగవతము – తృతీయ ప 878
261. హనుమచ్చరిత్ర - స్వామికృష్ణదాస్‌జీ పు 15
262. Hanuman in Art and Mythology, P. 24

263. పరాశర సంహిత – 20వ పటలము
264. Lectures on Ramayana, P. 262
265. A&B Hanuman in Art and Mythology, P. 8-10
266. Hindu Culture and caste system, Dr. Santakumar Vyas
267. A&B Hanuman in Art and Mythology, P. 13, 19–20
268. Gospel of Rama Krishna
269. హనుమదుపాసనా కల్పద్రుమము
270. A&B. హనుమద్విలాసము పు 201
271. ఆనందరామాయణము (శివశంకరశాస్త్రి) రాజ్యకాండ 7వ సర్గ పు 730-33
272. Hanuman in Art and Mythology, P. 19
273. అష్టాదశపురాణ సంగ్రహము (స్కాందపురాణము) పు 119 మరియు పరాశర సంహిత 10, 44, 47 పటలములు
274. శ్రీమద్రామాయణ వైభవము
275. Hanuman in Art and Mythology, P. 11
276. Hanuman in Art and Mythology, P. 12

THE STORY AND CHARACTERISATION OF HANUMAN IN TELUGU LITERATURE

Dr. R. S. Sudarsanacharlu.



జననం : కడపలో 18-12-1933

విద్య : ఎం. ఏ. (తెలుగు) ప్రెసిడెన్సీ కాలేజి మద్రాసు 1955
ఎం. ఏ. (ఇంగ్లీషు) కాశీ హిందూ విశ్వవిద్యాలయము 1963
పి హెచ్. డి., శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము 1988

ఉద్యోగము : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకులుగా ప్రారంభించి 1991 లో పుంగనూరు ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ.
1991 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారము.

రచనలు : తెలుగులో కథలు - విమర్శనా వ్యాసములు ('భారతి' ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, 'జయంతి' 'స్రవంతి'లలో ముద్రితాలు.)